सत्यमेव जयते

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక

2023 మార్చి 31 తో ముగిసిన సంవత్సరానికి

రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిట్ నివేదిక

SUPREME AUDIT INSTITUTION OF INDIA

लोकहितार्थ सत्यनिष्ठा

Dedicated to Truth in Public Interest

తెలంగాణ ప్రభుత్వం

2024 లో నివేదిక సంఖ్య 3

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక

2023 మార్చి 31తో ముగిసిన సంవత్సరానికి

రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిట్ నివేదిక

తెలంగాణ ప్రభుత్వం

2024 లో నివేదిక సంఖ్య 3

విషయసూచిక

వివరాలు	పేరా	పేజి
ముందు మాట		vii
కార్యనిర్వాహక సంగ్రహం		ix
అధ్యాయం - I అవలోకనం		
పరిచయం	1.1	1
రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిట్ నివేదికకు ప్రాతిపదిక, విధానం	1.2	5
ప్రభుత్వ పద్దుల కూర్పు - ఒక అవలోకనం	1.3	6
బడ్జెటు ప్రక్రియ	1.4	9
సంక్షిప్తంగా ఆర్థిక స్థితిగతుల స్థితి	1.5	10
సంక్షిప్తంగా ప్రభుత్వ ఆస్తులు, చెల్లింపు బాధ్యతల స్థితి	1.6	11
ద్రవ్య సమతుల్యత: లోటు, అప్పుల మొత్తం విషయంలో లక్ష్యాలను అందుకోవడం	1.7	12
ఆడిట్‌లో పరీక్షించిన పిదప లోట్లు, మొత్తం అప్పులు	1.8	17
అధ్యాయం - II రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు		
పరిచయం	2.1	19
2021-22 తో పోలిస్తే కీలకమైన ద్రవ్య సూచికలలో వచ్చిన ముఖ్యమైన మార్పులు	2.2	19
నిధులకు వనరులు, నిధుల వినియోగం	2.3	20
రాష్ట్రం వనరులు	2.4	21
వనరుల వినియోగం	2.5	34
ప్రజాపద్దు	2.6	55
ప్రభుత్వ చెల్లింపు బాధ్యతల నిర్వహణ	2.7	62
ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య ఆస్తులు, అప్పుల పంపకం	2.8	83
సారాంశం	2.9	84
సిఫార్సులు	2.10	86
అధ్యాయం - III బడ్జెటు నిర్వహణ		
పరిచయం	3.1	89
బడ్జెటు తయారీ ప్రక్రియ	3.2	89
వినియోగపు పద్దులు	3.3	98

వివరాలు	పేరా	పేజి
బడ్జెటు, అకౌంటింగు ప్రక్రియల సమగ్రత	3.4	103
బడ్జెటు, అకౌంటింగు ప్రక్రియ ప్రభావశీలత	3.5	123
సారాంశం	3.6	130
సిఫార్సులు	3.7	132
అధ్యాయం - IV పద్దుల నాణ్యత, ఆర్థికాంశాల నివేదన పద్ధతులు		
పరిచయం	4.1	133
వడ్డీతో కూడిన రిజర్వు నిధులు, డిపాజిట్ల విషయంలో వడ్డీ చెల్లింపు బాధ్యతను నెరవేర్చకపోవడం	4.2	133
రాష్ట్రంలోని అమలు చేసే సంస్థలకు నేరుగా నిధుల బదలాయింపు	4.3	134
స్థానిక నిధుల డిపాజిట్లు	4.4	136
అనిశ్చిత, ఆకస్మిక బిల్లులు	4.5	137
వ్యక్తిగత డిపాజిటు ఖాతాలు	4.6	138
పద్దులలో పారదర్శకతలేమి	4.7	140
అనామతు, డి.డి.ఆర్. పద్దుల కింద ఉన్న నిల్వలు	4.8	143
పద్దులలో గణాంకాలను సరిపోల్చి చూసుకోవడం	4.9	145
నగదు నిల్వలను సరిపోల్చి చూసుకోవడం	4.10	146
భారత ప్రభుత్వ అకౌంటింగ్ ప్రమాణాల పాటింపు	4.11	146
స్వయంపాలక సంస్థల ద్వారా పద్దుల సమర్పణ / ప్రత్యేక ఆడిటు నివేదికలు	4.12	147
సంస్థలు, ప్రాధికార సంస్థలకు ఇచ్చిన గ్రాంట్లు / ఋణాల వివరాలను సమర్పించకపోవడం	4.13	149
రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిటు నివేదికల మీద తదనంతర చర్యలు	4.14	149
సారాంశం	4.15	150
సిఫార్సులు	4.16	150
అధ్యాయం - V రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ (ఎస్.పి.ఎస్.యు)ల పనితీరు		
పరిచయం	5.1	151
ఆడిటు చేసే అధికారం	5.2	151
ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య, వాటి పద్దుల పరిస్థితి	5.3	152
రాష్ట్ర ఆర్థికానికి ప్రభుత్వ రంగ సంస్థల తోడ్పాటు	5.4	153
ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడి, బడ్జెటు ద్వారా తోడ్పాటు	5.5	154
ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ప్రతిఫలం	5.6	157
ప్రభుత్వ రంగ సంస్థలు పొందిన నష్టాలు	5.7	158
అప్పుల చెల్లింపు	5.8	162

వివరాలు	పేరా	పేజి
ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలాపాల నిర్వహణ సామర్థ్యం	5.9	164
అమ్మకాలు, మార్కెటింగు	5.10	168
ప్రభుత్వ రంగ సంస్థలకు సి.ఎ.జి. చట్టబద్ధమైన ఆడిటర్లను నియమించడం	5.11	169
ప్రభుత్వ రంగ సంస్థల పద్దుల సమర్పణ	5.12	169
సి.ఎ.జి. పర్యవేక్షణ – పద్దుల ఆడిటు, అనుబంధ ఆడిటు	5.13	171
సి.ఎ.జి. పర్యవేక్షణ ఫలితం	5.14	172
భారత అకౌంటింగు ప్రమాణాల (ఇండ్ ఎ.ఎస్) / అకౌంటింగు ప్రమాణాల నిబంధనలను పాటించకపోవడం	5.15	178
యాజమాన్య లేఖలు	5.16	179
సారాంశం	5.17	180
సిఫార్సులు	5.18	181

అనుబంధాలు

అనుబంధం సంఖ్య	అనుబంధం వివరం	పేరా	పేజి
1.1	తెలంగాణ స్వరూప చిత్రణ	1.1	183
1.2	రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులపై సంవత్సరాల వారీగా సమాచారం	1.5	184
3.1	2022-23 సంవత్సరంలో శాసనసభ అనుమతించిన మొత్తాల కన్నా ఎక్కువగా అయిన ఖర్చులు	3.4.2.1	188
3.2 (ఎ)	2023 సెప్టెంబరు నాటికి సంవత్సరాల వారీగా క్రమబద్ధీకరించాల్సిన అధికవ్యయాల సంగ్రహం	3.4.2.2	189
3.2 (బి)	2023 సెప్టెంబరు నాటికి సంవత్సరాల వారీగా, గ్రాంట్ల వారీగా క్రమబద్ధీకరించాల్సిన అధికవ్యయాల వివరాలు	3.4.2.2	190
3.3	కేటాయింపుతో పోలిస్తే ₹1,000 కోట్లకు మించి ఖర్చు తగ్గిన గ్రాంట్లు	3.4.3	195
3.4	వాస్తవానికి ఖర్చు తగ్గిన మొత్తాల కన్నా ఎక్కువ మొత్తాలకు ఇచ్చిన అప్పగింత ఉత్తర్వులు	3.4.6.3	197
4.1	సంవత్సరాలవారీగా అపరిష్కృతంగా ఉన్న ఎ.సి.బిల్లులు	4.5	199
4.2	2014-15 నుంచి శాఖలవారీగా అపరిష్కృతంగా ఉన్న ఎ.సి. బిల్లులు	4.5	200
4.3	2022-23 లో రాబడి మొత్తంగా ఆమాంబాపతు చిన్న పద్దు 800 కిందనే నమోదైన ఉదంతాలు	4.7	201
4.4	2022-23 సంవత్సరంలో ₹100 కోట్లకు మించి రాబడి ఆమాంబాపతు చిన్న పద్దు - 800 కింద నమోదైన ఉదంతాలు	4.7	201
4.5	2022-23 సంవత్సరం రాబడిలో 50 శాతానికి పైగా ఆమాంబాపతు చిన్న పద్దు - 800 కిందనే నమోదైన ఉదంతాలు	4.7	202
4.6	2022-23 సంవత్సరం ఖర్చులో ₹100 కోట్లకు మించి ఖర్చు ఆమాంబాపతు చిన్న పద్దు - 800 కిందనే నమోదైన ఉదంతాలు	4.7	202
4.7	2022-23 సంవత్సరం ఖర్చులో 50 శాతానికి పైగా ఆమాంబాపతు చిన్న పద్దు - 800 కిందనే నమోదైన ఉదంతాలు	4.7	203
4.8	₹100 కోట్లు, అంత కన్నా ఎక్కువ రాబడిని సరిపోల్చి చూడడం జరుగని పెద్దుపద్దుల జాబితా	4.9	203
4.9	₹100 కోట్లు, అంత కన్నా ఎక్కువ ఖర్చును సరిపోల్చి చూచుకోని ముఖ్య నియంత్రణాధికారుల జాబితా	4.9	204
4.10	పద్దుల సమర్పణ బకాయిల్లో ఉన్న స్వయంపాలక సంస్థలు	4.12	205
4.11	గ్రాంట్లు / ఋణాలు అందుకున్న సమాచారాన్ని అందజేసిన కార్పొరేషన్లు / సంస్థల జాబితా	4.13	206
4.12	శాఖలవారీగా అందిన, అందాల్సి ఉన్న వివరణాత్మక నివేదికల పరిస్థితి	4.14	208

అనుబంధం సంఖ్య	అనుబంధం వివరం	పేరా	పేజీ
5.1	భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ పరిధిలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల జాబితా, వాటి వార్షిక పద్దుల పరిస్థితిని వివరించే పట్టిక	5.3, 5.5.1	209
5.2	2020-21 నుంచి 2022-23 మధ్య సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు అందజేసిన బడ్జెటుపరమైన సాయం గురించి తెలిపే వివరణ పట్టిక	5.5.1, 5.5.3	213
5.3	మూలధనం క్షయించిన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల జాబితాను తెలిపే వివరణ పట్టిక	5.7.2	215
5.4	2023 మార్చి 31 నాటికి నికర విలువ ఋణాత్మకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల జాబితాను తెలిపే వివరణ పట్టిక	5.7.2	217
5.5	2023 మార్చి 31 నాటికి మూలధనం వాటా (ఈక్విటీ) మీద ప్రతిఫలాన్ని తెలియజేసే వివరణ పట్టిక	5.9.1.1	218
5.6	2023 మార్చి 31 నాటికి పెట్టిన పెట్టుబడి మీద ప్రతిఫలాన్ని చూపించే వివరణ పట్టిక	5.9.1.2	220
5.7	పెట్టుబడి కాలానుగుణమైన మూల్యం ఆధారంగా వాస్తవ ప్రతిఫలం రేటు	5.9.1.3 (ఎ)	222
5.8	పెట్టుబడి ప్రస్తుత విలువ ఆధారంగా వాస్తవ ప్రతిఫలం రేటు	5.9.1.3 (బి)	223
5.9	చట్టబద్ధమైన ఆడిటర్ల నివేదికకు సవరణలు జరిగిన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల జాబితాను తెలిపే వివరణ పట్టిక	5.14.3	225
5.10	పద్దుల మీద భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ వ్యాఖ్యలు జారీ అయిన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల జాబితాను తెలిపే వివరణ పట్టిక	5.14.4	226
5.11	అకౌంటింగ్ ప్రమాణాలను / భారత అకౌంటింగ్ ప్రమాణాలను పాటించలేదని చట్టబద్ధమైన ఆడిటర్లు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల జాబితాను తెలిపే వివరణ పట్టిక	5.15	227
5.12	యాజమాన్య లేఖలు జారీ అయిన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల జాబితాను తెలిపే వివరణ పట్టిక	5.16	228

ముందుమాట

భారత రాజ్యాంగంలోని 151 అధికరణ ప్రకారం రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టే నిమిత్తం తెలంగాణ రాష్ట్ర గవర్నరుకు సమర్పించడం కోసం ఈ నివేదికను రూపొందించడమైంది.

ఈ నివేదికలోని **అధ్యాయం 1** లో ఈ నివేదికకు ప్రాతిపదిక, విధానం, ప్రభుత్వ పద్దుల కూర్పు, బడ్జెటు ప్రక్రియలు, తెలంగాణ రాష్ట్ర ద్రవ్య బాధ్యత - బడ్జెటు నిర్వహణ (టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం) చట్టం పాటింపు, రెవెన్యూ మిగులు/లోటు, ద్రవ్య మిగులు/లోటు వంటి కీలకమైన ద్రవ్య కొలమానాల సరళి, ద్రవ్య సంస్కరణల తీరు గురించి ఉంటుంది.

ఈ నివేదికలోని **అధ్యాయం 2, 3** లలో 2023 మార్చి 31 తో ముగిసిన సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పద్దులు, వినియోగపు పద్దులను పరీక్షించగా వెల్లడైన విషయాలపై ఆడిట్ కనుగొన్న అంశాలు ఉంటాయి. అవసరమైన చోట్ల తెలంగాణ ప్రభుత్వం నుండి సమాచారం పొందడమైంది.

అధ్యాయం 4 'పద్దుల నాణ్యత, ఆర్థికాంశాల నివేదన పద్ధతులు' విషయమై ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివిధ ఆర్థిక నియమాలు, పద్దతులు, నిర్దేశాల పాటింపుపై ఒక అవలోకనాన్ని, పరిస్థితిని తెలియజేస్తుంది.

అధ్యాయం 5 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థికపరమైన పనితీరును చర్చించడంతో పాటు, ప్రభుత్వ రంగ సంస్థల చట్టబద్ధమైన ఆడిటర్ల పనితీరును పర్యవేక్షించడం ద్వారా, వాటి పద్దులను అనుబంధంగా ఆడిటు చేయడం ద్వారా భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ పర్యవేక్షక పాత్ర ఫలితాలను తెలియజేస్తుంది. భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సేవా షరతులు) చట్టం - 1971 (సవరించిన చట్టం) లోని సెక్షను 19ఎ నిబంధనల ప్రకారం తెలంగాణ శాసనసభ ముందు ప్రవేశపెట్టే నిమిత్తం ఒక ప్రభుత్వ కంపెనీ, లేదా కార్పొరేషను పద్దులకు సంబంధించిన ఆడిటు నివేదికలను భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ప్రభుత్వానికి సమర్పిస్తారు.

వివిధ ప్రభుత్వ శాఖలలో ఆడిట్ సమీక్షలు, నియమాల పాటింపు విషయమై ఆడిటు కనుగొన్న అంశాలతో కూడిన నివేదికలను, శాసనబద్ధమైన సంస్థలు, బోర్డులు, ప్రభుత్వ కంపెనీల ఆడిటులో వెల్లడైన పరిశీలనలతో కూడిన నివేదికను, రెవెన్యూ రాబడులపై పరిశీలనలతో కూడిన నివేదికను విడిగా సమర్పించడం జరుగుతుంది.

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ జారీచేసిన ఆడిటింగ్ ప్రమాణాలకు అనుగుణంగా ఆడిట్ చేయడం జరిగింది.

ఈ తెలుగు నివేదికలో ఏవైనా సందేహాలుంటే, అనువాదానికి ఆధారమైన ఆంగ్ల నివేదికను అధికారికంగా తీసుకోవాలి.

కార్యనిర్వాహక సంగ్రహం

కార్యనిర్వాహక సంగ్రహం

ఈ నివేదిక గురించి

2022-23 సంవత్సరానికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ఈ నివేదికను తయారు చేయడం జరిగింది. ఈ నివేదిక రాష్ట్ర ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన ఆర్థికాంశాల అవలోకనం, బడ్జెటు నిర్వహణ, పద్దుల నాణ్యత, ఆర్థికాంశాల నివేదన పద్ధతులు, ఇతర అంశాలను అందిస్తుంది.

ఈ కార్యనిర్వాహక సంగ్రహం ఈ నివేదికలోని విషయాలను ప్రముఖంగా తెలియచేస్తుంది. ముఖ్యమైన గణాంకాలు, అంశాల సంక్షిప్త స్థితి ద్వారా, ఆర్థిక స్థిరత్వం, బడ్జెట్ లక్ష్యానికి గానూ పనితీరు, రాబడి, వ్యయాల అంచనా, వైవిధ్యాలకుగల కారణాలు, దాని ప్రభావంపై సూక్ష్మ దృష్టిని అందిస్తుంది.

రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.) (ప్రస్తుత ధరల ప్రకారం) 2018-19 లో ₹8,57,427 కోట్ల నుంచి 2022-23 లో ₹13,13,391 కోట్లకు 15.09 శాతం సగటు వృద్ధి రేటుతో పెరిగింది.

2021-22 తో పోలిస్తే ప్రస్తుత సంవత్సరంలో జి.ఎస్.డి.పి. 16 శాతం పెరిగింది. గత సంవత్సరంతో పోలిస్తే రెవెన్యూ రాబడులు గణనీయంగా 25 శాతం మేర పెరిగాయి. మునుపటి సంవత్సరం 2021-22 తో పోలిస్తే రెవెన్యూ రాబడుల వృద్ధి రేటు ఒక శాతం తగ్గింది. జి.ఎస్.డి.పి.కి రెవెన్యూ రాబడుల నిష్పత్తి 2021-22 లో 11 శాతం నుంచి 2022-23 లో 12 శాతానికి ఒక శాతం పెరిగింది. రాష్ట్ర సొంత పన్నుల నుంచి రాబడి కోవిడ్-19 మహమ్మారి కారణంగా 2020-21 లో స్వల్పంగా తగ్గిన, 2021-22 లో గణనీయంగా పెరిగింది, 2022-23లో కూడా గణనీయమైన వృద్ధిని కొనసాగించింది. గత సంవత్సరంతో పోలిస్తే అది గణనీయంగా 17 శాతం (₹15,678 కోట్లు) పెరిగింది. తెలంగాణ మొత్తం ఖర్చు (ప్రధానంగా నిత్య వ్యావహారిక (రెవెన్యూ) వ్యయం, మూలధన (క్యాపిటల్) వ్యయం, ఇచ్చిన ఋణాలు, బయానాలు కలిగిన) 2018-19 లో ₹1,28,435 కోట్ల నుంచి 2022-23 లో ₹1,92,535 కోట్లకు 50 శాతం పెరిగింది, మునుపటి సంవత్సరం కంటే 11 శాతం పెరిగింది. రాష్ట్రం మూడు సంవత్సరాల తర్వాత రెవెన్యూ మిగులును (₹5,944 కోట్లు) నమోదు చేసింది. వాస్తవంగా, తదుపరి పేరాలో పేర్కొన్న విధంగా రెవెన్యూ మిగులు ₹1,680 కోట్లు మాత్రమే. ద్రవ్య లోటుకు లక్ష్యం జి.ఎస్.డి.పి.లో ఐదు శాతం. రాష్ట్రం ₹32,556 కోట్ల (జి.ఎస్.డి.పి.లో 2.48 శాతం) ద్రవ్య లోటును నమోదు చేసింది. ఇది రెండేళ్ల తర్వాత అనుమతించదగిన పరిమితిలో ఉన్నది.

రాబడుల-వ్యయాల అసమతుల్యత

రాష్ట్రానికి వివిధ మూలాల రాబడులు ఉన్నాయి అవి (i) రాష్ట్ర సొంత పన్నుల నుంచి రాబడి, పన్నులు కాని ఇతర రాబడి, పన్నులలో రాష్ట్ర వాటా పంపకాలు, కేంద్ర ప్రభుత్వం నుండి సహాయక గ్రాంట్లు, బదిలీలు కలిగిన రెవెన్యూ రాబడులు, (ii) తీసుకున్న అప్పులు, అప్పులు కాని ఇతర క్యాపిటల్ రాబడులు కలిగిన క్యాపిటల్ రాబడులు. రాష్ట్ర ప్రభుత్వ వ్యయం నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులు, ఆస్తుల సృష్టి, ఇచ్చిన ఋణాలు, బయానాలు, పెట్టుబడులు మొదలయిన మూలధన వ్యయం లేదా క్యాపిటల్ వ్యయం కలిగి ఉంటుంది.

రెవెన్యూ రాబడులు 2018-19 లో ₹1,01,420 కోట్ల నుంచి 2022-23 లో ₹1,59,350 కోట్లకు పెరిగాయి. క్యాపిటల్ రాబడులు మునుపటి సంవత్సరంలో ₹46,686 కోట్ల నుంచి 2022-23 లో ₹33,185 కోట్లకు తగ్గాయి. భారత ప్రభుత్వం నుండి సహాయక గ్రాంట్లు (₹13,179 కోట్లు) గత సంవత్సరంతో పోలిస్తే ₹4,560 కోట్లు (53 శాతం) పెరిగాయి. కేంద్ర ప్రాయోజిత పథకాలు (₹5,387 కోట్లు, సహాయక గ్రాంట్లలో 41 శాతం), వస్తు సేవల పన్ను అమలు కారణంగా ఏర్పడిన రాబడి నష్టానికి పరిహారం (₹4,061 కోట్లు, సహాయక గ్రాంట్లలో 31 శాతం) సహాయక గ్రాంట్లలో ప్రధాన భాగంగా ఉన్నాయి. నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులు అంటే ప్రస్తుత స్థాయిలో సేవలను కొనసాగించేందుకు, పాత చెల్లింపు బాధ్యతలను తీర్చేందుకు చేసే ఖర్చులు. అందువల్ల, ఈ ఖర్చుల వల్ల రాష్ట్ర మౌలిక సదుపాయాలకు గానీ, సేవల పరిధికి గానీ అదనంగా ఏమీ సమకూరదు. గత ఐదు సంవత్సరాలలో నిత్య వ్యావహారిక వ్యయం 2018-19 లో ఉన్న ₹97,083 కోట్ల నుంచి 2022-23 లో ₹1,53,406 కోట్లకు పెరిగింది. ప్రస్తుత సంవత్సరంలో, నిత్య వ్యావహారిక వ్యయం మొత్తం వ్యయంలో వాటా 80 శాతం, గత సంవత్సరం (79 శాతం) కంటే స్వల్పంగా పెరిగింది. ఇది ఈ సమయకాలంలో స్థిరంగా మొత్తం వ్యయంలో గణనీయమైన భాగాన్ని (76 నుండి 82 శాతం) ఆక్రమించింది.

రాబడులకు మించిన వ్యయ ఫలితం

రెవెన్యూ రాబడి, రెవెన్యూ వ్యయం మధ్య అంతరం రెవెన్యూ మిగులు లేదా రెవెన్యూ లోటుకు దారి తీస్తుంది. పద్దుల ప్రకారం రాష్ట్రం మూడు సంవత్సరాల తర్వాత రెవెన్యూ మిగులును (₹5,944 కోట్లు) నమోదు చేసింది. ఐతే ఈ రెవెన్యూ మిగులును ఈ కింది కారణాల వల్ల ₹4,264 కోట్ల మేర ఎక్కువగా చూపించారు. (i) సంచిత ఋణ విమోచన నిధికి జమ చేయకపోవడం (₹1,536 కోట్లు); (ii) ఇంతకు ముందు ఇచ్చిన ₹1,400 కోట్ల ఋణాలను బదిలీచేసి పన్నులు కాని ఇతర రాబడిగా ప్రభుత్వ ఖాతాలోని డిపాజిట్ ఖాతాలోకి జమ చేయడం; (iii) పూచీకత్తుల విముక్తి నిధికి జమ చేయకపోవడం (₹951 కోట్లు); (iv) వడ్డీ బాధ్యతలను నెరవేర్చకపోవడం (₹131 కోట్లు); (v) నిర్ధారిత వాటా పింఛను నిధి డిపాజిట్ ఖాతాలోకి తక్కువగా జమ చేయడం (₹114 కోట్లు), ఇతర కారణాలు. వాస్తవంగా రెవెన్యూ మిగులు ₹1,680 కోట్లు మాత్రమే.

మొత్తం వ్యయంలో భాగంగా చూస్తే గత ఐదు సంవత్సరాల కాలంలో ప్రస్తుత సంవత్సర మూలధన వ్యయం (ఇచ్చిన ఋణాలు, బయానాలు కాకుండా) (₹17,881 కోట్లు, 9 శాతం) అత్యల్పం. సాగునీటిపారుదల రంగం విషయానికి వస్తే గత ఐదు సంవత్సరాలుగా పాలమూరు-రంగారెడ్డి (₹12,937 కోట్లు), కాళేశ్వరం ప్రాజెక్టు (₹11,370 కోట్లు) ల మీద ఎక్కువగా మూలధన వ్యయం అయింది. 2023 మార్చి నాటికి పూర్తి కావల్సి ఉన్న సాగునీటిపారుదల ప్రాజెక్టులు (1983 నుంచి 2018 మధ్యకాలంలో ప్రారంభమైనవి) 20 ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల మీద ₹1,73,564 కోట్లు ఖర్చు అయింది. వీటి అంచనా మూల్యం ₹1,02,388 కోట్ల నుంచి ₹2,06,977 కోట్లకు పెరిగింది.

రాష్ట్ర మొత్తం వ్యయం, అప్పులు కాని ఇతర రాబడుల మధ్య అంతరం ద్రవ్య లోటుకు దారి తీస్తుంది. ద్రవ్య లోటుకు లక్ష్యం జి.ఎస్.డి.పి.లో ఐదు శాతం. రాష్ట్రం ₹32,556 కోట్ల (జి.ఎస్.డి.పి.లో 2.48 శాతం) ద్రవ్య లోటును నమోదు చేసింది. ఇది రెండేళ్ల తర్వాత అనుమతించదగిన పరిమితిలో ఉన్నది. ఐతే ఈ పరిమితిని రాష్ట్ర ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టానికి సవరణ చేసి (2022 మార్చి) నాలుగు శాతం నుంచి ఐదు శాతానికి పెంచడం జరిగింది. ఈ ద్రవ్య లోటును ఈ కింది కారణాల వల్ల ₹2,749 కోట్ల మేర తక్కువగా చూపించారు. (i) సంచిత ఋణ విమోచన నిధికి జమ చేయకపోవడం (₹1,536 కోట్లు); (ii) పూచీకత్తుల విముక్తి నిధికి జమ చేయకపోవడం (₹951 కోట్లు); (iii) వడ్డీ బాధ్యతలను నెరవేర్చకపోవడం (₹131 కోట్లు); (iv) నిర్ధారిత వాటా పింఛను నిధి డిపాజిట్ ఖాతాలోకి తక్కువగా జమ చేయడం (₹114 కోట్లు), ఇతర కారణాలు. వాస్తవంగా ద్రవ్య లోటు ₹35,305 కోట్లు.

రెవెన్యూ పద్దు కింద రాష్ట్ర ప్రభుత్వపు తప్పనిసరి ఖర్చులలో వడ్డీ చెల్లింపులు, జీతాలు-వేతనాలు, పింఛన్ల మీద ఖర్చులు ఉంటాయి. ప్రభుత్వ ఖర్చులో తొలి ప్రాథమ్యం వీటికే ఉంటుంది. రెవెన్యూ రాబడిలో శాతంగా చూస్తే తప్పనిసరి ఖర్చులు 2022-23 లో 46 శాతంగా ఉన్నాయి. గత ఐదేళ్లలో ఇది అత్యల్పం. కాబట్టి, సంక్షేమం, అభివృద్ధి కార్యకలాపాలు వంటి తప్పనిసరి కాని ఖర్చులు చేసేందుకు మరింత అవకాశం ఉంది. తప్పనిసరి ఖర్చులు నిత్య వ్యావహారిక వ్యయంలో 47 శాతం ఉన్నాయి.

ఇంతే కాకుండా, మూలధన వ్యయం వంటి వెసులుబాటు ఉన్న లావాదేవీల మాదిరిగా కాకుండా సాధారణంగా మార్చలేని ఖర్చులు, వార్షిక ప్రాతిపదికన శాసనవిహితంగా చేయాల్సిన ఖర్చుల లాంటి వెసులుబాటు లేని ఖర్చులు కూడా ఉంటాయి. వెసులుబాటు లేని ఖర్చులు రెవెన్యూ రాబడిలో 02 నుంచి 07 శాతం, నిత్య వ్యావహారిక వ్యయంలో 03 నుంచి 05 శాతం ఉన్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే నిత్య వ్యావహారిక వ్యయంలో ఒక శాతం తగ్గింది. తప్పనిసరి ఖర్చులు, వెసులుబాటు లేని ఖర్చులు కలిపి నిత్య వ్యావహారిక వ్యయంలో 51 శాతం ఉన్నాయి.

రాయితీలు

రెవెన్యూ రాబడిలో శాతంగానూ, నిత్య వ్యావహారిక వ్యయం అంటే రెవెన్యూ ఖర్చులలో శాతంగానూ రాయితీలు ప్రస్తుత సంవత్సరంలో స్వల్పంగా తగ్గాయి. వ్యవసాయ, అనుబంధ రాయితీల నిమిత్తం తెలంగాణ విద్యుత్ ప్రసార సంస్థ (ట్రాన్స్మిషన్ కార్పోరేషన్) కు సహాయం (₹7,665 కోట్లు) మాత్రమే రాయితీలలో 80 శాతం వరకు ఉంది.

ఋణాలు-అడ్వాన్సులు

ప్రస్తుత సంవత్సరంలో ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు-అడ్వాన్సులు (₹21,248 కోట్లు) భారీగా ఉన్నాయి, గత సంవత్సరంతో పోలిస్తే 150 శాతం కన్నా ఎక్కువగా పెరిగాయి. మొత్తం వ్యయంలో ఋణాలు-అడ్వాన్సుల వాటా (11 శాతం) గత ఐదేళ్లలో అత్యధికంగా ఉంది.

సంస్థలకు ఏర్పాటు చేసి, రాష్ట్ర ప్రభుత్వం తిరిగి వసూలు చేయదగిన ఋణాలు, 2023 మార్చి నాటికి ₹72,998 కోట్లు ఉన్నప్పటికీ, వాటిలో ఎక్కువ భాగం కాళేశ్వరం నీటిపారుదల ప్రాజెక్టు సంస్థ, తెలంగాణ తాగు నీటి సరఫరా సంస్థ వంటి సంస్థల ద్వారా తీసుకున్న బడ్జెటుకు వెలుపలి ఋణాలను తిరిగి చెల్లించడానికే. ఋణాలను తిరిగి చెల్లించడం కోసం సొంత రాబడి వనరులు లేని తెలంగాణ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థ, తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ, ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్టు వంటి సంస్థలకు కూడా ప్రభుత్వం ఋణాలను ఏర్పాటు చేసింది. అలాంటి ఋణాలు ప్రభుత్వ ఆస్తుల (తిరిగి వసూలు అయ్యే ఋణాలు) వాస్తవికమైన పరిస్థితిని ప్రతిబింబించడం లేదు. అందువల్ల, ఋణాల తిరిగి వసూలు చాలా పేలవంగా కొనసాగుతూ ఉంది.

బడ్జెటుకు వెలుపలి ఋణాలు

ప్రభుత్వం బడ్జెటు పత్రాలలో దాని బడ్జెటుకు వెలుపలి ఋణాల (ఓ.బి.బి.) పరిమాణం లేదా వివరాలను వెల్లడించలేదు. ఓ.బి.బి.ని సుమారు ₹1,18,629 కోట్లు ఉందని ఆడిట్ అంచనా వేసింది. 2022-23 లో బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సంస్థలకు తదుపరి ఋణాలుగా ₹17,829 కోట్లను అందించింది, అంటే వడ్డీ చెల్లింపు కోసం ₹8,696 కోట్లు, అసలు తిరిగి చెల్లింపు కోసం ₹3,531 కోట్లు, వడ్డీ చెల్లింపు కోసమా లేదా అసలు చెల్లింపు కోసమా అనే వివరాలు లేకుండా ₹5,602 కోట్లు.

పూచీకత్తుల కారణంగా ఆకస్మిక చెల్లింపు బాధ్యతలు

ఆర్థిక పద్దుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తుల విలువ ₹1,98,244 కోట్లు. తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ (₹50,000 కోట్లు), తెలంగాణ రాష్ట్ర విత్తనాల అభివృద్ధి సంస్థ (₹398 కోట్లు) లకు ఇచ్చిన పూచీకత్తులను ప్రభుత్వం వెల్లడించలేదు. తెలంగాణ రాష్ట్ర డిస్కములకు సంబంధించి వెల్లడింపు ₹16,000 కోట్లు తక్కువగా ఉంది. ఇచ్చిన పూచీకత్తులకు సంబంధించి నష్ట భయాన్ని అంచనా వేసిన తాలూక పత్రాలేవీ ఆడిటుకు అందజేయలేదు. నేరుగా భారం పడే 100 శాతం నష్టభయం ఉన్నవిగా వర్గీకరించి ఉండాల్సిన పూచీకత్తులను కూడా అత్యల్ప నష్టభయం నుంచి మధ్యస్థ నష్టభయం ఉన్నవిగానే వర్గీకరించారు.

అప్పులను భరించే సామర్థ్యం

అప్పులను భరించే సామర్థ్యం అంటే ఇటు ప్రస్తుతం, అటు భవిష్యత్తులోనూ అప్పులను తీర్చడంలో రాష్ట్ర సామర్థ్యం. ప్రస్తుతం ఉన్న లేదా చెల్లించాల్సి ఉన్న బాధ్యతలను తీర్చడం కోసం తగినన్ని ద్రవ్యరూప ఆస్తులు ఉన్నాయా లేవా అని, అదే విధంగా అదనపు ఋణాలపై చెల్లించే మూల్యానికి, అటువంటి ఋణాల వల్ల దక్కే ప్రతిఫలానికి మధ్య సమతుల్యతను సాధించే సామర్థ్యాన్ని అప్పులను భరించే సామర్థ్యం సూచిస్తుంది. ద్రవ్య కొలమానాలు, అప్పులకు సంబంధించి కొలమానాల ఆధారంగా, డోమర్ నమూనా ఆధారంగా, ఆయా ఎఫ్.ఆర్.బి.ఎం. లక్ష్యాల స్థూల ద్రవ్య కొలమానాల పాటింపు ఆధారంగా అప్పులను భరించే సామర్థ్యాన్ని విశ్లేషించడం జరిగింది.

ఎఫ్.ఆర్.బి.ఎం. ఆవశ్యకత, ద్రవ్య కొలమానాల పాటింపు

టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టం రెవెన్యూ మిగులు / రెవెన్యూ లోటు, జి.ఎస్.డి.పి.లో శాతంగా ద్రవ్య లోటు, జి.ఎస్.డి.పి.లో శాతంగా తీర్చాల్సి ఉన్న మొత్తం చెల్లింపు బాధ్యతలు పరంగా ద్రవ్య నిర్వహణ లక్ష్యాలను అమలు చేయడానికి ద్రవ్య లక్ష్యాలను నిర్దేశిస్తుంది. పద్దుల ప్రకారం రాష్ట్రం మూడు సంవత్సరాల తర్వాత రెవెన్యూ మిగులును (₹5,944 కోట్లు) నమోదు చేసింది. ద్రవ్య లోటుకు లక్ష్యం జి.ఎస్.డి.పి.లో ఐదు శాతం. రాష్ట్రం ₹32,556 కోట్ల (జి.ఎస్.డి.పి.లో 2.48 శాతం) ద్రవ్య లోటును నమోదు చేసింది. ఇది రెండేళ్ల తర్వాత అనుమతించదగిన పరిమితిలో ఉన్నది. మధ్య కాలిక ద్రవ్య విధాన ప్రకటన ప్రకారం, జి.ఎస్.డి.పి.కి మొత్తం చెల్లింపు బాధ్యతల నిష్పత్తి కోసం నిర్దేశించిన లక్ష్యం 25 శాతం. రాష్ట్రం సాధించిన జి.ఎస్.డి.పి.కి మొత్తం చెల్లింపు బాధ్యతల (₹3,49,537 కోట్లు) నిష్పత్తి 26.61 శాతం. రాష్ట్రం వరుసగా మూడో ఏడాది 25 శాతం లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైంది.

బడ్జెటుకు వెలుపలి ఋణాలను కలుపుకొని పదిహేనో ఆర్థిక సంఘం నిర్దేశించిన పరిమితి జి.ఎస్.డి.పి.లో 29.70 శాతం. ₹1,18,629 కోట్ల బడ్జెటుకు వెలుపలి ఋణాలను పరిగణిస్తే నిష్పత్తి 35.64 శాతం ఉంటుంది. అంటే పదిహేనో ఆర్థిక సంఘం నిర్దేశించిన పరిమితి కన్నా ఇది 5.94 శాతం ఎక్కువ.

ఋణస్థిరీకరణ విశ్లేషణ ప్రకారం, తీర్చాల్సి ఉన్న ప్రజాఋణం వృద్ధి రేటు గత ఐదు సంవత్సరాలలో 12 శాతం నుంచి 19 శాతం మేరకు ఉంది. అంతకు ముందు సంవత్సరం వృద్ధి రేటు (17 శాతం) తో పోలిస్తే ఈ సంవత్సరం వృద్ధి రేటు 12 శాతానికి తగ్గింది. రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో ప్రజాఋణం నిష్పత్తి 2020-21 వరకు పెరుగుతూ ఉండి, గత రెండు సంవత్సరాలలో తగ్గుముఖం పట్టింది. 2020-21 లో ఆ నిష్పత్తి 24.63 శాతం, 2022-23 లో 23.04 శాతానికి తగ్గింది.

డోమర్ నమూనా పరంగా, 2018-2023 కాల సమయంలో రాష్ట్రానికి ప్రాథమిక లోటే ఉంది. కోవిడ్ - 19 సంవత్సరం (2020-21) లో తప్ప, డోమర్ అంతరం ఈ కాలంలో సానుకూలంగానే ఉండడం ప్రజాఋణం ఒక స్థిరమైన స్థాయికి చేరుకుంటుందని సూచిస్తోంది. అయితే, 2021-2023 లో ప్రజాఋణం రాబడులలో గణనీయమైన భాగాన్ని (80 నుండి 84 శాతం) గతంలో తీసుకున్న ఋణాలను తిరిగి చెల్లించడానికి ఉపయోగించారు, ఇది ఋణాన్ని తీర్చడానికి ఆర్థిక వృద్ధి తగినంత బలంగా లేదని సూచిస్తుంది. ఇంకా, ప్రజా పద్దుల చెల్లింపు బాధ్యతలు, బడ్జెటుకు వెలుపలి ఋణాలు, ఇతర జాబితా చేయని రాబడి నష్టాలు వంటి ఇతర కారకాలు లెక్కించాల్సి ఉంది, ఇవి రాష్ట్రం అప్పులను భరించే సామర్థ్యాన్ని అస్థిరం చేస్తాయి.

మొత్తం మీద అప్పులను భరించే సామర్థ్యం సమీక్షలో బడ్జెటుకు వెలుపలి ఋణాల చెల్లింపును పరిశీలించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న నికర ప్రజాఋణం ప్రతికూలంగా ఉంటుందని సూచిస్తుంది. ఇది రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై గణనీయమైన ఒత్తిడిని కలిగించవచ్చు, రాష్ట్రం అప్పులను భరించే సామర్థ్యాన్ని అవాంఛనీయ స్థాయికి నెట్టవచ్చు. ఇంకా తీసుకున్న మార్కెటు ఋణాలలో గణనీయమైన భాగాన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు/ప్రత్యేక ప్రయోజన వాహక సంస్థలకు/ స్వయం పాలక సంస్థలకు బడ్జెటుకు వెలుపలి ఋణాల చెల్లింపు (అసలు, వడ్డీ) కోసం తిరిగి ఋణాలు, అడ్వాన్సులుగా ఇవ్వడం కోసం ప్రభుత్వం వినియోగించడం జరిగింది. అప్పులను భరించే సామర్థ్యం దృష్ట్యా ద్రవ్యపరంగా ఇది ఆరోగ్యకరమైన చర్య కాదు.

తెలంగాణ హరిత నిధి

గత సంవత్సరం తెలంగాణ హరిత నిధి పేరిట ఏర్పాటు చేసిన ఒక కొత్త నిధి ప్రభుత్వ పద్దులకు వెలుపల ఉంది. ఈ నిధికి ప్రజా ప్రతినిధుల నుంచి, ప్రభుత్వ ఉద్యోగుల నుంచి తప్పనిసరి విరాళాల, ఇతర స్వచ్ఛంద విరాళాల నుంచి ధనం సమకూరుతుంది.

ఏకీకృత సమన్వయ సంస్థ (సింగిల్ నోడల్ ఏజన్సీ)

ఒక్కొక్క కేంద్ర ప్రాయోజిత పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక ఏకీకృత సమన్వయ సంస్థను ఏర్పాటు చేయాలి. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి 77 కేంద్ర ప్రాయోజిత పథకాల గురించి 127 ఏకీకృత సమన్వయ సంస్థలను ఏర్పాటు చేసి సంబంధిత ఖాతాలను బ్యాంకులలో ప్రారంభించడం జరిగింది. ఐదు ఏకీకృత సమన్వయ సంస్థ ఖాతాలు ఉన్న ఐదు కేంద్ర ప్రాయోజిత పథకాల విషయంలో 2023 మార్చి నాటికి నిల్వ ఏమి లేదని, ఇతర 72 కేంద్ర ప్రాయోజిత పథకాల విషయంలో వాణిజ్య బ్యాంకుల వద్ద ₹2,170 కోట్ల నిల్వ ఉందని రాష్ట్ర ప్రభుత్వం / ఏకీకృత సమన్వయ సంస్థలు తెలిపాయి.

బడ్జెటు పనితీరు

యావత్తు బడ్జెటు లక్ష్యసాధన

తొలుత ఆమోదితమైన మొత్తంతో పోలిస్తే యావత్తు బడ్జెటు వ్యయ లక్ష్యసాధన / వాస్తవ వ్యయం తక్కువైనా, అధికమైనా ఏ మేరకు ప్రతిబింబిస్తోందన్న విషయాన్ని యావత్తు బడ్జెటు లక్ష్యసాధన ద్వారా మదింపు వేయవచ్చు. నిత్య వ్యావహారిక (అంటే, రెవెన్యూ) విభాగంలో, బడ్జెటు అంచనాలతో పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 14 శాతం. ఇది 17 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 10 గ్రాంట్లలో +/- 25 శాతం నుంచి +/- 50 శాతం వరకు తేడా, 10 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది. మూలధన (అంటే, క్యాపిటల్) విభాగంలో, బడ్జెటు అంచనాలతో

పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 39 శాతం. ఇది 2 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 9 గ్రాంట్లలో +/- 25 శాతం నుంచి +/- 50 శాతం వరకు తేడా, 13 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది. మరో 4 గ్రాంట్లలో 100 శాతం లేదా అంత కన్నా ఎక్కువగా ఉంది. ఋణాలు విభాగంలో, బడ్జెటు అంచనాలతో పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 12 శాతం. ఇది 8 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 3 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది. మరో గ్రాంటులో 100 శాతం లేదా అంత కన్నా ఎక్కువగా ఉంది.

ఖర్చుల కూర్పుకు సంబంధించిన లక్ష్యసాధన

బడ్జెటులోని ప్రధాన వర్గాల మధ్య తిరిగి చేసిన కేటాయింపులు ఏ మేరకు ఖర్చులో కూర్పులో తేడాలకు దోహదపడ్డాయో ఖర్చుల కూర్పు లక్ష్యసాధన మదింపు వేస్తుంది. నిత్య వ్యావహారిక (అంటే, రెవెన్యూ) విభాగంలో, సవరించిన అంచనాలతో పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 19 శాతం. ఇది 15 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 13 గ్రాంట్లలో +/- 25 శాతం నుంచి +/- 50 శాతం వరకు తేడా, 9 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది. మూలధన (అంటే, క్యాపిటల్) విభాగంలో, సవరించిన అంచనాలతో పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 48 శాతం. ఇది 3 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 9 గ్రాంట్లలో +/- 25 శాతం నుంచి +/- 50 శాతం వరకు తేడా, 13 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది. మరో 3 గ్రాంట్లలో 100 శాతం లేదా అంత కన్నా ఎక్కువగా ఉంది.

బడ్జెటు నిర్వహణలో ఇతర లోటుపాట్లు

అధిక ఖర్చు

ప్రస్తుత సంవత్సరంలో ₹1,05,565 కోట్ల మొత్తం అధిక వ్యయం అయ్యింది. 2014-15 నుంచి 2021-22 వరకు కేటాయింపులకు మించి చేసిన **₹2,89,115** కోట్ల అధిక వ్యయానికి రాష్ట్ర శాసన సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరణ పొందడంలో కూడా విఫలమయ్యింది. ఇది రాజ్యాంగంలోని 204 అధికరణ ఉల్లంఘన.

బడ్జెటు కేటాయింపులు లేకుండా ఖర్చు చేయడం ఈ సంవత్సరం కూడా కొనసాగడమే కాకుండా బడ్జెటు కేటాయింపు లేకుండా ప్రభుత్వం 48 ఉప పద్దుల కింద ₹8,985 కోట్ల భారీ మొత్తాన్ని ఖర్చు చేసింది. ఉదయ్ కింద డిస్కమ్‌ల నష్టాలను తీసుకోవడంలో ₹7,061 కోట్లు ఖర్చు చేసినప్పటికీ శాసనసభ ఆమోదం పొందడంలో ప్రభుత్వం విఫలమైంది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థలో (₹122 కోట్లు) పెట్టిన పెట్టుబడులకు శాసనసభ ఆమోదం పొందడంలో కూడా ప్రభుత్వం విఫలమైంది.

గత ఐదు సంవత్సరాలుగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య విభజించదగిన సేవా పింఛనుల ఖర్చును నామమాత్రంగా ₹50 కోట్ల కంటే తక్కువగా అంచనా వేయడం జరుగుతోంది, వాస్తవ వ్యయం గత ఐదు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరమూ ₹1,000 కోట్లకు మించి అధికంగా ఖర్చయింది. అదేవిధంగా, రాష్ట్ర అభివృద్ధి ఋణాల మీద వడ్డీపై ఖర్చు నిరంతరం తక్కువగా అంచనా వేయడం జరుగుతోంది.

పన్నులు కాని రాబడి

2022-23 సంవత్సరంలో పన్నులు కాని రాబడి నుంచి అందుకోవలసిన మొత్తం ₹25,422 కోట్లుగా అంచనా వేశారు. కానీ రాబడి ₹19,554 కోట్లు. ఇందులోనూ, (i) ఇతర రాబడి ద్వారా వచ్చిన ₹5,723

కోట్లు ప్రధానంగా డిపాజిటు ఖాతాలను జప్తు చేసినందు వల్ల వచ్చినవే, (ii) ప్రధాన ఖనిజాలపై కప్పం (లేదా రాయల్టీ) రూపంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ నుంచి వచ్చిన ₹5,003 కోట్లలో బకాయిలు, ముందుగా ఊహించని ముందస్తుగా చెల్లించిన రాయల్టీ కూడా ఉన్నాయి.

పన్నులు కాని రాబడిలో భూమి, ఆస్తి విక్రయం నుంచి ₹15,500 కోట్లు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది, కానీ కేవలం ₹791 కోట్లు మాత్రమే అందుకుంది. గత మూడు సంవత్సరాలుగా చూస్తే బడ్జెటు అంచనాలలో పన్నులు కాని రాబడి నుండి వచ్చే రాబడి అంచనాలు నిరంతరం ఎక్కువగానే ఉంటున్నాయి.

సహాయక గ్రాంట్లు

భారత ప్రభుత్వం నుంచి సహాయక గ్రాంట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ₹41,002 కోట్ల భారీ మొత్తాన్ని అంచనా వేసింది, కానీ ₹13,179 కోట్లు మాత్రమే అందుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అవాస్తవంగా ₹25,555 కోట్లు ప్రత్యేక ప్యాకేజీగా, అదనపు కేంద్ర సహాయంగా అందుతుందని అంచనా వేసింది, ఇది భారత ప్రభుత్వ బడ్జెటు ప్రతిపాదనలలోనూ కనబడలేదు, 2022-23 సంవత్సరంలోనూ అందలేదు. పన్నులు కాని రాబడి వలె, గత రెండు సంవత్సరాలుగా చూస్తే బడ్జెటు అంచనాలలో సహాయక గ్రాంట్లు నుండి వచ్చే రాబడి అంచనాలు నిరంతరం ఎక్కువగానే ఉంటున్నాయి.

ఇతర రాబడి

2023 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన సవరించిన అంచనాలలో కూడా భారీ రాబడిని (₹7,500 కోట్లు) అంతర్రాష్ట్ర సర్దుబాట్ల రూపంలో అంచనా వేయడం జరిగింది. ఈ మొత్తాలు వాస్తవానికి అందనే లేదు. ఇలా అంచనా వేసిన మొత్తం ఆంధ్ర ప్రదేశ్ విద్యుతు రంగ కంపెనీల నుంచి తెలంగాణ విద్యుతు రంగ కంపెనీలకు విద్యుతు బకాయిల రూపంలో రావల్సిన మొత్తం, రాష్ట్ర ప్రభుత్వానికి కాదు.

కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయకపోవడం

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం (₹11,000 కోట్లు), గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్‌కు సహాయం (₹1,000 కోట్లు), ఆయిల్ పామ్ పెంపకం (₹1,000 కోట్లు) వంటి పథకాలకు సంబంధించి ప్రస్తుత సంవత్సరంలో చేసిన భారీ కేటాయింపులు మొత్తం ఖర్చు కానేలేదు.

కేటాయింపులను ఎక్కువగా ఖర్చు చేయకపోవడం

తెలంగాణ దళిత బంధు పథకం (ఖర్చు కాని కేటాయింపు: ₹15,700 కోట్లు), రైతులకు ఋణ మాఫీ పథకం (ఖర్చు కాని కేటాయింపు: ₹3,964 కోట్లు) వంటి ప్రతిష్ఠాత్మక పథకాలపై కేటాయింపులలో భారీ భాగం ఖర్చుకాలేదు.

పద్దులలో తప్పుగా వర్గీకరణలు

శస్త్ర చికిత్సలలో వినియోగం అయిపోయే వస్తువుల కొనుగోలుకు సంబంధించిన ఖర్చును, వనీకరణ ఇతరత్ర మీద చిన్న పనుల ఖర్చును మూలధనవ్యయంగా (₹140 కోట్లు), యంత్రాలు, పరికరాలు, మోటారు వాహనాలు, పనిముట్లు, యంత్రాగారాల కొనుగోళ్లకు సంబంధించిన ఖర్చును నిత్య వ్యావహారిక వ్యయంగా (₹25 కోట్లు) తప్పుగా వర్గీకరణలు ప్రస్తుత సంవత్సరంలో కూడా కొనసాగింది.

పద్దుల నాణ్యత, ఆర్థికాంశాల నివేదన

ఆర్థిక నియమాలను, పద్ధతులను, ఆదేశాలను పాటించడంతో పాటు ఆ విధమైన పాటింపుకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో, నాణ్యమైన రీతిలో నివేదించడం కూడా సుపరిపాలన లక్షణాలలో ఒకటి. పాటింపు, నియంత్రణల మీద నివేదికలు ప్రభావవంతమై, ఆచరణలో ఉంటే మౌలికమైన కార్యనిర్వాహక బాధ్యతలను నిర్వర్తించడంలోనూ, వ్యూహాత్మక ప్రణాళికా రచనలోనూ, నిర్ణయాలు తీసుకోవటంలోనూ ప్రభుత్వానికి ఉపకరిస్తాయి.

వడ్డీ చెల్లింపు బాధ్యతను నెరవేర్చడం

ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (₹53 కోట్లు), రాష్ట్ర పరిహార వనీకరణ నిధి (₹47 కోట్లు), రాష్ట్ర విపత్తు నివారణ నిధి (₹9 కోట్లు), నిర్ధారిత వాటా పింఛను పథకం డిపాజిట్ల (₹22 కోట్లు) లలో ఉన్న నిధులపై ₹131 కోట్ల వడ్డీ చెల్లింపు బాధ్యతను ప్రభుత్వం నెరవేర్చలేదు. గత ఐదు సంవత్సరాలుగా ₹469 కోట్ల వడ్డీ చెల్లింపు బాధ్యతను నెరవేర్చలేదు.

అమాంబాపతు చిన్న పద్దు - 800 ను ఉపయోగించడం

₹6,560 కోట్లను అమాంబాపతు చిన్న పద్దు 800 - ఇతర రాబడి అని వర్గీకరించడంతో పాటు ఉప పద్దు, వివరణాత్మక పద్దుల స్థాయిలో కూడా ఇతర రాబడి / ఇతర అంశాలు, ఇతర రాబడి / ఇతర అంశాలు / ఇతరాలు అని వర్గీకరించడం జరిగింది. పర్యవసానంగా ఈ రాబడి తాలూకు మూలాన్ని గానీ, స్వభావాన్ని గానీ గుర్తించడం కష్టతరం అవుతుంది.

వ్యక్తిగత డిపాజిటు ఖాతాల నిర్వహణ

2023 మార్చి నాటికి ₹150 కోట్ల నిల్వగల 131 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలున్నాయి. 2022-23 లో రాష్ట్ర సంచిత నిధి నుంచి ఈ ఖాతాలకు ₹2,008 కోట్లు బదిలీ అయ్యాయి. గత సంవత్సరం (₹608 కోట్లు) తో పోలిస్తే ఇది గణనీయంగా 230 శాతం పెరిగింది. సంచిత నిధి నుంచి వ్యక్తిగత డిపాజిటు ఖాతాలకు బదిలీ గణనీయంగా పెరగడం ఈ సంవత్సరం బడ్జెటు మురిగిపోకుండా నివారించడం కోసం అయి ఉండవచ్చు. 71 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలలో రాబడి, చెల్లింపులు రెండూ కూడా లేకపోవడం అవి 2022-23 లో ఉపయోగంలో లేవు అని సూచిస్తోంది. ఈ 71 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలలో, 46 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలు గత సంవత్సరంలో కూడా ఉపయోగంలో లేవు. ఉపయోగంలో లేని ఈ వ్యక్తిగత డిపాజిటు ఖాతాలను సమీక్షించి, మూసివేయాలి.

ఎ.సి. బిల్లులకు గానూ డి.సి. బిల్లులు

2023 మార్చి నాటికి ₹191 కోట్ల విలువ గల 321 అనిశ్చిత, ఆకస్మిక (ఎ.సి.) బిల్లులకు వివరణాత్మక కంటింజెంట్ బిల్లులు అందవలసి ఉంది. గత సంవత్సరం మార్చి 31 (₹159 కోట్ల విలువ గల 496 ఎ.సి. బిల్లులు) తో పోలిస్తే సర్దుబాటు కాని ఎ.సి.బిల్లుల విలువ పెరిగినప్పటికీ సర్దుబాటు కాని ఎ.సి. బిల్లుల సంఖ్యలో తగ్గుదల ఉంది.

సరిపోల్చి చూసుకోవడం

రాబడికి సంబంధించి ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్ అండ్ ఎన్టైటిల్మెంట్స్) తో లెక్కలను సరిపోల్చి చూసుకోవాల్సిన 58 నియంత్రణాధికారులలో 29 మంది సరిపోల్చి చూసుకోకపోగా, 9 మంది పాక్షికంగా సరిపోల్చి చూసుకున్నారు. ఖర్చులకు సంబంధించి 196 మంది నియంత్రణాధికారులలో 25 మంది సరిపోల్చి చూసుకోకపోగా, 86 మంది పాక్షికంగా సరిపోల్చి చూసుకున్నారు.

వార్షిక పద్దుల సమర్పణ

29 స్వయంపాలక సంస్థలు గడువు లోపల వార్షిక పద్దులను సమర్పించలేదు. వాటి పద్దులను సమర్పించడంలో ఒకటి నుంచి పదహారు సంవత్సరాల జాప్యాలు ఉన్నాయి. వార్షిక పద్దుల సమర్పణలో జాప్యం సంస్థల జవాబుదారీతనాన్ని బలహీనం చేస్తుంది.

ఐ.జి.ఏ.ఎస్. పాటింపు

భారత ప్రభుత్వ అకౌంటింగు ప్రమాణాలను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా పాటించాల్సి ఉంది.

రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు

2023 మార్చి 31 నాటికి, తెలంగాణలో 77 ప్రభుత్వ కంపెనీలు (16 కంపెనీలు నిష్క్రియంగా ఉన్నాయి. అవి మూసివేత, అంటే లిక్విడేషన్లో ఉన్నాయి లేదా పనిచేయడం లేదు), మూడు చట్టబద్దమైన కార్పొరేషన్లు, మూడు ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఇతర కంపెనీలతో కలిపి 83 రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు (ఎస్.పి.ఎస్.యు.) భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ఆడిట్ పరిధిలో ఉన్నాయి. ఈ 83 ప్రభుత్వ రంగ సంస్థలలో, ఎనిమిది విద్యుతు రంగానికి చెందినవి కాగా, 75 విద్యుదితర రంగాలకు చెందినవి.

196 పద్దులు బకాయిలో ఉన్న 55 ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థిక ప్రకటనల సమర్పణకు సంబంధించి నిర్దేశించిన సమయపాలన పాటించలేదని ఆడిట్ గమనించింది. ఆరు పనిచేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్జించిన ₹3,857.48 కోట్ల మొత్తం లాభాలలో 98.76 శాతం కేవలం మూడు ప్రభుత్వ రంగ సంస్థలు తోడ్పాటు చేసాయి. ఒక ప్రభుత్వ రంగ సంస్థ లాభాన్ని గానీ నష్టాన్ని గానీ నివేదించలేదు. 11 పనిచేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు చవిచూసిన ₹11,969.66 కోట్ల మొత్తం నష్టాలలో, ₹11,898.57 కోట్ల నష్టం మూడు ప్రభుత్వ రంగ సంస్థలు పొందాయి. ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థిక ప్రకటనలపై 2022 అక్టోబరు నుంచి 2023 సెప్టెంబరు మధ్యకాలంలో జారీ చేసిన సి.ఎ.జి. వ్యాఖ్యల ఆర్థిక ప్రభావం లాభదాయకత మీద ₹757.21 కోట్లు, ఆస్తులు / అప్పుల మీద ₹31,989.68 కోట్లు.

ప్రభుత్వ రంగ సంస్థలు వారి ఆర్థిక ప్రకటనలను సకాలంలో సమర్పించేలా రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యంపై ఒత్తిడి చేయాలి. పద్దులు ఖరారు కానప్పుడు, అటువంటి ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రభుత్వ పెట్టుబడులు రాష్ట్ర శాసనసభ పర్యవేక్షణకు దూరంగా ఉంటాయి. నష్టాలను పొందుతున్న ప్రభుత్వ రంగ సంస్థలలో నష్టాలకు కారణాలను రాష్ట్ర ప్రభుత్వం విశ్లేషించి, వాటి కార్యకలాపాలను సమర్థవంతంగా, లాభదాయకంగా మార్చడానికి చర్యలు ప్రారంభించాలి. నిష్క్రియంగా ఉన్న ప్రభుత్వ కంపెనీలను కూడా సమీక్షించి, వాటి పునరుద్ధరణకు/ మూసివేతకు రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలి.

అధ్యాయం I

అవలోకనం

అధ్యాయం I అవలోకనం

1.1 పరిచయం

తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 02 న ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం దేశంలో జనాభాపరంగా 12 వ అతిపెద్ద రాష్ట్రం (2011 జనాభా లెక్కల ప్రకారం 350.04 లక్షలు) కాగా, విస్తీర్ణంపరంగా 11 వ అతి పెద్ద రాష్ట్రం (1,12,077 చదరపు కిలోమీటర్లు). తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఉన్న 10 జిల్లాలను 33 జిల్లాలుగా[1], జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పాటు, అటు తర్వాత 459 మండలాలను 612 మండలాలుగా, 8,368 గ్రామ పంచాయితీలను 12,769 గ్రామ పంచాయితీలుగా[2] పునర్వ్యవస్థీకరించడం జరిగింది. రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలు దాదాపు 45.8 శాతం జనాభాకు ఉపాధి కల్పిస్తాయి. రాష్ట్రంలో ప్రధాన భాగం జనాభ వ్యవసాయ సంబంధిత కార్యకలాపాల మీద ఆధారపడి ఉందని ఇది సూచిస్తుంది.

తెలంగాణ సాధారణ, ఆర్థిక సమాచారం ***అనుబంధం 1.1*** లో ఉంది.

1.1.1 తెలంగాణ రాష్ట్ర స్థూల గృహోత్పత్తి

స్థూల గృహోత్పత్తి (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ - జి.డి.పి.) అంటే ఒక నిర్దిష్టమైన కాల అవధిలో దేశం సరిహద్దుల లోపల ఉత్పత్తి అయిన అన్ని వస్తువుల, సేవల విలువ. ఈ కొలమానానికి రాష్ట్ర స్థాయిలో సమానమైన కొలమానం **రాష్ట్ర స్థూల గృహోత్పత్తి** (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ - జి.ఎస్.డి.పి.). జి.డి.పి. లేదా జి.ఎస్.డి.పి. వృద్ధిరేటు అనేది ఒక నిర్ణీతమైన కాల అవధిలో ఆర్థికాభివృద్ధి స్థాయిని తెలిపే ఒక ముఖ్యమైన ఆర్థిక సూచిక. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కూర్పులో వస్తున్న మార్పులను జి.డి.పి. / జి.ఎస్.డి.పి.కి చేకూరే వివిధ రంగాల వాటాలలోని మార్పులు ప్రతిబింబిస్తాయి.

సమకూరిన స్థూల విలువ (గ్రాస్ వాల్యూ యాడెడ్ - జి.వి.ఎ.) అంటే ఏదైనా ఒక యూనిటు (రంగం, ఉప-రంగం, సంస్థ వగైరా) దేశపు ఉత్పత్తికి సమకూర్చిన వాటా. యూనిట్ల ఉత్పత్తి మొత్తం విలువ నుండి అన్ని మధ్యంతర వస్తువుల, సేవల విలువను తీసివేయడం ద్వారా జి.వి.ఎ.ను లెక్కించడం జరుగుతుంది. 'రెండోసారి లెక్కించకుండా' ఉండేందుకు ఈ విధంగా మధ్యంతర విలువను తీసివేయడం జరుగుతుంది. ఈ కొలమానానికి రాష్ట్ర స్థాయిలో సమానకమైన కొలమానం సమకూరిన రాష్ట్ర స్థూల విలువ (గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్ - జి.ఎస్.వి.ఎ.).

స్థూల గృహోత్పత్తిలో పన్నులు, రాయితీలు ఇమిడి ఉండగా, సమకూరిన స్థూల విలువలో వాటి ప్రభావం ఉండదు. కనుక సాధారణంగా భారత ప్రభుత్వం, అంతర్జాతీయ ఆర్థిక నిధి, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు ఆర్థిక విశ్లేషణకు సమకూరిన స్థూల విలువను ఉపయోగిస్తుంటాయి. విధానకర్తల దృష్ట్యా మెరుగైన విశ్లేషణ, విధానపరమైన నూతన చర్యలకు సమకూరిన స్థూల విలువ, సమకూరిన రాష్ట్ర స్థూల విలువలను పోల్చి చూడడం కీలకం.

ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి అయిన అన్ని వస్తువులు, సేవల మొత్తం విలువను పౌరులందరికీ సమానంగా విభజించగా వచ్చే ధనం **తలసరి ఆదాయం**[3].

భారతదేశపు స్థూల గృహోత్పత్తి[4], సమకూరిన స్థూల విలువ, తలసరి ఆదాయంతో పోల్చే స్థూల రాష్ట్ర గృహోత్పత్తి[5], సమకూరిన రాష్ట్ర స్థూల విలువ, రాష్ట్ర తలసరి ఆదాయాలను ఈ కింది పట్టికలో చూపడం జరిగింది.

---

1 2016 అక్టోబరు, 2019 ఫిబ్రవరి

2 తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టం - 2018 (2018 మే), తరువాత ఆయా సమయాల్లో చేసిన సవరణలు

3 సామాజిక ఆర్థిక దృక్పథం 2022 ప్రకారం (ఆర్థిక, గణాంకాల డైరెక్టరేటు తయారు చేసింది)

4 ఈ నివేదిక అంతటా స్థూలగృహోత్పత్తిని ప్రస్తుత ధరల ప్రకారం పరిగణించడం జరిగింది

5 ఈ నివేదిక అంతటా రాష్ట్ర స్థూలగృహోత్పత్తిని ప్రస్తుత ధరల ప్రకారం పరిగణించడం జరిగింది

పట్టిక 1.1: దేశ స్థూల గృహోత్పత్తితో పోలిస్తే రాష్ట్ర స్థూల గృహోత్పత్తి పెరుగుదల సరళి

	2018-19	2019-20 (మూడోసారి సవరించిన అంచనాలు)	2020-21 (రెండోసారి సవరించిన అంచనాలు)	2021-22 (తొలిసారి సవరించిన అంచనాలు)	2022-23 (ముందస్తు అంచనాలు)
జి.డి.పి. (మూలం: 2011-12) (₹ కోట్లలో)	1,88,99,668	2,01,03,593	1,98,29,927	2,34,71,012	2,72,40,712
గత సంవత్సరంతో పోలిస్తే జి.డి.పి. వృద్ధి రేటు (శాతంలో)	*10.59*	*6.37*	*(-)1.36*	*18.36*	*16.06*
ఆధారభూతమైన ధరల వద్ద జి.వి.ఎ. (₹ కోట్లలో)	*1,71,75,128*	*1,83,81,117*	*1,81,88,780*	*2,14,38,883*	*2,47,42,871*
గత సంవత్సరంతో పోలిస్తే జి.వి.ఎ. వృద్ధి రేటు (శాతంలో)	*10.77*	*7.02*	*(-)1.05*	*17.87*	*15.41*
దేశం తలసరి జి.డి.పి. (₹)	*1,42,424*	*1,49,915*	*1,46,301*	*1,71,498*	*1,96,983*
జి.ఎస్.డి.పి. (మూలం: 2011-12) (₹ కోట్లలో)	8,57,427	9,50,090	9,42,814	11,28,907	13,13,391
గత సంవత్సరంతో పోలిస్తే జి.ఎస్.డి.పి. వృద్ధి రేటు (శాతంలో)	*14.32*	*10.81*	*(-)0.77*	*19.74*	*16.34*
ఆధారభూతమైన ధరల వద్ద జి.ఎస్.వి.ఎ. (₹ కోట్లలో)	7,76,946	8,69,773	8,68,689	10,33,322	12,14,122
గత సంవత్సరంతో పోలిస్తే జి.ఎస్.వి.ఎ. వృద్ధి రేటు (శాతంలో)	*14.23*	*11.95*	*(-)0.12*	*18.95*	*17.50*
తెలంగాణ తలసరి జి.ఎస్.డి.పి. (₹)	*2,31,156*	*2,54,402*	*2,50,755*	*2,98,526*	*3,45,638*
దేశం జి.డి.పి.లో తెలంగాణ జి.ఎస్.డి.పి. శాతం	*4.54*	*4.72*	*4.75*	*4.81*	*4.82*

మూలం: గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ

గత ఐదు సంవత్సరాలలోనూ రాష్ట్రం వృద్ధి రేటు దేశ స్థూల గృహోత్పత్తి వృద్ధి రేటు కన్నా ఎక్కువగా ఉందని పై పట్టికను బట్టి చూస్తే తెలుస్తోంది. అంతే కాకుండా, దేశ స్థూల గృహోత్పత్తిలో రాష్ట్ర స్థూల గృహోత్పత్తి వాటా నిరంతరంగా పెరుగుతూ 4.54 శాతం నుంచి 4.82 శాతానికి చేరింది. రాష్ట్ర ఆర్థికం సానుకూలంగా పెరుగుతోందని ఇది సూచిస్తోంది. అదే విధంగా, సమకూరిన రాష్ట్ర స్థూల విలువ (జి.ఎస్.వి.ఎ.) కూడా దేశం సమకూరిన రాష్ట్ర స్థూల విలువ (జి.వి.ఎ.) కన్నా ఎక్కువగా ఉంది.

ప్రస్తుత ధరల ప్రకారం 2022-23 లో తెలంగాణ తలసరి రాష్ట్ర స్థూల గృహోత్పత్తి ₹3,45,638[6]. ఇది దేశం సగటు తలసరి స్థూల గృహోత్పత్తి ₹1,96,983[7] కన్నా 1.75 రెట్లు ఎక్కువ.

ఆర్థిక కార్యకలాపాల ద్వారా ఉత్పత్తి అయిన జి.ఎస్.డి.పి.ని సాధారణంగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలను సూచిస్తూ ప్రాథమిక[8], ద్వితీయ[9], తృతీయ[10] రంగాలుగా వర్గీకరించడం జరుగుతుంది. 2022-23 సంవత్సరంలో దేశం జి.డి.పి., రాష్ట్రం జి.ఎస్.డి.పి.లలో వివిధ రంగాల వాటాలు *పటం 1.1, పటం 1.2* లలో ఉన్నాయి.

---

[6] తలసరి నికర రాష్ట్ర గృహోత్పత్తి ప్రకారం లెక్కించినది, మూలం: గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ప్రకారం 2023 ఆగస్టు 01 నాటికి

[7] సగటు తలసరి ఆదాయం 2023 సెప్టెంబరు 01 నాటికి

[8] ప్రాథమిక రంగంలో పంటలు, పశుగణం, అడవుల పెంపకం - చెట్ల నరికివేత, చేపలు పట్టడం – నీటి సేద్యం (అక్వా కల్చర్), గనుల తవ్వకం, క్వారీయింగ్ ఉంటాయి

[9] ద్వితీయ రంగంలో తయారీరంగం, విద్యుత్, గ్యాసు, నీటి సరఫరా, ఇతర ప్రజోపయోగ సేవలు, నిర్మాణరంగం ఉంటాయి

[10] తృతీయ రంగం అంటే సేవల రంగం. ఇందులో వర్తకం, మరమ్మతు సేవలు, హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, నిల్వ, సమాచార సేవలు, ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్, నివాసాల యాజమాన్యం వంటివి ఉంటాయి

పటం 1.1: 2022-23 సంవత్సరానికి రంగాల వారీగా జి.డి.పి. (₹ కోట్లలో, శాతంలో)



పటం 1.2: 2022-23 సంవత్సరానికి రంగాల వారీగా జి.ఎస్.డి.పి. (₹ కోట్లలో, శాతంలో)



మూలం: గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ సమాచారం

గమనిక 1: అన్ని పటములలోనూ సేవల రంగంలో అన్ని రంగాలకు సంబంధించిన ఉత్పత్తుల మీద రాయితీలు, పన్నులు కలిసిపోయి ఉన్నాయి

గమనిక 2: ఈ అధ్యాయంలోని అన్ని పటములలోనూ వ్యవసాయ రంగంలో పంటలు, పశుగణం, అడవుల పెంపకం - చెట్ల నరికివేత, చేపలు పట్టడం - నీటి సేద్యం (అక్వా కల్చర్) కలిసి ఉన్నాయి

2022-23 సంవత్సరంలో రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా దేశ స్థూల గృహోత్పత్తిలో వాటాతో పోల్చదగిందిగా ఉంది. అయితే, దేశ స్థూల గృహోత్పత్తిలో పరిశ్రమల వాటా ఎక్కువగా ఉంటే, తెలంగాణ రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో సేవల రంగం వాటా ఎక్కువగా ఉంది. ఏది ఏమైనా, అటు దేశ స్థూల గృహోత్పత్తిలో, ఇటు రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో సేవల రంగం వాటా సగం కన్నా ఎక్కువగా ఉంది.

- వ్యవసాయ రంగం కింద, రాష్ట్ర స్థూల గృహోత్పత్తికి ప్రధానంగా 'పంటలు' (₹1,05,134 కోట్లు) 8.00 శాతం, అటు తర్వాత 'పశు సంపద' (₹96,344 కోట్లు) 7.34 శాతం దోహదపడ్డాయి.

- పరిశ్రమల రంగం కింద, గత సంవత్సరం మాదిరిగానే ప్రధాన భాగం 'తయారీ రంగం' (₹1,37,869 కోట్లు) నుంచి వచ్చింది. దీని వాటా రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో 10.50 శాతం.

- సేవల రంగం విషయానికి వస్తే, గత సంవత్సరం మాదిరిగానే రాష్ట్ర స్థూల గృహోత్పత్తికి ముఖ్యమైన వాటా 'స్థిరాస్తి, నివాసాల యాజమాన్యం, ఇతర వృత్తిపరమైన సేవల రంగం' (₹2,74,233 కోట్ల) నుంచి వచ్చింది. దీని వాటా 20.88 శాతం. అటు తర్వాతి స్థానం 'వాణిజ్యం, మరమ్మతు సేవలు' (₹2,00,908 కోట్లు). దీని వాటా 15.30 శాతం.

మారుతున్న ఆర్థిక నిర్మాణాన్ని అర్థం చేసుకోవడానికి రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలోని వివిధ రంగాల వాటాలలో వస్తున్న మార్పు కూడా ముఖ్యమే. 2018-19 తో పోలిస్తే 2022-23 లో జి.ఎస్.డి.పి.కి వివిధ రంగాల వాటాల్లోని మార్పులను *పటం 1.3* లో చూపడం జరిగింది.

పటం 1.3: 2018-19 నుంచి 2022-23 వరకు రాష్ట్ర స్థూలగృహోత్పత్తికి దోహదపడిన రంగాల వాటాల్లో మార్పులు



మూలం: గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ సమాచారం

కోవిడ్ - 19 సమయం (2019-20, 2020-21) లో స్వల్పంగా తగ్గినప్పుడు తప్ప ఇతరత్రా అంతటా సేవల రంగం వాటా దాదాపుగా 65 శాతంగా ఉంది. కోవిడ్ - 19 సమయంలో వ్యవసాయం వాటా అత్యధికంగా ఉంది. గత నాలుగు సంవత్సరాలుగా పరిశ్రమల రంగం వాటా దాదాపుగా 19 శాతంగా ఉంది.

రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో విడిగా ఒక్కొక్క రంగం వృద్ధిని *పటం 1.4* లో చూపడమైంది.

పటం 1.4: రంగాల వారీగా రాష్ట్ర స్థూల గృహోత్పత్తి వృద్ధి రేట్లు



మూలం: గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ సమాచారం

కోవిడ్ - 19 సమయం (2019-20, 2020-21) లో తిరోగమనం ప్రదర్శించిన పరిశ్రమల రంగం 2021-22 లో గణనీయంగా పెరిగింది. 2022-23 లో తిరిగి కొంత మందగించినా ఇంకా దాదాపు 10 శాతం సానుకూల వృద్ధి రేటు ఉంది. 2019-20 లో వేగంగా వృద్ధి చెందిన వ్యవసాయ రంగం 2021-22 లో 6 శాతానికి తగ్గినా, ప్రస్తుత

సంవత్సరంలో మాత్రం 16 శాతం మేర అధిక వృద్ధి రేటుతో పెరిగింది. 'రవాణాకు అనుబంధంగా ఉండే సేవలు', 'నిల్వలు' లో తక్కువ వృద్ధి రేట్ల కారణంగా సేవల రంగం గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత సంవత్సరంలో 6 శాతం మేర తగ్గింది.

1.2 రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిట్ నివేదికకు ప్రాతిపదిక, విధానం

1.2.1 రాష్ట్ర ప్రభుత్వ పద్దుల తయారీ

వార్షిక పద్దులను (ఆర్థిక పద్దులు, వినియోగ పద్దులు) తెలంగాణ ప్రధాన మహాగణాధికారి (అకౌంట్స్, ఎన్టైటిల్మెంట్స్) తయారు చేస్తారు. ఈ వార్షిక పద్దులను తెలంగాణ ప్రభుత్వ నియంత్రణలో పని చేస్తూ ఉండి, తొలిపద్దులు, అనుబంధ పద్దులు, సంకలనం చేసిన పద్దులను నిర్వహించాల్సిన బాధ్యత ఉన్న ఖజానాలు, కార్యాలయాలు, ప్రభుత్వ శాఖల నుంచి అందిన ఆయా పద్దుల ఆధారంగా, ఇంకా భారతీయ రిజర్వు బ్యాంకు నుంచి అందిన లావాదేవీల సమాచారం ఆధారంగా తయారు చేయడం జరుగుతుంది. తొలి పద్దుల, అనుబంధ పద్దుల తయారీకి, వాటి ఖచ్చితత్వానికీ, అదే విధంగా ఆయా పద్దులకు, లావాదేవీలకు వర్తించదగిన చట్టాలు, ప్రమాణాలు, నియమాలు, నిబంధనలకు అనుగుణంగా సక్రమంగా లావాదేవీలు జరిగినట్లు ధ్రువీకరించుకునే ప్రాథమిక బాధ్యత తెలంగాణ ప్రభుత్వ నియంత్రణలో పనిచేస్తున్న ఖజానాలు, కార్యాలయాలు, ప్రభుత్వ శాఖలదే.

1.2.2 పద్దుల ఆడిటు, రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల మీద ఆడిటు నివేదిక తయారీ

భారత రాజ్యంగంలోని 149, 151 అధికరణలతో పాటు భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సేవా నిబంధనల) చట్టం - 1971 కి అనుగుణంగా తెలంగాణ వార్షిక పద్దులపై స్వతంత్రంగా ఆడిటు నిర్వహించడం జరుగుతుంది. ఆడిటు ఫలితాల ఆధారంగా ఈ పద్దుల మీద ఒక అభిప్రాయాన్ని వ్యక్తీకరించే నిమిత్తం ఈ ఆడిటును నిర్వహించడం జరుగుతుంది. ఆర్థిక ప్రకటనలలో చేసిన వెల్లడించిన మొత్తాలకు, అంశాలకు సంబంధించిన ఆధారాలను ఈ ఆడిటులో భాగంగా మచ్చుకు పరీక్షించడం జరుగుతుంది. రాష్ట్ర పద్దులకు సంబంధించిన భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలను రాష్ట్ర గవర్నరుకు సమర్పిస్తే, గవర్నరు వాటిని శాసనసభలో ప్రవేశపెట్టేలా చూస్తారు. 2023 మార్చి 31 తో ముగిసిన సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఈ ఆడిటు నివేదికను భారత రాజ్యాంగం అధికరణ 151(2) ప్రకారం తెలంగాణ గవర్నరుకు సమర్పించడం కొరకు భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ తయారు చేయడం జరిగింది.

1.2.3 రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిట్ నివేదిక తయారీకి ఆధారమైన వనరులు

రాష్ట్ర ఆర్థికస్థితిగతులపై ఆడిటు నివేదిక కోసం సమాచారాన్ని ప్రధానంగా 2022-23 సంవత్సరం రాష్ట్ర ఆర్థిక పద్దుల నుంచి, వినియోగపు పద్దుల నుంచి స్వీకరించడం జరిగింది. ఈ కింది ఇతర వనరుల నుంచి కూడా సమాచారం స్వీకరించడం జరిగింది:

- ఆయా సమయాల్లో సవరించిన విధంగా తెలంగాణ రాష్ట్ర ద్రవ్య బాధ్యత, బడ్జెటు నిర్వహణ (టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం.) చట్టం;
- గణాంకాలు, కార్యక్రమాల అమలు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి, తెలంగాణ ప్రభుత్వం లోని ఆర్థిక, గణాంకాల డైరెక్టరు నుంచి రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.), రాష్ట్రానికి సంబంధించిన ఇతర గణాంకాలు;
- ఆర్థికపరమైన కొలమానాలను, కేటాయింపు ప్రాధాన్యాలను, అంచనాలను మదింపు వేసేందుకు, అదే విధంగా వాటి అమలులో ప్రభావశీలతను తులనాత్మకంగా పరిశీలించేందుకు, సంబంధిత నియమాలు, నిర్దేశించిన పద్ధతుల పాటింపును మదింపు వేసేందుకు రాష్ట్ర బడ్జెట్ పత్రాలు;

- ఖజానాల నుంచి, శాఖాపరమైన అధికారుల నుంచి సమాచారం (పద్దులకు సంబంధించి సమాచారంతో పాటు యాజమాన్య సమాచార వ్యవస్థలకు సంబంధించిన సమాచారం);
- పద్నాలుగో ఆర్థిక సంఘం, పదిహేనో ఆర్థిక సంఘాల సిఫార్సులు;
- మహాగణాకాధికారి (ఆడిటు) కార్యాలయం నిర్వహించిన ఆడిటు తాలూకు ఫలితాలు.

1.3 ప్రభుత్వ పద్దుల కూర్పు - ఒక అవలోకనం

ప్రభుత్వ పద్దులలో మూడు భాగాలు ఉంటాయి:

1. రాష్ట్ర సంచిత నిధి

ఈ నిధిలో రాష్ట్ర ప్రభుత్వానికి అందిన అన్ని రాబడులు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అన్ని ఋణాలు (మార్కెట్ నుంచి తీసుకున్న ఋణాలు, బాండ్ల రూపంలో సేకరించిన ఋణాలు, కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకున్న ఋణాలు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న ఋణాలు, జాతీయ చిన్న మొత్తాల పొదుపు నిధికి జారీ చేసిన ప్రత్యేక హామీ పత్రాలు వంటివి), భారతీయ రిజర్వు బ్యాంకు ఇచ్చే చేబదుళ్లు (అంటే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు), రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల తిరిగి వసూళ్ల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి అందిన అన్ని డబ్బులు కలిసి ఉంటాయి. భారత రాజ్యాంగంలో నిర్దేశించిన ప్రయోజనాల కొరకు, నిర్దేశించిన పద్ధతుల్లో, చట్టానికి అనుగుణంగానే తప్ప ఇతరత్రా ఈ నిధి నుంచి ధనాన్ని వినియోగించరాదు. కొన్ని రకాల ఖర్చులను (అంటే ఉదాహరణకు రాజ్యాంగబద్ధమైన అధికారుల జీతాలు, ఋణాల తిరిగి చెల్లింపు వంటివి) ఈ నిధి నుండి నేరుగా ఖర్చు చేయవచ్చు (అంటే చార్జ్డ్ వ్యయం). వీటికి శాసనసభలో ఓటింగుతో అవసరం లేదు. మిగతా ఖర్చులకు (అంటే ఓటెడ్ వ్యయం) శాసనసభలో ఓటింగు ఉంటుంది.

2. రాష్ట్ర ఆకస్మిక ఖర్చుల నిధి

రాష్ట్ర శాసనసభచట్టం ద్వారా ఏర్పాటైన ఈ నిధి రాష్ట్ర గవర్నరు అధీనంలో ఉండే చేడబ్బు (ఇంప్రెస్టు) వంటిది. ఊహించని ఖర్చులు వస్తే, వాటికి రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపేలోగా ముందస్తు చెల్లింపుల కోసం ఈ నిధి వీలు కల్పిస్తుంది. సంబంధిత పెద్ద పద్దుకు ఖర్చు రాయడం ద్వారా సంచిత నిధి నుంచి ధనాన్ని తిరిగి ఈ ఆకస్మిక ఖర్చుల నిధికి భర్తీ చేయడం జరుగుతుంది.

3. రాష్ట్ర ప్రజాపద్దు

పైన పేర్కొన్న నిధులే కాకుండా, ప్రభుత్వం ఒక బ్యాంకరు లేదా ధర్మకర్త మాదిరిగా వ్యవహరిస్తూ ఉండి, ప్రభుత్వం అందుకున్న లేదా ప్రభుత్వం తరుపున అందుకున్న ఇతర ప్రజాధనాన్ని ప్రజాపద్దులకు జమ చేయడం జరుగుతుంది. ప్రజాపద్దులో చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధులు, ధరావతులు (వడ్డీతో కూడినవి, వడ్డీ లేనివి), అడ్వాన్సులు, రిజర్వు నిధులు (వడ్డీతో కూడినవి, వడ్డీ లేనివి), జమలు, అనామతు పద్దులు (ఈ రెండూ కూడా ఇంకా ఖరారుగాని తుది పద్దులను నిర్ధారించక, లెక్క రాయక ముందు ఉపయోగించే తాత్కాలిక పద్దులు) కలిసి ఉంటాయి. ప్రజాపద్దులో ప్రభుత్వం వద్ద ఉన్న నగదు నికర నిల్వ కూడా కలిసి ఉంటుంది. ప్రజాపద్దులో లావాదేవీలకు శాసన సభ ఓటింగు అవసరం ఉండదు.

ప్రభుత్వ పద్దుల కూర్పును చిత్రరూపకంగా ఈ కింది *పటం 1.5* లో ఇవ్వడం జరిగింది.

పటం 1.5: ప్రభుత్వ పద్దుల కూర్పు



మూలం: ఆర్థిక పద్దులు

రెవెన్యూ రాబడి లో పన్నుల నుంచి రాబడి, పన్నులు కాని ఇతర రాబడి, కేంద్ర పన్నులు / సుంకాలలో వాటా, భారత ప్రభుత్వం నుంచి అందే గ్రాంట్లు ఉంటాయి.

క్యాపిటల్ రాబడుల్లో ఈ కిందివి ఉంటాయి:

> **తీసుకున్న అప్పులు:** మార్కెట్ నుంచి తీసుకున్న ఋణాలు, బాండ్లు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న ఋణాలు, చేబదుళ్ళ (వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సుల) కింద నికర లావాదేవీలు, కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకున్న ఋణాలు, అడ్వాన్సుల వంటివి;
>
> **అప్పులు కాని ఇతర క్యాపిటల్ రాబడి:** పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా లభించిన ధనం, తిరిగి వసూలు అయిన ఋణాలు, అడ్వాన్సులు;

నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులలో భౌతికపరమైన లేదా ఆర్థికపరమైన ఆస్తులను సమకూర్చని ప్రభుత్వ ఖర్చులన్నీ ఉంటాయి. వీటిలో ప్రభుత్వ శాఖల సాధారణ విధి నిర్వహణలు, వివిధ సేవల కోసం చేసే ఖర్చులు, తీసుకున్న అప్పుల మీద ప్రభుత్వం చేసే వడ్డీ చెల్లింపులు, వివిధ సంస్థలకు ఇచ్చిన ప్రదానాలు లేదా గ్రాంట్లు (వీటిలో కొన్ని గ్రాంట్లు ఆస్తుల ఏర్పాటుకు ఉద్దేశించినవి అయినా కూడా) వంటి ఖర్చులు ఉంటాయి.

మూలధన వ్యయం లేదా క్యాపిటల్ వ్యయంలో భూసేకరణ, భవనాలు, యంత్రాలు, పరికరాలు, వాటాలలో (అంటే షేర్లలో) పెట్టుబడి, ప్రభుత్వ రంగ సంస్థలకు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు, బయానాల వంటి ఖర్చులు ఉంటాయి.

ప్రజాఋణంలో మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలు, సంస్థల నుంచి తీసుకున్న ఋణాలు, జాతీయ చిన్న మొత్తాల పొదుపు నిధికి జారీ చేసిన ప్రత్యేక సెక్యూరిటీలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల వంటివి ఉంటాయి. ప్రజాఋణాన్ని లెక్కించే నిమిత్తం పెద్ద పద్దులు 6003, 6004 – ప్రజాఋణం ను పరిగణించడం జరుగుతుంది.

ప్రజా పద్దులో 'చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధి వంటివి', 'రిజర్వు నిధులు', 'ధరావతులు, బయానాలు' వంటి వాటికి సంబంధించిన లావాదేవీలు ఉంటాయి. వీటి కింద అందిన మొత్తాలను తిరిగి చెల్లించాల్సిన బాధ్యత, ఇచ్చిన మొత్తాలను తిరిగి తీసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంటాయి. పెద్ద పద్దులు 8001 నుంచి 8554 వరకు ప్రజా పద్దు కింద పరిగణించడం జరుగుతుంది. ప్రజా పద్దు కింద '**జమలు**', '**అనామతు**' ల కింద లావాదేవీలలో సర్దుబాటు పద్దులు మాత్రమే ఉంటాయి. అంటే, ఖజానాల మధ్య నగదు జమల వంటి లావాదేవీలు, నగదు పేటికలు, ఇంకా వివిధ సర్కిళ్ల మధ్య బదిలీలు ఉంటాయి.

ఈ నివేదికలో, 'ప్రభుత్వ చెల్లింపు బాధ్యతలు' అంటే పెద్ద పద్దులు 6003, 6004 ల కింద జరిగిన లావాదేవీలతో పాటు పెద్ద పద్దులు 8001 నుంచి 8554 వరకు ఉన్న 'చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధి వంటివి', 'రిజర్వు నిధులు', 'ధరావతులు, బయానాలు' వంటి వాటికి సంబంధించిన లావాదేవీలను కూడా పరిగణించడమైంది.

1.3.1 ప్రభుత్వ విధానంలో పద్దుల వర్గీకరణ వ్యవస్థ

ప్రభుత్వ విధానంలో పద్దుల వర్గీకరణ వ్యవస్థ ఈ కింద చూపిన విధంగా అటు క్రియాపరమైనదిగానూ, ఇటు ఆర్థికపరమైనదిగానూ ఉంటుంది. క్రియాపరమైన వర్గీకరణ ఖర్చుకు సంబంధించిన శాఖను, విధులను, పథకాన్ని, కార్యక్రమాన్ని, ప్రయోజనాన్ని గుర్తించేందుకు ఉపకరిస్తుంది. ఆర్థికపరమైన వర్గీకరణ చెల్లింపులను నిత్య వ్యావహారిక వ్యయంగా, మూలధన వ్యయంగా, ఋణాలుగా అమర్చేందుకు తోడ్పడుతుంది.

పట్టిక 1.2: పద్దుల వర్గీకరణ తీరు

	లావాదేవి లక్షణం	వర్గీకరణ
పెద్ద పద్దులు, చిన్న పద్దుల జాబితా రూపంలో కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ద్వారా కేంద్రానికి, రాష్ట్రాలకు ప్రామాణికమైనవి	క్రియ లేదా విధి - విద్య, ఆరోగ్యం మొదలైనవి, ప్రభుత్వ శాఖ	ప్రదానాలు లేదా గ్రాంట్ల కింద పెద్ద పద్దు (4 - అంకెలు)
	ఉపక్రియ లేదా ఉపవిధి	ఉప పెద్ద పద్దు (2 - అంకెలు)
	కార్యక్రమం	చిన్న పద్దు (3 - అంకెలు)
రాష్ట్రాలకు వెసులుబాటు ఉన్నవి	పథకం	ఉప పద్దు (2 - అంకెలు)
	ఉప పథకం	వివరణాత్మక పద్దు (3 - అంకెలు)
	ఆర్థికపరమైనస్వభావం/ కార్యకలాపం	ప్రయోజనపు పద్దు - జీతాలు, చిన్న పనులు మొదలైనవి (3 – అంకెలు)

క్రియాపరమైన లేదా విధిపరమైన వర్గీకరణ విధానంలో రాబడిని, ఖర్చులను ఆర్థికపరమైన వర్గాలుగా విభజించడం, ప్రభుత్వ లావాదేవీలను నిత్య వ్యావహారిక లేదా రెవెన్యూ, మూలధన లేదా క్యాపిటల్ (అంటే ప్రజాఋణం, ఋణాలు, అడ్వాన్సులతో సహా) విభాగాలుగా, ఇంకా పన్నుల నుంచి రాబడి, ఇతరమైన రాబడి, సహాయక ప్రదానాలు లేదా గ్రాంట్ల వంటి వర్గాలుగా, ఆదాయవ్యయాల మీద పన్ను, విత్తపరమైన సేవల వంటి ఉపవర్గాలుగా గుర్తించడం వంటివి ఉంటాయి. ఖర్చుల పరంగా కూడా లావాదేవీలను సాధారణ సేవలు, ఆర్థిక సేవలు, సామాజిక సేవలు, సహాయక ప్రదానాలు, చందాలు లేదా విరాళాలు వంటి వర్గాలుగా విభజించడం జరుగుతుంది. అనంతరం ఈ వర్గాలను పెద్ద పద్దులుగా విభజించడం జరుగుతుంది. సంచిత నిధి పరిధిలోని పెద్ద పద్దులు ప్రభుత్వ విధులను లేదా కర్తవ్య రంగాలను సూచిస్తాయి. ఉదాహరణకు 'విద్య'. పెద్దపద్దులకు సంబంధించిన కర్తవ్యరంగాలకు చెందిన లక్ష్యాన్ని అందుకునేందుకు చేపట్టిన 'కార్యక్రమాన్ని' పెద్ద పద్దుల కింద ఉండే చిన్నపద్దులు సూచిస్తాయి. ఒక కార్యక్రమంలో పలు పథకాలు లేదా కార్యకలాపాలు ఉండవచ్చు. వీటిని చిన్న పద్దు కింద ఉండే 'ఉపపద్దు' సూచిస్తుంది. ఉపపద్దు కింద ఉండే 'వివరణాత్మక పద్దు' ప్రతి ఒక్క అంశం మీద ఖర్చును అదుపు చేయడం కోసం ఉద్దేశించినది. అంటే ఒక

పథకం లేదా కార్యకలాపం మీద అయిన ఖర్చు స్వభావాన్ని లేదా ప్రయోజనాన్ని తెలియజేస్తుంది. ఉదాహరణకు 'జీతాలు', 'కార్యాలయపు ఖర్చులు', 'సహాయక గ్రాంట్లు' వగైరా.

1.4 బడ్జెటు ప్రక్రియ

ప్రతి ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వానికి సంబంధించి అంచనా వేసిన రాబడి, ఖర్చుల వివరాలను వార్షిక ఆర్థిక వివరణ ప్రకటన రూపంలో రాష్ట్ర శాసనసభ(ల) ముందు ప్రవేశపెట్టేట్లు గవర్నరు చూడాలని భారత రాజ్యాంగం (202 అధికరణ) నిబంధిస్తోంది. ఈ 'ఆర్థిక వార్షిక వివరాల ప్రకటన'యే బడ్జెటు పత్రాలలో ప్రధానం. ఇంతే కాకుండా బడ్జెటులో నిత్య వ్యావహారిక పద్దులకు సంబంధించిన ఖర్చులను ఇతర ఖర్చులను విడదీసి చూపాలి.

అధికరణ 203 ప్రకారం శాసనసభ ముందు ప్రదానాలు లేదా గ్రాంట్లు / వినియోగానుమతులు లేదా అప్రోప్రియేషన్ల కోసం డిమాండ్ల రూపంలో ఈ వివరాల ప్రకటనను సమర్పించడం జరుగుతుంది. ఇవి ఆమోదం పొందిన పిదప, అధికరణ 204 ప్రకారం సంచిత నిధి నుంచి అవసరమైన ధనాన్ని వినియోగించే నిమిత్తం శాసనసభ వినియోగానుమతుల (అప్రోప్రియేషను) బిల్లును ఆమోదిస్తుంది. బడ్జెటు తయారీ, బడ్జెటు అమలు, బడ్జెటు పర్యవేక్షణకు సంబంధించిన ప్రక్రియను బడ్జెటు కరదీపిక (బడ్జెట్ మాన్యువల్) విశదీకరిస్తుంది.

ప్రగతి పద్దు (పథకపు వ్యయం), నిర్వహణ పద్దు (సిబ్బంది / నిర్వహణ వ్యయం): ప్రజా పథకాలను, ప్రాజెక్టులను పర్యవేక్షించేందుకు వీలుగా ఉత్పాదకత - ఫలితాలు అనే చట్రంలోకి తీసుకుని రావడం కోసం, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా 2017-18 సంవత్సరం నుంచి ప్రణాళిక, ప్రణాళికేతర అనే వర్గీకరణను వదిలిపెట్టడం జరిగింది. తదనుగుణంగా రాష్ట్రంలో ప్రణాళిక, ప్రణాళికేతర బడ్జెట్ల స్థానంలో "ప్రగతిపద్దు (పథకపు వ్యయం)", "నిర్వహణ పద్దు (సిబ్బంది/నిర్వహణ వ్యయం)" వచ్చాయి.

ప్రత్యేక అభివృద్ధి నిధి: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి (ఆర్థిక వనరుల ప్రణాళిక, కేటాయింపు, వినియోగం) చట్టం, 2017 ఏర్పాటైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి, షెడ్యూల్డ్ తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి రూపంలో ఉప-బడ్జెట్లను తయారు చేస్తోంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రగతిపద్దు మొత్తం అంచనా వ్యయంలో భాగాన్ని రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల (15.45 శాతం) / షెడ్యూల్డ్ తెగల (9.08 శాతం) జనాభా దామాషా ప్రకారం ఈ నిధులకు కేటాయించడం జరుగుతుంది. ప్రభుత్వ శాఖల ప్రత్యేక అభివృద్ధి నిధులలో షెడ్యూల్డ్ కులాలు / షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులకు లేదా కుటుంబాలకు లేదా జనావాసాలకు లేదా ప్రాంతాలకు ప్రత్యక్షంగానూ, పరిమాణాత్మకంగానూ ప్రయోజనాలను కల్పించే పథకాలకు మాత్రమే స్థానం ఉండాలి.

ఫలితాల / పనితీరు బడ్జెటు: పనితీరు బడ్జెటు అనేది ఒక సమగ్రమైన కార్యనిర్వహణ పత్రం. భౌతికపరమైన, ఆర్థికపరమైన అంశాల కలబోతతో కార్యక్రమాల, ప్రాజెక్టుల, కార్యకలాపాల రూపంలో సంకల్పించి, ప్రతిపాదించి, అమలయ్యే పత్రమే పనితీరు బడ్జెట్. అభ్యర్థించిన నిధులకు సంబంధించిన లక్ష్యాలను, ప్రయోజనాలను, ఈ ప్రయోజనాలను సాధించేందుకు ప్రతిపాదించిన వివిధ కార్యక్రమాల, కార్యకలాపాల మూల్యాన్ని, చేసిన పనిని లేదా అందించిన సేవల పరిమాణాత్మక సమాచారాన్ని, లేదా ప్రతి కార్యక్రమం, ప్రతి కార్యకలాపం సాధించిన ఫలితాలను తెలియపర్చే ప్రయత్నమే ఈ పనితీరు బడ్జెటు. బడ్జెటును, బడ్జెటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఇతర కార్యక్రమాల అమలును, ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కేటాయించిన నిధుల వినియోగాన్ని ఆడిటులో పరీక్షించి ఫలితాలను ***అధ్యాయం III*** లో వివరించడమైంది.

1.5 సంక్షిప్తంగా ఆర్థిక స్థితిగతుల స్థితి

2021-22 సంవత్సరంలోని వాస్తవ విలువలతో పోలిస్తే 2022-23 సంవత్సరంలో బడ్జెటు అంచనాలు, సంబంధిత వాస్తవ ఆర్థిక ఫలితాల వివరాలు *పట్టిక 1.3* లో ఉన్నాయి. 2018-23 సంవత్సరాలకు ప్రభుత్వ ఆర్థిక స్థితిగతుల కాలక్రమానుగత సమాచారం ***అనుబంధం 1.2*** లో ఉంది.

పట్టిక 1.3: సంక్షిప్తంగా ఆర్థిక స్థితిగతుల స్థితి

క్రమ సంఖ్య	భాగాంశాలు	2021-22 వాస్తవ వివరాలు (₹ కోట్లలో)	2022-23 బడ్జెటు అంచనాలు (₹ కోట్లలో)	2022-23 వాస్తవ వివరాలు (₹ కోట్లలో)	బడ్జెట్ అంచనాలలో వాస్తవ వివరాల శాతం	రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో వాస్తవ వివరాల శాతం
1	పన్నుల నుంచి రాబడి					
	(i) సొంత పన్నుల నుంచి రాబడి	91,271	1,08,212	1,06,949	98.83	8.14
	(ii) కేంద్ర పన్నులు/సుంకాలలో వాటా (ఎ)	18,721	18,393	19,668	106.93	1.50
2	పన్నులు కాని ఇతర రాబడి	8,858	25,422	19,554	76.92	1.49
3	సహాయక గ్రాంట్లు, విరాళాలు	8,619	41,002	13,179	32.14	1.00
4	**రెవెన్యూ రాబడి (1+2+3)**	**1,27,469**	**1,93,029**	**1,59,350**	**82.56**	**12.13**
5	ఇచ్చిన ఋణాలు, బయానాల తిరిగి వసూలు	48	60	629	1,048.33	--
6	ఇతర రాబడి	--	--	--	--	--
7	తీసుకున్న ఋణాలు, ఇతర చెల్లింపు బాధ్యతలు (బి)	46,638[11]	52,167	32,556	62.41	2.48
8	**మూలధనం కింద (క్యాపిటల్) రాబడి (5+6+7)**	**46,686**	**52,227**	**33,185**	**63.54**	**2.53**
9	**మొత్తం రాబడి (4+8)**	**1,74,155**	**2,45,256**	**1,92,535**	**78.50**	**14.66**
10	**నిత్య వ్యావహారిక (రెవెన్యూ) వ్యయం**	**1,36,804**	**1,89,275**	**1,53,406**	**81.05**	**11.68**
11	వ్యావహారిక వ్యయంలో వడ్డీ చెల్లింపులు	19,161	18,912	21,821	115.38	1.66
12	**మూలధన (క్యాపిటల్) వ్యయం**	**28,874**	**29,728**	**17,881**	**60.15**	**1.36**
13	**ఇచ్చిన ఋణాలు, బయానాలు**	**8,469**	**26,253**	**21,248**	**80.94**	**1.62**
14	**రాష్ట్రాల మధ్య సర్దుబాట్లు**	**8**	**0**	**0**	**--**	**--**
15	**మొత్తం ఖర్చు (10+12+13+14)**	**1,74,155**	**2,45,256**	**1,92,535**	**78.50**	**14.66**
16	**రెవెన్యూ మిగులు (+)/లోటు (-) (4-10)**	**(-)9,335**	**3,754**	**5,944**	**158.33**	**(-)0.45**
17	**ద్రవ్య లోటు {(4+5+6)-15}**	**(-)46,638**	**(-)52,167**	**(-)32,556**	**62.41**	**2.48**
18	**ప్రాథమిక లోటు (17-11)**	**(-)27,477**	**(-)33,255**	**(-)10,735**	**32.28**	**0.82**

మూలం: ఆర్థిక పద్దులు

(ఎ) కేంద్ర పన్నుల్లోని రాష్ట్ర వాటా ఇందులో కలిసి ఉంది

(బి) తీసుకున్న ఋణాలు, ఇతర చెల్లింపు బాధ్యతలు: ప్రజా ఋణం నికరం (వసూళ్లు - చెల్లింపులు) + ఆకస్మిక ఖర్చుల నిధి నికరం + ప్రజా పద్దు నికరం (వసూళ్లు - చెల్లింపులు) + ప్రారంభ, ముగింపు నగదు నిల్వల నికరం

[11] ఈ మొత్తంలో వస్తు సేవల పన్ను పరిహారంలో తగ్గుదలకు బదులుగా భారత ప్రభుత్వం నుండి అందిన ₹4,569 కోట్ల బ్యాక్-టు-బ్యాక్ ఋణాలు కూడా కలిసి ఉన్నాయి

- పై వివరాలను బట్టి చూస్తే సొంత పన్నుల నుంచి రాబడి విషయంలో, కేంద్రం పన్నులు, సుంకాలలో వాటా విషయంలో వాస్తవంగా అందిన రాబడి, బడ్జెటు అంచనాలతో ఇంచుమించుగా సమానంగా ఉన్నాయని గమనించవచ్చు. అంచనాలు వాస్తవికంగా ఉన్నాయని ఇది సూచిస్తోంది.

- పన్నులు కాని ఇతర రాబడి విషయంలో బడ్జెటు అంచనాలు గణనీయంగా ఎక్కువగా ఉన్నాయి. పన్నులు కాని ఇతర రాబడి కింద వాస్తవంగా వసూలైన మొత్తం గత సంవత్సరం కన్నా ఎక్కువగానే ఉన్నా బడ్జెటు అంచనాలతో పోలిస్తే మాత్రం ఇంకా తక్కువగానే ఉన్నాయి.

- సహాయక గ్రాంట్ల విషయంలో గత సంవత్సరం వాస్తవంగా అందిన మొత్తాల కన్నా ఈ సంవత్సరం అంచనాలు నాలుగు రెట్లు కన్నా ఎక్కువగా ఉన్నాయి (మరిన్ని వివరాల కోసం *పేరా 3.2.2.2* ని చూడవచ్చు). గత సంవత్సరంతో పోలిస్తే భారత ప్రభుత్వం నుంచి అందిన సహాయక ప్రదానాలు 53 శాతం ఎక్కువగా ఉన్నా, భారీగా అంచనా వేయడం వల్ల బడ్జెటు అంచనాలలో పోలిస్తే కేవలం 32 శాతం మాత్రమే ఉన్నాయి.

- బడ్జెటు అంచనాలతో పోలిస్తే తీసుకున్న ఋణాలు, ఇతర చెల్లింపు బాధ్యతలు ₹19,611 కోట్లు తక్కువగా ఉన్నాయి.

బడ్జెటు అంచనాలలో 79 శాతం మొత్తాన్ని మాత్రమే రాష్ట్రం సమీకరించుకోగలిగింది. పర్యవసానంగా, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చును తగ్గించుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా, మూలధన (అంటే క్యాపిటల్) వ్యయం బడ్జెటు అంచనాలతో పోలిస్తే 40 శాతం మేర తగ్గింది. నిత్య వ్యావహారిక (అంటే రెవెన్యూ) వ్యయం, ఇచ్చిన ఋణాలు, బయానాల ఖర్చులు కూడా చెరో 19 శాతం చొప్పున తగ్గాయి.

బడ్జెటు అంచనాలతో పోలిస్తే రెవెన్యూ రాబడి ₹33,679 కోట్లు తగ్గగా, రెవెన్యూ ఖర్చులు ₹35,869 కోట్లు తగ్గాయి. ఫలితంగా బడ్జెటు అంచనాలో ఉజ్జాయింపు వేసిన రెవెన్యూ మిగులు కన్నా ఎక్కువే సాధ్యమైంది. అయితే, రెవెన్యూ మిగులు ఎక్కువగా సాధ్యమైనా, మూలధన వ్యయం మాత్రం బాగా తగ్గిపోయింది. ఋణాలను తక్కువగా తీసుకోవడం, ఇచ్చిన ఋణాలు, బయానాల కేటాయింపు ఎక్కువ కావడం ఇందుకు కారణం. గత సంవత్సరంతో పోల్చినా, బడ్జెటు అంచనాలతో పోల్చినా ద్రవ్యలోటు కూడా తక్కువగానే ఉంది.

1.6 సంక్షిప్తంగా ప్రభుత్వ ఆస్తులు, చెల్లింపు బాధ్యతల స్థితి

ప్రభుత్వ ఆర్థికపరమైన చెల్లింపు బాధ్యతలను, పెట్టిన ఖర్చు ద్వారా ఏర్పడిన ఆస్తులను ప్రభుత్వ పద్దులలో పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. ప్రభుత్వం చెల్లింపు బాధ్యతల్లో ముఖ్యమైనవి అంతర్గత ఋణాలు, భారత ప్రభుత్వం నుంచి అందిన ఋణాలు - అడ్వాన్సులు, ప్రజాపద్దులోకి వచ్చిన మొత్తాలు, రిజర్వు నిధులు. ఆస్తులలో క్యాపిటల్ పరివ్యయం, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు - అడ్వాన్సులు, నగదు నిల్వలు ఉంటాయి. ఆస్తులు, చెల్లింపు బాధ్యతల స్థితిని సంక్షిప్తంగా కింద *పట్టిక 1.4* లో చూపటం జరిగింది.

పట్టిక 1.4: సంక్షిప్తంగా ఆస్తులు, చెల్లింపు బాధ్యతల స్థితి

చెల్లింపు బాధ్యతలు					ఆస్తులు				
		2021-22 (₹ కోట్లలో)	2022-23 (₹ కోట్లలో)	పెరుగుదల (+) / తగ్గుదల (-) శాతం			2021-22 (₹ కోట్లలో)	2022-23 (₹ కోట్లలో)	పెరుగుదల (+) / తగ్గుదల (-) శాతం
సంచిత నిధి									
ఎ	అంతర్గత ఋణం	2,63,041	2,93,129	11.44	ఎ	స్థూల మూలధన వ్యయం	1,63,531	1,81,412	10.93
బి	భారత ప్రభుత్వం నుంచి ఋణాలు, అడ్వాన్సులు	14,448*	16,434*	13.74	బి	రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులు	52,379	72,998	39.37
ఆకస్మిక ఖర్చుల నిధి		50	50	0			0.05	0.00	--
ప్రజాపద్దు									
ఎ	చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధులు వగైరా	12,912	14,962	15.88	ఎ	అడ్వాన్సులు	(-)23	(-)23	0
బి	డిపాజిట్లు	27,424	28,373	3.46	బి	జమలు	...	...	...
సి	రిజర్వు నిధులు	11,762	12,188	3.62	సి	అనామతు, నానావిధం	...	...	...
డి	జమలు	723	257	(-)64.45	నగదు నిల్వ (ప్రత్యేకించిన నిధిలో పెట్టుబడితో సహా)		8,095	10,919	34.89
ఈ	అనామతు, నానావిధ నిల్వలు	1,018	1,365	34.09	మొత్తం		2,23,982	2,65,305	18.45
					రెవెన్యూ పద్దులో లోటు		1,07,396	1,01,452	(-)5.54
	పూర్తి మొత్తం	3,31,378	3,66,758	10.68	పూర్తి మొత్తం		3,31,378	3,66,758	10.68

మూలం: ఆర్థిక పద్దులు

* ఈ మొత్తంలో వస్తు సేవల పన్ను పరిహారంలో తగ్గుదలకు బదులుగా భారత ప్రభుత్వం నుండి అందిన ₹6,949 కోట్ల బ్యాక్-టు-బ్యాక్ ఋణాలు కూడా కలిసి ఉన్నాయి. వీటిని రాష్ట్ర ప్రభుత్వ వనరుల నుంచి తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు

రెవెన్యూ పద్దు లోటులో ₹5,944 కోట్ల (6 శాతం) తగ్గుదల ఉంది. ప్రభుత్వ ఆస్తులు, అప్పుల కన్నా 27శాతం తక్కువగా ఉన్నాయి.

1.7 ద్రవ్య సమతుల్యత: లోటు, అప్పుల మొత్తం విషయంలో లక్ష్యాలను అందుకోవడం

రెవెన్యూ రూపేణా ప్రభుత్వానికి అందిన రాబడి కన్నా ఖర్చు ఎక్కువ అయితే లోటు ఏర్పడుతుంది. ప్రభుత్వ లోటులను మదింపు వేసేందుకు వివిధ కొలమానాలు ఉన్నాయి.

ఋణాలను తీసుకోవడం ద్వారా లోట్లును భర్తీ చేయడం వల్ల ప్రభుత్వానికి అప్పులు ఏర్పడుతాయి. లోట్లకు సంబంధించిన సిద్ధాంత భావనలకు, అప్పులకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. లోట్ల కారణంగా అప్పుల మొత్తం పెరుగుతుందని భావించవచ్చు. ప్రభుత్వం ఏటేటా ఋణాలు స్వీకరిస్తూ ఉంటే, అప్పులు పేరుకుపోయి, ప్రభుత్వం వడ్డీల రూపంలో మరింత ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది. ఈ వడ్డీ చెల్లింపులు కూడా అప్పులకు దోహదపడతాయి.

ఋణాలను స్వీకరించడం వల్ల ప్రభుత్వ భవిష్యత్తు తరాల సంగ్రహింపు తగ్గించి వాటిపై భారం మోపుతుంది. ప్రస్తుతం ప్రజలకు బాండ్లను జారీ చేయడం ద్వారా ఋణాలను స్వీకరిస్తుంది కనుక, బాండ్లకు సంబంధించిన చెల్లింపులను తరువాతి కాలంలో పన్నులను పెంచడం ద్వారా కానీ, ఖర్చులను తగ్గించడం ద్వారా కానీ చేస్తుంది కనుక భవిష్యత్తు మీద భారం పడుతుంది. పైగా ప్రజల వద్ద నుంచి ప్రభుత్వం ఋణాలను స్వీకరించడం వల్ల ప్రజలు ప్రైవేటు రంగంలో మదుపు చేసే సొమ్ము తగ్గిపోతుంది. ఆ మేరకు, మూలధనం నెలకొల్పే సామర్థ్యము, వృద్ధి తగ్గి, అప్పులు భవిష్యత్తు తరాల మీద 'భారం' గా మారుతాయి.

అయితే, ఉత్పత్తిని పెంచే లక్ష్యంలో ప్రభుత్వ లోట్లు సఫలీకృతం అయితే, ఆదాయం మరింత పెరుగుతుంది. తద్వారా మరింత మిగులు ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితిలో, అటు ప్రభుత్వం, ఇటు పరిశ్రమలు మరింతగా ఋణం తీసుకోవచ్చు. పైగా, ప్రభుత్వం మౌలిక సదుపాయాల మీద పెట్టుబడి పెడితే, భవిష్యత్తు తరాలు మరింత మెరుగ్గా ఉంటాయి. అయితే తీసుకున్న ఋణాల మీద వడ్డీ కన్నా పెట్టిన పెట్టుబడుల మీద దక్కే ప్రతిఫలం ఎక్కువగా ఉంటేనే ఇది సాధ్యమౌతుంది. ఉత్పత్తి పెరుగుదల ద్వారా తీసుకున్న ఋణాన్ని చెల్లించవచ్చు. అటువంటి పరిస్థితిలో అప్పును భారంగా పరిగణించక్కర్లేదు. అప్పులలో వృద్ధిని రాష్ట్ర ఆర్థిక వృద్ధి (రాష్ట్ర స్థూల గృహోత్పత్తి) తో పోల్చి నిర్ణయం చేయాలి.

రెవెన్యూలోటును క్రమక్రమంగా రూపుమాపడం, ద్రవ్య లోటును తగ్గించడం, అంగీకారయోగ్యమైన స్థాయికి అప్పులను తగ్గించడం, మెరుగైన ఋణ నిర్వహణను నెలకొల్పడం, మధ్యకాలిక విధాన చట్రంలో పారదర్శకతను మెరుగుపర్చడం వంటి లక్ష్యాలలో కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్రప్రభుత్వాలు ద్రవ్య బాధ్యత, బడ్జెటు నిర్వహణ చట్టాలను ఆమోదించాయి. ఈ నేపథ్యంలో, ఈ చట్టం రాష్ట్రం పాటించాల్సిన లోట్ల కొలమానాల, అప్పుల స్థాయుల విషయంలో పరిమాణాత్మక లక్ష్యాలను నిర్దేశించింది.

రెవెన్యూలోటును క్రమక్రమంగా రూపుమాపడం, ద్రవ్య లోటును తగ్గించడం, వివేకవంతమైనరీతిలో అప్పులను నిర్వహించడం వంటి చర్యల ద్వారా ద్రవ్య సుస్థిరత, ద్రవ్య నిర్వహణలో వివేచనను ధ్రువీకరించుకోవడం కొరకు రాష్ట్ర ప్రభుత్వం (మునుపటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం) ఆంధ్రప్రదేశ్ ద్రవ్య బాధ్యత, బడ్జెటు నిర్వహణ చట్టం - 2005 (ఎ.పి.ఎఫ్.ఆర్.బి.ఎం.) చేసింది. ఈ చట్టాన్ని 2016 లో తెలంగాణ ప్రభుత్వం అనువర్తింప చేసుకుంది (టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టం). తదనంతరం, 2020, 2022 సంవత్సారాలలో సవరణలు చేయడం జరిగింది. ద్రవ్య నిర్వహణ లక్ష్యాలను సాధించడం కోసం ఈచట్టం ద్రవ్యపరమైన లక్ష్యాలను నిర్దేశిస్తుంది.

1.7.1 కీలక ద్రవ్య కొలమానాల విషయంలో తెలంగాణ రాష్ట్ర ఎఫ్.ఆర్.బి.ఎం. లక్ష్యాలు - వాటి సాధన

టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టం ప్రకారం 2018-19 నుంచి 2022-23 మధ్య ఐదు సంవత్సరాల కాలంలో కీలకమైన ద్రవ్య కొలమానాలకు సంబంధించిన లక్ష్యాలు, వాటి సాధనను *పట్టిక 1.5* లో చూపటం జరిగింది.

పట్టిక 1.5: ద్రవ్య బాధ్యతలు, బడ్జెటు నిర్వహణ చట్టం నిబంధనల పాటింపు

ద్రవ్య కొలమానాలు	చట్టంలో నిర్దేశించిన ద్రవ్యపరమైన లక్ష్యాలు	లక్ష్యసాధన				
		2018-19	2019-20	2020-21	2021-22	2022-23
రెవెన్యూ లోటు (-) / మిగులు (+) (₹ కోట్లలో)	ప్రతి సంవత్సరం రెవెన్యూ మిగులు సాధించాలి	4,337	(-)6,254	(-)22,298	(-)9,335	5,944
		✓	✗	✗	✗	✓
ద్రవ్య లోటు (-)/మిగులు (+) (రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో శాతంగా)	2018-19: 3.25 శాతం; 2019-20: 3.25 శాతం + ₹1,435 కోట్లు*; 2020-21: 4.75 శాతం# 2021-22: 4 శాతం 2022-23: 5 శాతం@	(-)3.14 శాతం	(-)3.19 శాతం + ₹1,435 కోట్లు	(-)5.20 శాతం	(-)4.13 శాతం	(-)2.48 శాతం
		✓	✓	✗	✗	✓
రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోల్చితే తీర్చాల్సి ఉన్న మొత్తం ద్రవ్య బాధ్యతల నిష్పత్తి (శాతం)	25 శాతం	22.97	24.44	29.24[12]	27.87[13]	26.61[14]
		✓	✓	✗	✗	✗

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు, రాష్ట్ర స్థూల గృహోత్పత్తికి సంబంధించి గణాంకాలు-కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ, ద్రవ్య విధాన ప్రకటన

* *2019-20 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రం అర్హతకి మించి అదనంగా ఋణాలను తీసుకునేందుకు ఒకసారి ప్రత్యేక మినహాయింపును అనుమతిస్తూ భారత ప్రభుత్వం చేసిన (2020 ఫిబ్రవరి) నిర్ణయానికి అనుగుణంగా 2020 జనవరి 1 నుంచి అమలులోకి వచ్చిన టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం (సవరణ) చట్టం, 2020 (2020 సెప్టెంబరు 19) ప్రకారం రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో 3.25 శాతానికి మించి ₹1,435 కోట్ల మేర అదనపు ద్రవ్యలోటును అనుమతించడం జరిగింది.*

\# *2020 మే 17 నాటి భారత ప్రభుత్వ లేఖ ప్రకారం, రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో 3 శాతంగా ఉన్న సాధారణ ఋణ పరిమితికి అదనంగా, తెలంగాణ రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో 1.75 శాతం వరకు అదనపు ఋణ పరిమితిని ఉపయోగించుకోగలిగింది (బేషరతుగా: 0.50 శాతం; నాలుగు సంస్కరణలలో మూడింటిని నెరవేర్చడం ద్వారా: 0.50 శాతం; వన్ నేషన్ వన్ రేషన్ కార్డు సిస్టమ్ అమలు కారణంగా: 0.25 శాతం; సులభతర వ్యాపార సంస్కరణల (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ద్వారా : 0.25 శాతం; పట్టణ స్థానిక సంస్థల/ప్రజోపయోగ సేవల సంస్కరణల ద్వారా: 0.25 శాతం)*

@ *XV ఆర్థిక సంఘం అనుమతించిన అదనపు ఋణ పరిమితి దృష్ట్యా, రాష్ట్రం టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టానికి సవరణ చేసి (2022 మార్చి) 2022-23 సంవత్సరానికి సంబంధించి ద్రవ్య లోటు పరిమితి లక్ష్యాన్ని రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో ఐదు శాతానికి పెంచింది.*

ఆర్థిక పద్దుల ప్రకారం, మూడు సంవత్సరాల తరువాత రాష్ట్రం రెవెన్యూ మిగులును సాధించగలిగింది. రెండు సంవత్సరాల తరువాత ద్రవ్య లోటును పరిమితి లోపలే, అంటే సవరించిన పరిమితి లక్ష్యం ఐదు శాతం లోపునే ఉంచగలిగింది. అయితే, ఇంకా చెల్లించాల్సి ఉన్న చెల్లింపు బాధ్యతల విషయంలో లక్ష్యాన్ని సాధించడంలో వరుసగా మూడో సంవత్సరం విఫలమైంది.

సాధించిన లేదా సాధించలేకపోయిన పై లక్ష్యాలను కూడా ఈ నివేదికలో పలు చోట్ల పేర్కొన్న ఆడిటు పరిశీలనల నేపథ్యంలో గ్రహించాల్సి ఉంటుంది. వాటి సంగ్రహాన్ని ఈ అధ్యాయం చివరిలో చర్చించడం జరిగింది **(పేరా *1.8*)**.

[12] ఇందులో వస్తు సేవల పన్ను పరిహారంలో తగ్గుదలకు బదులుగా భారత ప్రభుత్వం నుంచి అందిన ₹2,380 కోట్ల బ్యాక్-టు-బ్యాక్ ఋణాలను మినహాయించడం జరిగింది

[13] ఇందులో వస్తు సేవల పన్ను పరిహారంలో తగ్గుదలకు బదులుగా భారత ప్రభుత్వం నుంచి అందిన ₹6,949 కోట్ల బ్యాక్-టు-బ్యాక్ ఋణాలను మినహాయించడం జరిగింది

[14] ఇందులో వస్తు సేవల పన్ను పరిహారంలో తగ్గుదలకు బదులుగా భారత ప్రభుత్వం నుంచి అందిన ₹6,949 కోట్ల బ్యాక్-టు-బ్యాక్ ఋణాలను మినహాయించడం జరిగింది

1.7.2 మధ్యకాలిక ద్రవ్య విధాన ప్రకటనలో పేర్కొన్న అంచనాల సాధన

టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టం ప్రకారం, సంబంధిత అంతర్లీనమైన యోచనలను వివరిస్తూ, మధ్యకాలిక ద్రవ్య విధాన (మీడియం టెర్మ్ ఫిస్కల్ పాలసీ స్టేట్మెంట్ - ఎం.టి.ఎఫ్.పి.) ప్రకటనలో ద్రవ్య నిర్వహణ లక్ష్యాలతో పాటు, నిర్దేశిత ద్రవ్యసూచికలకు మూడు సంవత్సరాలకు సంబంధించి ఏటావారీ లక్ష్యాలను నిర్దేశించాలి.

బడ్జెట్ పత్రాలతో పాటు శాసనసభ ముందు ప్రవేశపెట్టే ద్రవ్య విధాన ప్రకటన (2023 మార్చి) లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మధ్యకాలిక ద్రవ్య విధాన ప్రకటనను పొందుపర్చింది. అందులో మూడు సంవత్సరాలకు సంబంధించిన ఏటావారీ వరుస లక్ష్యాలను కూడా ప్రస్తావించడం జరిగింది. ఈ ఏటావారీ లక్ష్యాల సాధన గురించి పైన *పట్టిక 1.5* లో చర్చించడం జరిగింది.

మధ్యకాలిక ఆర్థిక విధాన ప్రకటనలో ఆర్థిక సూచికలకు ఆధారంగా ఉన్న వివిధ యోచనలతో పాటు, (i) రెవెన్యూ రాబడి, రెవెన్యూ ఖర్చు (వ్యావహారిక వ్యయం) మధ్య వ్యత్యాసం, (ii) తీసుకున్న ఋణాలతో సహా క్యాపిటల్ రాబడిని ఉత్పాదక ఆస్తుల ఏర్పాటు కొరకు వినియోగించడం, (iii) రానున్న పదేళ్ల కోసం వాస్తవికంగా అంచనా వేసిన ఏటావారీ పింఛను చెల్లింపు బాధ్యతలతో కూడిన సుస్థిరమైన మనుగడకు సంబంధించిన మదింపు కూడా ఉండాలి.

అయితే, రెవెన్యూ రాబడి, రెవెన్యూ ఖర్చుల మధ్య వ్యత్యాసం, క్యాపిటల్ రాబడిని ఉత్పాదక ఆస్తుల ఏర్పాటు కొరకు వినియోగించడం, ఏటావారీ పింఛను చెల్లింపు బాధ్యతల వివరాలను మధ్యకాలిక ద్రవ్య విధాన ప్రకటనలో పొందపర్చలేదు.

1.7.3 మిగులు / లోట్ల సరళి

మిగులు / లోట్ల కొలమానాల సంఖ్యాపరమైన సరళిని *పటం 1.6* లో, రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోల్చిన సరళిని *పటం 1.7* లో ప్రదర్శించడం జరిగింది.

పటం 1.6: మిగులు / లోటు కొలమానాల సరళి



మూలం: గత ఐదు సంవత్సరాల ఆర్థిక పద్దులు

వరుసగా మూడు సంవత్సరాల పాటు రెవెన్యూ లోటు తర్వాత, 2022-23 లో రాష్ట్రం రెవెన్యూ మిగులును సాధించగలిగింది. గత ఐదు సంవత్సరాల కాలంలో 2020-21 లో అత్యంత న్యూన స్థితిలో ఉన్న ద్రవ్యలోటు, ప్రాథమిక లోటు వరుసగా రెండో సంవత్సరం మెరుగుదల కనబరిచాయి. రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే కూడా సరళి దాదాపుగా ఇదే విధంగా ఉందని ఈ కింది *పటం 1.7* ను బట్టి అవగతం అవుతుంది.

పటం 1.7: రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే మిగులు / లోట్ల కొలమానాలు



మూలం: ఆర్థిక పద్దులు

2018-19 నుంచి 2022-23 వరకు ఐదు సంవత్సరాల కాలంలో తీర్చాల్సి ఉన్న ద్రవ్యబాధ్యతల సరళిని *పటం 1.8* లో చూపడం జరిగింది.

పటం 1.8: తీర్చాల్సి ఉన్న ద్రవ్యబాధ్యతల సరళి



మూలం: ఆర్థిక పద్దులు

గమనిక: 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాలలో భారత ప్రభుత్వం నుంచి అందిన ఋణాలు – అడ్వాన్సులు, ఇంకా చెల్లించాల్సి ఉన్న మొత్తం బాధ్యతలలో వస్తు సేవల పన్ను పరిహారంలో తగ్గుదలకు బదులుగా అందిన బ్యాక్-టు-బ్యాక్ ఋణాలను కలుపలేదు

2018-19 నుంచి 2022-23 మధ్యకాలంలో ఇంకా తీర్చాల్సి ఉన్న మొత్తం బాధ్యతలు 77 శాతం పెరిగాయి. అంతర్గత ఋణం (87 శాతం), ప్రజాపద్దు కింద చెల్లింపు బాధ్యతలు (48 శాతం) పెరగడం ఇందుకు ప్రధాన కారణం. భారత ప్రభుత్వం నుంచి అందిన ఋణాలు-అడ్వాన్సులు ఇదే సమయంలో 15 శాతం మేర పెరిగాయి.

1.8 ఆడిట్‌లో పరీక్షించిన పిదప లోట్లు, మొత్తం అప్పులు

ద్రవ్య బాధ్యత, బడ్జెటు నిర్వహణ చట్టం ప్రకారం, లోట్లు, అప్పులు పరిమితులు, పూచీకత్తులకు సంబంధించిన పరిమితులు వంటి ద్రవ్య సూచికల విషయమై నిర్ణయించిన లక్ష్యాలను సాధించేట్లు రాష్ట్ర ప్రభుత్వం ధృవీకరించుకోవాలి. వ్యావహారిక వ్యయాన్ని మూలధన వ్యయంగా, మూలధన వ్యయాన్ని వ్యావహారిక వ్యయంగా వర్గీకరించడం, బడ్జెటుకు ఆవల ద్రవ్యపరమైన లావాదేవీలు, చెల్లింపు బాధ్యతలను వాయిదా వేయడం, జాతీయ పింఛను వ్యవస్థకు తప్పనిసరిగా జమ చేయాల్సిన మొత్తాలను జమ చేయకపోవడం వంటి వాటి వల్ల రాష్ట్ర విషయంలో లెక్కించిన రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు ప్రభావితం అవుతాయి. ఇటువంటి అంశాలను భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ గత సంవత్సరాలకు[15] సంబంధించిన రాష్ట్ర ఆర్థిక స్థితి గతులపై ఆడిట్ నివేదికలలో వెలువరించడం జరిగింది. వాస్తవికంగా ఉన్న లోటును నిర్ధారించడం కొరకు అటువంటి వాటి ప్రభావాన్ని *పట్టిక 1.6* లో చూపించిన విధంగా తిరిగి లెక్కించడం జరిగింది.

పట్టిక 1.6: ఆడిట్‌లో పరీక్షించిన పిదప రెవెన్యూ, ద్రవ్యలోట్లు

వివరాలు	రెవెన్యూ మిగులు మీద ప్రభావం (తగ్గించి చూపినవి (+) /పెంచి చూపినవి (-)) (₹ కోట్లలో)	ద్రవ్య లోటు మీద ప్రభావం (తగ్గించి చూపినవి) (₹ కోట్లలో)	పేరా
ఋణాలుగా ఇచ్చి డిపాజిటు పద్దులలో ఉంచిన మొత్తాలను రెవెన్యూ పద్దుకు బదలాయించడం[16]	(-)1,400	--	పేరా 2.4.1.1 (ii) లోని పేటిక 2.1
నిర్ధారిత వాటా పింఛను నిధి డిపాజిటు పద్దుకు చెల్లించడంలో కొరత	(-)114	114	*2.5.2.3*
సంచిత ఋణ విమోచన నిధికి జమ చేయకపోవడం	(-)1,536	1,536	*2.6.2.1*
పూచీకత్తుల విముక్తి నిధికి పూచీకత్తుల కమిషన్‌ను బదలాయించకపోవడం	(-)17	17	*2.6.2.3*
పూచీకత్తుల విముక్తి నిధికి జమ చేయకపోవడం	(-)951	951	*2.6.2.3*
వడ్డీ బాధ్యతలను నెరవేర్చకపోవడం[17]	(-)131	131	*4.2*
తప్పు వర్గీకరణలు			
(i) రెవెన్యూ వ్యయాన్ని క్యాపిటల్‌గా వర్గీకరించడం[18]	(-)140	--	*3.4.9.1*
(ii) మూలధన వ్యయాన్ని వ్యావహారిక వ్యయంగా వర్గీకరించడం[19]	25	--	*3.4.9.2*
మొత్తం	(-)4,264	2,749	

మూలం: ఆర్థిక పద్దులు, ఆడిటు విశ్లేషణ

---

[15] గత సంవత్సరాలకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిటు నివేదిక(ల)ను https://cag.gov.in/ag/telangana లో చూడవచ్చు

[16] (i) తెలంగాణ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థ డిపాజిటు ఖాతా నుంచి రాబడి పద్దుకు బదలాయించిన మొత్తం ₹1,100 కోట్లు, (ii) తెలంగాణ గిరిజన సహకార ఆర్థిక సంస్థ డిపాజిటు ఖాతా నుంచి రాబడి పద్దుకు బదలాయించిన మొత్తం ₹300 కోట్లు

[17] (i) రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి మీద ఓవర్ డ్రాఫ్టుకు వర్తించే వడ్డీ రేట్ల (అంటే చేబదుళ్ల వడ్డీ రేటు మీద అదనంగా రెండు శాతం) ప్రకారం వడ్డీ: ₹53 కోట్లు; (ii) రాష్ట్ర పరిహార వనీకరణ నిధి మీద కేంద్ర పర్యావరణ, వన, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (జాతీయ ప్రాధికార సంస్థ) నిర్ణయించిన 3.35 శాతం చొప్పున వడ్డీ : ₹47 కోట్లు; (iii) రాష్ట్ర విపత్తు నివారణ నిధి మీద ఓవర్ డ్రాఫ్టుకు వర్తించే వడ్డీ రేట్ల (అంటే చేబదుళ్ల వడ్డీ రేటు మీద అదనంగా రెండు శాతం, అంటే 7.49 శాతం) ప్రకారం వడ్డీ: ₹9 కోట్లు; (iv) ప్రభుత్వ ఉద్యోగుల కొరకు నిర్దేశించిన వాటా పింఛను పథకం డిపాజిటు ఖాతా మీద వడ్డీ: ₹22 కోట్లు

[18] (i) చిన్న పనులను (ఇతర ఖర్చులు, నిర్వహణ, హెచ్.టి.సి.సి. చార్జీల వంటివాటిని) మూలధన వ్యయంగా పరిగణించడం: ₹90 కోట్లు, (ii) శస్త్ర చికిత్సలలో వినియోగం అయిపోయే వస్తువుల కొనుగోలును మూలధన వ్యయంగా పరిగణించడం: ₹50 కోట్లు

[19] (i) వాహనాల కొనుగోలు: ₹06 కోట్లు; (ii) యంత్రాలు, పరికరాల కొనుగోలు: ₹14 కోట్లు; (iii) పనిముట్లు, యంత్రాగారాలపై ఖర్చు: ₹05 కోట్లు

ఈ విధంగా, రెవెన్యూ మిగులును ₹4,264 కోట్ల మేర ఎక్కువగానూ, ద్రవ్యలోటును ₹2,749 కోట్ల మేర తగ్గించి చూపినట్లైంది.

దీని ప్రభావంగా, రెవెన్యూ మిగులు ₹1,680 కోట్ల (₹5,944 కోట్లు - ₹4,264 కోట్లు) మాత్రమే కాగా, ద్రవ్యలోటును ₹35,305 కోట్లుగా (₹32,556 కోట్లు + ₹2,749 కోట్లు) పరిగణించవచ్చు. అందుచేత, రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో ద్రవ్యలోటు 2.69 శాతంగా ఉంటుంది, ఇది ఇంకా అనుమతించదగిన పరిమితులకు లోబడే ఉంది.

తీర్చాల్సి ఉన్న చెల్లింపు బాధ్యతలు ₹3,49,537 కోట్లు[20] మాత్రమే కాకుండా, ₹1,18,629 కోట్ల మేర బడ్జెటుకు వెలుపలి ఋణాల (అంటే ఆఫ్-బడ్జెట్ బారోయింగ్స్) మీద వడ్డీ చెల్లింపు, అసలు మొత్తాన్ని తీర్చే బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వం మీద ఉంది (మరిన్ని వివరాలకు *పేరా 2.7.2* ను చూడవచ్చు). ఈ బడ్జెటుకు వెలుపలి ఋణాలను, రాష్ట్ర బడ్జెటు నుంచి చెల్లిస్తున్న ఇతర బాధ్యతలను పరిగణిస్తే రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో అప్పులు/మొత్తం చెల్లింపు బాధ్యతల నిష్పత్తి 35.64 *శాతం* అవుతుంది. అంటే తెలంగాణ రాష్ట్ర ద్రవ్య బాధ్యతలు, బడ్జెటు నిర్వహణ చట్టం నిర్దేశించిన లక్ష్యమైన 25 *శాతం* కన్నా ఇది 10.64 *శాతం* అధికం. ఇది XV ఆర్థిక సంఘం నిర్దేశ పథంలో సూచించిన 29.70 *శాతం* పరిమితి కన్నా కూడా 5.94 *శాతం* అధికం.

[20] వస్తు సేవల పన్ను పరిహారానికి బదులుగా జి.ఎస్.టి. పరిహార సెస్సు నుంచి చెల్లించే విధంగా భారత ప్రభుత్వం తీసుకుని రాష్ట్రాలకు అందించిన ₹6,949 కోట్ల బ్యాక్-టు-బ్యాక్ ఋణాలను మినహాయించి

అధ్యాయం II

రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు

అధ్యాయం II రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు

2.1 పరిచయం

ఈ అధ్యాయం తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర ఆర్థికపద్దుల ఆధారంగా ఆర్థిక స్థితిగతుల స్థూల దృక్కోణాన్ని అందజేయడంతో పాటు గత సంవత్సరాలతో పోలిస్తే కీలకమైన ద్రవ్యసూచికలలో వచ్చిన నిశితమైన మార్పులను, 2018-19 నుంచి 2022-23 మధ్య ఐదు సంవత్సరాల సమగ్రమైన సరళిని, అప్పులను తట్టుకునే విషయంలో రాష్ట్రానికి గల సామర్థ్యాన్ని, కీలకమైన ప్రజాపద్దుల లావాదేవీలను విశ్లేషిస్తుంది.

2.2 2021-22 తో పోలిస్తే కీలకమైన ద్రవ్యసూచికలలో వచ్చిన ముఖ్యమైన మార్పులు

అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 2022-23 సంవత్సరంలో రాష్ట్రానికి సంబంధించి కీలక ద్రవ్యసూచికలలో ముఖ్యమైన మార్పుల స్థూలస్వరూపాన్ని పట్టిక 2.1 లో చూపడమైంది.

పట్టిక 2.1: 2021-22 తో పోలిస్తే 2022-23 సంవత్సరంలో కీలక ద్రవ్య సూచికలలో మార్పులు

రెవెన్యూ రాబడి	రాష్ట్రం రెవెన్యూ రాబడి 25 *శాతం* పెరిగింది రాష్ట్రం సొంత పన్నుల నుంచి రాబడి 17 *శాతం* పెరిగింది పన్నులు కాని ఇతర సొంత రాబడి 121 *శాతం* పెరిగింది కేంద్ర పన్నులు, సుంకాలలో రాష్ట్రం వాటా 5 *శాతం* పెరిగింది భారత ప్రభుత్వం నుంచి సహాయక గ్రాంట్లు 53 *శాతం* పెరిగాయి
నిత్యవ్యావహారిక వ్యయం (లేదా రెవెన్యూ ఖర్చులు)	నిత్య వ్యావహారిక వ్యయం (లేదా రెవెన్యూ ఖర్చులు) 12 *శాతం* పెరిగింది సాధారణ సేవల మీద నిత్య వ్యావహారిక వ్యయం 13 *శాతం* పెరిగింది సామాజికసేవల మీద నిత్య వ్యావహారిక వ్యయం 8 *శాతం* పెరిగింది ఆర్థికసేవల మీద నిత్య వ్యావహారిక వ్యయం 17 *శాతం* పెరిగింది
క్యాపిటల్ రాబడి	తీసుకున్న అప్పుల ద్వారా క్యాపిటల్ రాబడి 25 *శాతం* తగ్గింది అప్పులు కాని ఇతర క్యాపిటల్ రాబడి 1210 *శాతం* పెరిగింది
మూలధన (లేదా క్యాపిటల్) వ్యయం	మూలధన వ్యయం 38 *శాతం* తగ్గింది సాధారణ సేవల మీద మూలధన వ్యయం 26 *శాతం* పెరిగింది సామాజికసేవల మీద మూలధన వ్యయం 57 *శాతం* తగ్గింది ఆర్థికసేవల మీద మూలధన వ్యయం 35 *శాతం* తగ్గింది
ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులు	ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులు 150 *శాతం* పెరిగాయి ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సుల తిరిగి వసూలు 1210 *శాతం* పెరిగింది
ప్రజాఋణం	తీసుకున్న ప్రజాఋణం 7 *శాతం* పెరిగింది తిరిగి తీర్చిన ప్రజాఋణం 25 *శాతం* పెరిగింది
ప్రజా పద్దు	ప్రజాపద్దులోకి రాక 11 *శాతం* పెరిగింది ప్రజాపద్దులో నుంచి చెల్లింపులు 10 *శాతం* పెరిగాయి
నగదు నిల్వ	అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 2022-23 లో నగదు నిల్వ ₹2,824 కోట్లు (35 *శాతం*) పెరిగింది

మూలం: ఆర్థిక పద్దులు

- రెవెన్యు రాబడి గణనీయంగా పెరిగింది. రెవన్యూ రాబడిలోని అన్ని అంశాలలో పెరుగుదల కనిపించింది.
- రెవెన్యూ ఖర్చులు అంటే నిత్య వ్యావహారిక వ్యయం కూడా పెరిగింది. అయితే రెవెన్యూ ఖర్చుల కన్నా రెవెన్యూ రాబడి మెరుగైన రేటుతో పెరిగింది. ఆ విధంగా రాష్ట్రం ఈ సంవత్సరం రెవెన్యూ మిగులును నమోదు చేసింది.
- మూలధన వ్యయం గణనీయంగా తగ్గిపోయింది. ముఖ్యంగా సామాజిక, ఆర్థిక రంగసేవలలో ఈ తగ్గుదల ఉంది.

- ప్రజాఋణం లేదా తీసుకున్న ఋణాలు స్వల్పంగా పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులు చెప్పుకోదగిన స్థాయిలో పెరిగాయి.

ఈ అంశాలను మరింతగా రానున్న పేరాలలో చర్చించడం జరిగింది.

2.3 నిధులకు వనరులు, నిధుల వినియోగం

అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే, 2022-23 లో రాష్ట్ర నిధులకు వనరులు, నిధుల వినియోగానికి సంబంధించిన వివిధ భాగాంశాలను *పట్టిక 2.2* లో చూపడమైంది.

పట్టిక 2.2: 2021-22, 2022-23 సంవత్సరాలలో నిధులకు వనరులు, నిధుల వినియోగం

(₹ కోట్లలో)

	వివరాలు	2021-22	2022-23	పెరుగుదల (+) / తగ్గుదల (-)
వనరులు	భారతీయ రిజర్వు బ్యాంకు వద్ద ప్రారంభ నగదు నిల్వ #	9,193	8,095	(-)1,098
	రెవెన్యూ రాబడి	1,27,469	1,59,350	31,881
	ఇచ్చిన ఋణాలు-అడ్వాన్సుల తిరిగి వసూలు	48	629	581
	ప్రజాఋణం రాక (నికరం)	42,935	32,074	(-)10,861
	ప్రజాపద్దులలోకి రాక (నికరం)	2,605	3,306	702
	మొత్తం	1,82,250	2,03,454	21,205
వినియోగం	వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులు	1,36,804	1,53,406	16,603
	మూలధనవ్యయం	28,874	17,881	(-)10,993
	ఇచ్చిన ఋణాలు-అడ్వాన్సులు	8,469	21,248	12,779
	రాష్ట్రాల మధ్య సర్దుబాట్లు	8	0	(-)8
	నికర ఆకస్మిక నిధి	0.05	0	(-)0.05
	భారతీయ రిజర్వు బ్యాంకులో ముగింపు నగదు నిల్వ #	8,095	10,919	2,824
	మొత్తం	1,82,250	2,03,454	21,205

మూలం: ఆర్థిక పద్దులు

 # నగదు నిల్వ నుంచి చేసిన పెట్టుబడులతో పాటు ప్రత్యేకించి ఏర్పాటైన నిధుల నుంచి చేసిన పెట్టుబడులు కూడా భారతీయ రిజర్వు బ్యాంకు వద్ద ఉన్న నగదు నిల్వలో కలిసి ఉంటాయి

సంచిత నిధికి సంబంధించి రాష్ట్రం వనరులు, ఆ వనరుల వినియోగపు కూర్పును శాతాల రూపంలో ఈ కింది పటాలలో చూపడమైంది.

పటం 2.1: 2022-23 లో వనరులు కూర్పు



పటం 2.2: 2022-23 లో వనరుల వినియోగం



మూలం: ఆర్థిక పద్దులు

రాష్ట్ర ప్రభుత్వం వనరుల కోసం గణనీయంగా ప్రజాఋణం (44 శాతం) మీద ఆధారపడింది. అయితే, అంతకు ముందు సంవత్సరం (48 శాతం) తో పోలిస్తే ప్రజాఋణం నుంచి వనరుల వాటా తక్కువే. వరుసగా రెండో సంవత్సరం ప్రజాఋణం వాటా తగ్గింది.

కోవిడ్ - 19 మహమ్మారి సంవత్సరం 2020-21 లో పన్నుల నుంచి రాబడి వాటా 30 శాతం ఉండగా, 2021-22 లో గణనీయంగా పెరిగి 37 శాతానికి చేరి, 2022-23 లో ఇంకొంత మేర అతి స్వల్పంగా 0.26 శాతం పాయింట్లు పెరిగింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే పన్నులు కాని ఇతర రాబడి ప్రస్తుత సంవత్సరంలో దాదాపు రెండింతలు అయింది. కేంద్ర పన్నుల నుంచి బదిలీల వాటా స్వల్పంగా తగ్గింది. సహాయక గ్రాంట్ల వాటా ఒక శాతం పాయింటు మేర పెరిగింది.

అయినా, ప్రజాఋణం మీద రాష్ట్రం ఆధారపడడం వనరుల వినియోగం మీద ప్రభావం చూపుతోంది. వనరులలో దాదాపు 33 శాతం మేర ప్రజాఋణం తిరిగి చెల్లింపు మీద వినియోగమయ్యింది. వనరుల వినియోగంలో ఇది అత్యధిక వాటా. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది మూడు శాతం పాయింట్లు ఎక్కువ. సాధారణ, ఆర్థిక సేవల వాటా దాదాపుగా అంతే ఉండగా, సామాజిక సేవల వాటలో ఒక శాతం పాయింటు తగ్గింది. మూలధన వ్యయం వాటాలో తగ్గుదల ఉంది. ఇచ్చిన ఋణాలు అడ్వాన్సుల వాటా నాలుగు శాతం పాయింట్ల కన్నా ఎక్కువ పెరిగింది.

2.4 రాష్ట్రం వనరులు

2022-23 సంవత్సరంలో రాష్ట్రానికి సంబంధించిన వనరుల కూర్పును ఈ కింది పటంలో చూపడమైంది.

పటం 2.3: 2022-23 సంవత్సరంలో రాష్ట్రం రాబడి కూర్పు



మూలం: ఆర్థిక పద్దులు

మొత్తం వనరులలో రెవెన్యూ రాబడి దాదాపు 55 శాతం. క్యాపిటల్ రాబడి 44 శాతం. ప్రజాపద్దులోకి నికర రాక మిగిలిన 01 శాతం. సొంత పన్నుల నుంచి రాబడి, పన్నులు కాని ఇతర రాబడితో కూడిన రాష్ట్రం సొంత రాబడి (₹1,26,503 కోట్లు) రెవెన్యూ రాబడిలో 79 శాతం.

2.4.1 రెవెన్యూ రాబడి

ప్రాతిపదికగా తీసుకున్న ఒక ద్రవ్య చరాంశంలో మార్పుకు ప్రతిస్పందనగా ఆర్థికపరమైన చరాంశాలు ప్రతిస్పందించే తీరును చలనగుణ నిష్పత్తి సూచిస్తుంది. 2018-23 మధ్య ఐదు సంవత్సరాల కాలంలో, రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.) తో పోలిస్తే రెవెన్యూ రాబడి సరళి, పెరుగుదల, రెవెన్యూ రాబడి చలనగుణం తీరును ఈ కింద చూపడమైంది:

పట్టిక 2.3: రెవెన్యూ రాబడి సరళి

కొలమానాలు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
రెవెన్యూ రాబడి (₹ కోట్లలో)	**1,01,420**	**1,02,544**	**1,00,914**	**1,27,469**	**1,59,350**
రెవెన్యూ రాబడి వృద్ధి రేటు (శాతం)	14	1	(-)2	26	25
సొంత పన్నుల నుంచి రాబడి (₹ కోట్లలో)	64,674	67,597	66,650	91,271	1,06,949
పన్నులు కాని ఇతర రాబడి (₹ కోట్లలో)	10,007	7,360	6,101	8,858	19,554
భారత ప్రభుత్వం నుంచి సహాయక గ్రాంట్లు (₹ కోట్లలో)	8,178	11,599	15,471	8,619	13,179
మొత్తం సొంత రాబడి (₹ కోట్లలో)	74,681	74,957	72,751	1,00,129	1,26,503
సొంత రాబడి వృద్ధి రేటు (సొంత పన్నుల రాబడి, పన్నులు కాని ఇతర రాబడి) (శాతం)	16	0.37	(-)3	38	26
రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.) (₹ కోట్లలో) (మూలం: 2011-12)	**8,57,427**	**9,50,090**	**9,42,814**	**11,28,907**	**13,13,391**
రాష్ట్ర స్థూల గృహోత్పత్తి వృద్ధి రేటు *(శాతం)*	14	11	(-)1	20	16
రెవెన్యూ రాబడి / జి.ఎస్.డి.పి. *(శాతం)*	12	11	11	11	12
చలనగుణ నిష్పత్తులు					
జి.ఎస్.డి.పి.తో పోలిస్తే రెవెన్యూ చలనగుణం (రెవెన్యూ రాబడి వృద్ధి రేటు శాతం / జి.ఎస్.డి.పి. వృద్ధి రేటు శాతం)	1.01	0.10	1.59	1.32	1.56
జి.ఎస్.డి.పి.తో పోలిస్తే రాష్ట్రం సొంత రెవెన్యూ చలనగుణం (సొంత రెవెన్యూ వృద్ధి రేటు శాతం / జి.ఎస్.డి.పి. వృద్ధి రేటు శాతం)	1.15	0.03	2.94	1.88	1.65

మూలం: (i) ఆర్థిక పద్దులు; (ii) జి.ఎస్.డి.పి. గణాంకాలకు సంబంధించి ఆయా సంవత్సరాలలో గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (2023 ఆగస్టు 01 నాటి గణాంకాలు)

- అంతకుముందు సంవత్సరం 2021-22 తో పోలిస్తే రెవెన్యూ రాబడి వృద్ధి రేటు ఒక శాతం పాయింటు తగ్గింది.
- రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే రెవెన్యూ రాబడి నిష్పత్తి ఒక శాతం పాయింటు పెరిగింది.
- రెవెన్యూ రాబడి, సొంత రెవెన్యూ రాబడిల చలనగుణ నిష్పత్తి 2022-23 లో '1' కన్నా ఎక్కువగానే ఉంది. అంటే, రాష్ట్ర స్థూల గృహోత్పత్తి కన్నా అవి వేగంగా పెరిగాయని ఇది సూచిస్తోంది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత సంవత్సరంలో రెవెన్యూ చలనగుణ నిష్పత్తి స్వల్పంగా పెరుగగా, రాష్ట్రం సొంత రెవెన్యూ చలనగుణ నిష్పత్తి కొద్దిగా తగ్గింది.
- అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే భారత ప్రభుత్వం నుంచి అందిన సహాయక గ్రాంట్లు ₹4,560 కోట్లు పెరిగాయి.

రాష్ట్రం రెవెన్యూ రాబడిని సాధారణంగా నాలుగు అంశాలుగా వర్గీకరించడం జరుగుతుంది. అవి (i) సొంత పన్నుల నుంచి రాబడి, (ii) పన్నులు కాని ఇతర రాబడి, (iii) కేంద్ర పన్నులలో రాష్ట్రానికి బదిలీ అయిన వాటాలు, (iv) భారత ప్రభుత్వం నుంచి అందిన సహాయక గ్రాంట్లు. *పట్టిక 2.1* లో పేర్కొన్నట్లుగా రెవెన్యూ రాబడి 25 శాతం పెరిగింది.

రెవెన్యూ రాబడికి సంబంధించిన అన్నీ అంశాలలో అంటే సొంత పన్నుల నుంచి రాబడి (17 శాతం పెరుగుదల), పన్నులు కాని ఇతర రాబడి (121 శాతం పెరుగుదల), కేంద్ర పన్నులు, సుంకాలలో రాష్ట్రం వాటా (05 శాతం పెరుగుదల), సహాయక గ్రాంట్ల (53 శాతం పెరుగుదల) లో పెరుగుదల ఉంది.

2018-23 మధ్యకాలంలో వివిధ అంశాల సరళి ఈ కింది పటంలో చూపడం జరిగింది:

పటం 2.4: 2018-23 మధ్యకాలంలో రెవెన్యూ రాబడి కూర్పు సరళి



మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

కోవిడ్ - 19 మహమ్మారి కారణంగా 2020-21 లో కొద్దిగా తగ్గిన రాష్ట్రం సొంత పన్నుల నుంచి రాబడి 2021-22 లో గణనీయంగా పెరిగి, 2022-23 లో కూడా చెప్పుకోదగ్గ పెరుగుదలను కనబర్చింది. (i) రాష్ట్ర వస్తు సేవల పన్ను, (ii) అమ్మకాలు, వర్తకం మీద పన్నులు వగైరా, (iii) స్టాంపులు, రిజిస్ట్రీకరణ, (iv) వాహనాల మీద పన్నులు, (v) రాష్ట్ర ఆబ్కారీ వంటి రాబడులలో పెరుగుదల కారణంగా పన్నుల నుంచి రాబడి పెరిగింది.

పన్నులు కాని ఇతర రాబడి అమాంతంగా పెరిగింది. (i) నానావిధ సాధారణ సేవలు, (ii) ఇనుము కాని ఖనిజాల తవ్వకం, లోహ సంబంధ పరిశ్రమలు, (iii) అడవులు, వన్య ప్రాణులు, (iv) పంటల పెంపకం, (v) వడ్డీల నుంచి రాబడి, (vi) భారీ నీటిపారుదల వంటి వాటి నుంచి పెరిగిన రాబడి కారణంగా పన్నులు కాని ఇతర రాబడి పెరిగింది.

కేంద్ర పన్నుల బదిలీలు కొద్దిగా పెరుగగా, భారత ప్రభుత్వం నుంచి సహాయక గ్రాంట్లు ఈ సంవత్సరం గణనీయంగా పెరిగాయి.

2020-21 లో తప్ప సొంత పన్నుల నుంచి రాబడి అన్న అంశంలో మాత్రమే క్రమం తప్పకుండా పెరుగుదల ఉంది. ఇది రాష్ట్రానికి ఒక విశ్వసనీయమైన ఆదాయపు వనరు. ఇతర అంశాలన్నింటిలో హెచ్చుతగ్గులు ఉన్నాయి.

2.4.1.1 రాష్ట్రం సొంత వనరులు

కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా ఆర్థిక సంఘం సిఫార్సుల ఆధారంగా నిర్ధారణ అవుతుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి అందే సహాయక గ్రాంట్లు వసూలైన కేంద్ర పన్నుల పరిమాణం, పథకాల కోసం ఆశించిన కేంద్ర సాయం ఆధారంగా నిర్ధారణ అవుతుంది. కనుక, సొంత పన్నుల నుంచి రాబడి, పన్నులు కాని ఇతర రాబడి అనే రెండు అంశాల ద్వారానే వనరుల సమీకరణలో రాష్ట్ర ప్రభుత్వం పని తీరును అర్థం చేసుకోవచ్చు.

(i) సొంత పన్నుల నుంచి రాబడి

రాష్ట్రం సొంత పన్నుల నుంచి రాబడిలో రాష్ట్ర వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.), అమ్మకాలు, వర్తకం మీద పన్నులు వగైరా, రాష్ట్ర ఆబ్కారీ, వాహనాల మీద పన్నులు, స్టాంపు సుంకం – రిజిస్ట్రీకరణ రుసుములు, భూమి శిస్తు, వస్తువులు – ప్రయాణికులపై పన్నులు వంటివి ఉంటాయి.

2022-23 సంవత్సరంలోని మొత్తం రెవెన్యూ రాబడి (₹1,59,350 కోట్లు) లో రాష్ట్రం సొంత పన్నుల నుంచి రాబడి (₹1,06,949 కోట్లు) 67 శాతం. సొంత పన్నుల నుంచి రాబడి గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం గణనీయంగా (₹15,678 కోట్లు) 17 శాతం పెరిగింది. సొంత పన్నుల నుంచి రాబడి రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో శాతంగా చూస్తే అంతకుముందు సంవత్సరం మాదిరిగానే 2022-23 లో కూడా 8 శాతంగానే ఉంది.

ప్రస్తుత సంవత్సరంలో సొంత పన్నుల నుంచి రాబడిలో ప్రధాన భాగం రాష్ట్ర వస్తు - సేవల పన్ను (34 శాతం), అమ్మకాలు, వర్తకం మీద పన్నులు వగైరా (28 శాతం), రాష్ట్ర ఆబ్కారీ (17 శాతం), స్టాంపులు, రిజిస్ట్రీకరణల (13 శాతం) నుంచి అందింది. 2018-23 మధ్యకాలంలో రాష్ట్ర సొంత పన్నుల నుంచి రాబడిలోని వివిధ అంశాల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి:

పట్టిక 2.4: రాష్ట్రం సొంత పన్నుల నుంచి రాబడిలోని అంశాలు

(₹ కోట్లలో)

రాబడి పద్దు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23	రేఖాచిత్రం
రాష్ట్ర వస్తు సేవల పన్ను	23,840	23,517	22,190	28,917	36,248	
అమ్మకాలు, వర్తకం మీద పన్నులు వగైరా	20,291	20,674	20,904	26,974	29,604	
రాష్ట్ర ఆబ్కారీ	10,638	11,992	14,370	17,482	18,471	
స్టాంపులు సుంకం, రిజిస్ట్రీకరణ రుసుము	5,344	6,671	5,243	12,373	14,228	
వాహనాల మీద పన్నులు	3,762	3,935	3,338	4,381	6,737	
వస్తువులు, ప్రయాణీకుల మీద పన్నులు	189	62	19	8	27	
భూమి శిస్తు	0.42	1	1	0.26	0.27	
ఇతర పన్నులు	610	745	585	1,136	1,634	
మొత్తం	**64,674**	**67,597**	**66,650**	**91,271**	**1,06,949**	

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

- కోవిడ్ – 19 మహమ్మారి కారణంగా 2020-21 లో కొద్దిగా తగ్గిన రాష్ట్ర వస్తు సేవల పన్ను నుంచి రాబడి బలంగా పుంజుకుని 2021-22 లో 30 శాతం, 2022-23 లో 25 శాతం పెరిగింది.
- 2018-19 నుంచి 2020-21 వరకు ఎదుగుదల లేకుండా స్థిరంగా ఉండిపోయిన అమ్మకాలు, వర్తకం మీద పన్నులు వగైరా నుంచి రాబడి 2021-22 లో గణనీయంగా 29 శాతం పెరుగగా, 2022-23 లో కూడా 10 శాతం మేర బాగానే పెరిగింది.
- రాష్ట్ర ఆబ్కారీ నుంచి రాబడి ఏటేటా పెరుగుతూనే ఉంది. కోవిడ్ – 19 మహమ్మారి సమయంలో కూడా రాష్ట్ర ఆబ్కారీ నుంచి రాబడి పెరిగింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 2022-23 లో, రాష్ట్ర ఆబ్కారీ నుంచి రాబడి ఆరు శాతం పెరిగింది. ముఖ్యంగా, (i) బీరు, లిక్కరు అమ్మకాల పరిమాణంలో పెరుగుదల కారణంగా 'విదేశీ మద్యం, మద్యపానీయాల' నుంచి రాబడిలో పెరుగుదల (₹1,864 కోట్లు), (ii) 'మాల్ట్ లిక్కర్' నుంచి రాబడిలో పెరుగుదల (₹492 కోట్లు) కారణంగా ఈ పెరుగుదల ఏర్పడింది.

- వాహనాల మీద పన్నులు, స్టాంపు సుంకం, రిజిస్ట్రీకరణ రుసుము 2020-21 లో తగ్గినా, 2021-22, 2022-23 లో పెరిగాయి.
- వస్తువులు, ప్రయాణీకుల మీద పన్నులు, ఇతర పన్నుల విషయంలో కూడా ఇదే మాదిరిగా పడిపోవడం, తిరిగి పుంజుకోవడం గమనించవచ్చు. దీనికి కారణం 'స్థానిక ప్రాంతాలలోకి సామగ్రి ప్రవేశం మీద పన్ను' రాబడిలో పెరుగుదల (₹20 కోట్లు), 'విలాసవు పన్ను' కింద పెరుగుదల (₹21 కోట్లు).
- భూమి శిస్తు దాదాపుగా అంతకు ముందు సంవత్సరంతో సమానంగా ఉంది.
- ఇతర పన్నులో రాబడి (i) విద్యుచ్ఛక్తి వినియోగం, అమ్మకం మీద పన్నులు (₹338 కోట్లు), (ii) వృత్తులు, వర్తకాలు, వాటాల అమ్మకం (కాలింగ్), ఉపాధి వంటి వాటి మీద పన్నుల (₹135 కోట్లు) కారణంగా పెరిగింది.

(ii) పన్నులు కాని ఇతర రాబడి

పన్నుల ద్వారా కాకుండా ఇతర వనరుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకునే ఆదాయాన్ని పన్నులు కాని ఇతర రాబడిగా పేర్కొనవచ్చు. వైద్యం, పోలీసు, సామాజిక సేవలు, వర్గ సేవల వంటి వాటి నుంచి రాబడి, వివిధ ప్రభుత్వ శాఖలు చేసిన సరఫరాల నుంచి రాబడి, గనుల తవ్వకం నుంచి రాబడి, వడ్డీ రాబడి, వాటాల మీద ప్రతిఫలం (డివిడెండు), లాభాలు వంటివే కాకుండా ఇతర శాఖాపరమైన రాబడులు ఇందులో ఉంటాయి.

2022-23 సంవత్సరంలోని మొత్తం రెవెన్యూ రాబడి (₹1,59,350 కోట్లు) లో పన్నులు కాకుండా రాష్ట్రం ఇతర సొంత రాబడి (₹19,554 కోట్లు) 12 శాతం. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత సంవత్సరంలో పన్నులు కాని ఇతర రాబడి గణనీయంగా ₹10,696 కోట్లు (121 శాతం) పెరిగింది.

పట్టిక 2.5: రాష్ట్రం తాలూకు పన్నులు కాని ఇతర రాబడిలోని అంశాలు

(₹ కోట్లలో)

రాబడి పద్దు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23	రేఖాచిత్రం
వడ్డీ రాబడి	60	18	34	20	267	
వాటాల మీద ప్రతిఫలం (డివిడెండు), లాభాలు	94	115	94	52	78	
ఇతర పన్నులు కాని రాబడి	9,853	7,227	5,973	8,786	19,209	
(ఎ) భారీ, మధ్య తరహా నీటిపారుదల	36	31	18	24	144	
(బి) రోడ్లు, వంతెనలు	34	46	24	18	2	
(సి) పట్టణాభివృద్ధి	9	21	7	93	9	
(డి) విద్య	318	367	614	495	343	
(ఇ) ఇనుము కాకుండా ఇతర ఖనిజాల తవ్వకం	4,647	3,487	3,457	2,296	7,494	
(ఎఫ్) ఇతరాలు లేదా నానావిధాలు	4,809	3,275	1,853	5,860	11,217	
మొత్తం	**10,007**	**7,360**	**6,101**	**8,858**	**19,554**	

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

- వడ్డీ రాబడిలో పెరుగుదలకు కారణం అధిక వోల్టేజి పంపిణీ వ్యవస్థ (హై వోల్టేజి డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ - హెచ్. వి. డి.ఎస్.) కోసం తెలంగాణ విద్యుత్ ప్రసార సంస్థ (ట్రాన్స్మిషన్ కార్పోరేషన్) కు ఇచ్చిన ఋణాల నుంచి వచ్చిన ₹247 కోట్ల వడ్డీ రాబడి. అయితే, మొత్తం ఇచ్చి ఉన్న ఋణాల విలువ ₹736 కోట్లు మాత్రమే కాగా, ఋణం మొత్తంలో 34 శాతం ఈ సంవత్సరం వడ్డీ రాబడిగా అందడం విచిత్రంగా ఉంది.

- సహకార సంఘాలలో ఇతర పెట్టుబడుల నుంచి వాటాల ప్రతిఫలం (డివిడెండు) లో పెరుగుదల కారణంగా వాటాల ప్రతిఫలంలో పెరుగుదల ఉంది.

- భారీ, మధ్య తరహా నీటిపారుదల నుంచి ₹120 కోట్ల మేర రాబడి నికర పెరుగుదలకు చిన్న పద్దు, ఉప పద్దు, వివరణాత్మక పద్దుల స్థాయిలో 'ఇతర రాబడి' గా వర్గీకరించిన ₹144 కోట్ల రాబడి కారణం.

- ఇనుము కాని ఖనిజాల తవ్వకం, లోహసంబంధ పరిశ్రమలు నుంచి అందిన రాబడి 2021-22 లో ₹2,296 కోట్లు కాగా, 2022-23 లో అమాంతంగా ₹7,493 కోట్లకు పెరిగినట్లు గమనించడం జరిగింది.

  - ఈ అంశంలో ఉన్న ఖనిజాల కౌలు రుసుము, అద్దెలు, కప్పం (లేదా రాయల్టీ) ల నుంచి అందిన రాబడి 2019-20 లో ఉన్న ₹2,787 కోట్లు, 2020-21 లో ఉన్న ₹2,751 కోట్లు నుంచి 2021-22 లో ₹1,582 కోట్లకు తగ్గింది. ఈ సంవత్సరం అది అమాంతంగా ₹6,553 కోట్లకు పెరిగింది. ఇందులో ₹4,818 కోట్లు 2022 జూన్ నెలలోనే అందింది. రాయల్టీ / శిస్తు రూపేణా ₹4,577 కోట్లు జమ చేసినట్లు (2022 జూన్) సింగరేణి కాలరీస్ సంస్థ తెలిపింది. ఈ మొత్తంలో 2020-21 కి సంబంధించిన రాయల్టీ ₹5 కోట్లు, 2021-22 కి సంబంధించిన ₹1,750 కోట్లు, ముందుస్తుగా చెల్లించిన ₹613 కోట్లు కలిసి ఉన్నాయి. ఈ విధంగా, రాయల్టీ బకాయిలు అందిన కారణంగా, ముందస్తుగా అందిన కారణంగా ఇనుము కాని ఖనిజాల తవ్వకం నుంచి రాబడి పెరిగింది.

  - ఇసుక అమ్మకం నుంచి రాబడి 2021-22 లో ఉన్న ₹714 కోట్ల నుంచి 2022-23 లో ₹940 కోట్లకు పెరిగింది.

- 'నానావిధ సాధారణ సేవలు' (₹5,875 కోట్లు) లో రాబడి పెరుగుదల కారణంగా 'ఇతర పన్నులు కాని రాబడి' పెరిగింది. 'ఇతర రాబడి' (₹4,533 కోట్ల మేర), 'భూములు, ఆస్తుల అమ్మకం' (₹1,361 కోట్ల మేర) పెరగడం వల్ల నానావిధ సాధారణ సేవల రాబడి పెరిగింది.

  - 2021-22 లో ₹1,189 కోట్లు ఉన్న ఇతర రాబడి 2022-23 లో ₹5,723 కోట్లకు ఎగిసింది. అయితే, చిన్న పద్దు, ఉప పద్దు, వివరణాత్మక పద్దుల స్థాయిలో 'ఇతర రాబడి – ఇతర రాబడి – ఇతర రాబడి' అని వర్గీకరించిన కారణంగా, వివరాలు లేని కారణంగా ఈ మొత్తాన్ని మరింతగా విశ్లేషించడం సాధ్యం కాలేదు. ఈ మొత్తంలో ₹5,562 కోట్లను నానావిధ సాధారణ సేవల కింద పి.ఎ.ఒ. హైదరాబాదు అర్బన్ జమ చేయడం జరిగింది. డిపాజిటు మొత్తాలను జప్తు చేసి వాటిని ఖర్చులో తగ్గింపుకు బదులుగా రెవెన్యూ రాబడిగా ప్రభుత్వ పద్దుకు జమ చేయడం జరిగిందని ఆడిటు పరిశీలనలో వెల్లడి అయ్యింది (***పేరాలు 3.2.2.1, 4.7*** లను కూడా చూడవచ్చు).

    ఇంత పెద్ద మొత్తంలో రాబడికి మూలంగానీ, ప్రయోజనం గానీ పద్దులలో కనిపించడంలేదు. పైగా, ఆడిటు ప్రత్యేకించి కోరిన తరువాత కూడా ప్రభుత్వం ఈ విషయమై ఎలాంటి వివరాలను అందించలేదు. తగిన వర్గీకరణ లేకుండా ఉన్న భారీ రాబడి పద్దులలో పారదర్శకతను ప్రభావితం చేస్తుంది.

పేటిక 2.1: ఇచ్చిన ఋణాలను జప్తు చేసి రెవెన్యూ రాబడిగా జమ చేయడం వల్ల రెవెన్యూ మిగులును ఎక్కువ చేసి చూపడం

'ఇతర రాబడి' కింద వచ్చిన రాబడిలో ప్రజాపద్దుల కింద ఉన్న తెలంగాణ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థ డిపాజిటు పద్దులో నుంచి జప్తు చేసుకున్న ₹1,100 కోట్లు, తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ డిపాజిటు పద్దులో నుంచి జప్తు చేసుకున్న ₹300 కోట్లు ఉన్నాయి. ఈ మొత్తాలను ఆ సంస్థలకు గతంలో ఋణాల రూపంలో ఇవ్వడం జరిగింది. ఈ ఉదంతాన్ని కింద వివరించడమైంది:

రాష్ట్ర ప్రభుత్వం 2017-18 లో ప్రభుత్వ రాయితీ పథకాలను అమలు చేయడం కోసం ఈ సంస్థలకు ₹2,300 కోట్ల[1] ఋణాలు ఇచ్చి ఆ మొత్తాలను ప్రజాపద్దు కింద ఉన్న ఆ సంస్థల డిపాజిటు ఖాతాలలోకి జమ చేసింది. తరువాతి సంవత్సరం 2018-19 లో ఈ మొత్తాలను రద్దు చేయడం జరిగింది. అయితే, వాటిని పద్దులలో ఋణాలను తగ్గించేందుకు బదులుగా ప్రభుత్వ ఖాతాకు రెవెన్యూ రాబడిగా జమ చేయడం జరిగింది. కానీ, 2018-19 లోనే మళ్లీ మరో ₹2,400 కోట్లు[2] ఋణాలుగా ఇవ్వడం జరిగింది (*2019 మార్చి తో ముగిసిన సంవత్సరానికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిటు నివేదికలోని పేరా 1.3.1 లోని పేటిక 1.1*). ఈ విధంగా ఆ సంస్థల నుంచి ప్రభుత్వానికి తిరిగి అందాల్సిన ఋణాల మొత్తం ₹4,700 కోట్లు[3].

పటం 2.5: ఋణాలను ఇవ్వడం, వాటిని రద్దు చేయడం, తరువాత ప్రభుత్వానికి ఆ మొత్తాలను పన్నులు కాని రాబడిగా జమ చేసిన వైనాన్ని తెలిపే చిత్రం

2017-18

ప్రభుత్వం తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థకు ₹1,500 కోట్లును, తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థకు ₹800 కోట్లను ఋణాలుగా ఇచ్చి ఆ మొత్తాలను ఆ సంస్థల డిపాజిటు పద్దులకు బదిలీ చేసింది.
ఆ సంస్థల నుంచి తిరిగి వసూలు కావల్సిన ఋణం ₹2,300 కోట్లు

↓

2018-19

డిపాజిటు పద్దులలో వినియోగం కాకుండా ఉన్న ₹2,300 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం రద్దు చేసి జప్తు చేసుకుంది. అయితే, తిరిగి చెల్లించాల్సి ఉన్న ఋణాల మొత్తాన్ని తగ్గించాల్సింది పోయి ఆ మొత్తాన్ని పన్నులు కాని ఇతర రాబడిగా తీసుకున్నది. అదే సంవత్సరం ప్రభుత్వం మళ్లీ తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థకు, తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థకు కలిపి ₹2,400 కోట్లను ఋణాలుగా ఇచ్చి ఆ మొత్తాలను ఆ సంస్థల డిపాజిటు పద్దులకు బదిలీ చేసింది.
ఆ సంస్థల నుంచి తిరిగి వసూలు కావల్సిన ఋణం ₹4,700 కోట్లు

↓

2021-22

2022 మార్చి నాటికి ఆ సంస్థల నుంచి ₹4,700 కోట్ల ఋణం ఇంకా తిరిగి వసూలు కావల్సి ఉన్నట్లు చూపుతుండగా, ప్రభుత్వం మరోసారి ₹1,000 కోట్లను (వినియోగం కాకుండా ఉండి రద్దు అయినవి) జప్తు చేసుకుంది. అయితే, తిరిగి వసూలు కావల్సిన ఋణాల మొత్తాన్ని తగ్గించేందుకు బదులు డిపాజిటు పద్దుల నుండి రెవెన్యూ రాబడిగా తీసుకున్నది.

↓

2022-23

2023 మార్చి నాటికి ఆ సంస్థల నుంచి ₹4,700 కోట్ల ఋణం ఇంకా తిరిగి వసూలు కావల్సి ఉన్నట్లు చూపుతుండగా, ప్రభుత్వం మరోసారి ₹1,400 కోట్లను (వినియోగం కాకుండా ఉండి రద్దు అయినవి) జప్తు చేసుకుంది. అయితే, తిరిగి వసూలు కావల్సిన ఋణాల మొత్తాన్ని తగ్గించేందుకు బదులు డిపాజిటు పద్దుల నుండి రెవెన్యూ రాబడిగా తీసుకున్నది.

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

---

1 తెలంగాణ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థ (₹1,500 కోట్లు), తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ (₹800 కోట్లు)

2 తెలంగాణ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థ (₹1,500 కోట్లు), తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ (₹900 కోట్లు)

3 తెలంగాణ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థ (₹3,000 కోట్లు), తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ (₹1,700 కోట్లు)

పెద్ద పద్దులు, చిన్న పద్దుల జాబితా[4] ప్రకారం, రిజర్వు నిధి / డిపాజిటు పద్దుకు బదిలీ చేసిన ఖర్చును తిరిగి వెనక్కు సర్దుబాటు చేయాల్సి వస్తే, దానిని సంబంధిత చిన్న పద్దులో ఖర్చుకు తగ్గింపుగా చూపాలి. అంతే కాకుండా, రాష్ట్ర ఆర్థిక నియమావళి[5] ప్రకారం సంచిత నిధికి ఖర్చు రాయడం ద్వారా ఏర్పాటు అయిన వ్యక్తిగత డిపాజిటు ఖాతాలను ఆర్థిక సంవత్సరం చివరిలో వాటిలో ఉన్న నిల్వలను సంచిత నిధిలోని సంబంధిత సేవల పద్దుకు ఖర్చును తిరుగరాయడం ద్వారా మూసివేయాలి.

ఆ విధంగా, పైన పేర్కొన్న ₹1,400 కోట్లను తిరిగి రావల్సిన ఋణాల మొత్తంలో నుంచి తగ్గింపుగా చూపకుండా, పన్నులు కాని ఇతర రాబడిగా తప్పుగా వర్గీకరించిన కారణంగా రెవెన్యూ రాబడిని, తిరిగి రావల్సిన ఉన్న ఋణాల మొత్తాన్ని, అంటే ఆస్తులను ఆమేరకు ఎక్కువ చేసి చూపినట్లు అయింది.

- ‘భూములు, ఆస్తుల అమ్మకం’ కింద 2021-22 లో ₹2,708 కోట్లు అందగా, 2022-23 లో ₹4,069 కోట్లు అందాయి. ‘ఓపెన్ ప్లాట్లు / ప్లాట్లు / గృహాల అమ్మకం నుంచి అందిన ప్రతిఫలం’ కింద భారీగా రాబడి పెరగడం ఇందుకు కారణం. ఈ అంశంలో 2021-22 లో కేవలం ₹49 కోట్లు అందగా, 2022-23 లో ₹3,278 కోట్లు అందాయి. అయితే ‘భూములు, ఆస్తుల అమ్మకం’ (ఉప పద్దు) మాత్రం 2021-22 లో ఉన్న ₹2,658 కోట్ల నుంచి 2022-23 లో ₹791 కోట్లకు తగ్గిపోయింది.

2.4.1.2 కేంద్ర పన్నుల విభజన, కేంద్రం నుంచి అందిన గ్రాంట్లు

2018-23 మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం నుంచి మొత్తం బదిలీలు, కేంద్ర పన్నులలో వాటా, కేంద్రం నుంచి అందిన సహాయక గ్రాంట్ల సరళిని ఈ కింది పటంలో చూపడం జరిగింది.

పటం 2.6: భారత ప్రభుత్వం నుంచి బదిలీల సరళి



మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

ప్రస్తుత సంవత్సరంలో, కేంద్ర పన్నులలో వాటా, సహాయక గ్రాంట్ల వాటా రెండూ పెరిగాయి. ఇవి కాకుండా, భారత ప్రభుత్వం మరిన్ని సహాయక గ్రాంట్లను రాష్ట్ర సంచిత నిధి ద్వారా కాకుండా పథకాలను అమలు చేసే సంస్థలకే నేరుగా విడుదల చేస్తోంది (వివరాల కోసం *పేరా 4.3* ను చూడవచ్చు). కేంద్ర పన్నుల విభజన, సహాయక గ్రాంట్లను గురించి ఈ కింది పేరాలలో చర్చించడం జరిగింది.

---

4 సాధారణ ఆదేశాలలోని పేరా 4.5

5 పేరా 271 (iii) (4)

(i) కేంద్ర పన్నుల బదిలీలు

పదిహేనో ఆర్థిక సంఘం 2021-26 మధ్య కాలానికి విభజించదగిన కేంద్ర పన్నుల మొత్తంలో 2.102 శాతాన్ని తెలంగాణకు కేటాయించింది. ఆ ప్రకారం, ఈ సంవత్సరానికి తెలంగాణ వాటా ₹15,400 కోట్లు[6] ఉండవచ్చని పదిహేనో ఆర్థిక సంఘం అంచనా వేసింది. అయితే కేంద్ర పన్నులలో వాటాగా ఈ సంవత్సరం రాష్ట్రానికి ₹19,668 కోట్లు అందాయి. పదిహేనో ఆర్థిక సంఘం అంచనా వేసిన మొత్తం కన్నా ఇది ఎక్కువే. ఆర్థిక సంఘాలు తమ నివేదికలలో అంచనా వేసిన మొత్తాల కన్నా 2021-22 వరకు రాష్ట్ర ప్రభుత్వానికి తక్కువగా అందిన సంవత్సరాల సరళితో పోలిస్తే ఇది భిన్నంగా ఉంది.

2018-23 కాలానికి సంబంధించి కేంద్ర పన్నులలో, సుంకాలలో రాష్ట్ర వాటా విషయంలో పద్నాలుగో ఆర్థిక సంఘం / పదిహేనో ఆర్థిక సంఘాల అంచనాలు, వాస్తవంగా అయిన పంపకాల వివరాలు ఈ కింది పట్టికలో ఉన్నాయి.

పట్టిక 2.6: కేంద్రపు పన్నులు, సుంకాలలో రాష్ట్ర వాటా: ఆర్థిక సంఘం అంచనాలతో పోలిస్తే వాస్తవ ప్రాప్తి

(₹ కోట్లలో)

సంవత్సరం	ఆర్థిక సంఘం అంచనాలు	ఆర్థిక సంఘం నివేదికలో అంచనాలు	వాస్తవంగా సంప్రాప్తించిన పన్ను	వ్యత్యాసం
1	2	3	4	5 (= నిలువు వరుస 4 - నిలువు వరుస 3)
2018-19	XIV ఆర్థిక సంఘం ప్రకారం	21,885	18,561	(-)3,324
2019-20		25,350	15,988	(-)9,362
2020-21	XV ఆర్థిక సంఘం ప్రకారం	18,241	12,692	(-)5,549
2021-22		13,844	18,721	(+)4,877
2022-23		15,400	19,668	(+)4,268

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు, ఆర్థిక సంఘం నివేదికలు

2018-23 మధ్యకాలంలో అంశాల వారీగా రాష్ట్రానికి అందిన కేంద్ర పన్నుల బదిలీలు ఈ కింద ఉన్నాయి:

పట్టిక 2.7: కేంద్ర పన్నుల బదిలీలు

(₹ కోట్లలో)

పద్దు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
కేంద్ర వస్తు సేవల పన్ను (సి.జి.ఎస్.టి.)	4,581	4,537	3,715	5,573	5,640
సమీకృత వస్తు సేవల పన్ను (ఐ.జి.ఎస్.టి.)	366	--	--	--	--
కార్పొరేషను పన్ను	6,454	5,451	3,865	4,649	6,399
కార్పొరేషను పన్ను కాకుండా ఆదాయం మీద పన్నులు	4,753	4,271	3,967	5,635	6,534
కస్టమ్స్	1,315	1,013	649	1,506	785
కేంద్ర ఆబ్కారీ సుంకాలు	874	705	422	899	246
సేవా పన్ను	172	--	63	438	31
ఇతర పన్నులు[7]	46	10	11	21	33
కేంద్ర పన్నుల బదిలీలు	18,561	15,988	12,692	18,721	19,668
గత సంవత్సరంతో పోలిస్తే పెరుగుదల శాతం	13	(-)14	(-)21	48	5
రెవెన్యూ రాబడితో పోలిస్తే కేంద్ర పన్నుల బదిలీల శాతం	18	16	13	15	12

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే కేంద్ర పన్నుల బదిలీలు ఐదు శాతం పెరిగినా, రెవెన్యూ రాబడిలో ఇతర అంశాల వృద్ధి రేటు అధికం కావడంతో రాష్ట్రం రెవెన్యూ రాబడిలో వాటాగా మాత్రం మూడు శాతం పాయింట్లు తగ్గింది.

---

6 విభజించదగిన కేంద్ర పన్నుల మొత్తం ₹7,32,628 కోట్లలో 2.102 శాతం

7 ఇందులో సంపద మీద పన్నులు, ఆదాయ వ్యయాల మీద ఇతర పన్నులు, సరుకులు, సేవలపై ఇతర పన్నులు, సుంకాలు ఉన్నాయి

(ii) భారత ప్రభుత్వం నుంచి సహాయక గ్రాంట్లు

2018-23 మధ్యకాలంలో భారత ప్రభుత్వం నుంచి అందిన సహాయక గ్రాంట్ల వివరాలు ఈ కింద ఉన్నాయి:

పట్టిక 2.8: భారత ప్రభుత్వం నుంచి సహాయక గ్రాంట్లు

(₹ కోట్లలో)

పద్దు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
కేంద్ర ప్రాయోజిత పథకాలకు గ్రాంట్లు	5,508	5,729	5,805	4,461	5,387
ఆర్థిక సంఘం గ్రాంట్లు	1,806	3,219	3,135	1,787	3,423
రాష్ట్రాలకు ఇతర బదిలీలు/గ్రాంట్లు	864	2,651	6,531	2,371	4,369
మొత్తం	**8,178**	**11,599**	**15,471**	**8,619**	**13,179**
గత సంవత్సరంతో పోలిస్తే పెరుగుదల/తగ్గుదల శాతం	1	42	33	(-)44	53
రెవెన్యూ రాబడిలో సహాయక గ్రాంట్ల శాతం	8	11	15	7	8

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

గత సంవత్సరంతో పోలిస్తే 2022-23 లో భారత ప్రభుత్వం నుంచి అందిన సహాయక గ్రాంట్లు ₹4,560 కోట్లు (53 శాతం) ఎక్కువ. సహాయక గ్రాంట్లు వాటా కూడా ఒక శాతం పాయింటు పెరిగింది. కేంద్ర ప్రాయోజిత పథకాలు (₹5,387 కోట్లు, సహాయక గ్రాంట్లలో 41 శాతం), వస్తు సేవల పన్ను అమలు కారణంగా ఏర్పడిన రాబడి నష్టానికి పరిహారం (₹4,061 కోట్లు, సహాయక గ్రాంట్లలో 31 శాతం) సహాయక గ్రాంట్లలో ప్రధాన భాగంగా ఉన్నాయి.

(ఎ) కేంద్ర ప్రాయోజిత పథకాలకు గ్రాంట్లు:

2022-23 సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు అందిన ₹5,387 కోట్ల సహాయక గ్రాంట్లలో ముఖ్యమైనవి:

- సర్వ శిక్షా అభియాన్: ₹1,143 కోట్లు;
- మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం: ₹1,089 కోట్లు;
- సమీకృత బాలల అభివృద్ధి సేవలు: ₹754 కోట్లు;
- జాతీయ ఆరోగ్య మిషన్: ₹724 కోట్లు;
- ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన: ₹321 కోట్లు;
- పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులు: ₹239 కోట్లు;
- జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం: ₹216 కోట్లు.

(బి) ఏకీకృత సమన్వయ సంస్థ (సింగిల్ నోడల్ ఏజన్సీ) ఖాతాలు:

రాష్ట్ర స్థాయిలో ఒక్కొక్క కేంద్ర ప్రాయోజిత పథకంలో నిధుల వినియోగాన్ని పర్యవేక్షించడం కోసం ఒక్కొక్క ఏకీకృత సమన్వయ సంస్థ ఖాతాను తెరువాల్సిందిగా భారత ప్రభుత్వం లోని ఆర్థిక మంత్రిత్వ శాఖ కింద ఉన్న వ్యయ విభాగం మార్గదర్శకాలను[8] జారీ జేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం అమలు చేస్తున్న ఒక్కొక్క కేంద్ర ప్రాయోజిత పథకానికి ప్రతి రాష్ట్రమూ కూడా ఒక ఏకీకృత సమన్వయ సంస్థను ఏర్పాటు చేయాలి. ఈ ఏకీకృత సమన్వయ సంస్థ షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులలో ప్రభుత్వ లావాదేవీలను నిర్వహించడం కోసం ఒక్కొక్క కేంద్ర ప్రాయోజిత పథకానికి ఒక ఏకీకృత సమన్వయ ఖాతాను తెరవాలి. విధానం ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలలో పొందిన కేంద్ర వాటాను సంబంధిత రాష్ట్ర వాటాతో పాటు సంబంధిత ఏకీకృత సమన్వయ సంస్థ ఖాతాకు బదిలీ చేయాలి. పథకాన్ని అమలు చేస్తున్న సంస్థల ఇతర ఖాతాలను మూసి వేయాలి లేదా సున్నా నిల్వ ఉన్న ఖాతాలుగా మార్చాలి. ఆయా ఖాతాలలో వినియోగం కాకుండా ఉన్న మొత్తాలను పథకంకు సంబంధించిన ఏకీకృత సమన్వయ ఖాతాకు తిరిగి అప్పగించాలి. 2022 జనవరి 31 నాటికి ఆ మేరకు సంబంధిత శాఖ కార్యదర్శి ఒక ధ్రువపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలి.

[8] ఎఫ్.సంఖ్య 1 (13) పి.ఎఫ్.ఎం.ఎస్./ఎఫ్.సి.డి./2020, తేదీ 2021 మార్చి 23

ఇందుకు అనుగుణంగా, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి 77 కేంద్ర ప్రాయోజిత పథకాల గురించి బ్యాంకులలో 127 ఏకీకృత సమన్వయ సంస్థ ఖాతాలను[9] ప్రారంభించడం జరిగింది. ఈ సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు భారత ప్రభుత్వం ₹5,030 కోట్లను అందించింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ₹2,847 కోట్లతో కలిపి మొత్తం ₹7,877 కోట్లను సహాయక గ్రాంట్లు బిల్లుల రూపంలో ఏకీకృత సమన్వయ సంస్థలకు బదిలీ చేసింది. వాస్తవ వ్యయానికి సంబంధించి ఏకీకృత సమన్వయ సంస్థల నుంచి పూర్తి స్థాయి వోచర్లు, సంబంధిత పత్రాలు ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్, ఎన్టైటిల్మెంట్స్) కి అందలేదు. ఐదు ఏకీకృత సమన్వయ సంస్థ ఖాతాలు ఉన్న ఐదు కేంద్ర ప్రాయోజిత పథకాల విషయంలో 2023 మార్చి నాటికి నిల్వ ఏమి లేదని, ఇతర 72 కేంద్ర ప్రాయోజిత పథకాల విషయంలో వాణిజ్య బ్యాంకుల వద్ద ₹2,170 కోట్ల నిల్వ ఉందని రాష్ట్ర ప్రభుత్వం / ఏకీకృత సమన్వయ సంస్థలు తెలిపాయి.

ఇంతే కాకుండా, భారత ప్రభుత్వంలోని ఆర్థిక మంత్రిత్వ శాఖ కింద ఉన్న వ్యయ విభాగం జారీ చేసిన మార్గదర్శకాల[10] ప్రకారం ఏకీకృత సమన్వయ ఖాతాల నుంచి అందిన వడ్డీని రెవెన్యూ రాబడి కింద సంబంధిత విధియుక్తమైన పెద్ద పద్దు / ఉప పెద్ద పద్దు కింద ఉన్న ప్రామాణికమైన చిన్న పద్దు '801 - ఖర్చు కాని నిల్వల మీద సహాయం అందుకున్న సంస్థల నుంచి వడ్డీ లేదా ఇతర సంపాదన' కింద జమ చేసి, ఆ విధంగా వర్గీకరించాలి. అయితే, వడ్డీ రూపంలో అందిన ₹8 కోట్లను పెద్ద పద్దు '0049-801 - ఖర్చు కాని నిల్వల మీద సహాయం అందుకున్న సంస్థల నుంచి వడ్డీ లేదా ఇతర సంపాదన' గా వర్గీకరించడంతో రాష్ట్ర ప్రభుత్వ వడ్డీ రాబడిని ఎక్కువ చేసి చూపినట్లు అయింది.

(సి) పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన గ్రాంట్లు:

2021-22 నుంచి 2025-26 సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల కాలానికి, అదే విధంగా 2022-23 సంవత్సరానికి పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన మొత్తాలు, 2022-23 సంవత్సరంలో వాస్తవంగా అందిన మొత్తాలను ఈ కింద చూపడం జరిగింది:

పట్టిక 2.9: పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సులు

(₹ కోట్లలో)

<table>
<tr><th rowspan="2">క్రమ సంఖ్య</th><th rowspan="2" colspan="2">సిఫార్సు అయిన ప్రదానాలు (లేదా గ్రాంట్లు)</th><th colspan="2">పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన మొత్తం</th><th rowspan="2">2022-23 లో వాస్తవంగా అందిన మొత్తం</th><th rowspan="2">తేడా</th></tr>
<tr><th>2021-26 మధ్య ఐదు సంవత్సరాల కాలానికి</th><th>2022-23 సంవత్సరానికి</th></tr>
<tr><td>(1)</td><td colspan="2">(2)</td><td>(3)</td><td>(4)</td><td>(5)</td><td>(6) = (4)-(5)</td></tr>
<tr><td>1</td><td colspan="2">గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రదానాలు లేదా గ్రాంట్లు</td><td>7,201</td><td>1,415</td><td>2,097</td><td rowspan="3">(-)682*</td></tr>
<tr><td></td><td colspan="2">(ఎ) పనితీరు/షరతులతో కూడిన గ్రాంట్లు#</td><td>4,321</td><td>849</td><td>1,258</td></tr>
<tr><td></td><td colspan="2">(బి) సాధారణ ప్రాథమిక/షరతులు లేని గ్రాంట్లు</td><td>2,880</td><td>566</td><td>839</td></tr>
<tr><td>2</td><td colspan="2">పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు</td><td>3,682</td><td>697</td><td rowspan="5">718</td><td rowspan="5">(-)21**</td></tr>
<tr><td rowspan="2"></td><td rowspan="2">(i) పనితీరు / షరతులతో కూడిన గ్రాంట్లు#</td><td>మిలియన్ ప్లస్ నగరాలు</td><td>1,939</td><td>367</td></tr>
<tr><td>మిలియన్ ప్లస్ నగరాలు కానివి</td><td>1,046</td><td>198</td></tr>
<tr><td rowspan="2"></td><td rowspan="2">(ii) సాధారణ ప్రాథమిక/షరతులు లేని గ్రాంట్లు</td><td>మిలియన్ ప్లస్ నగరాలు</td><td>ఎన్ఎ</td><td>ఎన్ఎ</td></tr>
<tr><td>మిలియన్ ప్లస్ నగరాలు కానివి</td><td>697</td><td>132</td></tr>
<tr><td colspan="3">స్థానిక సంస్థలకు మొత్తం గ్రాంట్లు (1+2)</td><td>10,883</td><td>2,112</td><td>2,815</td><td></td></tr>
</table>

[9] కొన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలకు పలు రాష్ట్ర అనుసంధానిత పథకాలు ఉన్నాయి

[10] ఎఫ్.సంఖ్య 1 (13) పి.ఎఫ్.ఎం.ఎస్./ఎఫ్.సి.డి./2022, తేదీ 2022 జూలై 15

క్రమ సంఖ్య	సిఫార్సు అయిన ప్రదానాలు (లేదా గ్రాంట్లు)		పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన మొత్తం		2022-23 లో వాస్తవంగా అందిన మొత్తం	తేడా
			2021-26 మధ్య ఐదు సంవత్సరాల కాలానికి	2022-23 సంవత్సరానికి		
(1)	(2)		(3)	(4)	(5)	(6) = (4)-(5)
3	రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి	కేంద్ర వాటా	2,483	472	189	283
		రాష్ట్ర వాటా	827	157	63	ఎన్ఎ
4	ఆరోగ్య గ్రాంట్లు		2,228	419	419	0
5	ఆపద్సంరక్షణ ఆసుపత్రులకు గ్రాంట్లు		270	54	0	54
6	జిల్లా సమీకృత ప్రజారోగ్య సూచికలకు గ్రాంట్లు		27	6	0	6
7	అనుబంధ ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణకోసం గ్రాంట్లు		221	44	0	44
8	డి.ఎన్.బి. కోర్సులకు గ్రాంట్లు		106	16	0	16
9	ఉన్నత విద్యకు గ్రాంట్లు		189	36	0	36
10	రాష్ట్రాలకు వ్యవసాయం పనితీరు ఆధారంగా ప్రోత్సాహక గ్రాంట్లు		1665	333	0	333
11	ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన రోడ్ల నిర్వహణ కోసం గ్రాంట్లు		255	47	0	47
12	న్యాయ వ్యవస్థకు గ్రాంట్లు		245	49	0	49
13	గణాంకాల కోసం గ్రాంట్లు (మొత్తంగా జిల్లాకు ₹1.50 కోటి చొప్పున)		46	31	0	31
14	రాష్ట్ర నిర్దిష్ట గ్రాంట్లు		2,362	472	0	472

మూలం: ఆర్థిక పద్దులు, XV ఆర్థిక సంఘం నివేదికలు

#: తాగు నీటి కోసం, వర్షపు నీటి సేకరణ, సురక్షిత నీటి వ్యవస్థ, పారిశుధ్యం, ఎన్ఎ: వర్తించదు

** అంతకు ముందు సంవత్సరం అంతే మొత్తం అంటే ₹682 కోట్ల కొరత ఉంది*

*** అంతకు ముందు సంవత్సరం ₹345 కోట్ల కొరత ఉంది*

రాష్ట్ర ప్రభుత్వానికి (i) రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి కింద ₹283 కోట్లు, (ii) నిర్దిష్ట రంగ గ్రాంట్ల కింద (పై పట్టికలో అంశాలు 5 నుంచి 13 వరకు) ₹616 కోట్లు, (iii) రాష్ట్ర నిర్దిష్ట గ్రాంట్ల కింద ₹472 కోట్లు అందలేదని పై సమాచారాన్ని బట్టి గమనించవచ్చు.

- రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి విషయంలో పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సును భారత ప్రభుత్వం అంగీకరించినా, ₹472 కోట్లకు బదులుగా కేవలం ₹189 కోట్లను మాత్రమే విడుదల చేసింది. కనుక, ఈ సంవత్సరంలో ₹283 కోట్ల తగ్గుదల ఉంది.
- నిర్దిష్ట రంగ గ్రాంట్ల విషయంలో, పదిహేనో ఆర్థిక సంఘం గుర్తించిన రంగాలకు ప్రస్తుత, నూతన కేంద్ర ప్రతిపాదిక పథకాలకు, కేంద్ర పథకాలకు రూపకల్పన, అమలు చేసేటప్పుడు తగిన రీతిలో పరిగణించడం జరుగుతుందని తన వివరణ పత్రంలో భారత ప్రభుత్వం పేర్కొంది.
- రాష్ట్ర నిర్దిష్ట గ్రాంట్లు విషయానికి వస్తే, కేంద్ర ప్రభుత్వం ఆర్థిక పరంగా కట్టుబడి ఉన్న అంశాలను, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఉన్న ఏకీకృత వనరులను దృష్టిలో ఉంచుకుని పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సులను తగిన రీతిలో పరిగణించడం జరుగుతుందని భారత ప్రభుత్వం నిర్ణయించింది.

2.4.2 క్యాపిటల్ పద్దు కింద రాబడి

క్యాపిటల్ పద్దు కింద రాబడి అంటే అంతర్గత వనరుల నుంచి అందిన ప్రజాఋణం (అంటే, మార్కెట్టు ఋణాలు, ఆర్థిక సంస్థలు / వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న ఋణాలు), భారత ప్రభుత్వం నుంచి తీసుకున్న ఋణాలు - అడ్వాన్సులు, పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా అందిన మొత్తాల వంటి నానావిధమైన క్యాపిటల్ రాబడులు, ఇచ్చిన ఋణాలు – అడ్వాన్సుల తిరిగి వసూళ్లు ఉంటాయి. క్యాపిటల్ పద్దులో రాబడిలో పెరుగుదల, కూర్పుల సరళి ఈ కింది పట్టిక లో ఉంది.

పట్టిక 2.10: క్యాపిటల్ పద్దు కింద రాబడి పెరుగుదల, కూర్పుల సరళి

(₹ కోట్లలో)

రాష్ట్ర రాబడికి వనరులు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
క్యాపిటల్ పద్దు కింద రాబడి	22,312	29,855	39,653	42,983	32,702
నానావిధమైన క్యాపిటల్ రాబడులు	--	--	--	--	--
ఇచ్చిన ఋణాలు-అడ్వాన్సుల తిరిగి వసూళ్లు	66	62	58	48	629
నికర ప్రజాఋణం రాబడి #	22,246	29,793	39,595	42,935	32,073
నికర అంతర్గత ఋణం	22,646	30,025	37,420	38,662	30,089
నికర అంతర్గత ఋణం వృద్ధి రేటు (శాతం)	*6*	*33*	25	3	(-)22
భారత ప్రభుత్వం నుంచి నికర ఋణాలు-అడ్వాన్సులు	(-)400	(-)232	2,175$	4,273$	1,984
భారత ప్రభుత్వం నుంచి ఋణాలు-అడ్వాన్సుల వృద్ధి రేటు (శాతం)	(-)*279*	(-)*42*	1,038	97	(-)54
ఋణాల రూపేణా క్యాపిటల్ రాబడి వృద్ధి రేటు (శాతం)	3	34	33	8	(-)25
అప్పులు కాని క్యాపిటల్ రాబడి వృద్ధి రేటు (శాతం)	(-)52	(-)6	(-)6	(-)17	1,210
రాష్ట్ర స్థూల గృహోత్పత్తి వృద్ధి రేటు (శాతం)	14	11	-1	20	16
క్యాపిటల్ రాబడి వృద్ధి రేటు (శాతం)	2	34	33	8	(-)24

మూలం: ఆర్థిక పద్దులు; జి.ఎస్.డి.పి. గణాంకాలకు సంబంధించి గణాంకాలు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (2023 ఆగస్టు 01 నాటి గణాంకాలు)

2018-19 లో ₹21,823 కోట్లు, 2019-20 లో ₹37,248 కోట్లు, 2020-21 లో ₹69,454 కోట్లు, 2021-22 లో ₹67,274 కోట్లు, 2022-23 లో ₹82,823 కోట్ల చేబదుళ్లను (అంటే, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులను) మినహాయించగా

$ *జి.ఎస్.టి. పరిహారానికి బదులుగా 2020-21 లో ₹2,380 కోట్ల మేర, 2021-22 లో ₹4,569 కోట్ల మేర ఋణాల రూపంలో అంది, రాష్ట్ర ప్రభుత్వం తీర్చాల్సిన అవసరం లేని బ్యాక్-టు-బ్యాక్ ఋణాలతో సహా*

రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం సాపేక్షికంగా తక్కువ ఋణాలను స్వీకరించింది. అంతకు ముందు సంవత్సరం నికర క్యాపిటల్ పద్దు కింద రాబడి ₹42,983 కోట్లతో పోలిస్తే 2022-23 లోని ₹32,702 కోట్లు 24 శాతం తగ్గాయి. ప్రస్తుత సంవత్సరం నికర అంతర్గత ఋణాలు (₹30,089 కోట్లు) అంతకు ముందు సంవత్సరం కన్నా 22 శాతం తగ్గాయి.

మార్కెటు, ఆర్థిక సంస్థలు, కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకుని, భవిష్యత్తులో తీర్చాల్సిన బాధ్యతను కల్పించే ఋణాలతో కూడిన ప్రజాఋణం నుంచి రాబడి క్యాపిటల్ పద్దు కింద రాబడిలో ముఖ్య భాగం (98.08 శాతం). అంతకు ముందు సంవత్సరం, భారత ప్రభుత్వం నుంచి అందిన ఋణాలు, అడ్వాన్సులలో పెరుగుదలకు జి.ఎస్.టి. పరిహారంలో తగ్గుదలకు బదులుగా ఇచ్చిన బ్యాక్-టు- బ్యాక్ ఋణాల మొత్తం ₹4,569 కోట్లు కారణమైంది. 2022-23 లో అలాంటి ఋణాలు లేవు.

2.4.3 వనరుల సమీకరణలో రాష్ట్రం పని తీరు

సొంత పన్నుల నుంచి రాబడి, పన్నులు కాని ఇతర రాబడి విషయంలో పదిహేనో ఆర్థిక సంఘం అంచనాలు, బడ్జెటులో రాష్ట్ర ప్రభుత్వ అంచనాలతో పోలిస్తే వనరుల సమీకరణలో వాస్తవికంగా సాధన తీరును ఈ కింద చూపించడం జరిగింది:

పట్టిక 2.11: సొంత పన్నుల నుంచి రాబడి, పన్నులు కాని రాబడుల అంచనాలు – వాస్తవంగా వసూలు అయినవి

(₹ కోట్లలో)

	పదిహేనో ఆర్థికసంఘం ఉజ్జాయింపులు	బడ్జెటు అంచనాలు	వాస్తవాలు	వాస్తవాలతో పోలిస్తే తేడా (శాతం)	
				పదిహేనో ఆర్థికసంఘం ఉజ్జాయింపులు	బడ్జెటు అంచనాలు
సొంత పన్నుల నుంచి రాబడి	89,464	1,08,212	1,06,949	20	(-)1
పన్నులు కాని ఇతర రాబడి	13,969	25,422	19,554	40	(-)23

మూలం: పదిహేనో ఆర్థిక సంఘం ఉజ్జాయింపులు, బడ్జెటు అంచనాలు, ఆర్థిక పద్దులు

- సొంత పన్నుల రాబడి విషయంలో 2022-23 సంవత్సరానికి సంబంధించి పదిహేనో ఆర్థిక సంఘం అంచనాల కన్నా రాష్ట్రం గణనీయంగా ఎక్కువగా సాధించింది. బడ్జెటు అంచనాలతో దాదాపుగా సమానంగా ఉండడం బడ్జెటు అంచనాలు వాస్తవికంగా ఉన్నాయని సూచిస్తోంది.
- పన్నులు కాని ఇతర రాబడి పదిహేనో ఆర్థిక సంఘం అంచనాల కన్నా గణనీయంగా ఎక్కువగా అందింది. అయితే, ప్రభుత్వ బడ్జెటు అంచనాలకన్నా గణనీయంగా తక్కువగా ఉండడం పన్నులు కాని రాబడిని ఎక్కువా అంచనా వేశారని తెలియజేస్తోంది (వివరాల కోసం *పేరా 3.2.2.1* కూడా చూడవచ్చు).

2.5 వనరుల వినియోగం

ద్రవ్యబాధ్యత చట్టాల పరిమితులకు లోబడి ఖర్చు చేయడం, మూలధనంతో మౌలిక సదుపాయాలు అభివృద్ధి, సామాజిక రంగంలో చేయాల్సిన ఖర్చును పణంగా పెట్టకుండా ప్రస్తుతం కొనసాగుతున్న రాష్ట్ర ద్రవ్య సంస్కరణల పథాన్ని, సుస్థిరత ప్రక్రియను ధ్రువీకరించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉంది. రాష్ట్రం ఖర్చుల తీరును ఈ కింది పేరాలలో వివరించడం జరిగింది.

2.5.1 ఖర్చుల తీరు, పెరుగుదల

2018-19 నుంచి 2022-23 మధ్య కాలంలో మొత్తం వ్యయం, అందులోని అంశాలు, రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే సాపేక్షికమైన వాటాల వివరాలు ఈ కింది పట్టికలో ఉన్నాయి:

పట్టిక 2.12: పూర్తి వ్యయం, అందులోని అంశాలు

(₹ కోట్లలో)

కొలమానాలు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
మొత్తం వ్యయం	1,28,435	1,34,365	1,50,010	1,74,155	1,92,535
నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులు	97,083	1,08,798	1,23,212	1,36,804	1,53,406
మూలధన వ్యయం లేదా క్యాపిటల్ వ్యయం	22,641	16,859	15,922	28,874	17,881
ఇచ్చిన ఋణాలు - అడ్వాన్సులు	8,706	8,700	10,868	8,469	21,248
రాష్ట్రాల మధ్య సర్దుబాట్లు	05	08	08	08	00
రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో శాతంగా					
మొత్తం వ్యయం	15	14	16	15	15
నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులు	11	11	13	12	12
మూలధన వ్యయం లేదా క్యాపిటల్ వ్యయం	03	02	02	03	01
ఇచ్చిన ఋణాలు - అడ్వాన్సులు	01	01	01	01	02

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

రాష్ట్రం మొత్తం వ్యయం 2018-19 సంవత్సరంలో ఉన్న ₹1,28,435 కోట్ల నుంచి 50 శాతంపెరిగి 2022-23 లో ₹1,92,535 కోట్లకు చేరింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 11 శాతం పెరిగింది. రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో శాతంగా చూస్తే నిత్యవ్యావహారిక వ్యయం (లేదా రెవెన్యూ ఖర్చులు) అంతకు ముందు సంవత్సరం ఉన్న మేరకే 2022-23 లో కూడా ఉంది. మూలధన వ్యయం (లేదా క్యాపిటల్ వ్యయం) అటు వాస్తవికంగా సంఖ్యాపరంగానూ, రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో శాతంగానూ కూడా తగ్గింది. వ్యయానికి సంబంధించిన వివిధ అంశాల వాటాలను ఈ కింది పటంలో ప్రదర్శించడమైంది.

పటం 2.7: మొత్తం వ్యయంలో వివిధ భాగాంశాల వాటాల సరళి



మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

- మొత్తం వ్యయంలో నిత్య వ్యావహారిక వ్యయం వాటా అంతకు ముందు సంవత్సరంతో పోల్స్తే ఒక శాతం పాయింటు పెరిగింది.
- మూలధన వ్యయం వాటా గత ఐదు సంవత్సరాలలోకెల్లా ఈ సంవత్సరం అత్యల్పంగా ఉంది. ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సుల వాటా అత్యధికంగా ఉంది. అయితే, ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులలో చాలా వరకు ప్రభుత్వ బడ్జెటుకు ఆవలి ఋణాల తిరిగి చెల్లింపు నిమిత్తం ఇచ్చినవి కావడంతో ఇచ్చిన ఋణాలు అడ్వాన్సుల ఎక్కువ వాటా ప్రభుత్వ ఆస్తులను వాస్తవికంగా ప్రతిబింబించడం లేదు (*పేరా 2.5.3.3* చూడవచ్చు).

కార్యకలాపాలపరంగా చూస్తే, మొత్తం ఖర్చులలో (i) వడ్డీ చెల్లింపులతో సహా సాధారణ సేవలు, (ii) సామాజిక సేవలు, (iii) ఆర్థిక సేవలు, (iv) ఇతరాలు (స్థానిక సంస్థలకు గ్రాంట్లు, ఋణాలు-అడ్వాన్సులు, రాష్ట్రాల మధ్య సర్దుబాట్లతో సహా) వంటి ఖర్చులు ఉంటాయి. కార్యకలాపాల పరంగా మొత్తం ఖర్చుల సరళిని ఈ కింది పటంలో చూపడమైంది.

పటం 2.8: గత ఐదు సంవత్సరాల కాలంలో కార్యకలాపాల వారీగా ఖర్చుల సరళి



మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

* *ఇతరాలులో ఇచ్చిన ఋణాలు-అడ్వాన్సులు, స్థానిక సంస్థలకు ఇచ్చిన గ్రాంట్లు, రాష్ట్రాల మధ్య సర్దుబాట్లు ఉంటాయి*

సాధారణ సేవల వాటా ఇన్ని సంవత్సరాలుగా దాదాపు స్థిరంగా ఉంది. అయితే, సామాజిక, ఆర్థిక సేవల వాటా ప్రస్తుత సంవత్సరంలో తగ్గింది. ప్రస్తుత సంవత్సరంలో ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సుల వాటా పైన పేర్కొన్న విధంగా పెరిగింది.

2022-23 సంవత్సరంలో ఖర్చుల తీరును ఈ కింది పటంలో చూపడమైంది.

పటం 2.9: 2022-23 లో ఖర్చుల తీరు (శాతంలో)



మూలం: ఆర్థిక పద్దులు

గమనిక: పై పటంలో ఉన్న ఋణాలు, సహాయక గ్రాంట్లు, చందాలు అంటే స్థానిక సంస్థలకు, పంచాయితీ రాజ్ సంస్థలకు ఇచ్చే పరిహారం, అప్పగించిన మొత్తాలు. ప్రస్తుత సంవత్సరంలో అవి శూన్యం.

వ్యయంలో ప్రధాన భాగం ప్రజాఋణం తిరిగి చెల్లింపు మీద అయింది. తరువాతి స్థానం సామాజిక సేవలది. మూలధన వ్యయం 10 శాతం కన్నా తక్కువే.

2.5.2 నిత్య వ్యావహారిక వ్యయం (లేదా రెవెన్యూ ఖర్చులు)

నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులు అంటే ప్రస్తుత స్థాయిలో సేవలను కొనసాగించేందుకు, పాత చెల్లింపు బాధ్యతలను తీర్చేందుకు చేసే ఖర్చులు. ఈ ఖర్చులలో నిర్వహణ నిమిత్తం చేసే తదనంతర ఖర్చులు, రోజువారీ పనికోసం చేసే ఖర్చులు కూడా ఉంటాయి. అందువల్ల, ఈ ఖర్చుల వల్ల రాష్ట్ర మౌలిక సదుపాయాలకు గానీ, సేవల పరిధికి గానీ అదనంగా ఏమీ సమకూరదు. మొత్తంగా నిత్యవ్యావహారిక వ్యయం, దాని వృద్ధి రేటు, మొత్తం వ్యయంలో దాని నిష్పత్తి, రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో, రెవన్యూ రాబడితో పోలిస్తే దాని చలనగుణం వంటివి ఈ కింది పట్టికలో ఉన్నాయి.

పట్టిక 2.13: నిత్య వ్యావహారిక వ్యయం (లేదా రెవెన్యూ ఖర్చులు) - ప్రాథమిక కొలమానాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	కొలమానం	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
1	మొత్తం వ్యయం	1,28,435	1,34,365	1,50,010	1,74,155	1,92,535
2	రెవెన్యూ ఖర్చులు	97,083	1,08,798	1,23,212	1,36,804	1,53,406
3	నిత్య వ్యావహారిక వ్యయం వృద్ధి రేటు (శాతం)	14	12	13	11	12
4	మొత్తం వ్యయంలో నిత్య వ్యావహారిక వ్యయం శాతం	76	81	82	79	80
5	నిత్య వ్యావహారిక వ్యయం / రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (శాతం)	11	11	13	12	12
6	రెవెన్యూ రాబడిలో రెవెన్యూ ఖర్చుల శాతం	96	106	122	107	96
7	రాష్ట్ర స్థూల గృహోత్పత్తి వృద్ధి రేటు (శాతం)	14	11	(-)01	20	16
8	రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే నిత్య వ్యావహారిక వ్యయం చలనగుణం (నిష్పత్తి)	0.96	1.12	ఎన్‌సి	0.56	0.74
9	రెవెన్యూ రాబడి వృద్ధి రేటు (శాతం)	14	1	(-)2	26	25
10	రెవెన్యూ రాబడితో పోలిస్తే రెవెన్యూ ఖర్చుల చలనగుణం (నిష్పత్తి)	0.97	10.89	ఎన్‌సి	0.42	0.49

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

ఎన్‌సి: రాష్ట్ర స్థూల గృహోత్పత్తి లేదా రెవెన్యూ రాబడుల వృద్ధి రేటు ఋణాత్మకంగా ఉన్నందు వల్ల లెక్కించలేదు

గత ఐదు సంవత్సరాలలో నిత్య వ్యావహారిక వ్యయం 2018-19 లో ఉన్న ₹97,083 కోట్ల నుంచి 2022-23 లో ₹1,53,406 కోట్లకు ₹56,323 కోట్ల మేర (58 శాతం) పెరిగింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే నిత్య వ్యావహారిక వ్యయం 12 శాతం పెరిగింది. రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే నిత్య వ్యావహారిక వ్యయం 12 శాతంగా ఉంది. రెవెన్యూ రాబడితో, రాష్ట్ర స్థూల గృహోత్పత్తులతో పోలిస్తే నిత్య వ్యావహారిక వ్యయం చలనగుణాలు '1' కన్నా తక్కువగానే ఉండడం రెవెన్యూ రాబడి కన్నా, రాష్ట్ర స్థూల గృహోత్పత్తి కన్నా నిత్యవ్యావహారిక వ్యయం తక్కువ వేగంతో పెరుగుతోందని సూచిస్తోంది.

2022-23 సంవత్సరంలో వివిధ రంగాల వారీగా నిత్య వ్యావహారిక వ్యయం ఈ కింది విధంగా ఉంది:

పటం 2.10: 2022-23 సంవత్సరంలో రంగాల వారీగా నిత్య వ్యావహారిక వ్యయం (లేదా రెవెన్యూ ఖర్చులు)



మూలం: ఆర్థిక పద్దులు

గమనిక: పై పటంలో ఉన్న ఋణాలు, సహాయక గ్రాంట్లు, చందాలు అంటే స్థానిక సంస్థలకు, పంచాయితీ రాజ్ సంస్థలకు ఇచ్చే పరిహారం, అప్పగించిన మొత్తాలు. ప్రస్తుత సంవత్సరంలో అవి శూన్యం.

నిత్య వ్యావహారిక వ్యయంలో ప్రధాన భాగం సామాజిక సేవల (37 శాతం) మీద జరిగింది. దాదాపు 31 శాతం వడ్డీ చెల్లింపులు, పింఛనులు, పాలనాపరమైన సేవల వంటి సాధారణ సేవల మీద జరిగింది.

2.5.2.1 నిత్య వ్యావహారిక వ్యయంలో ముఖ్యమైన మార్పులు

అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్ర నిత్య వ్యావహారిక వ్యయానికి సంబంధించి వివిధ పద్దులలోని గణనీయమైన మార్పులను ఈ కింద చూపడమైంది:

పట్టిక 2.14: 2021-22 తో పోలిస్తే 2022-23 లో నిత్యవ్యావహారిక వ్యయంలో మార్పులు

(₹ కోట్లలో)

పెద్ద పద్దు	2021-22	2022-23	వ్యత్యాసం
పెరిగినవి			
సాధారణ సేవలు			
2049 - వడ్డీ చెల్లింపులు	19,161	21,821	2,660
2071 - పింఛన్లు, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలు	14,025	15,816	1,791
సామాజిక రంగం			
2202 - సాధారణ విద్య	13,844	16,483	2,639
2235 - సామాజిక భద్రత, సంక్షేమం	10,328	12,181	1,853
ఆర్థిక రంగం			
2801 - విద్యుత్తు	11,111	17,678	6,567
2515 - ఇతర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు	4,410	5,733	1,323
తగ్గినవి			
సామాజిక రంగం			
2225 - షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమం	15,450	11,537	(-)3,913
ఆర్థిక రంగం			
2435 - ఇతర వ్యవసాయ కార్యక్రమాలు	772	47	(-)725
3055 - రోడ్డు రవాణా	890	459	(-)432
2401 - పంటల పెంపకం	17,303	17,031	(-)272
2852 - పరిశ్రమలు	1,067	803	(-)264

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

గత సంవత్సరంతో పోలిస్తే ముఖ్యంగా ఈ కింది వాటి కారణంగా నిత్య వ్యావహారిక వ్యయం పెరిగింది:

- విద్యుత్తు రంగంలో 'ఉదయ్ పథకం కింద డిస్కంముల నష్టాలను స్వీకరించడం' కోసం గణనీయమైన స్థాయిలో ₹7,061 కోట్ల వ్యయం జరిగింది;
- రాష్ట్రాభివృద్ధి ఋణాలపై వడ్డీ చెల్లింపులు ఎక్కువ (₹2,632 కోట్లు) కావడం (*పేరా 3.2.2.5* కూడ చూడవచ్చు);
- పింఛన్లు, ఇతర పదవీ విరమణ ప్రయోజనాల కింద విభజనకు పూర్వపు సేవా పింఛన్లు (₹1,435 కోట్లు), విభజనకు పూర్వపు కుటుంబ పింఛన్లు (₹684 కోట్లు), విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కేటాయించదగిన సేవా పింఛన్ల (₹795 కోట్లు) చెల్లింపులు పెరగడం (*పేరా 3.2.2.6* కూడ చూడవచ్చు);
- ఇతర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల కింద గ్రామ పంచాయితీలకు సహాయం కోసం ₹1,904 కోట్ల మేర గణనీయమైన వ్యయం;
- సామాజిక భద్రత, సంక్షేమం కింద ఆసరా పింఛన్ల మీద చెల్లింపులు ఎక్కువ (₹1,093 కోట్లు) కావడం;
- సాధారణ విద్య కింద మండల ప్రజా పరిషత్తులకు బోధన గ్రాంట్ల మీద ₹831 కోట్ల మేర, జిల్లా ప్రజా పరిషత్తులు బోధన గ్రాంట్లు మీద ₹843 కోట్ల మేర చెల్లింపులు ఎక్కువ కావడం.

దళిత బంధు పథకం కింద ఖర్చు తగ్గడం (₹2,442 కోట్లు) వల్ల షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమం వ్యయం తగ్గింది.

2018-23 మధ్య ఐదు సంవత్సరాల కాలానికి సంబంధించిన సమాచారం మీద చేసిన ఆడిటు విశ్లేషణలో నిత్య వ్యావహారిక వ్యయం (₹5,000 కోట్లు లేదా అంత కన్నా ఎక్కువ) ప్రధానంగా ఈ కింది పథకాలు/ఉప-పద్దులపై జరిగిందని వెల్లడైంది:

పట్టిక 2.15: 2018-19 నుంచి 2022-23 మధ్య కాలంలో నిత్య వ్యావహారిక వ్యయం గణనీయంగా జరిగిన ముఖ్యమైన పథకాలు/ఉప పద్దులు

(₹ కోట్లలో)

సామాజిక సేవలు		ఆర్థిక సేవలు	
ఆసరా పింఛన్లు (దివ్యాంగులు, వితంతువులు, నేత కార్మికులు, గీత కార్మికులకు పింఛన్లు, వృద్ధాప్య పింఛన్లతో సహా)	42,296	పెట్టుబడి మద్దతు పథకం (రైతు బంధు)	64,970
మండల ప్రజా పరిషత్తులకు బోధన గ్రాంట్లు	20,777	వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు రాయితీ కొరకు ట్రాన్స్‌కోకు సహాయం	41,468
జిల్లా ప్రజా పరిషత్తులకు బోధన గ్రాంట్లు	19,213	రైతులకు బీమా	5,738
కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్	9,999		
బియ్యంపై రాయితీ (మానవ వనరుల అభివృద్ధి)	8,482		
జాతీయ ఆరోగ్య మిషన్	6,899		
తెలంగాణ దళిత బంధు	6,442		

మూలం: గత ఐదు సంవత్సరాల ఆర్థిక పద్దులు

గత ఐదు సంవత్సరాలలో సామాజిక రంగం కింద అత్యధిక వాటా ఆసరా పింఛన్ల సంబంధిత ఖర్చులదే అని పై పట్టికను బట్టి గమనించవచ్చు. ఆర్థిక రంగం కింద వ్యవసాయంలో రెండు పథకాల మీద ₹1,06,438 కోట్లు ఖర్చు అయిందని కూడా గమనించవచ్చు.

నిత్య వ్యావహారిక వ్యయంలో ముఖ్యమైన అంశాల సరళిని ఈ కింది పటాలలో చూపడం జరిగింది:

పటం 2.11: సామాజిక రంగంలో నిత్య వ్యావహారిక వ్యయం కింద ముఖ్యమైన అంశాల సరళి



పటం 2.12: ఆర్థిక రంగంలో నిత్య వ్యావహారిక వ్యయం కింద ముఖ్యమైన అంశాల సరళి



మూలం: గత ఐదు సంవత్సరాల ఆర్థిక పద్దులు

గత ఐదు సంవత్సరాలలో ఆసరా పింఛన్ల మీద ఖర్చు దాదాపు రెండింతలు అయింది. బోధన గ్రాంట్ల మీద ఖర్చు కూడా గణనీయంగా పెరిగింది. 2018-19 లో మొదలైన పెట్టుబడి మద్దతు పథకం మీద ఖర్చు తొలి రెండు సంవత్సరాలు గణనీయంగా పెరిగి, అటు తర్వాత మూడు సంవత్సరాల పాటు దాదాపు అదే స్థాయిలో ఉంది. వ్యవసాయం, అనుబంధ రాయితీల కోసం ట్రాన్స్‌కోకు సహాయం మీద ఖర్చు అంతకు ముందు రెండు సంవత్సరాలు అమాంతంగా పెరిగినా 2022-23 లో స్వల్పంగా తగ్గింది.

2.5.2.2 తప్పనిసరి ఖర్చులు, వెసులుబాటు లేని ఖర్చులు

రెవెన్యూ పద్దు కింద రాష్ట్ర ప్రభుత్వపు తప్పనిసరి ఖర్చులలో వడ్డీ చెల్లింపులు, జీతాలు-వేతనాలు, పింఛన్ల మీద ఖర్చులు ఉంటాయి. ప్రభుత్వ ఖర్చులో తొలి ప్రాథమ్యం వీటికే ఉంటుంది. ఇంతే కాకుండా, మూలధన వ్యయం వంటి వెసులుబాటు ఉన్న లావాదేవీల మాదిరిగా కాకుండా సాధారణంగా మార్చలేని ఖర్చులు, వార్షిక ప్రాతిపదికన శాసనవిహితంగా చేయాల్సిన ఖర్చుల లాంటి వెసులుబాటు లేని ఖర్చులు కూడా ఉంటాయి. ఉదాహరణకు ఈ కింది అంశాలను వెసులుబాటు లేని ఖర్చులుగా పరిగణించవచ్చు.

(i) స్థానిక సంస్థలకు పంపకం – జీతభత్యాల కోసం స్థానిక సంస్థలకు శాసనవిహితమైన పంపకం (మూలధన వ్యయం కోసం పంపకం / బదలాయింపు)

(ii) రిజర్వు నిధులకు జమ చేయాల్సిన శాసనవిహితమైన ఆవశ్యకత – సంచిత ఋణ విమోచన నిధి, పూచీకత్తుల విముక్తి నిధి, రాష్ట్ర విపత్తు నివారణ / ప్రతిస్పందన నిధి వంటివి

(iii) ఆకస్మిక ఖర్చుల నిధికి తిరిగి జమ చేయడం – సంవత్సరంలోగా తిరిగి జమ చేసిన మొత్తం

(iv) శాసనవిహితంగా రిజర్వు నిధి / ఇతర సంస్థలకు బదిలీ చేయాల్సిన శిస్తు – ఏకీకృత సమన్వయ సంస్థలకు రాష్ట్ర వాటాను బదిలీ చేసిన / రాష్ట్రం చేసిన ఖర్చు

(v) కేంద్ర ప్రాయోజిత పథకాల విషయంలో అందిన కేంద్ర నిధికి ప్రతిగా వాటాను జమ చేయడం - ఏకీకృత సమన్వయ సంస్థలకు రాష్ట్ర వాటాను బదిలీ చేసిన / రాష్ట్రం చేసిన ఖర్చు

(vi) వడ్డీతో కూడిన నిధిలోని మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి ఉంటే వచ్చి ఉండే వడ్డీ చెల్లింపు, శాసనసభ ఓటుతో నిమిత్తం లేకుండా చేయాల్సిన ప్రజా ఋణం మీద వడ్డీ చెల్లింపు – వడ్డీ చెల్లింపు

తప్పనిసరి ఖర్చులు పైపైకి పెరుగుతూ ఉంటే అభివృద్ధి వ్యయం విషయంలో ప్రభుత్వానికి వెసులుబాటు తగ్గిపోతుంది. తప్పనిసరి ఖర్చులు, వెసులుబాటు లేని ఖర్చులు, వాటిలోని అంశాల సరళిని ఈ కింది పట్టికలో విశ్లేషించడమైంది:

పట్టిక 2.16: తప్పనిసరి ఖర్చులు, వెసులుబాటు లేని ఖర్చుల అంశాలు

(₹ కోట్లలో)

తప్పనిసరి ఖర్చులు, వెసులుబాటు లేని ఖర్చుల అంశాలు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
తప్పనిసరి ఖర్చులు					
జీతాలు, వేతనాలు	23,011	24,195	24,654	30,256	35,130
పింఛన్ల ఖర్చు	11,477	11,834	13,599	14,025	15,816
వడ్డీ చెల్లింపులు	12,586	14,386	16,841	19,161	21,821
ఉప-మొత్తం	**47,074**	**50,415**	**55,094**	**63,442**	**72,767**
వెసులుబాటు లేని ఖర్చులు					
స్థానిక సంస్థలకు శాసనవిహితమైన పంపకం	1,466	3,386	5,945	3,293	2,827
రిజర్వు నిధులకు జమ	1,002	1,250	599	479	252
ఆకస్మిక ఖర్చుల నిధికి తిరిగి జమ	0.09	2.10	4.21	0.00	0.05
కేంద్ర ప్రాయోజిత పథకాల విషయంలో అందిన కేంద్ర నిధికి ప్రతిగా రాష్ట్ర వాటాను జమ చేయడం	సమాచారం లేదు	సమాచారం లేదు	సమాచారం లేదు	2,167	3,282
వడ్డీతో కూడిన నిధిలోని మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి ఉంటే వచ్చి ఉండే వడ్డీ చెల్లింపు, శాసనసభ ఓటుతో నిమిత్తం లేకుండా చేయాల్సిన ప్రజా ఋణం మీద వడ్డీ చెల్లింపు – వడ్డీ చెల్లింపు	సమాచారం లేదు	23	213	182	131
ఉప మొత్తం	**2,468**	**4,661**	**6,761**	**6,121**	**6,492**
రెవెన్యూ రాబడిలో శాతంగా					
జీతాలు, వేతనాలు	23	24	24	24	22

తప్పనిసరి ఖర్చులు, వెసులుబాటు లేని ఖర్చుల అంశాలు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
పింఛన్లు ఖర్చు	11	11	14	11	10
వడ్డీ చెల్లింపులు	12	14	17	15	14
ఉప మొత్తం	46	49	55	50	46
రెవెన్యూ రాబడిలో శాతంగా వెసులుబాటు లేని ఖర్చు					
ఉప మొత్తం	02	05	07	05	04
నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులలో శాతంగా వెసులుబాటు లేని ఖర్చు					
ఉప మొత్తం	03	04	05	05	04
తప్పనిసరి కాని నిత్య వ్యావహారిక వ్యయం	50,009	58,383	68,118	73,362	80,639
మొత్తం వ్యయం	1,28,435	1,34,365	1,50,010	1,74,155	1,92,535
మొత్తం వ్యయంలో శాతం	39	43	45	42	42
మొత్తం తప్పనిసరి ఖర్చులు, వెసులు బాటు లేని ఖర్చులు	49,542	55,076	61,855	69,563	79,259
మొత్తం వ్యయంలో శాతం	39	41	41	40	41
రాయితీలు	6,304	6,846	9,566	10,218	9,634
తప్పనిసరి కాని వ్యయంలో రాయితీల శాతం	13	12	14	14	12

మూలం: గత ఐదు సంవత్సరాల ఆర్థిక పద్దులు

రెవెన్యూ రాబడిలో శాతంగా చూస్తే తప్పనిసరి ఖర్చులు 46 శాతంగా ఉన్నాయి. గత ఐదేళ్లలో ఇది అత్యల్పం. కాబట్టి, సంక్షేమం, అభివృద్ధి కార్యకలాపాలు వంటి తప్పనిసరి కాని ఖర్చులు చేసేందుకు మరింత అవకాశం ఉంది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే తప్పనిసరి ఖర్చులలోని అన్ని అంశాల ఖర్చు సంఖ్యాపరంగా చూస్తే పెరిగినా, రెవెన్యూ రాబడిలో శాతంగా చూస్తే మాత్రం తగ్గాయి.

వెసులుబాటు లేని ఖర్చులు రెవెన్యూ రాబడిలో 02 నుంచి 07 శాతం, నిత్య వ్యావహారిక వ్యయంలో 03 నుంచి 05 శాతం ఉన్నాయి.

గత ఐదు సంవత్సరాలలో మొత్తం వ్యయంలో తప్పనిసరి కాని ఖర్చులు 39 నుంచి 45 శాతంగా ఉన్నాయి. తప్పనిసరి కాని ఖర్చులలో రాయితీలు 12 నుంచి 14 శాతం వరకు ఉన్నాయి. దీని వల్ల సంక్షేమం, అభివృద్ధి కార్యకలాపాలకు ఆర్థికపరమైన అవకాశం తగ్గిపోతుంది.

గత ఐదు సంవత్సరాలుగా మొత్తం నిత్య వ్యావహారిక వ్యయం (లేదా రెవెన్యూ ఖర్చు) లో తప్పనిసరి ఖర్చుల వాటాను ఈ కింది పటంలో చూపడం జరిగింది:

పటం 2.13: 2018-19 నుంచి 2022-23 మధ్య కాలంలో నిత్య వ్యావహారిక వ్యయంలో తప్పనిసరి ఖర్చుల వాటా



మూలం: ఆర్థిక పద్దులు

2022-23 సంవత్సరంలో తప్పనిసరి ఖర్చులు నిత్య వ్యావహారిక వ్యయంలో 47 శాతం ఉన్నాయి. తప్పనిసరి ఖర్చులు, వెసులుబాటు లేని ఖర్చులు కలిపి నిత్య వ్యావహారిక వ్యయంలో 51 శాతం ఉన్నాయి. నిత్య వ్యావహారిక వ్యయంలో శాతంగా చూస్తే, తప్పని సరి ఖర్చులలోని భాగాంశాలు, అంటే జీతాలు, వేతనాలు, పింఛన్లు, వడ్డీ చెల్లింపులు అన్నీ పెరిగాయి.

ఇటీవలి సంవత్సరాలలో ప్రభుత్వం మార్కెటు ఋణాల మీద ఎక్కువగా ఆధారపడడం వల్ల వడ్డీ చెల్లింపుల రూపంలో తప్పనిసరి బాధ్యతలు పెరిగాయి. పర్యవసానంగా, 2018-23 మధ్య ఐదు సంవత్సరాల అవధిలో వడ్డీ చెల్లింపులు ₹12,586 కోట్ల నుంచి ₹21,821 కోట్లకు 73 శాతం పెరిగాయి. నిత్య వ్యావహారిక వ్యయంలో వడ్డీ చెల్లింపుల శాతం ఏటేటా పెరుగుతోందని పై పట్టికలో చూడవచ్చు.

ఇవి కాకుండా, ఏడు సంస్థలు తీసుకున్న ఋణాలపై వడ్డీ చెల్లింపు నిమిత్తం మరిన్ని ఋణాల[11] రూపేణా ప్రభుత్వం ₹8,696 కోట్లను చెల్లించింది. ఈ వడ్డీ చెల్లింపులు బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించినవిగా ఉన్నాయి (*పేరా 2.7.2* ని చూడవచ్చు).

2.5.2.3 జాతీయ పింఛను వ్యవస్థ పథకం కింద చెల్లించకుండా మిగిలి ఉన్న బాధ్యత

2004 సెప్టెంబరు 1 తేదీన లేదా ఆ తరువాత ప్రభుత్వ సేవలలోకి కొత్తగా ప్రవేశించేవారికి వర్తించే 'జాతీయ పింఛను వ్యవస్థ' పథకాన్ని భారత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం ప్రకారం, మూలవేతనం, కరువు భత్యాలలో 10 శాతం మొత్తాన్ని ఉద్యోగులు ప్రతి నెలా తమ వాటాగా చెల్లించాలి. దానికి సమానమైన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా జమ చేయాలి. ఉద్యోగి వాటాను, యాజమాన్యం వాటాను కలిపి తొలుత ప్రజాపద్దుకు (పెద్ద పద్దు '8342-117 – నిర్ధారిత వాటా పింఛను పథకం (డిఫైన్డ్ కంట్రిబ్యూటరీ పెన్షను స్కీమ్)') బదిలీ చేయడం జరుగుతుంది. మార్గదర్శకాల ప్రకారం ఇటు ఉద్యోగి, అటు యాజమాన్యం సమకూర్చిన వాటాలను తదుపరి పెట్టుబడి పెట్టే నిమిత్తం నియమితమైన సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్.ఎస్.డి.ఎల్.) / ట్రస్టీ బ్యాంకు వద్ద జమ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది.

ఆర్థిక పద్దుల ప్రకారం 2022 ఏప్రిల్ 01 నాటికి జాతీయ పింఛను వ్యవస్థ డిపాజిట్ పద్దులో ప్రభుత్వ ఉద్యోగుల నిర్ధారిత వాటా పింఛను పథకం కింద ₹314 కోట్ల ప్రారంభ నిల్వ ఉంది. ఈ ఏడాదిలో జాతీయ పింఛను వ్యవస్థ డిపాజిట్ ఖాతాకు ₹2,214 కోట్లు[12] అందాయి. అందుబాటులో ఉన్న ₹2,528 కోట్ల నుంచి ప్రభుత్వం నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్‌కు ₹1,455 కోట్లను బదిలీ చేయడం జరిగింది. ఇంకా బదిలీ చేయాల్సిన మొత్తం ₹1,073 కోట్లు[13].

జాతీయ పింఛను వ్యవస్థ నిబంధనల ప్రకారం ఉద్యోగులు జమచేసిన వాటాకు సమానమైన వాటాను రాష్ట్ర ప్రభుత్వం కూడా జమచేయాలి. ప్రభుత్వ వాటాను జమ చేయడంలో ఈ సంవత్సరం ₹114 కోట్లు తగ్గుదల, మొత్తంగా గత ఎనిమిది సంవత్సరాలలో ₹180 కోట్ల[14] తగ్గుదల ఉంది. పర్యవసానంగా ప్రస్తుత బాధ్యతను భవిష్యత్తు సంవత్సరాలకు వాయిదా వేసినట్లైంది. పైగా, 2023 మార్చి చివరి నాటికి ₹1,253 కోట్ల (ప్రభుత్వ వాటాను జమ

---

[11] ఈ సంస్థలకు వడ్డీ చెల్లింపుల నిమిత్తం ఋణాలను అందజేయడం జరిగిందని చెల్లింపు పత్రాలను (వోచర్లు) బట్టి గమనించడమైంది: (i) కాళేశ్వరం నీటి పారుదల ప్రాజెక్టు సంస్థ (₹6,608 కోట్లు); (ii) తెలంగాణ రాష్ట్ర జలవనరుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (₹1,106 కోట్లు); (iii) తెలంగాణ తాగు నీటి సరఫరా సంస్థ (₹581 కోట్లు); (iv) తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ (₹212 కోట్లు); (v) తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్థిక సంస్థ (₹127 కోట్లు); (vi) తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (₹40 కోట్లు); (vii) తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ (₹22 కోట్లు). మిగతా వాటి విషయంలో వడ్డీ చెల్లింపుల వివరాలు లభ్యం కాలేదు.

[12] ఇందులో ఉద్యోగుల వాటా ₹1,136 కోట్లు, ప్రభుత్వ వాటా ₹1,022 కోట్లు, ఇంకా సరి పోల్చి చూడడం జరుగుతున్న మొత్తం ₹55 కోట్లు కలిసి ఉన్నాయి

[13] 2023 మార్చి నాటికి ప్రజా పద్దులోని ప్రభుత్వ ఉద్యోగులకు నిర్ధారిత పింఛను పథకం డిపాజిట్ ఖాతాలో ఉన్న మొత్తం

[14] ఉద్యోగుల వాటా ₹5,387 కోట్లు (-) ప్రభుత్వ వాటా ₹5,207కోట్లు

చేయడంలో తగ్గుదల మొత్తం, నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్‌కు ఇంకా బదిలీ చేయాల్సి ఉన్న మొత్తం కలిపి) మీద నివారించదగిన వడ్డీ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకుంది. 2004 సెప్టెంబరు 01 నుంచి 2011 మార్చి 31 నాటి వరకు మధ్య కాలానికి తప్ప వడ్డీ చెల్లింపు విషయమై ప్రభుత్వ ఆదేశాలు లేవని ఖజానాలు, లెక్కల డైరెక్టరు తెలిపారు (2023 సెప్టెంబరు) (వడ్డీ బాధ్యతను నెరవేర్చని విషయమై *పేరా 4.2* ని చూడవచ్చు).

పూర్వపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2014 లో విభజన జరిగే నాటికి జాతీయ పింఛను వ్యవస్థ డిపాజిట్ ఖాతాలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెంది, ఎన్.ఎస్.డి.ఎల్.కి బదిలీ చేయాల్సి ఉన్న మొత్తం ₹730 కోట్లు. ఈ మొత్తాన్ని విభజిత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య పంచాల్సి ఉంది. ఈ మొత్తంలో ₹365 కోట్లను 2018-19 లో పంచగా, తెలంగాణకు ₹135 కోట్ల కేటాయింపు అయింది. 2019-23 మధ్య కాలంలో పంపకాలేవీ జరుగకపోవడంతో 2023 మార్చి నాటికి ఇంకా ₹365 కోట్లను పంచాల్సి ఉంది.

ఆర్థిక పద్దులకు, ఖజానా శాఖ వద్ద ఉన్న సమాచారానికి మధ్య ఈ కింది తేడాలు ఉన్నాయని ఖజానాలు - లెక్కల డైరెక్టరు తెలిపారు (2023 సెప్టెంబరు).

పట్టిక 2.17: ఆర్థిక పద్దులు, ఖజానాలు-లెక్కల డైరెక్టరు అందజేసిన సమాచారం ప్రకారం చందాలు, ఎన్.ఎస్.డి.ఎల్.కు బదిలీల వివరాలు

(₹ కోట్లలో)

	ఆర్థిక పద్దుల ప్రకారం	ఖజానాలు-లెక్కల డైరెక్టరు అందజేసిన సమాచారం
ఈ సంవత్సరం ఉద్యోగుల చందా	1,136	932
ఈ సంవత్సరం ప్రభుత్వం జమ చేసిన మొత్తం	1,022	861
ఎన్.ఎస్.డి.ఎల్. కు బదిలీ చేసిన మొత్తం	1,455	1,220
ఎన్.ఎస్.డి.ఎల్. కు బదిలీ చేయాల్సి ఉన్న మొత్తం	1,073	446
పంపకం జరిగిన మొత్తం	365	345

మూలం: ఆర్థిక పద్దులు, ఖజానాలు-లెక్కల శాఖ డైరెక్టరు అందజేసిన సమాచారం

ఈ విషయమై ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్, ఎన్టైటిల్మెంట్స్) తో పరిష్కరించుకునే ప్రయత్నం ప్రారంభించడం జరిగిందని ఖజానాలు-లెక్కల శాఖ డైరెక్టరు తెలిపారు (2023 సెప్టెంబరు).

2.5.2.4 రాయితీలు

2018-19 నుండి 2022-23 వరకు ఐదేళ్లలో రాయితీల కోసం చేసిన ఖర్చుల వివరాలు ఈ కింది పట్టికలో ఉన్నాయి.

పట్టిక 2.18: రాయితీల మీద చేసిన ఖర్చు

	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
రాయితీలు (₹ కోట్లలో)	6,304	6,846	9,566	10,218	9,634
రెవెన్యూ రాబడిలో రాయితీల శాతం	06	07	09	08	06
రెవెన్యూ ఖర్చులలో రాయితీల శాతం	06	06	08	07	06

మూలం: ఆర్థిక పద్దులు

- అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే రాయితీలు ₹584 కోట్లు (6 శాతం) తగ్గాయి. రెవెన్యూ రాబడిలో శాతాంనూ, నిత్య వ్యావహారిక వ్యయం అంటే రెవెన్యూ ఖర్చులలో శాతంగానూ రాయితీలు ప్రస్తుత సంవత్సరంలో తగ్గాయి. ముఖ్యంగా, (i) వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలపై రాయితీ నిమిత్తం విద్యుతు ప్రసార సంస్థ (ట్రాన్స్‌కో) కు సహాయం (₹396 కోట్ల తగ్గుదల), (ii) వివిధ వర్గాల పౌరులకు కల్పించిన రాయితీలను తిరిగి చెల్లించే నిమిత్తం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థకు సహాయం (₹331 కోట్ల తగ్గుదల) లో తగ్గుదలల కారణంగా రాయితీల మీద ఖర్చు తగ్గింది.

- మొత్తం రాయితీల్లో 99 శాతం కేవలం మూడు అంశాలదే. అవి: (i) వ్యవసాయ, అనుబంధ రాయితీల నిమిత్తం తెలంగాణ విద్యుతు ప్రసార సంస్థ (ట్రాన్స్మిషన్ కార్పొరేషన్) కు సహాయం (₹7,665 కోట్లు, 80 శాతం); (ii) బియ్యంపై రాయితీ (మానవ వనరుల అభివృద్ధి) (₹1,341 కోట్లు, 14 శాతం); (iii వివిధ వర్గాల పౌరులకు కల్పించిన రాయితీలను చెల్లించే నిమిత్తం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థకు సహాయం (₹459 కోట్లు, 5 శాతం).

(i) పరోక్షపు రాయితీలు

పరోక్షపు రాయితీలు అంటే ప్రభుత్వం సామాజిక, ఆర్థికపరమైన వస్తువులు /సేవలను ప్రభుత్వం ఆ వస్తువులు /సేవల మీద చేసిన ఖర్చు కన్నా తక్కువ ధరకే అందించే సేవలలో తగ్గింపు మొత్తాన్ని నేరుగా కాకుండా పరోక్షంగానో, వస్తు రూపకంగానో ఇచ్చినా, నిర్దిష్టంగా రాయితీలు అంటూ పేర్కొననివి. ఈ కింది వాటిని పరోక్షపు రాయితీలుగా పరిగణించవచ్చు:

- వ్యవసాయం, అనుబంధ రాయితీల కోసం తెలంగాణ విద్యుతు ప్రసార సంస్థ (ట్రాన్స్కో) కు సహాయం నిమిత్తం ప్రభుత్వం రాయితీల రూపేణా ₹7,665 కోట్లను ఇచ్చిందని పైన పేర్కొనడం జరిగింది. ఇవి కాకుండా, వాటి నిమిత్తమే మరో ₹2,835 కోట్లను కూడా ప్రభుత్వం సహాయక ప్రదానాలు (గ్రాంట్లు) గా ఇచ్చింది. అందులో ₹1,785 కోట్ల చిన్న పద్దు షెడ్యూల్డు కులాలకు ప్రత్యేక ప్రణాళిక కింద, ₹1,050 కోట్లను చిన్న పద్దు గిరిజన ప్రాంత ఉప ప్రణాళిక కింద ఇవ్వడం జరిగింది. అదే ప్రయోజనం కోసం ₹2,835 కోట్లను ఇతర పద్దుల కింద సహాయక గ్రాంట్లుగా ఇవ్వడం వెనుక కారణం తెలియరావడం లేదు.
- పరిశ్రమలకు విద్యుతు రాయితీ (₹101 కోట్లు), తెలంగాణ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థకు నిర్వహణ రాయితీ (₹40 కోట్లు) నిమిత్తం సహాయక గ్రాంట్ల రూపంలో ఇవ్వడం జరిగింది.

2.5.2.5 స్థానిక సంస్థలకు, ఇతర సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం

రాష్ట్ర ప్రభుత్వం 2022-23 లో స్థానిక సంస్థలకు, ఇతర సంస్థలకు సహాయక ప్రదానాలు (లేదా గ్రాంట్లు), ఋణాల రూపంలో ₹69,317 కోట్లు అందజేసింది. అంతకు ముందు సంవత్సరం కన్నా ఇది ₹7,917 కోట్లు ఎక్కువ.

పట్టిక 2.19: స్థానిక సంస్థలకు, ఇతర సంస్థలకు ఆర్థిక సహాయం

(₹ కోట్లలో)

సంస్థ	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
(ఎ) స్థానిక సంస్థలు					
పట్టణ స్థానిక సంస్థలు: మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు	1,542	1,359	3,785	2,698	4,110
పంచాయితీరాజ్ సంస్థలు: జిల్లా ప్రజా పరిషత్తులు, మండల ప్రజా పరిషత్తులు, గ్రామ పంచాయితీలు	5,996	7,273	8,538	8,521	11,127
మొత్తం(ఎ)	**7,538**	**8,632**	**12,323**	**11,219**	**15,237**
(బి) ఇతరాలు					
విద్యా సంస్థలు (ఎయిడెడ్ పాఠశాలలు, ఎయిడెడ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వగైరా)	1,037	965	985	1,032	1,134
ప్రాధికార అభివృద్ధి సంస్థలు	236	154	246	355	241
శాసనవిహితమైన కార్పొరేషన్లు	1,409	1,421	2,632	3,370	3,205
సహకార సంస్థలు	229	68	15	167	81
ప్రభుత్వేతర సంస్థలు	775	962	511	600	555
ఇతర సంస్థలు*	26,684	32,765	37,572	44,657	48,864
మొత్తం (బి)	**30,370**	**36,335**	**41,961**	**50,181**	**54,080**
మొత్తం (ఎ+బి)	**37,908**	**44,967**	**54,284**	**61,400**	**69,317**

సంస్థ	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
జీతాల నిమిత్తం సహాయక ప్రదానాలు (లేదా సహాయక గ్రాంట్లు)	6,563	6,957	7,192	8,533	9,848
ఆస్తుల నిర్మాణం నిమిత్తం సహాయక ప్రదానాలు	7	0	139	693	613
జీతాల నిమిత్తం కాక సహాయక ప్రదానాలు	31,337	38,010	46,953	52,174	58,856
వస్తు రూపేణ ఇచ్చిన సహాయక ప్రదానాలు	రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇవ్వలేదు				
నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులు	97,083	1,08,798	1,23,212	1,36,804	1,53,406
నిత్య వ్యావహారిక వ్యయంలో శాతంగా సహాయం	39.05	41.33	44.06	44.88	45.19

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

* *ఇతర సంస్థలు అంటే ఈ ఏడాదిలో తాత్కాలిక లేదా ఒకసారి గ్రాంట్లు అందుకున్నవి. అందులో ముఖ్యంగా పెట్టుబడి మద్దతు పథకం (₹14,366 కోట్లు), ఆసరా పింఛన్లు (₹6,383 కోట్లు), తెలంగాణ దళిత బంధు (₹2,000 కోట్లు), వయోవృద్ధులకు, వితంతువులకు ఆసరా పింఛన్లు (₹1,863 కోట్లు), కళ్యాణ లక్ష్మి (₹1,544 కోట్లు), రైతులకు బీమా (₹1,448 కోట్లు) సమగ్ర శిక్ష (₹1,216 కోట్లు) మొదలైనవి ఉన్నాయి (పూర్తి వివరాలు ఆర్థిక పద్దులలోని అనుబంధం III లో ఉన్నాయి)*

ప్రభుత్వ వ్యయం క్రమేణా సహాయక ప్రదానాల రూపం దాలుస్తున్నాయని పై పట్టికను బట్టి గమనించవచ్చు. 2018-19 సంవత్సరంలో నిత్య వ్యావహారిక వ్యయంలో 39 శాతం ఆర్థిక సహాయం రూపంలో ఉండగా 2022-23 లో 45 శాతం కన్నా ఎక్కువ ఉంది.

2022-23 లో ఆర్థిక సహాయంపెరగడానికి ముఖ్య కారణాలు ఉదయ్ కింద డిస్కముల నష్టాలను స్వీకరించే నిమిత్తం చేసిన ₹7,061 కోట్ల ఖర్చు, గ్రామ పంచాయితీలకు సహాయం నిమిత్తం చేసిన ₹1,876 కోట్ల ఖర్చు.

పేటిక 2.2: రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు

భారత రాజ్యాంగంలోని అధికరణ 23-I (1) తో పాటు 243 Y (1) నిర్దేశించిన విధంగా, భారత రాజ్యాంగానికి 73 వ సవరణ జరిగిన (1992) ఒక సంవత్సరం లోగా, అటు తర్వాత ప్రతి ఐదు సంవత్సరాల చివరిలో, రాష్ట్రంలోని పంచాయితీ రాజ్ సంస్థల, పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితిని సమీక్షించడం కోసం, రాష్ట్రానికి, పంచాయితీరాజ్ సంస్థలకు / పట్టణ స్థానిక సంస్థలకు మధ్య రాష్ట్రం విధించే విభాజ్యయోగ్యమైన సుంకాల పంపిణీకి సంబంధించిన సూత్రాలను సిఫార్సు చేయడం కోసం రాష్ట్ర గవర్నరు ఒక రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి.

2014 లో తెలంగాణ ఏర్పడిన ఏడాది లోగానే రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు ప్రకటన జారీ అయింది (2015 మార్చి). అయితే, దాదాపు మూడేళ్ల తర్వాతనే చైర్మన్, ఒక సభ్యుని నియమాకం జరిగినా (2018 జనవరి), విధివిధానాలను, నిబంధనలను సూచించే అధికారిక ఉత్తర్వులనేవీ ప్రభుత్వం వెలువరించలేదు. రాజ్యాంగంలోని 243 - Y, ఇంకా తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ చట్టం - 2018 లోని సెక్షను 250 లోని నిబంధనలను రాష్ట్ర ఆర్థిక సంఘం వర్తింపజేసుకుని 2020-21 నుంచి 2024-25 వరకు నిర్దేశిత అవధికి సంబంధించి అప్పగించిన పనిని పూర్తిచేసింది. అయితే, నివేదికను 2020-21 ఆర్థిక సంవత్సరం మొదలైన ఆరు నెలలు పూర్తి అయిన తర్వాతనే, అంటే 2020 అక్టోబరులో, ప్రభుత్వానికి సమర్పించడం జరిగింది.

రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదిక పరిశీలనలో ఉందని, జనాభా దామాషా ఆధారంగా నిధులను విడుదల చేస్తూ ఉన్నట్లు ప్రభుత్వం గత సంవత్సరాలలో తెలిపింది (2022 జనవరి). ప్రభుత్వం నుంచి తదుపరి సమాచారం అందాల్సి ఉంది.

రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుల నియామకంలో జాప్యం, అటు తర్వాత సిఫార్సులను ఆమోదించి, అమలు చేయడంలో జాప్యం కారణంగా రాజ్యాంగ నిబంధనను పాటించకపోవడమే కాకుండా, సంబంధిత సిఫార్సులు లేకుండానే నిధులను విడుదల చేసినట్లు అయింది.

రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదిక మీద రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్య తీసుకోవాలని, రాష్ట్ర ఆర్థిక సంఘాల వ్యవస్థ క్రియాశీలకంగా ఉండేట్లు ధ్రువీకరించుకోవాలని సిఫార్సు చేయడమైంది.

2.5.3 మూలధన వ్యయం (లేదా క్యాపిటల్ వ్యయం)

ఆస్తులను ఏర్పాటు, కొనుగోళ్ల కోసం పెట్టే ఖర్చే మూలధన వ్యయం. అంతకు ముందు సంవత్సరపు మూలధన వ్యయం (₹28,874 కోట్లు) తో పోలిస్తే 2022-23 సంవత్సరంలో మూలధన వ్యయం (₹17,881 కోట్లు) గణనీయంగా (38 శాతం) తక్కువ. మొత్తం వ్యయంలో శాతంగా చూస్తే గత ఐదు సంవత్సరాల కాలంలో 2022-23 లో మూలధన వ్యయం అత్యల్పం. మొత్తం వ్యయంలో మూలధన వ్యయం కేవలం 9 శాతమే ఉంది. 2018-19 సంవత్సరంలో మూలధన వ్యయం గరిష్ఠంగా 18 శాతంగా ఉంది.

2.5.3.1 మూలధన వ్యయంలో ముఖ్యమైన మార్పులు

అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 2022-23 లో వివిధ పద్దుల కింద అయిన మూలధన వ్యయంలో గణనీయమైన పెరుగుదల లేదా తగ్గుదలలను ఈ కింది పట్టికలో చూపడం జరిగింది.

పట్టిక 2.20: మూలధన వ్యయం - 2021-22, 2022-23 సంవత్సరాల మధ్య సారూప్యభేదాలు

(₹ కోట్లలో)

పెద్ద పద్దుల వివరాలు	2021-22	2022-23	మార్పు
పెరిగినవి			
సామాజిక రంగం			
4202 - విద్య, క్రీడలు, కళలు, సంస్కృతి మీద మూలధన పరివ్యయం	49	585	536
4210 - వైద్యం, ప్రజారోగ్యం మీద మూలధన పరివ్యయం	498	806	308
సాధారణ రంగం			
4059 - ప్రజాపనుల మీద మూలధన పరివ్యయం	447	698	251
తగ్గినవి			
ఆర్థిక రంగం			
4700 - భారీ నీటిపారుదల మీద మూలధన పరివ్యయం	12,025	7,427	(-) 4,597
5055 - రోడ్డు రవాణా మీద మూలధన పరివ్యయం	938	123	(-) 815
4702 - చిన్న తరహా నీటిపారుదల మీద మూలధన పరివ్యయం	1,383	677	(-) 706
4515 - ఇతర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల మీద మూలధన పరివ్యయం	2,600	1,946	(-) 653
సామాజిక రంగం			
4215 - నీటి సరఫరా, పారిశుధ్యంపై మూలధన పరివ్యయం	5,329	941	(-) 4,387

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

పెట్టుబడులు తగ్గిన కారణంగా మూలధన పరివ్యయం తగ్గింది. 2021-22 లో (i) తెలంగాణ తాగునీటి సరఫరా సంస్థ (₹3,708 కోట్లు), (ii) కాళేశ్వరం కార్పోరేషన్ (₹3,072 కోట్లు), (iii) తెలంగాణ రాష్ట్ర జలవనరుల మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ (₹1,095 కోట్లు), (iv) తెలంగాణ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ (₹573 కోట్లు), (v) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (₹365 కోట్లు), (vi) తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయల సంస్థ (₹269 కోట్లు) ఇతరత్ర వెరసి భారీగా ₹9,093 కోట్లను పెట్టుబడిగా పెట్టడం జరిగింది. వీటిలో ప్రస్తుత సంవత్సరం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (₹122 కోట్లు) లో మాత్రమే పెట్టుబడులు పెట్టడమైంది.

పెట్టుబడుల వల్లనే కాకుండా, మూలధన వ్యయం (i) పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (తగ్గుదల ₹576 కోట్లు), (ii) మిషన్ భగీరథ (తగ్గుదల ₹568 కోట్లు), (iii) గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి కింద చిన్ననీటి పారుదల పనులు (తగ్గుదల ₹387 కోట్లు), (iv) మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (తగ్గుదల ₹673 కోట్లు) వంటి వాటిలో కూడా తగ్గుదల ఉంది.

'విద్య, క్రీడలు, కళలు, సంస్కృతి' కింద ఎక్కువ ఖర్చు కావడానికి ప్రధానంగా సమగ్ర శిక్ష లోని సివిల్ పనుల మీద చెల్లింపులు ఎక్కువ (₹247 కోట్లు) కారణమైంది. ఇంకా, (i) సచివాలయ భవన నిర్మాణం (2021-22 లో ₹86 కోట్ల ఖర్చు కాగా 2022-23 లో ₹367 కోట్ల ఖర్చు), (ii) నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (2021-22 లో ₹432 కోట్లు ఖర్చు కాగా 2022-23 లో ₹1,029 కోట్లు), (iii) ఆసుపత్రులు, డిస్పెన్సరీలు (2021-22 లో ₹338 కోట్లు ఖర్చు కాగా, 2022-23 లో ₹589 కోట్లు) లలో కూడా పెరుగుదల ఉంది.

2018-23 మధ్య ఐదు సంవత్సరాలు ఈ కింది వాటి మీద మూలధన వ్యయం అత్యధికంగా అయింది:

పట్టిక 2.21: గత ఐదేళ్లలో మూలధన వ్యయం గణనీయంగా ఉన్న ముఖ్యమైన పథకాలు / ఉప-పద్దులు

సామాజికసేవలు (₹ కోట్లలో)		ఆర్థికసేవలు (₹ కోట్లలో)	
మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం	6,145	పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం	12,937
మిషన్ భగీరథ	6,366	కాళేశ్వరం ప్రాజెక్టు	11,370
		గ్రామీణ నీటి సరఫరా	6,798
		సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక అభివృద్ధి నిధి	3,839

మూలం: గత ఐదు సంవత్సరాల ఆర్థిక పద్దులు

స్వయంగా మూలధన వ్యయం చేయడమే కాకుండా, కాళేశ్వరం, మిషన్ భగీరథ, పాలమూరు రంగారెడ్డి పథకం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు / పథకాలను ప్రభుత్వం ప్రత్యేక ప్రయోజన వాహక సంస్థలు తీసుకునే బడ్జెటుకు వెలుపలి ఋణాల ద్వారా కూడా అమలు చేస్తోంది (వివరాలకు *పేరా 2.7.2* చూడవచ్చు).

పేటిక 2.3: శస్త్రచికిత్సలలో వినియోగం అయిపోయే వస్తువుల కొనుగోలు కోసం మూలధన వ్యయం

గత కొన్ని సంవత్సరాలుగా శస్త్రచికిత్సలలో వినియోగం అయిపోయే వస్తువుల కొనుగోలు ఖర్చును మూలధన వ్యయంగా తప్పుగా వర్గీకరిస్తున్న ఫలితంగా నిత్య వ్యావహారిక వ్యయాన్ని తక్కువగా, మూలధన వ్యయాన్ని ఎక్కువగా చూపినట్లవుతోంది. ఈ అంశాన్ని ఆయా సంవత్సరాలలో రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల మీద ఆడిటు నివేదికల ద్వారా గత కొద్ది సంవత్సరాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లడం జరుగుతోంది.

ఈ పద్ధతి ప్రస్తుత సంవత్సరంలో కూడా కొనసాగి, ₹50 కోట్ల ఖర్చును మూలధనవ్యయంగా నమోదు చేయడం జరిగింది (*పేరా 3.4.9.1 (i)* ని చూడవచ్చు). ఈ అంశం మీద 2023 మార్చి నాటికి అయిన మొత్తం మూలధన వ్యయం ₹223 కోట్లు అని గమనించాము. వినియోగం అయిపోయే వస్తువుల మీద నిత్య వ్యావహారిక వ్యయాన్ని ఈ విధంగా మూలధన వ్యయంగా వర్గీకరించడం సరికాదు.

2.5.3.2 మూలధన వ్యయం నాణ్యత - పెట్టుబడులు

నష్టాలు తెస్తున్న (లేదా నికర విలువ కరిగిపోయిన) కంపెనీలు, కార్పొరేషన్లు, ఇతర సంస్థల మీద పెట్టే మూలధన వ్యయం ప్రతిఫలం ఇచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ప్రభుత్వ రంగ సంస్థలలో మూలధనం వాటా రూపంలో పెట్టిన పెట్టుబడుల మీద ప్రతిఫలం, వివిధ సంస్థలకు ఇచ్చిన ఋణాలు సరిగ్గా వసూలు కావడం వంటివి మూలధన వ్యయపు నాణ్యతను నిర్ధారించే ముఖ్యమైన అంశాలు.

2023 మార్చి 31 నాటికి శాసనవిహితమైన కార్పొరేషన్లు, ప్రభుత్వ కంపెనీలు, జాయింట్ స్టాక్ కంపెనీలు, సహకార సంస్థల వంటి వాటిలో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన పెట్టుబడుల మొత్తం ₹31,100 కోట్లు. తెలంగాణ ప్రభుత్వం 2022-23 లో మూడు సంస్థలలో ₹181 కోట్లు పెట్టుబడి పెట్టింది. అంతకు ముందు సంవత్సరం 2021-22

(₹9,093 కోట్లు) తో పోలిస్తే ప్రస్తుత సంవత్సరంలో పెట్టుబడులు విపరీతంగా తగ్గాయి. ఈ కింద చూపిన విధంగా పెట్టుబడులు ప్రధానంగా రెండు సంస్థలలోనే పెట్టడం జరిగింది:

పట్టిక 2.22: 2022-23 లో ప్రభుత్వం పెట్టిన ముఖ్యమైన పెట్టుబడులు

క్రమ సంఖ్య	పెట్టుబడి	మొత్తం (₹ కోట్లలో)
1	తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ	122
2	రామగుండం ఫర్టిలైజర్స్, కెమికల్స్ లిమిటెడ్	54

మూలం: ఆర్థిక పద్దులు

సంవత్సరాల వారీగా ప్రభుత్వం పెట్టిన పెట్టుబడుల వివరాలను, ప్రభుత్వ పెట్టుబడుల మీద ప్రతిఫలం వివరాలను ఈ కింది పట్టికలో చూపడం జరిగింది:

పట్టిక 2.23: పెట్టుబడులు, పెట్టుబడుల మీద ప్రతిఫలం

పెట్టుబడి / ప్రతిఫలం / ఋణాల మూల్యం	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
సంవత్సరాంతానికి పెట్టుబడి (₹ కోట్లలో)	19,754	21,807	21,826	30,919	31,100
పెట్టుబడుల మీద ప్రతిఫలం (₹ కోట్లలో)	94	115	94	52	78
పెట్టుబడుల మీద ప్రతిఫలం (శాతంలో)	0.48	0.53	0.43	0.17	0.25
ప్రభుత్వం తీసుకున్న ఋణాల మీద చెల్లించిన వడ్డీ (₹ కోట్లలో)	12,586	14,386	16,841	19,161	21,821
ప్రభుత్వం తీసుకున్న ఋణాల మీద సగటు వడ్డీ రేటు (శాతంలో)	6.94	6.70	6.63	6.49	6.57
పెట్టుబడుల మీద ప్రతిఫలానికి#, ప్రభుత్వం తీసుకున్న ఋణాల మీద చెల్లించిన వడ్డీకి మధ్య తేడా (₹ కోట్లలో)	(-)12,492	(-)14,271	(-)16,747	(-)19,109	(-)21,743
ప్రతిఫలానికి, వడ్డీరేటుకు మధ్య తేడా (శాతంలో)	(-)6.46	(-)6.17	(-)6.20	(-)6.32	(-)6.32

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

 # సంవత్సరం చివరినాటికి పెట్టుబడి

ఈ కంపెనీలు / కార్పొరేషన్లలో పెట్టుబడుల మీద ప్రతిఫలం తక్కువగానే ఉంటోంది. ప్రభుత్వం పెట్టిన పెట్టుబడులు 2018-19 లో ఉన్న ₹19,754 కోట్ల నుంచి గత ఐదేళ్లలో 57.44 శాతం పెరిగి 2022-23 లో ₹31,100 కోట్లకు చేరాయి. అయినా, కంపెనీలు / కార్పోరేషన్లలో పెట్టిన పెట్టుబడుల నుంచి ప్రతిఫలంలో చెప్పుకోదగ్గ పెరుగుదల లేదు.

నష్టాలు తెస్తూ, నికర విలువ పూర్తిగా కరిగిపోయిన కంపెనీలు, కార్పొరేషన్లు, సహకార సంస్థలలో పెట్టిన పెట్టుబడులు, వాటికి ఇచ్చిన ఋణాలు మూలధన వ్యయపు నాణ్యతను ప్రభావితం చేస్తాయి. నష్టాలు పేరుకుపోవడం వల్ల నికర విలువ పూర్తిగా కరిగిపోయిన 9 ప్రభుత్వ రంగ సంస్థల నికర విలువ ఋణాత్మకమై(-)₹50,931 కోట్లకు చేరింది (మరిన్ని వివరాల కొరకు *పేరా 5.7.2* ను చూడవచ్చు). ఆర్థిక పద్దుల ప్రకారం, వాటిల్లోని నాలుగు[15] సంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈక్విటీగా (పెట్టుబడి వాటాగా) పెట్టిన మొత్తం ₹17,621 కోట్లు.

2.5.3.3 ఇచ్చిన ఋణాలు, వసూలైన ఋణాల పరిమాణం, నాణ్యత

రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు, స్థానిక సంస్థలకు, స్వయం పాలక సంస్థలకు ప్రభుత్వం ఋణాలను, అడ్వాన్సులను ఇస్తుంది. 2018-23 మధ్యకాలంలో ఇంకా తిరిగి వసూలు కావల్సి ఉన్న ఋణాలు, అడ్వాన్సుల వివరాలు ఈ కింద ఉన్నాయి.

[15] (i) రెండు డిస్కములు: ₹17,619 కోట్లు, (ii) తెలంగాణ రాష్ట్ర జల వనరుల మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ: ₹2 కోట్లు, (iii) తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ: ₹0.25 కోట్లు, (iv) తెలంగాణ రాజీవ్ స్వగృహ సంస్థ: ₹0.03 కోట్లు

పట్టిక 2.24: 2018-19 నుంచి 2022-23 మధ్యకాలంలో ఇచ్చిన ఋణాలు, తిరిగి వసూలైన ఋణాల పరిమాణం

(₹ కోట్లలో)

ఇచ్చిన, తిరిగి వసూలు అయిన ఋణాల పరిమాణం	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
ఇంకా తిరిగి వసూలు కావల్సి ఉన్న ఋణాల ప్రారంభ నిల్వ	15,869	24,509	33,147	43,957	52,379
సంవత్సరంలో ఇచ్చిన మొత్తం	8,706	8,700	10,868	8,469	21,248
సంవత్సరంలో తిరిగి వసూలైన మొత్తం	66	62	58	48	629
ఇంకా తిరిగి వసూలు కావల్సి ఉన్న ఋణాల తుది నిల్వ	**24,509**	**33,147**	**43,957**	**52,379**	**72,998**
ఇచ్చిన ఋణాల్లో నికరంగా పెరుగుదల మొత్తం	8,640	8,638	10,810	8,421	20,619
అందిన వడ్డీ	7	6	6	6	253
ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు-అడ్వాన్సుల మీద వడ్డీ రేటు	0.03	0.02	0.01	0.01	0.35
ప్రభుత్వం తీసుకున్న ఋణాల మీద చెల్లించిన వడ్డీ రేటు	6.94	6.70	6.63	6.49	6.57
అందిన వడ్డీ రేటు, చెల్లించిన వడ్డీ రేట్ల మధ్య తేడా (శాతం)	(-)6.91	(-)6.68	(-)6.62	(-)6.48	(-)6.22

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

అంతకు ముందు సంవత్సరంతో పోల్స్తే 2022-23 లో ఇచ్చిన ఋణాలు-అడ్వాన్సులు సంఖ్యాపరంగా చూస్తే ₹12,779 కోట్ల మేర, శాతంగా చూస్తే 150 శాతం మేర అమాంతంగా పెరిగాయి.

- ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులలో ముఖ్యమైన పెరుగుదల కాళేశ్వరం సాగునీటిపారుదల ప్రాజెక్టు సంస్థ (పెరుగుదల ₹7,460 కోట్లు), తెలంగాణ రాష్ట్ర జలవనరుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (పెరుగుదల ₹1,424 కోట్లు), హైదరాబాదు మెట్రో రైలు సంస్థ (₹1,300 కోట్లు), తెలంగాణ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ (₹587 కోట్లు) విషయంలో ఉంది.
- తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్‌కు ఇచ్చిన తాజా ఋణం (₹1,107 కోట్లు), కృష్ణా తాగు నీటి సరఫరా ప్రాజెక్టులోని సుంకిశాల ఇన్టేక్ ప్రాజెక్టు నిమిత్తం హైదరాబాదు మహానగర నీటి సరఫరా, మురుగు పారుదల బోర్డుకు ఇచ్చిన ఋణం (₹725 కోట్లు) వల్ల కూడా ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులు పెరిగాయి.
- పద్దుల ప్రకారం 2023 మార్చి నాటికి వివిధ సంస్థల నుంచి ఇంకా తిరిగి వసూలు కావల్సి ఉన్న ఋణాలు, అడ్వాన్సులు ₹72,998 కోట్లు. అందులో ముఖ్యమైనవి ఈ కింద ఉన్నాయి:

పట్టిక 2.25: ప్రభుత్వం సంస్థలకు ఇచ్చి, తిరిగి వసూలు కావల్సి ఉన్న ముఖ్యమైన ఋణాలు

క్రమ సంఖ్య	సంస్థ / కార్యక్రమం	₹ కోట్లలో
1	కాళేశ్వరం సాగునీటిపారుదల ప్రాజెక్టు సంస్థ	12,318
2	తెలంగాణ తాగునీటి సరఫరా సంస్థ	10,421
3	హైదరాబాదు మహానగర నీటి సరఫరా, మురుగు పారుదల బోర్డు	10,338
4	ఆర్థిక సంస్థలు (గృహనిర్మాణ రంగం కింద)	6,037
5	తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య సంస్థ	3,816
6	తెలంగాణ రాష్ట్ర జలవనరుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ	3,665
7	తెలంగాణ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థ	3,000
8	హైదరాబాదు మెట్రో రైలు ప్రాజెక్టు	2,627
9	ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు	2,812
10	విద్యుతు ఆర్థిక సంస్థ బాండ్ల తిరిగి చెల్లింపు	2,398
11	తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ	1,700
12	బలహీన వర్గాల గృహనిర్మాణ కార్యక్రమం	1,599

మూలం: ఆర్థిక పద్దులు

రాష్ట్ర ప్రభుత్వం అంతకు ముందు వివిధ బడ్జెటు ప్రసంగాలలో (i) తెలంగాణ తాగు నీటి సరఫరా సంస్థ అమలు చేస్తున్న మిషన్ భగీరథ, (ii) కాళేశ్వరం సాగునీటిపారుదల ప్రాజెక్టు సంస్థ ద్వారా, తెలంగాణ రాష్ట్ర జలవనరుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా అమలు చేస్తున్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, దేవాదుల వంటి భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, (iii) ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న ఋణాల ద్వారా అమలు చేస్తున్న రెండు పడక గదుల గృహనిర్మాణ పథకాలు, (iv) తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల సహకార సమాఖ్య అమలు చేస్తున్న గొర్రెలు, మేకల కార్యక్రమం వంటి కార్యక్రమాలను బడ్జెటుకు వెలుపలి వనరుల ద్వారా అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. పైన పేర్కొన్న అంశాలు (1), (2), (4), (5), (6) లలోని సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు ఆయా సంస్థలు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న ఋణాలకు సంబంధించిన వడ్డీ చెల్లింపు, అసలు మొత్తం తిరిగి చెల్లింపులకు చెందినవి. కనుక అవి బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించినవి.

ఇంకా, అంశాలు (7), (9), (11) లలో పేర్కొన్న సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు ప్రభుత్వం అమలు చేసే పథకాలకు సంబంధించినవే కాక ఆయా సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన ఋణాలను తీర్చేందుకు సొంత రాబడి వనరులు లేవు. అందువల్ల వీటిని ఋణాల రూపంలో ఇచ్చిన సహాయక గ్రాంట్లు లేదా సహాయక ప్రదానాలుగా పరిగణించవచ్చు.

ఇక అంశం (10) లోని సంస్థకు ఇచ్చిన ఋణాలు గతంలోని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో విద్యుతు ఆర్థిక సంస్థ బాండ్ల తిరిగి చెల్లింపునకు సంబంధించినవి. కనుక ఈ ఋణాలు వాస్తవానికి ప్రభుత్వ చెల్లింపు బాధ్యతలను తీర్చేందుకు ఇచ్చినవి.

కాబట్టి, ఈ ఋణాలు తిరిగి వసూలు కాగల ఋణాల రూపంలో ఉన్న ప్రభుత్వ ఆస్తుల వాస్తవ స్థితిని ప్రతిబింబించవు.

అందువల్ల, బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించి తిరిగి చెల్లింపు బాధ్యతలను ఆయా సంస్థలకు ఋణాలు ఇచ్చినట్లుగా చూపించే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం మార్చుకోవాల్సి ఉంటుంది.

- సంస్థలకు ఋణాలను ఇచ్చేటప్పుడు ప్రభుత్వం వడ్డీ రేట్లు, తిరిగి చెల్లింపు అవధి, వాయిదాల సంఖ్య వంటి ఋణ సంబంధిత నిబంధనలను విధించడం లేదు.
- ఆర్థిక పద్దులలో ప్రదర్శించిన ఋణాల నిల్వను ఆయా సంస్థలన్నీ ఇంకా ధ్రువీకరించలేదని ప్రభుత్వం తెలిపింది(2023 ఆగస్టు). అంతకు ముందు సంవత్సరాలలో కూడా ఆయా సంస్థల నుంచి ధ్రువీకరణ లేదు. వరుసగా గత కొన్ని సంవత్సరాలుగా ధ్రువీకరణ లేకపోవడం వల్ల పద్దులలో ఋణాలకు సంబంధించిన ప్రదర్శనలోని సమంజసత్వంపై ఆందోళన రేకెత్తుతుంది.
- ఋణాలు తిరిగి వసూలు ఈ సంవత్సరం కూడా బాగోలేదు. 2021-22 లో తిరిగి వసూలు అయిన ₹48 కోట్లతో పోలిస్తే 2022-23 సంవత్సరంలో చాలా ఎక్కువగా ₹629 కోట్లు తిరిగి వసూలు అయినట్లు ప్రదర్శించినా, అందులో ₹590 కోట్లు పద్దుల ప్రకారం అంతకు ముందు ఇచ్చిన ఋణాల కన్నా ఎక్కువ వసూలు అయినట్లు చూపడం వల్ల హైదరాబాదు మహానగర ప్రాంతంలో ప్రసార వ్యవస్థను ఆధునీకీకరించడం, బలోపేతం చేయడం కోసం తెలంగాణ ట్రాన్స్‌కోకు ఇచ్చిన ఋణాలు ఋణాత్మకంగా (నెగిటివ్) మారాయి. ఈ సంవత్సరం తిరిగి వసూలు అయిన మిగిలిన ₹39 కోట్లలో కూడా ₹17 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల వద్ద నుంచి వసూలు అయినవి కాగా ₹5 కోట్లు మోటారు కార్ల కొనుగోలు నిమిత్తం ఇచ్చిన ఋణాలు, మరో ₹7 కోట్లు గౌరవనీయ శాసనసభ్యుల మోటారు కార్ల కొనుగోలు నిమిత్తం ఇచ్చిన ఋణాలు .

భారీ మొత్తాలను ఋణాలు తీసుకున్న సంస్థల నుంచి తిరిగి వసూలు కాకపోవడం వల్ల పలు ఋణాలు బడ్జెటుకు వెలుపలి ఋణాలను తీర్చడం కోసం ఇచ్చినవని లేదా సొంతంగా రాబడి వనరులు లేని కారణంగా ఋణాలను తిరిగి తీర్చలేని సంస్థలకు ఇచ్చినవన్న అభిప్రాయాన్ని బలపరుస్తోంది.

- ఇచ్చిన ఋణాల మీద ₹253 కోట్లు వడ్డీగా అందింది. అయితే, *పేరా 2.4.1.1 (ii)* లో పేర్కొన్నట్లుగా, ఇందులో ₹247 కోట్లు హై వోల్టేజి పంపిణీ వ్యవస్థ కోసం తెలంగాణ ట్రాన్స్‌కోకు ఇచ్చిన ఋణాలకు ప్రతిగా తెలంగాణ ట్రాన్స్‌కో నుంచి అందిన మొత్తమే. ఈ సంస్థకు ఇచ్చిన ఋణం మొత్తమే ₹736 కోట్లు. అంటే అసలు మొత్తంలో 34 శాతం ఈ సంవత్సరం వడ్డీ రూపంలో అందింది. మరో ₹6 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల నుంచి అందింది.

  భారీ మొత్తాలను ఋణాలు తీసుకున్న సంస్థల నుంచి వడ్డీ ఏమీ అందలేదన్న విషయం మరోసారి గమనార్హం.

  అందువల్ల, ఋణాలను మంజూరు చేస్తూ ఇచ్చే ఉత్తర్వుల్లో/ఋణ ఒప్పందాల్లో వడ్డీ రేటు, తిరిగి తీర్చే ప్రణాళికావధి వంటి ముఖ్యమైన నిబంధనలను, షరతులను పొందుపర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించుకోవాలి. నిబంధనలు, షరతులు లేకుండా గతంలో ఏవైనా ఋణాలు ఇచ్చి ఉంటే, వాటిని కూడా నిర్దిష్టం చేసుకోవాలి.

- రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు మహానగర నీటి సరఫరా, మురుగు పారుదల బోర్డుకు 2022-23 లో ₹1,450 కోట్లు ఋణాలను, మొత్తంగా 2023 మార్చి నాటికి ₹10,338 కోట్ల ఋణాలను ఇచ్చింది. అయితే, హైదరాబాదు మహానగర నీటి సరఫరా, మురుగు పారుదల బోర్డు పద్దులు 2020-21 నుంచి మూడేళ్లుగా బకాయిల్లో ఉన్నాయి. అదే విధంగా, రాష్ట్ర ప్రభుత్వం ₹528 కోట్ల ఋణాలు ఇచ్చిన తెలంగాణ వైద్య విధాన పరిషత్తు 2020-21 నుంచి తమ పద్దుల ఆడిటును అప్పగించలేదు. నిజానికి ఆ సంస్థ 2014-15 నుంచి పద్దులను సమర్పించలేదు.

  రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని ఋణాలను అందించే ముందు ఆయా సంస్థలు సకాలంలో వార్షిక పద్దులను సమర్పించేట్లు ధ్రువీకరించుకోవాలి.

2.5.3.4 పూర్తి కాని/కొనసాగుతున్న ప్రాజెక్టులలో పెట్టిన మూలధనం

పూర్తి కాని/కొనసాగుతున్న ప్రాజెక్టులు/పనులు పూర్తి చేయడం ఆలస్యమైతే వాటిపై పెట్టిన మూలధనం ఖర్చుల నాణ్యత మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. పైగా, ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఋణాలను తీసుకుని ఉంటే వడ్డీ చెల్లింపులు కూడా అదనపు భారంగా పరిణమిస్తాయి.

గత ఐదు సంవత్సరాలలో మూలధన పరివ్యయం ₹1,02,177 కోట్లు. అది ప్రతి ఏటా మొత్తం వ్యయంలో 09 శాతం నుంచి 18 శాతం వరకు ఉంది. ఈ ఐదేళ్లలో మొత్తం మూలధన పరివ్యయంలో దాదాపు సగం (అంటే ₹48,679 కోట్లు, 48 శాతం) సాగునీటిపారుదల-వరదల నియంత్రణ రంగం మీదనే జరిగింది.

పటం 2.14: మూలధన పరివ్యయంలో సాగునీటిపారుదల-వరదల నియంత్రణ రంగం వాటా



మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సమాచారం ప్రకారం, 2023 మార్చి నాటికి ఇంకా పూర్తి కావల్సి ఉన్న 280 ప్రాజెక్టులు / పనులు ఉన్నాయి. వీటి మీద ₹1,78,354 కోట్లు ఖర్చు అయింది. సంవత్సరాలవారీగా వివరాలను, శాఖల / విభాగాల వారీ వివరాలను ఈ కింది పట్టికలలో చూడవచ్చు.

పట్టిక 2.26: సంవత్సరాల వారీగా 2023 మార్చి 31 నాటికి పూర్తికాని ప్రాజెక్టుల/పనుల వివరాలు

పూర్తి కాని ప్రాజెక్టు / పని ప్రారంభమైన సంవత్సరం	పూర్తి కాని ప్రాజెక్టుల / పనుల సంఖ్య	అంచనా వ్యయం (₹ కోట్లలో)	వ్యయం (₹ కోట్లలో)
2013-14 వరకు	17	64,283	1,48,943
2014-15	1	1	1
2015-16	28	108	60
2016-17	47	37,726	24,858
2017-18	41	2,867	2,083
2018-19	75	615	439
2019-20	20	313	186
2020-21	11	2,084	1,705
2021-22	18	135	43
2022-23	22	272	36
మొత్తం	280	1,08,404	1,78,354

పట్టిక 2.27: శాఖల వారీగా 2023 మార్చి 31 నాటికి పూర్తి కాని ప్రాజెక్టుల/పనుల వివరాలు

శాఖ / విభాగం	పూర్తి కాని ప్రాజెక్టుల / పనుల సంఖ్య	అంచనా వ్యయం (₹ కోట్లలో)	వ్యయం (₹ కోట్లలో)
రోడ్లు	216	2,800	1,656
భవనాలు	25	1,741	1,898
వంతెనలు	16	42	27
నీటిపారుదల	20	1,02,388	1,73,564
ఇతరాలు	3	1,433	1,209
మొత్తం	280	1,08,404	1,78,354

మూలం: ఆర్థిక పద్దులు

2023 సంవత్సరం నాటికి పూర్తి కావల్సి ఉన్న సాగునీటిపారుదల ప్రాజెక్టులు (1983 నుంచి 2018 మధ్యకాలంలో ప్రారంభమైనవి) 20 ఉన్నాయి. వీటి అంచనా మూల్యం ₹1,02,388 కోట్ల నుంచి ₹2,06,977 కోట్లకు, అంటే ₹1,04,589 కోట్లు (102 శాతం) పెరిగింది. ఈ ప్రాజెక్టుల మీద 2023 మార్చి వరకు ₹1,73,564 కోట్లు ఖర్చు అయింది. ఇంతే కాకుండా, కొనసాగుతున్న 13 సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వానికి ₹8,971 కోట్ల చెల్లింపు బాధ్యత ఉంది.

సాగునీటిపారుదల ప్రాజెక్టుల మూల్యం కన్నా, వాటి వల్ల చేకూరే ప్రయోజనాలే ఎక్కువ అనే అంచనా ఆధారంగా వాటిని చేపట్టడం జరుగుతుంది. ప్రాజెక్టులు పూర్తి కాకుంటే ఆర్థికరంగ వృద్ధి విషయంలో ఆశించిన ప్రయోజనాలు రాష్ట్రానికి అందవు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు తాలూకు ఆర్థిక ఫలితాలను కూడా వెల్లడించడంలేదు. అందువల్ల, సాగునీటిపారుదల, వరదల నియంత్రణ రంగంలో పెట్టిన ప్రజాధనపు పెట్టుబడుల ద్వారా దక్కే ప్రతిఫలాలకు భరోసా లేదు.

ఇతర శాఖలలో, ₹6,016 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 260 ప్రాజెక్టులు/పనులు ఇంకా పూర్తి కాలేదు. జాప్యమైన ఈ ప్రాజెక్టుల మీద 2023 మార్చి నాటికి ₹4,790 కోట్లు ఖర్చు అయింది. ఇంతే కాకుండా, ఆర్థిక పద్దులలోని అనుబంధం IX లో సమాచారం ప్రకారం కొనసాగుతున్న 113 ఇతర ప్రాజెక్టులు / పనులపై[16] ప్రభుత్వానికి ₹1,096 కోట్ల చెల్లింపు బాధ్యత ఉంది.

ఈ ప్రాజెక్టులను/పనులను పూర్తి చేయడంలో విపరీతమైన జాప్యాల కారణంగా ప్రతి సంవత్సరమూ ప్రభుత్వం మీద ఆర్థిక భారం పెరగుతూ ఉండడమే కాకుండా, ప్రజానీకానికి ఆశించిన ప్రయోజనాలు కూడా అందవు.

2.5.4 వ్యయ ప్రాథమ్యాలు

మానవాభివృద్ధి స్థాయిలను పెంచాలంటే విద్య, వైద్యం వంటి కీలకమైన సామాజిక సేవల మీద ఖర్చును రాష్ట్రం పెంచాల్సి ఉంటుంది. ఒక రంగానికి చేసిన కేటాయింపు సంబంధిత రంగంలో జాతీయ సగటు కన్నా తక్కువగా ఉంటే ఆ రంగానికి తక్కువ ద్రవ్యప్రాథమ్యం (అంటే మొత్తం ఖర్చులో ఆ రంగం మీద పెట్టిన ఖర్చు నిష్పత్తి) ఇచ్చినట్లు పరిగణించవచ్చు. మొత్తం ఖర్చులో ఆయా రంగాల నిష్పత్తి ఎంత ఎక్కువగా ఉంటే, ఖర్చు నాణ్యత అంత మెరుగ్గా ఉన్నట్లు పరిగణించాలి. సాధారణ రాష్ట్రాలతో[17] పోలిస్తే తెలంగాణ రాష్ట్రం వ్యయ ప్రాధాన్యతలను ఈ కింద ఇవ్వడం జరిగింది:

పట్టిక 2.28: వైద్యం, విద్య, మూలధనవ్యయాల విషయమై రాష్ట్రం వ్యయ ప్రాథమ్యాలు

	టి.ఇ./ జి.ఎస్.డి.పి.	ఎస్.ఎస్.ఇ./ టి.ఇ.	ఇ.ఎస్.ఇ./ టి.ఇ.	డి.ఇ. / టి.ఇ.	సి.ఇ. / టి.ఇ.	విద్య / టి.ఇ.	వైద్యం / టి.ఇ.
సాధారణ రాష్ట్రాల సగటు (2018-19)	16.38	36.60	30.65	67.24	15.58	14.76	5.07
తెలంగాణ (2018-19)	14.98	40.46	32.29	72.74	24.41	8.98	4.67
సాధారణ రాష్ట్రాల సగటు (2022-23)	15.79	38.11	29.17	67.28	15.22	14.85	5.68
తెలంగాణ (2022-23)	14.66	34.54	38.84	73.37	20.32	9.06	4.57

మూలం: సంబంధిత రాష్ట్రాల ఆర్థిక పద్దులు

గమనిక: సాధారణ రాష్ట్రాల సగటు కన్నా ఎక్కువగా ఉంటే ఆకుపచ్చ రంగుతోనూ, తక్కువగా ఉంటే ముదురు ఎరుపు రంగుతోనూ సూచించడం జరిగింది

టి.ఇ.: మొత్తం వ్యయం; జి.ఎస్.డి.పి.: రాష్ట్ర స్థూల గృహోత్పత్తి; ఎస్.ఎస్.ఇ.: సామాజిక రంగంపై వ్యయం; ఇ.ఎస్.ఇ.: ఆర్థిక రంగంపై వ్యయం; డి.ఇ.: అభివృద్ధి వ్యయం అంటే సామాజిక, ఆర్థిక రంగాలపై చేసిన వ్యయం; సి.ఇ.: క్యాపిటల్ వ్యయం

[16] (i) 84 రోడ్డు పనులలో చెల్లించాల్సిన బకాయిలు ₹181 కోట్లు, (ii) 07 భవనాల పనులలో చెల్లించాల్సిన బకాయిలు ₹6 కోట్లు, (iii) 22 సాగునీటి పారుదల ప్రాజెక్టులలో చెల్లించాల్సిన బకాయిలు ₹909 కోట్లు.

[17] ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, హర్యానా, ఝార్ఖండ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్

- రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో శాతంగా సాధారణ రాష్ట్రాలతో పోల్చినప్పుడు తెలంగాణ ప్రభుత్వం మొత్తం వ్యయం ఒక శాతం పాయింటు తక్కువగా ఉంది.
- మొత్తం ఖర్చుతో పోలిస్తే తెలంగాణలో అభివృద్ధి వ్యయం (అంటే సామాజిక, ఆర్థిక రంగాలపై చేసిన వ్యయం) దాదాపు ఇతర సాధారణ రాష్ట్రాల సగటు కంటే ఎక్కువగానే ఉంటోంది. రాష్ట్రం అభివృద్ధి వ్యయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందని ఇది సూచిస్తోంది. ఆర్థిక రంగ సేవల మీద ఖర్చు తొమ్మిది శాతం పాయింట్లు ఎక్కువగా ఉండడం వల్ల అభివృద్ధి వ్యయం ఎక్కువగా ఉంది. అయితే, మొట్టమొదటి సారి సామాజిక రంగ సేవల ఖర్చు ఇతర సాధారణ రాష్ట్రాల కన్నా తక్కువగా ఉంది.
- మొత్తం ఖర్చుతో పోలిస్తే తెలంగాణ మూలధనవ్యయం 2018-19 లో ఉన్న 24 శాతం నుంచి 2022-23 లో 20 శాతానికి తగ్గింది. అయినా, సాధారణ రాష్ట్రాల సగటు (15 శాతం) కన్నా ఎక్కువే (దాదాపు 05 శాతం).
- ఇతర సాధారణ రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రం విద్యపై ఖర్చులో (2022-23 లో దాదాపు 06 శాతం మేర), వైద్యంపై ఖర్చులో (2022-23 లో 01 శాతం మేర) వరుసగా వెనుకబడే ఉంటున్నది.

2.5.5 అంశాల వారీగా ఖర్చు

మొత్తం ఖర్చులో ప్రయోజనం లేదా స్వభావాన్ని బట్టి అంశాల వారీగా ఖర్చుల వివరాలను ఈ కింది పటంలో చూడవచ్చు.

పటం 2.15: ప్రయోజనం లేదా స్వభావాన్ని బట్టి అంశాల వారీగా ఖర్చు



మూలం: ఆర్థిక పద్దులు

ఖర్చులో ఎక్కువ భాగం సహాయక గ్రాంట్ల రూపంలో ఉంది. అటు తరువాతి స్థానాలు జీతాలు, పింఛనులు, వడ్డీలవి. నిత్య వ్యావహారిక వ్యయంలో సహాయక గ్రాంట్ల వాటా *పట్టిక 2.19* లో చూపినట్లు ప్రతి ఏటా పెరుగుతోంది. నిత్య వ్యావహారిక, మూలధన వ్యయాల మొత్తంలో కూడా దాని వాటా రైతు బంధు, దళిత బంధు వంటి పథకాల మీద పెరిగిన ఖర్చు కారణంగా ఈ కింద పటంలో చూపిన విధంగా 2018-19 లో ఉన్న 32 శాతం నుంచి 2022-23 లో 40 శాతానికి పెరిగింది.

పటం 2.16: సహాయక గ్రాంట్లు, ఇతర ఖర్చుల వాటా



మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

2.6 ప్రజాపద్దు

సంచిత నిధిలో భాగంగా ఉండని కొన్ని లావాదేవీలు అంటే చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధులు, రిజర్వు నిధులు, డిపాజిట్లు, అనామతు, జమల వంటి వాటిల్లో రాబడులు, చెల్లింపులను రాజ్యాంగంలోని 266(2) అధికరణ కింద ఏర్పాటు అయిన ప్రజా పద్దులో ఉంచడం జరుగుతుంది. ఈ లావాదేవీలకు రాష్ట్ర శాసనసభ ఓటింగ్ అవసరం లేదు. ఈ నిధుల విషయంలో ప్రభుత్వం ఒక బ్యాంకరులాగా వ్యవహరిస్తుంది. ఏడాదిలో చేయాల్సిన చెల్లింపులు జరిపిన తరువాత మిగిలి ఉన్న మొత్తం వివిధ ప్రయోజనాలపై వినియోగానికి ప్రభుత్వానికి అందుబాటులో ఉంటుంది.

2.6.1 ప్రజాపద్దు నికర నిల్వలు

2018-19 నుంచి 2022-23 వరకు గల ఐదేళ్లలో మార్చి 31 నాటికి ప్రజాపద్దులో అంశాల వారీగా ఉన్న నికర నిల్వల (పెరుగుదల / తగ్గుదల) ను ఈ తరువాతి పట్టికలో చూపడమైంది:

పట్టిక 2.29: ప్రజా పద్దులో (సంబంధిత సంవత్సరంలో మార్చి 31 నాటికి) అంశాల వారీగా నికర నిల్వలు (పెరుగుదల (+) / తగ్గుదల(-))

(₹ కోట్లలో)

వర్గం, ఉపవర్గం	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
చిన్న మొత్తాల పొదుపు, భవిష్యనిధులు వగైరా	845	783	945	1,067	2,049
రిజర్వు నిధులు					
ఎ) వడ్డీతో కూడిన రిజర్వు నిధులు	288	3,226	226	(-) 1,634	(-)207
బి) వడ్డీ ఉండని రిజర్వు నిధులు	1,242	1,127	548	580	634
డిపాజిట్లు					
ఎ) వడ్డీతో కూడిన డిపాజిట్లు	121	140	180	72	1,316
బి) వడ్డీ ఉండని డిపాజిట్లు	2,976	1,266	4,901	1,151	(-)367
సి) అడ్వాన్సులు (లేదా బయానాలు)	3	0.01	0	0.01	0.01
అనామతు, నానావిధం					
ఎ) అనామతు	113	292	(-)229	755	347
బి) ఇతర పద్దులు	(-)773	5	(-)3	(-)3	(-)0.26
సి) విదేశీ ప్రభుత్వాల వద్ద పద్దులు	(-)0.03	(-)0.02	(-)0.02	(-)0.02	(-)0.03
డి) నానావిధం	--	--	--	--	--
జమలు					
ఎ) మనీ ఆర్డర్లు, ఇతర జమలు	126	34	(-)5	583	(-)462
బి) ప్రభుత్వాల మధ్య సర్దుబాటు పద్దు	(-)11	(-)27	(-)27	34	(-)4
మొత్తం	**4,930**	**6,846**	**6,536**	**2,605**	**3,306**

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

- రాష్ట్ర ప్రభుత్వ బీమా నిధిలో ₹1,070 కోట్ల పెరుగుదల, సాధారణ భవిష్య నిధి నికర నిల్వలో ₹945 కోట్ల పెరుగుదల కారణంగా చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధి పద్దులో ₹2,049 కోట్ల పెరుగుదల ఉంది.
- రాష్ట్ర పరిహార వనీకరణ నిధిలో ₹336 కోట్ల తగ్గుదల, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిలో ₹128 కోట్ల పెరుగుదల కారణంగా వడ్డీతో కూడిన రిజర్వు నిధిలో ₹207 కోట్ల తగ్గుదల ఉంది.
- సంచిత ఋణవిమోచన నిధి, పూచీకత్తుల విముక్తి నిధిలోని మొత్తాల నుంచి పెట్టిన పెట్టుబడుల నుంచి దక్కిన మొత్తాల కారణంగా వడ్డీ ఉండని రిజర్వు నిధిలో పెరుగుదల ఉంది.
- వడ్డీతో కూడిన డిపాజిట్లలో 2022-23 లో ₹1,316 కోట్ల పెరుగుదల ఉంది. ఇందుకు ముఖ్య కారణం నేషనల్ సెక్యూరిటీ డిపాజిట్స్ లిమిటెడ్‌కు బదిలీ చేయకుండా ప్రభుత్వ ఉద్యోగుల నిర్ధారిత వాటా పింఛను పథకం నిధిలో అధిక మొత్తాలను ఉంచేయడమే (మరిన్ని వివరాల కోసం *పేరా 2.5.2.3* ని చూడవచ్చు).

2.6.2 రిజర్వు నిధులు, డిపాజిటు పద్దుల కింద నిధులు

నిర్దిష్టమైన, నిర్వచించిన ప్రయోజనాల కోసం రిజర్వు నిధులను ఏర్పాటు చేయడం జరుగుతుంది. రాష్ట్ర సంచిత నిధి నుంచి చందాలు లేదా విరాళాలు/గ్రాంట్ల ద్వారా వీటికి ధనం సమకూరుతుంది. ఈ నిధులలో 2023 మార్చి 31 నాటికి సమకూరి ఉన్న ₹12,188 కోట్ల స్థూల నిల్వలో, ₹8,600 కోట్లను భారత ప్రభుత్వం జారీ చేసే సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెట్టగా, ₹3,588 కోట్ల[18] నిల్వ నికరంగా మిగిలి ఉంది.

2022-23 సంవత్సరంలో ముఖ్యమైన రిజర్వు నిధుల లావాదేవీలను ఈ కింద వివరించడం జరిగింది.

2.6.2.1 సంచిత ఋణవిమోచన నిధి

మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలను, ఇతర ఋణాలను, అప్పుల బాధ్యతలను తీర్చే నిమిత్తం పన్నెండో ఆర్థిక సంఘం చేసిన సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం 1999-2000 సంవత్సరంలో ఋణ విమోచన నిధిని ఏర్పాటు చేసింది. ఈ నిధిని భారతీయ రిజర్వు బ్యాంకు నిర్వహిస్తుంది.

మార్గదర్శకాల ప్రకారం[19], అంతకు ముందు ఆర్థిక సంవత్సరం చివరి నాటికి తీర్చాల్సి ఉన్న చెల్లింపు బాధ్యతల[20] మీద 0.50 శాతం చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సంచిత ఋణ విమోచన నిధికి జమ చేయవచ్చు. తదనుగుణంగా, 2021-22 చివరి నాటికి తీర్చాల్సి ఉన్న ₹3,07,163 కోట్ల బాధ్యత ప్రకారం 2022-23 లో ₹1,536 కోట్లను జమ చేయాల్సి ఉంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం 2022-23 లో ఋణ విమోచన నిధికి ఏమీ జమ చేయలేదు. ఋణ విమోచన నిధిలోని మొత్తాలను పెట్టుబడిగా పెట్టగా వాటి మీద వచ్చిన వడ్డీ ₹513 కోట్లు. 2023 మార్చి 31 నాటికి ఋణ విమోచన నిధిలో ₹7,094 కోట్లు ఉండగా, అందులో ₹7,053 కోట్లను పెట్టుబడిగా పెట్టడం జరిగింది.

ఈ కింద చూపిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంచిత ఋణ విమోచన నిధికి క్రమం తప్పకుండా జమ చేయడం లేదు:

[18] వడ్డీతో కూడిన రిజర్వు నిధులు: ₹1,989 కోట్లు; వడ్డీ ఉండని రిజర్వు నిధులు: ₹1,599 కోట్లు

[19] సంచిత ఋణ విమోచన నిధి సవరించిన పథకం విషయమై జారీ అయిన జి.ఒ.ఎం.ఎస్. సంఖ్య 3, ఆర్థిక (డి.సి.ఎం.) శాఖ, తేది 2014 జూన్ 11

[20] సంచిత ఋణ విమోచన నిధి మార్గదర్శకాల ప్రకారం తీర్చాల్సి ఉన్న చెల్లింపు బాధ్యతలు అంటే అంతర్గత ఋణంతో పాటు ప్రజాపద్దు కింద ప్రభుత్వ చెల్లింపు బాధ్యతలు

పట్టిక 2.30: గత ఐదు సంవత్సరాలలో సంచిత ఋణ విమోచన నిధికి జమ చేయాల్సిన, జమ చేసిన మొత్తాలు

(₹ కోట్లలో)

	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
కిందటి సంవత్సరం చివరకు తీర్చాల్సి ఉన్న చెల్లింపు బాధ్యతలు	1,57,218	1,88,733	2,24,182	2,67,843	3,07,163
జమ చేయాల్సిన మొత్తం	786	944	1,121	1,339	1,536
రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిన మొత్తం	500	300	శూన్యం	శూన్యం	శూన్యం
సంచిత ఋణ విమోచన నిధి నుంచి పెట్టుబడులపై ప్రాప్తించిన వడ్డీ	352	450	468	472	513

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

గత ఐదు సంవత్సరాలలో సంచిత ఋణ విమోచన నిధికి జమ చేయాల్సి ఉన్న ₹5,726 కోట్లకు బదులుగా ప్రభుత్వం 2018-19, 2019-20 సంవత్సరాలలో కలిపి ₹800 కోట్లు మాత్రమే జమ చేయగా మొత్తం మీద జమ చేయడంలో ₹4,926 కోట్ల తగ్గుదల ఉంది. మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలను, ఇతర ఋణాలను, అప్పులను తీర్చడం కోసం ఈ నిధిని ఉపయోగించాలి. సంచిత ఋణ విమోచన నిధికి తరుచూ జమ చేయకపోవడం / తక్కువగా జమ చేయడం వల్ల నిధి ఏర్పాటు చేసిన అసలు ప్రయోజనమే దెబ్బతింటుంది.

2.6.2.2 రాష్ట్ర విపత్తు ప్రమాద నిర్వహణ నిధి

విపత్తు నిర్వహణ ప్రక్రియను మొదలు నుంచి చివరి వరకు నిర్వర్తించడం కోసం అన్ని రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర విపత్తు ప్రమాద నిర్వహణ నిధిని వర్గీకరించాలని, అంటే, (i) మొత్తం కేటాయింపులో 80 శాతాన్ని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధికి, (ii) జాతీయ విపత్తు నిర్వహణ సాధికార సంస్థ ఏర్పాటు చేయాలని సూచించిన రాష్ట్ర విపత్తు నివారణ నిధికి 20 శాతం మొత్తాన్ని కేటాయించాలని పదిహేనో ఆర్థిక సంఘం సిపార్సు చేసింది. ఈ నిధులకు జమ కావల్సిన మొత్తాలు తొలుత రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిలోకి వస్తాయి. అటు తర్వాత అందులో నుంచి 20 శాతం రాష్ట్ర విపత్తు నివారణ నిధికి బదిలీ చేయడం జరుగుతుంది.

2022-23 సంవత్సరానికి 75:25 నిష్పత్తిలో భారత ప్రభుత్వం నుంచి ₹472 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ₹157 కోట్లు వెరసి ₹629 కోట్లు రాష్ట్ర విపత్తు ప్రమాద నిర్వహణ నిధికి ఇవ్వాలని పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. అయితే, భారత ప్రభుత్వం ₹189 కోట్లను మాత్రమే ఇచ్చింది. ఈ మొత్తం రాష్ట్ర సంచిత నిధిలోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం తన 25 శాతం వాటాగా ₹63 కోట్లను ఇచ్చింది. ఆ విధంగా ₹629 కోట్లు జమ చేయాల్సి ఉండగా భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ₹252 కోట్లను మాత్రమే జమ చేశాయి. ఫలితంగా ₹377 కోట్ల మేర రాష్ట్ర విపత్తు ప్రమాద నిర్వహణ నిధిలో తగ్గుదల ఏర్పడింది. ఈ ₹252 కోట్ల వాటా తొలుత రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిలోకి వచ్చింది.

(i) రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి

గతంలో ఉండిన ప్రకృతి వైపరీత్యాల ఉపశమన నిధికి బదులు కేంద్ర ప్రభుత్వం 2010 ఏప్రిల్ 1 నుండి రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిని ఏర్పాటు చేసింది. ఈ నిధి మార్గదర్శకాల ప్రకారం, భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం 75:25 నిష్పత్తిలో ఈ నిధికి జమ చేయాలి.

ఈ నిధి కోసం వాటా చందాగా జమ అయిన మొత్తాలను ప్రజాపద్దు కింద ఉన్న పెద్దపద్దు సంఖ్య - 8121 కి బదిలీ చేయాలి. విపత్తులకు సంబంధించిన ఖర్చులను మొదట పెద్ద పద్దు సంఖ్య 2245- ప్రకృతి వైపరీత్యాలలో ఉపశమనం ద్వారా ఖర్చు పెట్టి, తర్వాత ఆ ఖర్చును ప్రజాపద్దుకు సర్దుబాటు చేయడం జరుగుతుంది. తుఫాను, కరువు, భూకంపం, అగ్ని ప్రమాదం, వరద, సునామీ, వడగళ్ళు, కొండచరియలు విరిగి పడటం, హిమవృష్టి, కుంభవృష్టి వంటి వాటి బాధితులకు తక్షణ ఉపశమనం కోసం అయ్యే ఖర్చును భరించడం కొరకు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిని ఉపయోగించడం జరుగుతుంది.

రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిలో 2022 ఏప్రిల్ 1 నాటికి ₹608 కోట్లు ఉన్నాయి. ఈ నిధికి 2022-23 లో భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిపి రాష్ట్ర విపత్తు ప్రమాద నివారణ నిధికి జమ చేయాల్సిందిగా సిఫార్సు అయిన ₹629 కోట్లలో 80 శాతం లెక్క ప్రకారం ₹503 కోట్లను జమ చేయాల్సి ఉండింది. అయితే, భారత ప్రభుత్వం ₹189 కోట్లను, రాష్ట్ర ప్రభుత్వం ₹63 కోట్లను జమ చేయడంతో మొత్తం ₹252 కోట్లు మాత్రమే అయింది. ఇందులో, ₹50 కోట్లను రాష్ట్ర విపత్తు నివారణ నిధికి బదిలీ చేయాల్సి ఉన్నా ఆ విధంగా బదిలీ చేయలేదు.

రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిలో ఉన్న ₹860 కోట్లలో ₹123 కోట్లను వినియోగించగా నిధిలో ఇంకా ₹737 కోట్లు ఉన్నాయి.

(ii) రాష్ట్ర విపత్తు నివారణ నిధి

జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి/రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధుల కిందకు వచ్చే విపత్తుల విషయంలో ముందుగా నివారణ చర్యల కోసం ప్రత్యేకించి రాష్ట్ర విపత్తు నివారణ నిధి ఏర్పాటైంది. అపాయావకాశాలను పరిహరించి, పర్యావరణహితమైన రీతిలో స్థిరపడే పద్ధతులను, జీవన విధానాలను ప్రోత్సహించడం కోసం సామాజిక కార్యక్రమాలకై స్థానిక స్థాయిలో ఈ నివారణ నిధిని ఉపయోగించాలి.

రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిలో 2022 ఏప్రిల్ 1 నాటికి ₹120 కోట్లు ఉన్నాయి. పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2022-23 లో భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిపి ₹629 కోట్లలో 20 శాతం అయిన ₹126 కోట్ల మేర జమ చేయాల్సి ఉంది. అయితే 2022-23 సంవత్సరంలో రాష్ట్ర విపత్తు నివారణ నిధిలో ఏమీ జమ కాలేదు. భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిపి రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిలోకి జమ చేసిన ₹252 కోట్లలో 20 శాతం అయిన ₹50 కోట్లను కూడా రాష్ట్ర విపత్తు నివారణ నిధికి బదిలీ చేయడం జరుగలేదు. రాష్ట్ర విపత్తు నివారణ నిధి నుంచి ఖర్చు కూడా ఏమీ కాలేదు. రాష్ట్ర విపత్తు నివారణ నిధిలో నిల్వ ₹120 కోట్లు గానే ఉంది.

విపత్తులను నివారించే నిమిత్తం రాష్ట్ర విపత్తు నివారణ నిధిని వినియోగించని కారణాలను రాష్ట్ర ప్రభుత్వం తెలుపలేదు.

2.6.2.3 పూచీకత్తుల విముక్తి నిధి

ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రత్యేక ప్రయోజన వాహక సంస్థల వంటివి తీసుకున్న ఋణాలను ఆ సంస్థలు చెల్లించకపోతే, ఆ ఋణాలకు ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తు బాధ్యతను నెరవేర్చే నిమిత్తం భారతీయ రిజర్వు బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం పూచీకత్తుల విముక్తి నిధిని ఏర్పాటు చేసింది[21] (2014 జూన్).

మార్గదర్శకాల (2014 జూన్) ప్రకారం, ప్రతి సంవత్సరం డిసెంబరు 31 నాటికి ఉన్న పూచీకత్తుల విలువలో 0.50 శాతం మొత్తం చొప్పున, తరువాతి ఐదు సంవత్సరాలలో కనిష్టంగా మూడు శాతానికి చేరే విధంగా ఈ నిధికి జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పూచీకత్తుల విముక్తి నిధిని క్రమక్రమంగా వాంఛనీయ స్థాయి అయిన ఐదు శాతానికి చేరేలా పెంచాలి. తదనుగుణంగా, ఇచ్చి ఉన్న పూచీకత్తుల విలువ (2022 డిసెంబరు 31 నాటికి ₹1,90,244 కోట్లు) మీద 2022-23 లో ₹951 కోట్లను జమచేయాలి. కానీ, 2022-23 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఏమీ జమ చేయలేదు

ఈ కింద చూపిన విధంగా, రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తుల విముక్తి నిధికి గత ఐదు సంవత్సరాలలో క్రమం తప్పకుండా జమచేయడం లేదు.

[21] జి.ఒ.ఎం.ఎస్. సంఖ్య 4, ఆర్థిక (డి.సి.ఎం.) శాఖ, తేది 2014 జూన్ 11

పట్టిక 2.31: గత ఐదు సంవత్సరాలలో పూచీకత్తుల విముక్తి నిధికి జమ చేయాల్సిన మొత్తాలు, జమ చేసిన మొత్తాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	వివరాలు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
1	ఇచ్చి ఉన్న పూచీకత్తుల విలువ	77,713	89,600	1,05,007	1,35,283	1,90,244
2	జమ చేయాల్సి ఉన్న మొత్తం	389	448	525	676	951
3	జమ చేసిన మొత్తం	200	300	శూన్యం	శూన్యం	శూన్యం
4	3 శాతం చొప్పన కనీస స్థాయి	2,331	2,688	3,150	4,058	5,707
5	5 శాతం చొప్పున వాంఛనీయ స్థాయి	3,886	4,480	5,250	6,764	9,512
6	పూచీకత్తుల విముక్తి నిధిలో ఉన్న మొత్తం*	838	1,225	1,325	1,431	1,543
7	ఇచ్చి ఉన్న పూచీకత్తులతో పోలిస్తే పూచీకత్తుల విముక్తి నిధి శాతం	*1.08*	*1.37*	*1.26*	*1.06*	*0.81*
8	కనీస స్థాయితో పోలిస్తే తగ్గుదల (వరుస 4 - వరుస 6)	1,493	1,463	1,825	2,627	4,164
9	వాంఛనీయ స్థాయితో పోలిస్తే తగ్గుదల (వరుస 5 - వరుస 6)	3,048	3,255	3,925	5,333	7,969

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

* పెట్టుబడుల నుంచి అందిన వడ్డీతో సహా

నిధికి ప్రాప్తించే ఆదాయమే కాకుండా, వివిధ సంస్థల నుంచి ఇచ్చిన పూచీకత్తుల ప్రతిగా పూచీకత్తుల కమీషను రూపంలో అంతకు ముందు సంవత్సరం దక్కిన మొత్తాలను తదుపరి సంవత్సరంలో (అంటే ఈ సంవత్సరం) ఈ నిధికి బదిలీ చేయాలి. పూచీకత్తు కమీషను రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి 2018-19 లో ₹340 కోట్లు, 2020-21 లో ₹6 కోట్లు, 2021-22 లో ₹17 కోట్లు అందాయి. ఆ మొత్తాలను 2019-20, 2021-22, 2022-23 సంవత్సరాలలో పూచీకత్తుల విముక్తి నిధికి బదిలీ చేయాల్సి ఉన్నా చేయలేదు.

రాష్ట్ర ద్రవ్య పరిస్థితిని బట్టి ఈ నిధికి జమ చేయడం జరుగుతోందని ప్రభుత్వం తెలిపింది (2023 సెప్టెంబరు). ప్రభుత్వ పూచీకత్తుల మీద బ్యాంకుల వంటి వాటి నుంచి ఆర్థిక సహాయం అందుకున్న కంపెనీలు / కార్పోరేషన్లు / స్వయం పాలక సంస్థలు ఎగవేసిన ఉదంతాలు లేవని కూడా తెలిపింది. జమ చేయడంలో తగ్గుదలకు, వాంఛనీయ స్థాయికి మధ్య అంతరాన్ని భర్తీ చేయడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా తెలిపింది.

2.6.2.4 రాష్ట్ర పరిహార వనీకరణ నిధి

పరిహార వనీకరణ నిధి చట్టం - 2016, పరిహార వనీకరణ నిధి నియమావళి - 2018 ల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం "రాష్ట్ర పరిహార వనీకరణ నిధి" ని ఏర్పాటు చేసింది (2019 ఫిబ్రవరి).

ఈ నిధి కింద 2022-23 సంవత్సరం ఆరంభంలో ₹1,450 కోట్ల ప్రారంభ నిల్వ ఉంది. ఈ సంవత్సరంలో రాష్ట్ర పరిహార వనీకరణ నిధికి ₹68 కోట్లు జమ కాగా, ఈ నిధి నుంచి ₹404 కోట్లు వితరణ అయ్యి, ఏడాది చివరకు నిధిలో ₹1,114 కోట్ల మొత్తం ఉంది.

2.6.2.5 గ్రామీణాభివృద్ధి నిధి

వడ్డీ ఉండని రిజర్వు నిధుల కింద ఉన్న అభివృద్ధి, సంక్షేమ నిధులలో గ్రామీణాభివృద్ధి నిధి ఒక భాగం. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి చట్టం, 1996 ప్రకారం గ్రామీణాభివృద్ధి నిధి ఏర్పాటు అయింది. (i) గ్రామీణ రోడ్లు, వంతెనలతో

సహా సమగ్ర గ్రామీణాభివృద్ధిని కల్పించడం, వేగవంతం చేయడం, (ii) వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడం కోసం గిడ్డంగుల వ్యవస్థను బలోపేతం చేయడం, (iii) ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వహించడం, బలోపేతం చేయడం ఈ నిధి లక్ష్యాలు.

ఈ నిధికి జమ చేసిన మొత్తాలు, దాని నుంచి ఖర్చుల వివరాలను ఈ కింద పట్టికలో ఇవ్వడం జరిగింది:

పట్టిక 2.32: గ్రామీణాభివృద్ధి నిధి నిర్వహణ

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	సంవత్సరం	ప్రారంభ నిల్వ	ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణల మధ్య పంపకం కారణంగా జమ అయిన మొత్తం	నిధికి జమ చేసిన మొత్తం	నిధి నుంచి ఖర్చు	నిధిలో ఉన్న నిల్వ
1	2018-19	1,285	0	145	0	1,430
2	2019-20	1,430	0	0	0	1,430
3	2020-21	1,430	0	0	0	1,430
4	2021-22	1,430	0	0	0	1,430
5	2022-23	1,430	0	0	0	1,430

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

2018-19 సంవత్సరంలో జమ చేసిన ₹145 కోట్లను మినహాయిస్తే ₹1,430 కోట్ల నిల్వ ఉన్నా, నిధిని వినియోగించడం లేదని పై పట్టికను బట్టి తెలుస్తోంది.

2.6.2.6 కేంద్ర రోడ్లు, మౌలిక సదుపాయల నిధి

డిపాజిటు పద్దుల కింద గతంలో ఉన్న కేంద్ర రోడ్ల నిధిని కేంద్ర రోడ్లు, మౌలిక సదుపాయల నిధిగా పేరు మార్చడం[22] జరిగింది. ఈ కేంద్ర రోడ్లు, మౌలిక సదుపాయల నిధిని జాతీయ రహదారులు, రైలు ప్రాజెక్టులు, రైల్వేలలో భద్రతను మెరుగుపరచడం, రాష్ట్ర, గ్రామీణ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయలు వంటి వాటి అభివృద్ధి, నిర్వహణ కోసం వినియోగించడం జరుగుతుంది. ప్రస్తుతం ఉన్న పద్దుల విధానం ప్రకారం, కేంద్రం నుంచి రాష్ట్రానికి అందే గ్రాంట్లను (లేదా ప్రదానాలను) తొలుత పెద్ద పద్దు సంఖ్య 1601 కింద రెవెన్యూ రాబడిగా వర్గీకరించడం జరుగుతుంది. అటు తర్వాత, ఇలా అందిన మొత్తాన్ని సంబంధిత పెద్ద పద్దుల ద్వారా ప్రజా పద్దు కింద ఉన్న పెద్ద పద్దు సంఖ్య 8449 ఇతర డిపాజిట్లు - కేంద్ర రోడ్లు, మౌలిక సదుపాయల నిధి నుంచి బదలాయింపు అనే పద్దుకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేస్తుంది.

2022-23 సంవత్సరంలో, కేంద్ర రోడ్లు, మౌలిక సదుపాయల నిధి కోసం ₹275.89 కోట్ల గ్రాంట్లు రాష్ట్ర ప్రభుత్వానికి అందాయి. ఈ మొత్తాన్ని పెద్ద పద్దు సంఖ్య 8449-00-103- ఇతర డిపాజిట్లు - కేంద్ర రోడ్లు, మౌలిక సదుపాయల నిధి నుంచి బదలాయింపు అనే పద్దుకు బదిలీ చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ₹128.11 కోట్లను ఖర్చు చేయగా, 2023 మార్చి నాటికి ఈ నిధిలో ₹158.25 కోట్ల నిల్వ ఉంది.

2.6.2.7 భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ శిస్తు

కార్మికులకు ప్రయోజనం కల్పించే ఉద్దేశ్యంతో ఒక శిస్తుని విధించి, వసూలు చేసేందుకు భారత ప్రభుత్వం భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ శిస్తు చట్టం - 1996 అనే చట్టాన్ని చేసింది.

[22] భారత ప్రభుత్వ గెజిట్ ప్రకటన తేది 2018 మార్చి 31

2022-23 సంవత్సరంలో, ప్రభుత్వం కార్మిక శిస్తు రూపంలో ₹89 కోట్లను వసూలు చేసి, అందులో ₹70 కోట్లను భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డుకు బదిలీ చేసింది. 2023 మార్చి నాటికి డిపాజిటు పద్దులలో ఉండి భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డుకు ఇంకా బదిలీ చేయాల్సి ఉన్న మొత్తం ₹30.56 కోట్లు[23].

2.6.3 సంచిత నిధి / ప్రజా పద్దుకు వెలుపల ఉన్న నిధులు, నిర్దిష్ట నిధులు

భారత రాజ్యాంగంలోని అధికరణ 266 (1) ప్రకారం, అధికరణ 267 లోని నిబంధనల మేరకు, ప్రభుత్వానికి అందిన అన్ని రాబడులూ, ఖజనా బిల్లుల రూపేణా గానీ, ఋణాల ద్వారా గానీ, చేబదుళ్ల (అంటే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు) రూపంలో గానీ, ప్రభుత్వం తీసుకున్న అన్ని ఋణాలు, ఇచ్చిన ఋణాలు తిరిగి వసూలు రూపంలో అందిన మొత్తం ధనం "రాష్ట్ర సంచిత నిధి" పేరిట ఉన్న ఒక ఏకీకృత నిధిగా ఏర్పడుతాయి. అంతే కాకుండా, అధికరణ 266 (2) ప్రకారం, భారత ప్రభుత్వం స్వయంగా గానీ, దాని తరపున గానీ, ఒక రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా గానీ, దాని తరపున గానీ అందుకున్న ప్రజాధనం అంతా భారత ప్రభుత్వం ప్రజాపద్దు లేదా రాష్ట్ర ప్రజాపద్దు లో జమ చేయాలి. రాజ్యంగంలోని అధికరణ 266 (3) పేర్కొన్న విధంగా, చట్టానికి అనుగుణమైన ప్రయోజనాల కోసం తప్ప సంచిత నిధి నుంచి ఇతరత్రా ధనాన్ని వినియోగించరాదు.

ఈ కింది ఉదంతాలలో ప్రభుత్వ పద్దులకు వెలుపల ఉన్న నిధులు/ ప్రజాధనం గురించి వివరించడమైంది:

2.6.3.1 తెలంగాణ హరిత నిధి

వనీకరణ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం "తెలంగాణకు హరిత హారం" అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది (2015). మొక్కలు నాటే కార్యక్రమాన్ని మరింత పెంపొందించడం కోసం, దీర్ఘకాలం కొనసాగించడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి "తెలంగాణ హరిత నిధి" పేరిట ఒక ప్రత్యేక నిధిని[24] ప్రకటించారు (2021 అక్టోబరు). ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, సమాజంలోని ఇతర వర్గాలవారి విరాళాల ద్వారా, ఇంకా రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులు, రుసుములు, ఇతర విధింపులలో ఒక నిర్దిష్టమైన భాగం వసూళ్ల ద్వారా ఈ నిధికి ధనం సమకూరుతుంది. ఈ నిధి నిర్వహణకు అటవీ శాఖ సమన్వయశాఖగా వ్యవహరిస్తుంది.

ఈ నిధిని ప్రభావవంతంగా నిర్వహించేందుకు, కార్యకలాపాలను అమలు చేసేందుకు (i) ఒక రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు, (ii) రాష్ట్ర స్థాయి కమిటీ విధులు, (iii) ఈ నిధిని వినియోగించాల్సిన కార్యకలాపాలు, (iv) ఈ నిధికి సంబంధించిన ఆర్థిక పరమైన, పాలనాపరమైన ఏర్పాట్లు మొదలైన అంశాల విషయమై ప్రభుత్వం ఉత్తర్వులు[25] జారీ చేసింది. అటు తర్వాత, ప్రజా ప్రతినిధుల జీతాలు / గౌరవ వేతనాలు / ఇతర వేతనాలు[26], పనులకు సంబంధించిన

---

[23] గత సంవత్సరాలకు చెందిన మొత్తం ₹11.42 కోట్లు, 2022-23 సంవత్సరానికి చెందిన మొత్తం ₹19.14 కోట్లు కలుపుకొని

[24] పర్యావరణం, అడవులు, శాస్త్ర, సాంకేతిక (అటవీ.1) శాఖ జి.ఓ.ఆర్.టి. సంఖ్య 139, తేదీ 16.12.2021 లోని ప్రవేశిక భాగం

[25] తెలంగాణ ప్రభుత్వ పర్యావరణం, అడవులు, శాస్త్ర, సాంకేతిక (అటవీ 1) శాఖ జి.ఓ.ఆర్.టి. సంఖ్య 139, తేదీ 16.12.2021

[26] (i) గౌరవనీయ పార్లమెంటు సభ్యులు / శాసనసభ సభ్యులు / శాసన మండలి సభ్యులు / కార్పొరేషన్ల చైర్మన్లు: సంవత్సరానికి ₹6,000, (ii) కార్పొరేషన్ల చైర్మన్లు అందరు, జిల్లా పరిషత్తు చైర్పర్సన్లు: సంవత్సరానికి ₹1,200, (iii) మండల ప్రజాపరిషత్తు చైర్పర్సన్లు / జిల్లా పరిషత్తు నియోజకవర్గ అధ్యక్షులు: సంవత్సరానికి ₹600, (iv) మండల పరిషత్తు నియోజకవర్గ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు: సంవత్సరానికి ₹120

ఒప్పందాలు[27], నియోజకవర్గ అభివృద్ధి నిధి[28], లైసెన్సుల జారీ[29], అన్ని తరగతుల ఉద్యోగాల జీతాలు[30] మొదలైన వాటి నుంచి ఈ నిధికి జమ చేయాల్సిన మొత్తాలకు సంబంధించి కూడా ప్రభుత్వం ఉత్తర్వులు[31] జారీ చేసింది. ఈ చందాలు/విరాళాలు అన్నీ ఒక జాతీయ బ్యాంకు, అంటే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నిర్వహించే తెలంగాణ హరిత నిధికి జమ అవుతాయి.

అటవీ శాఖ ప్రధాన ముఖ్య అటవీ సంరక్షకులు అందజేసిన సమాచారం ప్రకారం ఈ నిధిలోకి ₹35 కోట్లు అందగా, అందులో నుంచి ₹15 కోట్లు ఖర్చయ్యాయి. 2023 మార్చి 31 నాటికి ఈ నిధిలో ఇంకా ₹20 కోట్లు ఉన్నాయి.

- ఈ నిధిని ప్రజా పద్దులలో (అంటే ప్రభుత్వ పద్దులలో) నిర్వహించడం లేదు. ప్రభుత్వ పద్దులకు బయట ఉన్న జాతీయ బ్యాంకులో నిర్వహించడం జరుగుతోంది. ఈ నిధిలోకి వచ్చే ముఖ్య భాగం స్వచ్ఛంద విరాళాల ద్వారా వస్తుందని, నిర్వహణపరమైన వెసులుబాటు దృష్ట్యా, రాష్ట్ర స్థాయి కమిటీ నేరుగా పర్యవేక్షించే దృష్ట్యా ఈ నిధిని భారతీయ స్టేట్ బ్యాంకులో నిర్వహించడం జరుగుతోందని అటవీ శాఖ ప్రధాన ముఖ్య అటవీ సంరక్షకులు తెలిపారు (2023 ఆగస్టు).

  ఈ సమాధానం అంగీకారం కాదు. నిధిని ఏర్పాటు చేసేటప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఈ నిధిలోకి నిర్దిష్టమైన దామాషాలో ప్రభుత్వం విధించే పన్నులు, రుసుములు, ఇతర విధింపులు జమ అవుతాయి. అంతే కాకుండా, వివిధ వర్గాల ప్రజా సేవకుల వద్ద నుంచి, ప్రభుత్వ ఉద్యోగుల నుంచి, అదే విధంగా పనులకు సంబంధించిన ఒప్పందాల నుంచి, రిజిస్ట్రీకరణ, స్టాంపుల డిపార్టుమెంటు చేసే రిజిస్ట్రీకరణ నుంచి, అనుమతుల జారీ, పునరుద్ధరణ, విద్యార్థుల ప్రవేశ రుసుముల నుంచి నిర్దిష్టమైన మొత్తాన్ని నిర్దేశిస్తూ కూడా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

- ఇంతే కాకుండా, ఈ నిధి ఏర్పాటుకు శాసనసభ ఆమోదం లేదు. ఈ నిధి ఏర్పాటు అనేది కార్యనిర్వహక పరిధిలోనిదే అని, అందువల్ల శాసనసభ ఆమోదం అవసరం లేదని అటవీ శాఖ ప్రధాన ముఖ్య అటవీ సంరక్షకులు తెలిపారు (2023 ఆగస్టు). అయితే, ఏ అధికారం ప్రకారం కార్యనిర్వహక వ్యవస్థనే ఈ నిధిని ఏర్పాటు చేసింది అనే సమాచారం ఇవ్వలేదు.

ఏది ఏమైనా, ఈ నిధిని ప్రభుత్వ పద్దులకు వెలుపల ఏర్పాటు చేయడం జరిగిందనేది మాత్రం వాస్తవమే. ఫలితంగా ధనం వెలుపల ఉండిపోవడమే కాకుండా, శాసనసభ పర్యవేక్షణ లేకుండానే ఖర్చు జరిగే అవకాశం ఉంటుంది.

2.7 ప్రభుత్వ చెల్లింపు బాధ్యతల నిర్వహణ

ప్రభుత్వ చెల్లింపు బాధ్యతల నిర్వహణ అంటే అవసరమైన నిధుల మొత్తాన్ని సేకరించడం, నష్టభయాన్ని తగ్గించడం, మూల్యానికి తగిన లక్ష్యాలను సాధించడం వంటి వాటి ద్వారా ప్రభుత్వ చెల్లింపు బాధ్యతలను నిర్వహించడం కోసం ఒక వ్యూహాన్ని ఏర్పాటు చేసి, అమలు చేసే ప్రక్రియ. చట్టం ద్వారా గానీ, ఇతర వార్షిక బడ్జెటు ప్రకటనల ద్వారా గానీ ప్రభుత్వం నిర్దేశించుకున్న సార్వభౌమ్య ఋణ నిర్వహణ లక్ష్యాలను సాధించడం కూడా దీని ఉద్దేశ్యం.

[27] 0.01 శాతం

[28] 10 శాతం

[29] (i) వ్యాపార సంస్థల, దుకాణాల ఏర్పాటుకు లైసెన్సుల జారీ, లేదా పునరుద్ధరణ ఒక్కొక్కదానికి: ₹1,000; (ii) బార్లు, వైను దుకాణాలకు అనుమతి, లైసెన్సుల పునరుద్ధరణ ఒక్కొక్కదానికి: ₹1,000

[30] (i) అఖిల భారత సేవలు: సంవత్సరానికి ₹1,200; (ii) రాష్ట్ర ప్రభుత్వ గెజిటెడు, నాన్-గెజిటెడు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇంకా కార్పొరేషన్లు, సంఘాలు, విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండే సంస్థలతో సహా సహాయక గ్రాంట్ల నుంచి వేతనాలు పొందే ఉద్యోగులు: సంవత్సరానికి ₹300

[31] తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ (టి.ఎఫ్.ఆర్) జి.ఒ.ఎం.ఎస్. సంఖ్య 17, తేదీ 18.02.2022, తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ (టి.ఎఫ్.ఆర్) జి.ఒ.ఎం.ఎస్. సంఖ్య 16, తేదీ 18.02.2022

2.7.1 చెల్లింపు బాధ్యతల స్వరూపం: భాగాంశాలు

రాష్ట్ర ప్రభుత్వ మొత్తం చెల్లింపు బాధ్యతలలో (i) రాష్ట్ర అంతర్గత ఋణం (మార్కెట్ ఋణాలు, రిజర్వు బ్యాంకు నుంచి చేబదుళ్లు (అంటే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు), జాతీయ చిన్న మొత్తాల పొదుపు నిధికి జారీ చేసిన ప్రత్యేక సెక్యూరిటీలు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న ఋణాలు మొదలైనవి), (ii) కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకున్న ఋణాలు-అడ్వాన్సులు, (iii) ప్రజాపద్దుకు సంబంధించిన చెల్లింపు బాధ్యతలు ఉంటాయి.

రాష్ట్ర ప్రభుత్వం 2023 మార్చి చివరి నాటికి తీర్చాల్సి ఉన్న మొత్తం అప్పు ₹3,56,486 కోట్లు[32]. 2018-23 మధ్యకాలంలో తీర్చాల్సి ఉన్న మొత్తం అప్పు, రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే అప్పుల నిష్పత్తుల సరళి ఈ కింది పటంలో ఉంది:

పటం 2.17: ఇంకా చెల్లించాల్సి ఉన్న మొత్తం బాధ్యతల తీరు



మూలం: ఆర్థిక పద్దులు

గమనిక: 2020-21 సంవత్సరానికి పైన పేర్కొన్న ₹2,75,638 కోట్లలో భారత ప్రభుత్వం నుంచి బ్యాక్-టు-బ్యాక్ ఋణంగా బదలాయించిన ₹2,380 కోట్ల మొత్తాన్ని, అదేవిధంగా 2021-22 సంవత్సరానికి పేర్కొన్న ₹3,14,663 కోట్ల మొత్తంలోనూ, 2022-23 సంవత్సరానికి పేర్కొన్న ₹3,49,537 కోట్ల మొత్తంలోనూ బ్యాక్-టు-బ్యాక్ ఋణం ₹6,949 కోట్లను మినహాయించడం జరిగింది

- అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే చెల్లించాల్సి ఉన్న బాధ్యతలు[33] 11 శాతంపెరిగాయి. 2018-23 మధ్య కాలంలో ₹1,52,574 కోట్ల మేర అంటే 77 శాతంపెరిగాయి.
- మధ్య కాలిక ద్రవ్య విధాన ప్రకటన ప్రకారం రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే మొత్తం చెల్లించాల్సి ఉన్న బాధ్యతల నిష్పత్తి 25 శాతం లోపున ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే మొత్తం చెల్లింపు బాధ్యతల నిష్పత్తిని 25 శాతం లోపునే నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమై, ఆ నిష్పత్తిని 26.61 శాతంగా నమోదు చేసింది.
- పారదర్శకతను పెంపొందించడం కోసం, పారదర్శకంగా ఉండని బడ్జెటు వెలుపలి ఋణాలను నివారించడం కోసం పదిహేనో ఆర్థిక సంఘం రాష్ట్ర ప్రభుత్వాల ఋణ పరిమితులను దాదాపుగా 29 శాతం వద్ద అధిక పరిమితులను సిఫార్సు చేసింది. 2022-23 సంవత్సరానికి పదిహేనో ఆర్థిక సంఘం నిర్దిష్టంగా 29.70 శాతం నిష్పత్తిని సిఫార్సు చేసింది. బడ్జెటు వెలుపలి ఋణాలను పరిగణిస్తే, రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో మొత్తం చెల్లింపు బాధ్యతల నిష్పత్తి 35.64 శాతంగా ఉంది. పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన లక్ష్యం కన్నా ఇది ఎక్కువ (వివరాలు *పేరా 2.7.2* లో చూడవచ్చు).

అంశాల వారీగా 2018-23 మధ్య ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రానికి సంబంధించి తీర్చాల్సి ఉన్న బాధ్యతల సరళి ఈ కింది పట్టికలో ఉంది.

---

32 ఈ మొత్తంలో వస్తు సేవల పన్ను పరిహారంలో తగ్గుదలకు బదులుగా భారత ప్రభుత్వం నుంచి అందిన ₹6,949 కోట్ల బ్యాక్-టు-బ్యాక్ ఋణం కలిసి ఉంది

33 వస్తు సేవల పన్ను పరిహారంలో తగ్గుదలకు బదులు అందిన బ్యాక్-టు-బ్యాక్ ఋణాలను మినహాయించి

పట్టిక 2.33: చెల్లింపు బాధ్యతలలోని వివిధ భాగాంశాల సరళి

(₹ కోట్లలో)

ద్రవ్య బాధ్యత అంశం	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
చెల్లించాల్సి ఉన్న మొత్తం బాధ్యత	**1,96,963**	**2,32,181**	**2,75,638***	**3,14,663***	**3,49,537***
ప్రజాఋణం					
అంతర్గత ఋణం	1,56,933	1,86,959	2,24,379	2,63,041	2,93,129
భారత ప్రభుత్వం నుంచి ఋణాలు	8,231	7,999	7,794*	7,499*	9,485*
ప్రజాపద్దు చెల్లింపు బాధ్యతలు	31,799	37,223	43,464	44,122	46,923
చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధి వగైరా	10,117	10,900	11,845	12,912	14,962
వడ్డీతో కూడిన రిజర్వు నిధులు	377	3,604	3,830	2,196	1,989
వడ్డీ ఉండని రిజర్వు నిధులు	1,591	1,598	1,588	1,590	1,599
వడ్డీతో కూడిన డిపాజిట్లు	2,440	2,581	2,760	2,833	4,149
వడ్డీ ఉండని డిపాజిట్లు	17,274	18,540	23,441	24,591	24,224
అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే చెల్లించాల్సి ఉన్న మొత్తం బాధ్యత పెరుగుదల రేటు (శాతం)	*18.76*	*17.88*	*18.72*	*14.16*	*11.08*
రాష్ట్ర స్థూల గృహోత్పత్తి	8,57,427	9,50,090	9,42,814	11,28,907	13,13,391
చెల్చించాల్సి ఉన్న మొత్తం బాధ్యత / రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (శాతం)	*22.97*	*24.44*	*29.24*	*27.87*	*26.61*
ఋణాలు, ఇతర చెల్లింపు బాధ్యతలు (ఆర్థిక పద్దులలోని వివరణ ప్రకటన 6 ప్రకారం)					
మొత్తం రాక	1,17,715	1,43,870	1,87,503*	1,96,373*	2,13,803*
తిరిగి చెల్లింపు మొత్తం	91,080	1,08,652	1,41,666	1,52,779	1,78,928
అందుబాటులో ఉన్న నికర నిధులు	26,635	35,218	45,837	43,594	34,875
తిరిగి చెల్లింపులు / రాక (శాతం)#	*77.37*	*75.52*	*75.55*	*77.80*	*83.69*

మూలం: ఆర్థిక పద్దులు

* *వస్తు సేవల పన్ను పరిహారం తగ్గుదలకు బదులుగా బ్యాక్-టు-బ్యాక్ ఋణం రూపంలో అందిన 2020-21 సంవత్సరానికి ₹2,380 కోట్లు, 2021-22 సంవత్సరానికి ₹6,949 కోట్లు, 2022-23 సంవత్సరానికి ₹6,949 కోట్లు మినహాయించి, వీటిని రాష్ట్రం తన వనరుల నుండి చెల్లించనవసరం లేదు*

\# *2018-19 లో ₹21,823 కోట్ల చెబదుళ్లను మినహాయించగా 72.22 శాతం, 2019-20 లో ₹37,248 కోట్ల చెబదుళ్లను మినహాయించగా 66.96 శాతం, 2020-21 లో ₹69,454 కోట్ల చెబదుళ్లను మినహాయించగా 61.17 శాతం, 2021-22 లో ₹67,274 కోట్ల చెబదుళ్లను మినహాయించగా 66.23 శాతం, 2022-23 లో ₹82,823 కోట్ల చెబదుళ్లను మినహాయించగా 73.37 శాతం*

అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే చెల్లించాల్సి ఉన్న బాధ్యతలు/రాష్ట్ర స్థూల గృహోత్పత్తి నిష్పత్తి 1.26 శాతం తగ్గింది. 2023 మార్చి చివరి నాటికి ఉన్న తీర్చాల్సిన మొత్తం అప్పుల వివరాలు ఈ కింది పటంలో ఉన్నాయి.

పటం 2.18: 2023 మార్చి చివరి నాటికి ఉన్న చెల్లించాల్సి ఉన్న మొత్తం బాధ్యతల వివరాలు



మూలం: ఆర్థిక పద్దులు

తీసుకున్న అంతర్గత ఋణాలను, తీర్చిన అంతర్గత ఋణాలను పోల్చి ఈ కింది పటంలో చూపడం జరిగింది.

పటం 2.19: తీసుకున్న, తిరిగి చెల్లించిన అంతర్గత ఋణాల సరళి



మూలం: ఆర్థిక పద్దులు; గమనిక: తీసుకున్న, తిరిగి చెల్లించిన చేబదుళ్లను (అంటే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులను) మినహాయించగా

అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే తక్కువ ఋణాలను తీసుకున్నారని, ఎక్కువ తిరిగి చెల్లించారని పై పటం సూచిస్తోంది.

2.7.1.1 ద్రవ్యలోటు కూర్పు - దానిని భర్తీ చేసిన విధానం

రెవెన్యూ రాబడి, అప్పులు కాని ఇతర క్యాపిటల్ రాబడులు కలిపిన మొత్తానికి మించి అయిన నిత్య వ్యావహారిక, మూలధన వ్యయం (ఋణాలు-అడ్వాన్సులతో సహా) భరించేందుకు రాష్ట్రానికి అవసరమైన మొత్తాన్ని ద్రవ్యలోటు సూచిస్తుంది. ద్రవ్యలోటు కూర్పు, దానిని భర్తీ చేసిన తీరును ఈ కింది పట్టికలో చూపడం జరిగింది.

పట్టిక 2.34: ద్రవ్యలోటు కూర్పు - దానిని భర్తీ చేసిన తీరు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	వివరాలు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
ద్రవ్యలోటు కూర్పు						
1	రెవెన్యూ మిగులు (+) లేదా లోటు (-)	4,337	(-)6,254	(-)22,298	(-)9,335	5,944
2	నికర మూలధన వ్యయం	(-)22,641	(-)16,859	(-)15,922	(-)28,874	(-)17,881
3	నికరంగా ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులు	(-)8,640	(-)8,638	(-)10,810	(-)8,421	(-)20,619
4	నికరంగా రాష్ట్రాల మధ్య సర్దుబాటు	(-)5	(-)8	(-)8	(-)8	0
	స్థూల ద్రవ్యలోటు	**(-)26,949**	**(-)31,759**	**(-)49,038**	**(-)46,638**	**(-)32,556**
ద్రవ్యలోటును భర్తీ చేసిన తీరు						
1	మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలు	22,184	30,697	38,782	39,256	31,814
2	జాతీయ చిన్న మొత్తాల పొదుపు నిధికి జారీ చేసిన ప్రత్యేక సెక్యూరిటీలు	(-)814	(-)827	(-)827	(-)827	(-)827
3	ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న ఋణాలు, ఇతర ఋణాలు	1,276	155	(-)535	233	(-)898
4	భారత ప్రభుత్వం నుంచి తీసుకున్న ఋణాలు	(-)400	(-)232	2,175	4,273	1,985
5	చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధి వగైరాలు	845	783	945	1,067	2,049
6	డిపాజిట్లు, అడ్వాన్సులు	3,100	1,406	5,081	1,223	949
7	అనామతు, నానావిధాలు	(-)660	297	(-)232	752	347
8	జమలు	115	7	(-)32	617	(-)466
9	రిజర్వు నిధులు	1,530	4,353	774	(-)1,054	427
10	నికర ఆకస్మిక ఖర్చుల నిధి	(-)2.01	(-)2.11	4.21	(-)0.05	0.05
11	**మొత్తం**	**27,174**	**36,637**	**46,135**	**45,540**	**35,380**
12	నగదు నిల్వలో పెరుగుదల (-) /తగ్గుదల (+)	(-)225	(-)4,878	2,903	1,098	(-)2,824
	స్థూల ద్రవ్యలోటును తీర్చేందుకు ఉపకరించిన మొత్తం (11+12)	**26,949**	**31,759**	**49,038**	**46,638**	**32,556**

మూలం: ఆర్థిక పద్దులు

2022-23 సంవత్సరంలో ద్రవ్యలోటును భర్తీ చేసిన అంశాల కింద రాబడులు, చెల్లింపుల వివరాలను ఈ కింది పట్టికలో చూపడం జరిగింది:

పట్టిక 2.35: ద్రవ్యలోటును భర్తీ చేసిన విడివిడి అంశాల కింద రాబడి, చెల్లింపులు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	వివరాలు	రాబడి	చెల్లింపులు	నికరం
1	మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలు	40,150	8,336	31,814
2	జాతీయ చిన్న మొత్తాల పొదుపు నిధికి జారీ చేసిన ప్రత్యేకసెక్యురిటీలు	0	827	(-)827
3	ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న ఋణాలు	1,410	2,308	(-)898
4	భారత ప్రభుత్వం నుంచి తీసుకున్న ఋణాలు	2,501	516	1,985
5	చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధి వగైరాలు	3,281	1,232	2,049
6	డిపాజిట్లు, అడ్వాన్సులు	82,241	81,292	949
7	అనామతు, నానావిధాలు	2,709	2,362	347
8	జమలు	429	895	(-)466
9	రిజర్వు నిధులు	996	569	427
10	నికర ఆకస్మిక ఖర్చుల నిధి	0.05	0	0
11	**మొత్తం లోటు**	1,33,717	98,337	35,380
12	నగదు నిల్వలో పెరుగుదల (-) / తగ్గుదల (+)	--	--	(-)2,824
13	**స్థూల ద్రవ్యలోటు**	--	--	32,556

మూలం: ఆర్థిక పద్దులు

2022-23 లో, మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలలో కేవలం 56 శాతమే మూలధన వ్యయానికి వినియోగమైంది. ద్రవ్యలోటులో కేవలం 55 శాతం మాత్రమే మూలధనవ్యయం అయింది.

పటం 2.20: మూలధన వ్యయం, ద్రవ్యలోటు, మార్కెటు నుంచి తీసుకున్న ఋణాల పరస్పర సరళి



మూలం: ఆర్థిక పద్దులు

తీసుకున్న మార్కెటు ఋణాలను మూలధన వ్యయం కోసం వినియోగించి ఆస్తులను నెలకొల్పడం ఉత్తమం. 2018-19 సంవత్సరంలో మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలు మూలధన వ్యయం కన్నా తక్కువగా ఉండడం మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలను ఆస్తులు నెలకొల్పడానికే వినియోగించినట్లు సూచిస్తోంది. అయితే, గత నాలుగు సంవత్సరాలుగా, మార్కెటు నుంచి తీసుకున్న ఋణాల కన్నా మూలధన వ్యయం తక్కువగా ఉండడంతో మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలను మూలధన వ్యయం కోసం కాకుండా ఇతర ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నట్లు సూచిస్తోంది.

పై పట్టాన్ని బట్టి, *పట్టిక 2.34* ను బట్టి చూస్తే రెవెన్యూ మిగులు ఉన్నా, మార్కెటు నుంచి తీసుకున్న ఋణాల కన్నా మూలధన వ్యయం తక్కువగా ఉంది. ఋణాలు, అడ్వాన్సులు ఇవ్వడం కోసం మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలను ఉపయోగించడం జరిగింది. *పేరా 2.5.3.3* లో పేర్కొన్నట్లుగా ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులలో గణనీయమైన మొత్తం బడ్జెటు వెలుపలి ఋణాలను తిరిగి తీర్చడం కోసం ఉపయోగించడం జరిగింది.

బడ్జెటు వెలుపలి ఋణాలు, వాటి తిరిగి చెల్లింపులకు సంబంధించిన అంశాలను ఈ కింది పేరాలో చర్చించడమైంది.

2.7.2 బడ్జెటుకు వెలుపలి ఋణాలు

ద్రవ్య బాధ్యత, బడ్జెటు నిర్వహణ (ఎఫ్.ఆర్.బి.ఎం.) చట్టం, దానికి లోబడి చేసిన నియమాల ప్రకారం (i) మొత్తం రెవెన్యూ రాబడిలో శాతంగా రెవెన్యూ లోటు, (ii) రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో శాతంగా ద్రవ్యలోటు, (iii) రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో శాతంగా తీర్చాల్సి ఉన్న మొత్తం చెల్లింపు బాధ్యతల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు వరుస సంవత్సరాల లక్ష్యాలను ప్రకటించాలి. ఈ లక్ష్యాలు ఒక సంవత్సరంలో ప్రభుత్వ వ్యావహారిక వ్యయం మీద, తీసుకునే ఋణాల మీద, ఆర్థిక సంవత్సరం చివరినాటికి తీర్చాల్సి ఉన్న మొత్తం బాధ్యతల మీద పరిమితులను విధిస్తాయి.

రాష్ట్ర సంచిత నిధి పూచీకత్తుగా భారతదేశ భూభాగంలో ఎక్కడైనా రాష్ట్ర ప్రభుత్వాలు ఋణాలు తీసుకోవచ్చు. భారత రాజ్యాంగంలోని అధికరణ 293(3) ప్రకారం ఈ ఋణాల మీద పరిమితులను నియంత్రించడం జరుగుతుంది. రాబడుల అంచనాలు, బహిరంగ మార్కెటులో తీసుకున్న ఋణాలు, ప్రజా పద్దు నుంచి బదిలీల వంటి అన్ని రకాల వనరుల ఋణాల తిరిగి చెల్లింపులను తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం భారత ప్రభుత్వానికి ఆర్థిక వివరణ ప్రకటనలను సమర్పించాలి. వీటి ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఋణాలను తీసుకునేందుకు భారత ప్రభుత్వం సమ్మతిని ఇస్తూ, ఆ ఋణాలకు పరిమితిని కూడా విధిస్తుంది. అయితే, బడ్జెటుకు వెలుపల రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు / కార్పొరేషన్లు / ఇతర సంస్థల ద్వారా ఋణాలను స్వీకరించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నికర ఋణ పరిమితిని దాట వేస్తుంది. పైగా ఆ సంస్థలు తీసుకున్న ఋణాలను తీర్చడం కూడా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత కావడంతో రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు మీద ప్రభావం పడుతుంది. బడ్జెటులో వివరించకుండానే, ఇలాంటి చెల్లింపు బాధ్యతలను సృష్టించడం పారదర్శకత మీద, తరువాతి తరాల సంపద వాటా మీద ప్రశ్నలకు తావు ఇస్తుంది. ఇటువంటి బడ్జెటు వెలుపలి ఋణాలను బడ్జెటు పత్రాలలోని వెల్లడింపు ప్రకటనలలో గానీ, పద్దులలో గానీ పరిగణించడం జరుగదు. వీటికి శాసనసభ ఆమోదం కూడా ఉండదు.

బడ్జెటు వెలుపలి ఋణాలు లేదా బడ్జెటు వెలుపలి ఆర్థిక వనరులు అంటే ప్రభుత్వ ఖర్చుల కోసం ఒక నిర్దిష్టమైన సంవత్సరంలో గానీ, సంవత్సరాలలో గానీ ప్రదానాలు / వినియోగానుమతులను కోరే ఆ సంవత్సరం / ఆయా సంవత్సరాల బడ్జెటులో ప్రతిబింబించకుండా, శాసనసభ నియంత్రణకు వెలుపల ఉండిపోయే ప్రభుత్వ ఆర్థిక వనరులు. ప్రభుత్వానికి సొంతమైన లేదా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు, లేదా వాణిజ్యపరంగా పనిచేసే ప్రభుత్వ శాఖల సంస్థలు ప్రభుత్వం తరఫున మార్కెటు నుంచి ఋణాలను స్వీకరించడం ద్వారా ఈ బడ్జెటు వెలుపలి ఋణాలు సమకూరుతాయి. ఈ ఋణాల తిరిగి చెల్లింపును / ఇతర చెల్లింపు బాధ్యతలను ప్రభుత్వం తన బడ్జెటు నుంచే చేస్తుంది. కనుక, బడ్జెటుకు వెలుపలి ఋణాలు/ఆర్థిక వనరుల సమీకరణ విషయంగా తరుచుగా వడ్డీ చెల్లింపులు చేయడం ఒక బాధ్యత కాగా, ఈ ఋణాలను తీర్చాల్సిన సమయం వచ్చినప్పుడు బడ్జెటు నుంచి తిరిగి చెల్లించడం మరో బాధ్యత. బడ్జెటు వెలుపలి ఋణాలకు, పూచీకత్తులకు మధ్య తేడాను గుర్తించాల్సిన అవసరం ఉంది. పూచీకత్తులు ఆకస్మిక బాధ్యతల వంటివి. పూచీకత్తులన్నీ బడ్జెటు వెలుపలి ఋణాలు కాకపోవచ్చు. అయితే అన్ని బడ్జెటు వెలుపలి ఋణాలకు ప్రత్యేకించిన చెల్లింపులు గానీ, పూచీకత్తులు గానీ ఉంటాయి.

రాష్ట్ర ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టం ప్రకారం, 'మొత్తం చెల్లింపు బాధ్యతలు' అంటే వడ్డీని లేదా అసలు మొత్తాన్ని లేదా రెండింటినీ రాష్ట్ర బడ్జెటు నుంచి చెల్లించే పక్షంలో ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తులతో సహా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రత్యేక ప్రయోజన వాహక సంస్థలు, ఇతర సంస్థలు తీసుకున్న ఋణాలు, తత్సమానమైన ఇతరాలు కూడా ఇమిడి ఉంటాయి.

పారదర్శకత దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా బడ్జెటు వెలుపలి ఋణాలను పూర్తిగా వెల్లడించాల్సిన అవసరం ఉందని, ఇంకా తీర్చాల్సి ఉన్న బడ్జెటు వెలుపలి ఋణాలను స్పష్టంగా గుర్తించాలని, పారదర్శకమైన రీతిలో లోటును, అప్పులను నివేదిస్తూ బడ్జెటు వెలుపలి ఋణాలను నిర్ణీత గడువులోగా నిర్మూలించాలని పదిహేనో ఆర్థిక సంఘం 2020-21 సంవత్సరానికి ఇచ్చిన నివేదికలో సిఫార్సు చేసింది (2019 నవంబరు).

ద్రవ్య సుస్థిరతను దెబ్బతీసేలా ద్రవ్య పారదర్శకత ప్రమాణాలకు విరుద్ధంగా ఉండే ఆకస్మిక చెల్లింపు బాధ్యతలను, బడ్జెటు వెలుపలి లావాదేవీలను మరింతగా పెంచుకోకుండా ప్రభుత్వాలు కఠినమైన క్రమశిక్షణ పాటించాలని పదిహేనో ఆర్థిక సంఘం తన ప్రధాన నివేదిక (2020 అక్టోబరు) లో సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలోనే పారదర్శకతను పెంపొందించేందుకు, పారదర్శకత లేని చెల్లింపు బాధ్యతలను నివారించేందుకు పదిహేనో ఆర్థిక సంఘం అధిక ఋణ పరిమితులను అనుమతించింది.

2.7.2.1 బడ్జెటు వెలుపలి ఋణాలను రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించకపోవడం

ఆరు పథకాలను, నాలుగు ప్రాజెక్టులను బడ్జెటుకు వెలుపలి ఋణాల / బడ్జెటుకు అదనపు వనరుల ద్వారా అమలు చేయనున్నట్లు 2016-17 నుంచి 2019-20 వరకు వివిధ బడ్జెటుల సమర్పణ సమయంలో తెలంగాణ ప్రభుత్వం సూత్రప్రాయంగా రాష్ట్ర శాసనసభకు తెలిపింది. అయితే అటువంటి ఋణాల పరిమాణాన్ని గానీ, ఈ విధంగా బడ్జెటు వెలుపలి ఋణాలు / బడ్జెటుకు అదనపు వనరులు చేకూర్చే సంస్థల పేర్లుగానీ, ఇతర వివరాలు గానీ ఆయా బడ్జెటు పత్రాలలో తెలుపలేదు.

సంస్థల వారీగా తీసుకున్న బడ్జెటు వెలుపలి ఋణాల వివరాలను ఆడిటు ప్రత్యేకించి కోరగా, కంపెనీలు / కార్పొరేషన్ల నుంచి తీసుకోవాలని ప్రభుత్వం ఆడిటుకు తెలిపింది (2023 సెప్టెంబరు).

బడ్జెటుకు వెలుపలి ఋణాల వివరాలను బడ్జెటు పత్రాలలో వెల్లడి చేయకపోవడం పైన పేర్కొన్నట్లు పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సులకు విరుద్ధం.

రాష్ట్ర ప్రభుత్వపు బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించిన పథకాలు / ప్రాజెక్టులు / కార్యక్రమాలు / సంస్థల వివరాలు, ఆయా కంపెనీలు / కార్పొరేషన్లు అందజేసిన సంబంధిత సమాచారాన్ని ఈ కింద ఇవ్వడం జరిగింది:

పట్టిక 2.36: ప్రాజెక్టు / పథకం వారీగా బడ్జెటుకు వెలుపలి ఋణాల వివరాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	పథకం / ప్రాజెక్టు / కార్యక్రమం	బడ్జెటు ప్రసంగం సంవత్సరం	ప్రభుత్వం తెలిపిన బడ్జెటుకు వెలుపలి ఋణాల విలువ	ఈ సంవత్సరంలో ప్రభుత్వం తరపున తీసుకున్న ఋణం#	2023 మార్చి నాటికి ప్రభుత్వం తరపున తీసుకున్న ఋణం#	ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తుల విలువ@	బడ్జెటుకు వెలుపలి ఋణంగా పరిగణించిన విలువ (నిలువు వరుస 6, 7 లలో కనిష్ఠం)
(1)	*(2)*	*(3)*	*(4)*	*(5)*	*(6)*	*(7)*	*(8)*
1	మిషన్ భగీరథ (తెలంగాణ తాగునీటి సరఫరా సంస్థ)	2016-17, 2017-18	సమాచారం ఇవ్వలేదు	శూన్యం	శూన్యం	22,428	22,428
2	రెండు పడక గదుల గృహ నిర్మాణం (తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ)	2016-17, 2017-18, 2018-19	సమాచారం ఇవ్వలేదు	శూన్యం	శూన్యం	7,731	7,731
3	సూక్ష్మ సేద్యం (తెలంగాణ రాష్ట్ర ఉద్యానవనాభివృద్ధి సంస్థ)	2017-18	సమాచారం ఇవ్వలేదు	శూన్యం	132	219	132
4	మూసీ పరివాహ ముఖ ప్రాంతం (మూసి పరివాహక ముఖ ప్రాంతాభివృద్ధి సంస్థ)	2017-18	సమాచారం ఇవ్వలేదు	శూన్యం	శూన్యం	సమాచారం లేదు	--

క్రమ సంఖ్య	పథకం / ప్రాజెక్టు / కార్యక్రమం	బడ్జెటు ప్రసంగం సంవత్సరం	ప్రభుత్వం తెలిపిన బడ్జెటుకు వెలుపలి ఋణాల విలువ	ఈ సంవత్సరంలో ప్రభుత్వం తరపున తీసుకున్న ఋణం#	2023 మార్చి నాటికి ప్రభుత్వం తరపున తీసుకున్న ఋణం#	ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తుల విలువ@	బడ్జెటుకు వెలుపలి ఋణంగా పరిగణించిన విలువ (నిలువు వరుస 6, 7 లలో కనిష్ఠం)
(1)	*(2)*	*(3)*	*(4)*	*(5)*	*(6)*	*(7)*	*(8)*
5	గొర్రెల పెంపకం పథకం (తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య)	2018-19	సమాచారం ఇవ్వలేదు	శూన్యం	3,833	1,314	1,314
6	చేపల పెంపకం (తెలంగాణ మత్స్యకారుల సహకార సమాఖ్య)	2018-19	సమాచారం ఇవ్వలేదు	శూన్యం	600	275	275
7	కాళేశ్వరం ప్రాజెక్టు (కాళేశ్వరం సాగునీటి పారుదల ప్రాజెక్టు సంస్థ)	2019-20	సమాచారం ఇవ్వలేదు	7,137	79,205	64,652	64,652
8	పాలమూరు - రంగారెడ్డి, సీతారామ, దేవాదుల (తెలంగాణ రాష్ట్ర జల వనరుల మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ)	2019-20	సమాచారం ఇవ్వలేదు	1,112	15,284	12,953	12,953
							1,09,485

మూలం: ఆయా సంవత్సరాల బడ్జెటు ప్రసంగాలు, ఆయా సంస్థలు అందజేసిన సమాచారం, ఆర్థిక పద్దులు

 # ఆయా సంస్థలు అందజేసిన సమాచారం ప్రకారం

@ ఆర్థిక పద్దుల ప్రకారం

పైన పేర్కొన్న పథకాలు, సంస్థలే కాకుండా, మరికొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు / స్వయం పాలక సంస్థలు కూడా ప్రస్తుత సంవత్సరంలో, అంతకు ముందు సంవత్సరాలలో ప్రభుత్వం తరపున తీసుకున్న ఋణాలు ఉన్నాయని తెలిపాయి. వివరాలు ఇలా ఉన్నాయి:

పట్టిక 2.37: సంస్థలు తెలిపిన బడ్జెటుకు వెలుపలి ఋణాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	సంస్థ	2022-23 సంవత్సరంలో ప్రభుత్వం తరపున తీసుకున్న ఋణం	2023 మార్చి చివరి నాటికి ప్రభుత్వం తరపున తీసుకున్న ఋణం	ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తుల విలువ@	బడ్జెటుకు వెలుపలి ఋణంగా పరిగణించిన విలువ (నిలువు వరుస 4, 5 లలో కనిష్ఠం)
(1)	*(2)*	*(3)*	*(4)*	*(5)*	*(6)*
1	తెలంగాణ విద్యుత్ ఆర్థిక సంస్థ	శూన్యం	2130	679	679
2	తెలంగాణ రాష్ట్ర విత్తనాల అభివృద్ధి సంస్థ	0.15	398	సమాచారం లేదు	398*
3	తెలాంణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ	సమాచారం ఇవ్వలేదు	సమాచారం ఇవ్వలేదు	1,236	1,236
4	తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ	107	426	255	255
5	హైదరాబాదు మెట్రో రైలు సంస్థ	శూన్యం	294	200	200

క్రమ సంఖ్య	సంస్థ	2022-23 సంవత్సరంలో ప్రభుత్వం తరపున తీసుకున్న ఋణం	2023 మార్చి చివరి నాటికి ప్రభుత్వం తరపున తీసుకున్న ఋణం	ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తుల విలువ@	బడ్జెటుకు వెలుపలి ఋణంగా పరిగణించిన విలువ (నిలువు వరుస 4, 5 లలో కనిష్ఠం)
(1)	*(2)*	*(3)*	*(4)*	*(5)*	*(6)*
6	తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయల సంస్థ	శూన్యం	శూన్యం	262	262
7	హైదరాబాదు మహానగర నీటి సరఫరా, మురుగుపారుదల బోర్డు	శూన్యం	శూన్యం	2,567	2,567
8	తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్యం	శూన్యం	శూన్యం	185	185
					5,782

మూలం: ఆయా సంస్థలు అందజేసిన సమాచారం, ఆర్థిక పద్దులు

సమాచారం ఇవ్వలేదు: సమాచారం ప్రస్తుత సంవత్సరంలో ఇవ్వలేదు కానీ అంతకు ముందు సంవత్సరాలలో తెలిపాయి

@ ఆర్థిక పద్దుల ప్రకారం

** పూచీకత్తులు ఇచ్చినట్లు ప్రభుత్వం వెల్లడి చేయకపోయినా సంస్థ ఇచ్చిన సమాచారం ప్రకారం ₹398 కోట్లుగా పరిగణించడమైంది. తెలంగాణ రాష్ట్ర విత్తనాల అభివృద్ధి సంస్థ నుంచి ప్రభుత్వం పూచీకత్తుల కమిషన్ అందుకున్న (2020 డిసెంబరు) కారణంగా ఈ మొత్తాన్ని పరిగణించడమైంది*

రాష్ట్ర ప్రభుత్వం కూడా సంస్థలకు తదుపరి ఋణాలుగా ₹17,829 కోట్లు అందించింది, అంటే వడ్డీ చెల్లింపు కోసం ₹8,696 కోట్లు, అసలు చెల్లింపు కోసం ₹3,531 కోట్లు, 2022-23 లో వడ్డీ చెల్లింపు కోసమా లేదా అసలు తిరిగి చెల్లింపు కోసమా అనే వివరాలు లేకుండా ₹5,602 కోట్లు అందించింది. ఈ ఋణాలు బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించినవి.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ విషయంలో బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించి ఒక ఉదంతాన్ని ఈ కింద వివరించడం జరిగింది:

పేటిక 2.4: మార్కెటు నుంచి ఋణాలను స్వీకరించడం ద్వారా చెల్లింపులు చేయడం కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థకు రోడ్లు, వంతెన పనులను తాత్కాలికంగా బదిలీ చేయడం

బడ్జెటు కేటాయింపులతో దశల వారీగా 2014-17 మధ్యకాలంలో పూర్తి చేసే విధంగా ₹8,263 కోట్లు విలువ చేసే 792 రోడ్డు, వంతెనల పనులను[34] ప్రభుత్వం మంజూరు చేసింది (2014 నవంబరు).

తరువాతి కాలంలో, ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ రోడ్డు అభివృద్ధి చట్టం, 1998 ని అనువర్తింప చేసుకుని (2016 జూన్), తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ (టి.ఎస్.ఆర్.డి.సి.) ని ఏర్పాటు చేసింది (2017 ఫిబ్రవరి). టి.ఎస్.ఆర్.డి.సి. ఋణంగా స్వీకరించగలిగే గరిష్ఠ పరిమితిని ₹1,000 కోట్ల నుంచి ₹5,000 కోట్లకు ప్రభుత్వం పెంచింది (2017 జూలై).

టి.ఎస్.ఆర్.డి.సి.కి తాత్కాలికంగా 981 పనులను[35] అప్పగిస్తూ, పూర్తి అయిన ఆస్తులను తిరిగి రోడ్లు, భవనాల శాఖకు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వీటికి సంబంధించిన ఆర్థిక బాధ్యతను చెల్లించాలని కూడా ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ పూచీకత్తుల సాయంతో ఋణాల కోసం బ్యాంకులు / ఆర్థిక సంస్థలను

[34] (i) ₹6,289 కోట్లతో సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చే విధంగా 403 రోడ్ల పనులు; (ii) ₹1,974 కోట్లతో వంతెనలు లేని చోట్ల, వంతెనలు దెబ్బతినిపోయిన చోట్ల 389 వంతెన పనులు

[35] (i) 2017 నవంబరు లో పైన పేర్కొన్న 792 పనులతో సహా 930 పనులు, (ii) 2017 డిసెంబరులో మరో 51 పనులు

సంప్రదించేందుకు కూడా ప్రభుత్వం ఆయా సమయాల్లో[36] అనుమతులను ఇచ్చింది. తదనుగుణంగా, టి.ఎస్.ఆర్.డి.సి. రెండు బ్యాంకుల బృందాల నుంచి 2017-18 నుంచి 2021-22 మధ్య కాలంలో ₹4,167 కోట్ల ఋణాలను తీసుకుంది. 2023 మార్చి నాటికి ప్రభుత్వం టి.ఎస్.ఆర్.డి.సి.కి ఇచ్చిన పూచీకత్తుల విలువ ₹3,362 కోట్లు.

- ఋణాలు, అడ్వాన్సుల విషయంలో భారతీయ రిజర్వు బ్యాంకు జారీ చేసిన ఒక మాస్టర్ సర్క్యులర్‌లోని నిబంధన 2.3.8.3 ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే సాంకేతికంగా సాధ్యమయ్యే, ఆర్థికంగా మనగలిగే, ఋణాలివ్వదగిన ప్రాజెక్టులకు బ్యాంకులు / ఆర్థిక సంస్థలు ఋణాలు ఇవ్వవచ్చు. అయితే, ఈ విధంగా ఇచ్చే కాలిక ఋణాలు బడ్జెటు వనరులకు బదులుగా ఇచ్చేవి కాకూడదు. ప్రాజెక్టు నివేదికలోనే బడ్జెటు వనరులకు అదనంగా కాలిక ఋణాల ప్రస్తావన ఉంటే ఆ విధంగా ఇవ్వవచ్చు.

  అయితే, ప్రస్తుత ఉదంతంలో, 2014 నవంబరు నాటి తొలి ప్రణాళిక ప్రకారం ఈ పనులను మూడేళ్లలో బడ్జెటు కేటాయింపులతో చేపట్టాల్సి ఉందే తప్ప, బ్యాంకులు / ఆర్థిక సంస్థల నుంచి అదనపు వనరుల ప్రణాళికలు లేవు. అందువల్ల 2017 నవంబరులో, అంటే మంజూరీ ఇచ్చిన మూడు సంవత్సరాల తరువాత తాత్కాలికంగా పనులను టి.ఎస్.ఆర్.డి.సి.కి అప్పగించడం అంటే చేపట్టి, కొనసాగుతూ ఉన్న పనులకు టి.ఎస్.ఆర్.డి.సి. ద్వారా చెల్లింపులు చేసే వీలు కల్పించడమే.

- ప్రాజెక్టు నుంచి సమకూరే రాబడి ప్రాజెక్టు కోసం తీసుకున్న ఋణ బాధ్యతలను తీర్చేందుకు తగినంతగా ఉంటుందని, ఋణ బాధ్యతల చెల్లింపు / ఋణం తిరిగి చెల్లింపు బడ్జెటు వనరుల నుంచి ఉండరాదని ప్రాజెక్టు మనుగడ, ఋణం ఇవ్వదగిన స్థితిని ధ్రువీకరించుకోవాలని కూడా పైన పేర్కొన్న నిబంధన 2.3.8.3 నిబంధిస్తోంది.

  ఈ పనులను తొలుత రోడ్లు, భవనాలు శాఖ బడ్జెటు సాయంతో చేపట్టి, తరువాత చెల్లింపుల ఏర్పాటు నిమిత్తం టి.ఎస్.ఆర్.డి.సి.కి తాత్కాలికంగా బదిలీ చేసిన కారణంగా టి.ఎస్.ఆర్.డి.సి.కి ప్రత్యక్షంగా ఎలాంటి రాబడిని కూడా ఇవ్వవు. నిజానికి, టి.ఎస్.ఆర్.డి.సి. చట్టం ప్రకారం టోలు గేట్లను ఏర్పాటు చేయవచ్చని, ఈ ప్రతిపాదన ప్రభుత్వం వద్ద పరిగణనలో ఉందని టి.ఎస్.ఆర్.డి.సి.నే తెలిపింది (2023 ఆగష్టు). కనుక, ప్రభుత్వం నుంచి బదిలీ అయిన పనుల విషయంలో బిల్లుల చెల్లింపు కోసం తీసుకున్న ఋణాలను తిరిగి చెల్లించేందుకు ఇప్పటి వరకు టి.ఎస్.ఆర్.డి.సి.కి రాబడి వనరులు ఏవీ లేవని ఋజువు అవుతోంది. పైగా, గత సంవత్సరం 2021-22 లో 'టి.ఎస్.ఆర్.డి.సి.కి టోలు రుసుము చెల్లింపు కోసం టి.ఎస్.ఆర్.టి.సి.కి సహాయం' పేరిట సహాయక గ్రాంట్ల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం టోలు గేట్ల ఏర్పాటు, టోలు రుసుము వసూలు ప్రతిపాదనను అనుమతించక ముందే ₹100 కోట్లను ఇవ్వడం గమనార్హం.

వడ్డీ చెల్లింపు కోసం ₹1,284 కోట్లను, అసలులోకి తిరిగి చెల్లింపు కోసం ₹969 కోట్లను ప్రభుత్వం ఇచ్చిందని టి.ఎస్.ఆర్.డి.సి. తెలిపింది (2023 ఆగష్టు).

పైన పేర్కొన్నట్లు, ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టంలోని 'మొత్తం చెల్లింపు బాధ్యతలు' నిర్వచనం ప్రకారం, ప్రభుత్వ పూచీకత్తుల దన్నుతో టి.ఎస్.ఆర్.డి.సి. తీసుకున్న ఋణాలు ప్రభుత్వ మొత్తం చెల్లింపు బాధ్యతల పరిధిలోకే వస్తాయి. ఆ విధంగా, ప్రభుత్వం ఇచ్చిన ₹3,362 కోట్ల విలువగల పూచీకత్తులను బడ్జెటుకు వెలుపలి ఋణాలుగా పరిగణించడం జరిగింది.

ఆ విధంగా, 2023 మార్చి చివరి నాటికి తెలంగాణకు సంబంధించిన బడ్జెటుకు వెలుపలి ఋణాలను ₹1,18,629 కోట్లుగా మదింపు వేయడం జరిగింది.

[36] ₹600 కోట్లు (2017 అక్టోబరు), ₹600 కోట్లు (2017 డిసెంబరు), ₹3,000 కోట్లు (2018 ఏప్రిలు)

ఈ ₹1,18,629 కోట్ల బడ్జెటుకు వెలుపలి ఋణాలను కూడా పరిగణిస్తే, రాష్ట్రం ఇంకా తీర్చాల్సి ఉన్న మొత్తం చెల్లింపు బాధ్యతలు ₹4,68,166 కోట్లు (₹3,49,537 కోట్లు + ₹1,18,629 కోట్లు) అవుతాయి. ఆ రకంగా, రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే ఇంకా తీర్చాల్సి ఉన్న మొత్తం చెల్లింపు బాధ్యతల నిష్పత్తి 35.64 *శాతం*[37] (₹13,13,391 కోట్ల రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.) లో ₹4,68,166 కోట్లు) అవుతుంది. బడ్జెటుకు వెలుపలి ఋణాలతో సహా కలిపి పదిహేనో ఆర్థిక సంఘం నిర్దేశించిన లక్ష్యం (29.70 *శాతం*) కన్నా ఇది చాలా ఎక్కువ.

ప్రభుత్వపు కీలకమైన సామాజిక / ఆర్థిక పథకాలు / ప్రాజెక్టులకు కొన్ని ముఖ్యమైన ఆర్థిక వనరులు రాష్ట్ర శాసన సభ నియంత్రణకు, పర్యవేక్షణకు వెలుపల ఉన్నాయని పై అంశాలు సూచిస్తున్నాయి.

పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన విధంగా బడ్జెటు పత్రాలలో బడ్జెటుకు వెలుపలి ఋణాల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వెల్లడి చేయాలని ఆడిటు సిఫార్సు చేస్తోంది. పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన విధంగా నిర్ణీత గడువులోగా ఇటువంటి పరోక్ష ఋణాలను పరిహరించేందుకు ఒక నిర్దిష్టమైన సంస్కరణల పథాన్ని కూడా ప్రభుత్వం ప్రకటించాలి.

2.7.3 ఋణ స్వరూపం: ప్రజాఋణాలను తీర్చాల్సిన సమయసూచిక, తిరిగి చెల్లింపు

ప్రజాఋణంలో మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలు, వ్యవస్థాగత ఋణాలు, జాతీయ చిన్న మొత్తాల పొదుపు నిధికి జారీ చేసిన ప్రత్యేక సెక్యూరిటీలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు వంటివి కలిసి ఉంటాయి. అప్పులను తీర్చాల్సిన సమయసూచికను, తిరిగి చెల్లించాల్సిన తీరుతెన్నులను గమనిస్తే ప్రభుత్వానికి ఉన్న చెల్లింపు బాధ్యతలను తెలుసుకోవచ్చు. ప్రజాఋణం తీర్చాల్సిన వైనాన్ని ఈ కింది పటం వివరిస్తుంది.

పటం 2.21: రాష్ట్రం అప్పులను తీర్చాల్సిన వైనం



మూలం: ఆర్థిక పద్దులు

2023 మార్చి 31 నాటికి ఉన్న ప్రజాఋణం తిరిగి చెల్లింపు పట్టీని బట్టి చూస్తే, తీర్చాల్సి ఉన్న మొత్తం ప్రజాఋణంలో 32 *శాతం* (₹98,703 కోట్లు) రానున్న ఏడేళ్లలో తీర్చాలని తెలుస్తోంది.

2022-23 సంవత్సరంలో మార్కెట్ నుంచి తీసుకున్న[38] ₹40,150 కోట్ల ఋణాలలో ₹29,650 కోట్ల మొత్తాన్ని, అంటే 74 *శాతం* ఋణాలను 2033 నుంచి 2042 సంవత్సరాల మధ్యకాలంలో తీర్చాల్సి ఉంటుంది. తీసుకున్న ఋణాలలో 35 *శాతం* దీర్ఘకాలం తర్వాత తీర్చాల్సి ఉన్న స్థితిని అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరంలో చెప్పుకోదగ్గ మార్పు ఉంది.

---

[37] రాష్ట్ర స్థూల గృహోత్పత్తి ₹13,13,391 కోట్లలో పద్దుల ప్రకారం మొత్తం చెల్లింపు బాధ్యతలు ₹3,49,537 కోట్లు, ఇంకా బడ్జెటుకు వెలుపలి ఋణాలుగా ఆడిటు అంచనా వేసిన ₹1,18,629 కోట్లు, వెరసి ₹4,68,166 కోట్లు నిష్పత్తి శాతం

[38] మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలు అంటే రిజర్వు బ్యాంకు నుంచి తీసుకున్న ఋణాలు. వీటిని పెద్ద పద్దు 6003 - చిన్న పద్దు 101 కింద వర్గీకరించడం జరుగుతుంది

ఈ సంవత్సరం తీసుకున్న ఋణాల వడ్డీ రేట్లు 7.45 శాతం నుంచి 8.02 శాతం వరకు ఉన్నాయి. ఇటు స్వల్ప కాలం తర్వాత, అటు దీర్ఘకాలం తర్వాత తీర్చాల్సి ఉన్న ఋణాలకు వడ్డీ రేట్లు ఒకే విధంగా ఉండడం గమనార్హం.

2.7.3.1 రానున్న పది సంవత్సరాలలో అంతర్గత ఋణాల తిరిగి చెల్లింపు, వడ్డీ చెల్లింపు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ఋణాలు భారత రాజ్యాంగంలోని 293 అధికరణకు లోబడి ఉంటాయి. వివిధ రాష్ట్ర ప్రణాళిక కార్యక్రమాల అమలు కోసం, ద్రవ్య బాధ్యతల చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం మార్కెటు నుంచి ఋణాలను తీసుకుంటుంది.

2023 మార్చి నాటి పరిస్థితి ప్రకారం తీర్చాల్సిన బాధ్యత ఉన్న మార్కెటు ఋణాల మొత్తం ఆధారంగా, 2023-24 నుంచి రానున్న పది సంవత్సరాల పాటు మార్కెటు ఋణాల విషయంలో చెల్లించాల్సి ఉన్న అసలు మొత్తాలు, వడ్డీలను లెక్కించి, ఈ కింది పట్టికలో చూపడం జరిగింది:

పట్టిక 2.38: రానున్న పది సంవత్సరాలలో ఏటావారీగా చెల్లించాల్సిన మార్కెటు ఋణాలు, వడ్డీ

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	సంవత్సరం	తీర్చాల్సిన అసలు మొత్తం	చెల్లించాల్సిన వడ్డీ	చెల్లించాల్సిన మొత్తం
1	2023-24	9,341	20,825	30,166
2	2024-25	13,118	19,945	33,063
3	2025-26	15,850	18,842	34,692
4	2026-27	19,786	17,588	37,374
5	2027-28	17,050	16,102	33,152
6	2028-29	4,461	14,858	19,319
7	2029-30	2,449	14,541	16,990
8	2030-31	4,500	14,353	18,853
9	2031-32	7,311	14,032	21,343
10	2032-33	8,587	13,479	22,066
	మొత్తం	1,02,453	1,64,565	2,67,018

మూలం: ఆర్థిక పద్దులు

పై పట్టికను బట్టి చూస్తే, రానున్న పది సంవత్సరాలలో మార్కెటు ఋణాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 2032-33 వరకు అసలు మొత్తం, వడ్డీ కలిపి ₹2,67,018 కోట్లను చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది.

ఇవే కాకుండా, రానున్న పది సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం ఈ కింది ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న ఋణాలకు సంబంధించి ₹19,210 కోట్లను అసలు మొత్తం కింద తీర్చాల్సి ఉంది:

పట్టిక 2.39: ఇతర ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న ఋణాలకు సంబంధించిన రానున్న పది సంవత్సరాలలో చెల్లించాల్సి ఉన్న అసలు మొత్తాలు, వడ్డీలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	సంస్థ	అసలు ఋణం మొత్తం	వడ్డీ	మొత్తం
1	జాతీయ చిన్న మొత్తాల పొదుపు నిధి	5,551	3,926	9,477
2	భారత జీవిత బీమా సంస్థ	36	స.లే	36*
3	భారత సాధారణ బీమా సంస్థ	7	స.లే	7*
4	ఉదయ్ బాండ్లు	8,031	స.లే	8,031*
5	వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంకు	5,526	స.లే	5,526*
6	జాతీయ సహకారాభివృద్ధి సంస్థ	59	స.లే	59*
	మొత్తం	19,210	3,926	23,136

మూలం: ఆర్థిక పద్దులు

*స.లే: సమాచారం లేదు; * వడ్డీ రేట్ల సమాచారం అందుబాటులో లేని కారణంగా చెల్లించాల్సిన వడ్డీ ఇందులో కలిసి లేదు*

ప్రజాఋణం తీర్చేందుకు రానున్న పది సంవత్సరాలలో ప్రభుత్వం గణనీయమైన మొత్తాన్ని (₹2,86,228 కోట్లు) సమీకరించాల్సి ఉందని ఇది సూచిస్తోంది. ప్రభుత్వ ఆర్థికాన్ని ఇది గణనీయమైన ఒత్తిడికి గురి చేయవచ్చు.

2.7.4 అప్పులను భరించే సామర్థ్యం

ద్రవ్య కొలమానాలు, అప్పులకు సంబంధించి కొలమానాల ఆధారంగా, డోమర్ నమూనా ఆధారంగా, ఆయా ఎఫ్.ఆర్.బి.ఎం. లక్ష్యాల స్థూల ద్రవ్య కొలమానాల పాటింపు ఆధారంగా అప్పులను భరించే సామర్థ్యాన్ని విశ్లేషించడం జరిగింది. ఆ విశ్లేషణ వివరాలు ఈ కింది పేరాలలో ఉన్నాయి:

2.7.4.1 సాధారణంగా ఆమోదయోగ్యమైన సూచికల ప్రకారం అప్పులను భరించే సామర్థ్యం

అప్పులను భరించే సామర్థ్యం అంటే ఇటు ప్రస్తుతం, అటు భవిష్యత్తులోనూ అప్పులను తీర్చడంలో రాష్ట్రం సామర్థ్యం. ప్రస్తుతం ఉన్న లేదా చెల్లించాల్సి ఉన్న బాధ్యతలను తీర్చడం కోసం తగినన్ని ద్రవ్యరూప ఆస్తులు ఉన్నాయా లేవా అని, అదే విధంగా అదనపు ఋణాలపై చెల్లించే మూల్యానికి, అటువంటి ఋణాల వల్ల దక్కే ప్రతిఫలానికి మధ్య సమతుల్యతను సాధించే సామర్థ్యాన్ని అప్పులను భరించే సామర్థ్యం సూచిస్తుంది. సాధారణంగా ఆమోదయోగ్యమైన సూచికల ఆధారంగా అప్పులను భరించే విషయంలో రాష్ట్రం సామర్థ్యాన్ని ఈ కింది పట్టికలో విశ్లేషించడం జరిగింది:

పట్టిక 2.40: అప్పులను భరించే సామర్థ్యం – సూచికలు, సరళి

(₹ కోట్లలో)

అప్పులను భరించే సామర్థ్యాన్ని తెలిపే సూచికలు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
తీర్చాల్సి ఉన్న ప్రజాఋణం* (ఆయా సంవత్సరాల మార్చి 31 నాటికి)	1,65,164	1,94,958	2,32,173$	2,70,540$	3,02,614$
తీర్చాల్సి ఉన్న ప్రజాఋణం పెరుగుదల రేటు	15.57	18.04	19.09	16.53	11.86
రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.)	8,57,427	9,50,090	9,42,814	11,28,907	13,13,391
రాష్ట్ర స్థూల గృహోత్పత్తి వృద్ధి రేటు	14.32	10.81	(-)0.77	19.74	16.34
ప్రజాఋణం/ రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (శాతం)	19.26	20.52	24.63	23.96	23.04
రానున్న ఏడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రజాఋణం తీర్చాల్సిన వైనం	76,262	89,228	1,06,468	1,05,242	98,703
తీర్చాల్సి ఉన్న ప్రజాఋణం మీద సగటు వడ్డీ రేటు (శాతం)	8.17	7.99	7.89	7.62	7.61
రెవెన్యూ రాబడితో పోలిస్తే వడ్డీ చెల్లింపుల శాతం	12.41	14.03	16.69	15.03	13.69
తీసుకున్న ప్రజాఋణంతో పోలిస్తే తీర్చిన ప్రజాఋణం శాతం	66.85	59.72	54.47	59.32	76.73
రాష్ట్రానికి నికరంగా అందుబాటులో ఉన్న ప్రజాఋణం#	9,660	15,407	20,374	19,205	10,253
తీసుకున్న ప్రజాఋణంతో పోలిస్తే నికరంగా అందుబాటులో ఉన్న ప్రజాఋణం శాతం	33.15	40.28	45.53	40.68	23.27
ప్రాథమిక లోటు (-) లేదా ప్రాథమిక మిగులు (+)	(-)14,363	(-)17,373	(-)32,197	(-)27,447	(-)10,735
ఋణస్థిరీకరణ (విస్తరించిన పరిమాణం + ప్రాథమిక లోటు)	(-)8,417	(-)13,747	(-)44,340	3,476	15,773

మూలం: ఆర్థిక పద్దులు

* *తీర్చాల్సి ఉన్న ప్రజాఋణం అంటే పెద్ద పద్దులు 6003 - అంతర్గత ఋణం, 6004 - కేంద్ర ప్రభుత్వం నుండి తీసుకున్న ఋణాలు, అడ్వాన్సుల కింద ఇంకా తీర్చాల్సి ఉన్న మొత్తం*

\# *తీసుకున్న ప్రజాఋణం మొత్తంలో నుంచి తీర్చిన ప్రజాఋణం మొత్తం, ప్రస్తుత సంవత్సరం ప్రజాఋణం మీద వడ్డీ చెల్లింపులు పోగా మిగిలి ఉన్న మొత్తాన్ని నికరంగా రాష్ట్ర ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న ప్రజాఋణంగా లెక్కించడం జరిగింది*

$ *ఇంకా చెల్లించాల్సి ఉన్న ప్రజాఋణం మొత్తంలో వస్తు సేవల పన్ను పరిహారంలో తగ్గుదలకు బదులుగా బ్యాక్-టు-బ్యాక్ ఋణం రూపంలో భారత ప్రభుత్వం 2020-21 లో అందజేసిన ₹2,380 కోట్లు, 2021-22, 2022-23 సంవత్సరాలలో చివరి వరకు అందజేసిన ₹6,949 కోట్లను మినహాయించడం జరిగింది*

- తీర్చాల్సి ఉన్న ప్రజాఋణం వృద్ధి రేటు గత ఐదు సంవత్సరాలలో 12 శాతం నుంచి 19 శాతం మేరకు ఉంది. అంతకు ముందు సంవత్సరం వృద్ధి రేటు (17 శాతం) తో పోలిస్తే ఈ సంవత్సరం వృద్ధి రేటు 12 శాతానికి తగ్గింది. రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో ప్రజాఋణం నిష్పత్తి 2020-21 వరకు పెరుగుతూ ఉండి, గత రెండు సంవత్సరాలలో తగ్గుముఖం పట్టింది.

- తీర్చాల్సి ఉన్న ప్రజాఋణం మీద సగటు వడ్డీ రేటు గత ఐదు సంవత్సరాలలో, అంటే 2018-19 లో ఉన్న 8.17 శాతం నుంచి 2022-23 లో 7.61 శాతానికి తగ్గింది. అయితే, సంఖ్యాపరంగా 2018-19 లో ₹12,586 కోట్లుగా ఉన్న వడ్డీ చెల్లింపులు 2022-23 లో ₹21,821 కోట్లకు గణనీయంగా పెరిగాయి.
- ప్రజాఋణం తిరిగి చెల్లింపులకు (₹94,810 కోట్లు[39]), వడ్డీ చెల్లింపులకు (₹21,821 కోట్లు) పోగా, వినియోగం కోసం అందుబాటులో ఉన్న నికర ప్రజాఋణం ₹10,253 కోట్లు (17 శాతం). తీర్చాల్సి ఉన్న ప్రజాఋణం మొత్తంలో రెవెన్యూ రాబడి నిష్పత్తి 2018-19 లో ఉన్న 61 శాతం నుంచి 2022-23 లో 53 శాతానికి తగ్గింది.

2.7.4.2 డోమర్ నమూనా ప్రకారం అప్పులను భరించే సామర్థ్యం

అప్పులను భరించే సామర్థ్యాన్ని మదింపు వేయడంలో పలు పద్ధతులు ఉన్నాయి. అలాంటి వాటిలో ఒకటి డోమర్[40] నమూనా. ప్రభుత్వం తీసుకున్న ఋణాల వడ్డీ రేట్లు దేశ స్థూల గృహోత్పత్తి / రాష్ట్ర స్థూల గృహోత్పత్తి వృద్ధి రేటు కన్నా తక్కువగా ఉండడం ప్రజాఋణం విషయంలో సుస్థిరతకు తప్పని సరి సూత్రం అని డోమర్ నమూనా తెలియజేస్తుంది. వడ్డీ రేటు, రాష్ట్ర స్థూల గృహోత్పత్తి వృద్ధి రేటు ప్రాథమిక బడ్జెటు నిల్వల ఆధారంగా ప్రజాఋణం తీరుతెన్నులు ఈ కింద విధంగా ఉన్నాయి:

డోమర్ అంతరం: g-r (g: వాస్తవికమైన ఆర్థిక పురోగతి రేటు; r: ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వాస్తవికమైన వడ్డీ రేటు)	s<0 (ప్రాథమిక లోటు) (s: ప్రాథమిక నిల్వ)	s>0 (ప్రాథమిక మిగులు) (s: ప్రాథమిక నిల్వ)
g-r > 0 (బలమైన ఆర్థిక పురోగతి)	నమోదు అయిన ప్రాథమిక లోటు స్థిరంగా ఉండి, అప్పులు / రాష్ట్ర స్థూల గృహోత్పత్తి నిష్పత్తితో సమాంతరంగా ఉంటే, వాస్తవిక వడ్డీ రేటు కన్నా వాస్తవిక ఆర్థిక వృద్ధి రేటు ఎక్కువ ఉంటే, అలాంటి అప్పులను భరించవచ్చు.	ప్రాథమిక మిగులు నమోదు అయ్యి, వాస్తవిక వడ్డీ రేటు కన్నా వాస్తవిక ఆర్థిక వృద్ధి రేటు ఎక్కువ ఉంటే, అప్పులు / రాష్ట్ర స్థూల గృహోత్పత్తి నిష్పత్తి తగ్గి, అప్పులు స్థిరత్వం వైపు కదులుతున్నట్లు కనుక అలాంటి అప్పులను భరించవచ్చు.
g-r < 0 (ఆర్థిక పురోగతి మందగమనం)	ప్రాథమిక లోటు నమోదు అయ్యి, వాస్తవిక వడ్డీ రేటు కన్నా వాస్తవిక ఆర్థిక వృద్ధి రేటు తక్కువ ఉంటే, అప్పులు పరిమితులు లేకుండా పెరుగవచ్చు కనుక భరించసాధ్యం కాదు.	ప్రాథమిక మిగులు నమోదు అయ్యి, వాస్తవిక వడ్డీ రేటు కన్నా వాస్తవిక ఆర్థిక వృద్ధి రేటు తక్కువ ఉంటే, మధ్యకాలికంగా, దీర్ఘకాలికంగా తగ్గించకపోతే అప్పులను భరించడం సాధ్యం కాదు.

తెలంగాణ రాష్ట్రానికి పై నమూనాను వర్తింపజేసిన విశ్లేషణ తాలూకు ఫలితాలను ఈ కింద పట్టికలో ఇవ్వడం జరిగింది:

పట్టిక 2.41: డోమర్ నమూనా ప్రకారం అప్పులను భరించే సామర్థ్యం

సంవత్సరం	వాస్తవిక వృద్ధి రేటు (g)	వాస్తవిక వడ్డీ రేటు (r)	డోమర్ అంతరం (g-r)	ప్రాథమిక లోటు (-) లేదా మిగులు ((+) (s) (₹ కోట్లలో)	మదింపు
2018-19	9.15	5.55	3.60	(-)14,363	g-r>0, s<0; కనుక ప్రజాఋణం శూన్యం కన్నా ఎక్కువైన ఒక స్థిరమైన స్థాయికి చేరుతుంది.
2019-20	5.35	3.44	1.91	(-)17,373	
2020-21	(-)6.04	(-)0.07	(-)5.97	(-)32,197	g-r<0, s<0; కనుక ప్రజాఋణం స్థిరమైన స్థాయికి చేరకుండా అప్రతిహతంగా పెరుగుతుంది
2021-22	11.97	0.54	11.43	(-)27,477	g-r>0, s<0; కనుక ప్రజాఋణం శూన్యం కన్నా ఎక్కువైన ఒక స్థిరమైన స్థాయికి చేరుతుంది
2022-23	7.76	-1.00	8.76	(-)10,735	

మూలం: ఆర్థిక పద్దులు

39 రిజర్వు బ్యాంకు వద్ద తీసుకునే చేబదుళ్ల తిరిగి చెల్లింపులతో సహా ₹94,810 కోట్లు; తీసుకున్న చేబదుళ్ల మొత్తం ₹82,823 కోట్లను మినహాయించగా ప్రజాఋణం తిరిగి చెల్లింపు ₹11,987 కోట్లు

40 ఇ.డి. డోమర్, 1914-1997

గత ఐదు సంవత్సరాలలోనూ (2018-2023) రాష్ట్రానికి ప్రాథమిక లోటే ఉంది. కోవిడ్ - 19 సంవత్సరం (2020-21) లో డోమర్ అంతరం ఋణాత్మకంగా మారింది. మిగతా అన్ని సంవత్సరాలలోనూ ధనాత్మకంగా ఉంది. కావున డోమర్ నమూనా ప్రకారం అప్పులను భరించే సామర్థ్యాన్ని విశ్లేషణ చేస్తే ప్రజాఋణం శూన్యం కన్నా ఎక్కువైన ఒక స్థిరమైన స్థాయికి చేరుకుంటుందని అర్థం చేసుకోవచ్చు.

ఏదేమైనప్పటికీ 2021-22, 2022-23 సంవత్సరాల్లో డోమర్ అంతరాన్ని గమనించడం ద్వారా బలమైన ఆర్థిక వృద్ధి (g-r>0గా వ్యక్తీకరిస్తే) సరళిని సామాన్యధర్మంగా అన్వయించలేము. ఇంకా 2021-2023 కాలంలో ప్రజాఋణ రాబడులలో గణనీయమైన భాగం (80 నుండి 84 శాతం) మునుపటి సంవత్సరాల్లో తీసుకున్న ఋణాల చెల్లింపు కోసం వినియోగించారు, తద్వారా ఆర్థిక వృద్ధి ఋణాన్ని తీర్చడానికి తగినంత బలంగా లేదని సూచిస్తుంది.

అంతేకాకుండా రాష్ట్ర ఋణ స్థిరత్వాన్ని అస్థిరంగా మార్చే ప్రజా పద్దు చెల్లింపు బాధ్యతలు, బడ్జెటుకు వెలుపల తీసుకున్న ఋణాలు, ఏవైనా జాబితా చేయని ఆదాయ నష్టాలు వంటి ఇతర అంశాలను కూడా లెక్కించాలి.

2.7.4.3 ఎఫ్.ఆర్.బి.ఎం. లక్ష్యాల స్థూల-ద్రవ్య కొలమానాల పాటింపు ప్రకారం అప్పులను భరించే సామర్థ్యం

మధ్య కాలిక ద్రవ్య విధాన ప్రకటన (ఎ: ద్రవ్య సూచికలు - ఏటావారీ లక్ష్యాలు) లక్ష్యాలతో పోలిస్తే లక్ష్యసాధనలను ఈ కింద చూపడమైంది:

పట్టిక 2.42: మధ్యకాలిక ద్రవ్య విధాన ప్రకటన పాటింపు రీత్యా అప్పులను భరించే సామర్థ్యం

ద్రవ్య కొలమానాలు		మధ్యకాలిక ద్రవ్య విధాన ప్రకటనలో పేర్కొన్న లక్ష్యాలతో పోలిస్తే లక్ష్యసాధన				
		2018-19	2019-20	2020-21	2021-22	2022-23
మొత్తం రెవెన్యూ రాబడిలో శాతంగా రెవెన్యూ లోటు (-) లేదా మిగులు (+) (₹ కోట్లలో)	లక్ష్యం	4.21	1.81	3.13	3.92	1.95
	లక్ష్యసాధన	4.28	(-)6.10	(-)22.10	(-)7.32	3.73
ద్రవ్య లోటు (₹ కోట్లలో) (రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో శాతంగా)	లక్ష్యం	3.25 శాతం	3.25 శాతం (+)₹1,435 కోట్లు*	4.75 శాతం#	4.00 శాతం	5.00 శాతం @
	లక్ష్యసాధన	3.14 శాతం	3.19 శాతం (+)₹1,435 కోట్లు	5.20 శాతం	4.13 శాతం	2.48 శాతం
రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే తీర్చాల్సిన మొత్తం బాధ్యతల నిష్పత్తి (శాతంలో)	లక్ష్యం	25.00	25.00	25.00	25.00	25.00
	లక్ష్యసాధన	22.97	24.44	29.24	27.87	26.61
అంతకు ముందు సంవత్సరం రెవెన్యూ రాబడితో పోలిస్తే శాతంగా పూచీకత్తులు	లక్ష్యం	90	200$	200	200	200
	లక్ష్యసాధన	87	88	102	134	156

మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు, రాష్ట్ర స్థూల గృహోత్పత్తికి సంబంధించి గణాంకాలు-కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ, ద్రవ్య విధాన ప్రకటన

* *2019-20 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రం అర్హతకి మించి అదనంగా ఋణాలను తీసుకునేందుకు ఒకసారి ప్రత్యేక మినహాయింపును అనుమతిస్తూ భారత ప్రభుత్వం చేసిన (2020 ఫిబ్రవరి) నిర్ణయానికి అనుగుణంగా 2020 జనవరి 1 నుంచి అమలులోకి వచ్చిన టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం (సవరణ) చట్టం, 2020 (2020 సెప్టెంబరు 19) ప్రకారం రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో 3.25 శాతానికి మించి ₹1,435 కోట్ల మేర అదనపు ద్రవ్యలోటును అనుమతించడం జరిగింది.*

2020 మే 17 నాటి భారత ప్రభుత్వ లేఖ ప్రకారం, రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో 3 శాతంగా ఉన్న సాధారణ ఋణ పరిమితికి అదనంగా, తెలంగాణ రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో 1.75 శాతం వరకు అదనపు ఋణ పరిమితిని ఉపయోగించుకోగలిగింది (బేషరతుగా: 0.50 శాతం; నాలుగు సంస్కరణలలో మూడింటిని నెరవేర్చడం ద్వారా: 0.50 శాతం; వన్ నేషన్ వన్ రేషన్ కార్డు సిస్టమ్ అమలు కారణంగా: 0.25 శాతం; సులభతర వ్యాపార సంస్కరణల (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ద్వారా : 0.25 శాతం; పట్టణ స్థానిక సంస్థల సంస్కరణల ద్వారా: 0.25 శాతం)

@ *XV ఆర్థిక సంఘం అనుమతించిన అదనపు ఋణ పరిమితి దృష్ట్యా, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టానికి సవరణ చేసి 2022-23 సంవత్సరానికి సంబంధించి ద్రవ్య లోటు పరిమితి లక్ష్యాన్ని రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో ఐదు శాతానికి పెంచింది.*

$ *టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం. (సవరణ) చట్టం - 2020 ద్వారా ఈ పరిమితిని 90 శాతం నుంచి 200 శాతానికి పెంచడం (2020 సెప్టెంబరు) జరిగింది.*

- వరుసగా మూడు సంవత్సరాలు 2019-20 నుంచి 2021-22 వరకు రెవెన్యూ మిగులును సాధించడంలో రాష్ట్రం విఫలమైంది. అయితే, ప్రస్తుత సంవత్సరం 2022-23 లో రాష్ట్రం ₹5,944 కోట్ల రెవెన్యూ మిగులు నమోదు చేసింది. ప్రభావశీలంగా రెవెన్యూ మిగులు ₹1,680 కోట్లు మాత్రమే (*పేరా 1.8* లో పేర్కొన్నట్లు).

- కోవిడ్ - 19 మహమ్మారి కారణంగా పాక్షికంగా ప్రభావితమైన 2020-21, 2021-22 సంవత్సరాలలో రాష్ట్రం ద్రవ్యలోటు లక్ష్యాలను సాధించలేకపోయింది. అయితే, ప్రస్తుత సంవత్సరంలో ఈ లక్ష్యాన్ని సాధించగలిగింది.

- రాష్ట్ర స్థూల గృహోత్పత్తిలో తీర్చాల్సిన మొత్తం బాధ్యతల నిష్పత్తి విషయంలో రాష్ట్రం వరుసగా గత మూడు సంవత్సరాలుగా లక్ష్యాన్ని సాధించలేకపోయింది. ఈ లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్ర వైఫల్యం అప్పులను భరించే సామర్థ్యం విషయంలో ప్రమాద సంభావ్యతను పెంచుతుంది.

- అంతకు ముందు సంవత్సరం ఉన్న రెవెన్యూ రాబడితో పోలిస్తే పూచీకత్తుల విషయంలో రాష్ట్రం లక్ష్యాలను సాధించగలిగింది. అయితే, ఈ పరిమితిని 2020 సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం 90 *శాతం* నుంచి 200 *శాతం* వరకు పెంచిన విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

  పైగా, ఇలా పూచీకత్తుల పరిమితి పెంచిన విషయంతో పాటు, ప్రభుత్వం కొన్ని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు / పథకాలను ప్రభుత్వ రంగ సంస్థలు / ప్రత్యేక వాహక సంస్థలు ప్రభుత్వ పూచీకత్తుల సాయంతో తీసుకున్న బడ్జెటుకు వెలుపలి ఋణాల ద్వారా అమలు చేస్తున్న విషయాన్ని కూడా గమనించాలి. ఇటువంటి బడ్జెటుకు వెలుపలి ఋణాలను చెల్లించే బాధ్యతను గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్నందున, ఆ వాస్తవంతో పాటుగా రాష్ట్రం అప్పులను భరించే సామర్థ్యాన్ని అవగతం చేసుకోవాలి.

- బడ్జెటుకు వెలుపలి ఋణాల అంశం గూర్చి *పేరా 2.7.2* లో చర్చించడం జరిగింది. రాష్ట్ర బడ్జెటు నుండి తీరుస్తున్న ₹1,18,629 కోట్ల బడ్జెటుకు వెలుపలి ఋణాలను, ఇతర చెల్లింపు బాధ్యతలను పరిగణిస్తే, ఋణాలకు, రాష్ట్ర స్థూల గృహోత్పత్తికి నిష్పత్తి 35.64 *శాతం*గా ఉంటుంది. ఇది టి.ఎస్.ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టం నిర్దేశించిన 25 *శాతం* లక్ష్యం కన్నా 10.64 *శాతం* ఎక్కువ. ఇది పదిహేనో ఆర్థిక సంఘం నిర్దేశించిన లక్ష్యం (29.70 *శాతం*) కన్నా కూడా 5.94 *శాతం* ఎక్కువ.

మొత్తం మీద అప్పులను భరించే సామర్థ్యం విషయంపై జరిపిన విశ్లేషణలో సాధారణంగా ఆమోదయోగ్యమైన సూచికలను బట్టి చూస్తే బడ్జెటుకు వెలుపలి ఋణాల తిరిగి చెల్లింపు బాధ్యతను కూడా కలిపి చూస్తే రాష్ట్ర ప్రభుత్వ నికర ప్రజాఋణం లభ్యత ఋణాత్మకం ఉంటుంది. ఇది రాష్ట్ర ఆర్థికం మీద గణనీయమైన ఒత్తిడిని కలుగజేయవచ్చు, అప్పులను భరించే విషయంలో రాష్ట్రం సామర్థ్యాన్ని అవాంఛనీయమైన స్థాయికి నెట్టవచ్చు.

ఇక ఎఫ్.ఆర్.బి.ఎం. లక్ష్యాలకు సంబంధించి స్థూల-ద్రవ్య కొలమానాల పాటింపు దృష్ట్యా చూస్తే 2022-23 లో అప్పులను భరించే సామర్థ్యం మెరుగయినా, ముఖ్యంగా బడ్జెటుకు వెలుపలి ఋణాల కోసం భారీ పూచీకత్తులు ఇచ్చిన వాస్తవంతో పాటు ఈ అంశాన్ని పరిశీలించాలి. పైగా, మార్కెటు ఋణాల విమోచనం కోసం ఏర్పాటైన సంచిత ఋణ విమోచన నిధికి, పూచీకత్తుల కారణంగా ఎదురయ్యే బాధ్యతల నిమిత్తం ఏర్పాటైన పూచీకత్తుల విముక్తి నిధికి ప్రభుత్వం కూడా జమ చేయడం లేదు.

ఇంకా, ఇంతకు ముందు *పేరా 2.7.1.1 లో పేర్కొన్నట్లు ప్రభుత్వం తీసుకున్న మార్కెటు ఋణాలలో గణనీయమైన భాగం బడ్జెటుకు వెలుపల ప్రభుత్వం తీసుకున్న ఋణాల చెల్లింపు (అసలు మొత్తంలోకి, వడ్డీల చెల్లింపుకు) కోసం,* ప్రభుత్వ రంగ సంస్థలు / ప్రత్యేక ప్రయోజన వాహకాలు / స్వయం పాలక సంస్థలకు *తిరిగి ఋణాలు, అడ్వాన్సులుగా ఇవ్వడం కోసం ప్రభుత్వం వినియోగించింది. అప్పులను భరించే సామర్థ్యం దృష్ట్యా ఇది ఆరోగ్యకరమైన చర్య కాదు.*

2.7.4.4 తీసుకున్న ఋణాల వినియోగం

తీసుకున్న ఋణాలను ఆస్తుల ఏర్పాటు కోసం, అభివృద్ధి కార్యకలాపాల కోసం వినియోగించడం శ్రేష్ఠం. తీసుకున్న ఋణాలను ప్రస్తుత వినియోగం కోసమో, తీర్చాల్సి ఉన్న ఋణాల మీద వడ్డీ చెల్లింపుల కోసమో ఉపయోగించడం మనుగడకు మేలు చేయదు. తీసుకున్న ఋణాల వినియోగం వివరాలు ఈ కింది పట్టికలో ఉన్నాయి:

పట్టిక 2.43: తీసుకున్న ఋణాల వినియోగం

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	వివరాలు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
1	తీసుకున్న ఋణాల మొత్తం	1,17,715	1,43,870	1,85,123#	1,91,804#	2,13,803
2	తీసుకున్న ఋణాల తిరిగి చెల్లింపు (అసలు)	91,080	1,08,652	1,41,666	1,52,779	1,78,928
3	నికర మూలధన వ్యయం	22,641	16,859	15,922	28,874	17,881
4	ఇచ్చిన నికర ఋణాలు, అడ్వాన్సులు	8,640	8,638	10,810	8,421	20,619
5	అందుబాటులో ఉన్న ఋణాల నుంచి చేసిన నిత్య వ్యావహారిక వ్యయభాగం (=1-2-3-4)	(-)4,646	9,721	16,725	1,730	(-)3,625

మూలం: ఆర్థిక పద్దులు

 # తీర్చాల్సి ఉన్న ప్రజాఋణం మొత్తంలో వస్తు సేవల పన్ను పరిహారంలో తగ్గుదలకు బదులుగా భారత ప్రభుత్వం నుంచి 2021-22 లో అందిన ₹2,380 కోట్ల మేర, 2021-22 లో ₹4,569 కోట్ల మేర బ్యాక్-టు-బ్యాక్ ఋణాన్ని మినహాయించడం జరిగింది

నికరంగా అందుబాటులో ఉన్న ఋణనిధులలో నుంచి వినియోగమయిన నిత్యవ్యావహారిక వ్యయం (రెవెన్యూ ఖర్చులు) ఋణాత్మకంగా ఉంది అంటే ఈ సంవత్సరంలో రెవెన్యూ మిగులు ఉందని, అది మూలధన వ్యయానికి వినియోగం అయి ఉండవచ్చని అర్థం.

₹21,821 కోట్ల వడ్డీ చెల్లింపులు, ₹1,78,928 కోట్ల ఋణ చెల్లింపులను పరిగణనలోకి తీసుకుంటే, మూలధన వ్యయం/ఋణాలు, అడ్వాన్సులపై వినియోగానికి అందుబాటులో ఉన్న ఋణాలు ₹13,054 కోట్లు.

తీసుకున్న ఋణ నిధుల వినియోగపు సరళి ఈ కింది పటంలో ఉంది:

పటం 2.22: తీసుకున్న ఋణాలను వినియోగించిన సరళి



మూలం: ఆర్థిక పద్దులు

పైన పటాన్ని బట్టి చూస్తే, మూలధన వ్యయం కోసం ఋణ నిధుల వినియోగం తగ్గిందని తెలుస్తోంది. మరోవైపు, ఋణాలు, అడ్వాన్సులు ఇవ్వడం కోసం వినియోగించడం పెరిగింది. గతంలో తీసుకున్న ఋణాల తిరిగి చెల్లింపులో వాటా పెరుగుదలకు కారణం చేబదుళ్లు (వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్).

2.7.4.5 పూచీకత్తులు - ఆకస్మిక చెల్లింపు బాధ్యతల పరిస్థితి

పూచీకత్తు అందుకున్న ఋణగ్రహీత సంస్థ తీర్చడంలో విఫలమైతే, ఆ పూచీకత్తులు రాష్ట్ర సంచిత నిధికి ఆకస్మిక చెల్లింపు బాధ్యతలుగా పరిణమిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం 2018-23 మధ్యకాలంలో ఇచ్చి ఉన్న పూచీకత్తుల వివరాలు ఈ కింది పట్టికలో ఉన్నాయి:

పట్టిక 2.44: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తులు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	వివరాలు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
1	గత సంవత్సరం రెవెన్యూ రాబడి	88,824	1,01,420	1,02,544	1,00,914	1,27,469
2	వడ్డీతో సహా ఇచ్చి ఉన్న పూచీకత్తుల విలువ విషయంలో పరిమితి	79,942	2,02,840	2,05,088	2,01,828	2,54,938
3	వడ్డీతో సహా ఇచ్చి ఉన్న పూచీకత్తుల విలువ	77,713	89,601	1,05,007	1,35,283	1,98,244

మూలం: ఆర్థిక పద్దులు

నష్టభయంతో కూడిన వార్షిక పూచీకత్తుల విలువ గత సంవత్సరం మొత్తం రెవెన్యూ రాబడిలో 90 శాతం వరకూ ఉండొచ్చని తెలంగాణ రాష్ట్ర ద్రవ్య బాధ్యత, బడ్జెటు నిర్వహణ చట్టం - 2005 పరిమితిని విధించింది. అయితే, తెలంగాణ రాష్ట్ర ద్రవ్య బాధ్యత, బడ్జెటు నిర్వహణ (సవరణ) చట్టం - 2020 (2020 సెప్టెంబరు) ద్వారా ఈ పరిమితిని 200 శాతానికి పెంచడం జరిగింది. ఆ ప్రకారం చూస్తే, 2023 మార్చి నాటికి ఇచ్చి ఉన్న పూచీకత్తుల విలువ (₹1,98,244 కోట్లు), గత సంవత్సరపు రెవెన్యూ రాబడి (అంటే, 2021-22 లో ₹1,27,469 కోట్లు) తో పోలిస్తే 156 శాతంగా ఉండి, పెంచిన పరిమితిలోపునే ఉంది.

ప్రభుత్వం ఇచ్చిన మొత్తం పూచీకత్తులలో, 90 శాతం పూచీకత్తులు ప్రధానంగా కేవలం ఐదు సంస్థలు అంటే, (i) కాళేశ్వరం ప్రాజెక్ట్ అమలు కోసం కాళేశ్వరం నీటిపారుదల ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (₹64,652 కోట్లు), (ii) తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ (₹50,000 కోట్లు), (iii) తెలంగాణ రాష్ట్ర డిస్కములు (₹27,852 కోట్లు), (iv) ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ మిషన్ భగీరథ అమలు కొరకు తెలంగాణ తాగునీటి సరఫరా కార్పొరేషన్ లిమిటెడ్ (₹22,428 కోట్లు), (v) తెలంగాణ రాష్ట్ర నీటి వనరుల మౌలికసదుపాయల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (₹12,953 కోట్లు) కు ఇచ్చినవే.

₹1,98,244 కోట్ల విలువ గల 20 పూచీకత్తులలో రాష్ట్ర ప్రభుత్వం శాసనసభకు ₹1,32,244 కోట్ల విలువ గల 19 పూచీకత్తులను బడ్జెటు పత్రాలలో వెల్లడించింది (కింద ఉన్న *సబ్-పేరా (i)* చూడవచ్చు). అందులో, ₹1,18,320 కోట్ల (60 శాతం) విలువ గల 15 పూచీకత్తులు బడ్జెటుకు వెలుపలి ఋణాలు ఉన్న సంస్థలకు సంబంధించినవి.

(i) రాష్ట్ర ప్రభుత్వం శాసనసభకు సమర్పించిన పూచీకత్తుల ప్రకటన అసంపూర్ణం

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటు పత్రాలలో సంపుటి V/2 -ప్రభుత్వ పూచీకత్తులు, ఋణ పరిస్థితి ప్రకటనలో భాగంగా ఇచ్చిన పూచీకత్తుల జాబితాను రాష్ట్ర శాసనసభకు సమర్పిస్తోంది.

- అయితే, 'భారత ప్రభుత్వ అకౌంటింగు ప్రమాణాలు 1- ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తులు, వెల్లడింపుల' పాటింపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ (విలువ ₹50,000 కోట్లు) ఇచ్చిన పూచీకత్తులను వెల్లడించాల్సి ఉన్నా, పూచీకత్తుల జాబితాలో పొందుపర్చలేదు.

- తెలంగాణ రాష్ట్ర డిస్కముల విషయంలో ప్రభుత్వం ₹11,852 కోట్ల మేర పూచీకత్తులను మాత్రమే వెల్లడి చేయడంతో ఇచ్చిన పూచీకత్తుల విలువ దాదాపు ₹16,000 కోట్ల మేర తక్కువగా ఉంది.
- తెలంగాణ రాష్ట్ర విత్తనాల అభివృద్ధి సంస్థ 2023 మార్చి నాటికి ప్రభుత్వం తరఫున ₹398 కోట్లను ఋణం స్వీకరించినట్లు, ₹38 కోట్ల వడ్డీతో సహా ఈ మొత్తం ఇంకా ప్రభుత్వం నుంచి తిరిగి భర్తీ కావల్సి ఉన్నట్లు తెలిపింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం శాసనసభకు సమర్పించిన పూచీకత్తుల ప్రకటన జాబితాలో ఈ విషయం పొందుపర్చలేదు. నిజానికి, 2020 డిసెంబరులో తెలంగాణ రాష్ట్ర విత్తనాల అభివృద్ధి సంస్థ ప్రభుత్వ పద్దులలోకి ₹6 కోట్లను పూచీకత్తు కమిషనుగా జమ చేసింది.

(ii) పూచీకత్తులను ఇచ్చేటప్పుడు ఆదేశాలను పాటించకపోవడం

మునుపటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూచీకత్తులను జారీ చేసేటప్పుడు పాటించాల్సిన ఆదేశాలను[41] జారీచేసింది (2003 సెప్టెంబరు). ఆ ఆదేశాల పాటింపును గమనించడం జరిగింది.

- సచివాలయంలోని సంబంధిత పరిపాలనా శాఖలు, ప్రభుత్వ శాఖాధిపతులు ద్రవ్యపరమైన నష్ట భయాన్ని (అంటే రిస్కును) బేరీజు వేసి, పూచీకత్తులను నేరుగా భారం పడేవి (అంటే 100 శాతం నష్ట భయం), అధిక నష్ట భయం (75 శాతం), మధ్యస్థ నష్ట భయం (50 శాతం), అల్ప నష్ట భయం (25 శాతం), అత్యల్ప నష్ట భయం (5 శాతం) ఉన్నవిగా వర్గీకరించాలని[42] ప్రభుత్వ ఉత్తర్వులు నిర్దేశించాయి.

  ద్రవ్య విధాన ప్రకటనలో ఆర్థిక శాఖ పూచీకత్తులను ఈ కింది విధంగా వర్గీకరించింది (2023 ఫిబ్రవరి):

పట్టిక 2.45: రాష్ట్ర ప్రభుత్వంచే పూచీకత్తుల వర్గీకరణ

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	వర్గీకరణ	మొత్తం
1	నేరుగా భారం పడేవి	0
2	అధిక నష్ట భయం	0
3	మధ్యస్థ నష్ట భయం	38,962
4	అల్ప నష్ట భయం	74,361
5	అత్యల్ప నష్ట భయం	15,920
	మొత్తం	1,29,243*

మూలం: ప్రభుత్వం 2023 ఫిబ్రవరిలో బడ్జెటు పత్రాలతో పాటు శాసన సభ ముందు ఉంచిన పూచీకత్తుల ప్రకటన

* *బడ్జెటు పుస్తకాలలోని సంపుటి V/2 లో వెల్లడి చేసిన పూచీకత్తలకు అదనంగా, 2023 జనవరి 01 నుంచి 2023 మార్చి 31 మధ్య కాలంలో తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్.) కు అదనంగా మరో ₹3,000 కోట్ల పూచీకత్తులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇంతే కాకుండా, పైన సబ్ - పేరా (i) లో పేర్కొన్నట్లు ప్రభుత్వం ₹66,000 కోట్ల మేర పూచీకత్తులను వెల్లడి చేయలేదు, వీటిని ఆర్థిక పద్దులలో తీసుకోవడం జరిగింది. అందువల్ల బడ్జెటు పత్రాలకు, ఆర్థిక పద్దులకు మధ్య తేడా ఉంది.*

నిర్దేశిత కొలమానాల ఆధారంగా ఆయా శాఖల అధిపతులు పూచీకత్తులలో ద్రవ్య నష్టభయాన్ని అంచనా వేస్తారని ప్రభుత్వ ఆర్థిక శాఖ తెలిపింది (2023 సెప్టెంబరు). అయితే, ఆ విధంగా నష్ట భయాన్ని అంచనా వేసిన తాలూక పత్రాలేవీ ఆడిటుకు అందజేయలేదు. పైగా, ₹1,18,320 కోట్ల విలువ గల 15 పూచీకత్తులు బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించినవి కనుక వాటిని నేరుగా భారం పడే 100 శాతం నష్టభయం ఉన్నవిగా వర్గీకరించి ఉండాల్సింది. కానీ, ప్రభుత్వం అన్ని పూచీకత్తులను అత్యల్ప నష్టభయం నుంచి మధ్యస్థ నష్టభయం ఉన్నవిగానే వర్గీకరించింది.

---

41 జి.ఒ.ఎమ్.ఎస్.నెం.446, తేదీ 2003 సెప్టెంబర్ 29

42 (i) ప్రభుత్వ సహాయంతో ఋణాల చెల్లింపు, (ii) తిరిగి చెల్లింపు గడువులు, (iii) సంస్థ తాలూకు ఆర్థిక పరమైన పనితీరు, (iv) ప్రాథమికంగా పెట్టిన జమానతు, (v) ఆస్తులకు కట్టిన విలువ, (vi) ఋణానికి ప్రభుత్వం పూచీ ఇవ్వక మునుపు ఉన్న చట్టబద్ధమైన చెల్లింపు బాధ్యతలు వంటి అంశాల ఆధారంగా.

- ఋణగ్రహీత సంస్థల నుంచి సంవత్సరానికి 0.50 శాతం చొప్పున, లేదా మొత్తం పూచీకత్తు కాలానికి గంపగుత్తగా రెండు శాతం చొప్పున పూచీకత్తు కమిషను తీసుకోవాలని ప్రభుత్వ ఉత్తర్వులో నిబంధన ఉంది. 2023 మార్చి చివరి నాటికి ఇచ్చి ఉన్న పూచీకత్తుల ఆధారంగా 20 సంస్థల నుంచి పూచీకత్తు కమిషను రూపేణా ₹991.22 కోట్లు[43] అంది ఉండాల్సింది. అయితే, ప్రభుత్వం కేవలం రెండు సంస్థల[44] నుంచి ₹67 కోట్లు మాత్రమే పూచీకత్తు కమిషనుగా అందాలని మదింపు వేసింది.

  ఈ సంవత్సరం పూచీకత్తు కమిషను రూపంలో ఏమీ అందలేదు.

2.7.4.6 నగదు నిల్వల నిర్వహణ

(i) రిజర్వు బ్యాంకు వద్ద చేబదుళ్లు (వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు)

భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్.బి.ఐ.) తో ఉన్న ఒక ఒప్పందం ప్రకారం, రిజర్వు బ్యాంకు వద్ద రాష్ట్ర ప్రభుత్వం రోజూ కనీసం ₹1.38 కోట్ల నగదును నిల్వ ఉంచాలి. ఒకవేళ, ఏ దినమైనా అంగీకరించిన కనీస నిల్వ కన్నా తగ్గితే, ఆ లోటును (i) తొలుతగా సంచిత ఋణ విమోచన నిధి, పూచీకత్తుల విముక్తి నిధి, ఖజానా వేలం బిల్లుల నిల్వలు, ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఇతర పెట్టుబడులు మొదలైన వాటిని హామీగా ఉంచి ప్రత్యేక డ్రాయింగు సౌకర్యం (స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ - ఎస్.డి.ఎఫ్.) ద్వారా, (ii) తరువాత రిజర్వు బ్యాంకు నుంచి చేబదుళ్ల (డబ్ల్యూ.ఎం.ఎ., అంటే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సుల) ద్వారా, (iii) అటు పిమ్మట, చేబదుళ్ళు కూడా పరిమితి దాటిపోయినప్పుడు ఓవర్‌డ్రాఫ్టు లేదా ఓ.డి. ద్వారా భర్తీ చేసుకోవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వానికి సాధారణ చేబదుళ్ల పరిమితికి రిజర్వు బ్యాంకు ఎప్పటికప్పుడు సవరణలు చేస్తూ ఉంటుంది. ₹608.97 కోట్ల వరకు ప్రత్యేక సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు. ప్రత్యేక డ్రాయింగు సౌకర్యం పూర్తిగా వినియోగం అయిపోయినాక మరో ₹1,728 కోట్ల వరకు చేబదుళ్లు తీసుకోవచ్చు. గత సంవత్సరం, ఈ సంవత్సరం వినియోగించుకున్న ఆయా సౌకర్యాల వివరాలను ఈ కింది పటాలలో ప్రదర్శించడం జరిగింది:

పటం 2.23: 2021-22 తో పోలిస్తే 2022-23 లో చేబదుళ్ల పరిస్థితి - రోజుల సంఖ్య



పటం 2.24: 2021-22 తో పోలిస్తే 2022-23 లో చేబదుళ్ల పరిస్థితి - మొత్తం (₹ కోట్లలో)



మూలం: సంబంధిత సంవత్సరాల ఆర్థిక పద్దులు

రాష్ట్ర ప్రభుత్వం చేబదుళ్ల మీద ఆధారపడిన రోజుల సంఖ్య గత సంవత్సరం (289) కన్నా ఈ సంవత్సరం (341) పెరిగింది. చేబదుళ్ల మీద ఆధారపడడం పెరిగిందని ఇది సూచిస్తోంది. **నిజానికి ప్రభుత్వం ఒక్క 24 రోజులు తప్ప దాదాపు సంవత్సరం అంతా చేబదుళ్ల మీద ఆధారపడింది.** ప్రత్యేక సౌకర్యంతో పాటు చేబదుళ్ల మీద ఆధారపడిన రోజుల సంఖ్య, ప్రత్యేక సౌకర్యం, చేబదుళ్లతో పాటు ఓవర్ డ్రాఫ్ట్ మీద ఆధార పడిన రోజుల సంఖ్య అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే పెరిగాయి.

---

43 పూచీకత్తుల విలువ ₹1,98,244 కోట్ల మొత్తం మీద 0.50 శాతం చొప్పున లెక్కించినది

44 తెలంగాణ రాష్ట్ర డిస్కముల నుంచి ₹51 కోట్లు, తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ నుంచి ₹16 కోట్లు

ధనరూపేణా చూసినా, ఇదే సరళిని గమనించవచ్చు. ఈ సంవత్సరం తీసుకున్న చేబదుళ్ల విలువ ₹82,823 కోట్లు. అంతకు ముందు సంవత్సరం (₹67,274 కోట్లు) తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే కేవలం ప్రత్యేక సౌకర్యం విలువ తగ్గింది. అయితే చేబదుళ్లు, ఓవర్ డ్రాఫ్టల విషయంలో అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది.

రోజువారీ కార్యకలాపాల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేబదుళ్ల మీద ఆధారపడడం గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతూ ఉంది. గత ఐదు సంవత్సరాలలో తీసుకున్న చేబదుళ్ల మొత్తం గణనీయంగా 280 శాతం పెరిగింది (2018-19 లో ₹21,823 కోట్లు కాగా, 2022-23 లో ₹82,823 కోట్లు). పర్యవసానంగా, చేబదుళ్ల మీద (ప్రత్యేక డ్రాయింగు సౌకర్యం, ఓవర్ డ్రాఫ్టులతో కలిపి) వడ్డీ చెల్లింపులు 2018-19 లో ₹15 కోట్లు కాగా, 2022-23 లో ₹94 కోట్లు. అంటే, గణనీయంగా దాదాపు 527 శాతం పెరుగుదల ఉంది.

(ii) నగదు నిల్వల పెట్టుబడి

రాష్ట్ర ప్రభుత్వం వద్ద మిగులు నగదు ఉంటే, దానిని స్వల్ప కాలిక, దీర్ఘకాలిక కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీలలో, ఖజానా బిల్లులలో పెట్టుబడిగా పెట్టడం జరుగుతుంది. ఇలా పెట్టుబడులపై దక్కిన లాభాలు ప్రభుత్వ ఖాతాకు జమ అవుతాయి.

రాష్ట్ర ప్రభుత్వం వద్ద 2023 మార్చి చివరి నాటికి ఉన్న నగదు నిల్వ ₹10,918.76 కోట్లు. ఇందులో భారతీయ రిజర్వు బ్యాంకు వద్ద డిపాజిట్లు (₹35 కోట్లు), నగదు నిల్వ పెట్టుబడి ఖాతా (₹2,283 కోట్లు), ప్రత్యేకించి ఉంచిన నిధుల పెట్టుబడి (₹8,600 కోట్లు) కలిసి ఉన్నాయి. ప్రత్యేకించి ఉంచిన నిధులలో ఋణ విమోచన నిధి (₹7,053 కోట్లు), పూచీకత్తుల విముక్తి నిధి - పెట్టుబడుల ఖాతా (₹1,543 కోట్లు) ఉన్నాయి. ఈ ఏడాదిలో నగదు నిల్వలు, వాటి పెట్టుబడుల తీరును ఈ కింది పట్టికలో చూపడం జరిగింది.

పట్టిక 2.46: నగదు నిల్వలు, వాటి పెట్టుబడి

(₹ కోట్లలో)

	2022 ఏప్రిల్ 1 న ప్రారంభ నిల్వ	2023 మార్చి 31 ముగింపు నిల్వ
ఎ. సాధారణ నగదు నిల్వ		
ఖజానాలో ఉన్న నగదు	--	--
భారతీయ రిజర్వు బ్యాంకులో డిపాజిట్లు	63.82	34.78
ఇతర బ్యాంకుల్లో డిపాజిట్లు	--	--
ఇంకా ఖరారు కాని జమలు – స్థానికంగా	--	--
మొత్తం	**63.82**	**34.78**
నగదు నిల్వ పెట్టుబడుల ఖాతాలో ఉన్న పెట్టుబడులు	55.45	2,283.41
మొత్తం (ఎ)	**119.27**	**2,318.19**
బి. ఇతర నగదు నిల్వలు, పెట్టుబడులు		
ప్రజా పనుల శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు వంటి శాఖాధికారుల వద్ద ఉన్న నగదు	--	--
ఆకస్మిక ఖర్చుల కోసం ప్రభుత్వ శాఖాధికారుల వద్ద శాశ్వతంగా ఉన్న అడ్వాన్సులు	0.40	0.40
ప్రత్యేకించి ఉంచిన నిధులలో పెట్టుబడి	7,975.19	8,600.17
మొత్తం (బి)	**7,975.59**	**8,600.57**
మొత్తం (ఎ + బి)	**8,094.86**	**10,918.76**
దక్కిన వడ్డీ	**0.46**	**0.00**

మూలం: ఆర్థిక పద్దులు

2018-23 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వ నగదు నిల్వ పెట్టుబడులను ఈ కింది పట్టికలో చూపడం జరిగింది.

పట్టిక 2.47: నగదు నిల్వల పెట్టుబడి ఖాతా

(₹ కోట్లలో)

సంవత్సరం	ప్రారంభ నిల్వ	ముగింపు నిల్వ	పెరుగుదల (+) / తగ్గుదల (-)	దక్కిన వడ్డీ
2018-19	2,277.42	1,588.95	(-)688.47	22.97
2019-20	1,588.95	6,945.39	5,356.44	7.98
2020-21	6,945.39	1,801.12	(-)5,144.27	7.73
2021-22	1,801.12	55.45	(-)1,745.67	0.46
2022-23	55.45	2,283.41	2,227.96	0.00

మూలం: ఆర్థిక పద్దులు

భారత ప్రభుత్వ సెక్యూరిటీలలో, ఖజానా బిల్లులలో పెట్టిన పెట్టుబడుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి దక్కే వడ్డీ 2018-19 నుంచి తగ్గుతూ వస్తోంది. 2022-23 లో రాష్ట్ర ప్రభుత్వానికి ఈ వడ్డీ ఆదాయమేమీ లేదు.

2.8 ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య ఆస్తులు, అప్పుల పంపకం

ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం - 2014 ప్రకారం, ఆనాటి వరకు అయిన మొత్తం మూలధన వ్యయం, ఇచ్చిన ఋణాలు - అడ్వాన్సులు, ప్రజాఋణం, ప్రజాపద్దు కింద ఉన్న నిల్వలు విభజిత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య పంపకం కావాలి.

2.8.1 ప్రభుత్వ పద్దులలోని మొత్తాల పంపకం

2023 మార్చి నాటి పరిస్థితి ప్రకారం, క్యాపిటల్ పద్దు (₹1,51,350 కోట్లు), ఇచ్చిన ఋణాలు - అడ్వాన్సుల పద్దు (₹28,100 కోట్లు), డిపాజిట్లు - అడ్వాన్సుల పద్దు (₹4,474 కోట్లు), అనామతు - నానావిధాల పద్దు (₹238 కోట్లు), జమల పద్దు (₹310 కోట్లు) లలోని గణనీయమైన మొత్తాల పంపకం జరగాల్సి ఉంది. కనుక, ఆర్థిక పద్దుల్లో చూపిన రాష్ట్ర ప్రభుత్వపు ఆస్తులు, చెల్లింపు బాధ్యతలు ఆ మేరకు ప్రభావితం అయ్యాయి.

2018-19 తరువాత గత నాలుగు సంవత్సరాలుగా ఈ అంశంలో పురోగతి లేకపోవడం పంపకాల విషయమై తగినంత ప్రత్యేకదృష్టి లేదని సూచిస్తోంది.

2.8.2 ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం - 2014 లోని IX షెడ్యూలు ప్రకారం ఆస్తులు, అప్పుల విభజన

ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం - 2014 లోని IX షెడ్యూల్ ప్రకారం కంపెనీలు, కార్పొరేషన్లతో సహా మొత్తం 91 సంస్థలను విభజించాల్సి ఉంది. ఇందుకోసం 2014 మే నెలలో ఏర్పాటు అయిన ఒక నిపుణుల కమిటీ 90 సంస్థల[45] విషయంలో విభజన సిఫార్సులను ఇచ్చింది.

విభజిత రాష్ట్రాల మధ్య ఉన్న ద్వైపాక్షిక అంశాలను పరిష్కరించేందుకు కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ ఒక వివాద పరిష్కార ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. విభజనను మూడు దశలలో, అంటే, (i) భేదాభిప్రాయం లేని 53 ప్రభుత్వ రంగ సంస్థలు, (ii) తెలంగాణకు అంగీకారమై, ఆంధ్ర ప్రదేశ్‌కు అంగీకారం కాని 15 ప్రభుత్వ రంగ సంస్థలు, (ii) ఆంధ్ర ప్రదేశ్‌కు అంగీకారమై, తెలంగాణకు అంగీకారం కాని 23 సంస్థల విభజన చేయాలని ఆ ఉప సంఘం సూచించింది.

23 సంస్థల విషయంలో అభ్యంతరాలను కేంద్ర గృహ మంత్రిత్వ శాఖకు తెలుపడం జరిగిందని, ఈ విషయాన్ని కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ పరీక్షిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది (2023 సెప్టెంబరు).

---

[45] విభజిత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం 2016 జనవరిలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు విభజన ప్రణాళికను పంపిన ఒక్క ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ విషయంలో తప్ప

2.9 సారాంశం

రాష్ట్రం రెవెన్యూ రాబడి గణనీయంగా పెరిగింది. నిత్య వ్యావహారిక వ్యయం (లేదా రెవెన్యూ ఖర్చులు) పెరిగినా, రాష్ట్రం మూడు సంవత్సరాల తరువాత రెవెన్యూ మిగులును నమోదు చేయగలిగింది.

వనరుల కోసం రాష్ట్ర ప్రభుత్వం గణనీయంగా ప్రజాఋణం మీద ఆధార పడింది. ప్రజాఋణం మీద రాష్ట్రం ఆధార పడుతూ ఉండడం నిధుల వినియోగం మీద ప్రభావం చూపుతోంది. వనరులలో దాదాపు మూడో వంతు ప్రజాఋణం తిరిగి చెల్లింపు కోసం వినియోగం అవుతోంది. అయితే, వరుసగా రెండో సంవత్సరం కూడా మొత్తం రాబడిలో ప్రజాఋణం వాటా తగ్గింది. అంటే అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ప్రజాఋణం మీద ఆధారపడడం తగ్గిందని ఇది సూచిస్తోంది.

అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే పన్నుల నుంచి రాబడి వాటా పెరిగింది. రాష్ట్రం సొంత పన్నుల నుంచి రాబడి కోవిడ్ - 19 సంవత్సరం (2020-21) లో స్వల్పంగా తగ్గినా, తరువాతి సంవత్సరాలలో గణనీయంగా పెరిగింది. రాష్ట్రం సొంత పన్నుల నుంచి రాబడిలోని అన్ని అంశాలలో కూడా గణనీయమైన వృద్ధి నమోదు అయింది. వస్తు, సేవల పన్ను, అమ్మకాలు, వర్తకం మీద పన్నులు, స్టాంపులు - రిజిస్ట్రీకరణ, వాహనాల మీద పన్నులు గుర్తించదగ్గ స్థాయిలో వృద్ధిని నమోదు చేశాయి.

పన్నులు కాని ఇతర రాబడి అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే దాదాపు రెండింతలు అయింది. నానావిధ సాధారణ సేవలు, ఇనుము కాని ఇతర ఖనిజాల తవ్వకం - లోహ పరిశ్రమలలో భారీగా పెరుగుదల కారణంగా ఈ పెరుగుదల ఏర్పడింది. ఇనుము కాని ఇతర ఖనిజాల తవ్వకం - లోహ పరిశ్రమల విషయంలో సింగరేణి కాలరీస్ సంస్థ నుంచి కప్పం (లేదా రాయల్టీ) విషయంలో పాత బకాయిలు, ముందుస్తు చెల్లింపుల కారణంగా పెరుగుదల ఏర్పడింది. నానావిధ సాధారణ సేవల పద్దు కింద జమ విషయంలో 'ఇతర రాబడి' అంటూ వర్గీకరించిన కారణంగా జమ స్వభావం, మూలం రెండూ అసంపూర్ణంగా ఉన్నాయి. సరైన వర్గీకరణ లేని భారీ రాబడి పారదర్శకతను ప్రభావితం చేస్తుంది. తెలంగాణ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థకు, తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థకు 2018-19 లో ఇచ్చిన ఋణాలను రద్దు చేసి వాటిని ప్రభుత్వ పద్దుకు రెవెన్యూ రాబడి కింద పన్నులు కాని ఇతర రాబడి రూపంలో జమ చేసిన కారణంగా రెవెన్యూ మిగులును పెంచి చూపినట్లైంది.

భారత ప్రభుత్వం నుంచి సహాయక ప్రదానాలు అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 2022-23 లో సగానికి పైగా పెరిగాయి. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సహాయక ప్రదానాల రాక పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. భారత ప్రభుత్వం నుంచి ఈ సహాయక ప్రదానాలు ముఖ్యంగా సర్వ శిక్ష అభియాన్, మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం విషయంలో ఉన్నాయి.

మొత్తం మీద వనరుల సమీకరణలో అటు పన్నుల నుంచి రాబడి విషయంలోనూ, ఇటు పన్నులు కాని ఇతర రాబడి విషయంలోనూ పదిహేనో ఆర్థిక సంఘం వేసిన అంచనాలను రాష్ట్రం అందుకోగలిగింది. అయితే, తన స్వంత బడ్జెటు అంచనాలతో పోలిస్తే 'ఇతర రాబడి' లో భారీ పెరుగుదల ఉన్నా, పన్నులు కాని రాబడిని ఎక్కువగా అంచనా వేసిన కారణంగా పన్నులు కాని ఇతర రాబడి విషయంలో లక్ష్యసాధనలో విఫలమైంది.

ఇక ఖర్చుల విషయానికి వస్తే, నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులు స్వల్పంగా పెరిగాయి. 'ఉదయ్ కింద డిస్కంల నష్టాలను స్వీకరించడం', అధిక వడ్డీ చెల్లింపులు ఇందుకు ప్రధాన కారణాలు. తప్పని సరి ఖర్చులలోనూ, నిత్య వ్యావహారిక వ్యయంలోనూ వడ్డీ చెల్లింపుల వాటా పెరుగుతూనే ఉంది. గత ఐదు సంవత్సరాలలో నిత్య వ్యావహారిక వ్యయంలో అత్యధిక వాటా సామాజిక రంగంలో ఆసరా పింఛన్లది కాగా, ఆర్థిక రంగంలో వ్యవసాయానిది. 'వ్యవసాయ, అనుబంధ రాయితీల నిమిత్తం తెలంగాణ విద్యుత్ ప్రసార సంస్థ (ట్రాన్స్‌కో)

కు సహాయం' ను ప్రభుత్వం అటు రాయితీల రూపంలోనూ, ఇటు సహాయక ప్రదానాల రూపంలో అందజేసే పద్ధతిని కొనసాగించింది. ప్రభుత్వ ఖర్చులు క్రమేణా సహాయక ప్రదానాల రూపాన్ని సంతరించుకోవడం పెరుగుతోంది.

రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులను ఇంకా అమలు చేయాల్సి ఉంది. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుల నియామకంలో జాప్యం, తదుపరి సిఫార్సులను ఆమోదించడం, అమలు చేయడంలో జాప్యం వల్ల రాజ్యాంగ విహితమైన నిబంధన పాటించకపోవడమే కాకుండా, సిఫార్సులు లేకుండానే నిధులను విడుదల చేసే పరిస్థితికి దారితీసింది.

మూలధన వ్యయం వాటా గత ఐదు సంవత్సరాలలో అత్యల్పం. ప్రభుత్వపు పెట్టుబడులు అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే భారీగా పడిపోయాయి. అంతకు ముందు సంవత్సరం బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించి చెల్లింపులను పెట్టుబడులుగా ఇవ్వగా ఈ సంవత్సరం ఋణాలు, అడ్వాన్సులుగా ఇచ్చింది. మూలధన వ్యయం సమగ్ర శిక్ష కింద సివిల్ పనులు, సచివాలయ భవనం, నియోజక వర్గ అభివృద్ధి కార్యక్రమం, ఆసుపత్రులు, వైద్యశాలల విషయంలో పెరిగింది. సాగునీటిపారుదల రంగం విషయానికి వస్తే గత ఐదు సంవత్సరాలుగా పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుల మీద ఎక్కువగా మూలధన వ్యయం అయింది. ఏ సాగునీటిపారుదల ప్రాజెక్టు విషయంలోనూ ఆర్థిక ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదు. ఫలితంగా సాగునీటిపారుదల, వరదల నియంత్రణ ప్రాజెక్టుల మీద పెట్టిన పెట్టుబడుల నుంచి ప్రతిఫలానికి భరోసా లేదు. పెట్టుబడుల నుంచి ప్రతిఫలం స్వల్పంగానే ఉంటోంది.

కాళేశ్వరం నీటిపారుదల ప్రాజెక్టు సంస్థ, తెలంగాణ రాష్ట్ర జలవనరుల మౌలిక సదుపాయల సంస్థ, తెలంగాణ తాగు నీటి సరఫరా సంస్థ వంటి సంస్థలకు బడ్జెటుకు వెలుపలి ఋణాల తిరిగి చెల్లింపుల కారణంగా ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఋణాలను తిరిగి చెల్లించడం కోసం సొంత రాబడి వనరులు లేని ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్టు, తెలంగాణ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థ, తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ వంటి సంస్థలకు ఇచ్చిన ఋణాలు కూడా ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులలో ఉన్నాయి. విద్యుతు ఆర్థిక సంస్థ విషయంలో ప్రభుత్వ చెల్లింపు బాధ్యతను ఇచ్చిన ఋణాలుగా వర్గీకరించడం జరిగింది. ఆ విధంగా, ఆయా సంస్థల నుంచి తిరిగి వసూలు అయ్యే అవకాశాలు అరుదు కావడంతో ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులు ప్రభుత్వ ఆస్తుల వాస్తవికమైన పరిస్థితిని ప్రతిబింబించడం లేదు.

సంస్థలకు ఋణాలను ఇచ్చేటప్పుడు ప్రభుత్వం వడ్డీ రేట్లు, తిరిగి చెల్లింపు అవధి, వాయిదాల సంఖ్య వంటి నిబంధనలను నిర్దేశించడం లేదు. పద్దులలో పేర్కొన్న ఇచ్చిన ఋణాల మొత్తాలను ఆయా సంస్థలు ఇంకా ధ్రువీకరించవలసి ఉంది. ఇచ్చిన ఋణాలు తిరిగి వసూలు పేలవంగా కొనసాగుతూ ఉంది. ప్రభుత్వం భారీగా ఋణాలను ఇచ్చిన సంస్థల నుంచి తిరిగి వసూలు కాకపోవడం ఆ సంస్థలకు ఇచ్చిన ఋణాలు బడ్జెటుకు వెలుపలి ఋణాల తిరిగి చెల్లింపుకు సంబంధించినవి అయి ఉండవచ్చు లేదా సొంత రాబడి వనరులు అంటూ లేని సంస్థలకు ఇచ్చినవి అయి ఉండవచ్చు అన్న అభిప్రాయానికి ఊతం ఇస్తోంది.

శాసనవిహితమైన నిధులు అంటే సంచిత ఋణ విమోచన నిధి, పూచీకత్తుల విముక్తి నిధులకు వరుసగా మూడో సంవత్సరం ప్రభుత్వం ఏమీ జమ చేయలేదు. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుంచి రాష్ట్ర విపత్తు నివారణ నిధికి బదిలీ చేయాల్సిన వాటాను ప్రభుత్వం బదిలీ చేయలేదు. గత ఐదు సంవత్సరాలుగా గ్రామీణాభివృద్ధి నిధిలో గణనీయమైన మొత్తం వినియోగం కాకుండా ఉంది. గత సంవత్సరం తెలంగాణ హరిత నిధి పేరిట ఏర్పాటు చేసిన ఒక కొత్త నిధి ప్రభుత్వ పద్దులకు వెలుపల ఉంది. ఈ నిధికి ప్రజా ప్రతినిధుల నుంచి, ప్రభుత్వ ఉద్యోగుల నుంచి, ఇతర స్వచ్ఛంద విరాళాల నుంచి ధనం సమకూరుతుంది.

అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం అంతర్గత ఋణం స్వీకరణ తక్కువగానూ, తిరిగి చెల్లింపు ఎక్కువగానూ ఉంది. అయినా, రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే మొత్తం తీర్చాల్సిన బాధ్యతల నిష్పత్తి విషయంలో లక్ష్యమైన 25 శాతం లోపునే ఉంచడంలో వరుసగా మూడో సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. బడ్జెటుకు వెలుపలి ఋణాలను కూడా పరిగణిస్తే ఈ నిష్పత్తి పదిహేనో ఆర్థిక సంఘం నిర్దేశించిన పరిమితి కన్నా కూడా చాలా ఎక్కువ. ప్రభుత్వం బడ్జెటు పత్రాలలో బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించిన పరిమాణాన్ని గానీ, వివరాలను గానీ వెల్లడి చేయలేదు. రోడ్లు, వంతెనల పనులను వనరుల సమీకరణతో పాటు అమలు కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థకు బదిలీ చేయడం ఇందుకు ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ప్రజాఋణం తీర్చేందుకు రానున్న పది సంవత్సరాలలో ప్రభుత్వం గణనీయమైన ₹2,86,228 కోట్ల మొత్తాన్ని సమీకరించాల్సి ఉందని అప్పులను తీర్చాల్సిన సమయసూచిక సూచిస్తోంది. ప్రభుత్వ ఆర్థికాన్ని ఇది గణనీయమైన ఒత్తిడికి గురి చేయవచ్చు.

రెవెన్యూ మిగులు ఉన్నా కూడా, మార్కెటు నుంచి స్వీకరించిన ఋణాల మొత్తాన్ని పూర్తిగా మూలధన వ్యయం కోసమే కాకుండా బడ్జెటుకు వెలుపలి ఋణాలను తీసుకున్న సంస్థలకు ఋణాలు, అడ్వాన్సులు ఇచ్చేందుకు వినియోగించడం జరిగింది. అప్పులను భరించే సామర్థ్యం దృష్ట్యా ద్రవ్యపరంగా ఇది ఆరోగ్యకరమైన చర్య కాదు.

2.10 సిఫార్సులు

i. *‘ఇతర రాబడి’ వంటి అస్పష్టమైన వర్గీకరణను పరిహరించడం కోసం వివరణాత్మక పద్దు వరకూ కూడా జమకు సంబంధించి వివరాలను నమోదు చేసే వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.*

ii. *వ్యవసాయ, అనుబంధ రాయితీల నిమిత్తం ట్రాన్స్‌కోకు సహాయం అనే అంశాన్ని కొంత రాయితీల రూపంలో, కొంత సహాయక ప్రదానాల రూపంలో కాకుండా ఒకే విధంగా రాయితీల రూపంలో వర్గీకరించాలి.*

iii. *రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదిక మీద రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ఆర్థిక సంఘం వ్యవస్థ సజావుగా కొనసాగేలా ధ్రువీకరించుకోవాలి.*

iv. *మొత్తం వ్యయంలో మూలధన వ్యయం వాటాను రాష్ట్ర ప్రభుత్వం పెంచాలి.*

v. *పెట్టుబడులను విశ్లేషించి, పెట్టుబడుల మీద పదేపదే ప్రతిఫలం అల్పంగా ఉండేందుకు గల కారణాలను మదింపు వేయాలి.*

vi. *బడ్జెటుకు వెలుపలి ఋణాలకు సంబంధించి తిరిగి చెల్లింపు బాధ్యతలను ఆయా సంస్థలకు ఋణాలు ఇచ్చినట్లుగా చూపించే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం మార్చుకోవాల్సి ఉంటుంది. ఋణాలను మంజూరు చేస్తూ ఇచ్చే ఉత్తర్వుల్లో/ఋణ ఒప్పందాల్లో వడ్డీ రేటు, తిరిగి తీర్చే ప్రణాళికావధి వంటి ముఖ్యమైన నిబంధనలను, షరతులను పొందుపర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించుకోవాలి. నిబంధనలు, షరతులు లేకుండా గతంలో ఏవైనా ఋణాలు ఇచ్చి ఉంటే, వాటిని కూడా నిర్దిష్టం చేసుకోవాలి.*

vii. *సాగునీటిపారుదల ప్రాజెక్టుల ఆర్థిక ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసి, వెల్లడించాలి.*

viii. *ఆకస్మిక పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఏర్పాటు అయిన ఆయా శాసనవిహిత నిధులకు ఆయా ప్రయోజనాలు నెరవేరడం కోసం సంబంధిత నియమాల ప్రకారం క్రమం తప్పకుండా ప్రభుత్వం జమ చేయాలి. గ్రామీణాభివృద్ధి నిధిలో ఉన్న మొత్తాలను ఆ నిధి ఏర్పాటు అయిన ప్రయోజనాల కోసం వినియోగించాలి. తెలంగాణ హరిత నిధి ప్రభుత్వ పద్దులకు వెలుపల ఉంచకుండా ప్రజాపద్దు పరిధిలోకి తీసుకుని రావాలి.*

ix. రాష్ట్ర స్థూల గృహోత్పత్తితో పోలిస్తే మొత్తం తీర్చాల్సి ఉన్న బాధ్యతల నిష్పత్తిని నిర్ణీత పరిమితుల లోగానే ఉంచేందుకు ప్రభుత్వం పట్టుదలతో కృషి చేయాలి. బడ్జెటుకు వెలుపలి ఋణాలతో సహా ఈ నిష్పత్తిని పదిహేనో ఆర్థిక సంఘం నిర్దేశించిన స్థాయికే పరిమితం చేయాలి. పూచీకత్తుల వివరణ ప్రకటనతో పాటుగా, పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సులకు అనుగుణంగా బడ్జెటుకు వెలుపలి ఋణాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటు పత్రాలలో పూర్తిగా వెల్లడించాల్సి ఉంది. మార్కెటు నుంచి తీసుకున్న ఋణాలను మొత్తంగా మూలధన వ్యయం కోసమే ఖర్చు చేసేట్లు ధ్రువీకరించుకోవాలి.

అధ్యాయం III

బడ్జెటు నిర్వహణ

3.1 పరిచయం

విధానపరమైన నిర్ణయాలు పాలనాపరమైన స్థాయిలో నిధుల వృథా గానీ, మళ్లింపు గానీ లేకుండా విజయవంతంగా అమలయ్యేట్లు ప్రభావవంతమైన ఆర్థికనిర్వహణ తోడ్పడుతుంది. ఈ అధ్యాయంలో రాష్ట్ర ప్రభుత్వపు కేటాయింపుల ప్రాథమ్యాలను సమీక్షించి, బడ్జెటు రూపకల్పనలో పారదర్శకత మీద, అమలు చేయడంలో ప్రభావశీలత మీద వ్యాఖ్యానించడం జరిగింది.

3.2 బడ్జెటు తయారీ ప్రక్రియ

ప్రభుత్వ వనరులను సమర్థంగా ఉపయోగించుకునేందుకు వార్షిక బడ్జెటు తయారీ ప్రక్రియ ఒక మార్గసూచీని అందిస్తుంది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ శాఖల అంచనాల కోసం ఆర్థికశాఖ డిసెంబరు / జనవరి నెలల్లో ఒక సర్క్యులరును జారీ చేయడంతో బడ్జెటు తయారీ ప్రక్రియ మొదలౌతుంది. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెటు తయారీ ప్రక్రియను *పటం 3.1* లో చూపడం జరిగింది.

పటం 3.1: బడ్జెటు తయారీ ప్రక్రియ



మూలం: బడ్జెట్ మాన్యువల్‌లో సూచించిన పద్ధతులు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ఆధారంగా

వార్షిక బడ్జెటును, ప్రదానాలు (అంటే, గ్రాంట్లు)[1]/వినియోగానుమతుల (అంటే, అప్రోప్రియేషన్లు)[2] కోసం అధికారికాభ్యర్థనలను (అంటే, డిమాండ్లను) శాసనసభ ముందు ఉంచి, రాష్ట్ర సంచిత నిధి నుంచి ఖర్చుపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిని పొందుతుంది.

ఆర్థిక సంవత్సరం జరుగుతూ ఉండగా, బడ్జెటులో తొలుత కేటాయించిన మొత్తం కన్నా ఎక్కువగా ఖర్చు చేయడం కోసం అదనపు లేదా అనుబంధ ప్రదానాలను (అంటే, అనుబంధ గ్రాంట్లను) / వినియోగపు అనుమతులను అందించడం జరుగుతుంది. అంతేగాక, మిగులు ఏర్పడవచ్చని భావించిన వివిధ అంశాల నుంచి అదే ప్రదానం (గ్రాంటు) / వినియోగపు అనుమతి (అప్రోప్రియేషను) లోని, అదే విభాగం (అంటే రెవెన్యూ ఓటెడ్, రెవెన్యూ చార్జ్డ్, క్యాపిటల్ ఓటెడ్, క్యాపిటల్ చార్జ్డ్ వంటి విభాగాలు) కింద అదనంగా ఖర్చు అయ్యే అవకాశం ఉందని భావించిన అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం తగిన అధికారుల ద్వారా కేటాయింపుల బదిలీలను (రీ-అప్రోప్రియేషన్లు) లేదా మళ్లీ కేటాయింపులను చేస్తుంది.

రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బడ్జెట్ ప్రతిపాదనల అమలు తీరు వినియోగపు పద్దులలో నమోదు అవుతుంది. వినియోగపు చట్టం అమలు అయ్యే తీరును *పటం 3.2* లో చూపడం జరిగింది.

పటం 3.2: వినియోగపు పద్దులలో నమోదు అయ్యే విధంగా వినియోగపు చట్టం అమలు



మూలం: బడ్జెట్ మాన్యువల్ లో సూచించిన పద్ధతుల ఆధారంగా

3.2.1 ఉప-బడ్జెట్లు

3.2.1.1 ప్రగతి పద్దు (పథకపు వ్యయం), నిర్వహణ పద్దు (సిబ్బంది/నిర్వహణ వ్యయం)

ఇంతకు ముందు *పేరా 1.4* లో పేర్కొన్న విధంగా, 2017-18 సంవత్సరం నుంచి తెలంగాణ ప్రభుత్వం ప్రణాళిక, ప్రణాళికేతర బడ్జెట్లను మానివేసి, "ప్రగతి పద్దు (పథకపు వ్యయం)", "నిర్వహణ పద్దులను (సిబ్బంది/నిర్వహణ వ్యయం)" ప్రవేశపెట్టింది.

---

1 శాసనసభలో ఓటింగు అవసరమైనవి

2 శాసనసభలో ఓటింగు అవసరం లేనివి

3.2.1.2 ప్రత్యేక అభివృద్ధి నిధి

తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి (ఆర్థిక వనరుల ప్రణాళిక, కేటాయింపు, వినియోగం) చట్టం - 2017 అనే చట్టాన్ని చేసింది (2017 మార్చి). రాష్ట్రంలోని షెడ్యూల్డు కులాల (15.45 శాతం) / షెడ్యూల్డు తెగల (9.08 శాతం) జనాభా (అంటే, 2011 జనాభా లెక్కలు) దామాషా ఆధారంగా ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రగతి పద్దులోని మొత్తం అంచనా వ్యయాన్ని విభజించి రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి, షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి అనే ఉప-బడ్జెట్లను తయారు చేస్తోంది. షెడ్యూల్డ్ కులాల /షెడ్యూల్డ్ తెగల వ్యక్తులకు, కుటుంబాలకు, ఆవాసాలకు, ప్రాంతాలకు నేరుగానూ, పరిమాణాత్మకంగానూ లబ్ధి చేకూర్చే పథకాలను ఆయా శాఖల ప్రత్యేక అభివృద్ధి నిధిలో పొందుపర్చాలి.

ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కేటాయించిన నిధుల వినియోగం మీద విశ్లేషణను *పేరా 3.4.7* లో వివరించడం జరిగింది.

3.2.2 బడ్జెటు ఉజ్జాయింపులు, కేటాయింపులు

శాఖాధిపతులు, ఇంకా అంచనాలు వేసే ఇతర అధికారులు సమర్పించిన శాఖల వారీ అంచనాల ఆధారంగా బడ్జెటు ఉంటుంది. ఈ శాఖల వారీ అంచనాలకు శాఖల్లోని జిల్లా స్థాయి అధికారులు సమర్పించిన అంచనాలు ఆధారం అవుతాయి[3]. ప్రభుత్వ పద్దులను సాధారణంగా నగదు ప్రాతిపదికగా నిర్వహించడం జరుగుతుంది కనుక సంబంధిత బడ్జెటు సంవత్సరంలో[4] వాస్తవంగా వసూలు కాగలవు అని లేదా ఖర్చు చేయగలిగినవి అని అంచనా వేసిన అధికారులు భావించే రాబడిని, చెల్లింపులను[5] మాత్రమే అంచనాలలో పరిగణనలోకి తీసుకోవాలి. ఆర్థిక నిర్వహణ సఫలం కావాలంటే, రాబడి, ఖర్చులు రెండింటి విషయంలోనూ ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక, ఖచ్చితమైన అంచనా[6] అవసరం.

రాబడిని ఎక్కువగా అంచనా వేస్తే, దాని పర్యవసానంగా ఎక్కువ ఖర్చులకు కూడా ప్రణాళికలు వేసుకుని, తుదకు ఆ సంవత్సరంలో అందజేయాలని భావించిన సేవల విషయంలో నిర్ణయించుకున్న లక్ష్యాలను సాధించడంలో వైఫల్యం ఏర్పడడమే కాకుండా, శాసనసభ ఆమోదించిన గ్రాంట్లు/అప్రోప్రియేషన్ల మొత్తం ఖర్చుకాకుండా మిగుళ్లు ఏర్పడుతాయి. మరోవైపు, అప్పులను తీర్చేందుకు చేయాల్సిన చెల్లింపులు, వడ్డీ చెల్లింపులు, జీతాలు, పింఛనులు వంటి తప్పనిసరిగా చేయాల్సిన లేదా నివారించడం సాధ్యం కాని ఖర్చులను తక్కువగా అంచనా వేయడం వల్ల ఖర్చు అధికమై, తర్వాత శాసనసభ ద్వారా క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది.

బడ్జెటు ఉజ్జాయింపులు, కేటాయింపుల విషయంలో గమనించిన ముఖ్యమైన లోటుపాట్లను ఈ కింద చర్చించడమైంది:

3.2.2.1 పన్నులు కాని ఇతర రాబడి వసూళ్లను అంచనా వేయడం

వనరుల సమీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పనితీరును ఈ నివేదికలోని *పేరా 2.4.3* లో చర్చించడం జరిగింది. పన్నుల రాబడి విషయంలో రాష్ట్రం తన అంచనాలను అందుకోగలిగినా, పన్నులు కాని రాబడి విషయంలో మాత్రం వెనుకబడిందని పేర్కొనడం జరిగింది. ఇందుకు కారణం ఇంతకుముందు *పేరా 1.5* లో పేర్కొన్నట్లు పన్నులు కాని రాబడి నుంచి ఎక్కువ మొత్తాల వసూలును అంచనా వేయడమే. నిజానికి, గత మూడు సంవత్సరాలుగా చూస్తే పన్నులు కాని రాబడి విషయంలో రాష్ట్ర బడ్జెటు అంచనాలు ఈ కింద చూపిన విధంగా ప్రతి ఏటా ఎక్కువగానే ఉంటున్నాయి:

---

[3] బడ్జెటు నియమావళిలోని పేరా 13.1.1

[4] బడ్జెటు నియమావళిలోని పేరా 13.1.3

[5] గత సంవత్సరాలకు చెందిన బకాయిలతో సహా

[6] బడ్జెటు నియమావళిలోని పేరా 1.1

పట్టిక 3.1: పన్నులు కాని రాబడి విషయంలో బడ్జెటు అంచనాలు, వాస్తవంగా అయిన వసూళ్లు

(₹ కోట్లలో)

సంవత్సరం	బడ్జెటు అంచనా	వాస్తవంగా వసూలైన మొత్తం	అధికం (+) / తగ్గుదల (-)
(1)	*(2)*	*(3)*	*(4) = (3) - (2)*
2018-19	8,974	10,007	1,033
2019-20	15,875	7,360	(-)8,515
2020-21	30,600	6,101	(-)24,499
2021-22	30,557	8,857	(-)21,700
2022-23	25,422	19,554	(-)5,868

మూలం: గత ఐదు సంవత్సరాల బడ్జెట్ పత్రాలు, ఆర్థిక పద్దులు

- పన్నులు కాని రాబడి కింద నానావిధ సాధారణ సేవలు (పెరుగుదల ₹5,875 కోట్లు), ఇనుము కాక ఇతర ఖనిజాల తవ్వకం, లోహ సంబంధ పరిశ్రమల (పెరుగుదల ₹5,198 కోట్లు) విషయంలో వాస్తవంగా వసూలైన మొత్తంలో పెరుగుదల ఉన్నా, పూర్తి వివరాలు లేకపోవడంతో అటువంటి పెరుగుదలకు గల కారణాలను విశ్లేషించడం సాధ్యం కాలేదు.

  - నానావిధ సాధారణ సేవల కింద అందిన ₹9,800 కోట్లలో ₹5,723 కోట్ల భారీ మొత్తాన్ని అదనపు వివరాలేవీ లేకుండా 'ఇతర రాబడి' గా వర్గీకరించడం జరిగింది. ఇలా చేయడం వల్ల రాబడికి మూలాన్ని, దాని స్వభావాన్ని గుర్తించడం కష్టం కావడమే కాకుండా పద్దులలో పారదర్శకతలేమికి దారి తీస్తుంది (పద్దులలో పారదర్శకతలేమి గురించి మరిన్ని వివరాల కోసం *పేరా 4.9* ని చూడవచ్చు). డిపాజిటు పద్దులలోని మొత్తాలను జప్తు చేసి, వాటిని ఖర్చులో తగ్గింపునకు బదులుగా ప్రభుత్వపద్దుకు రెవెన్యూ రాబడిగా జమ చేయడం వల్ల ఈ విధంగా జరిగింది (మరిన్ని వివరాలకు *పేరా 2.4.1.1 (ii)* ని చూడవచ్చు).

  - అదేవిధంగా, ఇనుము కాక ఇతర ఖనిజాల తవ్వకం, లోహ పరిశ్రమల రాబడి కింద ముఖ్య ఖనిజాల నుంచి అందే కప్పం (లేదా రాయల్టీ) (₹5,003 కోట్లు), ఇతర ఖనిజాల నుంచి అందే రాయల్టీ (₹970 కోట్లు) లకు కూడా అదనపు వివరాలు లేవు. ప్రస్తుత సంవత్సరపు రాయల్టీతో పాటుగా గత సంవత్సరాలకు సంబంధించిన రాయల్టీని, రాబోయే సంవత్సరపు రాయల్టీని కూడా కలిపి చెల్లించడం వల్ల ఈ విధంగా జరిగింది (మరిన్ని వివరాలకు *పేరా 2.4.1.1 (ii)* ని చూడవచ్చు).

- బడ్జెట్ అంచనాలలో నానావిధ సాధారణ సేవల కింద ఉజ్జాయింపు వేసిన ప్రధాన అంశాలలో 'భూమి, ఆస్తుల అమ్మకం' ఒకటి. ఈ అంశాన్ని కింద చూపిన విధంగా ఏటేటా ఎక్కువగా అంచనా వేయడం జరుగుతోంది:

పట్టిక 3.2: భూమి అమ్మకం నుంచి అందే రాబడి విషయమై బడ్జెటు అంచనాలు, వాస్తవ రాబడి

(₹ కోట్లలో)

సంవత్సరం	బడ్జెటు అంచనాలు	వాస్తవంగా అందిన మొత్తం	అధికం (+) / తగ్గుదల (-)
(1)	*(2)*	*(3)*	*(4) = (3) - (2)*
2018-19	3,000	848	(-)2,152
2019-20	10,000	416	(-)9,584
2020-21	14,294	10	(-)14,284
2021-22	16,000	2,658	(-)13,342
2022-23	15,500	791	(-)14,709

మూలం: గత ఐదు సంవత్సరాల బడ్జెట్ పత్రాలు, ఆర్థిక పద్దులు

గత సంవత్సరాల్లో రాబడి తక్కువగా ఉన్నా, ప్రభుత్వం బడ్జెట్ అంచనాలలో భూమి, ఆస్తుల విక్రయం ద్వారా రాబడిని అధికంగా అంచనా వేసే పంథాను కొనసాగించింది.

3.2.2.2 'భారత ప్రభుత్వం నుంచి అందే సహాయక గ్రాంట్ల' రాబడిని అంచనా వేయడం

భారత ప్రభుత్వం నుంచి అందే సహాయక గ్రాంట్ల విషయంలో బడ్జెటు అంచనాలు హెచ్చుతగ్గులుగా ఉంటున్నాయి:

పట్టిక 3.3: భారత ప్రభుత్వం నుంచి అందే సహాయక గ్రాంట్ల రాబడి విషయమై బడ్జెటు అంచనాలు, వాస్తవ రాబడి

(₹ కోట్లలో)

సంవత్సరం	బడ్జెటు అంచనాలు	వాస్తవంగా అందిన మొత్తం	అధికం (+) / తగ్గుదల (-)
(1)	*(2)*	*(3)*	*(4) = (3) - (2)*
2018-19	29,042	8,178	(-)20,864
2019-20	8,178	11,598	3,420
2020-21	10,525	15,471	4,946
2021-22	38,669	8,619	(-)30,050
2022-23	41,002	13,179	(-)27,823

మూలం: గత ఐదు సంవత్సరాల బడ్జెట్ పత్రాలు, ఆర్థిక పద్దులు

భారత ప్రభుత్వం నుంచి అందే సహాయక గ్రాంట్ల విషయంలో అంచనాలు 2021-22, 2022-23 సంవత్సరాలలో విపరీతంగా ఎక్కువగా ఉన్నాయి. ఇందుకు కారణం 2021-22 లో ప్రత్యేక ప్యాకేజి రూపంలో ₹25,105 కోట్లను, 2022-23 లో అదనపు కేంద్ర సహాయం రూపంలో ₹25,555 కోట్లను అంచనా వేయడమే. అయితే, భారత ప్రభుత్వ బడ్జెటు ప్రతిపాదనలలో ఇటువంటి కేటాయింపులేవీ లేవు. భారత ప్రభుత్వం నుంచి అందే సహాయక గ్రాంట్ల రూపంలో వాస్తవంగా అందిన మొత్తాలు అంచనాల కన్నా బాగా తక్కువగా ఉన్నాయి.

పన్నులు కాని ఇతర రాబడి, సహాయక గ్రాంట్ల రూపేణా అందే రాబడి విషయంలో అంచనాలు వాస్తవికంగా ఉండేలా ప్రభుత్వం ధ్రువీకరించుకోవాలి.

3.2.2.3 రాబడిని అంచనా వేయడం లేదా సవరించిన అంచనాలలో రాబడిని తగ్గించడం

ఒక సంవత్సరానికి సంబంధించి బడ్జెటును సమర్పిస్తున్నప్పుడు, మునుపటి సంవత్సరానికి సంబంధించిన సవరించిన అంచనాలను, అంతకు ముందు సంవత్సరానికి సంబంధించిన వాస్తవాలను సమర్పించడం ఆనవాయితీ. తదనుగుణంగా, 2023 ఫిబ్రవరి లో 2023-24 సంవత్సరపు బడ్జెటుతో పాటు 2022-23 సంవత్సరపు సవరించిన అంచనాలను కూడా సమర్పించడం జరిగింది.

- తొలి బడ్జెటు అంచనాలతో పోలిస్తే, రెవెన్యూ రాబడి సవరించిన అంచనాలు ₹17,227 కోట్ల మేర తగ్గాయి. ప్రధానంగా సహాయక గ్రాంట్లు (₹10,752 కోట్ల తగ్గుదల), పన్నులు కాని ఇతర రాబడి (₹10,129 కోట్ల తగ్గుదల) విషయంలో ఈ తగ్గుదల ఉండడం 2022 మార్చిలో చేసిన తొలి ప్రతిపాదనలు ఎక్కువగా ఉన్నాయని రూఢి చేస్తోంది.

- అయితే 2022-23 సంవత్సరం సవరించిన అంచనాలలో అంతర్రాష్ట్ర సర్దుబాట్ల రూపేణా తొలి అంచనాల (2022 మార్చి) లో లేని ₹7,500 కోట్ల మొత్తాన్ని కొత్తగా అంచనా వేయడం జరిగింది. ఇలా అంచనా వేసిన ₹7,500 కోట్ల మొత్తం ఆంధ్ర ప్రదేశ్ నుంచి విద్యుత్ బకాయిల రూపంలో రావల్సిన మొత్తం. ఈ ₹7,500 కోట్ల మొత్తాన్ని అంతర్రాష్ట్ర సర్దుబాట్ల పద్దు కింద అంచనా వేసేందుకు గల ప్రాతిపదిక విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సమాచారమూ అందజేయలేదు. నిజానికి, అంతర్రాష్ట్ర సర్దుబాట్ల పద్దు కింద అంచనా వేసిన ₹7,500 కోట్లలో 2022-23 లో రాష్ట్రానికి ఏమీ అందలేదు.

విద్యుతు బకాయిలకు సంబంధించిన సమాచారాన్ని ఇంధన శాఖ నుండి పొందాలని ఆర్థిక శాఖ సమాధానం ఇచ్చింది (2023 సెప్టెంబరు). అయితే, తొలి ప్రతిపాదనలలో పొందుపరచకుండా, ప్రత్యేకించి సవరించిన అంచనాలలోనే చేర్చిన అదనపు రాబడి ప్రతిపాదనలను రాష్ట్ర శాసనసభకు సమర్పించే ముందు ఆర్థిక శాఖ పరిశీలించాల్సి ఉన్నందున ఈ సమాధానం తప్పించుకునేదిగా ఉంది.

ఆంధ్ర ప్రదేశ్ విద్యుతు రంగ సంస్థల నుంచి తెలంగాణ రాష్ట్ర విద్యుతు రంగ సంస్థలకు వడ్డీతో కలుపుకుని ₹20,406 కోట్లు రావలసి ఉందని తెలంగాణ విద్యుతు ప్రసార సంస్థ (ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్) తెలిపింది (2023 అక్టోబరు). ఈ మొత్తాలు అందాల్సింది విద్యుతు రంగ సంస్థలకే గానీ రాష్ట్ర ప్రభుత్వానికి కాదని ఈ సమాధానం ధ్రువీకరిస్తోంది. కాబట్టి, విద్యుతు రంగ సంస్థలకు అందాల్సిన మొత్తాలను రాష్ట్ర ప్రభుత్వ బడ్జెటు అంచనాలలో పొందుపర్చిన ఫలితంగా సవరించిన అంచనాలలో రాబడిని ఎక్కువగా ఉజ్జాయింపు వేసినట్లైంది.

3.2.2.4 చేబదుళ్ల (వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సుల) తిరిగి చెల్లింపు ఖర్చును అంచనా వేయడం

ఖర్చుల విషయానికొస్తే, గత కొన్ని సంవత్సరాలుగా అధికవ్యయం అవుతున్న ముఖ్యమైన అంశాలలో చేబదుళ్లను (అంటే, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులను)[7] తిరిగి చెల్లించడం ఒకటి. చేబదుళ్లను తీర్చే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కేవలం నామమాత్రపు కేటాయింపులే చేస్తున్నా, ప్రతి సంవత్సరం చేబదుళ్ల మీద ఆధారపడడం పెరుగుతుండడం వల్ల చేబదుళ్లను తీర్చడం ఈ కింద చూపిన విధంగా భారీ అధిక వ్యయానికి దారితీస్తోంది:

పట్టిక 3.4: గత ఐదు సంవత్సరాలలో చేబదుళ్లు తిరిగి చెల్లింపు విషయమై బడ్జెటు అంచనాలు, వాస్తవాలు

(₹ కోట్లలో)

సంవత్సరం	బడ్జెటు అంచనాలు	వాస్తవవ్యయం	అధికవ్యయం
2018-19	1,100	21,823	20,723
2019-20	1,100	37,247	36,147
2020-21	1,100	69,453	68,353
2021-22	100	67,274	67,174
2022-23	100	82,823	82,723

మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

గత నాలుగు సంవత్సరాలుగా, అంటే 2019-20 నుంచి చేబదుళ్లతో కలిపి చూస్తే బడ్జెటు కేటాయింపుల కన్నా మొత్తం ఖర్చు ఎక్కువగా అయినట్లు కనిపిస్తున్నా (*పటం 3.3*), చేబదుళ్లను మినహాయించి చూస్తే బడ్జెటు అంచనాల కన్నా మొత్తం ఖర్చు ఈ కింద చూపిన విధంగా (*పటం 3.4*) బాగా తక్కువ.

[7] భారతీయ రిజర్వు బ్యాంకు వద్ద బ్యాంకింగు చేసే రాష్ట్రాల రాబడి, చెల్లింపుల మధ్య నగదు ప్రవాహంలో తాత్కాలికంగా కొరత ఏర్పడినప్పుడు రాష్ట్రాలు ఆ స్థితిని అధిగమించడంలో సాయపడేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు పరపతి విధానం ప్రకారం ఉపయోగించే ఒక ప్రక్రియ

పటం 3.3: 2018-19 నుంచి 2022-23 మధ్యకాలంలో చేబదుళ్లతో కలిపి మొత్తం కేటాయింపులు, ఖర్చులు



మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

చేబదుళ్లు తిరిగి చెల్లింపు ఏటేటా పెరుగుతోంది. ఇందుకు కారణం చేబదుళ్ల మీద ఆధారపడడం పెరుగుతూ ఉండడమే. అంతే కాకుండా, బడ్జెటు అంచనాలలో కేవలం నామమాత్రపు కేటాయింపులు చేయడంతో పాటు చేబదుళ్ల తిరిగి చెల్లింపు భారీగా ఉండడం వల్ల ప్రతి ఏటా ఆర్థిక పాలన కింద ప్రజాఋణం విభాగంలో రాష్ట్ర శాసన సభ ద్వారా క్రమబద్ధీకరణ అవసరమయ్యే అధిక వ్యయం నమోదు అవుతోంది.

పటం 3.4: బడ్జెటుతో పోలిస్తే చేబదుళ్ల తిరిగి చెల్లింపుతో కలిపి, చేబదుళ్ల తిరిగి చెల్లింపు మినహాయించి ఖర్చుల శాతం



మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

మొత్తం మీద గత రెండు సంవత్సరాలుగా బడ్జెటు కేటాయింపులలో 77 శాతం మాత్రమే ఖర్చు అయ్యి, మిగతా మొత్తం ఖర్చు కాకుండా మిగిలింది. అయితే, నామమాత్రపు కేటాయింపులు ఉన్న చేబదుళ్ల తిరిగి చెల్లింపు భారీగా ఉండడం వల్ల 2022-23 లో మొత్తం కేటాయింపు కన్నా ఏడు శాతం అధిక వ్యయం అయినట్లు కనిపిస్తోంది (అధికవ్యయం గురించి మరిన్ని వివరాలు *పేరా 3.3.2* ని చూడవచ్చు).

3.2.2.5 రాష్ట్ర అభివృద్ధి ఋణాలపై వడ్డీ మీద ఖర్చును అంచనా వేయడం

రాష్ట్ర అభివృద్ధి ఋణాలపై వడ్డీకి సంబంధించిన బడ్జెట్ అంచనాలను ఏటేటా తక్కువగా ఉజ్జాయింపు వేయడం జరుగుతోంది. బడ్జెట్ అంచనాలు, వాస్తవ వ్యయం మరియు అధిక వ్యయాలను ఈ కింది పట్టికలో చూపడం జరిగింది:

పట్టిక 3.5: రాష్ట్ర అభివృద్ధి ఋణాలపై వడ్డీ విషయమై బడ్జెటు అంచనాలు, వాస్తవ ఖర్చు

(₹ కోట్లలో)

సంవత్సరం	బడ్జెటు అంచనాలు	వాస్తవ వ్యయం	అధిక వ్యయం
2018-19	8,316	9,610	1,294
2019-20	11,007	11,455	448
2020-21	12,075	13,907	1,832
2021-22	14,635	16,421	1,786
2022-23	18,125	19,053	928

మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

రాష్ట్ర అభివృద్ధి ఋణాలపై వడ్డీ ముందుగానే నిర్ధారితమై ఉంటుంది కనుక బడ్జెటు అంచనాలను మరింత వాస్తవికంగా తయారు చేయవచ్చు. తద్వారా ఖర్చుల సరళి గురించి సక్రమంగా ప్రణాళికలు వేయవచ్చు.

3.2.2.6 ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య విభజించదగిన పింఛనుల ఖర్చును అంచనా వేయడం

బడ్జెటు అంచనాలు తక్కువగానూ, వాస్తవంగా అయ్యే ఖర్చు ఎక్కువగానూ ఉన్న అంశాలలో రాష్ట్ర పునర్విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభజించదగిన వివిధ రకాల పింఛనుల చెల్లింపులు కూడా ఉన్నాయి. రెండు రాష్ట్రాల మధ్య విభజించదగిన వివిధ రకాల పింఛనుల బడ్జెటు అంచనాలు, వాస్తవంగా అయిన ఖర్చులు ఈ కింది పట్టికలో ఇవ్వడం జరిగింది. బడ్జెటు అంచనాలు తక్కువగా ఉండడం వల్ల ప్రతి సంవత్సరమూ ₹1,000 కోట్లకు మించి అధికవ్యయం నమోదైంది.

పట్టిక 3.6: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభజించదగ్గ పింఛన్ల విషయంలో బడ్జెటు అంచనాలు, వాస్తవఖర్చు

(₹ కోట్లలో)

సంవత్సరం	బడ్జెటు అంచనాలు	వాస్తవ వ్యయం	అధిక వ్యయం
విభజన అనంతరం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి కేటాయించే సేవా పింఛన్లు			
2018-19	23	1,964	1,941
2019-20	23	3,342	3,319
2020-21	24	3,891	3,867
2021-22	31	5,076	5,045
2022-23	30	4,398	4,368
విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య 58.42:41.68 నిష్పత్తిలో కేటాయించే విభజనానంతర సేవా పింఛన్లు			
2019-20	182	1,302	1,120
2020-21	186	1,484	1,298
2021-22	237	2,243	2,006
2022-23	230	3,038	2,808
విభజన అనంతరం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి కేటాయించే కుటుంబ పింఛన్లు			
2018-19	3	755	752
2019-20	3	1,255	1,252
2020-21	3	1,401	1,398
2021-22	4	1,933	1,929
2022-23	800	1,803	1,003

మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

3.2.2.7 గంపగుత్త కేటాయింపులు

బడ్జెటు నియమావళిలోని పేరా 13.12 ప్రకారం బడ్జెటు అంచనాలలో సాధరణంగా గంపగుత్త కేటాయింపులు చేయరాదు. రాష్ట్ర ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలలో ఈ కింది విధంగా గంపగుత్త కేటాయింపులను చేసింది:

పట్టిక 3.7: గంపగుత్త కేటాయింపుల విషయంలో బడ్జెటు అంచనాలు, వాస్తవఖర్చు

(₹ కోట్లలో)

సంవత్సరం	బడ్జెటు అంచనాలు	వాస్తవ ఖర్చు
2052 - సచివాలయం - సాధారణ సేవలు - 090- సచివాలయం - 75 - గంపగుత్త కేటాయింపులు -010 - జీతాలు		
2018-19	200	0
2019-20	10	0
2022-23	500	0
2052 - సచివాలయం - సాధారణ సేవలు - 090- సచివాలయం - 75 - గంపగుత్త కేటాయింపులు -270 చిన్న పనులు		
2018-19	1	0
2021-22	8,000	0

మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

ఆయా సంవత్సరాలలో ఈ గంపగుత్త కేటాయింపులలో ఏమీ ఖర్చు కాలేదు.

ఇవే కాకుండా, తప్పకుండా పెట్టాల్సిన కొన్ని ఖర్చులను తొలి లేదా అనుబంధ బడ్జెటు అంచనాలలో పొందుపర్చని కారణంగా ***పేరా 3.4.1*** లో చర్చించినట్లు రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘనగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం లేని ఖర్చులను చేసింది.

3.2.3 ఫలితాల / పనితీరు బడ్జెటు

బడ్జెట్ మాన్యువల్ పేరా 2.1(q) ప్రకారం, పనితీరు బడ్జెటు అంటే భౌతికపరమైన, ఆర్థికపరమైన అంశాల కలబోతతో కార్యక్రమాల, ప్రాజెక్టుల, కార్యకలాపాల రూపంలో సంభావించి, ప్రతిపాదించి, అమలు చేసిన వైనాన్ని వివరించే ఒక సమగ్రమైన కార్యనిర్వహణ పత్రం. ఒక్కొక్క కార్యక్రమం, కార్యకలాపం కింద అభ్యర్థించిన నిధులకు సంబంధించిన ప్రయోజనాలు, లక్ష్యాలతో పాటు, ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రతిపాదించిన కార్యక్రమాలు, కార్యకలాపాల మూల్యం, చేసిన పని, అందించిన సేవలు, సాధించిన ఫలితాల తాలుకూ పరిమాణాత్మక సమాచారాన్ని ఈ పనితీరు బడ్జెట్ తెలియచేస్తుంది.

2005-06 లో కేంద్ర ప్రభుత్వం ఫలితాల బడ్జెటును ప్రవేశపెట్టినప్పటి నుంచి కేంద్ర మంత్రిత్వ శాఖలు, వాటి కింద ఉన్న డిపార్టుమెంటులు ప్రతిపాదిత పరివ్యయాన్ని ఉత్పత్తితోనూ, ఫలితాలతోనూ జోడించాలి. ఖర్చు వాస్తవంగా జరిగే స్థాయిలోనే ఫలితాల బడ్జెటును తయారు చేయాలని, వాటిని ప్రభుత్వంలోని సంబంధిత స్థాయిలో పరిగణనలోకి తీసుకోవాలని పదమూడో ఆర్థిక సంఘం సూచించింది. నేరుగా పెట్టిన ఖర్చులకు సంబంధించిన ఫలితాల బడ్జెటును రాష్ట్ర ప్రభుత్వాలు తయారు చేయవచ్చని కూడా సూచించింది.

2022-23 సంవత్సరానికి రాష్ట్ర శాసనసభ ముందు రాష్ట్ర ప్రభుత్వం 37 ప్రదానాల (లేదా గ్రాంట్ల) [8] కు అధికారికాభ్యర్థనలను ప్రవేశపెట్టింది.

[8] అంతకు ముందు సంవత్సరాలలో 40 ప్రదానాలు (లేదా గ్రాంట్లు). 2022-23 నుంచి బలహీన వర్గాల గృహనిర్మాణ పథకం (గ్రాంటు సంఖ్య XVIII) ను రోడ్లు, భవనాలు (గ్రాంటు సంఖ్య XI) లో, చిన్న తరహా నీటిపారుదల (గ్రాంటు సంఖ్య XXXIV) ను నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి (గ్రాంటు సంఖ్య XXXIII) లో, ప్రభుత్వ సంస్థలు (గ్రాంటు సంఖ్య XL) ను పరిశ్రమలు, వాణిజ్యం (గ్రాంటు సంఖ్య XXXVI) లో విలీనం చేయడం జరిగింది

- మొత్తం 37 ప్రదానాలలో, 3 ప్రదానాలకు[9] సంబంధించి ఫలితాల బడ్జెటును తయారు చేయలేదు.
- మిగతా 34 ప్రదానాల ఫలితాల బడ్జెటును సమీక్షించగా, 24 ప్రదానాల విషయంలో ఫలితాల సాధనకు సంబంధించి స్పష్టంగా పేర్కొనడం జరిగింది.
- గ్రాంటు సంఖ్య XV - 'క్రీడలు, యువజన సేవలు' విషయంలో ఫలితాల బడ్జెటులో శూన్య నివేదికను ఇవ్వడం జరిగింది.
- ఎనిమిది ప్రదానాల[10] విషయంలో, అంచనా వేసిన ఫలితాలను గానీ, వాటి వాస్తవ సాధనను గానీ పేర్కొనలేదు.
- గ్రాంటు సంఖ్య IX - 'ఆర్థిక పాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు' విషయంలో ఫలితాల బడ్జెటును పేర్కొనకుండా లక్ష్యసాధనను పేర్కొనడం జరిగింది.

3.3 వినియోగపు పద్దులు

ప్రతి సంవత్సరమూ భారత రాజ్యాంగంలోని 204, 205 అధికరణల కింద ఆమోదం పొందిన వినియోగపు చట్టం (అప్రోప్రియేషన్ యాక్ట్) కు అనుబంధంగా ఉన్న అనుసూచి (అంటే, షెడ్యూళ్ల) లో నిర్దేశించిన వివిధ ప్రయోజనాల విషయంలో ఓటు ద్వారా ఆమోదం పొందిన ప్రదానాల (గ్రాంట్ల) మొత్తంతోనూ, ఓటుతో నిమిత్తం లేకుండా నేరుగా ఖర్చు చేయగలిగే (అంటే నేరుగా చార్జ్ చేసే) వినియోగానుమతుల (అప్రోప్రియేషన్ల) మొత్తంతోనూ పోలిస్తే అయిన ప్రభుత్వ ఖర్చుల వివరాలు వినియోగపు పద్దులలో ఉంటాయి. బడ్జెటు తొలి కేటాయింపును, అనుబంధ ప్రదానాలను (గ్రాంట్లను), ఖర్చు కాకుండా తిరిగి అప్పగించిన మొత్తాలను, ఒక అంశం నుంచి మరో అంశానికి చేసే కేటాయింపుల బదిలీలను (రీ-అప్రోప్రియేషన్లను) ఈ వినియోగపు పద్దులలో విడివిడిగా చూపడం జరుగుతుంది. నేరుగా ఖర్చు కాగల చార్జ్‌డ్ అంశాలు, ఓటెడ్ అంశాలు, రెంటి విషయంలోనూ వినియోగపు చట్టం ద్వారా ఆమోదితమైన మొత్తాలతో పోల్చి వివిధ నిర్దిష్టమైన సేవల మీద వాస్తవంగా అయిన నిత్య వ్యావహారిక వ్యయాన్ని (అంటే, రెవెన్యూ ఖర్చులను), మూలధనవ్యయాన్ని(అంటే, క్యాపిటల్ ఖర్చులను) కూడా ఈ వినియోగపు పద్దులు సూచిస్తాయి. నిధుల వినియోగాన్ని, ఆర్థిక వనరుల నిర్వహణను, బడ్జెటు కేటాయింపుల పర్యవేక్షణలను ఈ వినియోగపు పద్దులు ప్రతిబింబిస్తాయి. ఆ విధంగా, ఆర్థిక పద్దులకు ఈ వినియోగపు పద్దులు అనుపూరకంగా ఉంటాయి.

3.3.1 వినియోగానుమతుల (అప్రోప్రియేషన్లు) ఆడిటు

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నిర్వహించే వినియోగానుమతుల ఆడిటు అనేది వివిధ ప్రదానాలు / వినియోగానుమతుల (అంటే గ్రాంట్లు / అప్రోప్రియేషన్ల) కింద వాస్తవంగా పెట్టిన ఖర్చు వినియోగపు చట్టం ఇచ్చిన అనుమతులకు లోబడే ఉన్నదనీ, రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం నేరుగా ఖర్చు కాగల చార్జ్‌డ్ అంశాల మీద ఆ విధంగా నేరుగానే ఖర్చు అయిందనీ నిర్ధారించుకునేందుకు ఉద్దేశించింది. ఆ విధంగా పెట్టిన ఖర్చు సంబంధిత చట్టాలకు, నియమాలకు, నిబంధనలకు, ఆదేశాలకు అనుగుణంగానే ఉన్నదో లేదో కూడా మదింపు వేయడం జరుగుతుంది.

3.3.2 2022-23 లో మొత్తం కేటాయింపులు, వాస్తవంగా అయిన ఖర్చుల సంక్షిప్తరూపం

సంక్షిప్తంగా 2022-23 సంవత్సరం మొత్తం బడ్జెట్ కేటాయింపు, చెల్లింపులు, తగ్గిన ఖర్చు / అధిక వ్యయాల ***పట్టిక 3.8*** లో ఇవ్వడం జరిగింది.

[9] (i) రాష్ట్ర శాసనమండలి, (ii) గవర్నరు, మంత్రి పరిషత్తు, (iii) సాధారణ పరిపాలన, ఎన్నికలు

[10] (i) న్యాయపాలన, (ii) రెవెన్యూ, రిజిస్ట్రీకరణ, ఉపశమనం, (iii) ఆబ్కారీ పాలన, (iv) వాణిజ్య పన్నుల పాలన, (v) రవాణా పాలన, (vi) వైద్యం, ఆరోగ్యం, (vii) మత ధర్మాదాయ సంస్థల పాలన, (viii) ఇంధనం

పట్టిక 3.8: 2022-23 సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపు, చెల్లింపులు, తగ్గిన ఖర్చు / అధిక వ్యయం

(₹ కోట్లలో)

ఓటెడ్ / చార్జ్డ్	ఖర్చు తీరు	తొలి గ్రాంటు / అప్రోప్రియేషను	అనుబంధ గ్రాంటు/ అప్రోప్రియేషను	మొత్తం	వాస్తవంగా అయిన ఖర్చు	మొత్తం బడ్జెటుతో పోలిస్తే తక్కువ ఖర్చు (-) / అధిక వ్యయం (+)	తగ్గిన ఖర్చు (-) / అధిక వ్యయం(+) శాతం	ఈ సంవత్సరంలో తిరిగి అప్పగించిన	
								మొత్తం	శాతం
ఓటు అయిన తర్వాత ఖర్చు కాగలవి (ఓటెడ్)	రెవెన్యూ	1,70,135	12,068	1,82,203	1,41,643	(-) 40,560	(-) 22	60,140	33
	క్యాపిటల్	29,673	5,033	34,706	17,925	(-) 16,781	(-) 48	14,341	41
	ఇచ్చిన ఋణాలు - అడ్వాన్సులు	26,253	1,157	27,410	21,249	(-) 6,161	(-) 22	5,067	18
	ఓటెడ్ మొత్తం	2,26,061	18,258	2,44,319	1,80,817	(-) 63,502	(-) 26	79,548	33
ఓటింగుతో నిమిత్తం లేకుండా నేరుగా ఖర్చు కాగలవి (చార్జ్డ్)	రెవెన్యూ	19,202	1,873	21,075	22,079	1,004	5	53	0.25
	క్యాపిటల్	56	63	119	83	(-) 36	(-) 30	35	30
	ప్రజా ఋణాల తిరిగి చెల్లింపులు	11,702	310	12,012	94,810	82,798	689	818	7
	చార్జ్డ్ మొత్తం	30,960	2,246	33,206	1,16,972	83,766	252	906	3
ఆకస్మిక ఖర్చుల నిధి వినియోగానుమతి		శూన్యం	శూన్యం	శూన్యం	శూన్యం	శూన్యం	శూన్యం	శూన్యం	శూన్యం
పూర్తి మొత్తం		2,57,021	20,504	2,77,525	2,97,789	20,264	7	80,454	29

మూలం: వినియోగపు పద్దులు

గమనిక: మొత్తం ₹2,97,789 కోట్లలో, ₹2,013 కోట్లను వ్యక్తిగత డిపాజిట్ ఖాతాలకు బదలాయించడమైంది (పద్దు సంఖ్య 8443-106)

07 ప్రదానాలు (గ్రాంట్లు), 02 వినియోగానుమతులు[11] (అప్రోప్రియేషన్లు) (***అనుబంధం 3.1***) లో ₹1,05,565 కోట్లు అధిక వ్యయం అయ్యి, 35 ప్రదానాలు, 11 వినియోగానుమతులలో కేటాయింపులతో పోలిస్తే ₹85,301 కోట్ల మేర తక్కువ ఖర్చు కాగా, వెరసి నికర అధిక వ్యయం ₹20,264 కోట్లు. రాబడికి, చెల్లింపు అవసరాలకు మధ్య ఏర్పడే అంతరాన్ని ఎదుర్కొనేందుకు తీసుకున్న ₹82,823 కోట్లు తాత్కాలిక చేబదుళ్ల[12] తిరిగి చెల్లింపును మినహాయించినట్లైతే మొత్తం బడ్జెటు కేటాయింపులతో పోలిస్తే ₹62,458 కోట్ల[13] మేర తక్కువ ఖర్చు అయింది.

ఓటెడ్ విభాగం కింద అన్ని అంశాల్లోనూ, నేరుగా ఖర్చు కాగల చార్జ్డ్ అంశాలలోని క్యాపిటల్ విభాగంలోనూ కేటాయింపులతో పోలిస్తే తక్కువ ఖర్చు కాగా, నేరుగా ఖర్చు కాగల చార్జ్డ్ అంశాలలోని రెవెన్యూ చార్జ్డ్, ప్రజాఋణం తిరిగి చెల్లింపులలో అధిక వ్యయం అయ్యింది.

రాష్ట్ర ప్రభుత్వం 2022-23 లో బడ్జెటు కేటాయింపులు ఏమీ లేకుండానే ఉప-పద్దు స్థాయిలో ₹8,985 కోట్ల మేర ఆమోదం లేని ఖర్చులను చేసింది (*పేరా 3.4.1* ని చూడవచ్చు).

---

[11] నిత్య వ్యావహారిక వ్యయం (అంటే, రెవెన్యూ ఖర్చు) కింద నాలుగు గ్రాంట్లు, మూలధనవ్యయం (అంటే, క్యాపిటల్ ఖర్చు) కింద రెండు గ్రాంట్లు, ఋణాలు కింద ఒక గ్రాంటు, రెవెన్యూ కింద ఒక వినియోగానుమతి, ప్రజా ఋణం కింద ఒక వినియోగానుమతి

[12] చేబదుళ్లను తీర్చడం కోసం బడ్జెటులో ₹100 కోట్లను కేటాయించగా వాస్తవంగా అయిన ఖర్చు ₹82,823 కోట్లు

[13] చేబదుళ్ల తిరిగి చెల్లింపును మినహాయిస్తే బడ్జెటు కేటాయింపు ₹2,77,425 కోట్లు కాగా, వాస్తవంగా అయిన ఖర్చు ₹2,14,967 కోట్లు

3.3.3 చార్జ్డ్, ఓటెడ్ ఖర్చుల సరళి

శాసనసభ ఓటింగు అవసరం లేకుండా నేరుగా ఖర్చు కాగల చార్జ్డ్ ఖర్చులు, ఓటింగు ద్వారా ఆమోదం పొంది ఖర్చు చేయగలిగే ఓటెడ్ ఖర్చుల విషయంలో గత ఐదు సంవత్సరాల సరళిని ఈ కింద చూపడం జరిగింది:

పటం 3.5: 2018-19 నుంచి 2022-23 మధ్య ఐదు సంవత్సరాల కాలంలో నేరుగా కాగల చార్జ్డ్ ఖర్చులు, ఓటు ద్వారా ఆమోదం పొంది ఖర్చు కాగల ఓటెడ్ ఖర్చుల సరళి



మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

ప్రతి ఏటా నేరుగా ఖర్చు కాగల చార్జ్డ్ విభాగంలో అధిక వ్యయం అవుతుండగా, ఓటెడ్ విభాగంలో కేటాయింపులతో పోలిస్తే తక్కువే ఖర్చు అవుతోంది. చేబదుళ్లు (వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు), రాష్ట్ర అభివృద్ధి ఋణాల మీద వడ్డీ వంటి వాటి విషయంలో అంచనాలు తక్కువగా వేయడం వల్ల చార్జ్డ్ విభాగంలో అధిక వ్యయం అవుతుండగా, పథకాలు / సంక్షేమ కార్యక్రమాలు / అభివృద్ధి కార్యకలాపాల విషయంలో ఎక్కువ అంచనాలు వేయడం వల్ల కేటాయింపులతో పోలిస్తే ఖర్చు తక్కువ అవుతోంది.

ఓటింగుతో సంబంధం లేకుండా సంచిత నిధి నుంచి నేరుగా ఖర్చు కాగల చార్జ్డ్ ఖర్చుల విషయంలో సహేతుకమైన ఖచ్చితత్వంతో మదింపు వేయగలిగే ఖర్చులను వాస్తవికంగా అంచనా వేసేటట్లు రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించుకోవాలి.

3.3.4 బడ్జెటు ఖచ్చితత్వం

3.3.4.1 యావత్తు బడ్జెటు లక్ష్యసాధన

తొలుత ఆమోదితమైన మొత్తంతో పోలిస్తే యావత్తు బడ్జెటు వ్యయ లక్ష్యసాధన / వాస్తవ వ్యయం తక్కువైనా, అధికమైనా ఏ మేరకు ప్రతిబింబిస్తోందన్న విషయాన్ని యావత్తు బడ్జెటు లక్ష్యసాధన ద్వారా మదింపు వేయవచ్చు.

పట్టిక 3.9: 2022-23 సంవత్సరంలో ఆమోదితమైన తొలి బడ్జెట్, వాస్తవ వ్యయ లక్ష్యసాధన

(₹ కోట్లలో)

వివరం	ఆమోదితమైన తొలి బడ్జెటు	వ్యయపరంగా వాస్తవ లక్ష్యసాధన	అంచనాలకు, వాస్తవాలకు మధ్య వ్యత్యాసం
నిత్య వ్యావహారిక వ్యయం (లేదా రెవెన్యూ)	1,89,337	1,63,722	(-) 25,615
మూలధన (లేదా క్యాపిటల్) వ్యయం	29,729	18,009	(-) 11,720
ఋణాలు (ప్రజాఋణంతో సహా*)	37,855	33,236	(-) 4,619
మొత్తం	**2,56,921**	**2,14,967**	**(-) 41,954**

** చేబదుళ్లను మినహాయించగా*

మూలం: వినియోగ పద్దులు

నిత్య వ్యావహారిక (అంటే, రెవెన్యూ) విభాగంలో, బడ్జెటు అంచనాలతో పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 14 శాతం. ఇది 17 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 10 గ్రాంట్లలో +/- 25 శాతం నుంచి +/- 50 శాతం వరకు తేడా, 10 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది. రెవెన్యూ విభాగంలో ఇంధన గ్రాంటులో లక్ష్యసాధన +90 శాతం మేర అధికంగా ఉండగా, రోడ్లు, భవనాలు గ్రాంటులో ((-)87 శాతం), పర్యటన, కళలు, సంస్కృతి గ్రాంటులో ((-)84 శాతం), పౌర సరఫరాల పాలన గ్రాంటులో ((-) 77 శాతం) లక్ష్యసాధన తగ్గింది.

మూలధన (అంటే, క్యాపిటల్) విభాగంలో, బడ్జెటు అంచనాలతో పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 39 శాతం. ఇది 2 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 9 గ్రాంట్లలో +/- 25 శాతం నుంచి +/- 50 శాతం వరకు తేడా, 13 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది. మరో 4 గ్రాంట్లలో 100 శాతం లేదా అంత కన్నా ఎక్కువగా ఉంది. మూలధన విభాగంలో కార్మిక, ఉపాధి గ్రాంటులో (8,113 శాతం), మహిళ, శిశు సంక్షేమం గ్రాంటులో (1,980 శాతం), పాఠశాల విద్య గ్రాంటులో (336 శాతం), పరిశ్రమలు, వాణిజ్యం గ్రాంటులో (247 శాతం) లక్ష్యసాధన 100 శాతం కన్నా ఎక్కువగా ఉండగా, వాణిజ్య పన్నుల పాలన, పురపాలక - పట్టణాభివృద్ధి గ్రాంటులలో లక్ష్యసాధన 100 శాతం కన్నా తక్కువగా ఉంది.

ఋణాలు విభాగంలో, బడ్జెటు అంచనాలతో పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 12 శాతం. ఇది 8 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 3 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది. మరో గ్రాంటులో 100 శాతం లేదా అంత కన్నా ఎక్కువగా ఉంది. ఋణాల విభాగంలో వ్యవసాయ గ్రాంటులో (551 శాతం) అత్యధిక లక్ష్యసాధన ఉంది.

3.3.4.2 ఖర్చుల కూర్పుకు సంబంధించిన లక్ష్యసాధన

బడ్జెటులోని ప్రధాన వర్గాల మధ్య తిరిగి చేసిన కేటాయింపులు ఏ మేరకు ఖర్చుల కూర్పులో తేడాలకు దోహదపడ్డాయో ఖర్చుల కూర్పు లక్ష్యసాధన మదింపు వేస్తుంది.

పట్టిక 3.10: 2022-23 సంవత్సరానికి సవరించిన బడ్జెటు, వాస్తవ వ్యయ లక్ష్యసాధన

(₹ కోట్లలో)

వివరం	ఆమోదితమైన తొలి బడ్జెటు అంచనాలు	సవరించిన అంచనాలు	వాస్తవ వ్యయ లక్ష్యసాధన	తొలి అంచనాలకు, సవరించిన అంచనాలకు మధ్య తేడా	సవరించిన అంచనాలకు, వాస్తవ వ్యయ లక్ష్యసాధనకు మధ్య తేడా
నిత్య వ్యావహారిక వ్యయం (లేదా రెవెన్యూ)	1,89,337	2,03,278	1,63,722	13,941	(-) 39,556
మూలధన (లేదా క్యాపిటల్) వ్యయం	29,729	34,824	18,009	5,095	(-) 16,815
ఋణాలు (ప్రజాఋణంతో సహా*)	37,855	39,323	33,236	1,468	(-) 6,087
మొత్తం	**2,56,921**	**2,77,425**	**2,14,967**	**20,504**	**(-) 62,458**

** చెల్లింపులను మినహాయించగా; మూలం: వినియోగ పద్దులు*

నిత్య వ్యావహారిక (అంటే, రెవెన్యూ) విభాగంలో, సవరించిన అంచనాలతో పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 19 శాతం. ఇది 15 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 13 గ్రాంట్లలో +/- 25 శాతం నుంచి +/- 50 శాతం వరకు తేడా, 09 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది.

మూలధన (అంటే, క్యాపిటల్) విభాగంలో, సవరించిన అంచనాలతో పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 48 శాతం. ఇది 3 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 9 గ్రాంట్లలో +/- 25 శాతం నుంచి +/- 50 శాతం వరకు తేడా, 13 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది. మరో 3 గ్రాంట్లలో 100 శాతం లేదా అంత కన్నా ఎక్కువగా ఉంది.

ఋణాల విభాగంలో, సవరించిన అంచనాలతో పోలిస్తే వ్యయ లక్ష్యసాధనలో తేడా (-) 15 శాతం. ఇది 08 గ్రాంట్లలో 0 నుంచి +/- 25 శాతం వరకు తేడా, 3 గ్రాంట్లలో +/-50 శాతం నుంచి +/-100 శాతం వరకు తేడా వచ్చిన కారణంగా జరిగింది. మరో 1 గ్రాంటులో 100 శాతం లేదా అంత కన్నా ఎక్కువగా ఉంది.

3.3.5 బడ్జెటుతో పోలిస్తే ఏర్పడిన వ్యత్యాసానికి వివరణ ఇవ్వకపోవడం

ప్రజా పద్దుల సంఘం (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పి.ఎ.సి.)) నిర్దేశించిన పరిమితులకు మించి ఉప-పద్దు స్థాయిలో అయిన అధిక వ్యయం లేదా తక్కువ ఖర్చుల మీద వ్యాఖ్యలకు వినియోగపు పద్దులు వివరణనిస్తాయి.

మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలోని ప్రజాపద్దుల సంఘం (పి.ఏ.సి.) 2013 జనవరిలో వినియోగపు పద్దుల మీద వ్యాఖ్యల కోసం ఆమోదించిన ఈ కింది ప్రమాణాలనే తెలంగాణ ప్రభుత్వం కూడా వర్తింప జేసుకుంది.

కేటాయింపుతో పోలిస్తే తగ్గిన ఖర్చు	(ఎ) ఒక గ్రాంటు / ఛార్జ్‌డ్ అప్రోప్రియేషను కింద మొత్తంగా ఉన్న ఖర్చులో న్యూనత కేటాయింపు మొత్తంలో 5 శాతం కన్నా తక్కువగా ఉంటే ఏమీ వ్యాఖ్యానించాల్సిన అవసరం లేదు. అయితే, గ్రాంటు / అప్రోప్రియేషనుకు మొత్తం కేటాయింపు ₹500 కోట్లు అంత కన్నా ఎక్కువగా ఉంటే, విడిగా ఒక ఉప పద్దు కింద కేటాయింపులో 10 శాతం లేదా ₹100 లక్షలు, రెంటిలో ఏది ఎక్కువ అయితే దానికి మించి తగ్గిన ఖర్చు / అధిక వ్యయం ఉంటే ఆ ఉప పద్దులోని తగ్గిన ఖర్చు / అధిక వ్యయం మీద వ్యాఖ్యలను పొందుపర్చడం జరుగుతుంది. (బి) ఒక గ్రాంటు / ఛార్జ్‌డ్ అప్రోప్రియేషను కింద మొత్తంగా ఉన్న ఖర్చులో న్యూనత కేటాయింపు మొత్తంలో 5 శాతం కన్నా ఎక్కువగా ఉంటే, విడిగా ఒక ఉప పద్దు కింద తగ్గిన ఖర్చు / అధిక వ్యయం కేటాయింపులో 10 శాతం లేదా ₹50 లక్షలు, రెంటిలో ఏది ఎక్కువగా ఉంటే దానికి మించి తగ్గిన ఖర్చు / అధిక వ్యయం ఉంటే ఆ ఉప-పద్దులో తగ్గిన ఖర్చు/ అధిక వ్యయం మీద వ్యాఖ్యలను పొందుపర్చడం జరుగుతుంది.
అధికవ్యయం	(ఎ) ఏదైనా ఒక గ్రాంటు / అప్రోప్రియేషను కింద ఒక్క రూపాయి అధికవ్యయం అయినా దానికి శాసనసభ క్రమబద్ధీకరణ అవసరం. (బి) విడిగా ఒక ఉప పద్దు కింద అధిక వ్యయం ₹25 లక్షలు, అంత కన్నా ఎక్కువ ఉన్నపుడు మాత్రమే ఆ ఉప పద్దు అధిక వ్యయం మీద వ్యాఖ్యలను పొందుపర్చడం జరుగుతుంది. (సి) విడిగా ఒక ఉప పద్దు కింద మిగులు (అధిక వ్యయం గ్రాంటు కింద), కేటాయింపులో 10 శాతం లేదా ₹50 లక్షలు, రెంటిలో ఏది ఎక్కువగా ఉంటే దాని కన్నా ఎక్కువ ఉన్నప్పుడు ఆ ఉప పద్దులో తగ్గిన ఖర్చు మీద వ్యాఖ్యలను పొందుపర్చడం జరుగుతుంది.

ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్ & ఎన్టైటిల్మెంట్స్) ముసాయిదా వినియోగపు పద్దులను ఆయా శాఖలకు అందజేసి, ఉప పద్దు స్థాయిలో పొందుపరిచిన అధికవ్యయం / తక్కువ ఖర్చుల మీద చేసిన వ్యాఖ్యలపై కారణాలను/ వివరణలను కోరారు. అయితే, బడ్జెట్ కేటాయింపులకు, వాటితో పోలిస్తే ఖర్చుకు మధ్య ఉన్న తేడాలకు నియంత్రణాధికారులు వివరణ అందజేయలేదు. 2022-23 లో పద్దులలో ఉన్న మొత్తం ఉప పద్దుల సంఖ్య, కేటాయింపులతో పోలిస్తే ఖర్చులలో ఉన్న తేడాలకు వివరణలు అవసరమైన ఉప పద్దుల సంఖ్య, తేడాలకు వివరణ అందిన ఉప పద్దుల సంఖ్యలను ***పటం 3.6*** లో చూపడం జరిగింది.

పటం 3.6: 2022-23 సంవత్సరంలో బడ్జెటుతో పోలిస్తే తేడాలకు వివరణ అందని ఉప పద్దులు

మొత్తం ఉప పద్దుల సంఖ్య	2059
తేడాలకు వివరణ అవసరం ఉన్న ఉప పద్దుల సంఖ్య	1019
తేడాలకు వివరణ అందిన ఉప పద్దుల సంఖ్య	శూన్యం

మూలం: వినియోగ పద్దులు

వివరణ అవసరమైన ఏ ఒక్క ఉప పద్దు విషయంలోనూ తేడాలకు వివరణలు అందలేదని గమనించాము. నిజానికి, 2021-22 లో 1,019 ఉప పద్దులకు (మొత్తం ఉప పద్దులు 2,012), 2020-21 లో 893 ఉప పద్దులకు (మొత్తం ఉపపద్దులు 1,952), అదే విధంగా, 2019-20 లో 862 ఉపపద్దులకు (మొత్తం ఉప పద్దులు 2,282) కూడా రాష్ట్ర ప్రభుత్వం వివరణలను ఇవ్వలేదు. ఇదే విషయాన్ని 2022 మార్చి, 2021 మార్చి, 2020 మార్చిలతో ముగిసిన రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల మీద ఆడిటు నివేదికలలో కూడా ప్రస్తావించడం జరిగింది[14].

బడ్జెట్ కేటాయింపుకు, వినియోగానికి మధ్య ఏర్పడ్డ తేడాలకు వివరణ సమర్పించకపోవడం ప్రభుత్వ ఆర్థికపరమైన జవాబుదారీతనాన్ని, బడ్జెటు మీద శాసనసభ నియంత్రణను పరిమితం చేస్తుంది.

3.4 బడ్జెటు, అకౌంటింగు ప్రక్రియల సమగ్రత

3.4.1 చట్టపరమైన అధికారం లేకుండానే చేసిన ఖర్చులు

భారత రాజ్యాంగంలోని అధికరణ 204 ప్రకారం, ఈ అధికరణలోని నిబంధనలకు అనుగుణంగా ఆమోదం పొందిన చట్టంలోని వినియోగానుమతుల మేరకు తప్ప రాష్ట్ర సంచిత నిధి నుంచి ధనాన్ని ఇతరత్రా తీసుకోరాదు. బడ్జెట్ నియమావళిలోని పేరా 17.3.5 ప్రకారం, ఏదైనా సంవత్సరం బడ్జెటు అంచనాలలో పొందుపర్చని 'కొత్త సర్వీసు' మీద నేరుగా ఖర్చు పెట్టే చార్జ్‌డ్ ఖర్చు అయినా, శాసనసభ ఓటు చేసిన తర్వాత పెట్టే ఓటెడ్ ఖర్చు అయినా, కేటాయింపు బదిలీ (రీ-అప్రోప్రియేషను) ద్వారా ఖర్చు పెట్టగలిగేది అయినా, కాకున్నా, శాసన సభకు సమర్పించే అనుబంధ వ్యయ ప్రకటనలోనో, తదనంతర వినియోగపు చట్టంలోనో పొందుపర్చకుండా ఖర్చు చేయరాదు.

ఉప పద్దుల స్థాయిలో ఈ కింద చూపిన విధంగా బడ్జెటు కేటాయింపులు లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం 48 ఉప పద్దుల కింద ₹8,985 కోట్ల భారీ మొత్తాన్ని ఖర్చు చేసింది:

పట్టిక 3.11: 2022-23 సంవత్సరంలో బడ్జెటు కేటాయింపులు లేకుండానే పెట్టిన ఖర్చు

గ్రాంట్లు / అప్రోప్రియేషన్ల సంఖ్య	పెద్ద పద్దుల సంఖ్య	ఉప పద్దుల సంఖ్య	ఖర్చు (₹కోట్లలో)
24	28	48	8,985

మూలం: వినియోగ పద్దులు

[14] ఈ నివేదికలలోని పేరా 3.4.1 "చట్టపరమైన అధికారం లేకుండానే చేసిన ఖర్చుల" ను వివరిస్తే, పేరా 3.4.2 లో "అధికవ్యయాలు – వాటి క్రమబద్ధీకరణ" ను చర్చించడం జరిగింది.

బడ్జెటు కేటాయింపు లేకుండా పెట్టిన మొత్తం వ్యయంలో 98 శాతం (₹8,765 కోట్లు) ఉన్న ఈ కింది ఐదు అంశాల మీద అప్పటికే ఖర్చు జరిగి ఉన్నా లేదా తప్పనిసరిగా పెట్టాల్సి ఉన్న ఖర్చు అని తెలిసి ఉన్నా ఆర్థిక శాఖ వాటిని పొందుపర్చలేదు.

3.4.1.1 'ఉదయ్' కింద డిస్కముల నష్టాలను తీసుకోవడం కోసం ఖర్చు చేసిన తర్వాత కూడా కేటాయింపులను చేయకపోవడం

'ఉజ్వల్ డిస్కం అస్యూరెన్స్ యోజన (ఉదయ్)' ప్రకారం కేంద్ర ప్రభుత్వంతో, డిస్కంలతో కుదుర్చుకున్న ఒక త్రైపాక్షిక ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వం డిస్కముల నష్టాలను తీసుకోవాల్సి ఉంది. కట్టుబడి ఉన్న ఈ అంశాన్ని నెరవేర్చేందుకు 2022-23 సంవత్సరం తొలి బడ్జెట్ అంచనాలలో ఎలాంటి మొత్తాలను కేటాయించకపోయినా, గ్రాంటు సంఖ్య XXXV - ఇంధనం కింద 'ప్రభుత్వ రంగ సంస్థలకు, ఇతర సంస్థలకు సహాయం'[15] అనే చిన్న పద్దులో రాష్ట్ర ప్రభుత్వం ₹7,061 కోట్లను[16] ఖర్చు చేసింది.

ఈ ఖర్చుకు తొలి బడ్జెటు అంచనాలలో శాసన సభ నుంచి ఆమోదం తీసుకోనందువల్ల, 2022 జూన్, డిసెంబరు నెలల్లో ఖర్చు జరిగినందువల్ల, ఇంధన, ఆర్థిక శాఖలు అనుబంధ కేటాయింపుల ద్వారా రాష్ట్ర శాసన సభ ఆమోదాన్ని పొందాల్సి ఉన్నా, ఆ విధంగా ఆమోదాన్ని పొందలేదు. అందుకు గల కారణాలు రికార్డుల్లో లేవు. ఈ విధంగా, ₹7,061 కోట్ల మేర ఆమోదం లేని ఖర్చు అయింది.

నిజానికి, 'ఉదయ్ కింద డిస్కమ్‌ల నష్టాలను తీసుకోవడం' కోసం అప్పటికే (అంటే, 2022 జూన్ నాటికే) ₹6,646 కోట్లను ఖర్చు చేయడం జరిగిందని ఒక ఆడిటు ప్రశ్నకు సమాధానంగా ఆర్థిక శాఖ తెలిపింది (2022 నవంబరు). అప్పటికే అయి ఉన్న ఖర్చుకు అనుబంధ డిమాండ్ల రూపంలో ఆమోదం పొందాల్సి ఉన్న విషయం ఆర్థిక శాఖకు తెలుసని ఈ సమాధానం రూఢీ చేస్తోంది.

3.4.1.2 మార్క్‌ఫెడ్‌కు ఋణాలు ఇచ్చే నిమిత్తం ఖర్చు చేసిన తర్వాత కూడా బడ్జెటు అంచనాలలో కేటాయింపులను చేయకపోవడం

గ్రాంటు సంఖ్య XXVII - వ్యవసాయం కింద మార్క్‌ఫెడ్‌కు ఋణాలను ఇచ్చే నిమిత్తం బడ్జెటు తొలి అంచనాల్లో కేటాయింపులు లేకున్నా ₹1,107 కోట్లను ఖర్చు చేయడం జరిగింది (2022 ఆగస్టు). ఈ ఖర్చుకు బడ్జెటు తొలి అంచనాలలో శాసనసభ ఆమోదం లేదు కనుక తదుపరి ఖర్చు నిమిత్తం ప్రదానం కోసం అధికారిక అభ్యర్థన రూపంలో ఋణాల విభాగం (పెద్ద పద్దు 6401) కింద అనుబంధ అంచనాలలో (2023 ఫిబ్రవరి) ఈ అంశాన్ని సరిగానే చేర్చడం జరిగింది.

అయితే, ఈ అంశాన్ని వినియోగపు చట్టం (అప్రోప్రియేషన్ యాక్ట్ - యాక్ట్ 3 ఆఫ్ 2023) లో ఋణాల విభాగంలో కాకుండా పొరపాటున మూలధన విభాగంలో చేర్చడం జరిగింది.

ఫలితంగా, మూలధన విభాగంలో ₹1,107 కోట్ల మేర చేసిన కేటాయింపు ఖర్చు కాకుండా ఉన్నట్లైంది. మరోవైపు, మార్క్‌ఫెడ్‌కు ఋణాల రూపంలో ఋణాల విభాగం కింద ఇచ్చిన ₹1,107 కోట్లు ఖర్చు ఆమోదం లేకుండా పెట్టిన ఖర్చు అయింది.

వినియోగానుమతుల చట్టానికి అనుగుణంగా అనుబంధ బడ్జెటు అంచనాలకు అవసరమైన సవరణ జారీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం (2023 సెప్టెంబరు) సమాధానమిచ్చింది.

---

[15] ఇక్కడ పేర్కొన్న ₹7,061 కోట్లలో చిన్న పద్దు 'ప్రభుత్వ రంగ సంస్థలకు, ఇతర సంస్థలకు సహాయం' నుంచి ₹1,091 కోట్లను షెడ్యూల్డు కులాలకు ప్రత్యేక అంశాల ప్రణాళిక' కు, ₹643 కోట్లను 'గిరిజన ప్రాంత ఉప-ప్రణాళిక' కు పద్దు పుస్తకాలలో సర్దుబాటు ద్వారా బదిలీ చేయడం జరిగింది (ఈ అంశమై మరిన్ని వివరాల కోసం *పేరా 3.4.7* చూడవచ్చు)

[16] 2002 జూన్ లో ₹6,646 కోట్లు, 2022 డిసెంబరులో ₹415 కోట్లు

అయితే, 2022 ఆగస్టులోనే ఋణాల విభాగం కింద ఈ ఖర్చు పెట్టడం జరిగినందున, 2023 ఫిబ్రవరి లోని వినియోగపు చట్టం మూలధనం విభాగం కింద ఖర్చుకు ఆమోదం తెలిపినందున, ఋణాల విభాగంలో బడ్జెటు కేటాయింపు లేకుండానే ఖర్చు అయినట్లు, మూలధన విభాగంలో కేటాయింపు మొత్తం ఖర్చు కాకుండానే ఉండిపోయినట్లు అయింది.

3.4.1.3 కేంద్ర రోడ్డు నిధి నుంచి బదలాయింపు నిమిత్తం అనుబంధ బడ్జెటు అంచనాలలో కేటాయింపులను చేయకపోవడం

రోడ్ల అభివృద్ధి పనుల కోసం భారత ప్రభుత్వం నుంచి అందిన గ్రాంట్లను రాష్ట్ర సంచిత నిధిలో భారత ప్రభుత్వం నుంచి అందిన గ్రాంట్లుగా జమ చేయడం జరుగుతుంది. ఈ మొత్తాలను తరువాత సంచిత నిధి నుంచి ప్రజాపద్దులలోని డిపాజిటు పద్దులకు బదిలీ చేయడం జరుగుతుంది. తొలుత రాష్ట్ర కేటాయింపుల నుంచి నిత్య వ్యావహారిక (రెవెన్యూ) వ్యయం రూపంలో ఖర్చు చేయడం ద్వారా ఈ నిధి నుంచి ఖర్చు అవుతుంది. అటు తర్వాత, ఖర్చును ప్రజాపద్దులోని డిపాజిటు పద్దుకు బదిలీ చేసి దానికి అనుగుణమైన మొత్తాన్ని మూలధన వ్యయానికి జమ చేయడం జరుగుతుంది.

ఈ ప్రక్రియకు అనుగుణంగా 2022-23 లో కేంద్ర రోడ్డు నిధి నుంచి బదలాయింపు నిమిత్తం భారత ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ₹276 కోట్లు[17] (2022 జూన్, సెప్టెంబర్) అందింది. కనుక కేంద్ర రోడ్డు నిధి బదలాయింపు కింద ₹276 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి తెలుసు.

అయితే, ఈ అంశానికి సంబంధించి ఖర్చుకు శాసనసభ నుంచి ఆమోదాన్ని పొందలేదు. ఈ విధంగా, ₹276 కోట్ల మేర ఆమోదం లేని ఖర్చు అయింది.

ఈ అంశంపై ఇలాంటి ఆమోదం లేని వ్యయాన్ని గతంలోని రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిటు నివేదికలలో కూడా ప్రస్తావించడం జరిగింది. అయితే, 2022-23 లో ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు.

3.4.1.4 విభజన అనంతరం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి కేటాయించే మొత్తాల నిమిత్తం రీ-అప్రోప్రియేషన్ ఉత్తర్వుల ద్వారా ఆమోదం లేని ఖర్చు

బడ్జెట్ నియమావళిలోని పేరా 17.6.1 (సి) ప్రకారం, ఒక సంవత్సరానికి సంబంధించిన తొలి వినియోగపు చట్టంలో గానీ, లేదా అనుబంధ వ్యయప్రకటనకు సంబంధించిన వినియోగపు చట్టంలో గానీ కేటాయింపు లేని ఏదైనా ఒక అంశం మీద ఖర్చును భరించే నిమిత్తం కేటాయింపుల బదిలీ (రీ-అప్రోప్రియేషను) ఉత్తర్వులు ఇవ్వరాదు.

అయితే, విభజన అనంతరం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి కేటాయించే మొత్తాల కింద (గ్రాంటు సంఖ్య IX - ద్రవ్య పాలన) సెలవును నగదుగా మార్చుకునే (లీవు ఎన్‌క్యాష్‌మెంట్) ప్రయోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం (2022 ఆగస్టు నుంచి 2023 మార్చి వరకు) తొలి బడ్జెట్ అంచనాల ద్వారా గానీ లేదా అనుబంధ అంచనాల ద్వారా గానీ ఆమోదం లేకుండా కేటాయింపుల బదిలీ ఉత్తర్వుల ద్వారా ₹199 కోట్లను ఖర్చు చేసింది. ఇది బడ్జెటు నియమావళికి విరుద్ధం.

ఈ అంశంపై ఇటువంటి ఆమోదం లేని ఖర్చులను గతంలోని రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిటు నివేదికలలో కూడా ప్రస్తావించడం జరిగింది. అయితే, 2022-23 లో ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు.

ఇటువంటి సక్రమం కాని కేటాయింపుల బదిలీలలో ఇతర ముఖ్యమైన ఉదంతాలను *పేరా 3.4.6.1* లో చర్చించడం జరిగింది.

[17] 2022 జూన్ లో ₹167 కోట్లు, 2022 సెప్టెంబరులో ₹109 కోట్లు

3.4.1.5 తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థలో పెట్టుబడుల నిమిత్తం కేటాయింపులు చేయకపోవడం

ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రభుత్వ పెట్టుబడులు ఆ రంగానికి ఉత్తేజాన్ని ఇస్తాయి. ఇవి సాధారణంగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు. కనుక, గణనీయమైన స్థాయిలో పెట్టుబడులు పెట్టినప్పుడు బడ్జెటు అంచనాలలో కేటాయింపులు చేయడంతో పాటు బడ్జెటు ప్రసంగంలో ఆ మేరకు వెల్లడి చేయడం కూడా జరుగుతుంది.

అయితే, 2022-23 సంవత్సరంలో, తొలి బడ్జెటు అంచనాలలో ఆమోదం లేకుండా గ్రాంటు సంఖ్య XI - రోడ్లు, భవనాలు కింద రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థలో ₹122 కోట్లను పెట్టుబడిగా పెట్టింది (2022 జూన్, ఆగస్టు, సెప్టెంబరు). కానీ, అటు రోడ్లు, భవనాల శాఖ గానీ, ఇటు ఆర్థిక శాఖ గానీ అనుబంధ అంచనాల ద్వారా శాసన సభ నుంచి ఆమోదం పొందలేదు. ఆ విధంగా, ₹122 కోట్లు ఖర్చు ఆమోదం లేని ఖర్చు అయింది.

ఈ విధంగా, ఖర్చు జరిగి ఉందని తెలిసినా, ఆర్థిక శాఖ గానీ, ఇతర శాఖలు గానీ అనుబంధ అంచనాల ద్వారా ₹8,566 కోట్ల మేర శాసన సభ ఆమోదాన్ని పొందలేదు. ఫలితంగా, రాజ్యాంగంలోని 204 అధికరణకు విరుద్ధంగా ఆమోదం లేని ఖర్చు అయింది.

మొత్తం మీద చూస్తే, శాసన సభ ఆమోదం లేని ఖర్చు గత సంవత్సరం (₹1,383 కోట్ల) తో పోలిస్తే ఈ సంవత్సరం (₹8,985 కోట్లు) గణనీయంగా పెరిగింది. 'ఉదయ్ కింద డిస్కముల నష్టాలను తీసుకోవడం', 'మార్క్ ఫెడ్‌కు ఇచ్చిన ఋణాలు' ఇందుకు ప్రధాన కారణాలు.

బడ్జెటు కేటాయింపులకు శాసన సభ ఆమోదం లేకుండా పదేపదే ఖర్చు చేయడం శాసనసభ సాధికారతను తగ్గించినట్లవుతుంది. ఈ విధంగా ఆమోదం లేకుండా ఏటేటా ఖర్చులు చేయడం బడ్జెటు పరమైన, ఆర్థికపరమైన నియంత్రణల ఉల్లంఘనకే కాకుండా, ప్రజావనరుల నిర్వహణలో ఆర్థిక క్రమశిక్షణారాహిత్యానికి దారితీస్తుంది.

3.4.2 అధిక వ్యయాలు, వాటి క్రమబద్ధీకరణ

భారత రాజ్యాంగంలోని అధికరణ 204 (3) ప్రకారం, ఈ అధికరణలోని నిబంధనల అనుగుణంగా ఆమోదం పొందిన చట్టంలోని వినియోగానుమతుల మేరకు తప్ప రాష్ట్ర సంచిత నిధి నుంచి ధనాన్ని ఇతరత్రా తీసుకోరాదు. అంతే కాకుండా, ఒక ఆర్థిక సంవత్సరంలో ఏదైనా సేవ కోసం ఆమోదించిన మొత్తానికి మించి ఆ సంవత్సరం ఆ సేవ మీద ఖర్చయితే, రాజ్యంగంలోని అధికరణ 205(1)(బి) ప్రకారం అటువంటి అధికవ్యయానికి సంబంధించిన అధికారిక అభ్యర్థనలను రాష్ట్ర శాసన సభలో ప్రవేశపెట్టేలా గవర్నరు చర్యలు తీసుకోవాలి. కనుక, ఆర్థిక సంవత్సరంలో గ్రాంట్లు/ అప్రోప్రియేషన్లకు మించి అయిన అధిక వ్యయాలను రాష్ట్ర శాసనసభ ద్వారా క్రమబద్ధీకరణ పొందడం రాష్ట్ర ప్రభుత్వానికి తప్పనిసరి.

దైనందిన పాలనకు సంబంధించి నిధులను అందజేసే ద్రవ్యపాలన, హోం పాలన వంటి ప్రదానాల విషయంలో సాధారణంగా గత కొన్ని సంవత్సరాలుగా తరుచూ అధిక వ్యయాలు అవుతున్నాయి. మరోవైపు, అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలతో ముడివడిన పురపాలన - పట్టణాభివృద్ధి, భారీ, మధ్య తరహా నీటిపారుదల, గృహనిర్మాణం, సాంఘిక సంక్షేమం వంటి ప్రదానాల విషయంలో శాసనసభ ఆమోదించిన మేర ఖర్చులు కావడం లేదు. పరిపాలనకు సంబంధించిన గ్రాంట్ల బడ్జెటును తక్కువగా, సంక్షేమ, అభివృద్ధి గ్రాంట్ల బడ్జెటును ఎక్కువగా అంచనా వేసినట్లు ఇది సూచిస్తోంది.

3.4.2.1 ప్రస్తుత సంవత్సరంలో అధికవ్యయం

ఒక సంవత్సరంలో కేటాయించిన మొత్తానికి మించి అధికవ్యయం కావడం ఖర్చుకు శాసనసభ ఆమోదం పొందాలన్న నిబంధనకు విరుద్ధమే కాకుండా, పేలవమైన ప్రణాళికను, ఖర్చుల పురోగతి మీద సరైన అదుపు లేకపోవడాన్ని సూచిస్తుంది. *పట్టిక 3.8* లో చూపినట్లు 2022-23 లో మొత్తం మీద ₹20,264 కోట్ల మేర అధికవ్యయం ఉంది. 2021-22 తో పోలిస్తే 2022-23 లో మొత్తం బడ్జెటు కేటాయింపు 9 శాతం[18] పెరుగగా, ఖర్చులు 13 శాతం[19] పెరిగాయి.

ప్రదానాలు (అంటే, గ్రాంట్లు) / వినియోగానుమతుల (అంటే, అప్రోప్రియేషన్ల) స్థాయిలో చూస్తే, ఏడు గ్రాంట్లు, రెండు అప్రోప్రియేషన్ల[20] కింద అధిక వ్యయం అయింది. వీటి బడ్జెటు కేటాయింపులు ₹53,521 కోట్లు కాగా, ఖర్చు ₹159,086 కోట్లు (కేటాయింపుతో పోలిస్తే 297 శాతం). ఫలితంగా అయిన అధిక వ్యయం ₹1,05,565 కోట్లు (వివరాలు ***అనుబంధం 3.1*** లో ఉన్నాయి).

పెద్ద పద్దు స్థాయిలో విశ్లేషించగా, 17 పెద్ద పద్దులలో కేటాయింపు (₹55,793 కోట్లు) లను, ఖర్చు (₹1,62,199 కోట్లు) లను పోలిస్తే అధిక వ్యయం ₹1,06,406 కోట్లు అని వెల్లడైంది. రాష్ట్ర ప్రభుత్వ అంతర్గత ఋణం (₹82,650 కోట్లు) కాకుండా, పింఛనులు, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలు (₹14,105 కోట్లు), విద్యుతు (₹7,066 కోట్లు), పంటల పెంపకం కోసం ఋణాలు (₹1,107 కోట్లు), వడ్డీ చెల్లింపులు (₹1,059 కోట్లు), కేంద్ర ప్రభుత్వం నుంచి ఋణాలు, అడ్వాన్సులు (₹148 కోట్లు), రోడ్డు రవాణా కింద మూలధన పరివ్యయం (₹122 కోట్లు) వంటి పెద్ద పద్దులలో అధిక వ్యయాలు అయ్యాయి.

పథకం/ఉప పద్దు దృష్ట్యా చూస్తే, ఈ కింది అంశాలను గమనించడమైంది:

- ఇంతకు ముందు పేరాలలో పేర్కొన్నట్లు, 2022-23 సంవత్సరంలో అధిక వ్యయానికి ముఖ్య కారణం గ్రాంటు సంఖ్య IX - ద్రవ్య పాలన (ఋణాలు చార్జ్‌డ్) కింద 'చేబదుళ్ల తిరిగి చెల్లింపు' (₹82,723 కోట్లు). ఈ అంశం కోసం చేసిన తొలి కేటాయింపు ₹100 కోట్లు మాత్రమే కాగా, అనుబంధ కేటాయింపులు ఏమీ లేవు. వాస్తవంగా అయిన ఖర్చు ₹82,823 కోట్లు.
- ఇంతకు ముందు ***పేరా 3.2.2.6*** లో పేర్కొన్నట్లు పింఛనుల చెల్లింపు బాధ్యతలను బడ్జెటులో తరుచూ తక్కువగా అంచనా వేయడంతో పాటు, గ్రాంటు సంఖ్య IX - ద్రవ్య పాలనలోని ప్రస్తుత సంవత్సరంలో పింఛనులకు సంబంధించిన ఈ కింది ఉప పద్దులలో బడ్జెటు కేటాయింపులకు మించి (ఒక్కొక్క ఉదంతంలోనూ ₹1,000 కోట్లు, లేదా అంత కన్నా మించి) అధిక వ్యయాలు కూడా ఉన్నాయి.

పట్టిక 3.12: 2022-23 సంవత్సరంలో గ్రాంటు సంఖ్య IX - ద్రవ్యపాలన కింద అధిక వ్యయానికి కారణమైన ముఖ్యాంశాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	పథకం / ఉప పద్దు వివరాలు	బడ్జెటు	ఖర్చు	అధిక వ్యయం
1	విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య 58.32:41.68 నిష్పత్తిలో కేటాయించే విభజనకు ముందున్న సేవా పింఛన్లు	4,595	7,579	2,984
2	విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య 58.32:41.68 నిష్పత్తిలో కేటాయించే విభజనకు ముందున్న కుటుంబ పింఛన్లు	2,000	3,392	1,392

మూలం: వినియోగ పద్దులు

[18] 2021-22 లో ₹2,55,016 కోట్లు కాగా, 2022-23 లో ₹2,77,525 కోట్లు

[19] 2021-22 లో ₹2,63,092 కోట్లు కాగా, 2022-23 లో ₹2,97,789 కోట్లు

[20] నిత్య వ్యావహారిక వ్యయం (అంటే, రెవెన్యూ ఖర్చు) కింద నాలుగు గ్రాంట్లు, మూలధనవ్యయం (అంటే, క్యాపిటల్ ఖర్చు) కింద రెండు గ్రాంట్లు, ఋణాలు కింద ఒక గ్రాంటు, రెవెన్యూ కింద ఒక వినియోగానుమతి, ప్రజా ఋణం కింద ఒక వినియోగానుమతి

మొదటి అంశానికి సంబంధించి గత మూడేళ్ళలోనూ అధిక వ్యయం జరుగగా, రెండో అంశం విషయంలో మాత్రం ప్రస్తుత సంవత్సరంలోనే అధికవ్యయం జరిగింది.

ఇతర గ్రాంట్ల విషయానికి వస్తే, 2022-23 సంవత్సరంలో కింది పథకాలు / ఉప పద్దుల్లో గణనీయమైన స్థాయిలో (ఒక్కొక్క ఉదంతంలోనూ ₹500 కోట్లకు మించి) అధిక వ్యయం జరిగింది:

పట్టిక 3.13: ద్రవ్యపాలన కాకుండా ఇతర గ్రాంట్లలో గణనీయంగా అధిక వ్యయం అయిన అంశాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	గ్రాంటు సంఖ్య	గ్రాంటు పేరు	పథకం / ఉప పద్దు	మొత్తం
1	XII (రెవెన్యూ ఓటెడ్)	పాఠశాల విద్య	జిల్లా ప్రజా పరిషత్తులకు బోధన గ్రాంట్లు	569
2	XII (రెవెన్యూ ఓటెడ్)	పాఠశాల విద్య	మండల ప్రజా పరిషత్తులకు బోధన గ్రాంట్లు	548

మూలం: వినియోగ పద్దులు

పై అధిక వ్యయాలకు నిర్దిష్ట కారణాలేవీ తెలియపర్చలేదు.

3.4.2.2 క్రమబద్ధీకరణ జరగాల్సిన అధికవ్యయం

భారత రాజ్యాంగంలోని అధికరణ 205 ప్రకారం, ఒక ప్రదానం (అంటే, గ్రాంటు) / వినియోగానుమతి (అంటే, అప్రోప్రియేషన్) కి మించి అయిన అధిక వ్యయాన్ని రాష్ట్ర శాసనసభ ద్వారా క్రమబద్ధీకరణ పొందటం రాష్ట్ర ప్రభుత్వానికి తప్పనిసరి. ప్రజా పద్దుల కమిటీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ - పి.ఎ.సి.) చర్చించిన తర్వాత అధికవ్యయాన్ని క్రమబద్ధీకరించాల్సి ఉంటుంది. ఇందుకోసం, సంబంధిత శాఖలు అధిక వ్యయాలపై వివరాణత్మక నివేదికలను ఆర్థికశాఖ ద్వారా ప్రజా పద్దుల కమిటీకి సమర్పించాల్సి ఉంటుంది.

2014-15 నుంచి 2021-22 వరకు కేటాయింపులకు మించి చేసిన ₹2,89,115 కోట్ల అధిక వ్యయానికి రాష్ట్ర శాసన సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా క్రమబద్ధీకరణ పొందలేదు (సంవత్సరాల వారీగ సంక్షిప్త వివరాలను ***అనుబంధం 3.2 (ఎ)*** లో, సంవత్సరాల వారీగానూ, ప్రదానాల వారీగానూ వివరాలను ***అనుబంధం 3.2 (బి)*** లో ఇవ్వడం జరిగింది).

శాసన సభ ప్రజాపద్దుల కమిటీలో చర్చించిన తర్వాత అధిక వ్యయాన్ని క్రమబద్ధీకరించాలి. ప్రజాపద్దుల కమిటీ ఆరుసార్లు[21] సమావేశమై రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిటు నివేదికలలోని 14 పేరాల[22] మీద చర్చించింది. అయితే, శాసనసభ ఆమోదానికి మించి జరిగిన అధిక వ్యయాన్ని క్రమబద్ధీకరించే అంశం ఇంకా చేపట్టడం జరుగలేదు.

రాష్ట్ర శాసనసభ ఆమోదించిన ప్రదానాలకు / వినియోగానుమతులకు మించి తరుచూ అధికవ్యయం కావడం రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా ఇచ్చిన వినియోగనుమతుల ప్రకారం తప్ప రాష్ట్ర సంచిత నిధి నుంచి ధనాన్ని ఇతరత్రా తీసుకోరాదని నిర్దేశించే రాజ్యాంగంలోని 204, 205 అధికరణలకు విరుద్ధం. ఇది బడ్జెటుపరమైన, ఆర్థికపరమైన నియంత్రణలను బలహీనపరచడమే కాకుండా, ప్రజావనరుల నిర్వహణలో ఆర్థిక క్రమశిక్షణారాహిత్యాన్ని ప్రోత్సహిస్తుంది.

3.4.3 ఖర్చు కాని మొత్తాలు / తగ్గిన ఖర్చులు

2022-23 సంవత్సరంలో కేటాయింపుతో పోల్చితే, తగ్గిన ఖర్చుల మొత్తం ₹85,301 కోట్లు[23]. ఇందులో ₹75,038 కోట్లు (అంటే 88 శాతం) ***అనుబంధం 3.3*** లో చూపినట్లు ప్రతి గ్రాంటులో ₹1,000 కోట్లకు మించి ఖర్చు తగ్గిన 17 గ్రాంట్లకు చెందిన 23 విభాగాలలోనివి.

[21] 2018 మే, 2021 ఆగస్టు (రెండు సార్లు), 2022 ఫిబ్రవరి, 2022 మార్చి, 2022 డిసెంబరు

[22] పేరాలు: 2014-15 (2.5.3, 3.2.1, 3.2.2); 2015-16 (3.2.2, 3.2.3); 2017-18 (3.6); 2018-19 (3.4, 3.5), 2019-20 (3.5.2.1), 2020-21 (3.5.2.2., 4.6, 4.6.1, 4.7, 4.7.1)

[23] 70 గ్రాంటు విభాగాలలో ₹85,210 కోట్లు, 13 అప్రోప్రియేషను విభాగాల్లో ₹91 కోట్లు

గ్రాంటు విభాగం స్థాయిలో విశ్లేషిస్తే, సాంఘిక సంక్షేమం (రెవెన్యూ ఓటెడ్ - ₹19,782 కోట్లు), రోడ్లు, భవనాలు (రెవెన్యూ ఓటెడ్ - ₹8,937 కోట్లు), వ్యవసాయం (రెవెన్యూ ఓటెడ్ - ₹5,389 కోట్లు) లలో శాసనసభ ఆమోదించిన కేటాయింపు మొత్తాలతో పోలిస్తే ₹5,000 కోట్లకు మించి ఖర్చు తగ్గింది.

3.4.3.1 తొలి కేటాయింపు మొత్తంగా వినియోగం కాకపోవడం

3 గ్రాంట్ల కింద 4 సెక్షన్లు[24] విషయంలో తొలి కేటాయింపు మొత్తం ₹2.22 కోట్లు వినియోగం కాకుండా ఉండిపోయాయి.

ఉప పద్దు / పథకం స్థాయిలో చూస్తే, 20 ప్రదానాలు / వినియోగానుమతులలోని 112 ఉదంతాలలో ₹22,636 కోట్ల మేర తొలి కేటాయింపు మొత్తం వినియోగం కాలేదు. ముఖ్యమైన కొన్ని అంశాలను ఈ కింద చూపడం జరిగింది:

పట్టిక 3.14: కేటాయింపు మొత్తం వినియోగం కాని ఉదంతాల్లో ముఖ్యమైన అంశాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	గ్రాంటు సంఖ్య	గ్రాంటు లేదా ప్రదానం పేరు	పథకం / ఉప పద్దు	బడ్జెటు కేటాయింపు
1	XI	రోడ్లు, భవనాలు	బి.ఎల్.సి. కింద గ్రామీణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం	3,900
2	XI	రోడ్లు, భవనాలు	బి.ఎల్.సి. కింద పట్టణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం	3,450
3	XXI	సాంఘిక సంక్షేమం	గ్రామీణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం	1,200
4	XXVIII	పశు సంవర్థక, మత్స్య పరిశ్రమ	గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య సహాయం	1,000
5	XXVII, XXI, XXII	వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం	పామ్ ఆయిల్ పెంపకం	1,000
6	XXII	గిరిజన సంక్షేమం	గ్రామీణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం	900
7	XXII	గిరిజన సంక్షేమం	పట్టణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం	800
8	XXI	సాంఘిక సంక్షేమం	పట్టణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం	750
9	XXXVII	పర్యటన, కళలు, సంస్కృతి	కాళేశ్వరం పర్యాటకం సర్క్యూట్	750
10	XI	రోడ్లు, భవనాలు	ప్రాంతీయ వలయ రహదారి	500
11	XVII	పురపాలన, పట్టణాభివృద్ధి	పాతబస్తీకి మెట్రోను కలిపే సౌకర్యం	500
12	XVII, XXI, XXII	పురపాలన - పట్టణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం	విమానాశ్రయానికి మెట్రోను కలిపే సౌకర్యం	500

మూలం: వినియోగ పద్దులు

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం అనే ప్రధాన అంశానికి వివిధ గ్రాంట్లు మరియు ఉప పద్దుల కింద చేసిన కేటాయింపు మొత్తాన్ని అసలు ఉపయోగించనే లేదు.

[24] (i) గ్రాంటు సంఖ్య VII - వాణిజ్య పన్నుల పాలన (క్యాపిటల్ ఓటెడ్): ₹1 కోటి, (ii) గ్రాంటు సంఖ్య XXXI - పంచాయతీ రాజ్ (క్యాపిటల్ చార్జ్డ్): ₹1.05 కోటి, (iii) గ్రాంటు సంఖ్య XXXVI - పరిశ్రమలు, వాణిజ్యం (రెవెన్యూ చార్జ్డ్): ₹0.10 కోటి, (iv) గ్రాంటు సంఖ్య XXXVI - పరిశ్రమలు, వాణిజ్యం (క్యాపిటల్ చార్జ్డ్): ₹0.06 కోటి

పేటిక 3.1: హైదరాబాదు పట్టణ సముదాయ పథకం మీద ఖర్చు శూన్యం

హైదరాబాదు పట్టణ సముదాయ పథకం గత మూడు సంవత్సరాలుగా ఏ మాత్రం ఖర్చు కాని ఒక అంశం. ఈ పథకం 2020-21 లో ప్రారంభం అయింది. ఒక అంతర్జాతీయ నగరంగా రూపాంతరం చెందుతున్న రాజధాని నగరంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు రానున్న ఐదు సంవత్సరాలలో (అంటే, 2020-21 నుంచి మొదలుకుని) ₹50,000 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ నేపథ్యంలోనే 2020-21 సంవత్సరం బడ్జెటులో మూసీ ప్రక్షాళన కోసం, మూసీ నది పరీవాహక ప్రాంత పథకం, ఇంకా ఇతర అన్ని పథకాల కోసం, హైదరాబాదు పట్టణ సముదాయ ప్రాంతలోని పనుల కోసం ₹10,000 కోట్లను ప్రతిపాదించడం జరిగింది. అయితే, కేటాయింపు మొత్తం ₹10,000 కోట్లు 2020-21 సంవత్సరంలో వినియోగం కానేలేదు.

ఆ తరువాతి సంవత్సరం 2021-22 లో, హైదరాబాదు పట్టణ సముదాయ పథకం బడ్జెటును ₹2,600 కోట్లకు గణనీయంగా తగ్గించడం జరిగింది. అయినా, మళ్లీ మొత్తం కేటాయింపు ఆ సంవత్సరం కూడ ఖర్చు కానేలేదు.

ప్రస్తుత సంవత్సరం 2022-23 లో బడ్జెటును మరింత గణనీయంగా ₹200 కోట్లకు తగ్గించడం జరిగింది. ఈ విధంగా తగ్గించిన మొత్తం కూడా వినియోగం కాలేదు.

3.4.3.2 కేటాయింపు వినియోగం కాని ముఖ్యమైన అంశాలు

ఈ కింది పథకాల విషయంలో (అంటే, ఉప పద్దు స్థాయిలో) ₹2,000 కోట్లకు మించిన మొత్తాలు ఖర్చు కాలేదు.

పట్టిక 3.15: కేటాయింపులో ఖర్చు కాని ముఖ్యమైన అంశాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	గ్రాంట్ల సంఖ్యలు	గ్రాంట్ల పేర్లు	పథకం / ఉప పద్దు	బడ్జెటు కేటాయింపు	ఖర్చు	తగ్గిన ఖర్చు
1	XXI (ఋణాలు ఓటెడ్)	సాంఘిక సంక్షేమం	తెలంగాణ దళిత బంధు	17,700	2,000	15,700
2	XXI, XXII, XXVII (అన్నీ రెవెన్యూ ఓటెడ్)	సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, వ్యవసాయం	రైతులకు ఋణ మాఫీ పథకం	4,000	36	3,964
3	XXXI (ఋణాలు ఓటెడ్)	పంచాయతీ రాజ్	టి.డి.డబ్ల్యూ.ఎస్.సి.ఎల్.కు ఋణాలు[25]	4,589	1,274	3,315

మూలం: వినియోగ పద్దులు

నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు[26] (మూలధన విభాగం, ఇచ్చిన ఋణాల విభాగాలలో), క్యాపిటల్ విభాగంలో జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం[27], శ్రీపాదసాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు[28], సీతారామ ఎత్తిపోతల పథకం[29] లో కేటాయింపుతో పోలిస్తే ఖర్చు బాగా తగ్గింది.

3.4.4 తరుచూ ఏర్పడుతున్న ధోరణులు

ఇంతకు ముందు పేరాలలో పేర్కొన్నట్లు, ద్రవ్యపాలన (రెవెన్యూ ఓటెడ్), హోం పాలన (రెవెన్యూ ఓటెడ్) వంటి దైనందిన పాలనకు సంబంధించి నిధులను అందజేసే ప్రదానాల (గ్రాంట్ల) విషయంలో గత ఐదేళ్లుగా అధిక వ్యయాలు

[25] తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పోరేషన్ లిమిటెడ్

[26] క్యాపిటల్ వోటెడ్ విభాగంలో బడ్జెటు కేటాయింపు:₹2,638 కోట్లు, ఖర్చు:₹2,202 కోట్లు, కేటాయింపుతో పోలిస్తే తగ్గిన ఖర్చు:₹436 కోట్లు, ఇచ్చిన ఋణాల వోటెడ్ విభాగంలో బడ్జెటు కేటాయింపు:₹9,240 కోట్లు, ఖర్చు:₹8,902 కోట్లు, కేటాయింపుతో పోలిస్తే తగ్గిన ఖర్చు:₹338 కోట్లు

[27] బడ్జెటు కేటాయింపు: ₹515 కోట్లు, ఖర్చు: ₹34 కోట్లు, కేటాయింపుతో పోలిస్తే తగ్గిన ఖర్చు: ₹481 కోట్లు

[28] బడ్జెటు కేటాయింపు: ₹398 కోట్లు, ఖర్చు: ₹72 కోట్లు, కేటాయింపుతో పోలిస్తే తగ్గిన ఖర్చు: ₹326 కోట్లు

[29] బడ్జెటు కేటాయింపు: ₹998 కోట్లు, ఖర్చు: ₹775 కోట్లు, కేటాయింపుతో పోలిస్తే తగ్గిన ఖర్చు: ₹223 కోట్లు

ఏర్పడుతున్నాయి. మరోవైపు, అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలకు సంబంధించిన పురపాలన - పట్టణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం వంటి ప్రదానాల (గ్రాంట్లు) విషయంలో శాసనసభ అనుమతించిన మేర ఖర్చు కావడంలేదు. **అంటే, పాలనపరమైన ప్రదానాల విషయంలో బడ్జెటును తక్కువగానూ, అభివృద్ధి, సంక్షేమాలకు చెందిన ప్రదానాల విషయంలో బడ్జెటును ఎక్కువగానూ అంచనావేశారని ఇది సూచిస్తోంది.** తరుచూ ఏర్పడుతున్న అధిక వ్యయాలు, బడ్జెటు కేటాయింపులతో పోలిస్తే తరుచూ తక్కువగా అవుతున్న ఖర్చులను ఈ కింది పేరాలలో చర్చించడం జరిగింది:

3.4.4.1 తరుచూ అవుతున్న అధిక వ్యయాలు

కొన్ని ప్రదానాలలో తరుచూ అధిక వ్యయాలు ఏర్పడుతుండడం ఆయా శాఖలలో బడ్జెటరీ పర్యవేక్షణ, నియంత్రణలు ప్రభావవంతంగా లేవని, మరియు/లేదా బడ్జెటు అంచనాల తయారీ వాస్తవికంగా జరుగ లేదని సూచిస్తోంది.

గత ఐదు సంవత్సరాలుగా గ్రాంటు సంఖ్య IX - ద్రవ్యపాలన (రెవెన్యూ ఓటెడ్) గ్రాంటులో అధికవ్యయాలు అయ్యాయి.

పట్టిక 3.16: గత ఐదు సంవత్సరాలుగా గ్రాంటు సంఖ్య IX - ద్రవ్య పాలన కింద అధిక వ్యయాలు

(₹ కోట్లలో)

వివరాలు	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
గ్రాంటు కేటాయింపు	12,881	10,741	10,451	19,377	12,479
వాస్తవ వ్యయం	16,871	19,059	19,574	24,593	25,958
అధికవ్యయం	3,990	8,318	9,123	5,216	13,479

మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

గత ఐదేళ్లుగా (2021-22 మినహా) ద్రవ్యపాలన గ్రాంటులో అధికవ్యయం పరిమాణం పెరుగుతోంది. 2021-22 తో పోలిస్తే ప్రస్తుత సంవత్సరంలో 158 శాతం పెరిగింది.

గ్రాంట్ IX - ద్రవ్య పాలన (రెవెన్యూ ఓటెడ్) కింద గత ఐదేళ్లుగా అధిక వ్యయం అయిన ముఖ్యమైన అంశాలు: విభజన అనంతరం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి కేటాయించే సేవా పింఛన్లు (మొత్తం అధిక వ్యయం ₹18,538 కోట్లు), విభజన అనంతరం ఏర్పడిన రాష్ట్రాల మధ్య విభజనానంతరం కేటాయించే సేవా పింఛన్లు (మొత్తం అధిక వ్యయం ₹8,195 కోట్లు), విభజన అనంతరం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి కేటాయించే కుటుంబ పింఛన్లు (మొత్తం అధిక వ్యయం ₹6,333 కోట్లు). పైన పేర్కొన్నట్లు, తప్పనిసరిగా పెట్టాల్సిన ఖర్చులను తక్కువగా అంచనా వేయడం వల్ల ఈ విధంగా అధిక వ్యయం అయింది.

అంతే కాకుండా, గ్రాంటు సంఖ్య XXXV - ఇంధనం కింద 2021-22 లో ₹292 కోట్ల అధిక వ్యయం, 2022-23 లో ₹7,055 కోట్ల అధిక వ్యయం అయ్యింది. ఈ అధికవ్యయానికి 2022-23 లో ప్రధాన కారణం 'ఉదయ్ కింద డిస్కమ్‌ల నష్టాలను తీసుకోవడం' (₹7,061 కోట్లు) కాగా, 2021-22 లో అధిక వ్యయానికి ప్రధాన కారణం 'వ్యవసాయ, అనబంధ రాయితీల కోసం తెలంగాణ ప్రసార సంస్థ (ట్రాన్స్‌మిషన్ కార్పోరేషన్) కు సహాయం' (₹396 కోట్లు).

2015-16 నుంచి 2020-21 వరకు వరుసగా అధిక వ్యయం నమోదు అయిన గ్రాంటు సంఖ్య X - ఆంతరంగిక (హోం) పాలనలో గత రెండు సంవత్సరాలుగా అధిక వ్యయం నమోదు కాలేదు.

3.4.4.2 కేటాయింపుతో పోలిస్తే తరుచూ ఖర్చు తగ్గిన అంశాలు

ఈ కింది పట్టికలో చూపిన విధంగా, 2018-19 నుంచి 2022-23 మధ్య సంవత్సరాల్లో ప్రతి సంవత్సరమూ కేటాయింపులతో పోలిస్తే ₹1,000 కోట్లకు పైగా ఖర్చు తగ్గిన నాలుగు గ్రాంట్లు ఉన్నాయి:

పట్టిక 3.17: 2018-19 నుంచి 2022-23 సంవత్సరాల మధ్య కాలంలో రెవెన్యూ ఓటెడ్ విభాగం కింద ₹1,000 కోట్లకు పైగా కేటాయింపుతో పోలిస్తే ఏటేటా ఖర్చు తగ్గిన గ్రాంట్లు

క్రమ సంఖ్య	గ్రాంటు సంఖ్య	గ్రాంటు పేరు	కేటాయింపుతో పోలిస్తే తగ్గిన ఖర్చు, కోట్ల రూపాయలలో *(శాతం)*				
			2018-19	2019-20	2020-21	2021-22	2022-23
1.	XXI	సాంఘిక సంక్షేమం (రెవెన్యూ ఓటెడ్)	4,539*(38)*	1,810*(17)*	6,124*(40)*	3,577*(20)*	19,782*(63)*
2.	XXVII	వ్యవసాయం (రెవెన్యూ ఓటెడ్)	4,178*(31)*	4,347*(28)*	4,684*(25)*	4,401*(23)*	5,389*(28)*
3.	XVII	పురపాలన, పట్టణాభివృద్ధి (రెవెన్యూ ఓటెడ్)	4,035*(67)*	1,092*(36)*	1,949*(33)*	5,156*(60)*	3,106*(38)*
4.	XXII	గిరిజన సంక్షేమం (రెవెన్యూ ఓటెడ్)	2,159*(32)*	1,065*(16)*	3,416*(36)*	2,094*(21)*	3,823*(35)*

మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

- 'రెండు పడక గదుల ఇళ్లు', 'పెట్టుబడి మద్దతు పథకం (రైతు బంధు)', 'ఆర్థిక మద్దతు పథకాలు, ఎల్.పి.ఎస్.', 'రైతులకు ఋణ మాఫీ పథకం', 'పరిశ్రమల ప్రోత్సాహించడం కోసం ప్రోత్సహకాలు', 'పట్టణ, గ్రామీణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం' వంటి పథకాలతో కూడిన సాంఘిక సంక్షేమం (రెవెన్యూ ఓటెడ్) లో 2020-21 నుంచి కేటాయింపుతో పోలిస్తే ఖర్చు గణనీయంగా తక్కువగా ఉంది. ఇంతకు ముందు పేర్కొన్నట్లుగా, ప్రస్తుత సంవత్సరంలో కేటాయింపుతో పోలిస్తే ఖర్చు బాగా తక్కువ కావడానికి కారణం తెలంగాణ 'దళిత బంధు పథకం' కింద ₹15,700 కోట్లు మేర కేటాయింపు ఖర్చు కాకుండా ఉండడమే.

- ఇటీవలి సంవత్సరాలలో అధిక ప్రాథమ్యాన్ని అందుకుంటున్న వ్యవసాయం (రెవెన్యూ ఓటెడ్) లో గత ఐదు సంవత్సరాలుగా ప్రతి ఏటా కేటాయించిన మొత్తాలతో పోలిస్తే ₹4,000 కోట్లకు పైగా ఖర్చు కాకుండా ఉండిపోతున్నాయి. ఇందుకు ముఖ్య కారణం కేటాయింపులతో పోలిస్తే గత మూడేళ్లుగా 'రైతులకు ఋణ మాఫీ పథకం' విషయంలోనూ, 2018-19 సంవత్సరంలో 'పెట్టుబడి మద్దతు పథకం (రైతు బంధు)' విషయంలో, 2020-21, 2021-22 సంవత్సరాలలో 'మార్కెటు ప్రమేయ నిధి' విషయంలో, 2022-23 సంవత్సరంలో 'వ్యవసాయ యాంత్రీకరణ', 'పామ్ ఆయిల్ పెంపకం' విషయంలో ఖర్చు తగ్గడమే.

- పురపాలన, పట్టణాభివృద్ధి (రెవెన్యూ ఓటెడ్) విషయంలో ముఖ్యంగా 'స్మార్ట్ నగరాలు', 'అమృత్', 'రాష్ట్ర ఆర్థిక సంఘం కింద పురపాలికలకు సహాయం' వంటి వాటి విషయంలో కేటాయింపులతో పోలిస్తే ఖర్చు తగ్గింది.

- అదే విధంగా, సాంఘిక సంక్షేమం ప్రదానం విషయంలో మాదిరిగానే, గిరిజన సంక్షేమం (రెవెన్యూ ఓటెడ్) లో కూడా 2020-21 నుంచి 'రెండు పడక గదుల ఇళ్లు', 'రైతులకు ఋణ మాఫీ పథకం', 'పట్టణ, గ్రామీణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం', 'ఆసరా పింఛన్లు' వంటి వాటి విషయంలో కేటాయింపులతో పోలిస్తే ఖర్చు గణనీయంగా తగ్గింది.

శాతాలవారీగా చూస్తే, ఈ కింది పట్టికలో చూపిన ప్రదానాలలో కేటాయింపులతో పోలిస్తే తరుచూ ఖర్చు తక్కువగా ఉంటోంది.

పట్టిక 3.18: ఐదు సంవత్సరాల (2018-19 నుంచి 2022-23) మధ్యకాలంలో కనీసం మూడు సంవత్సరాల పాటు కేటాయింపులతో పోలిస్తే ఖర్చు 50 శాతం లేదా అంతకన్నా తక్కువగా ఉన్న ప్రదానాలు / వినియోగానుమతులు

క్రమ సంఖ్య	గ్రాంటు సంఖ్య	గ్రాంటు / అప్రోప్రియేషను పేరు	వినియోగం శాతం				
			2018-19	2019-20	2020-21	2021-22	2022-23
1.	XI	రోడ్లు, భవనాలు (గృహనిర్మాణంతో సహా)	50	102	**39**	**38**	**33**
2.	XXXVI	పరిశ్రమలు, వాణిజ్యం	**28**	77	**38**	**36**	**42**
3.	XXXVII	పర్యటన, కళలు, సంస్కృతి	62	78	**27**	**21**	**13**

మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

గమనిక: 50 శాతం కన్నా తక్కువగా వినియోగం ఉన్న అంశాలు ఎరుపు రంగులో ముద్ద అక్షరాల్లో సూచించడమైంది

- గత మూడేళ్ళలో ఈ మూడు ప్రదానాలలో కేటాయింపు వినియోగం 50 శాతం కంటే తక్కువగా ఉంది. దీని బట్టి వీటికి ప్రాధామ్యం తక్కువని తెలుస్తోంది.
- ముఖ్యంగా, రోడ్లు, భవనాలు (ప్రస్తుత సంవత్సరం 2022-23 లో రోడ్లు, భవనాలలో విలీనం అయిన గృహనిర్మాణంతో సహా) కింద 'గ్రామీణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం', 'పట్టణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం', 'ప్రధాన మంత్రి ఆవాస యోజన (గ్రామీణ) ', 'ప్రధాన మంత్రి ఆవాస యోజన (పట్టణ)' పథకాలకు కేటాయించిన మొత్తాలలో వినియోగం శాతం గణనీయంగా తక్కువగా ఉంది.
- పరిశ్రమలు, వాణిజ్యం కింద ముఖ్యంగా 'పరిశ్రమల ప్రోత్సాహించడం కోసం ప్రోత్సహాకాలు'లో ఖర్చు కాని కేటాయింపులు ఉన్నాయి.

3.4.5 అనుబంధ ప్రదానాలు

రాజ్యాంగంలోని అధికరణ 205 ప్రకారం, (i) కొత్త ఖర్చులున్న పథకాల మీద ప్రస్తుత సంవత్సరంలో ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు, (ii) తగినంత కేటాయింపు లేనప్పుడు, (iii) సాంకేతికంగా "కొత్త ఖర్చులున్న పథకాలు" కాకపోయినా తాజా ఖర్చులు చేయాల్సినప్పుడు, (iv) పొరపాటున కేటాయింపు చేయకపోయినప్పుడు, వాటికి ప్రస్తుత సంవత్సరంలోనే ఖర్చు చేయాల్సి వస్తే, ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత కాకుండా, సదరు సంవత్సరంలోనే వినియోగ చట్టంలో చేసిన కేటాయింపునకు మించి అప్రోప్రియేషను గానీ, అదనపు ప్రదానం గానీ, అనుబంధ ప్రదానం (అంటే, సప్లిమెంటరీ గ్రాంటు) గానీ చేయవచ్చు. అటువంటి అదనపు వ్యయాన్ని చేయక తప్పని పరిస్థితి ఎదురైనప్పుడు, సదరు అధిక వ్యయానికి కేటాయింపుల బదిలీ (రీ-అప్రోప్రియేషన్ల) ద్వారా అదే గ్రాంటులో మిగులును సాధించలేనప్పుడు, సంబంధిత శాఖ కార్యదర్శి అదనపు లేదా అనుబంధ (గ్రాంటు) ప్రదానం లేదా వినియోగానుమతి (అప్రోప్రియేషను) కోసం ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపడం జరుగుతుంది.

అనుబంధ అంచనాల కింద 2022-23 సంవత్సరంలో ₹20,504 కోట్ల మొత్తాన్ని కేటాయించడం (2023 ఫిబ్రవరి) జరిగింది.

3.4.5.1 అనుబంధ కేటాయింపులను మొత్తంగా వినియోగించకపోవడం

తొలి కేటాయింపులకు అదనంగానూ, దాదాపు సంవత్సరం చివరిలో అనుబంధ కేటాయింపులు చేసినందున అవి వినియోగం కాకుండా ఉండరాదు. అయితే, 14 ప్రదానాలకు సంబంధించిన 20 విభాగాల్లో, ₹465 కోట్ల మేర శాసనసభ ఆమోదం తెల్పిన అనుబంధ కేటాయింపులు మొత్తం ఖర్చు కాకుండా ఉండిపోయాయి. అంతే కాకుండా, ఉప పద్దుల కోణంలో చూస్తే 18 ప్రదానాలలో 36 ఉప పద్దుల (పథకాలను సూచించేవి) విషయంలో ₹626 కోట్ల మేర శాసనసభ ఆమోదం తెల్పిన అనుబంధ కేటాయింపులు మొత్తం ఖర్చు కాకుండా ఉండిపోయాయి. వీటిని ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఉపసంహరించుకోవడం జరిగింది. ఏ ప్రయోజనాల కోసం అనుబంధ కేటాయింపులు చేశారో వాటిని ఈ సంవత్సరం అమలు చేయలేదని దీన్ని బట్టి తెలుస్తోంది. ఈ కిందివి ముఖ్యమైన అంశాలు.

- కె.డి.డబ్ల్యూ.ఎస్.పి. కింద సుంకిశాల ఇన్‌టేక్ ప్రాజెక్టు కోసం హైదరాబాదు మహానగర నీటి సరఫరా, మురుగపారుదల బోర్డుకు ఋణాలు (₹200 కోట్లు);
- అంతర్గత ఋణాల కింద తెలంగాణ ట్రాన్స్‌కో బాండ్ల నుంచి ఋణాలు (₹144 కోట్లు);
- ఏ.ఐ.బి.పి. ప్రాజెక్టు కింద కేంద్ర ప్రతిపాదిత పథకమైన జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకానికి రాష్ట్రం ఇచ్చే దామాషా వాటా (₹132 కోట్లు);
- సిద్ధిపేట వద్ద కొత్త పశువైద్య కళాశాలకు మౌలిక సదుపాయలు, ఇతరాలను సమకూర్చడం (₹69 కోట్లు).

3.4.5.2 తొలి, అనుబంధ కేటాయింపులను మొత్తంగా వినియోగించకపోవడం

తొలి కేటాయింపులకు అదనంగా కేటాయింపులు చేసిన 12 ప్రదానాలు లేదా వినియోగానుమతులలోని 29 ఉదంతాలలో సంవత్సరం చివరి వరకు ₹700 కోట్ల మేర మొత్తం కేటాయింపులు ఖర్చు కాకుండా ఉండి పోయాయి. ఈ కిందివి ముఖ్యమైన అంశాలు:

- ఎస్.ఇ.ఆర్.పి. కి సహాయం (తొలి కేటాయింపు: ₹177 కోట్లు, అనుబంధ కేటాయింపు: ₹20 కోట్లు, మొత్తం కేటాయింపు: ₹197 కోట్లు);
- ప్రధాన మంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్ (పి.ఎం. పోషణ్ - వంట ఖర్చు) కింద వివిధ ఉప పద్దులు (తొలి కేటాయింపు: ₹91 కోట్లు, అనుబంధ కేటాయింపు: ₹36 కోట్లు, మొత్తం కేటాయింపు: ₹127 కోట్లు);
- హైదరాబాదు నగరంలో మహిళల భద్రత కోసం భద్రమైన నగరం పథకం (నిర్భయ నిధి) (తొలి కేటాయింపు: ₹1 కోటి, అనుబంధ కేటాయింపు: ₹89 కోట్లు, మొత్తం కేటాయింపు: ₹90 కోట్లు);
- గురుకుల పాఠశాలల నిర్వహణ, మరమ్మతులు (తొలి కేటాయింపు: ₹10 కోట్లు, అనుబంధ కేటాయింపు: ₹34 కోట్లు, మొత్తం కేటాయింపు: ₹44 కోట్లు);

తొలి కేటాయింపులు సైతం వినియోగం కాకున్నా అనుబంధ కేటాయింపులను పొందేందుకు కారణాలను తెలియ జేయలేదు.

3.4.5.3 అవసరం లేని / అధికమైన / తగినంతగా లేని అనుబంధ కేటాయింపులు

తొలి కేటాయింపులతో పోలిస్తేనే ఖర్చు తక్కువగా ఉండి, 2023 ఫిబ్రవరిలో అనవసరంగా అనుబంధ కేటాయింపులు పొందిన పలు ప్రదానాలు / వినియోగానుమతులు ఉన్నాయి. ఇటువంటి అనుబంధ కేటాయింపులను అవసరమైన చోట్ల నామమాత్రానికి పరిమితం చేసి ఉండవచ్చు. అదే విధంగా, తుదకు అధిక వ్యయం లేదా కేటాయింపుతో పోలిస్తే ఖర్చు తక్కువ అయిన నేపథ్యంలో పొందిన అనుబంధ కేటాయింపులు అధికం అయ్యాయని లేదా తగినంతగా లేవని నిరూపణ అయిన ఉదంతాలు కూడా ఉన్నాయి.

పట్టిక 3.19: అవసరం లేని / అధికమైన / తగినంతగా లేని అనుబంధ కేటాయింపులు

క్రమ సంఖ్య	వివరాలు	గ్రాంట్లు / అప్రోప్రియేషన్ల సంఖ్య	తొలి కేటాయింపు (₹ కోట్లలో)	అనుబంధ కేటాయింపు (₹ కోట్లలో)	మొత్తం ప్రదానం (₹ కోట్లలో)	మొత్తం ఖర్చు (₹ కోట్లలో)	అధిక వ్యయం(+) / తక్కువ ఖర్చు (-) (₹ కోట్లలో)
1	అవసరం లేని అనుబంధ కేటాయింపు	30	24,793	2,779	27,572	19,489	(-) 8,082
2	అధికమైన అనుబంధ కేటాయింపు	36	7,601	8,085	15,687	11,232	(-) 4,454
3	తగినంతగా లేని అనుబంధ కేటాయింపు	29	26,566	5,717	32,283	35,782	3,500

మూలం: వినియోగ పద్దులు

(i) అవసరం లేని అనుబంధ కేటాయింపులు ఉన్న ముఖ్యమైన పథకాలు / ఉప పద్దులు:

ఉప పద్దుల స్థాయిలో, ఈ కింది ఉదంతాల్లో ఖర్చు తొలి కేటాయింపు కన్నా కూడా తక్కువైన కారణంగా అనుబంధ కేటాయింపులు ₹100 కోట్లకు మించి అవసరం లేదు:

పట్టిక 3.20: ₹100 కోట్లకు మించి చేసిన అనుబంధ కేటాయింపులు అనవసరమని నిరూపణ అయిన పథకాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	గ్రాంటు సంఖ్య	గ్రాంటు పేరు	పథకం / ఉప పద్దు	తొలి కేటాయింపు	అనుబంధ కేటాయింపు	మొత్తం	ఖర్చు	తగ్గిన ఖర్చు
1	XII	పాఠశాల విద్య	ప్రాథమిక పాఠశాలలు	747	1,000	1,747	722	1,024
2	XXV	స్త్రీ, శిశు, దివ్యాంగుల సంక్షేమం	సమీకృత శిశు అభివృద్ధి సేవలు	1,003	271	1,274	875	399
3	XXVII	వ్యవసాయం	పెట్టుబడి మద్దతు పథకం	11,491	190	11,681	11,140	540
4	XII	పాఠశాల విద్య	IX, X తరగతులకు పోషకాహార భోజన కార్యక్రమాలు	101	148	249	26	223
5	XVI	వైద్యం, ఆరోగ్యం	బోధనాసుపత్రుల ఏర్పాటు	743	109	853	691	162

మూలం: వినియోగ పద్దులు

(ii) అనుబంధ కేటాయింపులు అధికమైన ముఖ్యమైన పథకాలు / ఉప పద్దులు:

ఉప పద్దుల స్థాయిలో, ఈ కింది ఉదంతాల్లో అనుబంధ కేటాయింపులు ₹200 కోట్లకు మించి అధికం అయ్యాయి:

పట్టిక 3.21: అనుబంధ కేటాయింపులు ₹200 కోట్లకు మించి అధికం అయిన పథకాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	గ్రాంటు సంఖ్య	గ్రాంటు పేరు	పథకం / ఉప పద్దు	తొలి కేటాయింపు	అనుబంధ కేటాయింపు	మొత్తం	ఖర్చు	తగ్గిన ఖర్చు
1	X	ఆంతరంగిక (హోం) పాలన	జిల్లా కార్యాలయాలు (పోలీసు సూపరింటెండెంట్లు)	67	500	567	68	499
2	XXXI	పంచాయతీ రాజ్	జిల్లా పంచాయతీ కార్యాలయాలు	36	538	574	215	359
3	XII	పాఠశాల విద్య	సమగ్ర శిక్ష	561	646	1,207	860	347
4	XIII	ఉన్నత విద్య	ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	357	267	624	423	201

మూలం: వినియోగ పద్దులు

(iii) అనుబంధ కేటాయింపులు తగినంతగా లేవని నిరూపణ అయిన ముఖ్యమైన పథకాలు / ఉప పద్దులు:

ఈ కింది ఉప పద్దుల (పథకాలు) లో అనుబంధ కేటాయింపులు ₹200 కోట్లకు మించి తక్కువగా ఉన్నాయి.

పట్టిక 3.22: అనుబంధ కేటాయింపులు ₹200 కోట్లకు మించి తక్కువ అయిన పథకాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	గ్రాంటు సంఖ్య	గ్రాంటు పేరు	పథకం / ఉప పద్దు	తొలి కేటాయింపు	అనుబంధ కేటాయింపు	మొత్తం	ఖర్చు	తగ్గుదల
1	IX	ద్రవ్య పాలన	రాష్ట్ర అభివృద్ధి ఋణాల మీద వడ్డీ	16,275	1,850	18,125	19,053	928
2	X	ఆంతరంగిక (హోం) పాలన	జిల్లా పోలీసు బలగం	2,698	0*	2,698	3,167	469
3	XVII	పురపాలన, పట్టణాభివృద్ధి	అభివృద్ధి పనుల కోసం పురపాలికలకు సహాయం	0#	1,000	1,000	1,355	355

మూలం: వినియోగ పద్దులు

* *₹55,000 మేర అనుబంధ కేటాయింపు చేయడమైంది*

తొలి కేటాయింపు ₹1,000

ఈ విధంగా శాసనసభ నుంచి అనుబంధ కేటాయింపులను పొందాల్సిన మొత్తాలను మదింపు వేయడంలో ఆర్థిక శాఖ, సంబంధిత శాఖలు పొరపడ్డాయి.

3.4.6 కేటాయింపుల బదిలీలు (రీ-అప్రోప్రియేషన్లు), అప్పగించిన మొత్తాలు, ఉపసంహరించిన / తిరిగి వెనక్కు తీసుకున్న నిధుల కేటాయింపులు

కేటాయింపుల బదిలీ లేదా 'రీ అప్రోప్రియేషన్' అంటే తగు అధికారి ఒక గ్రాంటు లేదా చార్జ్డ్ అప్రోప్రియేషన్‌లోని ఒక అంశంలో ఖర్చు కాకుండా ఉన్న కేటాయింపు మొత్తాన్ని, అదే గ్రాంటు లేదా అదే చార్జ్డ్ అప్రోప్రియేషన్‌లోని మరొక అంశంలో ఏర్పడే అదనపు వ్యయాన్ని భరించడం కొరకు బదిలీ చేయడం. బడ్జెటు నియమావళిలో పేర్కొన్న నిబంధనల ప్రకారం నిర్ధారిత పరిమితులకు, నియంత్రణకు లోబడి ఒక అంశం కొరకు ఆమోదం పొందిన కేటాయింపును అదే గ్రాంటులోని మరో అంశానికి బదిలీ చేసే అనుమతి ప్రభుత్వానికి ఉంది.

బడ్జెటు కేటాయింపులను తగ్గించడం / పెంచడం కోసమో, ఆమోదం పొందిన కేటాయింపులను ఉపసంహరించడం కోసమో, తిరిగి అప్పగించడం కోసమో ప్రభుత్వం కేటాయింపుల బదిలీ (రీ-అప్రోప్రియేషను) / ఉపసంహరణ (రిజెంప్షను) ఉత్తర్వులను జారీ చేస్తోంది. ప్రభుత్వం జారీ చేసిన అటువంటి అన్ని కేటాయింపుల బదిలీ / ఉపసంహరణ ఉత్తర్వుల నికర ప్రభావంగా బడ్జెట్ కేటాయింపుల్లో ₹80,454 కోట్ల తగ్గుదల ఏర్పడింది. అయితే, ***పట్టిక 3.8, పేరా 3.3.2*** లలో పేర్కొన్నట్లుగా మొత్తం మీద నికరంగా ₹20,264 కోట్ల అధిక వ్యయం అయింది.

3.4.6.1 సక్రమం కాని రీ-అప్రోప్రియేషన్లు

బడ్జెట్ నియమావళి లోని పేరా 17.6.1 (సి) ప్రకారం, ఒక సంవత్సరానికి సంబంధించిన తొలి వినియోగపు చట్టంలో గానీ, లేదా అనుబంధ వ్యయప్రకటనకు సంబంధించిన వినియోగపుచట్టంలోగానీ కేటాయింపు లేని ఏదైనా ఒక అంశం మీద ఖర్చును భరించే నిమిత్తం కేటాయింపుల బదిలీ (రీ-అప్రోప్రియేషను) ఉత్తర్వులు ఇవ్వరాదు.

అయితే, ఈ నిబంధనకు విరుద్ధంగా, తొలి కేటాయింపులోగానీ, అనుబంధ కేటాయింపులోగానీ రాష్ట్ర శాసనసభ ఆమోదం లేకున్నా రీ-అప్రోప్రియేషను ఉత్తర్వుల ద్వారా 16 గ్రాంట్లలోని 27 ఉప-పద్దుల విషయంలో ₹704 కోట్లను కేటాయించడం జరిగింది. అందులో ముఖ్యమైన అంశాల వివరాలు ఇలా ఉన్నాయి.

పట్టిక 3.23: ఆమోదం పొందిన బడ్జెటు కేటాయింపులు లేకున్నా కేటాయింపుల బదిలీ ఉత్తర్వుల ద్వారా ₹100 కోట్లకు మించి కేటాయింపులు జరిగిన పథకాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	గ్రాంటు సంఖ్య	గ్రాంటు పేరు	పథకం / ఉప పద్దు	బడ్జెటు కేటాయింపు లేకున్నా కేటాయింపుల బదిలీ ఉత్తర్వుల ద్వారా కేటాయించిన మొత్తం	ఖర్చు
1	XI	రోడ్లు, భవనాలు, రేవులు (రెవెన్యూ ఓటెడ్)	కేంద్ర రోడ్లు నిధి నుంచి బదలాయింపు	276	276
2	IX	ద్రవ్య పాలన (రెవెన్యూ ఓటెడ్)	విభజన అనంతరం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి కేటాయించ దగిన మొత్తం	199	199
3	XI	రోడ్లు, భవనాలు, రేవులు (క్యాపిటల్ ఓటెడ్)	టి.ఎస్.ఆర్.టి.సి. లో పెట్టుబడులు	123	123

మూలం: వినియోగ పద్దులు

'వాస్తవవ్యయం ఆధారంగా పెరుగుదల' అని పేర్కొనడం తప్ప, సక్రమం కాని ఈ విధంగా కేటాయింపుల బదిలీలకు ఏ కారణాలను పేర్కొనడం జరుగలేదు.

3.4.6.2 అధిక వ్యయం అయినా నిధుల అప్పగింతకు జారీ అయిన ఉత్తర్వులు

ఒక వినియోగానుమతి (అప్రోప్రియేషను), ఐదు ప్రదానాల (గ్రాంట్ల) విషయంలో అధిక వ్యయం అయినా ప్రభుత్వం నిధుల అప్పగింత ఉత్తర్వులను ఇవ్వడంతో ఆ ఉత్తర్వులు లోపభూయిష్ఠమయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి:

పట్టిక 3.24: అధిక వ్యయం అయినా నిధుల అప్పగింత ఉత్తర్వులు జారీ అయిన ఉదంతాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	గ్రాంటు సంఖ్య	గ్రాంటు పేరు	తొలి బడ్జెటు	అనుబంధ బడ్జెటు	మొత్తం	ఖర్చు	అధిక వ్యయం (+)	అప్పగింత (-)
వినియోగానుమతి (అప్రోప్రియేషను)								
1	IX	ద్రవ్య పాలన (ఋణాలు చార్జ్‌డ్)	11,701.90	310.53	12,012.43	94,809.75	82,797.32	(-)818.07
ప్రదానాలు (గ్రాంట్లు)								
2	II	గవర్నరు, మంత్రి పరిషత్తు (రెవెన్యూ ఓటెడ్)	27.56	0.19	27.75	28.85	1.10	(-)0.07
3	IV	సాధారణ పరిపాలన, ఎన్నికలు (క్యాపిటల్ ఓటెడ్)	3.64	0.00	3.64	5.78	2.13	(-)0.36
4	IX	ద్రవ్య పాలన (రెవెన్యూ ఓటెడ్)	12,446.31	32.66	12,478.97	25,958.30	13,479.32	(-)91.13
5	XXX	సహకారం (రెవెన్యూ ఓటెడ్)	129.57	0.02	129.59	132.84	3.26	(-)4.97
6	XXXV	ఇంధనం (రెవెన్యూ ఓటెడ్)	7,800.86	0.40	7,801.26	14,856.04	7,054.79	(-)6,64

మూలం: వినియోగ పద్దులు

పేటిక 3.2: ఖర్చు మొత్తం అయినా కేటాయింపు మొత్తం అప్పగింతకు ఉత్తర్వుల జారీ

ఉప పద్దు స్థాయిలో కేటాయించిన పూర్తి మొత్తం ఖర్చు అయిన తర్వాత కూడా మొత్తం కేటాయింపు తిరిగి అప్పగింతకు ఉత్తర్వు జారీ అయిన ఒక ఉదంతం ఏర్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి:

తొలి బడ్జెటు అంచనాలలో పెద్ద పద్దు 6003 - రాష్ట్ర ప్రభుత్వ అంతర్గత ఋణాలు, చిన్న పద్దు 106 - పరిహారం, ఇతర బాండ్లు, ఉప పద్దు 06 - ఉజ్వల్ డిస్కమ్ అస్యూరెన్స్ యోజన (ఉదయ్) కింద ₹892 కోట్లను

కేటాయించడం జరిగింది. అయితే, మొత్తం ₹892 కోట్లనూ రీ-అప్రోప్రియేషన్ ఉత్తర్వుల ద్వారా ఉపసంహారించడం జరిగింది (2023 మార్చి 31). ఇందుకు కారణంగా 'వాస్తవవ్యయం ఆధారంగా ఖర్చులో తగ్గుదల' అని మాత్రమే పేర్కొనడం జరిగింది. అయితే, కేటాయింపు బదిలీకి / తిరిగి అప్పగింతకు ఈ కారణానికి సహేతుకమైన సంబంధం లేదు.

నిజానికి, ₹892 కోట్లు (2023 మార్చి ప్రాథమిక పద్దుల ప్రకారమే) ఖర్చు అయిపోయింది. అందువల్ల, అప్పటికే ఖర్చు అయి ఉన్న అంశంలో రీ-అప్రోప్రియేషను ఉత్తర్వుల ద్వారా కేటాయింపు ఉపసంహరణ లేదా తిరిగి అప్పగింత అనేది ఖర్చుల పురోగతితో వాస్తవికంగా పొంతనలేని విషయాన్ని సూచిస్తోంది.

3.4.6.3 కేటాయింపుతో పోలిస్తే వాస్తవంగా ఖర్చు తగ్గిన మొత్తానికి మించి అప్పగింత ఉత్తర్వుల జారీ

05 వినియోగానుమతులు (అప్రోప్రియేషన్లు) (ఒక్కొక్క విభాగంలో), 23 ప్రదానాల (గ్రాంట్లు) (32 విభాగాలు) లో కేటాయింపులతో పోలిస్తే వాస్తవంగా తగ్గిన ఖర్చు ₹32,628 కోట్లు కాగా ₹32,749 కోట్ల మేర అప్పగింత ఉత్తర్వుల జారీ అయ్యాయి. వివరాలు ***అనుబంధం 3.4*** లో ఉన్నాయి.

3.4.6.4 ఏడాది చిట్టచివరిలో అప్పగింత/ఉపసంహరణ ఉత్తర్వులు

బడ్జెట్ మాన్యువల్ పేరా 17.2.2 లోని నిబంధన ప్రకారం, ఖర్చు తగ్గే అన్ని ఉదంతాలను దృష్టికి వచ్చిన వెనువెంటనే, అవి ఏ విధంగా ఏర్పడ్డాయో పూర్తిగా వివరిస్తూ సత్వరమే తిరిగి అప్పగించాలి. అంతే కాకుండా, మార్చి 25 తరువాత అప్పగింతకు ప్రతిపాదనలు చేస్తే, కేటాయింపులతో పోలిస్తే ఖర్చులు తగ్గే విషయాన్ని ముందుగా ఎందుకు గుర్తించలేదో పూర్తి వివరణ ఇవ్వాలి.

అయితే, మొత్తం మీద ₹80,454 కోట్ల మేర కేటాయింపులను తగ్గిస్తూ 401 కేటాయింపు బదిలీ / ఉపసంహరణ ఉత్తర్వులను[30] ఆర్థిక సంవత్సరం ఆఖరి రోజున అంటే 2023 మార్చి 31 నే జారీ చేసినా, కేటాయింపులతో పోలిస్తే ఖర్చులు తగ్గే విషయాన్ని ముందుగా ఎందుకు గుర్తించలేదో తెలిపే వివరణలేవీ రికార్డులలో లేవు.

3.4.6.5 నిర్దిష్టమైన కారణాలు లేకుండా రీ-అప్రోప్రియేషన్లు

పెరుగుదలకు కానీ, తగ్గించేందుకు కానీ ఇచ్చిన ఏ కేటాయింపు బదిలీ ఉత్తర్వులలోనూ నిర్దిష్టమైన కారణాలేవీ పేర్కొనలేదు. 'వాస్తవవ్యయం ఆధారంగా పెరుగుదల' లేదా 'వాస్తవవ్యయం ఆధారంగా తగ్గుదల' అంటూ మామూలు కారణాలను మాత్రమే ఇవ్వడం జరిగింది.

3.4.6.6 బడ్జెటు కేటాయింపు, అపేక్షలకు - వాస్తవాలకు మధ్య అంతరం

పన్నుల నిర్వహణ / ఇతర రాబడి, ప్రజా వ్యయాల సమర్థ నిర్వహణ వివిధ ద్రవ్య సూచికల సాధనకు కీలకం. వాస్తవదూరమైన ప్రతిపాదనల ఆధారంగా బడ్జెటు కేటాయింపులు చేయడం, ఖర్చుల పర్యవేక్షణ యంత్రాగం పేలవంగా ఉండడం, పథకాల అమలు సామర్థ్యం బలహీనంగా ఉండడం, అంతర్గత నియంత్రణలు బలహీనంగా ఉండడం వంటివి వివిధ అభివృద్ధి అవసరాలకు కేటాయింపుల కొరతకు దారి తీస్తాయి. కొన్ని శాఖలలో కేటాయింపుతో పోలిస్తే ఖర్చు బాగా తక్కువ కావడం వల్ల వినియోగించగలిగే శాఖలకు నిధులు దక్కకుండాపోతాయి.

2022-23 సంవత్సరంలో మొత్తం కేటాయింపు (చేబదుళ్లను మినహాయించి) ₹2,77,425 కోట్లు. ఈ సంవత్సరంలో మొత్తం స్థూల వ్యయం (చేబదుళ్లను మినహాయించి) ₹2,14,967 కోట్లు. ఫలితంగా 2022-23 సంవత్సరంలో కేటాయించిన మొత్తంతో పోలిస్తే తగ్గిన ఖర్చు ₹62,458 కోట్లు. అయితే, తగ్గిన ఖర్చు కన్నా ₹17,996 కోట్లు ఎక్కువగా అంటే ₹80,454 కోట్ల తిరిగి అప్పగింత జరిగింది. అప్పగింతలన్నింటినీ 2023 మార్చి 31 నే చేయడం జరిగింది. వివరాలు ***పట్టిక 3.8*** లో ఉన్నాయి.

[30] వినియోగ పద్దుల ప్రకారం ₹7,765 కోట్ల మేర కేటాయింపులను పెంచడం కొరకు, ₹88,219 కోట్ల మేర కేటాయింపులను తగ్గించడం కొరకు

2018-19 నుంచి 2022-23 మధ్యకాలంలో తొలి కేటాయింపు, సవరించిన అంచనా, వాస్తవ వ్యయం వివరాలు ఈ కింద ఉన్నాయి:

పట్టిక 3.25: 2018-23 మధ్యకాలంలో తొలి బడ్జెటు, రీ-అప్రోప్రియేషన్ల తరువాత కేటాయింపు, వాస్తవ వ్యయం

(₹ కోట్లలో)

	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
తొలి బడ్జెటు	1,74,409	1,46,447	1,82,859	2,30,772	2,56,921
అనుబంధ బడ్జెటు	23,542	24,257	25,131	24,144	20,504
మొత్తం బడ్జెటు	1,97,951	1,70,705	2,07,990	2,54,916	2,77,425
రీ-అప్రోప్రియేషన్ల తర్వాత కేటాయింపు మొత్తం	1,36,067	1,42,691	1,52,656	1,27,344	1,96,971
వాస్తవ వ్యయం	1,39,747	1,50,009	1,64,634	1,95,818	2,14,967
తగ్గిన ఖర్చు	(-) 58,204	(-) 20,696	(-) 43,356	(-) 59,098	(-) 62,458
తొలి బడ్జెటుతో పోలిస్తే అనుబంధ బడ్జెటు శాతం	13	17	14	10	8
మొత్తం బడ్జెటుతో పోలిస్తే తగ్గిన ఖర్చు / అధిక వ్యయం శాతం	(-) 29	(-) 12	(-) 21	(-) 23	(-) 23
మొత్తం బడ్జెటు (-) రీ-అప్రోప్రియేషన్ల తర్వాత కేటాయింపు మొత్తం	61,884	28,014	55,334	1,27,572	80,454
రీ-అప్రోప్రియేషన్ల తర్వాత కేటాయింపు మొత్తం (-) వాస్తవ వ్యయం	(-) 3,680	(-) 7,318	(-) 11,978	(-) 68,474	(-) 17,996
మొత్తం బడ్జెటులో శాతంగా (మొత్తం బడ్జెటు (-) రీ-అప్రోప్రియేషన్ల తర్వాత కేటాయింపు మొత్తం)	31	16	27	50	29
మొత్తం బడ్జెటులో శాతంగా (రీ-అప్రోప్రియేషన్ల తర్వాత కేటాయింపు మొత్తం (-) వాస్తవ వ్యయం)	(-) 2	(-) 4	(-) 6	(-) 27	(-) 6

మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

గమనిక: సంఖ్యలన్నీ చేబదుళ్ల తిరిగి చెల్లింపును మినహాయించినవి

2022-23 లో అనుబంధ కేటాయింపు ₹20,504 కోట్లు అని *పట్టిక 3.25* తెలియజేస్తోంది. తొలి కేటాయింపుతో పోలిస్తే ఇది 8 శాతం. గత ఏడాది అనుబంధ కేటాయింపు తొలి కేటాయింపులో 10 శాతం .

పైన పట్టికను బట్టి చూస్తే, 2018-19 నుంచి 2022-23 మధ్యకాలంలో, మొత్తం బడ్జెటుతో పోలిస్తే రీ-అప్రోప్రియేషన్ల తర్వాత కేటాయింపు మొత్తం ఎప్పుడూ తక్కువగానే ఉంది. 2018-19, 2020-21, 2022-23 సంవత్సరాలలో ఈ రెంటి మధ్య తేడా దాదాపు 30 శాతంగా ఉండగా, 2021-22 లో అది 50 శాతం ఉండడం ఆ సంవత్సరంలో భారీగా రీ-అప్రోప్రియేషన్లు ఉన్నాయని సూచిస్తోంది. అదే విధంగా, రీ-అప్రోప్రియేషన్ల తర్వాత కేటాయింపుతో పోలిస్తే వాస్తవవ్యయం విషయంలో కూడా 2021-22 లో గణనీయమైన తేడా ఉంది. అన్నీ సంవత్సరాలలోనూ వాస్తవవ్యయం కన్నా రీ-అప్రోప్రియేషన్ల తర్వాత కేటాయింపు తక్కువగా ఉంది. అంటే, కేటాయింపుతో పోలిస్తే తగ్గిన ఖర్చు కన్నా అప్పగించిన మొత్తాలే ఎక్కువగా ఉన్నాయి.

3.4.7 ప్రత్యేక అభివృద్ధి నిధి

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి (ఆర్థిక వనరుల ప్రణాళిక, కేటాయింపు వినియోగం) చట్టం - 2017 ప్రకారం, రాష్ట్రం ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రం మొత్తం ప్రగతి పద్దు (పరివ్యయం) లో కొంత భాగాన్ని రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డు కులాల / షెడ్యూల్డు తెగల జనాభా దామాషాలో, నిర్దేశించే పద్ధతిలో, షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి, షెడ్యూల్డ్ తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి పేరిట ఉండే నిధులకు ప్రత్యేకించి తీసి ఉంచాలి. 2011 జనాభా ప్రకారం షెడ్యూల్డ్ కులాల జనాభా 15.45 శాతం కాగా, షెడ్యూల్డ్ తెగల జనాభా 9.08 శాతం. షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి, షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి కింద చేపట్టే కార్యక్రమాల్లో ఉపకార వేతనాలకు రాయితీలు, షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల జనవాసాల్లో రహదారుల నిర్మాణం వంటివి ఉంటాయి.

2022-23 లో మొత్తం ప్రగతి పద్దు వ్యయం (₹1,41,971 కోట్ల) నుంచి ప్రభుత్వం షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి కోసం ₹33,938 కోట్లు[31], షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి కోసం ₹13,412 కోట్లు[32] కేటాయించింది. ఈ మొత్తాలు ప్రగతి పద్దు మొత్తం పరివ్యయంలో 23.90 శాతం, 9.45 శాతంగా ఉన్నాయి. అంటే, చట్టం నిర్దేశించిన ప్రమాణాల కన్నా స్వల్పంగా ఎక్కువ కేటాయింపులే ఉన్నాయి.

అయితే, షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి కోసం కేటాయించిన నిధుల్లో 58 శాతం[33], షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి కోసం కేటాయించిన నిధుల్లో 38 శాతం[34] వినియోగం కాలేదు.

నిజానికి వినియోగం ఏటేటా ఈ కింద చూపిన విధంగా తగ్గుదల ఉంటోంది:

పట్టిక 3.26: గత ఐదు సంవత్సరాలలో షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి, షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద ఖర్చు, కేటాయింపుతో పోలిస్తే తగ్గిన ఖర్చుల శాతాలు

(శాతంలో)

క్రమసంఖ్య	సంవత్సరం	షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి		షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి	
		వినియోగం	తగ్గుదల	వినియోగం	తగ్గుదల
1	2018-19	38	62	57	43
2	2019-20	79	21	74	26
3	2020-21	60	40	63	37
4	2021-22	73	27	73	27
5	2022-23	42	58	62	38

మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

అంతే కాకుండా, చట్టంలోని సెక్షన్ 14 ప్రకారం, ప్రత్యేక అభివృద్ధి నిధిలో ఏదైనా మొత్తం ఖర్చు కాకుండా ఉండిపోతే తరువాతి సంవత్సరంలో పరిహారం కల్పించాలి. ఈ పరిహారాన్ని, ప్రగతి పద్దు మొత్తం బడ్జెటు అంచనాతో పోలిస్తే ఏడాది చివరకు మొత్తం ఖర్చు ఉన్నంత దామాషా మేరకు, నిర్దేశిత పద్ధతిలో కల్పించాలి. అయితే, ఈ విధమైన పరిహారం గురించి గత సంవత్సరాల బడ్జెటు పత్రాలలో పేర్కొన లేదు. పైగా, షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి విషయంలో కేటాయింపు దాదాపు నిర్దేశిత ప్రమాణం మేరకే ఉన్నందున, గత సంవత్సరాల తాలూకు పరిహారాన్ని చట్టం ప్రకారం ప్రస్తుత సంవత్సరంలో అమలు చేయలేదని భావించవచ్చు.

పేటిక 3.3: ఉదయ్ కింద ప్రభుత్వం తీసుకున్న డిస్కంల నష్టాలను షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి, షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి కింద ఖర్చుగా పద్దు రాయడం

2022-23 సంవత్సరపు తొలి బడ్జెటులో కేటాయింపులు లేకపోయినా ఉదయ్ కింద డిస్కంల గత సంవత్సరాల నష్టాలను తీసుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ₹7,061 కోట్లను విడుదల[35] చేసింది. చిన్న పద్దు 190 – "ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర సంస్థలకు సహాయం" కింద చేయడం ఈ ఖర్చు జరిగింది.

తరువాత, అయిన ఖర్చు ₹7,061 కోట్లలో, ₹1,091 కోట్లను చిన్న పద్దు 789 - 'షెడ్యూల్డు కులాలకు ప్రత్యేక ప్రణాళిక" కు, ₹643 కోట్లను చిన్న పద్దు 796 - "గిరిజన ప్రాంత ఉప ప్రణాళిక" కు ప్రత్యేక అభివృద్ధి నిధి

[31] అన్ని శాఖలకు కలిపి ₹32,910 కోట్లు, ఇంకా విడదీయలేని మౌలిక సదుపాయాల పనుల కొరకు ₹1,028 కోట్లు

[32] అన్ని శాఖలకు కలిపి ₹12,972 కోట్లు, ఇంకా విడదీయలేని మౌలిక సదుపాయాల పనుల కొరకు ₹440 కోట్లు

[33] షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి బడ్జెట్ (తొలి+అనుబంధ కేటాయింపు): ₹34,386 కోట్లు, ఖర్చు: ₹14,534 కోట్లు (42 శాతం), తగ్గిన ఖర్చు: ₹19,852 కోట్లు (58 శాతం)

[34] షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి బడ్జెట్ (తొలి+అనుబంధ కేటాయింపు): ₹14,258 కోట్లు, ఖర్చు: ₹8,775 కోట్లు (62 శాతం), తగ్గిన ఖర్చు: ₹5,483 కోట్లు (38 శాతం)

[35] 2022 జూన్ లో ₹6,646 కోట్లు, 2022 డిసెంబరులో ₹415 కోట్లు

చట్టంలో పేర్కొన్న దామాషా ప్రకారం పద్దు పుస్తకాలలో సర్దుబాట్లు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. 2022-23 సంవత్సరం బడ్జెటు అంచనాలలో ఉదయ్ కింద నష్టాలను తీసుకునేందుకు కేటాయింపులు లేవు కనుక ప్రగతి పద్దు (పథకపు వ్యయం) లో కూడా ఈ అంశం రాలేదు.

ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం లోని సెక్షను 5 ప్రకారం డిపార్టుమెంట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులలో కేవలం షెడ్యూల్డు కులాలు / షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తులు, లేదా షెడ్యూల్డు కులాలు / షెడ్యూల్డు తెగల కుటుంబాలు లేదా షెడ్యూల్డు కులాలు / షెడ్యూల్డు తెగల ఆవాసాలు లేదా గిరిజన ప్రాంతాలలో ఆ చట్టంలోని ప్రమాణాలు, దాని కింద చేసిన నియమాలకు అనుగుణంగా అభివృద్ధిలో వ్యత్యాసాలను తగ్గించేందుకు ప్రత్యక్షమైన, పరిమాణాత్మకమైన ప్రయోజనాలను సాధించే పథకాలను మాత్రమే పొందుపర్చాలి.

ఉదయ్ అన్నది డిస్కముల ఆర్థిక పునరుత్తేజం కోసం ఉద్దేశించినది కనుకా, ఇంకా ఈ మొత్తం ₹7,061 కోట్ల ఖర్చు (₹1,091 కోట్లు, ₹643 కోట్లతో సహా) 2019-20 సంవత్సరం వరకు డిస్కములకు వచ్చి ఉన్న నష్టాలను తీసుకోవడం కోసం పెట్టింది కనుక అది షెడ్యూల్డు కులాల / షెడ్యూల్డు తెగల వ్యక్తులు, షెడ్యూల్డు కులాల / షెడ్యూల్డు తెగల కుటుంబాలు, షెడ్యూల్డు కులాల / షెడ్యూల్డు తెగల ఆవాసాలు లేదా గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో అంతరాలను పూడ్చేందుకు ప్రత్యక్షమైన, పరిమాణత్మకమైన ప్రయోజనాలను చేకూర్చగలిగేవి కాబోవు. ఈ విధంగా పద్దు రాసిన ఖర్చు ఏ విధంగా ఉద్దేశిత లబ్ధిదారులకు ప్రత్యక్షమైన, పరిమాణత్మకమైన ప్రయోజనాలను అందజేసినట్లు ప్రభుత్వం ధ్రువీకరించుకున్నదో అన్న సమాచారం ప్రభుత్వం ఇవ్వలేదు.

పైగా, బడ్జెటు అంచనాలలో ఈ అంశానికి కేటాయింపు లేదు, ప్రగతి పద్దులో కూడా ఈ అంశం లేదు.

ప్రత్యేక అభివృద్ధి నిధి కింద లక్ష్యసాధనను పెంచి చూపడం కోసం ఈ విధంగా పద్దు పుస్తకాల్లో సర్దుబాట్లు చేసినట్లు స్పష్టమౌతోంది. కాబట్టి, షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి కింద చూపిన 42 శాతం వినియోగాన్ని, షెడ్యూల్డు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి కింద చూపిన 62 శాతం వినియోగాన్ని ఆ మేరకు పెంచి చూపినట్లైంది.

3.4.8 ఇతర డిపాజిట్ ఖాతాలకు బదిలీలు

ఒక ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత ప్రదానాల (గ్రాంట్ల) కింద ఖర్చు చేయడం కోసం వినియోగపు చట్టం అనుమతిని ఇస్తుంది. కాబట్టి ధనాన్ని రాష్ట్ర సంచిత నిధి నుంచి ప్రజాపద్దు కింద ఉన్న సివిల్ డిపాజిట్ల (పెద్ద పద్దు 8443 సివిల్ డిపాజిట్లు - చిన్న పద్దు 800 ఇతర డిపాజిట్లు) పద్దుకు బదిలీ చేస్తే, ఆ ప్రజాపద్దు నుంచి (తరువాతి సంవత్సరాలలో) ధనాన్ని తీసుకోవడం కోసం మళ్లీ శాసనసభ ఆమోదం అవసరం లేదు కనుక, ఆ విధంగా బదిలీ చేయడం ఆందోళనకరమైన విషయం.

2022-23 సంవత్సరంలో మొత్తంగా ₹5,094 కోట్లను సంచిత నిధి నుంచి ఇతర డిపాజిటు పద్దులకు బదిలీ చేసి, రెవెన్యూ (₹4,220 కోట్లు), క్యాపిటల్ (₹200 కోట్లు), ఋణాలు - అడ్వాన్సులు (₹674 కోట్లు) విభాగాల కింద ఖర్చుగా నమోదు చేయడం జరిగింది.

- నిత్య వ్యావహారిక వ్యయం (రెవెన్యూ ఖర్చులు) గా పద్దు రాసి, ఒక్కొక్క ఉదంతం లోనూ ₹100 కోట్లకు పైగా డిపాజిటు పద్దులకు బదిలీ చేసిన అంశాలలో తెలంగాణ అల్పసంఖ్యాక వర్గాల గురుకుల విద్యా సంస్థల సంఘం (₹774 కోట్లు), ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు (₹261 కోట్లు), తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ (₹203 కోట్లు), షాదీ ముబారక్ (₹148 కోట్లు), తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (₹106 కోట్లు) ఉన్నాయి.
- మూలధన (క్యాపిటల్) వ్యయంగా పద్దు రాసి డిపాజిటు పద్దులకు బదిలీ చేసిన వాటిలో ముఖ్యమైనది తెలంగాణ రాష్ట్ర తాగు నీటి సరఫరా సంస్థ (₹200 కోట్లు).
- ఋణాల వ్యయంగా పద్దు రాసి ఇతర డిపాజిట్ల కింద డిపాజిటు పద్దులకు బదిలీ చేసిన వాటిలో ముఖ్యమైనవి ఆరోగ్యశ్రీ ఆరోగ్య సంరక్షణ ట్రస్టు (₹474 కోట్లు), ఉద్యానవన అభివృద్ధి సంస్థ (₹200) కోట్లు.

సంచిత నిధి నుంచి డిపాజిటు పద్దులకు బదిలీ చేసేస్తే, తరువాత మళ్లీ శాసనసభ ఆమోదం లేకుండానే ఆయా పద్దుల నుంచి ఖర్చులు జరిగే ప్రమాదావకాశాలు ఉన్నాయి.

3.4.9 ఖర్చులను తప్పుగా వర్గీకరించడం

ప్రభుత్వ వ్యయాన్ని సాధారణంగా రెండు రకాలుగా వర్గీకరించడం జరుగుతుంది. అవి, (i) ప్రభుత్వ ఖర్చులకు శాసనసభలో ఓటింగు ద్వారా ఆమోదం అవసరమా లేదా అన్న అంశం ఆధారంగా 'చార్జ్‌డ్' ఖర్చులుగాను (అంటే, శాసనసభలో ఓటింగుతో సంబంధం లేకుండా నేరుగా కాగల ఖర్చులు), 'ఓటెడ్' ఖర్చులుగాను (అంటే, శాసనసభలో ఓటు ద్వారా ఆమోదం తెలిపే ఖర్చులు), (ii) ఖర్చుల స్వభావాన్ని బట్టి వాటిని 'నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ', 'మూలధన వ్యయం లేదా క్యాపిటల్', 'ఇచ్చిన ఋణాలు లేదా లోన్లు' గా వర్గీకరించడం జరుగుతుంది.

పేరా 1.3 లో వివరించినట్లుగా ప్రభుత్వ పద్దుల వ్యవస్థలో పైన పేర్కొన్న వివిధ స్థాయిలకు వివిధ సంకేత సంఖ్య (అంటే కోడ్) లను కేటాయించే ఏర్పాటు ఉంది. పద్దులలో ఖర్చుల తప్పు వర్గీకరణల మీద మా పరిశీలనలను ప్రతి ఏటా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిటు నివేదికలలో ప్రస్తావించడం జరుగుతోంది. వ్యావహారిక వ్యయాన్ని (అంటే, రెవెన్యూ ఖర్చులను) మూలధనం వ్యయంగానూ (అంటే, క్యాపిటల్ వ్యయంగానూ) లేదా మూలధన వ్యయాన్ని నిత్య వ్యావహారిక వ్యయంగా వర్గీకరించడం వల్ల రెవెన్యూ ఖర్చులను, అదే విధంగా రెవెన్యూ లోటు/మిగులును తగ్గించి/పెంచి చూపించినట్లు అవుతుంది.

3.4.9.1 నిత్య వ్యావహారిక వ్యయాన్ని మూలధన వ్యయంగా వర్గీకరించడం

(i) శస్త్ర చికిత్సలలో వినియోగం అయిపోయే వస్తువుల కొనుగోలును మూలధనవ్యయంగా వర్గీకరించడం

నిత్య వ్యావహారిక వ్యయం లేదా రెవెన్యూ ఖర్చులు అంటే పునరావృతం అయ్యే స్వభావం కలవి. ఈ రెవెన్యూ ఖర్చులను సాధారణంగా రెవెన్యూ రాబడి నుంచి ఖర్చు చేయాలన్నది ఉద్దేశ్యం. మూలధన వ్యయం లేదా క్యాపిటల్ వ్యయం అంటే శాశ్వతమైన స్వభావం లేదా పదార్థాలు గల ఆస్తుల ఏర్పాటు కోసమో లేదా శాశ్వతంగా చెల్లింపు బాధ్యతలను తగ్గించుకోవడం కోసమో పెట్టే ఖర్చు. అయితే, శస్త్ర చికిత్సలలో వినియోగం అయిపోయే వస్తువుల కొనుగోలు మీద ఖర్చును నిత్య వ్యావహారిక వ్యయంగా వర్గీకరించాల్సి ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటులో ₹125 కోట్ల మేర అటువంటి ఖర్చును మూలధన వ్యయంగా పరిగణించి ₹50 కోట్లను ఖర్చు చేసింది.

(ii) చిన్న పనుల ఖర్చులను మూలధనవ్యయంగా వర్గీకరించడం

సాధారణంగా 'పెద్ద పనుల' మీద వ్యయాన్ని మూలధన వ్యయంగానూ, 'చిన్నపనుల' మీద వ్యావహారిక వ్యయంగా వర్గీకరించడం జరుగుతుంది.

అయితే, రాష్ట్ర ప్రభుత్వం 'చిన్న పనుల' కోసం ₹258 కోట్లను బడ్జెటులో మూలధనవ్యయం కింద కేటాయించి, ₹90 కోట్లను ఖర్చు చేసింది. ఇందులో వనీకరణ నిధి కింద ₹145 కోట్లను చిన్న పనుల నిమిత్తం కేటాయించి, ₹84 కోట్లను ఖర్చు చేయడం జరిగింది. మరో ₹113 కోట్లను చిన్న పనుల కింద నిర్వహణ నిమిత్తం కేటాయించి, ₹6 కోట్లను ఖర్చు చేయడం జరిగింది. ఈ వర్గీకరణ సరి కాదు.

(iii) మూలధన వ్యయంగా వర్గీకరణ అయిన ఖర్చులు

పద్దుల నియమావళి (అకౌంట్స్ కోడ్) లోని అధికరణ 30 - (ఎ) (2) ప్రకారం, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ సలహాపై రాష్ట్రపతి ప్రత్యేక అనుమతి ఇచ్చిన సందర్భాలలో తప్ప తాత్కాలిక ఆస్తుల మీద ఖర్చును, లేదా స్థానిక సంస్థలకు, వ్యవస్థలకు (స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు చెందే ఆస్తుల ఏర్పాటు కోసం) ఇచ్చే సహాయక గ్రాంట్ల మీద ఖర్చును, సాధారణంగా మూలధన వ్యయంగా వర్గీకరించడం, మూలధన వ్యయం పద్దు కింద ఖర్చు రాయడం చేయరాదు.

అయితే, ఈ కింద చూపిన ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం మూలధన విభాగం కింద వర్గీకరించింది.

పట్టిక 3.27: మూలధన విభాగం కింద వర్గీకరణ అయిన నిత్య వ్యావహారిక వ్యయం

క్రమ సంఖ్య	వివరాలు	ఖర్చు (₹ కోట్లలో)	వ్యాఖ్యానాలు
1	మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఖర్చు	1,483	ఉపాధి వేతన హామీని కల్పించడం ద్వారా జీవనోపాధిని పెంపొందించడం ఈ చట్టం ఉద్దేశ్యం. అయితే, ఈ పథకం ద్వారా ఏర్పడ్డ ఆస్తులు పథకాన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేసిన స్థానిక సంస్థలకు లేదా స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలకు చెందవు అని, ప్రభుత్వానికే చెందుతాయని ఋజువు చేసేందుకు ఊతమిచ్చే సమాచారమేదీ లేదు.
2	నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం	1,029	ఈ పథకం ఉద్దేశ్యం నియోజకవర్గాలలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం. అయితే, తద్వారా ఏర్పడ్డ ఆస్తులు ప్రభుత్వానికే చెందుతాయని ఋజువు చేసేందుకు ఊతమిచ్చే సమాచారమేదీ లేదు.
	మొత్తం	2,512	

మూలం: వినియోగ పద్దులు

3.4.9.2 మూలధన వ్యయాన్ని వ్యావహారిక వ్యయంగా వర్గీకరించడం

మూలధన వ్యయం లేదా క్యాపిటల్ వ్యయం అంటే శాశ్వతమైన స్వభావం లేదా పదార్థాలు గల ఆస్తుల ఏర్పాటు కోసమో లేదా శాశ్వతంగా చెల్లింపు బాధ్యతలను తగ్గించుకోవడం కోసమో పెట్టే ఖర్చు అని నిర్వచించవచ్చు. పునరావృతం అయ్యే స్వభావం ఉన్న ఖర్చులను నిత్య వ్యావహారిక వ్యయంగా పరిగణించవచ్చు. ఈ కింది ఉదంతాల్లో ₹25 కోట్ల మేర మూలధన వ్యయాన్ని (అంటే క్యాపిటల్ వ్యయాన్ని) రెవెన్యూ విభాగం కింద వర్గీకరించడం జరిగింది:

పట్టిక 3.28: రెవెన్యూ విభాగం కింద వర్గీకరణ అయిన మూలధన వ్యయం

క్రమ సంఖ్య	వివరాలు	ఖర్చు (₹ కోట్లలో)
1	మోటారు వాహనాల కొనుగోలు	6
2	యంత్రాలు, పరికరాలు - కొనుగోళ్లు	14
3	యంత్రాలు, పరికరాలు -పనిముట్లు, యంత్రాగారాలు	5
	మొత్తం	25

మూలం: వినియోగ పద్దులు

ఆస్తులను మూలధనం విభాగంలో కాకుండా నిత్య వ్యావహారిక విభాగంలో వర్గీకరిస్తే వ్యావహారిక వ్యయాన్ని ఎక్కువగాను, ఇటు మూలధన వ్యయాన్నీ, అటు ప్రభుత్వం ఆస్తులను తక్కువగానూ చూపినట్లౌతుంది. ఇంకా, ఆస్తులను సంబంధిత ఆస్తుల పద్దుల పుస్తకాల్లో నమోదు చేయకపోయేందుకు ఆస్కారం ఏర్పడడమే కాకుండా, ప్రభుత్వ ఆస్తుల తస్కరణకు, మళ్లింపుకు వీలు ఏర్పడుతుంది.

3.5 బడ్జెటు, అకౌంటింగు ప్రక్రియ ప్రభావశీలత

3.5.1 ఖర్చుల సమయవ్యాప్తి

దృఢమైన ప్రజాధన నిర్వహణకు ఒక క్రమమైన వేగంతో ఖర్చు చేయడం ఒక కీలకమైన అంశం. ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలోనో, లేక చివరి నెలలలోనో చేసే హడావిడి ఖర్చులు అందజేసే సేవల మీద, ఖర్చుల నాణ్యత మీద ప్రతికూల ప్రభావం చూపుతాయి.

ఈ సంవత్సరంలో ఖర్చు జరిగిన సరళిని ఈ దిగువ పటంలో చూపడం జరిగింది.

పటం 3.7: 2022-23 సంవత్సరంలో ఖర్చుల సరళి



మూలం: వినియోగ పద్దులు

ఖర్చు ముఖ్యంగా 2022 జూన్ నుంచి 2022 ఆగస్టు వరకు, 2023 జనవరి నుంచి 2023 మార్చి వరకు అత్యధికంగా ఉంది. ఈ ఆరు నెలలలోనూ ఎక్కువగా ఖర్చు కావడానికి కారణం చేబదుళ్ల తిరిగి చెల్లింపే. అంతే కాకుండా, పెట్టుబడి మద్దతు పథకం (జూన్, జూలై, జనవరి), మార్కెటు ఋణాల అనామతు (జూన్, జూలై, ఆగస్టు), రాష్ట్ర అభివృద్ధి ఋణాల మీద వడ్డీ (ఆగస్టు, జనవరి, ఫిబ్రవరి, మార్చి), ఉదయ్ కింద డిస్కములు నుంచి తీసుకున్న నష్టాలు (జూన్) వంటి వాటి వల్ల ఆయా నెలలలో ఖర్చు అధికం అయింది.

3.5.2 సలహా లేకుండానే కొత్త ఉప-పద్దులను/వివరణాత్మక పద్దులను ప్రారంభించడం

రాజ్యాంగంలోని 150 వ అధికరణం ప్రకారం భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి.ఎ.జి.) సలహా మేరకు రాష్ట్రపతి పద్దుల నమూనాను నిర్ణయించాల్సి ఉంది. అందుచేత, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏవైనా ఉప పద్దులను ప్రారంభించే ముందు తెలంగాణ ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్ అండ్ ఎన్టైటిల్మెంట్స్) ముందస్తు సమ్మతి పొందాలి.

అయితే, 2022-23 లో ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్ అండ్ ఎన్టైటిల్మెంట్స్) నుండి ముందస్తు సమ్మతి లేకుండా ప్రభుత్వం కొత్తగా 89 ఉప-పద్దులను (రెవెన్యూ కింద 62[36], క్యాపిటల్ కింద 20[37], ప్రజాపద్దు కింద 07[38]) ప్రారంభించింది. ఈ ఉపపద్దుల కింద ₹11,927 కోట్లు కేటాయింపులను చేయడం జరిగింది. ₹3,890 కోట్ల అనుబంధ కేటాయింపులతో కలిపి మొత్తం కేటాయింపులు ₹15,817 కోట్లు కాగా, ₹11,499 కోట్లు ఖర్చయింది.

ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్ అండ్ ఎన్టైటిల్మెంట్స్) సమ్మతి లేకుండా కొత్త ఉప-పద్దులను ప్రారంభిస్తే, ఒకటే పథకానికి రెండు లేదా అంతకన్నా ఎక్కువ ఉప-పద్దులు, లేదా రెండు లేదా అంతకన్నా ఎక్కువ పథకాలకు ఒకే ఉప-పద్దు ఉండే ప్రమాదావకాశం ఉంది. ఈ రెండూ కూడా పద్దులలో పారదర్శకతను ప్రభావితం చేయగలవు.

---

36 బడ్జెటు కేటాయింపు: ₹11,856 కోట్లు, ఖర్చు: ₹9,461 కోట్లు

37 బడ్జెటు కేటాయింపు: ₹3,961 కోట్లు, ఖర్చు: ₹1,719 కోట్లు

38 బడ్జెటు కేటాయింపు: శూన్యం, ఖర్చు: ₹318 కోట్లు

3.5.3 ఎంపిక చేసిన గ్రాంట్ల సమీక్ష

వివరణాత్మకంగా పరిశీలించేందుకు రెండు గ్రాంట్లను, అంటే (i) గ్రాంటు సంఖ్య XVII - పురపాలన, పట్టణాభివృద్ధి, (ii) గ్రాంటు సంఖ్య XXXI - పంచాయతీ రాజ్ గ్రాంట్లను ఎంపిక చేయడం జరిగింది. ఈ రెండు గ్రాంట్లలోనూ కేటాయింపులతో పోలిస్తే గణనీయమైన స్థాయిలో ఖర్చు తక్కువగా ఉంది. వివరాలు *పట్టిక 3.29* లో ఉన్నాయి.

పట్టిక 3.29: ఎంపిక చేసిన గ్రాంట్లలో బడ్జెటు కేటాయింపులు, ఖర్చులు, అధికవ్యయం, తగ్గిన ఖర్చులు

(₹ కోట్లలో)

విభాగం	తొలి కేటాయింపు	అనుబంధ కేటాయింపు	మొత్తం	ఖర్చు	అధిక వ్యయం (+) / తగ్గిన ఖర్చు (-)	కేటాయింపుల బదిలీ / తిరిగి అప్పగింత
గ్రాంటు XVII - పురపాలన, పట్టణాభివృద్ధి						
ఓటెడ్						
రెవెన్యూ	7,115	1,032	8,147	5,040	(-) 3,106	(-) 3,106
క్యాపిటల్	151	-	151	-	(-) 151	(-) 151
ఋణాలు	3,325	200	3,525	2,950	(-)575	(-) 575
గ్రాంటు XVII మొత్తం	**10,591**	**1,232**	**11,823**	**7,990**	**(-) 3,832**	**(-) 3,832**
గ్రాంటు XXXI - పంచాయతీ రాజ్						
ఓటెడ్						
రెవెన్యూ	5,838	2,737	8,575	5,863	(-) 2,713	(-) 2,713
క్యాపిటల్	2,385	274	2,659	1,388	(-) 1,271	(-) 871
ఋణాలు	4,589	-	4,589	1,274	(-) 3,315	(-) 3,315
ఉప మొత్తం	**12,812**	**3,011**	**15,823**	**8,525**	**(-) 7,298**	**(-) 6,898**
చార్జ్‌డ్						
క్యాపిటల్	-	1	1	-	(-) 1	(-) 1
ఉప మొత్తం	-	1	1	-	(-) 1	(-) 1
గ్రాంటు XXXI మొత్తం	**12,812**	**3,012**	**15,824**	**8,525**	**(-) 7,299**	**(-) 6,899**
పూర్తి మొత్తం	**23,403**	**4,244**	**27,646**	**16,515**	**(-)11,131**	**(-) 10,731**

మూలం: వినియోగ పద్దులు

పై గ్రాంట్ల విషయమై ఆడిటు కనుగొన్న విషయాలను ఈ కింది పేరాలలో వివరించడమైంది:

3.5.3.1 గ్రాంటు XVII - పురపాలన, పట్టణాభివృద్ధి

(i) గ్రాంటును గురించి అవలోకనం

ఈ గ్రాంటును పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ నిర్వహిస్తుంది.

2022-23 సంవత్సరంలో మొత్తం ₹2,57,021 కోట్ల బడ్జెటులో తొలి కేటాయింపులో ఈ గ్రాంటుకు ఇచ్చిన కేటాయింపు (₹10,591 కోట్లు) నాలుగు శాతం. మొత్తం అనుబంధ కేటాయింపులు ₹20,504 కోట్లలో ఈ గ్రాంటుకు ఇచ్చిన అనుబంధ కేటాయింపులు ఆరు శాతం (₹1,232 కోట్లు). మొత్తం ఖర్చు ₹2,97,789 కోట్లలో ఈ గ్రాంటు కింద అయిన ఖర్చు (₹7,990 కోట్లు) మూడు శాతం. ఈ గ్రాంటులో తిరిగి అప్పగించిన ₹3,832 కోట్లు, తిరిగి అప్పగించిన మొత్తం (₹80,454 కోట్లు) లో అయిదు శాతం, ఈ గ్రాంటుకు కేటాయించిన మొత్తంలో 32 శాతం.

పైన *పట్టిక 3.29* చూపినట్లుగా రెవెన్యూ విభాగం కింద తొలి కేటాయింపు కన్నా కూడా ఖర్చు తక్కువే అయిన కారణంగా 2023 ఫిబ్రవరిలో పొందిన ₹1,032 కోట్ల అనుబంధ కేటాయింపులు అక్కర్లేదు. వాటికి అవసరమైన చోట్ల నామమాత్రపు కేటాయింపులు చేసి ఉండవచ్చు. ఋణాల విభాగంలో కూడా, తొలి కేటాయింపు కన్నా కూడా ఖర్చు తక్కువే అయిన కారణంగా 2023 ఫిబ్రవరిలో పొందిన ₹200 కోట్ల అనుబంధ కేటాయింపులు అనవసరం.

మూలధన విభాగం కింద మొత్తం కేటాయింపు ₹151 కోట్లు కాగా, ఖర్చు కేవలం ₹20,000 మాత్రమే. హైదరాబాదు పట్టణ సముదాయం విషయంలో ఎలాంటి కారణాలు లేకుండానే మొత్తం కేటాయింపును తిరిగి అప్పగించిన కారణంగా ఈ విభాగం కింద దాదాపు మొత్తం కేటాయింపు ఖర్చు కాకుండానే ఉండిపోయింది (హైదరాబాదు పట్టణ సముదాయం కింద మూడు సంవత్సరాలుగా మొత్తం కేటాయింపును వినియోగించక పోయిన విషయమై **పేరా *3.4.3.1*** లోని ***పేటిక 3.1*** ని చూడవచ్చు).

(ii) గత ఐదు సంవత్సరాలుగా కేటాయింపుల వినియోగంలో తగ్గుదల

ఇంతకు ముందు **పేరా *3.4.4.2*** లో పేర్కొన్నట్లుగా, గత ఐదు సంవత్సరాలుగా కేటాయింపుతో పోలిస్తే వినియోగం తరుచూ తక్కువగా ఉన్న గ్రాంట్లలో పురపాలన, పట్టణాభివృద్ధి గ్రాంటు ఒకటి. ఖర్చులు, వినియోగం కాని కేటాయింపులను ఈ కింది పటంలో చూపడం జరిగింది:

పటం 3.8: పురపాలన, పట్టణాభివృద్ధి గ్రాంటులో ఖర్చు, వినియోగం కాని కేటాయింపు



మూలం: గత ఐదు సంవత్సరాల వినియోగ పద్దులు

పైన ఉన్న పటాన్ని బట్టి చూస్తే, గత ఐదు సంవత్సరాలుగా కేటాయింపుల వినియోగంలో తగ్గుదల ప్రతి ఏటా ఉన్నదని అవగతం అవుతోంది. 2018-19, 2020-21, 2021-22 సంవత్సరాలలో వినియోగం అయిన మొత్తం కన్నా వినియోగం కాని మొత్తమే ఎక్కువ. రెవెన్యూ ఓటెడ్ విభాగంలో కేటాయింపులతో పోలిస్తే ఖర్చులో తగ్గుదలకు కారణం 'హైదరాబాదు పట్టణ సముదాయం', 'స్మార్ట్ నగరాలు', 'అమృత్', 'రాష్ట్ర ఆర్థిక సంఘం కింద పురపాలికలకు సహాయం' వంటివి. గత ఐదు సంవత్సరాలలో మూడు సంవత్సరాల పాటు కనీసం ₹100 కోట్లకు మించి కేటాయింపులతో పోలిస్తే ఖర్చులో తగ్గుదల ఉన్న పథకాలను ఈ కింద చూపడమైంది:

పట్టిక 3.30: కేటాయింపులతో పోలిస్తే తరుచూ వినియోగంలో తగ్గుదల ఉన్న ఉప-పద్దులు / పథకాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	పథకం	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
1.	స్మార్ట్ నగరాలు	127	--	422	726	685
2.	అమృత్	212	--	106	753	312
3.	రాష్ట్ర ఆర్థిక సంఘం కింద పురపాలికలకు సహాయం	677	390	--	--	174
4.	మిషన్ భగీరథ - పట్టణ	4	--	661	110	188
5.	స్వచ్ఛ భారత్	125	--	157	592	37

క్రమ సంఖ్య	పథకం	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
6.	పురపాలికలకు / కార్పొరేషన్లకు వడ్డీ లేని ఋణాల కోసం సహాయం (వడ్డీ లేని ఋణాలు)	--	66	186	538	128
7.	బాహ్యవలయ రహదారి ప్రాజెక్టు కోసం హైదరాబాదు మహానగర అభివృద్ధి సంస్థకు ఋణాలు	171	--	--	472	200
8.	మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి	377	2	--	200	185
9.	యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధి సంస్థ	76	30	175	88	185

మూలం: వినియోగ పద్దులు

(iii) ప్రస్తుత సంవత్సరంలో తొలి కేటాయింపు మొత్తంగా వినియోగించకపోవడం

ఈ కింది పథకాలు / కార్యక్రమాల విషయంలో ₹100 కోట్లు లేదా అంతకు మించిన తొలి కేటాయింపు మొత్తంగా వినియోగం కానేలేదు. రీ-అప్రోప్రియేషన్ ఉత్తర్వులను జారీ చేసేటప్పుడు 'వాస్తవవ్యయం ఆధారంగా తగ్గుదల' అంటూ మామూలు కారణాలను మాత్రమే ఇవ్వడం జరిగింది తప్ప రీ-అప్రోప్రియేషను / తిరిగి అప్పగింతకు సంబంధించిన నిర్దిష్టమైన కారణాలను చూపలేదు.

పట్టిక 3.31: తొలి కేటాయింపును మొత్తంగా ఉపసంహరించడం

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	పథకం	బడ్జెటు కేటాయింపు	తిరిగి అప్పగింత / రీ-అప్రోప్రియేషన్	కారణాలు / డిపార్టుమెంటు వ్యాఖ్యలు
1.	పాతబస్తీకి మెట్రో మార్గం	500	500	పనులు ప్రారంభం కాకపోవడం
2.	విమానాశ్రయానికి మెట్రో మార్గం	378	378	పనులు ప్రారంభం కాకపోవడం
3.	బాహ్యవలయ రహదారి ప్రాజెక్టు కోసం హైదరాబాదు మహానగర అభివృద్ధి సంస్థకు ఋణాలు	200	200	ధనం విడుదల కాలేదు
4.	హైదరాబాదు పట్టణ సముదాయం	151	151	కారణాలను పేర్కొనలేదు
5.	ల్యాండు పూలింగ్ సీడ్ మని	100	100	కారణాలను పేర్కొనలేదు

మూలం: వినియోగ పద్దులు

(iv) ప్రస్తుత సంవత్సరంలో తొలి కేటాయింపునూ, అనుబంధ కేటాయింపును మొత్తంగా వినియోగించకపోవడం

ప్రస్తుత 2022-23 సంవత్సరంలో 'వరంగల్లు పురపాలక సంస్థకు సహాయం' కోసం ₹10 కోట్ల మొత్తాన్ని కేటాయించడమైంది. ఈ మొత్తానికి అనుబంధ కేటాయింపులుగా మరో ₹10 కోట్లను కూడా కేటాయించడం జరిగింది. అయితే, ఈ ₹20 కోట్ల మొత్తాన్ని 'వాస్తవవ్యయం ఆధారంగా తగ్గుదల' అన్న కారణంతో నిర్దిష్టమైన కారణాలేవీ పేర్కనకుండా ఉపసంహరించడం / తిరిగి అప్పగించడం జరిగింది. నిజానికి, 2021-22 లో కూడా ఇదే విధంగా తొలి కేటాయింపు, అనుబంధ కేటాయింపుల మొత్తం ₹250 కోట్లను ఉపసంహరించడం జరిగింది.

(v) ప్రస్తుత సంవత్సరంలో అనుబంధ కేటాయింపును మొత్తంగా వినియోగించకపోవడం

2022-23 సంవత్సరంలో 'కృష్ణా తాగు నీటి సరఫరా ప్రాజెక్టులోని సుంకిశాల ఇన్‌టేక్ ప్రాజెక్టు కోసం హైదరాబాదు మహానగర నీటి సరఫరా, మురుగుపారుదల బోర్డుకు ఋణాలు' రూపేణా ₹725 కోట్ల మొత్తాన్ని కేటాయించడం జరిగింది. ఈ అంశానికి మరో ₹200 కోట్ల మొత్తాన్ని అనుబంధపు కేటాయింపులను ఇవ్వడంతో మొత్తం కేటాయింపులు ₹925 కోట్లు అయింది. అయితే, హైదరాబాదు మహానగర నీటి సరఫరా, మురుగుపారుదల బోర్డుకు ఈ అంశం నిమిత్తం ఇచ్చిన ఋణాలు ₹725 కోట్లు మాత్రమే. అనుబంధ కేటాయింపుల రూపేణా ఇచ్చిన ₹200 కోట్ల మొత్తాన్ని ఉపసంహరిస్తూ తిరిగి అప్పగింత / రీ-అప్రోప్రియేషన్ ఉత్తర్వులను జారీ చేయడం జరిగింది. ఆ విధంగా, మొత్తం అనుబంధపు కేటాయింపు నిరుపయోగంగా ఉండిపోయింది.

అనుబంధపు కేటాయింపులను ప్రతిపాదించడం కోసం కానీ, వాటిని ఉపయోగించక పోవడం కోసం కానీ కారణాలేవీ తెలియపర్చలేదు.

గత సంవత్సరం 2021-22 లో కూడా నిర్దిష్టమైన కారణాలు లేకుండానే ₹725 కోట్ల తొలి కేటాయింపు మొత్తాన్ని ఉపసంహరించడం జరిగింది.

(vi) అనుబంధ కేటాయింపులలో కొరత

ఈ కింది పథకాల విషయంలో ఒక్కొక్క ఉదంతంలోనూ పొందిన అనుబంధ కేటాయింపులు ₹100 కోట్లకు మించి తక్కువ అయ్యాయి.

పట్టిక 3.32: పొందిన అనుబంధపు కేటాయింపులో ఒక్కొక్క ఉదంతంలోనూ ₹100 కోట్లకు మించి తక్కువ అయిన సందర్భాలు

(₹ కోట్లలో)

పథకం	తొలి కేటాయింపు	అనుబంధపు కేటాయింపు	రీ-అప్రోప్రియేషన్	ఖర్చు
అభివృద్ధి పనుల కోసం పురపాలికలకు సహాయం	0.001	1,000	355	1,355
మిలియన్ ప్లస్ సిటీస్ (హైదరాబాదు) కు ఆర్థిక సంఘం గ్రాంట్లు	330	10	120	460
వరంగల్లు స్మార్ట్ నగరం	--	0.01	100	100

మూలం: వినియోగ పద్దులు

(vii) గ్రేటర్ హైదరాబాదు మునిసిపల్ కార్పోరేషనుకు పన్నుల చెల్లింపు విషయంలో బడ్జెటు కేటాయింపులను ఉపసంహరించడం / తిరిగి అప్పగించడం

గత ఐదు సంవత్సరాలలో (i) 'జంట నగరాలలోని ప్రభుత్వం భవనాల కోసం గ్రేటర్ హైదరాబదు మునిసిపల్ కార్పోరేషనుకు ఆస్తి పన్ను చెల్లింపు', (ii) 'గ్రేటర్ హైదరాబాదు మునిసిపల్ కార్పోరేషనుకు వృత్తి పన్ను పరిహారం' విషయంలో ఆమోదితమైన కేటాయింపులు ఖర్చు చేయకుండా ఈ కింద చూపిన విధంగా ఉపసంహరించడం / తిరిగి అప్పగించడం జరిగింది:

పట్టిక 3.33: గ్రేటర్ హైదరాబాదు మునిసిపల్ కార్పోరేషనుకు చెల్లించాల్సిన మొత్తాల విషయంలో ఆమోదితమైన బడ్జెటు కేటాయింపులను ఖర్చు చేయకపోవడం

(₹ కోట్లలో)

పథకం / సంవత్సరం	తొలి బడ్జెటు	అనుబంధపు బడ్జెటు	రీ-అప్రోప్రియేషను	ఖర్చు
జంట నగరాలలోని ప్రభుత్వం భవనాల కోసం గ్రేటర్ హైదరాబాదు మునిసిపల్ కార్పోరేషనుకు ఆస్తి పన్ను చెల్లింపు				
2018-19	32	-	(-) 32	-
2019-20	10	-	(-) 10	-
2020-21	8	-	(-) 8	-
2021-22	8	-	(-) 8	-
2022-23	10	-	(-) 10	-
గ్రేటర్ హైదరాబాదు మునిసిపల్ కార్పోరేషనుకు వృత్తి పన్ను పరిహారం				
2018-19	31	-	(-) 31	-
2019-20	10	-	(-) 10	-
2020-21	10	-	(-) 10	-
2021-22	10	-	(-) 10	-
2022-23	10	-	(-) 10	-

మూలం: వినియోగ పద్దులు

3.5.3.2 గ్రాంటు XXXI - పంచాయతీ రాజ్

(i) గ్రాంటును గురించి అవలోకనం

ఈ గ్రాంటును పంచాయతీ రాజ్ శాఖ నిర్వహిస్తుంది.

2022-23 సంవత్సరంలో మొత్తం ₹2,57,021 కోట్ల బడ్జెటు తొలి కేటాయింపులో ఈ గ్రాంటుకు ఇచ్చిన కేటాయింపు (₹12,812 కోట్లు) 5 శాతం. మొత్తం అనుబంధ కేటాయింపులు ₹20,504 కోట్లలో ఈ గ్రాంటుకు ఇచ్చిన అనుబంధ కేటాయింపులు 15 శాతం (₹3,012 కోట్లు). మొత్తం ఖర్చు ₹2,97,789 కోట్లలో ఈ గ్రాంటు కింద అయిన ఖర్చు (₹8,525 కోట్లు) 3 శాతం. ఈ గ్రాంటులో తిరిగి అప్పగించిన ₹6,899 కోట్లు, తిరిగి అప్పగించిన మొత్తం (₹80,454 కోట్లు) లో 9 శాతం, పంచాయతీ రాజ్ గ్రాంటుకు కేటాయించిన మొత్తంలో 44 శాతం.

మొత్తం ₹15,824 కోట్ల కేటాయింపులో పెట్టిన ఖర్చు ₹8,525 కోట్లు. అంటే, పంచాయతీ రాజ్ గ్రాంటుకు చేసిన కేటాయింపులలో 46 శాతం వినియోగం కాలేదు.

రెవెన్యూ ఓటెడ్ విభాగం కింద పొందిన తొలి కేటాయింపు ₹5,838 కోట్లకు ఖర్చు ₹5,863 కోట్లు దాదాపు సమానంగా ఉంది. కాబట్టి, 2023 ఫిబ్రవరిలో పొందిన ₹2,737 కోట్ల అనుబంధపు కేటాయింపు చాలా ఎక్కువ.

మూలధన ఓటెడ్ విభాగం కింద పెట్టిన ఖర్చు ₹1,388 కోట్లు తొలి కేటాయింపు ₹2,385 కోట్ల కన్నా తక్కువ కావడంతో పొందిన అనుబంధపు కేటాయింపు ₹274 కోట్లు అవసరం లేదు. కేటాయింపుతో పోలిస్తే ఖర్చు ₹1,271 కోట్ల మేర తక్కువ అయినా ₹871 కోట్ల మేరకే తిరిగి అప్పగింత ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఋణాల విభాగంలో తొలి కేటాయింపు (₹4,589 కోట్ల) తో పోలిస్తే ఖర్చు (₹1,274 కోట్లు) 28 శాతం మాత్రమే.

(ii) చార్జ్‌డ్ అనుబంధపు కేటాయింపును తిరిగి అప్పగించడం

మిషన్ భగీరథ (ఉప పద్దు 31) - పెద్ద పనులు (వివరణాత్మక పద్దు - 530) - భూములు (ప్రయోజనాత్మక పద్దు - 532) మీద ఖర్చును భరించడం కోసం ఆకస్మిక ఖర్చుల నిధి నుంచి ₹1.05 కోట్ల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం బయానాగా మంజూరు చేసింది (2022 డిసెంబరు). తదనంతరం, ఆకస్మిక ఖర్చుల నిధి నుంచి బయనాగా తీసుకున్న మొత్తాన్ని తిరిగి భర్తీ చేయడం కోసం అనుబంధ అంచనాల రూపంలో అభ్యర్థించడం జరిగింది. ఈ మొత్తాన్ని అనుబంధ వినియోగపు చట్టం (2023 ఫిబ్రవరి) లో పొందుపర్చడం జరిగింది.

అయితే, మంజూరు చేసిన ఈ మొత్తాన్ని ఆకస్మిక ఖర్చుల నిధి నుంచి డ్రా చేయనేలేదు. చివరకు, 'వాస్తవవ్యయం ఆధారంగా తగ్గుదల' అని పేర్కొంటూ మొత్తాన్ని ఉపసంహరించడం / తిరిగి అప్పగించడం జరిగింది.

(iii) తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పోరేషన్ లిమిటెడ్‌కు ఋణాలు

తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పోరేషన్ లిమిటెడ్ వివిధ బ్యాంకుల నుంచి ₹27,838 కోట్ల ఋణాలను తీసుకున్నదని పంచాయతీ రాజ్ గ్రాంటు ఫలితాల బడ్జెటులో పేర్కొనడం జరిగింది. ఈ సంవత్సరంలో తిరిగి చెల్లించాల్సిన అసలు ఋణం, వడ్డీల మొత్తాన్ని ₹4,383 కోట్లుగా లెక్కించి మిషన్ భగీరథ బడ్జెటు కోసం ఋణాల పద్దు కింద తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పోరేషన్ లిమిటెడ్‌కు ఇచ్చే ఋణాలుగా పంచాయతీ రాజ్ శాఖ ప్రతిపాదించింది. అయితే, తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పోరేషన్ లిమిటెడ్‌కు ఋణాల రూపంలో ₹4,589 కోట్ల మొత్తానికి శాసనసభ ఆమోదం తెలిపింది.

తదనంతరం, ₹3,315 కోట్ల మొత్తాన్ని ఉపసంహరించడం / తిరిగి అప్పగించడం జరుగగా ₹1,274 కోట్ల మొత్తం ఉంది. కేటాయించిన మొత్తం వినియోగంలో తగ్గుదలకు గల కారణాలను పేర్కొనడం జరుగలేదు.

(iv) తొలి బడ్జెటులో కేటాయింపు పొందకపోవడం

గ్రామ పంచాయతీలకు సహాయం కోసం ₹1,876 కోట్లను[39] అనుబంధ కేటాయింపుగా పొందడం జరిగింది. సంవత్సరంలో తరువాత ఆకస్మికంగా ఏర్పడిన కారణంగానో లేదా తదుపరి ప్రణాళిక కారణంగానో ఈ ఖర్చు ఏర్పడలేదు కనుక తొలి బడ్జెటు అంచనాలలోనే ఇంత పెద్ద మొత్తానికి ఆమోదం ఎందుకు పొందలేదో కారణాలను పేర్కొనలేదు. గ్రామ పంచాయతీలకు సహాయక గ్రాంట్ల రూపంలో బదిలీ చేయడం ద్వారా మొత్తం ఖర్చు పెట్టడం జరిగింది.

(v) జల్ జీవన్ మిషన్ కింద కేటాయింపు వినియోగంలో భారీ తగ్గుదల

కేంద్రం, రాష్ట్రాల మధ్య 50:50 నిధుల నిష్పత్తి కూర్పుతో 2024 నాటికి ప్రతి గ్రామీణ గృహాలలోనూ నీటి పంపు కనెక్షన్లను ఏర్పాటు చేసే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను ప్రారంభించింది. మూలధన (క్యాపిటల్) విభాగం కింద ₹1,000 కోట్లను కేటాయించడం జరిగింది. అయితే, భారత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం, పర్యవసానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో కేవలం ₹5 కోట్లు మాత్రమే ఖర్చు కాగా, 99 శాతం కేటాయింపు వినియోగం కాలేదు.

(vi) అనుబంధ కేటాయింపులలో కొరత

మిషన్ భగీరథ విషయంలో మూలధన (క్యాపిటల్) విభాగం కింద తొలి కేటాయింపు ₹520 కోట్లు కాగా, మరో ₹240 కోట్లను అనుబంధంగా కేటాయించడం జరిగింది. ఖర్చు ₹932 కోట్లు. కాబట్టి, తుది ఖర్చు దృష్ట్యా ₹240 కోట్ల అనుబంధపు కేటాయింపు సరిపోలేదు.

3.6 సారాంశం

బడ్జెటును సమీక్షించగా పన్నులు కాని ఇతర రాబడి, సహాయక గ్రాంట్లను ఎక్కువగా అంచనా వేశారని వెల్లడి అయింది. తొలి బడ్జెటులోనే కాకుండా, 2023 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన సవరించిన అంచనాలలో కూడా భారీ రాబడిని అంతర్రాష్ట్ర సర్దుబాట్ల రూపంలో అంచనా వేయడం జరిగింది. ఈ మొత్తాలు అందనే లేదు.

రాబడిని ఎక్కువగా అంచనా వేసిన ఫలితంగా, బడ్జెటు అంచనాలలో ఖర్చును కూడా ఎక్కువగానే అంచనా వేయడం జరిగింది. ఫలితంగా పలు ప్రదానాలలో కేటాయింపులు ఖర్చు కాలేదు. గత సంవత్సరాల మాదిరిగానే రాష్ట్ర అభివృద్ధి ఋణాల మీద వడ్డీ, పింఛను చెల్లింపులు వంటి పాలన సంబంధిత ఖర్చులను తక్కువగా అంచనా వేయడం వల్ల అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలకు ఎక్కువ మొత్తాలను అంచనా వేయడం జరిగింది.

పాలన పరమైన ఖర్చులను తక్కువగా, అభివృద్ధి, సంక్షేమ ప్రదానాలలో ఖర్చులను ఎక్కువగా అంచనా వేసే సరళి ఈ సంవత్సరం కూడా కొనసాగడం వల్ల మొదటి రకం అంశాలలో అధిక వ్యయం కాగా, రెండో రకం అంశాల కేటాయింపులలో ఖర్చుకాకుండా ఉన్నాయి. ఇదే రకమైన సరళి చార్జ్డ్, ఓటెడ్ ఖర్చుల విషయంలో కూడా గమనించడం జరిగింది.

బడ్జెటు కేటాయింపులు లేకుండా ఖర్చు చేయడం ఈ సంవత్సరం కూడా కొనసాగడమే కాకుండా గణనీయంగా కూడా పెరిగింది. డిస్కముల నష్టాలను ఉదయ్ కింద తీసుకోవాల్సి ఉందని గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వానికి తెలిసి ఉన్న ఖర్చును ఈ సంవత్సరం చెల్లించింది. అయితే, శాసనసభ ఆమోదాన్ని పొందడంలో ప్రభుత్వం విఫలమైంది. అదే విధంగా, తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థలో పెట్టిన పెట్టుబడులకు శాసనసభ ఆమోదం పొందడంలో కూడా ప్రభుత్వం విఫలమైంది. తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్‌కు ఇచ్చిన ఋణాలకు పొరపాటున మూలధన విభాగం కింద ఆమోదం పొందడం జరిగింది.

---

39 చిన్న పద్దు 198 - గ్రామ పంచాయతీలకు సహాయం కింద ₹1,416 కోట్లు; చిన్న పద్దు 789 - షెడ్యూల్డు కులాలకు ప్రత్యేక ప్రణాళిక కింద ₹290 కోట్లు; చిన్న పద్దు 796 - గిరిజన ఉప ప్రణాళిక కింద ₹170 కోట్లు;

ఈ సంవత్సరంలో, ₹1,05,565 కోట్ల మేర అధికవ్యయం జరిగింది. 2014-15 నుంచి 2021-22 వరకు కేటాయింపులకు మించి అయిన ₹2,89,115 కోట్ల అధిక వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇంకా రాష్ట్ర శాసన సభ ద్వారా క్రమబద్ధీకరింపజేయించుకోవాల్సి ఉంది. ఇది రాజ్యాంగంలో 204 అధికరణకు ఉల్లంఘన.

ప్రస్తుత సంవత్సరంలో గ్రామీణ, పట్టణ పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్‌కు సహాయం, ఆయిల్ పామ్ పెంపకం, కాళేశ్వరం టూరిజమ్ సర్క్యూట్, ప్రాంతీయ వలయ రహదారి, పాతబస్తీకి మెట్రో మార్గం, విమానాశ్రయానికి మెట్రో మార్గం, హైదరాబాదు పట్టణ సముదాయం వంటి పథకాల విషయంలో ఆమోదించిన కేటాయింపు మొత్తం ఖర్చు కానేలేదు. అదే విధంగా, మొత్తం అనుబంధపు కేటాయింపు, ఇంకా మొత్తం తొలి కేటాయింపుతో పాటు అనుబంధపు కేటాయింపులు ఖర్చు కాకుండానే ఉండిపోయిన పలు సందర్భాలు ఉన్నాయి.

తెలంగాణ దళిత బంధు, రైతులకు ఋణ మాఫీ పథకం, తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పొరేషన్ లిమిటెడ్ వంటి పథకాల విషయంలో భారీ కేటాయింపులు ఖర్చు కాకుండా ఉండిపోయాయి. వాస్తవంగా ఖర్చు ఉన్నా / అధిక వ్యయం ఉన్నా కూడా తిరిగి అప్పగింతకు / రీ-అప్రోప్రియేషనుకు ఉత్తర్వులు జారీచేసిన ఉదంతాలు ఉన్నాయి. అదే విధంగా వాస్తవంగా తగ్గిన ఖర్చు కన్నా ఎక్కువగా తిరిగి అప్పగించిన ఉదంతాలు ఉండడం ఈ ఉత్తర్వులను వాస్తవికంగా సమయానుగతమైన సమాచారం ఆధారంగా జారీచేయడం లేదని సూచిస్తోంది.

షెడ్యూల్డు కులాలకు ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కేటాయించిన నిధులలో 58 శాతం, షెడ్యూల్డు తెగలకు ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కేటాయించిన నిధులలో 38 శాతం వినియోగం కాలేదు. వినియోగం అయిన నిధులలో కూడా, ఉదయ్‌కు అనుగుణంగా డిస్కముల నుంచి ప్రభుత్వం తీసుకున్న నష్టాలను షెడ్యూల్డు కులాలకు ప్రత్యేక ప్రణాళిక, గిరిజన ప్రాంత ఉప ప్రణాళికలకు సర్దుబాటు చేయడం జరిగింది. ఈ విధంగా చేయడం వల్ల ఉద్దేశించిన వర్గాలకు ప్రత్యక్షమైన, పరిమాణాత్మకమైన ప్రయోజనాలను అందించినట్లు కాకపోవచ్చు.

శస్త్ర చికిత్సలలో వినియోగం అయిపోయే సామగ్రి, వనీకరణ కోసం చిన్న పనుల వంటి ఖర్చులను మూలధన (క్యాపిటల్) వ్యయంగానూ, అదే విధంగా, యంత్రాలు, పరికరాలు, మోటారు వాహనాలు, పనిముట్లు, యంత్రాగారాల కొనుగోలు వంటి వాటిని నిత్య వ్యావహారిక వ్యయంగా తప్పుగా వర్గీకరించడం ప్రస్తుత సంవత్సరంలో కూడా కొనసాగింది.

పురపాలన, పట్టణాభివృద్ధి ప్రదానంలో కేటాయించిన నిధులలో భారీ మొత్తం ఏటేటా ఖర్చుకాకుండా ఉండిపోతోంది. గత రెండేళ్లుగా స్మార్ట్ నగరాలు విషయంలో గణనీయమైన స్థాయిలో కేటాయింపులతో పోలిస్తే ఖర్చు తగ్గింది. పాతబస్తీకి మెట్రో మార్గం, విమానాశ్రయానికి మెట్రో మార్గం వంటి వాటికి ఈ సంవత్సరం చేసిన మొత్తం కేటాయింపులు ఖర్చు కానేలేదు.

పంచాయతీ రాజ్ ప్రదానం కింద 'గ్రామ పంచాయతీలకు సహాయం' కోసం భారీ మొత్తాలను అనుబంధ కేటాయింపుల ద్వారా అందించడం జరిగింది. వీటికి తొలి అంచనాలలోనే కేటాయింపులు పొంది ఉండవచ్చు. జల్ జీవన్ మిషన్ కింద భారీ స్థాయిలో కేటాయింపులు ఉన్నా నామమాత్రంగానే ఖర్చు అయింది.

3.7 సిఫార్సులు

(i) రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి 2014-15 నుంచి అయిన అధిక వ్యయాలను రాష్ట్ర శాసన సభ ద్వారా క్రమబద్ధీకరింపజేసుకోవాలి.

(ii) ఆమోదం పొందిన ఖర్చులను ప్రభావవంతంగా అమలు చేయడం కోసం, రాష్ట్ర ప్రభుత్వం వాస్తవికంగా, సాధించగలిగేలా బడ్జెటు అంచనాలను రూపొందించాలి. ముఖ్యంగా, పన్నులు కాని ఇతర రాబడి, సహాయక గ్రాంట్ల అంచనాలు ఆచరణాత్మకంగా ఉండేలా ప్రభుత్వం ధ్రువీకరించుకోవాలి.

(iii) ఆమోదం పొందిన కేటాయింపులకు మించి ఖర్చు కాకుండా / ఆమోదం లేకుండా ఖర్చు కాకుండా ధ్రువీకరించుకునేందుకు దృఢమైన, తార్కికమైన నియంత్రణలను ఏర్పాటు చేయాలి.

(iv) ఉన్న సమయంలో వాస్తవంగా వినియోగించుకోగలిగే అంశాల విషయంలోనే అనుబంధ కేటాయింపులు కోరాలని శాఖలకు సూచించాలి.

(v) కొత్తగా ఉప-పద్దులను / వివరణాత్మక పద్దులను ప్రారంభించే ముందు ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్ అండ్ ఎన్టైటిల్మెంట్స్) ముందస్తు సమ్మతిని పొందేలా రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించుకోవాలి.

అధ్యాయం IV

పద్దుల నాణ్యత, ఆర్థికాంశాల నివేదన పద్ధతులు

అధ్యాయం IV పద్దుల నాణ్యత, ఆర్థికాంశాల నివేదన పద్ధతులు

4.1 పరిచయం

విశ్వసనీయమైన, సంబంధిత సమాచారంతో కూడిన దృఢమైన అంతర్గత ఆర్థిక నివేదన వ్యవస్థ ఉండడం సమర్థమైన, ప్రభావవంతమైన పాలనలో రాష్ట్ర ప్రభుత్వానికి గణనీయంగా తోడ్పడుతుంది. ఆర్థిక నియమాలను, పద్ధతులను, ఆదేశాలను పాటించడంతో పాటు ఆ విధమైన పాటింపుకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో, నాణ్యమైన రీతిలో నివేదించడం కూడా సుపరిపాలన లక్షణాలలో ఒకటి. పాటింపు, నియంత్రణల మీద నివేదికలు ప్రభావవంతమై, ఆచరణలో ఉంటే మౌలికమైన కార్యనిర్వాహక బాధ్యతలను నిర్వర్తించడంలోనూ, వ్యూహాత్మక ప్రణాళికా రచనలోనూ, నిర్ణయాలు తీసుకోవటంలోనూ ప్రభుత్వానికి ఉపకరిస్తాయి.

ఈ అధ్యాయం పద్దుల నాణ్యత గురించి, పూర్ణత్వం, పారదర్శకత, కొలమానం, వెల్లడింపులకు సంబంధించి నిర్దేశిత ఆర్థిక నియమాలు, పద్ధతులు, ఆదేశాల వంటి ఆర్థికాంశాల నివేదన విధానం విషయమై రాష్ట్ర ప్రభుత్వ పాటింపు గురించి ఒక అవలోకనాన్ని అందిస్తుంది.

పద్దుల పూర్ణత్వానికి సంబంధించిన అంశాలు

4.2 వడ్డీతో కూడిన రిజర్వు నిధులు, డిపాజిట్ల విషయంలో వడ్డీ చెల్లింపు బాధ్యతను నెరవేర్చకపోవడం

ప్రజాపద్దులలో రిజర్వు నిధులు, డిపాజిట్లు అనే విభాగాల కింద నిధులలో వడ్డీతో కూడినవి, వడ్డీ లేనివి అని రెండు వర్గాలు ఉంటాయి. అందువల్ల, వడ్డీతో కూడిన రిజర్వు నిధులలో, డిపాజిట్లలో ఉండి, పెట్టుబడి పెట్టకుండా ఉంచేసిన మొత్తాల మీద రాష్ట్ర ప్రభుత్వం వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. వడ్డీతో కూడిన రిజర్వు నిధులు, డిపాజిట్లలో ఉన్న నిల్వలకు సంబంధించి ఈ కింద చూపిన విధంగా ₹131 కోట్ల మేర వడ్డీ చెల్లింపు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం 2022-23 లో నెరవేర్చలేదు.

పట్టిక 4.1: వడ్డీ చెల్లింపు బాధ్యతను నెరవేర్చకపోవడం

(₹ కోట్లలో)

రంగం	ఉప రంగం	అంచనా వేసిన వడ్డీ రేటు	2022 ఏప్రిల్ నాటికి ఉన్న నిల్వ	చెల్లించాల్సిన వడ్డీ
జె - రిజర్వు నిధులు	రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (పెద్ద పద్దు 8121- చిన్న పద్దు 122)	రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి మార్గదర్శకాల ప్రకారం వడ్డీ రేటు అంటే భారత రిజర్వు బ్యాంకు ఓవర్ డ్రాఫ్ట్ నియంత్రణ మార్గదర్శకాల ప్రకారం ఓవర్ డ్రాఫ్టుకు వర్తించే రేటు (నెలవారీ నిల్వలపై నెలవారీ రెపో రేటు + 2 శాతం చొప్పున వడ్డీ రేటుతో వడ్డీని లెక్కించడం జరిగింది)	608	53
జె - రిజర్వు నిధులు	రాష్ట్ర పరిహార వనీకరణ నిధి (పెద్ద పద్దు 8121 - చిన్న పద్దు 129)	పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల (జాతీయ ప్రాధికార సంస్థ) మంత్రిత్వ శాఖ వడ్డీ రేటును 3.35 శాతంగా నిర్ణయించింది.	1,450	47

రంగం	ఉప రంగం	అంచనా వేసిన వడ్డీ రేటు	2022 ఏప్రిల్ నాటికి ఉన్న నిల్వ	చెల్లించాల్సిన వడ్డీ
జె - రిజర్వ్ నిధులు	రాష్ట్ర విపత్తు నివారణ నిధి (పెద్ద పద్దు 8121- చిన్న పద్దు 130)	రాష్ట్ర విపత్తు నివారణ నిధి మార్గదర్శకాల ప్రకారం వడ్డీ రేటు అంటే భారత రిజర్వ్ బ్యాంకు ఓవర్ డ్రాఫ్ట్ నియంత్రణ మార్గదర్శకాల ప్రకారం ఓవర్ డ్రాఫ్టుకు వర్తించే రేటు అంటే, 2022-23 లో సగటున 7.49 శాతం చొప్పున లెక్కించడం జరిగింది.	120	9
కె - డిపాజిట్లు, అడ్వాన్సులు	ప్రభుత్వ ఉద్యోగులకు నిర్ధారిత వాటా పింఛను పథకం (పెద్ద పద్దు 8342 - చిన్న పద్దు 117)	ప్రభుత్వం ప్రకటించిన/సాధారణ భవిష్య నిధి విషయంలో చెల్లించాల్సిన వడ్డీ రేటు అంటే 7.1 శాతం ప్రకారం లెక్కించడం జరిగింది.	314	22
చెల్లించాల్సి ఉన్న వడ్డీ మొత్తం				131

మూలం: ఆర్థిక పద్దులు

₹131 కోట్ల మేర వడ్డీని చెల్లించని / తక్కువగా చెల్లించిన కారణంగా ఆ మేరకు రెవెన్యూ లోటును, ద్రవ్య లోటును తక్కువగా చూపించినట్లైంది. వీటి మీద ప్రభుత్వం కూడా గత ఐదు సంవత్సరాలుగా వెరసి ₹469[1] కోట్ల వడ్డీని చెల్లించలేదు.

అంతేకాకుండా, 2022 ఏప్రిల్ 01 నాటికి (వడ్డీతో కూడిన డిపాజిట్లు వర్గం కింద ఉన్న) ఇతర స్వయంపాలక సంస్థల డిపాజిటు పద్దు కింద ₹2,390 కోట్లు, నానావిధ డిపాజిట్ల పద్దు కింద ఉన్న ₹146 కోట్లు ఉన్నాయి. ఈ మొత్తాల మీద ప్రభుత్వం వడ్డీని చెల్లించడంలేదు.

ప్రస్తుత సంవత్సరంలో నెరవేర్చని చెల్లింపు బాధ్యత భవిష్యత్తులో ప్రభుత్వ వ్యావహారిక (లేదా రెవెన్యూ) వ్యయ భారాన్ని పెంచుతుంది.

4.3 రాష్ట్రంలోని అమలు చేసే సంస్థలకు నేరుగా నిధుల బదలాయింపు

కేంద్ర ప్రాయోజిక పథకాలు / అదనపు కేంద్ర సహాయానికి సంబంధించి అందజేస్తున్న అన్ని సహాయాలను 2014 ఏప్రిల్ 1 నుంచి పథకాలను అమలు చేసే సంస్థలకు నేరుగా విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాలకే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, 2014-15 నుంచి 2022-23 వరకు కేంద్ర ప్రభుత్వం ₹82,242 కోట్లను[2] రాష్ట్రంలో పథకాలను అమలు చేస్తున్న సంస్థలకే నేరుగా బదిలీ చేసింది.

అమలు చేస్తున్న సంస్థలకు గత ఐదు సంవత్సరాలుగా నేరుగా బదిలీ అయిన నిధుల సరళి *పటం 4.1* లో చూపడమైంది.

[1] (i) 2017-18: ₹22 కోట్లు, (ii) 2018-19: ₹29 కోట్లు, (iii) 2019-20: ₹23 కోట్లు, (iv) 2020-21: ₹213 కోట్లు, (v) 2021-22: ₹182 కోట్లు,

[2] (i)2014-15: ₹425 కోట్లు, (ii) 2015-16: ₹858 కోట్లు, (iii) 2016-17: ₹888 కోట్లు, (iv) 2017-18: ₹9,741 కోట్లు, (v) 2018-19: ₹9,795 కోట్లు, (vi) 2019-20: ₹13,399 కోట్లు, (vii) 2020-21: ₹18,726 కోట్లు, (viii) 2021-22: ₹18,392 కోట్లు, (ix) 2022-23: ₹10,018 కోట్లు

పటం 4.1: 2018-19 నుంచి 2022-23 మధ్య కాలంలో పథకాలను అమలు చేస్తున్న సంస్థలకే నేరుగా బదిలీ అయిన నిధులు



మూలం: ఆర్థిక పద్దులు

2022-23 లో నేరుగా బదిలీ చేసిన నిధుల వివరాలు ఆర్థిక పద్దులలోని అనుబంధం - VI లో ఉన్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే అమలు చేసే సంస్థలకు నేరుగా బదిలీ చేసిన మొత్తం 46 శాతం తగ్గిందని పై పటంలో గమనించవచ్చు. రాష్ట్రంలోని అమలు సంస్థలకు చేసిన కొన్ని ముఖ్యమైన బదిలీలను *పట్టిక 4.2* లో చూపడం జరిగింది:

పట్టిక 4.2: రాష్ట్రంలోని అమలు సంస్థలకు నేరుగా అయిన ముఖ్యమైన బదిలీలు

క్రమ సంఖ్య	సంస్థ, పథకం	మొత్తం (₹ కోట్లలో)
1	జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఆహార ధాన్యాల వికేంద్రీకృత సేకరణ కోసం ఆహార సబ్సిడీ నిమిత్తం తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ	5,243
2	మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిమిత్తం గ్రామీణాభివృద్ధి కమీషనరు	2,127
3	ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కోసం వ్యవసాయ శాఖ	2,022

మూలం: ఆర్థిక పద్దులు

గత ఐదు సంవత్సరాలలో, ఈ విధంగా నేరుగా చేసిన బదిలీలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (₹31,818 కోట్లు[3]), జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఆహార ధాన్యాల వికేంద్రీకృత సేకరణ కోసం ఆహార సబ్సిడీ (₹26,786 కోట్లు[4]), ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం (₹9,042 కోట్లు[5]) విషయంలో ప్రస్ఫుటంగా ఉన్నాయి.

ఈ నిధులు రాష్ట్ర సంచిత నిధి ద్వారా బదిలీ కాలేదు కనుక, వాటికి సంబంధించిన రాకపోకల వివరాలు వార్షిక పద్దులలో ఉండవు. కాబట్టి, రాష్ట్ర రాబడి, ఖర్చులు, ఇతర ద్రవ్య చరంకాలు ఆ మేరకు సమగ్రంగా ఉండవు.

---

3 (i) 2018-19: ₹6,376 కోట్లు, (ii) 2019-20: ₹6,336 కోట్లు, (iii) 2020-21: ₹9,006 కోట్లు, (iv) 2021-22: ₹7,973 కోట్లు, (v) 2022-23: ₹2,127 కోట్లు

4 (i) 2018-19: ₹2,559 కోట్లు, (ii) 2019-20: ₹4,439 కోట్లు, (iii) 2020-21: ₹6,880 కోట్లు, (iv) 2021-22: ₹7,665 కోట్లు, (v) 2022-23: ₹5,243 కోట్లు

5 (i) 2018-19: ₹377 కోట్లు, (ii) 2019-20: ₹2,176 కోట్లు, (iii) 2020-21: ₹2,187 కోట్లు, (iv) 2021-22: ₹2,280 కోట్లు, (v) 2022-23: ₹2,022 కోట్లు

4.4 స్థానిక నిధుల డిపాజిట్లు

పంచాయతీ రాజ్ సంస్థలకు, పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన స్థానిక నిధులను రాష్ట్ర ప్రభుత్వ పద్దులలోని ప్రజాపద్దుల కింద ఉన్న డిపాజిట్ల విభాగంలో నిర్వహించడం జరుగుతుంది. ఆయా చట్టాల ప్రకారం వసూలు అయిన ధనంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంఘాల నుంచి ఈ స్థానిక సంస్థలకు ప్రదానాలు లేదా గ్రాంట్ల రూపేణా అందిన ధనం ఉంటాయి. గ్రామ పంచాయితీలలో పారిశుధ్యం, మొక్కలు నాటడం, వీధి దీపాల వంటి వాటి[6] మీద ఖర్చులు అవుతాయి. మునిసిపాలిటీల్లో నీటి సరఫరా, పారిశుధ్యం, వీధులు, వీధి దీపాలు, మార్కెట్లు వంటి[7] వాటి మీద ఖర్చులు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం వద్ద స్థానిక నిధుల డిపాజిట్ల వివరాలు దిగువపేర్కొన్నవిధంగా ఉన్నాయి:

పట్టిక 4.3: స్థానిక నిధుల డిపాజిట్లు

(₹ కోట్లలో)

నిధి	పద్దు వివరం		2018-19	2019-20	2020-21	2021-22	2022-23
పట్టణ స్థానిక సంస్థలు							
పురపాలక నిధులు	(8448-102)	ప్రారంభ నిల్వ	1,286*	1,678	1,848	2,511	1,838
		రాబడి	1,740	2,200	3,221	1,528	1,009
		ఖర్చు	1,348	2,030	2,558	2,201	1,386
		ముగింపు నిల్వ	**1,678**	**1,848**	**2,511**	**1,838**	**1,461**
పంచాయితీ రాజ్ సంస్థలు							
గ్రామ పంచాయతీ నిధి	(8448-109-01)	ప్రారంభ నిల్వ	924*	1,453	1,579	2,205	1,655
		రాబడి	1,945	2,898	3,920	3,032	1,589
		ఖర్చు	1,416	2,772	3,294	3,582	2,194
		ముగింపు నిల్వ	**1,453**	**1,579**	**2,205**	**1,655**	**1,050**
మండల ప్రజా పరిషత్తు నిధులు	(8448-109-02)	ప్రారంభ నిల్వ	101*	143	92	286	475
		రాబడి	158	130	331	470	206
		ఖర్చు	116	181	137	281	209
		ముగింపు నిల్వ	**143**	**92**	**286**	**475**	**472**
జిల్లా పరిషత్తు నిధులు	(8448-109-03)	ప్రారంభ నిల్వ	287*	364	373	408	512
		రాబడి	203	266	204	252	133
		ఖర్చు	126	257	169	148	199
		ముగింపు నిల్వ	**364**	**373**	**408**	**512**	**446**
సంవత్సరం చివరకు పంచాయతీ సంస్థల నిధుల మొత్తం ముగింపు నిల్వ			**1,960**	**2,043**	**2,899**	**2,641**	**1,968**

మూలం: ఆర్థిక పద్దులు

* *ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య నిల్వల పంపకం వల్ల గత సంవత్సరాల ముగింపు నిల్వతో ప్రారంభ నిల్వ భిన్నంగా ఉంది. దీన్ని సరిపోల్చి చూడడం జరుగుతోంది.*

[6] తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టం, 2018 ప్రకారం

[7] తెలంగాణ పురపాలికల చట్టం, 2019 ప్రకారం

పురపాలక నిధిలో (i) XIII ఆర్థిక సంఘం గ్రాంట్లు (₹551 కోట్లు), (ii) మున్సిపల్ కార్పోరేషన్ నిధి (₹502 కోట్లు), (iii) సాధారణ నిధులు (₹266 కోట్లు), (iv) పురపాలక ఉద్యోగుల జీతాల నిధి (₹109 కోట్లు) కలిసి ఉన్నాయి.

గ్రామ పంచాయితీ నిధిలో (i) రాష్ట్ర ఆర్థిక సంఘం గ్రాంట్లు (₹476 కోట్లు), (ii) సాధారణ నిధులు (₹392 కోట్లు), (iii) గ్రామ పంచాయితీలకు XIII ఆర్థిక సంఘం గ్రాంట్లు (₹181కోట్లు) కలిసి ఉన్నాయి.

స్థానిక సంస్థలకు ఇచ్చిన XIII ఆర్థిక సంఘం గ్రాంట్లకు సంబంధించి ₹732 కోట్ల మొత్తం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజాపద్దులో అందుబాటులో ఉంది. XIII ఆర్థిక సంఘం (2010-2015) కింద విడుదల అయిన భారీ మొత్తాలు ఎనిమిది సంవత్సరాలు గడిచిపోయినా ఖర్చు కాకుండా ఇంకా ప్రజాపద్దులలోనే ఉన్నాయని ఇది సూచిస్తోంది.

ఇంతకు ముందు ***పేరాలు 1.4, 2.6*** లలో పేర్కొన్నట్లు, చెల్లింపుల తర్వాత ఇంకా ప్రజాపద్దులలో నిలువ ఉన్న మొత్తాలను ప్రభుత్వం వివిధ ప్రయోజనాలకు ఉపయోగించుకోవచ్చు. ఈ నిధుల విషయంలో ప్రభుత్వం ఒక బ్యాంకరు మాదిరిగా వ్యవహరిస్తుంది. ఈ మొత్తాలను తిరిగి చెల్లించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వం మీద ఉంటుంది. అందువల్ల, స్థానిక నిధులకు చెందిన గణనీయమైన మొత్తాలను సుదీర్ఘ కాలం ప్రభుత్వం వద్ద ప్రజాపద్దుల్లో ఉంచడం, స్థానిక ప్రభుత్వాల కింద ఉద్దేశించిన ప్రయోజనాల కోసం ఆ నిధులను వినియోగించలేదని, అంతే కాకుండా తత్సమానమైన నగదు మొత్తం ప్రభుత్వం వద్ద లేకపోతే ప్రభుత్వం ఈ మొత్తాలను ఇతర ప్రయోజనాలకు ఉపయోగించిందని కూడా సూచిస్తుంది.

స్థానిక ప్రభుత్వ సంస్థలకు అర్హమైన నిధులను ప్రాధాన్యత ఇచ్చి వాటిని సకాలంలో అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించుకోవాలని ఆడిటు సిఫార్సు చేస్తోంది.

పారదర్శకతకు సంబంధించిన అంశాలు

4.5 అనిశ్చిత, ఆకస్మిక బిల్లులు

తక్షణ చెల్లింపులు కోసం అవసరమైతే తప్ప ఖజానా నుంచి ధనాన్ని గైకొనరాదని రాష్ట్ర ఆర్థిక నియమావళిలోని అధికరణ 94 నిర్దేశిస్తోంది. అయితే, కొన్ని నిర్దేశిత ప్రయోజనాల కోసం ఏర్పడే ఆకస్మిక ఖర్చులను భరించడం కొరకు 'అనిశ్చిత - ఆకస్మిక' (అబ్‌స్ట్రాక్ట్ కంటింజెంట్ - ఎ.సి.) బిల్లుల మీద అడ్వాన్సు రూపంలో ముందస్తుగా ధనం తీసుకునేందుకు అధికరణ 102 అనుమతిస్తోంది. ముందస్తుగా తీసుకున్న అటువంటి అన్ని అడ్వాన్సులకు సంబంధించి, ఎ.సి. బిల్లు తీసుకున్న మూడు నెలలలోగా ధ్రువీకరణ సంతకంతో వివరణాత్మక కంటింజెంట్ (డీటైల్డ్ కంటింజెంట్ - డి.సి.) బిల్లులను సమర్పించడం ద్వారా సర్దుబాటు జరగాలని ప్రభుత్వ ఉత్తర్వులలో[8] నిర్దేశించడమైనది.

2023 మార్చి 31[9] నాటి స్థితి ప్రకారం, తీసుకున్న ఎ.సి.బిల్లులు / సమర్పించిన డి.సి. బిల్లులు, ఇంకా సర్దుబాటు కావల్సి ఉన్న ఎ.సి.బిల్లుల ఏటా-వారీ వివరాలను ***పట్టిక 4.4*** లో ఇవ్వడం జరిగింది. ఇంకా బకాయి ఉన్న డి.సి.బిల్లుల ఏటా-వారీ వివరాలను ***అనుబంధం 4.1*** లో ఇవ్వడం జరిగింది.

8 జి.ఓ. సంఖ్య 507, తేదీ 10-04-2002

9 2023 మార్చి వరకు ఎ.సి.బిల్లులను డ్రా చేసి, 2023 జూలై నాటికి డి.సి.బిల్లులు సమర్పించిన స్థితి

పట్టిక 4.4: సంవత్సరాల వారీగా తీసుకున్న అనిశ్చిత ఆకస్మిక బిల్లులు, సమర్పించిన వివరణాత్మక బిల్లుల వివరాలు

	డ్రా చేసిన ఎ.సి.బిల్లులు		సమర్పణ అయిన డి.సి.బిల్లులు		సర్దుబాటు కావల్సి ఉన్న ఎ.సి.బిల్లులు	
	సంఖ్య	మొత్తం (₹ కోట్లలో)	సంఖ్య	మొత్తం (₹ కోట్లలో)	సంఖ్య	మొత్తం (₹ కోట్లలో)
2020-21 వరకు	27,542	2,568	27,338	2,507	204	61
2021-22	2,744	700	2,717	635	27	65
2022-23	455	114	365	49	90	65
మొత్తం	30,741	3,382	30,420	3,191	321	191

మూలం: ప్రధాన మహా గణకాధికారి (అకౌంట్స్, ఎన్టైటిల్మెంట్స్) అంద జేసిన సమాచారం

ఆడిటు ఈ కింది అంశాలను గమనించింది:

- గత సంవత్సరం 2021-22 లో ₹159 కోట్ల విలువ గల 496 ఎ.సి. బిల్లులకు 2022 మార్చి 31 నాటికి ఇంకా డి.సి.బిల్లుల సమర్పణ జరుగలేదు. ఇంకా సర్దుబాటు కాని ఎ.సి.బిల్లుల సంఖ్యలో తగ్గుదల ఉన్నా గత సంవత్సరం మార్చి 31 తో పోలిస్తే సర్దుబాటు కాని ఎ.సి.బిల్లుల విలువ పెరిగింది.
- 2022-23 లో డ్రా చేసిన ₹114 కోట్లు విలువగల 455 ఎ.సి.బిల్లులలో, ₹17 కోట్ల (15 శాతం) విలువ గల 23 ఎ.సి.బిల్లులను 2023 మార్చి నెలలోనే డ్రా చేసారని గమనించడం జరిగింది. ₹191 కోట్ల విలువ గల 321 ఎ.సి. బిల్లులకు 2023 మార్చి 31 నాటి వరకు డి.సి.బిల్లులు అందలేదు.
- ఖజానాల ద్వారా, 2022-23 సంవత్సరంలో ₹27 కోట్లు విలువ గల 271 ఎ.సి.బిల్లులను డ్రా చేయడం జరిగింది. గత సంవత్సరం (₹52 కోట్లు) తో పోలిస్తే ఇది తక్కువే. అదే విధంగా, 2023 మార్చి నెలలో ₹0.06 కోటి విలువ చేసే ఒక ఎ.సి.బిల్లును డ్రా చేయడం జరిగింది.2022 మార్చి నెలలో డ్రా చేసిన ఎ.సి. బిల్లులతో పోలిస్తే ఇది కూడా తక్కువే.
- ఖజానాల ద్వారా 2022 ఏప్రిలు నుంచి 2023 జూలై మధ్య కాలంలో ₹75 కోట్లు విలువ గల 574 ఎ.సి.బిల్లులను పరిష్కారం చేయడం జరుగగా, అందులో ₹23 కోట్ల విలువ గల 254 బిల్లులను ప్రస్తుత సంవత్సరం అంటే 2022-23 లోనే తీసుకోవడం జరిగింది. మిగతా ₹52 కోట్ల విలువ చేసే 320 బిల్లులు అంతకు ముందు కాలానికి చెందినవి.
- 2014 నుంచి శాఖల వారీగా అపరిష్కృతంగా ఉన్న డి.సి. బిల్లుల వివరాలు ***అనుబంధం 4.2*** లో ఉన్నాయి. ఇందులో ప్రధానమైన భాగం అంటే ₹101 కోట్ల మేర అపరిష్కృతంగా ఉన్న ఎ.సి. బిల్లులు హోం శాఖకు చెందినవి.

4.6 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలు

వ్యక్తిగత డిపాజిటు (లేదా పర్సనల్ డిపాజిటు లేదా పర్సనల్ లెడ్జరు లేదా పి.డి.) ఖాతాలను రాష్ట్ర ఖజానాలలో బ్యాంకింగ్ ఖాతాల మాదిరిగా నిర్వహించడం జరుగుతుంది. ఒక పథకం కోసం రాష్ట్ర సంచిత నిధి నుంచి బదిలీ చేసి డ్రాయింగ్ ఆఫీసర్ల అధీనంలో ఉంచిన నిధులను ఖర్చు చేసే వెసులుబాటును పి.డి. ఖాతాలు కల్పిస్తాయి.

వ్యక్తిగత డిపాజిటు ఖాతాలు కింద పేర్కొన్న విధంగా ఏర్పాటవుతాయి:

- శాసనవిహితమైన ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేదా ఏదైనా ఒక చట్టం లేక చట్టంతో సమానమైన వర్తింపు గల నియమం ప్రకారం, ప్రత్యేక చట్టాల నుంచి ఏర్పడే ప్రభుత్వ బాధ్యతలను నిర్వర్తించడం కోసం రాష్ట్ర సంచిత నిధి నుంచి నిధులను బదిలీ చేయడం ద్వారా ఈ ఖాతాలు ఏర్పాటవుతాయి.

- వివిధ ప్రాజెక్టులు, పథకాలు వంటి వాటి అమలులో రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతలను నిర్వర్తించడం కొరకు రాష్ట్ర సంచిత నిధి నుండి నిధులను బదిలీ చేయడం ద్వారా నిర్దిష్టమైన ప్రభుత్వాధికారుల పేరిట ఈ ఖాతాలను ఏర్పాటు చేయవచ్చు.

కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ప్రకటన చేసిన పెద్దపద్దు, చిన్నపద్దుల జాబితా ప్రకారం ఈ వ్యక్తిగత డిపాజిటు ఖాతాలు పెద్దపద్దు 8443 - సివిల్ డిపాజిటు - చిన్న పద్దు 106 వ్యక్తిగత డిపాజిట్ల కిందకు వస్తాయి.

4.6.1 వ్యక్తిగత డిపాజిటు ఖాతాల పరిస్థితి

ఈ కింద *పట్టిక 4.5* లో 2023 మార్చి 31 నాటికి వ్యక్తిగత డిపాజిటు ఖాతాల పరిస్థితి ఉంది:

పట్టిక 4.5: వ్యక్తిగత డిపాజిటు ఖాతాల వివరాలు

క్రమ సంఖ్య	వివరం	ఖాతాల సంఖ్య	మొత్తం (₹ కోట్లలో)
1	ఈ సంవత్సరం ఆరంభంలో ఉన్న వ్యక్తిగత డిపాజిటు ఖాతాల సంఖ్య	147[10]	130
2	ఈ సంవత్సరం ఏర్పాటైన కొత్త వ్యక్తిగత డిపాజిటు ఖాతాలు	--	--
3	ఈ సంవత్సరం వ్యక్తిగత డిపాజిటు ఖాతాల్లో జమ అయిన మొత్తం	--	2,013
4	**మొత్తం**	**147**	**2,143**
5	ఈ సంవత్సరంలో జరిగిన చెల్లింపులు	--	1,850
6	ఈ సంవత్సరంలో ప్రభుత్వానికి జప్తు అయిన మొత్తం	--	143
7	ఈ సంవత్సరం మూసివేసిన వ్యక్తిగత డిపాజిటు ఖాతాలు	16	0.01
8	**ఈ సంవత్సరం చివరలో ఉన్న వ్యక్తిగత డిపాజిటు ఖాతాలు**	**131**	**150**

మూలం: ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్ అండ్ ఎన్టైటిల్మెంట్స్) కు ఖజానా లెక్కల డైరెక్టరేటు (డి.టి.ఏ.) అందజేసిన సమాచారం

2022-23 లో రాష్ట్ర సంచిత నిధి నుంచి ఈ ఖాతాలకు ₹2,008 కోట్లు బదిలీ అయ్యాయి. గత సంవత్సరం (₹608 కోట్లు) తో పోలిస్తే ఇది గణనీయంగా 230 శాతం పెరిగింది. మరో ₹5 కోట్లు చలానాల ద్వారా జమ అయింది. సంచిత నిధి నుంచి వ్యక్తిగత డిపాజిటు ఖాతాలకు బదిలీ గణనీయంగా పెరగడం ఈ సంవత్సరం బడ్జెటు మురిగిపోకుండా నివారించడం కోసం అయి ఉండవచ్చు. ఇందులో ₹221 కోట్ల (అంటే సంవత్సరం మొత్తం మీద వ్యక్తిగత డిపాజిటు ఖాతాలకు బదిలీ చేసిన మొత్తంలో 11 శాతం) బదిలీ 2023 మార్చి నెలలోనే జరిగింది. ఆర్థిక సంవత్సరం చివరి రోజు (అంటే, 2023 మార్చి 31) నాడు ₹50 కోట్లు బదిలీ అయ్యాయి.

4.6.2 ఉపయోగంలో లేని వ్యక్తిగత డిపాజిటు ఖాతాలను మూసివేయకపోవడం

తెలంగాణ ఆర్థిక నియమావళి ఒకటో సంపుటి లోని అధికరణ 271 (iii) (4) ప్రకారం, సంచిత నిధి పద్దులో ఖర్చుగా రాయడం ద్వారా వ్యక్తిగత డిపాజిటు ఖాతాలను తెరిచిన సందర్భాలలో, అటువంటి వ్యక్తిగత డిపాజిటు ఖాతాలను సంవత్సరం చివరిలో మిగిలి ఉన్న మొత్తాలను మళ్లీ సంచితనిధి లోని సంబంధిత సేవా పద్దులలో ఖర్చును తగ్గిస్తూ తిరగరాయడం ద్వారా మూసివేయాలి. అవసరమైతే వాటిని తరువాతి సంవత్సరం యథావిధిగా మళ్లీ ప్రారంభించుకోవచ్చు. ఏదైనా వ్యక్తిగత డిపాజిటు ఖాతా కొంత కాలం పాటు ఉపయోగంలో లేకుంటే, ఆ వ్యక్తిగత

---

10 గత సంవత్సరం ముగింపు నిల్వ 146 ఖాతాలలో ₹132 కోట్లు. అయితే సాంకేతిక సమస్య కారణంగా 2021-22 సంవత్సరంలో ఒక డిపాజిటు ఖాతాలో ఉన్న ₹1.83 కోట్ల నిల్వను తగ్గించకుండానే ఆ ఖాతాను మూసివేసినట్లు చూపడం జరుగడంతో గత సంవత్సరం ముగింపు నిల్వకు, ఈ సంవత్సరం ప్రారంభ నిల్వకు మధ్య తేడా ఏర్పడింది. ఇదే కాకుండా, ఒక వ్యక్తిగత డిపాజిటు ఖాతాను 2021-22 లో మరో చోట తెరిచి, ఆ వివరాలను 2022-23 లో తెలియజేయడం వల్ల ఒక వ్యక్తిగత ఖాతా సంఖ్య పెరిగినట్లు కనబడుతోంది.

డిపాజిటు ఖాతా అవసరం తీరిపోయిందని భావించేందుకు తగిన కారణాలు ఉంటే, ఆ వ్యక్తిగత డిపాజిటు ఖాతా ఉన్న సంబంధిత అధికారితో సంప్రదించి ఆ ఖాతాను మూసివేయాలి.

సంవత్సరం చివరకు ఉన్న 131 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలకు గానూ, కేవలం 22 ఖాతాలలో మాత్రమే రాబడి, చెల్లింపులు రెండూ ఉన్నాయి. 32 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలలో రాబడి మాత్రమే ఉండగా, 6 ఖాతాలలో చెల్లింపులు మాత్రమే ఉన్నాయి. **71 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలలో రాబడి, చెల్లింపులు రెండూ కూడా లేకపోవడం అవి 2022-23 లో ఉపయోగంలో లేవు అని సూచిస్తోంది. ఈ 71 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలలో, 46 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలు గత సంవత్సరం కూడా ఉపయోగంలో లేవు. ఉపయోగంలో లేని ఈ వ్యక్తిగత డిపాజిటు ఖాతాలను సమీక్షించి, మూసివేయాలి.**

ప్రభుత్వ ఉత్తర్వులు[11] ప్రకారం, ఒక ఆర్థిక సంవత్సరంలో కేటగిరి 'సి' డిపాజిటు ఖాతాకు విడుదలైన నిధులు తరువాతి సంవత్సరం మార్చి 31 తో రద్దు కావాలి. కాబట్టి, అటువంటి వ్యక్తిగత డిపాజిటు ఖాతాల నిర్వాహకులు ఖర్చు కాకుండా మిగిలిన మొత్తాలను ప్రభుత్వ పద్దుకు తిరిగి జమచేయాలి. ఈ ప్రకారంగా, 2022-23 లో ₹143 కోట్లను రద్దు చేసి ప్రభుత్వానికి జమ చేయడం జరిగింది. అయితే, ఆర్థిక నియమావళి ఒకటో సంపుటి లోని అధికరణ 271 (iii) (4) ప్రకారం సంచితనిధిలోని సంబంధిత పద్దుకు ఖర్చును తగ్గిస్తూ తిరగ రాయడంగా కాకుండా ₹24 లక్షలను రెవెన్యూ పద్దుల కింద రాబడిగా జమ చేయడం జరిగింది.

4.7 పద్దులలో పారదర్శకతలేమి

పద్దుల నియమావళి (అకౌంట్స్ కోడ్) ఒకటో సంపుటిలోని 30 అధికరణ ప్రకారం, ప్రభుత్వ పద్దులలో లావాదేవీల వర్గీకరణ అనేది రాబడి గానీ, ఖర్చు గానీ జరిగే శాఖను బట్టి కాకుండా ప్రభుత్వ కార్యక్రమానికి, విధికి, కార్యకలాపానికి, రాబడి లేదా ఖర్చుకు సంబంధించిన ప్రయోజనానికి సాధ్యమైనంత దగ్గరగా ఉండాలన్నది సాధారణ నియమం. ఒక పెద్ద పద్దు కింద తగిన చిన్న పద్దు లేని సందర్భాలలో మాత్రమే ఇతర రాబడి, ఇతర ఖర్చులకు సంబంధించిన చిన్న పద్దు సంఖ్య - 800 ఉపయోగించాలి. చిన్న పద్దు సంఖ్య -800 ను ఒక మామూలు అలవాటుగా ఉపయోగిస్తూ ఉంటే, పద్దులలో పారదర్శకత తగ్గిపోతుంది. కనుక ఈ చిన్న పద్దు ఉపయోగాన్ని సాధ్యమైనంత పరిహరించాలి. 2018-19 నుంచి 2022-23 వరకు సంవత్సరాలలో ఈ చిన్న పద్దు కింద ఉన్న లావాదేవీల వివరాలను కింది ***పటములలో*** ఇవ్వడం జరిగింది:

పటం 4.2: 2018-19 నుంచి 2022-23 మధ్య కాలంలో చిన్న పద్దు 800 - ఇతర రాబడి పద్దు వినియోగం



మూలం: ఆర్థిక పద్దులు; గమనిక: ఇక్కడ రాబడి అంటే రెవెన్యూ రాబడి మాత్రమే

[11] జి.ఓ.ఎం.ఎస్.సంఖ్య 43, తేది 2000 ఏప్రిలు 22

- గత సంవత్సరంతో పోలిస్తే ఆమాంబాపతు చిన్న పద్దు - 800 వినియోగం 2022-23 సంవత్సరంలో ₹3,940 కోట్లు పెరిగింది. ముఖ్యంగా, "0075 - నానావిధ సాధారణ సేవలు - 81 ఇతర రాబడి - 800 ఇతర రాబడి" కింద ₹4,553 కోట్లు పెరిగింది. అటు తర్వాత ఉన్న కింద స్థాయి వర్గీకరణలో కూడా, అంటే చిన్న పద్దు నుంచి వివరణాత్మక పద్దు వరకు 'ఇతర రాబడి' అని మాత్రమే పేర్కొన్న కారణంగా ఈ రాబడికి సంబంధించిన అసలు స్వరూపాన్ని తేలికగా గుర్తించడం వీలుపడలేదు.

- అంతే కాకుండా, 2022-23 లో చిన్న పద్దు 800 - ఇతర రాబడి కింద వచ్చిన ₹7,904 కోట్లకుగానూ ₹6,560 కోట్లను చిన్న పద్దు 800 - ఇతర రాబడి అని వర్గీకరించడంతో పాటు ఉప పద్దు, వివరణాత్మక పద్దుల స్థాయిలో కూడా ఇతర రాబడి / ఇతర అంశాలు, ఇతర రాబడి / ఇతర అంశాలు / ఇతరాలు అని వర్గీకరించడం జరిగింది. పర్యవసానంగా ఈ రాబడి తాలూక మూలాన్ని గానీ, స్వభావాన్ని గానీ గుర్తించడం కష్టతరం అవుతుంది. నిజానికి, 2023 మార్చి నెలలోనే నిర్దిష్టమైన వివరాలేవీ లేకుండా ₹5,796 కోట్లు జమ అయ్యాయి. ఇందులో, ₹5,562 కోట్లు 'హైదరాబాదు అర్బన్' పే అండ్ అకౌంట్స్ ఆఫీసరు నానావిధ సాధరణ సేవలు కింద జమ చేసినవే. అయితే, డిపాజిటు ఖాతాలలోని మొత్తాలను జప్తు చేసి ఖర్చుకు తగ్గింపుగా తిరగ రాయడానికి బదులుగా ఆ మొత్తాలను ప్రభుత్వ ఖాతాలోకి రెవెన్యూ రాబడిగా జమ చేయడం వల్ల ఇలా జరిగిందని ఆడిట్ పరీక్షలో వెల్లడి అయింది (***పేరాలు 2.4.1.1 (ii), 3.2.2.1*** లను కూడా చూడవచ్చు). అదే విధంగా, పశు సంవర్ధన కింద కూడా 'హైదరాబాదు అర్బన్' ద్వారా ₹171 కోట్లు నిర్దిష్టమైన వివరాలు ఏమీ లేకుండా జమ అయ్యాయి.

  ఇంకా, ***పేరా 4.9*** లో చర్చించినట్లు ఈ పెద్దు పద్దు 0075 - నానావిధ సాధారణ సేవలును ఇంకా సరిపోల్చి చూచుకోవడం జరుగలేదు (2023 ఆగష్టు).

- గత ఐదు సంవత్సరాలుగా, ప్రతి సంవత్సరమూ పెద్ద పద్దు 0075 - నానావిధ సాధారణ సేవల విషయంలో ₹1,000 కోట్లకు మించి రాబడి చిన్న పద్దు 800 - ఇతర రాబడిగా వర్గీకరణ అవుతోంది[12]. అంటే గత ఐదు సంవత్సరాలుగా భారీ స్థాయిలో రాబడి ఇతర రాబడి రూపంలో వర్గీకరణ అవుతోందని దీన్ని బట్టి తెలుస్తోంది.

- పౌర సరఫరాలు, పట్టణాభివృద్ధి, ఇంధనం, మధ్య తరహా సాగునీటి పారుదల, పౌర విమానయానం వంటి 13 రాబడి పెద్ద పద్దుల విషయంలో మొత్తం రాబడి చిన్న పద్దు 800 - ఇతర రాబడిగా వర్గీకరణ అయ్యింది. వీటి మొత్తం ₹205 కోట్లు (వివరాలు ***అనుబంధం 4.3*** లో ఉన్నాయి).

- ఏడు[13] రాబడి పెద్ద పద్దుల విషయంలో, ఒక్కొక్క దానిలోనూ ₹100 కోట్లకు మించి వెరసి ₹7,574 కోట్ల రాబడి చిన్న పద్దు 800 - ఇతర రాబడిగా వర్గీకరణ అయ్యాయి (వివరాలు ***అనుబంధం 4.4*** లో ఉన్నాయి).

- 11 పెద్ద పద్దుల విషయంలో గణనీయమైన భాగం, అంటే 50 శాతం కన్నా ఎక్కువ మొత్తం చిన్న పద్దు 800 - ఇతర రాబడి కింద వర్గీకరణ అయ్యింది (***అనుబంధం 4.5***). వీటి మొత్తం ₹6,294 కోట్లు.

---

[12] 2022-23 లో ₹5,723 కోట్లు, 2021-22 లో ₹1,190 కోట్లు, 2020-21 లో ₹1,201 కోట్లు, 2019-20 లో ₹1,764 కోట్లు, 2018-19 లో ₹2,661 కోట్లు

[13] (i) నానావిధ సాధారణ సేవలు, (ii) ఇనుము కాని ఇతర ఖనిజాల తవ్వకం, లోహ సంబంధ పరిశ్రమలు, (iii) అడవులు, వన్యప్రాణులు, (iv) సేద్యం, (v) స్టాంపులు, రిజిస్ట్రీకరణ రుసుములు, (vi) భారీ నీటిపారుదల, (vii) వాహనాల మీద పన్నులు

పటం 4.3: 2018-19 నుంచి 2022-23 మధ్య కాలంలో చిన్న పద్దు 800 – ఇతర ఖర్చులు పద్దు వినియోగం



మూలం: ఆర్థిక పద్దులు

గమనిక: ఇక్కడ ఖర్చు అంటే నిత్య వ్యావహారిక వ్యయం (అంటే రెవన్యూ ఖర్చులు), మూలధన (అంటే క్యాపిటల్) వ్యయం రెండూ కలిసి ఉన్నాయి

- ఖర్చుల విషయానికి వస్తే ఆమాంబాపతు చిన్న పద్దు 800 వినియోగం ధన విలువ రూపేణా స్వల్పంగా తగ్గింది. గత రెండు సంవత్సరాలుగా ఖర్చుల విషయంలో ఆమాంబాపతు చిన్న పద్దు ఉపయోగం గణనీయంగా తగ్గిందని పై పటాన్ని బట్టి గ్రహించవచ్చు.

- తొమ్మిది ఖర్చుల పెద్ద పద్దుల విషయంలో, ఒక్కొక్క దానిలోనూ ₹100 కోట్లకు మించి, వెరసి ₹1,719 కోట్లు చిన్న పద్దు 800 – ఇతర ఖర్చులుగా వర్గీకరణ అయ్యాయి (వివరాలు ***అనుబంధం 4.6*** లో ఉన్నాయి). ఇందులోని ఆరు[14] పెద్ద పద్దుల విషయంలో ₹100 కోట్లకు మించి గత ఐదు ఆర్థిక సంవత్సరాలుగా చిన్న పద్దు 800 – ఇతర ఖర్చులుగా వర్గీకరణ అవుతూ ఉన్నాయి.

- ఐదు పెద్ద పద్దుల విషయంలో గణనీయమైన భాగం, అంటే 50 శాతం కన్నా ఎక్కువ మొత్తం చిన్న పద్దు 800 – ఇతర ఖర్చులు కింద వర్గీకరణ అయ్యింది (వివరాలు ***అనుబంధం 4.7*** లో ఉన్నాయి). వీటి మొత్తం ₹438 కోట్లు.

- అంతే కాకుండా, ₹74 కోట్ల మొత్తాన్ని అమాంబాపతు చిన్న పద్దు 800 – ఇతర ఖర్చులుగా వర్గీకరించడమే కాకుండా కింది స్థాయిలోని ఉప పద్దులు, వివరణాత్మక పద్దులను కూడా ఇతర ఖర్చులు, ఇతర చార్జీలు అని వర్గీకరించడం వల్ల ఖర్చు స్వభావాన్ని, ప్రయోజనాన్ని గుర్తించడం కష్టం అవుతోంది. నిర్దిష్టమైన వివరాలు లేని ఈ విధమైన ఖర్చు అంతా 'ప్రకృతి వైపరీత్యాలలో ఉపశమనం' కింద అయింది.

అమాంబాపతు చిన్న పద్దు 800 – ఇతర రాబడి / ఇతర ఖర్చులు పద్దులను విచ్చలవిడిగా ఉపయోగిస్తే పద్దులలో పారదర్శకత తగ్గుతుంది. ఇది అవాంఛనీయం. మొత్తాలను అమాంబాపతు చిన్న పద్దు 800 కింద వర్గీకరించడం ఆర్థిక నివేదనలో పారదర్శకతను ప్రభావితం చేస్తుంది. అది రాబడి, ఖర్చుల నాణ్యతను, కేటాయింపు ప్రాధాన్యాల విశ్లేషణలో వక్రీకరణకు దారి తీస్తుంది.

---

[14] (i) భారీ నీటిపారుదల మీద మూలధన పరివ్యయం, (ii) షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం, (iii) రహదారులు వంతెనల మీద మూలధన పరివ్యయం, (iv) ఇతర సాధారణ ఆర్థిక సేవల మీద మూలధన పరివ్యయం, (v) షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం మీద మూలధన పరివ్యయం, (vi) పింఛనులు, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలు

పేటిక 4.1: వివరణాత్మక పద్దు -500 కింద ఇతర ఛార్జీలుగా వర్గీకరించడం

వివరణాత్మక పద్దు స్థాయిలో కూడా ఖర్చులను 'ఇతర చార్జీలు'గా వర్గీకరించిన కారణంగా ఖర్చుకు సంబంధించిన స్వభావం / రూపం / ప్రయోజనాన్ని గుర్తించడం కష్టమౌతుంది. 2022-23 లో వివరణాత్మక పద్దు 500 - ఇతర ఛార్జీల కింద అయిన ఖర్చు ₹3,633 కోట్లు (మొత్తం వ్యయంలో 2.12 శాతం). ఇందులో చిన్న పద్దు - 800 ఇతర ఖర్చుల కింద అయిన వ్యయం ₹370 కోట్లు కాగా, మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద అయిన ఖర్చు ₹1,483 కోట్లు. భారీ మొత్తాలను వివరణాత్మక పద్దు - 500 ఇతర చార్జీలు కింద వర్గీకరించడం ఆర్థిక నివేదనలో పారదర్శకతను ప్రభావితం చేస్తుంది.

4.7.1 నిర్దిష్టమైన చిన్న పద్దులు అందుబాటులో ఉన్నా అమాంబాపతు చిన్న పద్దు - 800 ను ఉపయోగించడం

ఈ కింది ఉదంతాల్లో నిర్దిష్టమైన చిన్న పద్దు అందుబాటులో ఉన్నా గానీ (సరిపోలే ఉప పద్దుతో / వివరణాత్మక పద్దుతో మేళవించి) అమాంబాపతు చిన్న పద్దు - 800 ను ఉపయోగించడం జరిగింది:

పట్టిక 4.6: నిర్దిష్టమైన చిన్న పద్దు అందుబాటులో ఉన్నా, సరిపోలే ఉప పద్దుతో మేళవించి అమాంబాపతు చిన్న పద్దు 800 ను ఉపయోగించడం

క్రమ సంఖ్య	చిన్న పద్దు - 800 కింద వర్గీకరణ	ఉపయోగించిన ఉప పద్దు వివరం	వాస్తవంగా ఉపయోగించాల్సిన సంబంధిత నిర్దిష్టమైన చిన్న పద్దు	అందుబాటులో ఉన్న సంబంధిత చిన్న పద్దు వివరం	మొత్తం (₹ లక్షలలో)
రాబడి					
1	0070-60-800-25	సమాచార హక్కు చట్టం, 2005 కింద రాబడి	0070-60-118	సమాచార హక్కు చట్టం, 2005 కింద రాబడి	1.33
2	0202-04-800-01	పురాతన వస్తు శాఖ రాబడి	0202-04-101	పురాతన వస్తువులు, ప్రదర్శనశాలలు	53.71

మూలం: ఆర్థిక పద్దులు

నిర్దిష్టమైన చిన్న పద్దులు అందుబాటులో ఉన్నా గానీ, అమాంబాపతు చిన్న పద్దు -800 కింద రాబడి, ఖర్చులను వర్గీకరించడం పద్దులలో రాబడి ఖర్చులను ఖచ్చితంగా ప్రదర్శించే విషయంలో ఉదాసీనతను సూచిస్తోంది.

కొలమానానికి సంబంధించిన అంశాలు

4.8 అనామతు, డి.డి.ఆర్. పద్దుల కింద ఉన్న నిల్వలు

సర్దుబాటుకు సంబంధించి అన్ని లావాదేవీలను నమోదు చేయడం కోసం 'అనామతు', 'జమ' పద్దులు ఉన్నాయి. ఖజానాలు / పే అండ్ అకౌంట్స్ అధికారులు షెడ్యూల్ ఆఫ్ సెటిల్మెంట్ పంపకపోవడం, భారతీయ రిజర్వు బ్యాంకు నుంచి క్లియరెన్స్ మెమోలు అందకపోవడం, ఓచర్లు అందకపోవడం వంటి వాటి వల్ల సమాచారం లేని కారణంగా రాబడిని గానీ, ఖర్చులను గానీ నిశ్చయంగా తుది పద్దుకు లెక్క రాయడం వీలుపడని లావాదేవీలను నమోదు చేయడం కొరకు ప్రభుత్వ పద్దులలో 'అనామతు పద్దుల' పేరిట కొన్ని మధ్యంతర / సర్దుబాటు పద్దులను తెరుస్తారు. సమాచారాన్ని సంబంధిత తుది పద్దుల కింద నమోదు చేసేటప్పుడు ఈ అనామతు పద్దులను మైనస్ డెబిట్ ద్వారా గానీ మైనస్ క్రెడిట్ ద్వారా గానీ సర్దుబాటు చేసి పరిష్కరించడం జరుగుతుంది. ఈ పద్దులలో ఉన్న మొత్తాలు పరిష్కారం కాకుండా ఉంటే, అనామతు పద్దుల కింద ఉన్న నిల్వలు పేరుకుని పోయి, ప్రభుత్వ రాబడి, ఖర్చుల పద్దులు సరైన పరిస్థితిని ప్రతిబింబించవు.

'జమ (రెమిటెన్సు)' లలో పద్దులను సర్దుబాటు చేసేందుకు చేపట్టే అన్ని లావాదేవీలు ఉంటాయి. ఈ పద్దుల కింద డెబిట్లు లేదా క్రెడిట్లు అంతిమంగా ఒకే సర్కిల్ లోగానీ వేరే సర్కిల్ లో గానీ సంబంధిత క్రెడిట్ల లేదా డెబిట్ల ద్వారా సర్దుబాటు అవుతాయి.

గత మూడు సంవత్సరాలలో అనామతు, జమ పద్దుల కింద ఉన్న నిల్వ పరిస్థితి ఈ కింద *పట్టిక 4.7* లో ఇవ్వడం జరిగింది:

పట్టిక 4.7: అనామతు, జమ పద్దుల కింద నిల్వలు

(₹ కోట్లలో)

చిన్న పద్దు	2020-21		2021-22		2022-23	
	డెబిట్	క్రెడిట్	డెబిట్	క్రెడిట్	డెబిట్	క్రెడిట్
పెద్ద పద్దు 8658 – అనామతు						
101 – పి.ఎ.ఓ. అనామతు	547.13	405.16	701.11	608.09	870.97	798.90
నికర నిల్వ		డెబిట్ 141.97		డెబిట్ 93.02		డెబిట్ 72.07
102 – అనామతు ఖాతా సివిల్	1,358.34	1,605.59	2,975.95	3,399.80	5,117.83	5,548.16
నికర నిల్వ		క్రెడిట్ 247.25		క్రెడిట్ 423.85		క్రెడిట్ 430.33
109 – రిజర్వు బ్యాంకు అనామతు -ప్రధాన కార్యాలయం	5.22	(-)0.33	5.23	2.78	5.22	2.72
నికర నిల్వ		డెబిట్ 5.55		డెబిట్ 2.45		డెబిట్ 2.50
110 – రిజర్వు బ్యాంకు అనామతు – పి.ఎ.ఓ.	(-)10.88	(-)11.28	(-)10.98	(-)11.38	0.10	(-)0.14
నికర నిల్వ		క్రెడిట్ 0.40		క్రెడిట్ 0.40		డెబిట్ 0.24
112 – మూలం వద్ద మినహాయించిన పన్ను (టి.డి.ఎస్.) అనామతు	(-)0.01	92.10	(-)0.01	618.68	(-)0.00	938.00
నికర నిల్వ		క్రెడిట్ 92.11		క్రెడిట్ 618.69		క్రెడిట్ 938.00
123 - అఖిల భారత సేవా అధికారుల సామూహిక బీమా పథకం	0.01	0.09	0.00	0.11	0.00	0.13
నికర నిల్వ		క్రెడిట్ 0.08		క్రెడిట్ 0.11		క్రెడిట్ 0.13
పెద్ద పద్దు 8782 - నగదు జమలు						
102 – ప్రజా పనుల కింద జమలు	265.69	159.74	154.03	169.07	144.99	142.35
నికర నిల్వ		డెబిట్ 309.79		డెబిట్ 294.75		డెబిట్ 297.39
103 – అటవీ శాఖ జమలు	430.35	531.21	392.62	960.33	746.13	286.43
నికర నిల్వ		క్రెడిట్ 488.32		క్రెడిట్ 1,056.03		క్రెడిట్ 596.33
పెద్ద పద్దు 8793 – రాష్ట్రాల మధ్య అనామతు ఖాతా	102.42	29.47	68.45	29.51	72.03	29.36
నికర నిల్వ		డెబిట్ 72.95		డెబిట్ 38.94		డెబిట్ 42.67

మూలం: ఆర్థిక పద్దులు

అనామతు పద్దు (సివిల్) 8658-102 కింద పెరుగుదల ప్రధానంగా (i) రైతు బంధు కింద తిరిగి జమ చేయాల్సిన చలానాలు, జీతాలు, వ్యక్తిగత డిపాజిటు ఖాతా చలానాలు వంటి ఇ-చెల్లింపుల కింద ఇంకా జమ చేయకపోవడం వల్ల, (ii) ముఖ్యంగా సాగునీటి పారుదల విషయంలో పి.ఎ.ఓ. చెక్కులను తిరిగి పంపడం వల్ల ఏర్పడింది. అనామతు పద్దు 8658-112 మూలం వద్ద మినహాయించిన పన్ను (టి.డి.ఎస్.) అనామతు పద్దు కింద గత సంవత్సరంలో ఉన్న ₹619 కోట్లతో పోలిస్తే ఈ సంవత్సరం ₹938 కోట్లకు పెరిగింది.

ప్రజా పనుల కింద జమల పద్దులో సర్దుబాటు కావల్సి ఉన్న నిల్వ ₹295 కోట్ల నుంచి ₹297 కోట్లకు స్వల్పంగా పెరిగింది. అయితే, అటవీ శాఖ జమల విషయంలో సర్దుబాటు కావల్సి ఉన్న నిల్వ మొత్తం ₹1,056 కోట్ల నుంచి ₹596 కోట్లకు తగ్గింది.

ఈ పద్దుల కింద సర్దుబాటు కాకుండా మిగిలి ఉన్న మొత్తాలు ప్రభుత్వ రాబడి, ఖర్చులను ఖచ్చితంగా ప్రదర్శించే అంశం మీద ప్రభావం చూపుతుంది.

4.9 పద్దులలో గణాంకాలను సరిపోల్చి చూసుకోవడం

ఆర్థిక పద్దులలో ఖచ్చితత్వాన్ని, స్థిరత్వాన్ని ధ్రువీకరించుకోవడం కోసం నియతకాలికంగానూ, క్రమం తప్పకుండానూ పద్దులను సరిపోల్చి చూచుకోవాల్సిన అవసరం ఉందని సాధారణంగా ఆమోదయోగ్యమైన అకౌంటింగ్ సూత్రాలు నిర్దేశిస్తున్నాయి. పద్దులను సరిపోల్చి, గణంకాలను సరిచూసుకోవడం వల్ల ముఖ్య నియంత్రణాధికారులకు (సి.సి.ఓ.లు) బడ్జెటును, ఖర్చులను ప్రభావవంతంగా నియంత్రించే వీలు కలుగుతుంది. దీనివల్ల పద్దులలో ఖచ్చితత్వాన్ని కూడా ధ్రువీకరించుకోవచ్చు. ప్రభుత్వ శాఖల ముఖ్య నియంత్రణాధికారుల పద్దుల పుస్తకాలలో నమోదు చేసిన ఖర్చులను ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్ అండ్ ఎన్టైటిల్మెంట్స్) పద్దు పుస్తకాలలోని లెక్కలతో ప్రతి నెలా సరి పోల్చి చూసుకోవాలని ప్రభుత్వ ఉత్తర్వులు[15], ఆర్థిక నియమాలు[16] నిబంధిస్తున్నాయి.

పట్టిక 4.8: రాబడి, ఖర్చులను సరిపోల్చి చూసుకునే విషయంలో పరిస్థితి

సంవత్సరం	మొత్తం నియంత్రణాధికారుల సంఖ్య	పూర్తిగా సరిపోల్చి చూచుకున్న నియంత్రణాధికారుల సంఖ్య	పాక్షికంగా సరిపోల్చి చూచుకున్న నియంత్రణాధికారుల సంఖ్య	అసలు సరిపోల్చి చూచుకోని నియంత్రణాధికారుల సంఖ్య
రాబడి				
2018-19	39	15	10	14
2019-20	38	9	23	6
2020-21	54	15	6	33
2021-22	59	19	12	28
2022-23	58	20	9	29
ఖర్చు				
2018-19	281	191	51	39
2019-20	196	63	94	39
2020-21	194	95	63	36
2021-22	198	108	72	18
2022-23	196	85	86	25

మూలం: ఆర్థిక పద్దులు

గమనిక: ఖర్చుల విషయంలో 2018-19 వరకు అంకెలు పెద్ద పద్దుల వారీగా, అటు తర్వాత ముఖ్య నియంత్రణాధికారుల వారీగా, రాబడి విషయంలో పెద్ద పద్దుల వారీగా

ధనరూపేణా చూస్తే 2022-23 లో, ₹1,48,579 కోట్ల రాబడి (అంటే మొత్తం రెవెన్యూ రాబడిలో 93 శాతం), ₹1,59,802 కోట్ల ఖర్చు (అంటే మొత్తం ఖర్చులో 93 శాతం) ను సరిపోల్చి చూచుకోవడం జరిగింది. మొత్తం మీద ₹10,771 కోట్ల మేర రాబడిని, ₹11,485 కోట్ల మేర ఖర్చులను సరిపోల్చి చూచుకోవడం జరుగలేదు.

- 2022-23 లో రెవెన్యూ రాబడి విషయంలో నాలుగు పెద్ద పద్దుల (***అనుబంధం 4.8***) కింద, ఒక్కొక్క ఉదంతంలోనూ ₹100 కోట్లకు మించి, వెరసి ₹10,329 కోట్ల మేర మొత్తాన్ని ఇంకా (2023 ఆగష్టు) సరిపోల్చి చూచుకోవాల్సి ఉంది. రాబడి సరిపోల్చని అంశాలలో నానావిధ సాధారణ సేవలు (పెద్ద పద్దు 0075) ఒక్కటే 91 శాతం (₹9,800 కోట్లు) ఉంది.

  అంతే కాకుండా, ఈ ₹9,800 కోట్లలో ₹5,714 కోట్ల రాబడి విషయంలో చిన్న పద్దు, ఉప పద్దు, వివరణాత్మక పద్దుల స్థాయిలో 'ఇతర రాబడి' అని వర్గీకరణ అయ్యి, ఇంకా సరిపోల్చి చూచుకోవడం జరుగలేదు. అందువల్ల, ***పేరా 4.7*** లో చర్చించినట్లు పారదర్శకత మీద, ఖచ్చితత్వం మీద ప్రతికూల ప్రభావం పడుతుంది.

---

[15] ఆర్థిక (టి.ఎఫ్.ఆర్.) శాఖ జి.ఓ.ఎం.ఎస్. సంఖ్య 507, తేదీ 2002 ఏప్రిల్ 10

[16] ఆర్థిక నియమావళిలోని అధికరణ 9

- ఒక పెద్ద పద్దు[17] విషయంలో గత మూడు సంవత్సరాలుగా ₹100 కోట్లకు మించిన రాబడి సరిపోల్చి చూచుకోకుండా ఉంది.
- ఒక్కొక్క ఉదంతంలోనూ ₹100 కోట్లకు పైగా ఖర్చును, వెరసి మొత్తంగా ₹10,425 కోట్ల మేర ఖర్చులను సరిపోల్చి చూడని ముఖ్య నియంత్రణాధికారులు 20 మంది ఉన్నారు (***అనుబంధం 4.9***). ఇందులో నలుగురు ముఖ్య నియంత్రణాధికారులు, ఒక్కొక్కరూ ₹1,000 కోట్లకు పైగా, వెరసి మొత్తంగా ₹5,717 కోట్ల ఖర్చును ఇంకా సరిపోల్చి చూచుకోలేదు.
- గిరిజన సంక్షేమ శాఖ కమీషనరు కార్యాలయంలోని అకౌంట్స్ అధికారి[18] వరుసగా గత ఐదు సంవత్సరాలుగా ₹100 కోట్లకు పైగా సరిపోల్చి చూచుకోవడం లేదు.

లెక్కలను సరిపోల్చి చూసుకోకపోతే, రాబడి / ఖర్చులు తుది పద్దులలో సక్రమంగానే నమోదు అయ్యాయనే భరోసా మీద ప్రభావం పడుతుంది. ఇటువంటి సరిపోల్చి చూచుకునే పరీక్షను నిర్వహించకపోవడం వల్ల పద్దుల్లో రాబడి, ఖర్చులు తప్పుగా నమోదు అయ్యేందుకు, వాటి తప్పుడు వర్గీకరణకు ఆస్కారం ఏర్పడుతుంది.

4.10 నగదు నిల్వలను సరిపోల్చి చూసుకోవడం

పద్దులలో నివేదించిన నగదు నిల్వ అంటే రిజర్వు బ్యాంకు లోని కేంద్ర లెక్కల విభాగంలో రాష్ట్ర ప్రభుత్వం పద్దులో మార్చి 31 నాటికి నమోదు అయి ఉన్న రాష్ట్ర నిల్వ. నగదు నిల్వ అంటే రాష్ట్రానికి సంబంధించి సంచిత నిధి, ఆకస్మిక ఖర్చుల నిధి, ప్రజా పద్దులలోని నగదు లావాదేవీలు పిదప ఉన్న నిల్వ. ఆర్థిక పద్దులలో నివేదించిన నగదు నిల్వ భారత రిజర్వు బ్యాంకు పద్దు పుస్తకాలతో పోల్చి చూచిన పిదప మారే అవకాశం ఉంటుంది. సిద్ధాంత పరంగా చూస్తే, ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్ అండ్ ఎన్టైటిల్మెంట్స్) పద్దు పుస్తకాల ప్రకారం ఉన్న రాష్ట్ర నగదు నిల్వ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదించిన నగదు నిల్వతో సరిపోవాలి.

2023 మార్చి 31 నాటికి, ప్రధాన మహాగణకాధికారి (అకౌంట్స్ అండ్ ఎన్టైటిల్మెంట్స్) పద్దు పుస్తకాల ప్రకారం ₹34.78 కోట్ల నగదు నిల్వ (డెబిట్) ఉండగా, రిజర్వు బ్యాంకు ప్రకారం ₹33.81 కోట్లు నగదు నిల్వ (క్రెడిట్) ఉంది. ముఖ్యంగా నివేదనలో బ్యాంకుల జాప్యం కారణంగా 2023 మార్చి 31 నాటికి రెండింటి పద్దు పుస్తకాల మధ్య ₹0.97 కోట్ల (డెబిట్) నికర వ్యత్యాసం ఉంది.

వెల్లడింపుకు సంబంధించిన అంశాలు

4.11 భారత ప్రభుత్వ అకౌంటింగ్ ప్రమాణాల పాటింపు

భారత రాజ్యాంగంలోని అధికరణ 150 ప్రకారం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పద్దుల రూపురేఖలను భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ సలహా మేరకు భారత రాష్ట్రపతి నిర్దేశించవచ్చు. ఈ నిబంధనను అనుసరించి, భారత రాష్ట్రపతి ఇప్పటి వరకు నాలుగు[19] భారత ప్రభుత్వ అకౌంటింగ్ ప్రమాణాలను (ఇండియన్ గవర్నమెంట్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ - ఐ.జి.ఏ.ఎస్.) ప్రకటించారు. 2022-23 లో తెలంగాణ ప్రభుత్వం ద్వారా ఈ ప్రమాణాల పాటింపులు, అందులోని లోటుపాట్లను ***పట్టిక 4.9*** లో వివరించడం జరిగింది.

---

[17] వైద్యం, ప్రజారోగ్యం (పెద్ద పద్దు - 0210) - 2022-23 లో ₹246 కోట్లు, 2021-22 లో ₹406 కోట్లు, 2020-21 లో ₹246 కోట్లు

[18] (i) 2022-23 లో ₹682 కోట్లు; (ii) 2021-22 లో ₹1,071 కోట్లు; (iii) 2020-21 లో ₹952 కోట్లు; (iv) 2019-20 లో ₹114 కోట్లు; (v) 2018-19 లో ₹659 కోట్లు

[19] భారత ప్రభుత్వ అకౌంటింగు ప్రమాణం 4 - గత కాలానికి చెందిన సర్దుబాట్లు అనే ప్రమాణాన్ని 2023 మార్చి 2 న ప్రకటించడం జరిగింది. ఈ ప్రమాణం 2023 ఏప్రిలు 1 నాటి నుంచి మొదలయ్యే ఆర్థిక వివరణ ప్రకటనలకు వర్తిస్తుంది.

పట్టిక 4.9: అకౌంటింగు ప్రమాణాల పాటింపు

క్రమ సంఖ్య	అకౌంటింగ్ ప్రమాణం	ప్రమాణంలోని సారాంశం	రాష్ట్ర ప్రభుత్వం పాటింపు	పాటింపు విషయంలో గమనించిన లోటు పాట్లు
1	ఐ.జి.ఏ.ఎస్. 1: ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తులు – వెల్లడించాల్సిన అంశాలు	ఈ ప్రమాణం ప్రకారం సంవత్సరంలో గరిష్టంగా ఇచ్చిన పూచీకత్తుల మొత్తాన్ని ప్రభుత్వం ఆర్థిక వివరణ ప్రకటనలలో వెల్లడి చేయాలి. దానితో పాటే కొత్తగా ఇచ్చిన పూచీకత్తులను, ఉపసంహరించిన పూచీకత్తులను, ధనం కోరిన పూచీకత్తులను, ఋణాల చెల్లింపు పూర్తి అయిన పూచీకత్తులను, ఏడాది ముగిసే నాటికి మిగిలిన ఇచ్చి ఉన్న పూచీకత్తులను వెల్లడి చేయాలి.	పాటింపు పూర్తిగా లేదు (ఆర్థిక పద్దుల్లోని ప్రకటన పట్టికలు 9, 20)	• తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషనుకు ఇచ్చిన ₹50,000 కోట్ల పూచీకత్తులను, విద్యుత్తు రంగంలో ఇచ్చిన ₹16,000 కోట్ల పూచీకత్తులను ప్రభుత్వం వెల్లడించలేదు. • రంగాల వారీగా / వర్గీకరణ వారీగా వివరాలను వెల్లడించినా, ఒక్కో సంస్థకు ఇచ్చిన పూచీకత్తుల సంఖ్య వంటి వివరాలను వెల్లడించలేదు. • 2022-23 లో చెల్లించినా, చెల్లించకపోయినా, ధనం కోరిన పూచీకత్తుల వివరాలను వెల్లడించలేదు.
2	ఐ.జి.ఏ.ఎస్. 2: సహాయక గ్రాంట్ల వర్గీకరణ, అకౌంటింగ్	సహాయక గ్రాంట్ల తుది వినియోగంతో సంబంధం లేకుండా ఇచ్చిన వారి పద్దు పుస్తకాలలో వాటిని వ్యావహారిక వ్యయం (అంటే, రెవెన్యూ ఖర్చులుగా), తీసుకున్న వారి పద్దు పుస్తకాలలో రెవెన్యూ రాబడిగానూ వర్గీకరించాలి.	పాటింపు పూర్తిగా లేదు (ఆర్థిక పద్దుల్లోని ప్రకటన పట్టిక 10)	• అకౌంటింగ్ ప్రమాణాలకు భిన్నంగా కొన్ని సహాయక గ్రాంట్లు (₹5.09 కోట్లు) క్యాపిటల్ విభాగం కింద వర్గీకరణ అయ్యాయి. • సహాయక గ్రాంట్లకు సంబంధించిన పూర్తి వివరాలను రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించలేదు.
3	ఐ.జి.ఏ.ఎస్. 3: ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులు	ఈ ప్రమాణం సంపూర్ణత్వం, ఖచ్చితత్వం, ఏకరూపమైన అకౌంటింగు పద్ధతులు ఉండేలా ధ్రువీకరించుకోవడం కోసం ప్రభుత్వం ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సుల విషయంలో ఆర్థిక ప్రకటనలలో గుర్తింపు, కొలమానం, వెలకట్టడం, నివేదించడం వంటి వాటికి సంబంధించింది.	పాటింపు పూర్తిగా లేదు (ఆర్థిక పద్దుల్లోని ప్రకటన పట్టికలు 7, 18)	ఇచ్చిన ఋణాల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం / ఋణాలు తీసుకున్న కొన్ని సంస్థలు ధ్రువీకరించలేదు.

మూలం: భారత ప్రభుత్వ అకౌంటింగ్ ప్రమాణాలు, ఆర్థిక పద్దులు

అకౌంటింగ్ ప్రమాణాలను పాటించకపోవడం వల్ల ద్రవ్యపరమైన పారదర్శకత ప్రభావితం కావడమే కాకుండా, ఆర్థికాంశాలను నిజమైన, సముచితమైన రీతిలో ప్రదర్శించేందుకు ఆటంకం అవుతుంది.

4.12 స్వయంపాలక సంస్థల ద్వారా పద్దుల సమర్పణ / ప్రత్యేక ఆడిటు నివేదికలు

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వయంపాలక సంస్థల పద్దుల ధ్రువీకరణ "భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సేవా నిబంధనలు చట్టం) 1971" (డి.పి.సి. చట్టం) లోని సెక్షను 19 లేదా 20 కింద జరుగుతుంది.

డి.పి.సి. చట్టం సెక్షను 19 లేదా 20 కింద ఆడిటు పరిధిలో ఉన్న 31 స్వయంపాలక సంస్థలు సి.ఏ.జి.కి వార్షిక పద్దులను ప్రతి సంవత్సరం జూన్ 30 లోగా సమర్పించాలి. ఈ 31 సంస్థలలో, రెండు సంస్థలు[20] మాత్రమే 2022-23 వరకు పద్దులను సమర్పించాయి.

పట్టిక 4.10: స్వయంపాలక సంస్థల వార్షిక పద్దుల సమర్పణలో జాప్యాల వివరాలు

క్రమ సంఖ్య	జాప్యపు సంవత్సరాలు సంఖ్య	స్వయంపాలక సంస్థల సంఖ్య
1	1	6
2	2-5	10
3	6-10	10
4	11-16	3
మొత్తం		29

మిగిలిన 29 స్వయంపాలక సంస్థలు గడువు లోపల వార్షిక పద్దులను సమర్పించలేదు. వాటి పద్దులను సమర్పించడంలో ఒకటి నుంచి పదహారు సంవత్సరాల జాప్యాలు ఉన్నాయి (*పట్టిక 4.10*).

- వార్షిక పద్దులు బకాయిల్లో ఉన్న 29 స్వయం పాలక సంస్థలలో (***అనుబంధం 4.10***), 10 స్వయం పాలక సంస్థలు న్యాయ సేవా ప్రాధికార సంస్థలే. వీటిలో వరంగల్లు జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఏడు సంవత్సరాలుగా, ఆదిలాబాదు జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఆరు సంవత్సరాలుగా, హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఐదు సంవత్సరాలుగా వార్షిక పద్దులను సమర్పించలేదు.

- ఏటూరునాగారం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ 16 సంవత్సరాలుగా, ఉట్నూరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ 14 సంవత్సరాలుగా, భద్రాచలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ 13 సంవత్సరాలుగా వార్షిక పద్దులను సమర్పించలేదు.

- రాష్ట్ర ప్రభుత్వం ఆడిటును అప్పగించినా, వార్షిక పద్దులు అందని కారణంగా 11[21] స్వయంపాలక సంస్థల ఆడిటును చేపట్టడం జరుగలేదు.

- 29 స్వయం పాలక సంస్థలలో, ఆరు సంస్థల ఆడిటును సి.ఏ.జి.కి అప్పగించడం జరుగలేదు. ఇందులో తెలంగాణ వైద్య విధాన పరిషత్తు 2019-20 నుంచి, తెలంగాణ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు 2020-21 నుంచి తమ పద్దుల ఆడిటును అప్పగించలేదు. తెలంగాణ వైద్య విధాన పరిషత్తుకు 2019-20 నుంచి 2022-23 వరకు ₹2,824 కోట్లు, తెలంగాణ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డుకు 2020-21 నుంచి 2022-23 వరకు ₹13 కోట్లు సహాయక గ్రాంట్లు అందాయి. అదే విధంగా, నాలుగు[22] స్వయంపాలక సంస్థలు కూడా తమ పద్దుల ఆడిటును 2022-23 నుంచి అప్పగించలేదు.

- హైదరాబాదు మహానగర నీటి సరఫరా, మురుగుపారుదల బోర్డు (బోర్డు) కు సంబంధించి, 2020-21 నుంచి మూడు సంవత్సరాల పద్దులు బకాయిల్లో ఉన్నాయి. పద్దుల సమర్పణలో జాప్యం ఉన్నా కూడా, ప్రభుత్వం బోర్డుకు ఋణాలు, పూచీకత్తులు అందజేస్తూ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 2022-23 లో బోర్డుకు ₹1,450 కోట్ల

---

[20] (i) నిజామాబాదు జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ, (ii) మెదక్ జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ

[21] (i) ఏటూరు నాగారం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, (ii) భద్రాచలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, (iii) సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, మైదాన ప్రాంతాలు, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు, (iv) ఉట్నూరు సమీకృత గిరిజనాభివృద్ధి, (v) శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ, (vi) స్తంభాద్రి పట్టణాభివృద్ధి సంస్థ, ఖమ్మం, (vii) నిజామాబాదు పట్టణాభివృద్ధి సంస్థ, (viii) సిద్దిపేట పట్టణాభివృద్ధి సంస్థ, (ix) కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, (x) తెలంగాణ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు, (xi) తెలంగాణ వైద్య విధాన పరిషత్తు

[22] (i) స్తంభాద్రి పట్టణాభివృద్ధి సంస్థ, (ii) శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ, (iii) నిజామాబాదు పట్టణాభివృద్ధి సంస్థ, (iv) సిద్దిపేట పట్టణాభివృద్ధి సంస్థ

ఋణాలు ఇవ్వగా, 2023 మార్చి చివరి నాటికి ఇచ్చి ఉన్న ఋణాల మొత్తం ₹10,338 కోట్లు. అంతే కాకుండా, 2023 మార్చి నాటికి రాష్ట్ర ప్రభుత్వం బోర్డుకు ఇచ్చి ఉన్న మొత్తం పూచీకత్తుల విలువ ₹2,567 కోట్లు.

వార్షిక పద్దుల సమర్పణలో జాప్యం సంస్థల జవాబుదారీతనాన్ని బలహీనం చేస్తుంది. ఋణాలను, పూచీకత్తులను, గ్రాంట్లను అందుకుంటున్న స్వయంపాలక సంస్థలు సమర్పిస్తున్న ఆర్థిక ప్రకటనలు నిజమైన, సముచితమైన ఆర్థిక స్థితినే ప్రతిబింబిస్తున్నాయని నిర్ధారించుకోవడం కోసం అవి వార్షిక పద్దులను సకాలంలో తయారు చేసి, సమర్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించుకోవాలి. ముఖ్యంగా మహానగర నీటి సరఫరా, మురుగుపారుదల బోర్డుకు భారీ మొత్తాలను ఋణాలుగా ఇచ్చి, భారీ మొత్తాలకు పూచీకత్తులు ఇచ్చినందువల్ల ఆ సంస్థకు ప్రాథమ్యం ఇచ్చి వార్షిక పద్దులను సమర్పించేలా ప్రభుత్వం నిర్ధారించుకోవాలి.

4.13 సంస్థలు, ప్రాధికార సంస్థలకు ఇచ్చిన గ్రాంట్లు / ఋణాల వివరాలను సమర్పించకపోవడం

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సేవా నిబంధనలు) చట్టం 1971 (డి.పి.సి. చట్టం) లోని 14, 15 సెక్షన్ల కింద ఆడిటు చేయదగిన సంస్థలను గుర్తించే నిమిత్తం, గ్రాంట్లు / ఋణాల రూపేణా ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన సమాచారం అవసరం. ఆడిట్, అకౌంట్స్ నిబంధనలు 2020 లోని నిబంధన 88 ప్రకారం (ఎ) అందజేసిన సహాయం మొత్తం, (బి) సహాయం మంజూరు అయిన ప్రయోజనం, (సి) సదరు సంస్థ లేదా ప్రాధికార సంస్థ మొత్తం ఖర్చులను సూచిస్తూ ప్రతి సంవత్సరం జూలై చివరి నాటికి అంతకు ముందు సంవత్సరంలో పది లక్షల రూపాయలు లేదా అంత కన్నా ఎక్కువ మొత్తం గ్రాంట్లు మరియు / లేదా ఋణాల మంజూరీ పొందిన సంస్థలు, ప్రాధికార సంస్థల వివరాలను ఆయా సంస్థలు లేదా ప్రాధికార సంస్థలకు గ్రాంట్లు మరియు / లేదా ఋణాలు మంజూరు చేసే ప్రభుత్వాలు, శాఖాధిపతులు ఆడిటు కార్యాలయానికి సమర్పించాలి.

అయితే, 2022-23 సంవత్సరంలో ఐదు శాఖలు[23] గ్రాంట్లు మరియు/లేదా ఋణాలను అందుకున్న సంస్థలు, ప్రాధికార సంస్థల వివరాలను అందజేశాయి. ఆడిటు ప్రత్యేకించి కోరిన పిదప కేవలం 53 కార్పొరేషన్లు / సంస్థలు (***అనుబంధం 4.11***) సమాచారాన్ని అందజేశాయి. ఇతర కార్పోరేషన్లు / సంస్థలు / శాఖల నుంచి సమాచారం లేదు (2023 ఆగష్టు). సమాచారం లేని కారణంగా భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సేవా నిబంధనలు) చట్టం 1971 (డి.పి.సి. చట్టం) లోని 14, 15 సెక్షన్ల కింద ఆడిటు చేయాల్సిన సంస్థలను మదింపు వేయడం సాధ్యపడలేదు.

4.14 రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిటు నివేదికల మీద తదనంతర చర్యలు

ఆర్థిక, ప్రణాళిక శాఖ 1993 నవంబరులో జారీ చేసిన ఆదేశాల ప్రకారం, ఆడిటు నివేదికలను శాసనసభలో ప్రవేశపెట్టిన మూడు నెలల లోగా, ప్రజా పద్దుల సంఘం నుండి ఎలాంటి నోటీసు లేదా పిలుపు కోసం వేచి చూడకుండా, తీసుకున్న లేదా ప్రతిపాదిత చర్యలను సూచిస్తూ, సంబంధిత పాలన శాఖలు వివరణాత్మక నివేదికలను సమర్పించాలి. ఆర్థిక, బడ్జెటరీ నిర్వహణకు సంబంధించిన అంశాలను, నిర్దేశితమైన నియమాలు, నిబంధనలు, పద్ధతుల పాటింపులో రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, అధికారుల లోపాలను, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ప్రతి ఏటా ప్రస్తావిస్తూ ఉన్నారు.

[23] (i) వ్యవసాయ శాఖ, (ii) పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యపరిశ్రమల శాఖ, (iii) పరిశ్రమలు, వాణిజ్య శాఖ, (iv) అటవీ శాఖ, (v) రోడ్లు, భవనాల శాఖ

2014-15 నుంచి 2020-21 సంవత్సరాలకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిట్ నివేదికల విషయమై 19 శాఖల నుంచి 183 ఆడిటు పేరాలకు సంబంధించి అందాల్సిన 209 వివరణాత్మక నివేదికలకుగానూ 178 వివరణాత్మక నివేదికలు అందాయి (2023 ఆగష్టు). ఇంకా, 11 డిపార్టుమెంట్లకు చెందిన 23 ఆడిటు పేరాలకు సంబంధించి 31 వివరణాత్మక నివేదికలు అందాల్సి ఉంది (2023 ఆగష్టు). వివరాలు ***అనుబంధం 4.12*** లో ఉన్నాయి.

4.15 సారాంశం

వడ్డీతో కూడిన రిజర్వు నిధులు, డిపాజిట్లకు సంబంధించి వడ్డీ చెల్లింపు బాధ్యతను ప్రభుత్వం నెరవేర్చలేదు.

2022-23 లో 71 వ్యక్తిగత డిపాజిటు ఖాతాలలోకి రాబడి గానీ, వాటి నుంచి చెల్లింపులు గానీ లేకపోవడం అవి ఈ సంవత్సరంలో ఉపయోగంలో లేవని సూచిస్తోంది.

గత సంవత్సరంతో పోలిస్తే ఆమాంబాపతు చిన్న పద్దు - 800 ఉపయోగం పెరిగింది. భారీ మొత్తంలో రాబడి అన్ని కింద స్థాయిలలోనూ ఇతర రాబడిగా వర్గీకరణ అవుతోంది. ముఖ్యంగా మార్చి నెలలో, హైదరాబాదు అర్బన్ పి.ఎ.ఓ. లో ఈ విధంగా జరిగింది. వివరాలు లేక పోవడం వల్ల రాబడి మూలాన్ని గానీ, స్వభావాన్ని గానీ గుర్తించడం కష్టం కావడమే కాకుండా పద్దుల పారదర్శకత ప్రభావితం అవుతోంది.

స్వయంపాలక సంస్థలు పద్దులను ఖరారు చేయకుండా చాలాకాలం పాటు కొనసాగుతుండగా, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం వాటికి గ్రాంట్లు, ఋణాలు, పూచీకత్తుల మద్దతునిస్తోంది.

4.16 సిఫార్సులు

(i) స్థానిక ప్రభుత్వ సంస్థలకు అర్హమైన నిధులను, ప్రాధాన్యత ఇచ్చి వాటిని సకాలంలో అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించుకోవాలి.

(ii) ఉపయోగంలో లేని వ్యక్తిగత డిపాజిటు ఖాతాలను రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, మూసివేయాలి.

(iii) ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయంపాలక సంస్థలు సకాలంలో పద్దులు సమర్పించడాన్ని బట్టే వాటికి గ్రాంట్లను / ఋణాలను విడుదల చేయడం, పూచీకత్తులను ఇచ్చే అంశాలను ప్రభుత్వం పరిగణించాలి.

అధ్యాయం V

రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ (ఎస్.పి.ఎస్.యు.) ల పనితీరు

అధ్యాయం V రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ (ఎస్.పి.ఎస్.యు.) ల పనితీరు

5.1 పరిచయం

ఈ అధ్యాయం తెలంగాణ ప్రభుత్వ కంపెనీలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఇతర కంపెనీలు, శాసనవిహితమైన కార్పొరేషన్లు సమర్పించిన పద్దులు/సమాచారం నుంచి వెల్లడి అయిన ఆర్థికపరమైన పని తీరును, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి.ఎ.జి.) పర్యవేక్షక పాత్ర ఫలితాల సారాంశాన్ని తెలియ జేస్తుంది. సి.ఎ.జి. నిర్వహించిన ప్రభుత్వ రంగ సంస్థల పద్దుల అనుబంధ ఆడిట్ పర్యవసానంగా జారీ అయిన గణనీయమైన కొన్ని వ్యాఖ్యలను ఈ అధ్యాయం ప్రముఖంగా ప్రస్తావిస్తుంది.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం వాణిజ్యపరమైన స్వభావం గల కార్యకలాపాలను కొనసాగించడానికి ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపిస్తాయి.

కంపెనీల చట్టం - 2013 లోని సెక్షను 2(45) లో నిర్వచించిన ప్రకారం ఒక ప్రభుత్వ కంపెనీ అంటే చెల్లించిన మూలధనం వాటాలో కేంద్ర ప్రభుత్వం గానీ, ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వాలు గానీ 51 శాతం కన్నా తక్కువ కాకుండా గానీ లేదా కేంద్ర ప్రభుత్వం, ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ రాష్ట్ర ప్రభుత్వాలు పాక్షికంగా వాటాలు కలిగి ఉన్న కంపెనీ. ప్రభుత్వ కంపెనీకి అనుబంధంగా ఉన్న కంపెనీ కూడా ఈ నిర్వచనంలో భాగమే.

ఇంతే కాకుండా, కేంద్ర ప్రభుత్వం లేదా ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వాలు లేదా పాక్షికంగా కేంద్ర ప్రభుత్వం, పాక్షికంగా ఒకటి లేదా అంత కన్నా ఎక్కువ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ యాజమాన్యం కలిగి ఉండే లేదా నియంత్రించే ఏదైనా ఇతర కంపెనీని ఈ నివేదికలో ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఇతర కంపెనీగా ప్రస్తావించడమైంది.

శాసనవిహితమైన కార్పొరేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. సంబంధిత చట్టాల ప్రకారం వాటి నియంత్రణ ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు అన్న పదంలో ప్రభుత్వ కంపెనీలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఇతర కంపెనీలు, శాసనవిహితమైన తెలంగాణ ప్రభుత్వ కార్పొరేషన్లు ఇమిడి ఉంటాయి.

5.2 ఆడిటు చేసే అధికారం

కంపెనీల చట్టం - 2013 లోని సెక్షను 143 తో పాటు, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సేవా షరతులు) చట్టం - 1971 లోని సెక్షను 19, దాని కింద చేసిన నిబంధనల ప్రకారం భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి.ఎ.జి.) ద్వారా ప్రభుత్వ కంపెనీలు, ప్రభుత్వం నియంత్రించే ఇతర కంపెనీల ఆడిటును నిర్వహించడం జరుగుతుంది. కంపెనీల చట్టం - 2013 లోని సెక్షన్లు 139 (5), (7) ప్రకారం సి.ఎ.జి. ప్రభుత్వ కంపెనీలకు చట్టబద్ధమైన ఆడిటర్లను నియమించి, పద్దులను ఆడిటు చేసే పద్ధతుల మీద ఆదేశాలు ఇస్తారు. అంతే కాకుండా, కంపెనీల చట్టం - 2013 లోని సెక్షను 143 (6) ప్రకారం అనుబంధ ఆడిటును నిర్వహించేందుకు, ఆడిటు నివేదికల మీద గానీ, అనుబంధంగా గానీ వ్యాఖ్యలను జారీ చేసే హక్కు సి.ఎ.జి.కి ఉంటుంది.

శాసనవిహితమైన కార్పొరేషన్లను నియంత్రించే చట్టాల ప్రకారం కూడా వాటి పద్దులను సి.ఎ.జి. ఆడిటు చేయాలి, ఆ నివేదికను రాష్ట్ర శాసనసభకు సమర్పించాలి.

5.3 ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య, వాటి పద్దుల పరిస్థితి

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం - 2014 ప్రకారం, మునుపటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తెలంగాణ, అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విభజించిన తర్వాత, 2014 జూన్ 2 న తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం - 2014 నిబంధనల ప్రకారం, ఒక రాష్ట్రంలో మాత్రమే ప్రత్యేకించి ఉన్న లేదా ఒక రాష్ట్రానికే ప్రత్యేకించి కార్యకలాపాలు పరిమితమై ఉన్న ఒక ప్రభుత్వ రంగ సంస్థను ఆ రాష్ట్రానికే కేటాయించాలి. అంతర్రాష్ట్ర కార్యకలాపాలు ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులు, అప్పులను రెండు రాష్ట్రాల మధ్య ఈ కింద విధంగా పంపకం చేయాలి:

- కార్యకలాపాలు సాగుతున్న యూనిట్లను అవి ఉన్న ప్రాంతం ఆధారంగా విభజించాలి;
- ప్రధాన కార్యాలయాన్ని జనాభా దామాషా ఆధారంగా విభజించాలి.

2023 మార్చి 31 నాటికి తెలంగాణ రాష్ట్రంలో 83 ప్రభుత్వ రంగ సంస్థలు (విద్యుత్ రంగంలో ఎనిమిది ప్రభుత్వ కంపెనీలు, విద్యుదితర రంగంలో 69 ప్రభుత్వ కంపెనీలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మూడు ఇతర కంపెనీలు[1], మూడు శాసనవిహితమైన కార్పొరేషన్లు) సి.ఎ.జి. ఆడిటు పరిధిలో ఉన్నాయి. మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేస్తున్నవి 67 కాగా నిష్క్రియంగా[2] 16 కంపెనీలు ఉన్నాయి. విభజన దశలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన విద్యుత్ కంపెనీ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల సంస్థ అనే రెండు ప్రభుత్వ రంగ సంస్థలను పని చేస్తూ ఉన్న కంపెనీలలో చేర్చడమైంది.

2023 సెప్టెంబరు 30 నాటికి 83 ప్రభుత్వ రంగ సంస్థల స్వభావం, పద్దుల పరిస్థితిని *పట్టిక 5.1* లో వివరించడమైంది.

పట్టిక 5.1: ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య, పద్దుల పరిస్థితి

ప్రభుత్వ రంగ సంస్థల స్వభావం	మొత్తం ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య	2023 సెప్టెంబరు 30 నాటికి పద్దులు అందిన ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య				వార్షిక పద్దులు బకాయిలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య (బకాయిలలో ఉన్న పద్దుల సంఖ్య)
		2020-21 వరకు	2021-22 వరకు	2022-23 వరకు	మొత్తం	
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7) = (2) - (5)
ప్రభుత్వ కంపెనీలు	61	7	13	12	32	49 (162)
శాసనవిహితమైన కార్పొరేషన్లు	3	0	0	0	0	3 (20)
ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఇతర కంపెనీలు	3	0	1	0	1	3 (14)
మొత్తం పని చేస్తూ ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు	**67**	**7**	**14**	**12**	**33**	**55 (196)**
నిష్క్రియంగా ఉన్న ప్రభుత్వ కంపెనీలు	16	0	0	0	0	16 (405)
పూర్తి మొత్తం	**83**	**7**	**14**	**12**	**33**	**71(601)**

మూలం: తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన వార్షిక పద్దులు

పని చేస్తూ ఉన్న 67 ప్రభుత్వ రంగ సంస్థలలో 49 సంస్థలను[3] 2023 సెప్టెంబరు 30 వరకు మూడు లేదా అంత కన్నా ఎక్కువ సంవత్సరాల పద్దులు బకాయిలలో ఉన్న లేదా సమాచారం ఆడిటుకు సమర్పించనివి ఈ అధ్యాయంలో ప్రస్తావించడం లేదు. 2023 మార్చితో ముగిసిన గత మూడు సంవత్సరాలు ప్రభుత్వ రంగ సంస్థలు (విద్యుత్, విద్యుదితర సంస్థలు) సమర్పించిన సమాచారం, పద్దుల ఆధారంగా పనిచేస్తూ ఉన్న 18 ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థికపరమైన పనితీరు విశ్లేషణను ఈ అధ్యాయంలో ప్రస్తావించడమైంది.

---

1 (i) హైదరాబాదు గ్రోత్ కారిడార్ లిమిటెడ్, (ii) కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, (iii) గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్

2 పని చేయకుండా ఉన్నవి లేదా మూసివేత (లిక్విడేషన్) లో ఉన్నవి. వీటిలో 15 కంపెనీలు విభజన దశలో ఉన్నాయి

3 మొదటి పద్దులు రావలసిన 13 ప్రభుత్వ రంగ సంస్థలు కలుపుకొని

2023 సెప్టెంబరు 30 నాటికి పని చేస్తూ ఉన్న, నిష్క్రియంగా ఉన్న మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థల పద్దుల బకాయిల పరిస్థితిని ***అనుబంధం 5.1*** లో ఇవ్వడమైంది. పని చేస్తూ ఉన్న 18 ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థికపరమైన పనితీరు సారాంశాన్ని ***పట్టిక 5.2*** లో ఇవ్వడమైంది.

పట్టిక 5.2: 18 ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థికపరమైన పనితీరు సారాంశం

(₹ కోట్లలో)

పని చేస్తూ ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య	67
ఈ నివేదికలో ప్రస్తావించిన ప్రభుత్వ రంగ సంస్థలు	18
చెల్లించిన మూలధనం (18 ప్రభుత్వ రంగ సంస్థలు)	₹20,536.93
దీర్ఘకాలిక ఋణాలు (18 ప్రభుత్వ రంగ సంస్థలు)	₹78,035.15
నికర లాభం (06 ప్రభుత్వ రంగ సంస్థలు)	₹3,857.48
నికర నష్టం (11 ప్రభుత్వ రంగ సంస్థలు)	(-) ₹11,969.66
లాభం/నష్టం లేనివి (1 ప్రభుత్వ రంగ సంస్థ)	-
ప్రకటించిన డివిడెండు (01 ప్రభుత్వ రంగ సంస్థ)	₹129.99
నికర విలువ[4] (18 ప్రభుత్వ రంగ సంస్థలు)	(-) ₹33,005.15

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు/సమాచారం

5.4 రాష్ట్ర ఆర్థికానికి ప్రభుత్వ రంగ సంస్థల తోడ్పాటు

రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.) లో ప్రభుత్వ రంగ సంస్థల టర్నోవరు నిష్పత్తి రాష్ట్ర ఆర్థికానికి ప్రభుత్వ రంగ సంస్థల తోడ్పాటును తెలియజేస్తుంది.

2023 మార్చితో ముగిసిన మూడు సంవత్సరాల కాలంలో జి.ఎస్.డి.పి., పని చేస్తూ ఉన్న 18 ప్రభుత్వ రంగ సంస్థల టర్నోవరు వివరాలు ***పట్టిక 5.3*** లో వివరించడమైంది:

పట్టిక 5.3: తెలంగాణ జి.ఎస్.డి.పి., పని చేస్తూ ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల టర్నోవర్ల వివరాలు

(₹ కోట్లలో)

రంగం	2020-21	2021-22	2022-23
విద్యుత్తు	63,217.89	79,334.81	94,793.90
వ్యవసాయం	1.00	43.75	25.46
మౌలిక సదుపాయాల రంగం	12.21	16.66	16.19
తయారీ రంగం	276.75	288.35	320.55
సేవా రంగం	2.42	7.36	1.82
ఆర్థిక రంగం	0.00	0.00	0.00
ఇతరుల రంగం	50.08	52.59	46.82
మొత్తం టర్నోవరు	**63,560.35**	**79,743.52**	**95,204.74**
తెలంగాణ జి.ఎస్.డి.పి. (2023 ఆగష్టు 1 నాటికి)	9,61,800	11,48,115	13,13,391
తెలంగాణ జి.ఎస్.డి.పి. లో టర్నోవరు శాతం	6.61	6.95	7.25

మూలం: టర్నోవరు గణాంకాలు ఆయా ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం ప్రకారం, జి.ఎస్.డి.పి. గణాంకాలు భారత ప్రభుత్వ గణాంకాలు - కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ ప్రకారం

గత సంవత్సరంతో పోలిస్తే, ఈ 18 ప్రభుత్వ రంగ సంస్థల టర్నోవరు 19.39 శాతం పెరిగిన కారణంగా తెలంగాణ జి.ఎస్.డి.పి.లో 18 ప్రభుత్వ రంగ సంస్థల తోడ్పాటు వాటా 2020-21 లో ఉన్న 6.61 శాతం నుంచి 2022-23 లో 7.25 శాతానికి పెరిగింది. ఈ 18 ప్రభుత్వ రంగ సంస్థలలో కేవలం విద్యుత్తు రంగ సంస్థలే 99.57 శాతం టర్నోవరును నమోదు చేసి, జి.ఎస్.డి.పి.కి 7.22 శాతం వాటా మేర తోడ్పడ్డాయి. 2022-23 సంవత్సరంలో మిగతా

[4] నికర విలువ = మొత్తం వాటా మూలధనం - వాటా దరఖాస్తు ధనం + సంచిత లాభాలు - వాయిదా వేసిన రెవెన్యూ ఖర్చు

విద్యుదితర సంస్థలు అందించిన వాటా తోడ్పాటు 0.03 శాతం మాత్రమే. గత సంవత్సరంతో పోలిస్తే బొగ్గు కార్యకలాపాల ద్వారా రాబడి 30.88 శాతం (₹5,135.62 కోట్లు) పెరిగినట్లు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్.సి.సి.ఎల్.) నివేదించింది. అదేవిధంగా, గత సంవత్సరంతో పోలిస్తే దక్షిణ తెలంగాణ విద్యుతు పంపిణీ సంస్థ ఎల్.టి.,హెచ్.టి. విద్యుతు సరఫరా ద్వారా 28.99 శాతం (₹6,339.35 కోట్లు) ఎక్కువ ఆదాయాన్ని నివేదించింది.

5.5 ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడి, బడ్జెటు ద్వారా తోడ్పాటు

5.5.1 ప్రభుత్వ రంగ సంస్థలలో రాష్ట్ర ప్రభుత్వం ఈక్విటీ రూపేణా పెట్టిన పెట్టుబడి, దీర్ఘకాలిక ఋణాలు

2023 మార్చి 31 చివరి నాటికి పని చేస్తూ ఉన్న 18 ప్రభుత్వ రంగ సంస్థలలో మూలధనం వాటా (ఈక్విటీ), ఋణాల మొత్తాలను ***పట్టిక 5.4*** లో ఇవ్వడమైంది:

పట్టిక 5.4: తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థలలో మొత్తం పెట్టుబడి

(₹ కోట్లలో)

పెట్టుబడికి మూలం	31.03.2022 నాటికి పెట్టుబడులు			31.03.2023 నాటికి పెట్టుబడులు		
	ఈక్విటీ*	దీర్ఘకాలిక ఋణాలు	మొత్తం	ఈక్విటీ*	దీర్ఘకాలిక ఋణాలు	మొత్తం
(1)	(2)	(3)	(4)=(2)+(3)	(5)	(6)	(7)=(5)+(6)
1. కేంద్ర ప్రభుత్వం/ కేంద్ర ప్రభుత్వ కంపెనీలు/ కార్పొరేషన్లు	847.56	0.00	847.56	847.56	0.00	847.56
2. రాష్ట్ర ప్రభుత్వం /రాష్ట్ర ప్రభుత్వ కంపెనీలు/ కార్పొరేషన్లు	19,689.27	7,462.99	27,152.26	19,688.85	8,428.59	28,117.44
3. ఆర్థిక సంస్థలు, ఇతరులు	0.82	74,312.26	74,313.08	0.52	69,606.56	69,607.08
మొత్తం	**20,537.65**	**81,775.25**	**1,02,312.90**	**20,536.93**	**78,035.15**	**98,572.08**
మొత్తం పెట్టుబడిలో రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడి శాతం	95.87	9.13	26.54	95.87	10.80	28.52

** ఈక్విటీలో వాటా దరఖాస్తు ధనం కలిసి ఉంది*

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

గత సంవత్సరంతో పోలిస్తే, మొత్తం మీద 18 ప్రభుత్వ రంగ సంస్థల మొత్తం ఋణంలో ₹3,740.10 కోట్లు తగ్గింది. ఈ సంవత్సరంలో, ప్రధానంగా తెలంగాణ విద్యుతు ప్రసార సంస్థ (₹345.02 కోట్లు), తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (₹633.80 కోట్లు), తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (₹7,428.10 కోట్లు) లలో ఋణ చెల్లింపు జరిగింది. అయితే 2022-23 లో ఋణాలలో పెరుగుదల ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (టి.ఎస్.జెన్కో) (₹2,372.58 కోట్లు), దక్షిణ తెలంగాణ విద్యుతు పంపిణీ సంస్థ (₹1,099.69 కోట్లు) లలో ఉంది.

తొమ్మిది సంవత్సరాలకు మించి, 38 సంవత్సరాల వరకు నిష్క్రియంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు 16 ఉన్నాయి (***అనుబంధం 5.1***). నిష్క్రియంగా ఉన్న ఈ ప్రభుత్వ రంగ సంస్థలలో మూలధనం (₹34.98 కోట్లు), దీర్ఘకాలిక ఋణాలు (₹163.89 కోట్లు), వెరసి రాష్ట్ర ప్రభుత్వం ₹198.87 కోట్లను పెట్టుబడిగా పెట్టింది. ప్రతి సంవత్సరం అభ్యర్థిస్తూనే ఉన్నా ఈ ప్రభుత్వ రంగ సంస్థలు పద్దులు / సమాచారం అందజేయని కారణంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఈ పెట్టుబడిని గురించి ఎలాంటి అంచనాకు రాలేకపోతున్నాము.

2020-21 నుంచి 2022-23 వరకు ఆర్థిక సంవత్సరాల చివరిలో ఈ 18 ప్రభుత్వ రంగ సంస్థలలో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన సంచితమైన పెట్టుబడి సరళిని ***పట్టిక 5.5*** లో ఇవ్వడమైంది.

పట్టిక 5.5: ప్రభుత్వ రంగ సంస్థలలో రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడి

(₹ కోట్లలో)

రంగం	సంవత్సరం		
	2020-21	2021-22	2022-23
విద్యుత్తు	23,706.21	20,722.96	20,407.16
వ్యవసాయం	0.00	0.00	0.11
మౌలిక సదుపాయాల రంగం	4,083.52	6,348.05	7,664.71
తయారీ రంగం	69.31	69.31	32.87
సేవా రంగం	12.12	11.89	12.54
ఆర్థిక రంగం	0.00	0.00	0.00
ఇతరుల రంగం	0.05	0.05	0.05
మొత్తం	27,871.21	27,152.26	28,117.44

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

2023 మార్చి 31 నాటికి, ఈ 18 ప్రభుత్వ రంగ సంస్థలలో ఈక్విటి రూపేణా, దీర్ఘకాలిక ఋణాల రూపేణా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి ₹28,117.44 కోట్లు. ఈ 18 ప్రభుత్వ రంగ సంస్థలలో రాష్ట్ర ప్రభుత్వం బకాయిలో ఉన్న ఋణాలు 2022 మార్చి 31 నాటికి ₹7,462.99 కోట్ల నుంచి 2023 మార్చి 31 నాటికి ₹8,428.59 కోట్లకు పెరిగాయి. 2022-23 లో ఈక్విటి రూపంలో మంజీర ఎత్తిపోతల నీటి పారుదల సంస్థలో ₹0.10 కోట్లు పెట్టడం జరిగింది (***అనుబంధం 5.2***).

2022-23 లో ప్రభుత్వ రంగ సంస్థలలో చెల్లించిన మూలధనంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న గణనీయమైన వాటా (₹500 కోట్లకు మించి ఉన్న వాటా) వివరాలను ***పట్టిక 5.6*** లో ఇవ్వడమైంది.

పట్టిక 5.6: రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న గణనీయమైన ఈక్విటి వాటా

(₹ కోట్లలో)

ప్రభుత్వ రంగ సంస్థ పేరు	తెలంగాణ ప్రభుత్వ పరిపాలన శాఖ పేరు	చెల్లించిన మూలధనం లో పెట్టుబడి మొత్తం
ప్రభుత్వ విద్యుత్తు రంగ సంస్థలు		
దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ	ఇంధన శాఖ	12,017.93
ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ	ఇంధన శాఖ	5,869.20
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్	ఇంధన శాఖ	885.60
తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ	ఇంధన శాఖ	869.64
మొత్తం		**19,642.37**

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన మొత్తం ఈక్విటి పెట్టుబడి ₹19,688.85 కోట్లలో గణనీయమైన మొత్తం (99.76 శాతం) పైన పేర్కొన్న నాలుగు ప్రభుత్వ రంగ సంస్థలలోనే ఉంది.

5.5.2 ప్రభుత్వ రంగ సంస్థల పునర్నిర్మాణం, ప్రైవేటీకరణ, వాటి నుంచి పెట్టుబడుల ఉపసంహరణ

2022-23 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థనూ ప్రైవేటికరించలేదు, ఏ ప్రభుత్వ రంగ సంస్థ నుంచి పెట్టుబడులను ఉపసంహరించలేదు.

5.5.3 ప్రభుత్వ రంగ సంస్థలకు బడ్జెటు సాయం

ప్రభుత్వ రంగ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో వార్షిక బడ్జెటు ద్వారా ఆర్థిక సాయం అందిస్తుంది. 2023 మార్చితో ముగిసిన గత మూడు సంవత్సరాలలో బడ్జెటు ద్వారా 18 ప్రభుత్వ రంగ సంస్థలకు విడుదల చేసిన ఈక్విటి, ఋణాలు, గ్రాంట్లు/రాయితీలు, ఈక్విటిగా మార్చిన ఋణాలు, వడ్డీ మాఫీ, జారీ అయిన పూచీకత్తులు, ఇచ్చి ఉన్న పూచీకత్తుల విలువ ఈ విధంగా ఉన్నాయి.

పట్టిక 5.7: ప్రభుత్వ రంగ సంస్థలకు బడ్జెటు సాయం వివరాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	వివరాలు	2020-21		2021-22		2022-23	
		ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య	మొత్తం	ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య	మొత్తం	ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య	మొత్తం
	ప్రభుత్వ విద్యుత్ రంగ సంస్థలు						
1	బడ్జెటు ద్వారా పెట్టిన ఈక్విటీ మూలధనం	1	1.95	0	0.00	0	0.00
2	బడ్జెటు ద్వారా ఇచ్చిన ఋణాలు	0	0.00	0	0.00	0	0.00
3	బడ్జెటు ద్వారా ఇచ్చిన గ్రాంట్లు / రాయితీ*	3	5,661.39	3	1,517.86	4	8,329.48
4	**విడుదలైన మొత్తం**[5]	4	5,663.34	3	1,517.86	4	8,329.48
5	ఈక్విటీగా మార్చిన ఋణాలు	0	0.00	0	0.00	0	0.00
6	మాఫీ అయిన ఋణాలు, వడ్డీ, అపరాధ వడ్డీ	0	0.00	0	0.00	0	0.00
7	ఇచ్చిన పూచీకత్తులు[6]	2	12,586.93	0	0.00	2	9,271.70
8	కట్టుబడి ఉన్న పూచీకత్తులు[7]	5	19,393.40	5	19,151.96	4	25,308.74
	ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు						
1	బడ్జెటు ద్వారా పెట్టిన ఈక్విటీ మూలధనం	1	0.02	1	0.50	1	0.10
2	బడ్జెటు ద్వారా ఇచ్చిన ఋణాలు	1	2,461.06	1	2,264.53	2	950.65
3	బడ్జెటు ద్వారా ఇచ్చిన గ్రాంట్లు / రాయితీ*	3	172.26	2	654.50	3	101.75
4	**విడుదలైన మొత్తం**	4	2,633.34	3	2,919.53	5	1,052.50
5	ఈక్విటీగా మార్చిన ఋణాలు	0	0.00	0	0.00	0	0
6	మాఫీ అయిన ఋణాలు, వడ్డీ, అపరాధ వడ్డీ	0	0.00	0	0.00	0	0
7	ఇచ్చిన పూచీకత్తులు	0	0	0	0	1	1,000
8	కట్టుబడి ఉన్న పూచీకత్తులు	1	482.80	1	307.24	2	1,131.68
	మొత్తం						
1	బడ్జెటు ద్వారా పెట్టిన ఈక్విటీ మూలధనం	2	1.97	1	0.50	1	0.10
2	బడ్జెటు ద్వారా ఇచ్చిన ఋణాలు	1	2,461.06	1	2,264.53	2	950.65
3	బడ్జెటు ద్వారా ఇచ్చిన గ్రాంట్లు / రాయితీ*	6	5,833.65	5	2,172.36	7	8,431.23
4	**విడుదలైన మొత్తం**	8	8,296.68	6	4,437.39	8	9,381.98
5	ఈక్విటీగా మార్చిన ఋణాలు	0	0.00	0	0.00	0	0.00
6	మాఫీ అయిన ఋణాలు, వడ్డీ, అపరాధ వడ్డీ	0	0.00	0	0.00	0	0.00
7	ఇచ్చిన పూచీకత్తులు	2	12,586.93	0	0.00	3	10,271.70
8	కట్టుబడి ఉన్న పూచీకత్తులు	6	19,876.20	6	19,459.20	6	26,440.42

** విడిగా మదింపు వేయలేని వ్యవహారకార్యకలాపాల, యాజమాన్య నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఇచ్చిన గ్రాంట్లు/రాయితీలతో సహా*

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

2022-23 సంవత్సరంలో ప్రభుత్వం ₹9,381.98 కోట్ల మొత్తం పెట్టింది (***అనుబంధం 5.2***). ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలకు రాయితీలు/ గ్రాంట్ల రూపంలో పెట్టిన మొత్తం 2021-22 (₹654.50 కోట్లు) తో పోలిస్తే, 2022-23

---

5 విడుదలైన మొత్తం అనే సంఖ్య ఈక్విటీ, ఋణాలు, గ్రాంట్లు/రాయితీ రూపంలో ఒకటి లేదా అంత కన్నా ఎక్కువ పద్దుల కింద రాష్ట్ర ప్రభుత్వ బడ్జెటు నుంచి నిధులను అందుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను సూచిస్తుంది

6 ఒక నిర్దిష్ట సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చిన ప్రభుత్వపు పూచీకత్తు

7 ఒక నిర్దిష్ట సంవత్సరం చివరలో ప్రభుత్వ రంగ సంస్థల విషయంలో ప్రభుత్వం ఇచ్చి ఉన్న పూచీకత్తుల ముగింపు నిల్వ

లో (₹101.75 కోట్లు) తక్కువగా ఉంది. 2022-23 సంవత్సరంలో దక్షిణ తెలంగాణ విద్యుతు పంపిణీ సంస్థకు ₹1,923.89 కోట్లు, ఉత్తర తెలంగాణ విద్యుతు పంపిణీ సంస్థకు ₹6,404.00 కోట్లు ధరల్లో రాయితీ కోసం విడుదల చేయడం జరిగింది. అలాగే 2 పడక గదుల ఇళ్ల నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థకు ₹100 కోట్లు విడుదల చేయడం జరిగింది. అయితే, రాయితీలు/గ్రాంట్లు అందినప్పటికీ, భారీగా పేరుకుపోయిన నష్టాలతో ఈ మూడు సంస్థల ఆర్థిక స్థితి అత్యంత ప్రమాదకరంగా ఉంది.

2022-23 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన ₹9,381.98 కోట్ల బడ్జెటు సాయంలో మూడు లేదా అంత కన్నా ఎక్కువ సంవత్సరాల పాటు పద్దులు బకాయిల్లో ఉండి, పని చేస్తూ ఉన్న రెండు[8] ప్రభుత్వ రంగ సంస్థలకు ₹1,051.09 కోట్లు అందజేయడం జరిగింది. వివరాలు ***అనుబంధం 5.2*** లో ఉన్నాయి.

5.6 ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ప్రతిఫలం

2022-23 సంవత్సరంలో, 18 ప్రభుత్వ రంగ సంస్థలలో ఆరు సంస్థలు లాభాలను ఆర్జించగా, 11 సంస్థలు నష్టాలు పొందాయి, ఒక ప్రభుత్వ రంగ సంస్థ[9] లాభాన్ని గానీ, నష్టాన్నీ గానీ నివేదించలేదు.

5.6.1 ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్జించిన లాభాలు

18 ప్రభుత్వ రంగ సంస్థలకు గానూ, 2021-22 సంవత్సరంలో ఎనిమిది సంస్థలు ₹1,761.29 కోట్ల లాభం ఉన్నట్లు నివేదించగా, 2022-23 లో ఆరు సంస్థలు ₹3,857.48 కోట్ల లాభాన్ని ఆర్జించాయి. ఈ ఆరు ప్రభుత్వ రంగ సంస్థలన్ని వ్యవహారకార్యకలాపాల కారణంగా లాభం ఆర్జించినట్లు నివేదించాయి. గత సంవత్సరం నుంచి దశ తిరిగినట్లు ఒక ప్రభుత్వ రంగ సంస్థ (తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్) నివేదించింది. మరోవైపు, గత సంవత్సరం లాభం గడించిన పిదప మూడు సంస్థలు[10] నష్టం పొందాయి.

2021-22 లో లాభాలు గడిస్తున్న ఎనిమిది ప్రభుత్వ రంగ సంస్థల వాటాధనం మీద ప్రతిఫలం (రిటర్న్ ఆన్ ఈక్విటి) 12.30 శాతంతో పోలిస్తే, 2022-23 లో లాభాలు గడిస్తున్న ఆరు ప్రభుత్వ రంగ సంస్థల వాటాధనం మీద ప్రతిఫలం 21.53 శాతంగా ఉంది. మొత్తం మీద ప్రభుత్వ రంగ సంస్థల (నష్టాలను పొందుతున్న 11 సంస్థలతో పాటు, శూన్య లాభం లేదా శూన్య నష్టం ఆర్జించిన ఒక కంపెనీతో సహా) వాటాధనం మీద ప్రతిఫలాన్ని లెక్కించడం సాధ్యపడలేదు. 2023 మార్చి 31 నాటికి మొత్తం మీద నికరలాభం, నికర విలువ రెండూ ఋణాత్మకంగా ఉండడమే అందుకు కారణం.

ఆరు ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్జించిన మొత్తం ₹3,857.48 కోట్ల లాభాలలో నికర లాభం ₹3,809.81 కోట్లు (మొత్తం నికర లాభంలో 98.76 శాతం) విద్యుతు రంగంలోని మూడు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి వచ్చింది. 2022-23 సంవత్సరంలో విద్యుతు రంగం మొత్తం మీద ₹3,809.81 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

పట్టిక 5.8: 2022-23 లో అత్యధిక లాభాలు ఆర్జించిన ప్రభుత్వ రంగ సంస్థల జాబితా

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	ప్రభుత్వ రంగ సంస్థ పేరు	పన్ను మొత్తం తీసిన తర్వాత నికర లాభం
	ప్రభుత్వ విద్యుతు రంగ సంస్థలు	
1	సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్	2,596.40
2	తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ	908.96
3	తెలంగాణ విద్యుతు ప్రసార సంస్థ	304.45
	ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు	
4	తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ	38.31
	మొత్తం	3,848.12

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

[8] తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ

[9] తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

[10] (i) తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ, (ii) టి-వర్క్స్ ఫౌండేషన్, (iii) నిజాం షుగర్స్ లిమిటెడ్

ఆరు ప్రభుత్వ రంగ సంస్థలు 2022-23 లో ఆర్జించిన మొత్తం లాభంలో 99.76 శాతం పైన పేర్కొన్న నాలుగు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి వచ్చింది. వీటిలో క్రమ సంఖ్య(1), (3) లలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు గుత్తాధిపత్యంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

5.6.2 చెల్లించిన డివిడెండు

రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిన మూలధనం వాటా మీద ప్రభుత్వ రంగ సంస్థలు కనీస ప్రతిఫలాన్ని చెల్లించాల్సి ఉంటుందంటూ ఏ విధమైన డివిడెండు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించలేదు. ఆరు ప్రభుత్వ రంగ సంస్థలు లాభాలు గడించగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అను ఒక ప్రభుత్వ రంగ సంస్థ మాత్రమే 2021-22 లో ₹86.66 కోట్లు, 2022-23 లో ₹129.99 కోట్ల డివిడెండును చెల్లించింది. ఈ ఒక ప్రభుత్వ రంగ సంస్థ నికర లాభంలో శాతంగా చూస్తే ప్రకటించిన డివిడెండు 2021-22 లో ఉన్న 7.06 శాతం తో పోలిస్తే 2022-23 లో 5.01 శాతానికి తగ్గింది. 2022-23 లో ప్రకటించిన డివిడెండు గత సంవత్సరంతో పోలిస్తే ₹43.33 కోట్లు (50 శాతం)పెరిగింది.

18 ప్రభుత్వ రంగ సంస్థలలో మొత్తం ఈక్విటీ మీద డివిడెండు రూపంలోని ప్రతిఫలం 2021-22 లో 0.42 శాతంగా ఉండగా, 2022-23 లో 0.63 శాతంగా ఉంది.

5.7 ప్రభుత్వ రంగ సంస్థలు పొందిన నష్టాలు

5.7.1 పొందిన నష్టాలు

18 ప్రభుత్వ రంగ సంస్థలకు గాను 2022-23 లో 11 సంస్థలు నష్టాలను పొందాయి. ఏడు సంస్థలు[11] పొందిన నష్టాలు 2021-22 లో ఉన్న ₹1,973.00 కోట్ల నుంచి 2022-23 లో ₹11,925.37 కోట్లకు భారీగా పెరిగాయి. తెలంగాణ డిస్కంలు నష్టాలు 2021-22 లో ₹830.83 కోట్ల నుంచి 2022-23 లో ₹11,103.44 కోట్లకు పెరగడం దీనికి ప్రధాన కారణం. గత మూడు ఆర్థిక సంవత్సరాలలో ప్రభుత్వ రంగ సంస్థలు పొందిన నష్టాల వివరాలు కింది *పట్టిక 5.9* లో ఇవ్వడమైంది:

పట్టిక 5.9: నష్టాలను పొందిన ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య

(₹ కోట్లలో)

సంవత్సరం	నష్టాలు పొందిన ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య	సంవత్సరపు నికర నష్టం	పేరుకుపోయిన నష్టాలు	నికర విలువ
ప్రభుత్వ విద్యుత్తు రంగ సంస్థలు				
2020-21	2	(-)6,686.33	(-)48,982.22	(-)31,095.09
2021-22	2	(-)830.83	(-)49,815.88	(-)31,928.75
2022-23	3	(-)11,107.50	(-)60,922.49	(-)43,033.70
ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు				
2020-21	7	(-)802.61	(-)7,644.65	(-)7,633.78
2021-22	6	(-)1,142.24	(-)6,589.31	(-)6,577.94
2022-23	8	(-)862.16	(-)7,926.33	(-)7,891.72
మొత్తం				
2020-21	9	(-)7,488.94	(-)56,626.87	(-)38,728.87
2021-22	8	(-)1,973.07	(-)56,405.19	(-)38,506.69
2022-23	11	(-)11,969.66	(-)68,848.82	(-)50,925.42

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

[11] 2021-22, 2022-23లో సాధారణంగా నష్టాలు పొందిన ఏడు ప్రభుత్వ రంగ సంస్థలు:1) దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ, 2) ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ, 3) తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, 4) దామోదర మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్, 5) తెలంగాణ రాజీవ్ స్వగృహ సంస్థ, 6) తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ, 7) తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థ.

2022-23 లో 11 ప్రభుత్వ రంగ సంస్థల మొత్తం నష్టాలు ₹11,969.66 కోట్లలో విద్యుతు రంగపు వాటా ₹11,107.50 కోట్లు, విద్యుదితర రంగపు వాటా ₹862.16 కోట్లు.

2022-23 లో 10 ప్రభుత్వ రంగ సంస్థలలో[12] పేరుకుపోయిన సంచిత నష్టాలు ₹68,856.49 కోట్లు కాగా, ఏడు ప్రభుత్వ రంగ సంస్థలలోని ₹15,314.42 కోట్ల సంచిత లాభాలను సర్దుబాటు చేయగా సంచిత నికర నష్టాలు ₹53,542.07 కోట్లు.

ఈ కింద ***పట్టిక 5.10*** లో పేర్కొన్న ప్రభుత్వ రంగ సంస్థలు 2022-23 సంవత్సరంలో ₹50.00 కోట్ల కన్నా ఎక్కువ నష్టాన్ని పొందాయి.

పట్టిక 5.10: 2022-23 లో ₹50 కోట్ల కన్నా ఎక్కువగా నష్టాన్ని పొందిన ప్రభుత్వ రంగ సంస్థల జాబితా

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	ప్రభుత్వ రంగ సంస్థ పేరు	నికర నష్టం	నికర విలువ
	ప్రభుత్వ విద్యుతు రంగ సంస్థలు		
1	దక్షిణ తెలంగాణ విద్యుతు పంపిణీ సంస్థ	(-)8,147.48	(-)30,311.57
2	ఉత్తర తెలంగాణ విద్యుతు పంపిణీ సంస్థ	(-)2,955.96	(-)12,723.79
	ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు		
3	తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ	(-)795.13	(-) 6,744.56
	మొత్తం	**(-)11,898.57**	**(-)49,779.92**

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

2022-23 లో 11 ప్రభుత్వ రంగ సంస్థలు పొందిన మొత్తం ₹11,969.66 కోట్ల నష్టాలలో ₹11,898.57 కోట్లు అంటే 99.41 శాతంపైన చూపిన మూడు ప్రభుత్వ రంగ సంస్థలు పొందినవే. గత సంవత్సరంలో పొందిన ₹324.23 కోట్ల నష్టంతో పోలిస్తే 2022-23 లో తెలంగాణ రాజీవ్ స్వగృహ సంస్థ పొందిన నష్టం ₹25.26 కోట్లు. రెండు డిస్కంలలో (టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్, టి.ఎస్.ఎన్.పి.డి.సి.ఎల్) నష్టాలు ప్రధానంగా విద్యుతు కొనుగోలు వ్యయంతో పాటు సవరించని ధరల వలన రాబడిలో తగ్గుదల కారణంగా సంభవించాయి. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో ఆర్థిక ఖర్చులు, సిబ్బంది ఖర్చులతో పోలిస్తే కార్యకలాపాల ద్వారా చెప్పుకోదగ్గ ఆదాయం లేనందున నష్టాలు ఏర్పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈక్విటి, ఋణాలు, గ్రాంట్లు/రాయితీ, 2022-23 లో ఋణంపై జారీ చేసిన పూచీకత్తుల ద్వారా మొత్తం ₹4,30,64.96 కోట్లను నష్టపోతున్న కంపెనీలలో పెట్టుబడి పెట్టినట్లు గమనించడం జరిగింది. వీటిలో ₹39,881.43 కోట్లను విద్యుతు రంగ సంస్థలలో పెట్టుబడి పెట్టగా, కేవలం ₹3,183.53 కోట్లను విద్యుదితర రంగ సంస్థలలో పెట్టుబడి పెట్టారు.

5.7.2 ప్రభుత్వ రంగ సంస్థలలో మూలధన క్షయం

నికర విలువ అంటే చెల్లించిన మూలధనం, యదేచ్ఛగా వినియోగించుకోగలిగే నిల్వలు, మిగుళ్ల మొత్తం నుంచి సంచిత నష్టాలు, వాయిదా వేసిన రెవెన్యూ ఖర్చులను తీసివేయగా వచ్చిన మొత్తం. తమ సంస్థ ఎంత విలువైనదో యజమానులకు తెలిపే కొలమానం నికర విలువ. ఇది ఋణాత్మకంగా ఉంటే యజమానులు పెట్టిన మొత్తం పెట్టుబడిని సంచిత నష్టాలు తుడిచిపెట్టాయని అర్థం.

2023 మార్చి 31 నాటికి 18 ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన చెల్లించిన మూలధనం ₹20,536.93 కోట్లు, సంచిత నష్టాలు ₹53,542.07 కోట్ల (***అనుబంధం 5.3***) ఫలితంగా వాయిదా వేసిన రెవెన్యూ ఖర్చులు ₹0.01 కోట్లు సర్దుబాటు తర్వాత ఋణాత్మక నికర విలువ ₹33,005.15 కోట్లు. ఈ ప్రభుత్వ రంగ సంస్థలలో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి

[12] 2020-21 నుండి నష్టాలు చవిచూసినా, తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ సంచిత లాభాలను ఆర్జించింది.

మొత్తంగా తుడిచిపెట్టుకుపోయిందని ఇది సూచిస్తుంది. 18 ప్రభుత్వ రంగ సంస్థలలో 10 సంస్థలు ₹68,856.49 కోట్ల సంచిత నష్టాలను, ఏడు సంస్థలు ₹15,314.42 కోట్లు సంచిత లాభాలను నివేదించగా ఒక సంస్థ లాభాన్ని గానీ, నష్టాన్ని గానీ నివేదించలేదు. మొత్తం 10 ప్రభుత్వ రంగ సంస్థల సంచిత నష్టం ₹68,856.49 కోట్లలో మూడు ప్రభుత్వ రంగ సంస్థల[13] తాలుకూ సంచిత నష్టాలే (₹67,667.30 కోట్లు) 98.27 శాతం.

18 ప్రభుత్వ రంగ సంస్థలలోని తొమ్మిది సంస్థలలో సంచిత నష్టాల కారణంగా నికర విలువ పూర్తిగా క్షయమై పోయిన పర్యవసానంగా ఋణాత్మక నికర విలువకు దారి తీసింది. ఈ తొమ్మిది ప్రభుత్వ రంగ సంస్థల నికర విలువ ఒకటి నుంచి తొమ్మిది సంవత్సరాల పరిధి కాలం వరకు ఋణాత్మకంగా ఉంది. ఈ తొమ్మిది ప్రభుత్వ రంగ సంస్థలలో చెల్లించిన మూలధనం ₹17,921.74 కోట్లకు ప్రతిగా ₹68,852.37 కోట్ల మేర పేరుకుపోయిన సంచిత నష్టాల కారణంగా 2023 మార్చి 31 నాటికి ఉన్న ఋణాత్మక నికర విలువ ₹50,930.63 కోట్లు (***అనుబంధం 5.4***). ఈ తొమ్మిది ప్రభుత్వ రంగ సంస్థలలో 2023 మార్చి 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడి ₹26,348.38 కోట్లు. వీటిలో ***పట్టిక 5.11*** లో వివరించిన విధంగా ఈక్విటీ ₹17,921.33 కోట్లు, ఋణాలు ₹8,427.05 కోట్లు ఉన్నాయి.

పట్టిక 5.11: తాజాగా ఖరారైన పద్దుల ప్రకారం నికర విలువ క్షయమై పోయిన ప్రభుత్వ రంగ సంస్థల వివరాలు

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	రంగం, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ పేరు	పద్దులు ఖరారైన తాజా సంవత్సరం	చెల్లించిన మొత్తం మూలధనం	వడ్డీ, పన్ను, డివిడెండ్ తర్వాత నికర లాభం / నష్టం	పేరుకుపోయిన నష్టం	నికర విలువ ఋణాత్మకంగా మారిన సంవత్సరం	నికర విలువ	2023 మార్చి 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీ	2023 మార్చి 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఋణాలు
ప్రభుత్వ విద్యుత్ రంగ సంస్థలు									
1	ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ	2022-23	5,869.20	(-)2,955.96	(-)18,592.99	2014-15	(-)12,723.79	5,869.20	357.35
2	దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ	2022-23	12,017.93	(-)8,147.48	(-)42,329.50	2014-15	(-)30,311.57	12,017.93	405.29
	ఉప మొత్తం		17,887.13	(-)11,103.44	(-)60,922.49		(-)43,035.36	17,887.13	762.64
ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు									
3	దామోదర మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్	2022-23	0.04	(-)0.01	(-)0.13	2014-15	(-)0.09	0.00	0.00
4	తెలంగాణ రాజీవ్ స్వగృహ సంస్థ	అందలేదు	0.05	(-)25.26	(-)890.67	2018-19	(-)890.62	0.05	0.00
5	తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ	2015-16	0.25	(-)795.13	(-)6,744.81	2015-16	(-)6,744.56	0.25	7,664.41

[13] i) దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ii) ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, iii) తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ

క్రమ సంఖ్య	రంగం, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ పేరు	పద్దులు ఖరారైన తాజా సంవత్సరం	చెల్లించిన మొత్తం మూలధనం	వడ్డీ, పన్ను, డివిడెండ్ తర్వాత నికర లాభం / నష్టం	పేరుకుపోయిన నష్టం	నికర విలువ ఋణాత్మకంగా మారిన సంవత్సరం	నికర విలువ	2023 మార్చి 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీ	2023 మార్చి 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఋణాలు
6	తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థ	2022-23	1.00	(-)0.21	(-)1.28	2022-23	(-)0.28	1.00	0.00
7	నిజాం షుగర్స్ లిమిటెడ్	2022-23	33.17	(-)24.90	(-)276.98	2014-15	(-)243.81	32.80	0.00
8	మంజీర ఎత్తిపోతల నీటి పారుదల సంస్థ	ప్రారంభం నుండి	0.10	(-)0.15	(-)0.15	2022-23	(-)0.05	0.10	0.00
9	టి-వర్క్స్ ఫౌండేషన్	2022-23	0.00	(-)15.18	(-)15.86	2020-21	(-)15.86	0.00	0.00
	ఉప మొత్తం		34.61	(-)860.84	(-)7,929.88		(-)7,895.27	34.20	7,664.41
	మొత్తం		**17,921.74**	**(-)11,964.28**	**(-)68,852.37**		**(-)50,930.63**	**17,921.33**	**8,427.05**

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

ఋణాత్మక నికర విలువ ఉన్న 9 ప్రభుత్వ రంగ సంస్థలలో ఒక ప్రభుత్వ రంగ సంస్థ, నిజాం షుగర్స్ లో మాత్రమే ₹1.69 కోట్ల ఆదాయం, ₹1.56 కోట్ల ఖర్చులను అధిగమించింది. మిగిలిన 8 ప్రభుత్వ రంగ సంస్థలలో, ఖర్చుల కంటే రాబడులు తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల[14] రాబడులు / ఆదాయం, ఖర్చులు, సిబ్బంది ఖర్చుల వివరాలు ***పట్టిక 5.12*** లో ఉన్నాయి.

పట్టిక 5.12: తాజాగా ఖరారైన పద్దుల ప్రకారం నికర విలువ క్షయించిన ప్రభుత్వ రంగ సంస్థల రాబడులు / ఆదాయం, ఖర్చుల వివరాలు (2022-23)

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	రంగం, ప్రభుత్వ రంగ సంస్థ పేరు	నికర విలువ	రాబడులు / ఆదాయం	ఖర్చులు	సిబ్బంది ఖర్చులు
1	ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ	(-)12,723.79	15,880.03	18,835.99	2,053.82
2	దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ	(-)30,311.57	34,254.70	42,243.00	3,081.80
	ఉప మొత్తం	(-)43,035.36	50,134.73	61,078.99	5,135.62
3	దామోదర మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్	(-)0.09	0	0.006	-
4	తెలంగాణ రాజీవ్ స్వగృహ సంస్థ	(-)890.62	0.98	26.24	-
5	తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ	(-)6,744.56	15.21	793.35	49.75
6	తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థ	(-)0.28	0	0.21	-
7	నిజాం షుగర్స్ లిమిటెడ్	(-)243.81	1.69	1.56	0.61
8	మంజీర ఎత్తిపోతల నీటి పారుదల సంస్థ	(-)0.05	0	0.15	-
9	టి-వర్క్స్ ఫౌండేషన్	(-)15.86	1.93	17.12	-
	ఉప మొత్తం	(-)7,895.27	19.81	838.64	50.36
	మొత్తం	**(-)50,930.63**	**50,154.54**	**61,917.626**	**5,185.98**

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

[14] అనుబంధం 5.2 లో వివరించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన బడ్జెటుపరమైన సాయం నిధుల నుండి చెల్లింపు బాధ్యతలను / సిబ్బంది ఖర్చులను తీర్చడం జరిగింది.

5.8 అప్పుల చెల్లింపు

5.8.1 వడ్డీ విస్తృతి నిష్పత్తి (ఇంట్రెస్టు కవరేజి రేషియో - ఐ.సి.ఆర్.)

ఒక కంపెనీ ఇంకా చెల్లించాల్సి ఉన్న అప్పుల మీద వడ్డీని చెల్లించగలిగే సామర్థ్యాన్ని నిర్ధారించడం కోసం వడ్డీ విస్తృతి నిష్పత్తిని (ఇంట్రెస్ట్ కవరేజ్ రేషియో -ఐ.సి.ఆర్.) ఉపయోగిస్తారు. వడ్డీని, పన్నులను తీసివేయక ముందు ఉన్న లాభాన్ని / ఆర్జనలను అదే సమయంలో ఉన్న వడ్డీ ఖర్చులతో భాగించడం ద్వారా వడ్డీ విస్తృతి నిష్పత్తిని లెక్కిస్తారు. వడ్డీ విస్తృతి నిష్పత్తి ఎంత తక్కువగా ఉంటే అప్పు మీద వడ్డీని చెల్లించే విషయంలో సంస్థ సామర్థ్యం అంత తక్కువగా ఉన్నట్లు భావించాలి. ఈ నిష్పత్తి 'ఒకటి' కన్నా తక్కువగా ఉంటే వడ్డీ ఖర్చులను భరించడానికి తగిన రాబడిని ఆ సంస్థ సముపార్జించడం లేదని సూచిస్తుంది. 2020-21 నుంచి 2022-23 మధ్యకాలంలో అన్ని రకాల వనరుల నుంచి పొందిన ఋణాల మీద వడ్డీని చెల్లించిన ప్రభుత్వ రంగ సంస్థల తాలూకు వడ్డీ విస్తృతి నిష్పత్తి వివరాలను *పట్టిక 5.13* లో ఇవ్వడం జరిగింది.

పట్టిక 5.13: ప్రభుత్వ రంగ సంస్థల వడ్డీ విస్తృతి నిష్పత్తి

(₹ కోట్లలో)

సంవత్సరం	వడ్డీ, పన్నులను తీయక ముందు ఆర్జన	వడ్డీ	వడ్డీ విస్తృతి నిష్పత్తి	వడ్డీ భారం ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య	వడ్డీ విస్తృతి నిష్పత్తి ఒకటి కన్నా ఎక్కువగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య	వడ్డీ విస్తృతి నిష్పత్తి ఒకటి కన్నా తక్కువగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య
(1)	(2)	(3)	(4)	(5)	(6) నిలువు వరుస 5 లో ఎన్ని	(7) నిలువు వరుస 5 లో ఎన్ని
ప్రభుత్వ విద్యుత్తు రంగ సంస్థలు						
2020-21	1,537.87	7,386	0.21:1	6	4	2
2021-22	10,623.88	8,330.72	1.28:1	6	4	2
2022-23	3,167.79	9,017.82	0.35:1	6	3	3
ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు						
2020-21	26.94	771.47	0.03:1	5	1	4
2021-22	(-)758.73	58.68	(-)12.93:1	2	0	2
2022-23	(-)736.00	62.23	(-)11.83	4	0	4
మొత్తం						
2020-21	1,564.81	8,157.47	0.19:1	11	5	6
2021-22	9,865.15	8,389.40	1.18:1	8	4	4
2022-23	2,431.79	9,080.05	0.27:1	10	3	7

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

2020-21 నుంచి 2022-23 మధ్య కాలంలో ప్రభుత్వ రంగ సంస్థల మొత్తం మీద వడ్డీ విస్తృతి నిష్పత్తి 0.03 నుంచి 1.28 మధ్య పరిధిలో ఉందని గమనించాము. ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థల వడ్డీ విస్తృతి నిష్పత్తి 2021-22, 2022-23, రెండు సంవత్సరాలలోనూ ఋణాత్మకంగానే ఉంది. ప్రభుత్వ విద్యుతు రంగ సంస్థలు మెరుగ్గా ఉన్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ప్రభుత్వ విద్యుతు రంగ సంస్థల వడ్డీ విస్తృతి నిష్పత్తి 2022-23 సంవత్సరంలో తగ్గింది. దీనికి కారణం డిస్కమ్‌ల వడ్డీని, పన్నులను తీయక ముందు ఉన్న ఆర్జన తగ్గడమే. మొత్తం మీద ప్రభుత్వ విద్యుతు రంగ సంస్థల వడ్డీ విస్తృతి నిష్పత్తి 2020-21, 2022-23 లో 'ఒకటి' కన్నా తక్కువగానే ఉంది. అంటే, వడ్డీ చెల్లింపు బాధ్యత ఉన్న ప్రభుత్వ విద్యుతు రంగ సంస్థలు తమ వడ్డీ బాధ్యతను నెరవేర్చడానికి తగినంత రాబడిని సముపార్జించడం లేదని ఇది సూచిస్తోంది.

5.8.2 రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాలపై చెల్లించాల్సి ఉన్న వడ్డీ యొక్క కాలానుగుణ విశ్లేషణ

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల మీద వడ్డీ చెల్లింపు బాధ్యతలు ఉన్న నాలుగు ప్రభుత్వ రంగ సంస్థలకుగాను 2022-23 సంవత్సరంలో మూడు సంస్థలు చెల్లించాల్సిన వడ్డీ ₹750.09 కోట్లు. రెండు ప్రభుత్వ రంగ సంస్థలు

₹982.93 కోట్లను 2022-23 లో ప్రభుత్వానికి చెల్లించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన దీర్ఘకాలిక ఋణాల మీద 2023 మార్చి 31 నాటికి చెల్లించాల్సి ఉన్న వడ్డీ ₹159.57 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల మీద 2023 మార్చి 31 నాటికి ప్రభుత్వ రంగ సంస్థలు చెల్లించాల్సి ఉన్న వడ్డీ వివరాల కాలానుగుణ విశ్లేషణను ***పట్టిక 5.14*** లో వివరించడం జరిగింది.

పట్టిక 5.14: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల మీద చెల్లించాల్సి ఉన్న వడ్డీ కాలానుగుణ విశ్లేషణ

(₹ కోట్లలో)

క్రమ సంఖ్య	ప్రభుత్వ రంగ సంస్థ పేరు	రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల మీద 2022-23 లో గణించిన వడ్డీ	2022-23 లో చెల్లించిన వడ్డీ	2023 మార్చి 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల మీద చెల్లించాల్సి ఉన్న వడ్డీ	రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల మీద ఒక సంవత్సరం కన్నా తక్కువ కాలంగా చెల్లించాల్సి ఉన్న వడ్డీ	రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల మీద 1-3 సంవత్సరాలకు చెల్లించాల్సి ఉన్న వడ్డీ	రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల మీద 3 సంవత్సరాలకు పైగా చెల్లించాల్సి ఉన్న వడ్డీ
ప్రభుత్వ విద్యుత్ రంగ సంస్థలు							
1	తెలంగాణ విద్యుత్ ప్రసార సంస్థ	14.03	246.93	0	0	0	0
2	ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ	0.06	0	0.34	0.06	0.12	0.16
ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు							
3	నిజాం షుగర్స్ లిమిటెడ్	0	0	159.23	0	0	159.23
4	తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ	736	736	0	0	0	
	మొత్తం	750.09	982.93	159.57	0.06	0.12	159.39

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

దీన్ని బట్టి చూస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల మీద 99.89 శాతం వడ్డీ మూడు సంవత్సరాల కన్నా ఎక్కువ కాలంగా చెల్లించాల్సి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఋణాల మీద ప్రభుత్వ రంగ సంస్థలు సకాలంలో వడ్డీని జమ చేయలేదని చెల్లించాల్సి ఉన్న వడ్డీ బకాయిలు పేరుకుపోవడం సూచిస్తోంది.

5.8.3 విద్యుదుత్పత్తి కంపెనీలకు డిస్కంల బకాయిలు

2023 మార్చి 31 నాటికి తెలంగాణలో రెండు డిస్కంలు (ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ - టి.ఎస్.ఎన్.పి.డి.సి.ఎల్., దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ - టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్.) ఉన్నాయి. వివిధ, కేంద్ర, రాష్ట్ర, ఇతర విద్యుదుత్పత్తి కంపెనీలకు ఈ డిస్కంలు చెల్లించవలసిన బకాయిలు 2020-21లో ₹26,099.00 కోట్ల నుంచి 2021-22 లో ₹37,505.00 కోట్లకు (43.70 శాతం) పెరిగాయి. అయితే డిస్కంల విద్యుత్ కొనుగోలు బకాయిలు 2021-22 తో పోల్చితే 2022-23 లో ₹33,776.59 కోట్లకు (9.94 శాతం) తగ్గాయి.

పట్టిక 5.15: కేంద్ర, రాష్ట్ర, ఇతర విద్యుదుత్పత్తి కంపెనీలకు తెలంగాణ డిస్కంలు గత మూడు సంవత్సరాలు చెల్లించవలసిన బకాయిలను చూపించే వివరణ పట్టిక.

(₹ కోట్లలో)

డిస్కం పేరు	2021 మార్చి నాటికి			2022 మార్చి నాటికి			2023 మార్చి నాటికి		
	చెల్లించవలసిన బకాయిలు	ఎల్.పి.ఎస్./ జరిమానాలు	చెల్లించవలసిన మొత్తం బకాయిలు	చెల్లించవలసిన బకాయిలు	ఎల్.పి.ఎస్./ జరిమానాలు	చెల్లించవలసిన మొత్తం బకాయిలు	చెల్లించవలసిన బకాయిలు	ఎల్.పి.ఎస్./ జరిమానాలు	చెల్లించవలసిన మొత్తం బకాయిలు
ఎ. రాష్ట్ర విద్యుదుత్పత్తి కంపెనీకు తెలంగాణ డిస్కంలు చెల్లించవలసిన బకాయిలు									
టి.ఎస్.ఎన్.పి.డి.సి.ఎల్.	4,886	0	4,886	6,983	0	6,983	6,983.70	0	6,983.70
టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్.	11,703	0	11,703	16,729	0	16,729	15,950.90	0	15,950.90
ఉప మొత్తం	**16,589**	0	**16,589**	**23,712**	0	**23,712**	22,934.6	0	**22,934.60**
బి. కేంద్ర విద్యుదుత్పత్తి కంపెనీలకు తెలంగాణ డిస్కంల బకాయిలు									
టి.ఎస్.ఎన్.పి.డి.సి.ఎల్.	904.71	65.29	970.00	711.66	0.34	712	866.26	1.70	867.97
టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్.	2,223.90	97.10	2,321	1,709.24	0.76	1,710	2,327.82	4.08	2,331.90
ఉప మొత్తం	**3,128.61**	**162.39**	**3,291**	**2,420.90**	1.10	**2,422**	3,194.08	**5.78**	**3,199.87**
సి. ఇతర విద్యుదుత్పత్తి కంపెనీలకు తెలంగాణ డిస్కంల బకాయిలు									
టి.ఎస్.ఎన్.పి.డి.సి.ఎల్.	1,525.38	39.62	1,565	2,498.29	20.71	2,519	474.17	144.15	618.32
టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్.	4,561.06	92.94	4,654	8,802.38	49.62	8,852	7,018.59	5.21	7,023.80
ఉప మొత్తం	**6,092.38**	**132.56**	**6,219**	**11,300.67**	70.33	11,271	7,492.76	**149.36**	**7,642.12**
మొత్తం (ఎ+బి+సి)	25,809.99	294.95	**26,099**	37,433.57	71.43	**37,505**	33,621.44	155.14	**33,776.59**

మూలం: తెలంగాణ డిస్కంలు సమర్పించిన సమాచారం

దీన్ని బట్టి చూస్తే, రాష్ట్ర, కేంద్ర, ఇతర విద్యుదుత్పత్తి కంపెనీలకు తెలంగాణ డిస్కంలు చెల్లించవలసిన బకాయిలు గత సంవత్సరం ముగింపుతో పోలిస్తే 2022 మార్చి 31 నాటికి 43.70 శాతం పెరిగింది, 2023 మార్చి 31 నాటికి 9.94 శాతం తగ్గింది.

విద్యుతు కొనుగోలు వ్యయం డిస్కంల ఖర్చులో 82.89 శాతం ఉంది. 2022-23 లో డిస్కంలు రెండూ కలిపి ₹11,103.44 కోట్ల నికర నష్టాన్ని నివేదించాయి. కావున వివిధ విద్యుదుత్పత్తి కంపెనీలకు డిస్కంలు చెల్లించవలసిన బకాయిలు రాష్ట్ర ఆర్థికంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి.

5.9 ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలాపాల నిర్వహణ సామర్థ్యం

5.9.1 పెట్టుబడి మీద ప్రతిఫలం

ప్రభుత్వం పెట్టిన పెట్టుబడుల మీద ప్రభుత్వ రంగ సంస్థలు సహేతుకమైన ప్రతిఫలాన్ని అందజేస్తాయని ఆశించడం జరుగుతుంది. ఒక కంపెనీ లాభదాయకతను వాటాధనంపై ప్రతిఫలం (రిటర్న్ ఆన్ ఈక్విటీ), పెట్టిన మూలధనం మీద ప్రతిఫలం (రిటర్న్ ఆన్ క్యాపిటల్ ఎంప్లాయ్డ్) ల ద్వారా మదింపు వేయడం జరుగుతుంది.

5.9.1.1 వాటాధనంపై ప్రతిఫలం (రిటర్న్ ఆన్ ఈక్విటీ)

లాభాల ఆర్జనకు యాజమాన్యం కంపెనీ ఆస్తులను ఉపయోగించే సామర్థ్యాన్ని మదింపు వేసే ఆర్థికపరమైన పనితీరును అంచనా వేసే ఒక కొలమానమే వాటాధనం మీద ప్రతిఫలం (రిటర్న్ ఆన్ ఈక్విటీ). నికర ఆదాయాన్ని (అంటే పన్నుల మొత్తాన్ని తీసివేశాక నికర లాభం) వాటాదారుల నిధితో భాగించడం ద్వారా దీన్ని లెక్కించి శాతం రూపంలో వ్యక్తీకరించడం జరుగుతుంది. నికర ఆదాయం, వాటాదారుల నిధి రెండూ ధనాత్మక సంఖ్యలైతే దీన్ని లెక్కించవచ్చు.

చెల్లించిన మూలధనం, యదేచ్ఛగా వినియోగించుకోగలిగే నిల్వలను కూడి, సంచిత నష్టాలను, వాయిదా వేసిన రెవెన్యూ ఖర్చులను తీసివేయడం ద్వారా వాటాదారుల నిధిని లెక్కించడం జరుగుతుంది. అంటే ఒక వేళ ఆస్తులన్నీ

అమ్మివేసి, అప్పులన్నీ తీర్చేస్తే కంపెనీ వాటాదారులకు మిగిలే మొత్తాన్ని ఈ వాటాదారుల నిధి వెల్లడి చేస్తుంది. వాటాదారుల నిధి ధనాత్మకంగా ఉంటే, కంపెనీ చెల్లింపు బాధ్యతలను నెరవేర్చడానికి చాలినంత ఆస్తులు ఉన్నాయని, వాటాదారుల నిధి ఋణాత్మకంగా ఉంటే ఆస్తుల కన్నా చెల్లింపు బాధ్యతలు ఎక్కువ ఉన్నాయని వెల్లడి అవుతుంది.

ప్రభుత్వ రంగ సంస్థల వారీగా వాటాధనంపై ప్రతిఫలం వివరాలను ***అనుబంధం 5.5*** లో ఇవ్వడమైంది. 2020-21 నుంచి 2022-23 మధ్య కాలంలో 18 ప్రభుత్వ రంగ సంస్థల సంచిత వాటాదారుల నిధి, వాటాధనంపై ప్రతిఫలం గణాంకాలను ***పట్టిక 5.16*** లో ఇవ్వడమైంది:

పట్టిక 5.16: ప్రభుత్వ రంగ సంస్థల వాటాదారుల నిధి, వాటాధనంపై ప్రతిఫలం

(₹ కోట్లలో)

సంవత్సరం	నికర లాభం/నష్టం	వాటాదారుల నిధి	వాటాధనంపై ప్రతిఫలం (శాతంలో)
ప్రభుత్వ విద్యుతు రంగ సంస్థలు			
2020-21	(-)5,970.01	(-)18,989.39	-
2021-22	878.80	(-)17,672.44	-
2022-23	(-)7,297.69	(-)25,520.20	-
ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు			
2020-21	(-)749.16	(-)7,622.41	-
2021-22	(-)1,090.58	(-)6,517.41	-
2022-23	(-)814.49	(-)7,484.99	-
మొత్తం			
2020-21	(-) 6,719.17	(-)26,611.80	-
2021-22	(-)211.78	(-)24,189.85	-
2022-23	(-)8,112.18	(-)33,005.15	-

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు/ సమాచారం

పై పట్టికను బట్టి చూస్తే, ప్రభుత్వ విద్యుతు, విద్యుదితర రంగ సంస్థలు రెంటికీ 2020-21 నుంచి 2022-23 మధ్య మూడు సంవత్సరాల కాలంలోనూ వాటదారుల నిధి ఋణాత్మకంగానే ఉంది. అందువల్ల వాటాధనంపై ప్రతిఫలాన్ని లెక్కించలేదు. ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తుల కన్నా చెల్లింపు బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయని వాటాదారుల నిధి ఋణాత్మకంగా ఉండడం సూచిస్తోంది. కాబట్టి ప్రభుత్వ రంగ సంస్థలు వాటాదారులకు ప్రతిఫలాన్ని చెల్లించే బదులు పని చేస్తూ ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల ఋణదాతలకు వాటాదారులే డబ్బు చెల్లించాల్సి ఉంది. వాటాధనంపై ఋణాత్మక ప్రతిఫలానికి ప్రధానంగా ఉత్తర తెలంగాణ విద్యుతు పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ విద్యుతు పంపిణీ సంస్థ, తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలు కారణమయ్యాయి. వివరాలు ***అనుబంధం 5.5*** లో ఉన్నాయి.

5.9.1.2 పెట్టిన మూలధనం మీద ప్రతిఫలం (రిటర్న్ ఆన్ క్యాపిటల్ ఎంప్లాయ్డ్)

పెట్టిన మూలధనం మీద ప్రతిఫలం అనేది లాభదాయకతను సూచించే ఒక కొలమానం. ఇది ఒక కంపెనీ మూలధన వినియోగంలో సామర్థ్యాన్ని, దీర్ఘకాలిక లాభదాయకతను కొలుస్తుంది. వడ్డీని, పన్నులను తీసి వేయక ముందు ఒక కంపెనీ లాభం/ ఆర్జనను పెట్టిన మూలధనంతో[15] భాగించడం ద్వారా పెట్టిన మూలధనంపై ప్రతిఫలాన్ని లెక్కించడం జరుగుతుంది. పెట్టిన మూలధనంపై ప్రతిఫలం అనేది దీర్ఘకాలిక ఋణదాతలకు ఒక ముఖ్యమైన నిర్ణయాత్మక కొలమానం. తన వాటాదారులకు లాభాలను ఆర్జించేందుకు ఒక కంపెనీ ఆస్తులను ఏ విధంగా ఉపయోగించారో తెలిపే వాటాధనం మీద ప్రతిఫలం అనే కొలమానంతో కలిపి చూసినప్పుడు పెట్టిన మూలధనం మీద ప్రతిఫలం అనే కొలమానం ప్రాముఖ్యం స్పష్టంగా తెలుస్తుంది.

పెట్టిన మూలధనంపై ప్రతిఫలం వివరాలను ప్రభుత్వ రంగ సంస్థల వారీగా ***అనుబంధం 5.6*** లో ఇవ్వడం జరిగింది. 2020-21 నుంచి 2022-23 వరకు 18 ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టిన మూలధనంపై సంచిత ప్రతిఫలం వివరాలను ***పట్టిక 5.17*** లో ఇవ్వడమైంది.

---

[15] పెట్టిన మూలధనం = చెల్లించిన మూలధనం వాటా + యదేచ్ఛగా వినియోగించుకోగలిగే నిల్వలు, మిగులు + దీర్ఘకాలిక ఋణాలు - సంచిత నష్టాలు - వాయిదా వేసిన రెవెన్యూ ఖర్చులు

పట్టిక 5.17: ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టిన మూలధనం మీద ప్రతిఫలం

(₹ కోట్లలో)

సంవత్సరం	వడ్డీ, పన్నులను తీయక ముందు ఆర్జన	పెట్టిన మూలధనం	పెట్టిన మూలధనం మీద ప్రతిఫలం(శాతంలో)
(1)	(2)	(3)	(4) నిలువు వరుస 2 / నిలువ వరుస 3 x 100
ప్రభుత్వ విద్యుతు రంగ సంస్థలు			
2020-21	1,537.87	46,229.79	3.33
2021-22	10,623.88	48,803.54	21.77
2022-23	3,167.79	44,770.35	7.08
ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు			
2020-21	39.69	4,564.51	0.87
2021-22	(-)1,012.63	8,781.96	(-)11.53
2022-23	(-)736.00	259.65	(-)283.46
మొత్తం			
2020-21	1,577.56	50,794.30	3.11
2021-22	9,611.25	57,585.40	16.69
2022-23	2,431.79	45,030.00	5.40

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు / సమాచారం

18 ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టిన మూలధనంపై ప్రతిఫలం 2020-21 లో 3.11 శాతం నుంచి 2021-22 లో 16.69 శాతానికి పెరిగింది, అయితే 2022-23 సంవత్సరంలో పెట్టిన మూలధనంపై ప్రతిఫలం 5.40 శాతానికి తగ్గింది. 2021-22 తో పోలిస్తే 2022-23 లో 18 ప్రభుత్వ విద్యుతు రంగ సంస్థలలో పెట్టిన మూలధనంపై ప్రతిఫలం మూడు రెట్లు తగ్గింది. దీనికి కారణం ప్రభుత్వ విద్యుతు రంగ సంస్థలలో వడ్డీ, పన్నులను తీసివేయక ముందు ఆర్జన తగ్గడం.

అంతే కాకుండా, 18 ప్రభుత్వ రంగ సంస్థలకుగాను వాణిజ్యమార్గంలో పని చేస్తూ తమ ఆదాయాన్ని స్వంతంగా సముపార్జించుకునే ఏడు సంస్థలలో (మూడు విద్యుతు రంగ సంస్థలు, నాలుగు విద్యుదితర రంగ సంస్థలు[16]) పెట్టిన మూలధనం మీద ప్రతిఫలం మూడు సంవత్సరాలలోనూ ధనాత్మకంగా ఉంది. (2020-21 లో 12.24 శాతం, 2021-22 లో 14.41 శాతం, 2022-23 లో 17.70 శాతం). వడ్డీ, పన్నులను తీసివేయక ముందు ఆర్జన ఋణాత్మకంగా ఉన్న కారణంగా 2022-23 లో ఒక విద్యుతు రంగ సంస్థ[17], రెండు విద్యుదితర ప్రభుత్వ రంగ సంస్థలలో[18] పెట్టిన మూలధనం మీద ప్రతిఫలం ఋణాత్మకంగా (-) 84.97 శాతం నుంచి (-) 240.36 శాతం వరకు ఉంది.

5.9.1.3 పెట్టుబడి మీద వాస్తవ ప్రతిఫలం రేటు (రేట్ ఆఫ్ రియల్ రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్మెంట్ - ఆర్.ఒ.ఆర్.ఆర్.)

మూలధనం వాటా (ఈక్విటి), వడ్డీ లేని అటువంటి ఇతర మూలధనాలను కాలానుగుణమైన విలువకు సర్దుబాటు చేసిన తరువాత వాటిని ఉపయోగించే సామర్థ్యం, లాభదాయకతలను కొలిచేందుకు పెట్టుబడిపై వాస్తవ ప్రతిఫలం రేటు (రేట్ ఆఫ్ రియల్ రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్మెంట్) ఉపయోగపడుతుంది. సాంప్రదాయికంగా లెక్కించే పెట్టుబడిపై ప్రతిఫల రేటు (రేట్ ఆఫ్ రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్మెంట్) తో పోల్చి చూసినప్పుడు దీనికి ప్రాముఖ్యం ఏర్పడుతుంది. పన్నుల మొత్తాన్ని తీసివేసిన తరువాత వచ్చే లాభాన్ని, అన్ని పెట్టుబడుల కాలానుగుణమైన మొత్తం మూల్యంతో భాగించడం ద్వారా దీన్ని లెక్కించవచ్చు. ఈ నేపథ్యంలో పెట్టుబడి అంటే మూలధనం వాటా (ఈక్విటి), వడ్డీ లేని ఋణాలు, కార్యకలాపాల ఖర్చులతో పాటు నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఇచ్చిన రాయితీలు, గ్రాంట్లు కలిపిన మొత్తం. పెట్టుబడిపై వాస్తవ ప్రతిఫలం రేటు అంటే మొత్తం పెట్టుబడి మీద లాభం లేదా నష్టపు శాతం.

---

16 (i) సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, (ii) తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ, (iii) తెలంగాణ విద్యుతు ప్రసార సంస్థ, (iv) తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్, (v) తెలంగాణ రాష్ట్ర సాంకేతిక సేవల సంస్థ, (vi) తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ, (vii) తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ.

17 తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ

18 తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, టి-వర్క్స్ ఫౌండేషన్

ఏ) పెట్టుబడి కాలానుగుణమైన మూల్యం ఆధారంగా వాస్తవ ప్రతిఫలం రేటు

ప్రభుత్వ రంగ సంస్థలలో రాష్ట్ర ప్రభుత్వం మూలధనం వాటా (ఈక్విటీ) రూపంలో, ఋణాల రూపంలో, కార్యకలాపాల ఖర్చులతో పాటు నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఇచ్చే రాయితీలు / గ్రాంట్ల రూపంలో నిధులను పెట్టింది. మూలధనం వాటా (అంటే ఈక్విటీ) రూపంలో, ఋణాల రూపంలో, కార్యకలాపాల ఖర్చులతో పాటు నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఇచ్చే రాయితీలు / గ్రాంట్ల రూపంలో మొత్తం పెట్టుబడి (అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతరులు పెట్టిన పెట్టుబడి) మీద ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టిన పెట్టుబడిపై వాస్తవ ప్రతిఫలం రేటును లెక్కించడమైంది. ఋణాల విషయానికి వస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఋణాల మీద వడ్డీని అందుకోదు కనుక, తిరిగి చెల్లింపుకు సంబంధించిన నిబంధనలు, షరతుల ప్రకారం ఋణాలను తిరిగి చెల్లించాల్సి ఉన్న విషయంలో తప్ప ఋణాలు కూడా మూలధనం వాటా (ఈక్విటీ) పెట్టుబడి వంటివే కనుక వడ్డీ లేని ఋణాలను పెట్టుబడిగానే పరిగణించాలి.

విభజిత ప్రభుత్వ రంగ సంస్థల మధ్య ఆస్తులు, అప్పుల పంపకం ఫలితమైన పునర్వ్యవస్థీకరణ / విభజన సర్దుబాటు రిజర్వు నిధి (మిగులు/లోటు) అనేది మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తేది నాటికి ఉన్న ఆస్తులు, అప్పుల చిట్టా (బ్యాలెన్స్ షీట్) గణాంకాలతో పోలిస్తే ఏర్పడిన వ్యత్యాసాన్ని, ఇతర అంశాలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు అందుకున్న మూలధనం వాటాను కూడా ప్రతిబింబిస్తుంది కనుక ఆ మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడిగా పరిగణించడమైనది.

18 పనిచేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలలో 2023 మార్చి 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడి ₹68,981.41 కోట్లు; కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి ₹1,725.63 కోట్లు కాగా ఇతరుల పెట్టుబడి ₹518.33 కోట్లు.

రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఇతరులు పెట్టిన కాలానుగుణమైన పెట్టుబడుల వివరాలను ***అనుబంధం 5.7*** లో ఇవ్వడం జరిగింది. నష్టాల కారణంగా గత తొమ్మిది సంవత్సరాలలోనూ మొత్తమ్మీద పెట్టుబడిపై ప్రతిఫలం ఋణాత్మకంగానే ఉందని స్పష్టమౌతోంది.

బి) పెట్టుబడి ప్రస్తుత విలువ ఆధారంగా వాస్తవ ప్రతిఫలం రేటు

ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలలో గణనీయంగా పెట్టుబడులు పెట్టిన దృష్ట్యా అటువంటి పెట్టుబడుల మీద వాస్తవ ప్రతిఫలం రేటు ఆవశ్యకం అవుతుంది. అయితే, కాలానుగుణమైన పెట్టుబడి మూల్యం ఆధారంగా మాత్రమే ప్రతిఫలాన్ని లెక్కించే సాంప్రదాయికమైన పద్ధతిలో ధనానికి ప్రస్తుతం ఉన్న విలువను పరిగణనలోకి తీసుకోవడం జరుగదు కనుక పెట్టుబడిపై వాస్తవ ప్రతిఫలం రేటు తగినంత ఉందా లేదా అన్న విషయానికి సరైన సూచిక కాకపోవచ్చు. కాలానుగుణమైన పెట్టుబడి విలువతో కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ప్రస్తుత విలువ మీద వాస్తవ ప్రతిఫలం రేటును మదింపు వేసే నిమిత్తం పెట్టుబడుల ప్రస్తుత విలువను లెక్కించడం జరిగింది. కాలానుగుణమైన పెట్టుబడుల మూల్యాన్ని 2023 మార్చి 31 నాటి వరకు ప్రతి సంవత్సరం చివర నాటికి ఉన్న ప్రస్తుత విలువగా మార్చి లెక్కించే నిమిత్తం ప్రభుత్వ రంగ సంస్థలలో గత పెట్టుబడులను / సంవత్సరాల వారీగా పెట్టిన నిధులను ప్రభుత్వం తీసుకునే ఋణాల ఏటా-వారీ సగటు వడ్డీ రేటును ఆ సంవత్సరానికి నిధుల కనీస మూల్యంగా భావించి, చక్రీయ పద్ధతిలో గణించడం జరిగింది. కనుక, ఈ కింది ఉజ్జాయింపుల ఆధారంగా ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ప్రస్తుత విలువను లెక్కించడం జరిగింది:

- మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగే తేదీ నాటికి ప్రభుత్వ రంగ సంస్థలలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిని (పునర్వ్యవస్థీకరణ / విభజన సర్దుబాటు విలువను తీసివేయగా ఉన్న ప్రారంభ ఈక్విటీ) రాష్ట్ర ప్రభుత్వ ప్రారంభ పెట్టుబడిగా పరిగణించడం జరిగింది.

- 2023 మార్చి 31 వరకు వడ్డీ లేని ఋణాల రూపేణా, కార్యకలాపాల ఖర్చులతో పాటు నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఇచ్చే రాయితీలు / గ్రాంట్ల రూపేణా ఇచ్చిన నిధులను పెట్టుబడిగా పరిగణించడం జరిగింది.

- ఒక సంవత్సరంలో నిధుల పెట్టుబడికి ప్రభుత్వం భరించే మూల్యాన్ని ప్రతిబింబిస్తుంది కనుక ప్రస్తుత విలువను లెక్కించే నిమిత్తం ఆయా సంవత్సరాలకు ప్రభుత్వం తీసుకున్న ఋణాల మీద సగటు వడ్డీ రేటును చక్రీయ రేటుగా పరిగణించడం జరిగింది. అందువల్ల దీనినే రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన పెట్టుబడులపై కనీస స్థాయిలో ఆశించే ప్రతిఫలపు రేటుగా పరిగణించడం జరిగింది.

ఈ 18 పనిచేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలలో 2022-23 సంవత్సరం చివరి నాటికి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఇతరులు పెట్టిన మొత్తం పెట్టుబడులు ₹96,883.99 కోట్లు. ఇందులో మూలధనం వాటా (ఈక్విటీ) ₹26,079.40 కోట్లు, వడ్డీ లేని ఋణాలు ₹20.56 కోట్లు, రాయితీలు / గ్రాంట్లు ₹45,125.41 కోట్లు. 2023 మార్చి 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఇతరులు పెట్టిన పెట్టుబడుల ప్రస్తుత విలువ ₹1,03,249.27 కోట్లుగా లెక్కించడం జరిగింది. 2014-15 నుంచి 2022-23 మధ్య తొమ్మిది ఆర్థిక సంవత్సరాలలోనూ ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాలను పొందిన కారణంగా పెట్టుబడుల ప్రస్తుత విలువ మీద వాస్తవ ప్రతిఫలం రేటు అన్ని సంవత్సరాలలోనూ ఋణాత్మకంగానే ఉంది. వివరాలు ***అనుబంధం 5.8*** లో ఉన్నాయి.

5.10 అమ్మకాలు - మార్కెటింగ్

5.10.1 అమ్మకాలు - మార్కెటింగ్

18 ప్రభుత్వ రంగ సంస్థల మొత్తం టర్నోవరు 2021-22 లో ₹79,743.52 కోట్లు కాగా 2022-23 లో ₹95,204.74 కోట్లు. ఈ 18 ప్రభుత్వ రంగ సంస్థలలోని ఏడు సంస్థల[19] మొత్తం అమ్మకాలు ₹94,840.72 కోట్లకుగాను, ₹48,667.41 కోట్ల (51.31 *శాతం*) విలువైన వస్తువులు /సేవలను ప్రభుత్వ రంగానికి అందించాయి.

2022-23 లో ప్రభుత్వ రంగ సంస్థలేవీ కూడా వస్తువులు /సేవలు ఎగుమతి చేయలేదు.

5.10.2 పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలు (రీసర్చ్ అండ్ డెవలప్మెంట్-ఆర్. అండ్ డి.)

పరిశోధన - అభివృద్ధి కార్యకలాపాల వల్ల ఒక కంపెనీకి అనేక ప్రయోజనాలు ఉంటాయి:

- విశిష్ఠమైన / వినూత్నమైన ఉత్పత్తులను, సేవలను అభివృద్ధి చేయడంలో పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలు సహాయపడతాయి. ఫలితంగా అమ్మకాలు, లాభాలు మెరుగవుతాయి;
- వినూత్నమైన ఉత్పత్తులు కంపెనీకి పోటీ ప్రపంచంలో అనుకూలతను అందించగలవు;
- పరిశోధన – అభివృద్ధి కార్యకలాపాలు చేపడితే ఆదాయపు పన్ను చట్టం – 1961 కింద పన్ను రాయితీ ప్రయోజనాలు ఉంటాయి.

2022-23 సంవత్సరంలో 18 ప్రభుత్వ రంగ సంస్థలలో ఒకే ఒక ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మాత్రమే పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టింది. ఈ సంస్థ పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాల మీద 2021-22 లో ₹4.30 కోట్లను ఖర్చు చేయగా 2022-23 లో ₹5.93 కోట్లు ఖర్చు చేసింది.

పై విషయాలను గమనిస్తే, ప్రభుత్వ రంగ సంస్థలలో పరిశోధన – అభివృద్ధి కార్యకలాపాల మీద ఖర్చు కొరవడిందని స్పష్టమౌతుంది. ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వ రంగ సంస్థలు పరిశోధన – అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటు సహాయం ద్వారా ప్రోత్సాహించాలి.

---

[19] (i) సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, (ii) తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ, (iii) తెలంగాణ విద్యుత్ ప్రసార సంస్థ, (iv) దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, (v) ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, (vi) తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ, (vii) తెలంగాణ రాష్ట్ర సాంకేతిక సేవల సంస్థ

5.11 ప్రభుత్వ రంగ సంస్థలకు సి.ఎ.జి. చట్టబద్ధమైన ఆడిటర్లను నియమించడం

కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 139(5) కింద ప్రభుత్వ కంపెనీ లేదా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఇతర కంపెనీలకు చట్టబద్ధమైన ఆడిటర్లను భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి.ఎ.జి.) నియమిస్తారు. చట్టబద్ధమైన ఆడిటరు జారీ చేసిన ఆడిటు నివేదికకు అనుబంధంగా ఆడిటు నిర్వహించే హక్కు సి.ఎ.జి.కి ఉంటుంది. ఆ ఆడిటు నివేదిక మీద వ్యాఖ్యలను గానీ, దానికి అనుబంధ నివేదికను గానీ సి.ఎ.జి. జారీ చేయవచ్చు. శాసనవిహితమైన కార్పొరేషన్లకు ఆడిటర్ల నియామకం విషయంలో కూడా ఆయా చట్టాలలో ఇదే విధమైన నిబంధనలు ఉన్నాయి. ప్రభుత్వ కంపెనీల విషయంలో ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 180 రోజుల వ్యవధిలో సి.ఎ.జి. చట్టబద్ధమైన ఆడిటర్లను నియమించాలని కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 139 (5) నిర్దేశిస్తోంది. తదనుగుణంగా, సి.ఎ.జి. సంబంధిత సంవత్సరాలకు చట్టబద్ధమైన ఆడిటర్లను నియమించారు.

5.12 ప్రభుత్వ రంగ సంస్థల పద్దుల సమర్పణ

5.12.1 సకాలంలో సమర్పించాల్సిన ఆవశ్యకత

కంపెనీల చట్టం - 2013 లోని సెక్షను 395 ప్రకారం, ప్రభుత్వ కంపెనీ తాలూకు పనితీరు, దాని వ్యవహారాల మీద వార్షిక సర్వ సభ్య సమావేశం (యాన్యువల్ జనరల్ మీటింగ్ - ఎ.జి.ఎం.) జరిగిన మూడు నెలల లోపు వార్షిక నివేదికను తయారు చేసి, ఆ విధంగా తయారు చేసిన పిదప సాధ్యమైనంత త్వరగా ఈ వార్షిక నివేదికను, ఆడిటు నివేదిక ప్రతితో సహా, ఆ నివేదిక మీద సి.ఎ.జి. వ్యాఖ్యలను లేదా దానికి అనుబంధంగా ఇచ్చిన నివేదిక ప్రతి కలిపి రాష్ట్ర శాసనసభ లేదా ఇరు సభల ముందు ప్రవేశపెట్టాలి. శాసనవిహితమైన కార్పొరేషన్లను నియంత్రించే సంబంధిత చట్టాలలో కూడా దాదాపు ఇటువంటి నిబంధనలే ఉన్నాయి. ఈ ప్రక్రియ ద్వారా రాష్ట్ర సంచిత నిధి నుంచి కంపెనీలు, కార్పొరేషన్లలో పెట్టిన ప్రజానిధుల వినియోగం మీద ఆవశ్యకమైన శాసనసభ నియంత్రణ ఉంటుంది.

కంపెనీల చట్టం, 2013 లోని సెక్షను 96 ప్రకారం ప్రతి కంపెనీ, ప్రతి క్యాలెండరు సంవత్సరానికి ఒకసారి వాటాదారుల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది. ఒక సర్వ సభ్య సమావేశం తేదీకి తరువాతి సమావేశం తేదీకి మధ్య 15 నెలలు దాటకూడదని కూడా పేర్కొనడం జరిగింది. తొలిసారి జరిగే సర్వ సభ్య సమావేశం అయితే, కంపెనీ తాలూకు తొలి ఆర్థిక సంవత్సరం ముగిసిన తేది నుంచి తొమ్మిది నెలల లోపల, ఇతర సందర్భాల్లో ఆర్థిక సంవత్సరం ముగిసిన తేది నుంచి ఆరు నెలల లోపల నిర్వహించాలి. అంతే కాకుండా, ఆడిటు అయిన ఆర్థిక ప్రకటనలను సర్వ సభ్య సమావేశం పరిగణనార్థం ప్రవేశపెట్టాలని కూడా కంపెనీల చట్టం, 2013 లోని సెక్షను 129 నిబంధిస్తోంది. దీని పర్యవసానంగా ఆర్థిక ప్రకటనలను తయారు చేసి, తదుపరి సంవత్సరం సెప్టెంబరు 30 లోపల సర్వ సభ్య సమావేశంలో ప్రవేశపెట్టాలి.

5.12.2 చట్టపు నిబంధనల ఉల్లంఘనకు జరిమానా

కంపెనీల చట్టం, 2013 సెక్షను 96 ప్రకారం కంపెనీ సమావేశాన్ని నిర్వహించలేకపోతే, సెక్షను 99 ప్రకారం ఆ కంపెనీ, అందుకు కారణమైన ప్రతి అధికారి మీద ఒక లక్ష రూపాయల వరకు జరిమానాతోపాటు, ఆ విధమైన లోపం కొనసాగుతూ ఉంటే, అలా కొనసాగినంత కాలం రోజుకు ఐదు వేల రూపాయల వరకు అదనంగా జరిమానాను విధించవచ్చు.

అంతే కాకుండా, కంపెనీల చట్టం, 2013 లోని సెక్షను 129 (7) ప్రకారం, ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రతి సర్వ సభ్య సమావేశంలో ఆర్థిక ప్రకటనలను ప్రవేశపెట్టకపోతే కంపెనీ డైరెక్టర్లతో సహా ఆయా వ్యక్తులపై జరిమానా, కారాగారం వంటి దండనలను విధించే అవకాశం ఉంది.

5.12.3 ప్రభుత్వ రంగ సంస్థల వార్షిక పద్దుల సమర్పణ

2023 మార్చి 31 నాటికి, సి.ఎ.జి. ఆడిటు పరిధిలో 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయి. ఈ 83 సంస్థలలో, 16 సంస్థలు నిష్క్రియంగా ఉన్నాయి. పని చేస్తూ ఉన్న మిగిలిన 67 ప్రభుత్వ రంగ సంస్థలలో, 12 కంపెనీలు మాత్రమే 2022-23 ఆర్థిక సంవత్సరానికి తమ పద్దులను 2023 సెప్టెంబరు 30 లోగా సమర్పించాయి. పని చేస్తూ ఉన్న 52 ప్రభుత్వ కంపెనీలు, మూడు శాసనబద్ధమైన కార్పొరేషన్ల పద్దులు ఒకటి నుంచి ఎనిమిది సంవత్సరాల వరకు బకాయిల్లో ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల పద్దుల సమర్పణలో బకాయిల వివరాలను *పట్టిక 5.18* లో ఇవ్వడమైంది:

పట్టిక 5.18: పద్దుల సమర్పణలో ప్రభుత్వ రంగ సంస్థల జాప్యం

వివరాలు		ప్రభుత్వ కంపెనీలు	శాసనబద్ధమైన కార్పొరేషన్లు	మొత్తం
2023 మార్చి 31 నాటికి మొత్తం ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య		80	3	83
2023 సెప్టెంబరు 30 నాటికల్లా సి.ఎ.జి. ఆడిటు కోసం పద్దులను సమర్పించిన ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య		12	0	12
పద్దులు బకాయిల్లో ఉన్న కంపెనీల సంఖ్య		68	3	71
బకాయిల వివరాలు	(i) మూసివేతలో ఉన్నవి	8	0	8
	(ii) నిష్క్రియంగా ఉన్నవి	8	0	8
	(iii) ఇతర సంస్థలు	52	3	55
'ఇతర సంస్థల' వర్గంలో కాలానుగుణంగా బకాయిల విశ్లేషణ	ఒక సంవత్సరం (2022-23)	14	0	14
	రెండు సంవత్సరాలు (2020-21, 2021-22)	7	0	7
	మూడు సంవత్సరాలు, అంత కన్నా ఎక్కువ	31	3	34

మూలం: ప్రభుత్వ రంగ సంస్థలు సమర్పించిన పద్దులు/సమాచారం

పద్దులు బకాయిలో ఉన్న 68 ప్రభుత్వ కంపెనీలలో, 31 కంపెనీల పద్దులు మూడు లేదా అంత కన్నా ఎక్కువ సంవత్సరాలు బకాయిల్లో ఉన్నాయి. ఈ 31 కంపెనీలలో, 11 కంపెనీలు ఏర్పడినప్పటి నుంచి 2023 సెప్టెంబరు 30 నాటి వరకు తొలి పద్దులను కూడా సమర్పించలేదు.

విడి ఆడిటు నివేదికలు (సెపరేట్ ఆడిట్ రిపోర్ట్స్ - ఎస్.ఎ.ఆర్.) అంటే శాసనవిహితమైన కార్పొరేషన్ల పద్దుల మీద సి.ఎ.జి. ఆడిటు నివేదికలు. వీటిని ఆయా చట్టాలలోని నిబంధనల ప్రకారం రాష్ట్ర శాసన సభ ముందు ప్రవేశపెట్టాలి. సి.ఎ.జి. ఆడిటు పరిధి కింద ఉన్న మూడు శాసనవిహితమైన కార్పొరేషన్ల (అంటే తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంస్థ, టి.ఎస్.ఆర్.టి.సి.) లలో టి.ఎస్.ఆర్.టి.సి.కి మాత్రం సి.ఎ.జి. ఏకైక ఆడిటరు. అయితే, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాత్రమే 2017-18 సంవత్సరానికి పద్దులను సమర్పించింది. మిగిలిన రెండు శాసనవిహితమైన కార్పొరేషన్లు అవి ఏర్పడినప్పటి నుంచి పద్దులను సమర్పించలేదు.

పద్దులను జాప్యంతో సమర్పించడం / సమర్పించకపోవడం వల్ల ప్రభుత్వ కంపెనీల్లో పెట్టుబడిగా పెట్టిన ధనం మీద శాసన సభ నియంత్రణ సంకటంలో పడవచ్చు. ప్రజానిధుల నిర్వహణలో ఈ కంపెనీల సామర్థ్యాన్ని, ప్రభావశీలతను మదింపు వేయడం సాధ్యం కాలేదు. దీని ఫలితంగా పాలనప్రక్రియలో అంతర్గత నియంత్రణలు పలుచన కావడానికి, ప్రజారంగంలో వస్తువుల, సేవల అందింపులో అసమర్థతకు, ప్రభావహీనతకు, వంచనలకు, అవినీతికి, ప్రజాధనవష్టానికి దారితీయవచ్చు.

5.13 సి.ఎ.జి. పర్యవేక్షణ - పద్దుల ఆడిటు, అనుబంధ ఆడిటు

5.13.1 ఆర్థిక నివేదన వ్యవస్థ

పద్దులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన తప్పనిసరి ప్రమాణాలను పాటిస్తూ, జాతీయ ఆర్థిక నివేదనల ప్రాధికార సంస్థ చేసిన సిఫార్సులను పరీక్షించి, ఆ సంస్థతో సంప్రదించిన తరువాత భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ ఇన్స్టిట్యూట్ సిఫార్సు చేసిన విధంగా, కంపెనీల చట్టం, 2013 లోని షెడ్యూల్ III లో నిర్దేశించిన నమూనాలో కంపెనీలు ఆర్థిక ప్రకటనలను తయారు చేయాల్సి ఉంటుంది. శాసనవిహితమైన కార్పొరేషన్ల విషయానికి వస్తే, ఆయా కార్పొరేషన్లను నియంత్రించే చట్టంలో పద్దులకు సంబంధించిన నిర్దిష్టమైన నిబంధనల ప్రకారం, సి.ఎ.జి.తో సంప్రదించి రూపొందించిన నియమాలు నిర్దేశించిన రూపంలో పద్దులను తయారు చేయాల్సి ఉంటుంది.

5.13.2 చట్టబద్ధమైన ఆడిటర్ల ద్వారా ప్రభుత్వ కంపెనీల పద్దుల ఆడిటు

కంపెనీల చట్టం, 2013 లోని సెక్షను 139 ప్రకారం సి.ఎ.జి. నియమించిన చట్టబద్ధమైన ఆడిటర్లు ప్రభుత్వ కంపెనీల పద్దుల ఆడిటును నిర్వహించి, కంపెనీల చట్టం, 2013 లోని సెక్షను 143 ప్రకారం నివేదికను సమర్పించాలి.

చట్టబద్ధమైన ఆడిటర్లకు ఇచ్చిన విధులను సక్రమంగా, ప్రభావవంతంగా నిర్వర్తిస్తున్నారని నిర్ధారించుకునే లక్ష్యంతో ప్రభుత్వ రంగ సంస్థల ఆడిటులో చట్టబద్ధమైన ఆడిటర్ల పనితీరును పర్యవేక్షించడం ద్వారా సి.ఎ.జి. పర్యవేక్షక పాత్రను పోషిస్తారు. ఈ కింది అధికారాలను వినియోగించడం ద్వారా ఆ బాధ్యతను నిర్వహించడం జరుగుతుంది:

- కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 143(5) ప్రకారం చట్టబద్ధమైన ఆడిటర్లకు ఆదేశాలను జారీచేయడం;
- కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 143(6) ప్రకారం చట్టబద్ధమైన ఆడిటర్ల నివేదిక మీద వ్యాఖ్యలు చేయడం లేదా అనుబంధ నివేదికలను జారీ చేయడం.

5.13.3 ప్రభుత్వ కంపెనీల పద్దుల అనుబంధ ఆడిటు

కంపెనీల చట్టం, 2013 లేదా ఇతర సంబంధిత చట్టం కింద నిర్దేశించిన ఆర్థిక నివేదన వ్యవస్థకు అనుగుణంగా ఆర్థిక ప్రకటనలను తయారుచేసే ప్రధాన బాధ్యత ఆ సంస్థ యాజమాన్యానిదే.

కంపెనీల చట్టం, 2013 లోని సెక్షను 143(9) కింద నిర్దేశించిన ఆడిటింగ్ ప్రమాణాలు, సి.ఎ.జి. జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా స్వతంత్రమైన ఆడిటును నిర్వహించి, కంపెనీల చట్టం, 2013 లోని సెక్షను 143 కింద ఆర్థిక ప్రకటనల మీద ఒక అభిప్రాయాన్ని వ్యక్తం చేసే బాధ్యత, కంపెనీల చట్టం, 2013 లోని సెక్షను 139 కింద సి.ఎ.జి. నియమించిన చట్టబద్ధమైన ఆడిటర్లది. కంపెనీల చట్టం, 2013లోని సెక్షను 143 కింద చట్టబద్ధమైన ఆడిటర్లు సి.ఎ.జి.కి ఆడిట్ నివేదికను సమర్పించాల్సి ఉంది.

చట్టబద్ధమైన ఆడిటర్ల నివేదికతో సహా ప్రభుత్వ కంపెనీల తాలూకు ధ్రువీకరణ అయిన పద్దులపై అనుబంధ ఆడిటును నిర్వహించడం ద్వారా సి.ఎ.జి. సమీక్షిస్తారు. ఆ విధమైన సమీక్ష ఆధారంగా, ఏవైనా గణనీయమైన ఆడిటు పరిశీలనలు ఉంటే, కంపెనీల చట్టం, 2013 లోని సెక్షను 143(6) ప్రకారం నివేదించడం జరుగుతుంది. వాటిని సంబంధిత ప్రభుత్వ కంపెనీల / ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఇతర కంపెనీల వార్షిక సర్వ సభ్య సమావేశంలో ప్రవేశపెట్టాలి.

5.14 సి.ఎ.జి. పర్యవేక్షణ ఫలితం

5.14.1 కంపెనీల చట్టం, 2013 లోని సెక్షను 143 కింద ప్రభుత్వ కంపెనీల పద్దుల ఆడిటు

2022 అక్టోబరు 1 నుంచి 2023 సెప్టెంబరు 30 మధ్య కాలంలో, 39 ప్రభుత్వ కంపెనీలు 2016-17 నుంచి 2022-23 మధ్య కాలానికి సంబంధించిన 45 పద్దులను సి.ఎ.జి. ఆడిటు కొరకు సమర్పించాయి. వీటిల్లో 14 ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన 15 పద్దులను సి.ఎ.జి. సమీక్షించారు. అయితే 10 ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన 10 పద్దులకు సమీక్ష లేదంటూ ధ్రువ పత్రాన్ని జారీ చేయడం జరిగింది. 2023 సెప్టెంబర్ 30 నాటికి 20 పద్దులకు సంబంధించి సి.ఎ.జి. వ్యాఖ్యల ఖరారు కావలసి ఉన్నాయి.

ఇంకా 2022 సెప్టెంబర్ 30 కన్నా ముందు సమర్పించిన 26 రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి 32 పద్దులను సమీక్షించి 2022 అక్టోబరు 1 నుంచి 2023 సెప్టెంబరు 30 మధ్య కాలంలో ఖరారు చేయడం జరిగింది. 2022సెప్టెంబర్ 30 కన్నా ముందు సమర్పించిన రెండు పద్దులకు సంబంధించి సమీక్షలేదంటూ ధ్రువ పత్రాన్ని జారీ చేయడం జరిగింది.

5.14.2 ఆర్థిక ప్రకటనల సవరణ

తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్ (2021-22), మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (2021-22) లు తమ ఆర్థిక ప్రకటనలను సర్వ సభ్య సమావేశంలో ప్రవేశపెట్టే ముందు సవరించాయి.

5.14.3 ఆడిటర్ల నివేదిక సవరణ

ఆర్థిక ప్రకటనల మీద సి.ఎ.జి. నిర్వహించిన అనుబంధ ఆడిటు పర్యవసానంగా ***అనుబంధం 5.9*** లో వివరించినట్లు 20 ప్రభుత్వ కంపెనీల చట్టబద్ధమైన ఆడిటర్లు తమ 20 నివేదికలను సవరించారు (2022 మే నుంచి 2023 ఆగష్టు).

5.14.4 ప్రభుత్వ కంపెనీల / ప్రభుత్వ నియంత్రణలోని ఇతర కంపెనీల మీద చట్టబద్ధమైన ఆడిటర్ల నివేదికలకు అనుబంధంగా సి.ఎ.జి. జారీ చేసిన ముఖ్యమైన వ్యాఖ్యలు

2022 అక్టోబరు 1 నుంచి 2023 సెప్టెంబర్ 30 మధ్యకాలంలో ఆడిటు సమీక్షించి, ఖరారు చేసిన 47 పద్దులలో, 35 పద్దులకు సంబంధించి సి.ఎ.జి. వ్యాఖ్యలు జారీ చేయడం జరిగింది. వ్యాఖ్యలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల జాబితాను ***అనుబంధం 5.10*** లో ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ కంపెనీలు, ప్రభుత్వ నియంత్రణ ఉన్న ఇతర కంపెనీల ఆర్థిక ప్రకటనల లాభదాయకత మీద ₹757.21 కోట్ల ఆర్థిక ప్రభావం, ఆస్తులు / అప్పుల మీద ₹31,989.68 కోట్ల ఆర్థిక ప్రభావం ఉన్న ముఖ్యమైన కొన్ని వ్యాఖ్యలను ఈ కింద వివరించడం జరిగింది.

(ఎ) లాభదాయకత మీద వ్యాఖ్యలు:

క్రమ సంఖ్య	కంపెనీ పేరు (పద్దుల సంవత్సరం)	వ్యాఖ్యలు
ప్రభుత్వ విద్యుత్ రంగ సంస్థలు		
1	దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (2022-23)	రాష్ట్ర లోడు బట్వాడా కేంద్రం (ఎస్.ఎల్.డి.సి.) షెడ్యూలింగ్ ప్రకారం విద్యుత్ ఛార్జీలకు కంపెనీ పద్దులలో కేటాయించాల్సిన బదులుగా 2018-19 నుండి 2022-23 మధ్య కాలంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్.టి.పి.పి.) కి సరఫరా చేసిన వాస్తవ మీటర్ విద్యుత్ చెల్లింపుల కోసం కంపెనీ కేటాయింపు

క్రమ సంఖ్య	కంపెనీ పేరు (పద్దుల సంవత్సరం)	వ్యాఖ్యలు
		చేసింది. దీని వలన విద్యుత్తు కొనుగోలు ఖర్చులను ₹76.59 కోట్లు ఎక్కువగా చూపడం జరిగింది. ఈ మొత్తానికి సంబంధించి ఎస్.టి.పి.పి. క్లెయిమ్‌ను తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి అనుమతించలేదు. కావున, డిస్కం తమ పుస్తకాలలో కేటాయింపు చేయడం వలన విద్యుత్తు కొనుగోలు ఖర్చులను, తాత్కాలిక అప్పులను, నష్టాన్ని ₹76.59 కోట్ల చొప్పున ఎక్కువగా చూపినట్లైంది.
2	ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (2022-23)	సింగరేణి కాలిరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్.సి.సి.ఎల్.) కి చెల్లించాల్సిన వినియోగించని విద్యుత్తు (బ్యాంక్ ఎనర్జీ) యూనిట్ల వ్యయం ₹20.04 కోట్లను కంపెనీ గణించలేదు. ఫలితంగా విద్యుత్తు కొనుగోలు ఖర్చును, వర్తకపు చెల్లింపు బాధ్యతలను, నష్టాన్ని ₹20.04 కోట్ల చొప్పున తక్కువగా చూపినట్లైంది.
ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు		
3	హైదరాబాదు మెట్రో రైల్ లిమిటెడ్ (2016-17)	ప్రభుత్వం అందించిన నిధుల నుండి వినియోగ అంశాలను స్థానాంతరణకు, అవసరమైన ప్రాంతాలలో అడ్డంకుల తొలిగింపు పనుల ఒప్పందాలకు, పునరావాస ఖర్చులకు, రోడ్డు విస్తరణ కోసం ఆస్తులను స్వాధీనం చేసుకున్నందుకు చెల్లించిన నిర్మాణ పరిహారం మొదలైనవి వాటి కోసం కంపెనీ ₹115.22 కోట్లను ఖర్చు చేసింది. నిధుల స్వీకరణను ఆర్థిక ప్రకటనలలో ఋణాలుగా గణించడం జరిగింది. ప్రభుత్వం అందించిన నిధుల నుండి కంపెనీ చేసిన ఖర్చును సర్దుబాటు చేయనూ లేదు, ప్రభుత్వం నుండి స్వీకరించదగిన మొత్తాలుగానూ గుర్తించలేదు. ఫలితంగా ₹115.22 కోట్ల చొప్పున పరిపాలనాపరమైన ఖర్చులు ఎక్కువగా, "ప్రభుత్వం నుండి స్వీకరించదగిన మొత్తాలు" తక్కువగా, నష్టాన్ని ఎక్కువగా చూపినట్లైంది.
4	తెలంగాణ తాగునీటి సరఫరా సంస్థ (2019-20)	1. 2019-20 సంవత్సరానికి చేసిన నిర్వహణ ఖర్చు చెల్లింపులు సంవత్సరాంతంలో బకాయిలో ఉన్న ₹61.69 కోట్లను కంపెనీ తక్కువగా చూపడం జరిగింది. ఈ ఖర్చును 2019-20 పద్దులలో ఏర్పాటు చేయకపోవడం వలన ఖర్చులను, తాత్కాలిక అప్పులను, నష్టాన్ని ₹61.69 కోట్ల చొప్పున తక్కువగా చూపినట్లైంది. 2. 31.03.2020 వరకు కాలానికి వాటర్ గ్రిడ్ సబ్‌స్టేషన్ల నిర్వహణ నిమిత్తం ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థకు చెల్లించవలసిన నిర్వహణ ఖర్చును కంపెనీ ₹19.50 కోట్లు తక్కువగా చూపడం జరిగింది. పద్దులలో కేటాయింపు చేయకపోవడం వలన ఖర్చులను, తాత్కాలిక అప్పులను, నష్టాన్ని ₹19.50 కోట్ల చొప్పున తక్కువగా చూపినట్లైంది. 3. 31.03.2020 వరకు కాలానికి విద్యుత్తు వినియోగ చార్జీల నిమిత్తం దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్.) కు చెల్లించవలసిన ₹458.50 కోట్ల మొత్తాన్ని కంపెనీ గుర్తించలేదు. పద్దులలో గణించకపోవడం వలన తాత్కాలిక అప్పులను, విద్యుత్తు వినియోగ చార్జీలను, నష్టాన్ని ₹458.50 కోట్ల చొప్పున తక్కువగా చూపినట్లైంది.

క్రమ సంఖ్య	కంపెనీ పేరు (పద్దుల సంవత్సరం)	వ్యాఖ్యలు
5	తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ (2018-19 స్వతంత్ర ఆర్థిక ప్రకటనలు, ఏకీకృత ఆర్థిక ప్రకటనలు)	హైదరాబాద్ ఫార్మా సిటీలో ఎన్.ఐ.ఎం.జెడ్. స్థాపన కోసం గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి సంస్థ (హుడ్కో) (₹725 కోట్లు), బుగ్గపాడు, ఖమ్మంలో మెగా ఫుడ్ పార్క్ ప్రాజెక్టు స్థాపన కోసం జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) (₹29.44 కోట్లు) నుండి సహాయం పొందిన ఋణాలతో బ్యాంకులలో చేసిన తాత్కాలిక డిపాజిట్లు అంటే ప్రాజెక్టు - నిర్దిష్ట కేటాయింపు నిధులపై ఆర్జించిన ₹5.67 కోట్లను కంపెనీ తమ పద్దులలో వడ్డీ ఆదాయంగా గణించింది. కేటాయింపు నిధులపై ఆర్జించిన వడ్డీని కంపెనీ ఆదాయంగా పరిగణించడం వలన ₹5.67 కోట్ల చొప్పున వడ్డీ ఆదాయం ఎక్కువగా, ఇతర ప్రస్తుతం ఉన్న చెల్లింపు బాధ్యతలు తక్కువగా, నష్టాన్ని తక్కువగా చూపినట్లైంది.

(బి) ఆర్థిక స్థితి మీద వ్యాఖ్యలు:

క్రమ సంఖ్య	కంపెనీ పేరు (పద్దుల సంవత్సరం)	వ్యాఖ్యలు
		ప్రభుత్వ విద్యుదితర రంగ సంస్థలు
1	తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ (2016-17)	ప్రభుత్వ కంపెనీలు/ కార్పొరేషన్ల / సంస్థల విభజన ప్రతిపాదనల ఆమోదం కోసం నిపుణుల కమిటీని నియమించారు. ఎ.పి. పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 షెడ్యూల్ **IX**లోని నిపుణుల కమిటీ సిఫార్సుల ప్రకారం నిల్వలు, మిగుళ్లలో విభజన (పునర్వ్యవస్థీకరణ) సర్దుబాటు ఖాతా నిల్వ ₹180.44 కోట్లను చేర్చలేదు. ఈ నిల్వ అప్పులపై ఆస్తుల మిగులు కారణంగా ఉత్పన్నమయ్యింది. దానిని 'నిల్వలు, మిగుళ్లు' కింద విడిగా చూపించకుండా 'తాత్కాలిక అప్పులు' గా గణించడం వలన ₹180.44 కోట్ల మేర నిల్వలు, మిగుళ్లు తక్కువగానూ, తాత్కాలిక అప్పులు ఎక్కువగానూ చూపినట్లైంది.
